# సులభమైన ప్రార్థన యొక్క శక్తి

దేవునితో ప్రతివిషయం గురించి ఎలా మాట్లాడాలి




జాయిస్ మేయర్

#1 న్యూయార్క్ టైమ్స్ వారి ఉత్తమ రచయిత్రి

# సులభమైన ప్రార్థన

## యొక్క శక్తి

# సులభమైన ప్రార్థన యొక్క శక్తి

దేవునితో ప్రతివిషయం గురించి ఎలా మాట్లాడాలి?


## జాయిస్ మేయర్



JOYCE MEYER
MINISTRIES

Nanakramguda, Hyderabad - 500 008

© 2007 by Joyce Meyer Asia

All rights reserved. No part of this book may be reproduced in any form or by any electronic or mechanical means, including information storage and retrieval systems, without permission in writing from the publisher, except by a reviewer who may quote brief passages in a review.

Unless otherwise indicated, all Scripture quotations are taken from

The Amplified® Bible (AMP). Copyright © 1954, 1962, 1965, 1987 by The Lockman Foundation. Used by permission.

Scriptures marked NKJV are taken from the New King James Version.

The Power of Simple Prayer - *Telugu*

*FIRST PRINT - 2009*

*Printed at*
**Caxton Printers**
Hyderabad 500 004

# విషయసూచిక


ఉపోద్ఘాతము vii

1. ప్రభువా, నాకు బోధించు 1

2. సులభమైన ఆధిక్యత 19

3. ఊపిరిపీల్చుట వంటిదే 36

4. ప్రార్థనా శక్తి 52

5. స్తుతి, ఆరాధన మరియు కృతజ్ఞతాస్తుతులు 67

6. సమర్పించుకొనుట మరియు కట్టుబడియుండుట 86

7. విన్నపము మరియు పట్టుదల 103

8. విజ్ఞాపన మరియు ఒప్పందము 119

9. వాక్యము మరియు ఆత్మ 135

10. శక్తివంతమైన ప్రార్థనకు తాళపుచెవులు 152

11. అన్నిటికంటే ఉన్నతంగా 174

12. జవాబులు పొందు ప్రార్థనకు పదునాలుగు ఆటంకములు 191

13. ప్రార్థనలో రూఢియైన విజయము 212

14. ప్రార్థన ద్వారా బలంగా నిలచుట 228

ముగింపులో.... 245

# ఉపోద్ఘాతము

నన్ను ఎవరైనా "జాయిస్, ప్రార్థన గురించి ఒకే ఒక వ్యాఖ్యానం చెయ్యమంటే నీవేమి చెప్తావు?" అని అడిగినట్లయితే నేను దాని సులభత్వమును గురించి మాట్లాడతాను. నేను అనేకమైన, వాటి కొరకు అనేక సంవత్సరముల నుండి ప్రార్థిస్తున్నాను మరియు ప్రార్థనను గురించి గొప్ప విషయాలు చెప్పగలను, అయితే నేను కేవలం ఒక్కవిషయం మాత్రమే ధృఢంగా చెప్పగలను, ఇది మనం ఆలోచించునంతకంటే *అతి సులువైనది* అని చెప్పగలను.

ప్రార్థనను గురించి దేవుడు నాకు బోధించుట మొదలు పెట్టినవిధంగా, ఆయన ప్రార్థనను కష్టమైనదిగా కాక, అతి సులువైనదిగా చేసినాడని తెలుసుకొని ఆశ్చర్యపోయాను. కొన్ని సమయాలలో మనుష్యులు ప్రార్థనను జీవం లేనిదిగాను మరియు కష్టమైనదిగానూ చేస్తారు కొన్ని సమయాలలో మన మతపరమైన మనస్తత్వాలు మరియు "వ్యవస్థలు", మనలో అనేకమందికి అందుబాటులో లేని విధంగా వుండు ప్రార్థనను వివరిస్తాయి. మన ప్రార్థనా జీవితాలు సహజంగానూ, సంతోషకరముగానూ వుండాలని దేవుడు కోరుకుంటున్నాడని చెప్పినపుడు, నేను యదార్దాన్ని చెప్తున్నాను. మన ప్రార్థనలు నిజాయితీగానూ, మనస్పూర్తిగానూ వుండాలనని ఆయన కోరుకుంటున్నాడు మరియు అవి నియమ నిబంధనలు, శాస్త్రం మరియు బాధ్యతల వత్తిడి క్రింద వుండకూడదని ఆయన కోరుకుంటున్నాడు. ప్రార్థన అనునది మన దయనొందిన జీవితాలలో అభిన్న భాగమైయుండాలని – ప్రతిదినము మనము చేయుటకు సులువైన పనియైయుండాలని దేవుడు భావిస్తున్నాడు.

అనేక మంది తాము చేయగలిగినంత కంటే ఎక్కువ ప్రార్థన చేస్తారనీ, కాబట్టి వారు తాము అనుభవించునంత కంటే ఎక్కువ ప్రభావవంతమైన మరియు విజయవంతమైన ప్రార్థనా జీవితాలు కలిగివుంటారని నేను భావిస్తున్నాను. వారు తాము ఎప్పుడు ప్రార్థిస్తున్నామనునది గుర్తించరు, ఎందుకంటే, ప్రార్థనకు ఒక నిర్థిష్టమైన వాతావరణము, నిర్థిష్టమైన విదానము, నిర్థిష్టమైన రూపము అవసరమై వుంటున్నది లేక అది ఖచ్చితంగా కొన్ని నిర్థిష్టమైన నియమాలను అనుసరిస్తుందని వారు మొదటినుండి బోధించబడ్డారు.

ప్రార్థన అనగా మాములుగా దేవునితో మాట్లాడుటయే. నిజంచెప్పాలంటే, మనము ఎప్పుడైనా, ఎక్కడైనా దేవునికి ప్రార్థించవచ్చును – దేవుని గూర్చిన తలంపు కూడా 'మౌన ప్రార్థనగా' ఎంచబడుతుంది.

నీవు సంవత్సరముల నుండి ప్రార్థన చేస్తున్నప్పటికీ, యిప్పుడిప్పుడే ప్రార్థన నేర్చుకుంటున్నప్పటికీ, ఆత్మీయ జీవితంలో గొప్ప స్థానంలో వున్నప్పటికీ, లేక నీ ప్రార్థనా జీవితం అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నప్పటికీ, నువ్వు తెలిసికోవలసివున్నది: నీవు మరింత ప్రభావంతముగా ప్రార్థించాలని మరియు నీ ప్రార్థనా జీవితం మరింత నిండుగా వుండాలనీ దేవుడు కోరుకుంటున్నాడు. నీవు ఈ పుస్తకం తెరిచావు గనుక, దేవునితో నీ సన్నిహితత్వాన్ని పెంచుకొనుటకు నీలో ఏదో ఒక రకమై ఇష్టత వుందని, నేను రూఢిగా చెప్పగలను. ప్రార్థన శక్తివంతమైనదని నీకు తెలుసు గనుక నీ జీవితములోను, నీవు ప్రేమించువారి జీవితములలోను మరియు నిన్ను వేధించు పరిస్థితులలోను ఆ అద్భుతమైన ప్రార్థనా శక్తి విడుదలను చూచుటకు నీవు ఇష్టపడుతున్నావని నేను నమ్ముతున్నాను.

క్లుప్తమైన, సరళమైన ప్రార్థనలు వివరణకు అందనంత శక్తివంతమైనవి, అయితే ఆది ప్రార్థన గొప్ప మర్మమను సత్యాన్ని కొట్టివేయదు. వాచ్‌మన్ అని ఒక చైనా దేశస్థుడైన క్రైస్తవుడు, తన విశ్వాసము నిమిత్తమై చెరసాలలో వున్నపుడు అనేక గూఢార్థములుగల పుస్తకాలు వ్రాసినాడు, అతను వ్రాస్తూ, "ప్రార్థన అనునది ఆత్మీయ ప్రదేశములోని అద్భుతమైన కార్యము, అలాగే గొప్ప ఆత్మీయ కార్యము." అని అంటున్నాడు. పరలోకమందున్న దేవుని హృదయముతో, భూలోకమందున్న మనుష్యుల హృదయాలను కలుపుటయే ప్రార్థన యొక్క గొప్ప మర్మమని నేను నమ్ముతాను. ప్రార్థన ఆత్మీయమైనది మరియు అది అదృశ్యమైన ప్రదేశాన్ని చేరుతుంది; అది ఆ అదృశ్యమైన ప్రదేశమునుండి మనం జీవించుచున్న, దృశ్యమైన ప్రదేశములోనికి విషయాలను తీసుకొని వస్తుంది. మన సామాన్యమైన, దయనొందిన జీవితాలలో యిది ఆశీర్వాదములను కుమ్మరించి, భూలోక పరిస్థితులను భరించునట్లుగా ఆత్మీయ శక్తిని తెస్తుంది. సామాన్యమైన ప్రదేశంలో నిలుచుండియే, ఆత్మీయ ప్రదేశాన్ని తాకగలిగినది మానవులు మాత్రమే. మనం ప్రార్థించునపుడు, మన దయనొందిన జీవితాలను, తరచుగా మనం గుర్తించనంతకంటే ఎక్కువగా ప్రభావం చేయు దేవునితో కలిసి మాట్లాడుతున్నాము.

మనము ప్రార్థించుటకు ఇష్టపడుట – మన ప్రార్థనా జీవితాలు అభివృద్ధి పొందుతాయని నమ్ము నిజాలు, ఆత్మీయ రాజ్యం వున్నదనియు, అక్కడ సంభవించు ప్రతి విషయం యిక్కడ ప్రభావం చూపుతున్నదనియు మనం నమ్ముతున్నామను విషయానికి ఋజువులై యున్నవి. పౌలు 2 కొరింథీయులకు 4:18 నందు : "*క్షణమాత్రముండు మా చులకని శ్రమ మాకొరకు అంత కంతకు ఎక్కువగా నిత్యమైన మహిమ భారమును కలుగజేయుచున్నది. ఏలయనగా దృశ్యమైనవి అనిత్యములు అదృశ్యమైనవి నిత్యములు.*" అని వ్రాసినట్లుగా మనము కన్నులతో చూచు జీవితం కంటే ఎక్కువైన జీవితం వున్నదనియు, మనము చూచు వస్తువుల కంటే

చూడని వస్తువులకు ఎక్కువ విలువ ఇస్తున్నామనియు యిది ఋజువు చేస్తుంది. మన భూమి పై జీవితాలను ప్రభావం చేసే అదృశ్యమైన, అనంతమైన ఆత్మీయ సత్యాలు వున్నవని మనము అర్థంచేసుకున్నపుడు, వాటిని గ్రహించుటకు ఆసక్తి కలిగివుంటాము. ఆత్మీయ విషయాలను గ్రహించి, వాటిని భూమిపై నెరవేర్చుటకు, దేవునికి భాగస్వాములుగా ఆయన మనలను పిలుచుచున్నాడని మనం గ్రహిస్తాము– మరియు అది ప్రార్థన వలననే సాధ్యమైయున్నది.

ప్రార్థన, దేవుడు కార్యముచేయునట్లుగా ద్వారాలు తెరుస్తుందని, చెప్పుటకు నేను ఇష్టపడుచున్నాను. ప్రార్థన ద్వారా మనం దేవునితో భాగస్వామ్యం పొందుతున్నప్పుడు, మనము ఈ ప్రపంచములోనికి, మన సమాజంలోనికి, యితర ప్రజల జీవితాలలోనికి, ఈ ఆత్మీయ సంగతులను తీసుకొని వస్తాము. ఇవి పరలోకము నుండి వచ్చు వస్తువులు, దేవుని బహుమానాలు మనకొరకు సిద్ధము చేయబడివున్నవి – అయితే మనము దేవుని ప్రార్థించి, అడుగనిదే వాటిని పొందుకొనలేము. అదృశ్యమైన రాజ్యములో ఆయన మనకొరకు చాలా దాచియుంచాడు; ఆయన మనకొరకు అనేక అద్భుతమైన విషయాలు చేస్తున్నాడు, అవి కంటికి కనబడవు, చెవికి వినబడవు, మనుష్య హృదయమునకు గోచరము కావు – మనము వాటిని ప్రార్థనా శక్తి ద్వారానే పొందుకొని, ఆనందించగలము. బైబిలు ఇలా చెప్తుంది "*దేవుడు తన్ను ప్రేమించువారి కొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు.*" (1 కొరింథీయులకు 2:9).

ప్రార్థన అనునది విధేయత కలిగిన జీవితములో ఒక భాగమైయున్నది. మనం దేవుని అడుగకపోవుట వలన కొన్ని విషయాలు కలిగియుండ లేకపోతున్నామని బైబిలు చెప్తుంది (యాకోబు 4:2), మన కొరకు ఆయన ముందుగానే దాచియుంచిన దానిని మనము అడిగి పొందుకోవాలని దేవుడు కోరుతున్నాడనునది ప్రార్థన యొక్క రహస్యంలో ఒక భాగమై యున్నది. దేవుడు – సర్వోన్నతుడై, తాను చేయదలచుకున్నది ఎక్కడైనా, ఎప్పుడైనా, ఏ విధంగానైనా, ఏ సమయంలోనైనా, ఎవరి అనుమతి లేకుండానే చేయగలవాడు – మనం ఆయనను అడగాలని కోరుకుంటున్నాడు. ఎవరో ఒకరు అడుగకుండా ఆయన భూమిపై ఏమీ చేయలేడను నియమాన్ని ఆయన ఏర్పరచి, దానికి కట్టుబడివున్నాడు.

దేవుడు ఎల్లప్పుడూ తన ప్రజలతోనూ, ఇప్పుడు మనతోనూ "నీవు, నేను భాగస్వాములము, నీవు భూమి పైనున్న నా శరీరానివి" అని చెప్తున్నాడు. దాని అర్థమేమిటి? మనం ఆయన శరీరమును, మనం "క్రీస్తు శరీరం" అని పిలుచుకుంటున్నాము. క్రీస్తు ఇంకనెన్నటికీ భౌతిక శరీరాన్ని కలిగివుండడు. ఆయన ఏమైయున్నాడు, భూమి పై ఏమి చేశాడు అనుదానికి మనం భాధ్యులుగా వున్నాము. మనము, ఆయన యొక్క నోరు, చేతులు, పాదాలు, ముఖమునైయున్నాము. మనము మాత్రమే ఆయన యొక్క హృదయమును, ప్రేమను, శక్తిని మన చుట్టుప్రక్కల వారికి వివరించగలము. మన జీవితాలలోను మన చుట్టూ వున్నవారి జీవితాలలోను దేవుని ఉద్దేశాలు నెరవేరునట్లుగా మనము దేవునితో భాగస్వామ్యము చేయవలసివున్నది.

ఈ పుస్తకపు మాటలలోనే నీ ప్రార్థనాజీవితానికి అత్యంత సహాయకరమైన ప్రోత్సాహం లభిస్తుందని నమ్ముతున్నాను. ఈ పుస్తకంలో ప్రతిదీ ఆవశ్యకమైన నిర్దిష్టమైన ప్రార్థనను గురించే కాదుగానీ, ప్రతీ విషయం ప్రార్థనతో సంబంధాన్ని కలిగివుంది. అయితే ఇది దేవునితో సులువైన నిండైన, ప్రభావంతమైన, పట్టుదల కలిగిన సహవాసాన్ని కలిగివుండుటకు సంబంధించినదైయున్నది.

మరింత ప్రభావంతంగా ప్రార్థించుటకు నేర్పించమని దేవుని అడుగుతూ, ఈ పుస్తకాన్ని ప్రారంభించమని మిమ్మల్ని ప్రోత్సాహపరుస్తున్నాను, మీ ప్రార్థనకు జవాబును కనుగొనుటకు ఈ పుస్తకపు మాటలను దేవుడు ఉపయోగించుకోవాలని నేను మీ కొరకు ప్రార్థిస్తాను. మీరు చదువుచుండగా, దేవుని ఎదుట వ్యక్తిగతంగా ప్రార్థించుట ఎలాగో, నిన్ను ఆయన నిర్మించి పిలిచిన విధముగా, ఒక ప్రత్యేకమైన వ్యక్తిలా సహజమైన రీతిలో నిన్ను నీవు స్వేచ్ఛగా, దేవునికి వ్యక్తపరచుకొను విధానమును ఈ పుస్తకములో తెలుసుకుంటావు. ప్రార్థన అనునది అత్యంత గొప్ప భాగ్యమే కాక అనేకులు ఆలోచించు దానికంటే సులువైనదని నీవు గ్రహిస్తావు. నీ ప్రార్థనాజీవితమును సులువైనదిగా ఎలా చేసుకోవచ్చో తెలుసుకుంటావు మరియు ప్రార్థన నియమాలతో కూడి వుండాలి లేదా ఒక నిర్దిష్ట విధానంలో చేయాలను ఆలోచనా ధోరణి నుండి ఎలా విడుదల పొందాలో అర్థం చేసుకొంటావు. అదనంగా, నీ జీవితంలో ప్రార్థన బాధ్యతే కాక సంతోషించునదిగా వుండుట వలన, అది నీ జీవితంలో భాగమైపోతుంది. నేను ప్రార్థన ఊపిరి పీల్చునంత సులువైనదని మరియు ఏ సమయంలోనైనా, ఎక్కడికి వెళ్ళినా నీ జీవిత విధానంలోనూ, ప్రార్థనా జీవిత విధానాన్ని పెంచుకొనుట ఎలాగో తెలుసుకొనుటకు సహాయపడుతుందని మీతో పంచుకొంటాను.

నీవు ఈ పుస్తకము చదువుచుండగా, మానవునికి తెలిసిన వాటికంటే విభిన్నమైన ప్రార్థనా శక్తిని మీరు గుర్తు చేసుకొంటారు, మరియు మీ దయనొందిన జీవితంలోను, సామాన్య పరిస్థితులలోను దాని శక్తిని అనుభవించుటకు ప్రోత్సాహపరచబడతారు. ప్రార్థనలోని అనేక దశలను మీరు చదువుచుండగా, వివిధ సమయాలలో మరియు పరిస్థితులలో వివిధ రకాలుగా ప్రార్థించాలని తెలుసుకొంటారు – మరియు ప్రార్థనలో మీ ప్రభావము వృద్ధి చెందునట్లుగా వివిధ రకాలైన ప్రార్థనలను నేర్చుకొంటారు.

క్లుప్తంగా చెప్పుటకు, ఇక్కడ ఒక ఉదాహరణ వుంది: నీవు ఒక్క నిమిషంలో తెలుసుకుంటావు. కారు ప్రమాదాన్ని తప్పించుకొన్నావని గ్రహించినపుడు “వందనాలు ప్రభువా” అని చెప్పుట కూడా ప్రార్థనే అని తెలుసుకుంటావు. నేను పంచుకొనబోవు ఇతర ప్రార్థనా విదానాలు: నీజీవితాన్ని దేవునికి అప్పగించుట, నీ సమస్యలను ఆయనకు అధీనము చేయుట, నీకిష్టమైన వాటిని, కావలసిన వాటిని అడుగుట, జవాబులు వచ్చు వరకు ప్రార్థనలో పట్టుదల కలిగివుండుట, ఇతరుల కొరకు విజ్ఞాపన చేయుట, ప్రార్థనలో యితరులతో ఏకీభవించుట దేవుని వాక్య ప్రకారము ప్రార్థించుట మరియు ఆత్మలో ప్రార్థించుట. ప్రభావంతమైన

ప్రార్థనకు తాళపు చెవులను నీవు తెలుసుకుంటావు మరియు అర్థం చేసుకొంటావు – అవి నీ ప్రార్థనలు జవాబులు పొందునట్లుగా, మార్గము సిద్దము చేయు కొన్ని హృదయ ఆలోచనలు. చివరగా, జవాబుపొందు ప్రార్థనలకు పదునాలుగు ఆటంకముల గురించి నేను వివరిస్తాను, దాని ద్వారా నీ ప్రార్థనలు విజయవంతం కావాలంటే వేటికి దూరంగా వుండాలో నీవు తెలుసుకుంటావు. మొత్తానికి ప్రార్థనను గురించిన విషయాలే కాకుండా, ప్రార్థించుటకు సహాయపడు బోధలు కూడా సంపూర్ణముగా మీకు అందించుటకు నేను ప్రయత్నించాను.

నీ ప్రార్థనలు వైవిధ్యాన్ని కలుగజేస్తున్నాయని తెలిసికొనుటకు ఇష్టపడుతున్నావు, నీ జీవితములోను, నీ చుట్టూవున్నవారి జీవితములలోను దేవుని శక్తి పనిచేయుటను చూచుటకు ఇష్టపడుతున్నావు, ఆయనతో నీ సంబంధము వృద్ధి చెందుచుండగా దేవుని సహవాసమును ఆనందించుటకు నీవు ఇష్టపడుతున్నావు గనుక ఈ పుస్తకాన్ని చదువుచున్నావు. దేవుడు కూడా కచ్చితంగా దీన్నే కోరుకుంటున్నాడని, నీకు సహాయము చేయుటకు ఇష్టపడుతున్నాడని నిశ్చయతనిస్తున్నాను. మరింత సన్నిహితమైన, ఉత్సాహపూరితమైన, ప్రభావవంతమైన ప్రార్థనలోనికి ప్రవేశించుచుండగా ఆశీర్వదింపబడుము.

– జాయిస్ మేయర్

# సులభమైన ప్రార్థన

## యొక్క శక్తి

# 1

# ప్రభువా, నాకు బోధించు

నేను మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను, మీ ప్రార్థనలు నిజంగా వైవిధ్యాలని కలుగ చేస్తున్నాయని మీరు నమ్ముతున్నారా? దీనినాలోచించుము: నా ప్రార్థన దేవుడు 'వింటున్నాడా, లేదా' అని ఎప్పుడైనా మీ మనసులో అనుకున్నారా? మీరు ప్రార్థించుట ముగించిన తర్వాత మీ ప్రార్థన కొంత సాధించిందని మీకు నమ్మకం కలిగిందా? మీ ప్రార్థనా జీవితం మీకు సంతృప్తికరంగా ఉందా? ఎలా ప్రార్థించాలో మీకు నిజంగా తెలుసా? ప్రార్థన ద్వారా దేవునితో లోతైన, గొప్పదైన, ఇంకా శక్తివంతమైన సంబంధం కలిగివుండుటకు ఆశపడుతున్నారా?

నా 30 సం॥రాల పరిచర్యలో నేనెదుర్కొనిన, కొన్ని వేలమందిలాంటివాడివే నీవు కూడా ఐతే నీ జవాబు "అవును! అవును! అవును!" అని ఉంటుంది. నేను ప్రయాణిస్తూ, ప్రజలను కలిసినపుడు, నేను, ఒక విషయాన్ని కనిపెట్ట కలిగినాను. వారు నిజముగా ప్రార్థించాలని, దేవుడు తమ ప్రార్థనలు వింటుఉండాలని, తమ ప్రార్థనలు ప్రభావవంతమైనవై వుండాలని వారు కోరుకుంటున్నారు. అందరూ తాము తమ ప్రార్థనా జీవితంలో ఎదగాలని, వారు వారి కొరకు, ఇతరుల కొరకు ప్రార్థించినప్పుడు అవి మరింత శక్తివంతముగా మారాలని ఆశపడుతుంటారు. నిజానికి, 2005 లో 800 మంది అమెరికా సంఘకాపరులకు నిర్వహించిన సర్వేలో, వారిలో కేవలం 16 శాతం మంది మాత్రమే "చాలా సంతృప్తికరమైన" ప్రార్థనా జీవితాన్ని కలిగియున్నామని చెప్పినారు. దీని ద్వారా 84 శాతం మంది తమ ప్రార్థనా జీవితం, ఎప్పటికైనా తప్పకుండా బాగవుతుందని నమ్ముతున్నారని తెలుస్తుంది. ఈ సర్వేలోని సంఘకాపరులవలే అనేకులు తమ ప్రార్థనా జీవితాలతో సంతృప్తిలేకుండా వున్నారు. వారు దేవునితో మాట్లాడేటప్పుడు ఆయన వింటున్నాడన్న నిశ్చయత వారికి

లేదు, కొన్ని ప్రార్థనలు జవాబులేకుండా ఎందుకు మిగిలిపోతున్నాయో వారికి తెలియదు; తాము "సరిగ్గా" ప్రార్థిస్తున్నామా లేక సరిపడినంత మాత్రమే ప్రార్థిస్తున్నామా అని ఆలోచిస్తారు. సామాన్యంగా వారు తమ ప్రార్థనా జీవితంలో వేసారి, 'దేవునితో ఎక్కువ సంబంధం కలిగివున్న అనుభూతిని పొంది, తమ ప్రార్థనలు నిజంగా వైవిధ్యాన్ని కలుగజేస్తాయన్న విశ్వాసాన్ని పొందుకొనుటకు ఏమి చేయాలో తెలిసికొనుటకు' ఆసక్తి కలిగివుంటారు. ***కాపరుల పరిస్థితే యిలావుంటే వారి సంఘం ఎలా వుంటుంది?***

ఒక వ్యక్తి పలుకగల అత్యంత ముఖ్యమైన, జీవితాన్ని మార్చగల ప్రార్థన: "ప్రభువా, నాకు ప్రార్థించుట బోధించు" అనేదే. యిది కేవలం "ప్రభువా, నాకు ***ప్రార్థించుట*** బోధించు" కాదు గాని, "ప్రభువా, ***నాకు*** ప్రార్థించుట నేర్పించు" అని అర్థమిచ్చుచున్నది. ప్రార్థన గురించి తెలుసుకోవటం సరిపోదు, మనం ప్రార్థించుచున్న దేవునితో మన సన్నిహిత, శక్తివంతమైన సంబంధాన్ని అనుసరించి, వ్యక్తిగతంగా ప్రార్థించుటను నేర్చుకొనవలసియున్నది. ప్రతి ఒక్కరూ అన్వయించుకొనదగిన ప్రార్థనా నియమాలున్నప్పటికీ, మనము ప్రత్యేకముగానున్నాము, ప్రభువు కూడా మనలను ప్రత్యేకముగా నడిపిస్తాడు. నేను అనేక "ప్రార్థనా సమావేశము"లకు హాజరయ్యాను, వాటిలో వినిన ఇతరుల వ్యక్తిగత ప్రార్థనా జీవిత అనుభవాలను అనుసరించుటకు ప్రయత్నించాను. ఫలితముగా, దేవుడు నా కొరకు ఒక ప్రత్యేక ప్రణాళిక కలిగియున్నాడని – తనతో మరింత ప్రభావవంతముగా సంభాషించుటకు ఒక మార్గాన్ని నిర్దేంచాడని గ్రహించాను – కాబట్టి నేను "ప్రభువా, **నాకు ప్రార్థించుట నేర్పించు**" అని చెప్పవలసి వచ్చింది. 2000 సం॥రాల క్రితం యేసు శిష్యులు అడిగిన "ప్రభువా, మాకు ప్రార్థించుట నేర్పించు" (లూకా 11:1) అను ప్రశ్ననే నేడు అనేకులు అడుగుతున్నారని నేను నమ్ముతున్నాను. వారు ఆయన స్వరం వినుటలోను, నేర్చుకొనుటలోను, ఆయన ఆశ్చర్యకార్యములు చూచుటలోను గొప్ప వ్యక్తిగత సమయాన్ని గడుపుచున్నప్పటికినీ, ప్రార్థనలో ఆయన సూచనలను తీసుకొనవలసిన అవసరతను వారు గుర్తించుచున్నారు. శిష్యులు గుంపుగా వెళ్లి తమకు ప్రార్థన నేర్పించమని యేసును అడిగియున్నారు. అయితే, యిదే ప్రశ్నను నేను వ్యక్తిగతముగా అడిగినప్పుడు, దేవుడు శక్తివంతమైన విధంగా నాకు జవాబిచ్చి, నా ప్రార్థనా జీవితములో ఆశ్చర్యకరమైన అభివృద్ధిని తెచ్చినాడు.

ఉదాహరణకు:

- ప్రధానముగా, ఐహికపరముగా, తనకుతానే (ఈ ప్రార్థన, ఒక వ్యక్తి యొక్క ఆలోచన, చిత్తము, మరియు ఉద్రేకముల నుండి బయటకు వచ్చును) చేయు, ప్రార్థనల నుండి ఆత్మ యొక్క నింపుదలకు, ఆత్మ యొక్క నడిపింపుకు, విశ్వాస పూరితమైన ప్రార్థనలకు నేను కదిలింపబడ్డాను.
- నా "బాహ్య జీవితము" (నా పరిస్థితులు, నేను చేయు పనులు, నా చుట్టూ జరుగుతున్న విషయాలు) గురించి ప్రార్థించుటలేదు. ఇప్పుడు నేను నా అంతరంగ

జీవితము (నా హృదయ పరిస్థితి, నా ఆత్మీయ ఎదుగుదల, నా వైఖరి, నా తలంపులు) ను గురించి ప్రార్థించుచున్నాను. దేవుడు, నా పని అంతరంగములో బలపడుటకు ప్రార్థించుట మరియు సరియైన తలంపులు పరిశుద్ధమైన హృదయముతో జీవించుటకు, దేవుని సహాయమునడుగుట అని దేవుని పని మరియు బయటి విషయాలను గూర్చి జాగ్రత్త తీసుకొనుట అని నేర్పించినాడు.

- నేను కొన్ని రోజులకొకసారి, ఒక ఐదు నిమిషాలు ప్రార్థించుటకు కష్టపడే పద్ధతిని వదిలిపెట్టాను. బదులుగా ప్రార్థనలో నిజముగా అనందిస్తూ – యధార్థముగా, వ్యక్తిగతముగా కోరుకుంటూ, ఇష్టపడుతూ – ప్రతి రోజును ప్రార్థనతో మొదలుపెట్టి, నా హృదయములో దినమంతా ప్రార్థిస్తూ, చివరగా దేవునితో మాట్లాడుతూ నిద్రలోనికి జారుకొనుటతో నా దినమును ముగిస్తున్నాను.
- నేను ఒకటొకటిగా చేసే, క్రమములేని ప్రార్థనా జీవితములో నుండి, శాస్త్రానుసారమైనది కాని, క్రమమైన, నియమిత ప్రార్థనా జీవితములోనికి నడిపింపబడ్డాను.
- ఒకప్పుడు ప్రార్థించుట ద్వారా దేవుని యెడల నా కర్తవ్యమును నిర్వర్తిస్తున్నానని తలంచేదానను, ఇప్పుడైతే ప్రార్థించనిదే ఒక్క దినముకూడా తృప్తిగా జీవించలేనని గ్రహించాను. ప్రార్థన అనేది విధి కాదు, గాని గొప్ప భాగ్యమని గ్రహించాను.
- నేనింకా దేవుని భయముతోనూ, నిజముగా నా ప్రార్థన విని, జవాబు పంపిస్తాడా అనే ఆలోచనతోను దేవుని చేరుటలేదు. ఆయన వాక్యం చెప్పినట్లుగా ధైర్యముతోను, గొప్ప అంచనాలతోను వెళ్ళుతున్నాను.

నీవు కూడా ప్రార్థించుట నేర్పమని దేవుని అడిగినట్లయితే, నీవు ప్రార్థించు విధానములో గొప్ప మార్పులను, నీ ప్రార్థనలలో ప్రభావమును, దేవునితో నీ సంబంధములో అద్భుతమైన సంతృప్తిని, మరియు నీ ప్రార్థనలో తాజా స్వేచ్ఛను, సంతోషాన్ని అనుభవిస్తావు.

ఈ పుస్తకములో నేను మీకు ప్రార్థనను గురించిన భావార్థమైన బోధ యివ్వగలను. ఈ మాటల ద్వారా మీరు నేర్చుకుంటారని నేను ఆశిస్తున్నాను, కాని దేవుడు మాత్రమే ఈ సమాచారాన్ని గ్రహించి, దానిని జీవముతో నింపి, ప్రార్థన మీకు క్షేమాభివృద్ధిని, ఆసక్తిని, ప్రభావాన్ని కలిగించునట్లుగా

దేవుడు మాత్రమే ఈ సమాచారాన్ని గ్రహించి, దానిని జీవముతో నింపి, ప్రార్థన మీకు క్షేమాభివృద్ధిని, ఆసక్తిని, ప్రభావాన్ని కలిగించునట్లుగా చేయగలడు.

చేయగలడని నాకు తెలుసు. ఆయన దీనిని మీకొరకు అసామాన్యమైన, జీవితాన్ని మార్చే రీతిలో చేయగలడని ప్రార్థిస్తూ, నమ్ముతున్నాను. నేను మీతో పంచుకొనబోవుచున్న బైబిలు సమాచారాన్ని, నీ వ్యక్తిత్వానికి, ప్రస్తుతము నీవు ఎదుర్కొంటున్న పరిస్థితులకు అనుగుణంగా, సరియైన మార్గంలో అన్వయించుకొనునట్లు దేవుడు సహాయం చేయును గాక!

ఉదాహరణకు, నలుగురు చిన్న పిల్లలున్న తల్లికి ప్రతి రోజు ఉదయాన్నే ప్రార్థించలేక పోవచ్చును. ఆమె అనేక పనులు చేయవలసి వస్తుంది, వాటిలో కొన్ని వెంటనే చేయవలసి వస్తుంది. 'తన జీవితములో కొంతకాలము అవసరమైన సమయములో ఆమె ఉన్నది కనుక దేవుడు ఆమెకు సహాయకరమైన సమయములో ప్రార్థించునట్లుగా' ఆమెను నడిపిస్తాడు. ఆమె తన రోజును ప్రార్థనతో ప్రారంభించి, దినమంతా ప్రార్థించవచ్చును, కాని పిల్లలు లేకుండా వుండి, తన సమయాన్ని తానే ప్రణాళిక వేసుకునే స్త్రీ వలే చేయనవసరం లేదు.

నాకు జ్ఞాపకం వుంది. నేను ఒక ప్రార్దన కూటముకు వెళ్ళినప్పుడు: ఒక వృద్దురాలైన స్త్రీ "ఉదయమున 5 గంటల నుండి 9 గంటల వరకు తానేలా, ప్రార్థిస్తువుంటుందో ఆ విషయాన్ని ఆమె అక్కడ వివరించటం నేను విన్నాను". ఆమె ఆ విధంగా అనేక సంవత్సరముల నుండి చేస్తుంది మరియు ఆ విధంగా చేయుటకు దేవుని వద్ద నుండి కృపను పొందుతుంది. ప్రతి ఒక్కరికీ దేవుడిచ్చు సామర్థ్యాలను నేను అప్పటికీ అర్థం చేసుకోలేదు కాబట్టి, నేను కూడా అలానే చేయాలన్న నిశ్చయతతో ఇంటికి వెళ్లాను. నేను చేసిందంతా ఏంటంటే, మొదటి 15 నిమిషాల తర్వాత విసుకుగా, మత్తుగా తయారయాను. ఈ అనుభవం మరియు ఇంకా ఇతరుల అనుభవాల ద్వారా, ఇతరుల ప్రార్థనా జీవితాలతో మన ప్రార్థనా జీవితాలను పోల్చుకొనలేమని నేను నేర్చుకొన్నాను. మనందరము ప్రత్యేకమైనవారమని, ప్రతి ఒక్కరి నిమిత్తం దేవుడు ప్రత్యేక ప్రణాళిక కలిగి వున్నాడనియు. మనలో ప్రతి ఒక్కరికీ పని చేయునట్లుగా దేవుడు కొంత కృపను ఇస్తాడని, మనము ఆ పనిని పూర్ణ హృదయముతో చేయాలని బైబిలు చెప్తుంది. ఆ ప్రార్థనా కూడికకు వచ్చిన స్త్రీ ప్రతి రోజూ కొన్ని గంటలు ప్రార్థించే కృపను పొందుకుంది. అదే విధంగా, నేను దేవుని రాజ్యంలో బోధకురాలిగా పిలువబడ్డాను గనుక, ఎక్కువ సమయం చదువుటకు కృపను పొందాను. ఇతరుల వలె కాక, నీంవలే నీవు వుండుటకు ప్రయత్నించమని మిమ్మల్ని ప్రోత్సాహపరుస్తున్నాను. నీవలె నీవు వుండుటకు కాక యితరుల వలె వుండుటకు దేవుడు నీకు సహాయముచేయడు.

## ఇది వ్యక్తిగతమైనది

మన ఆత్మీయ జీవితాలకు సంబంధించిన ప్రతిదీ, దేవునితో మన వ్యక్తిగత సంబంధం మీదను, దేవునితో మన వ్యక్తిగత విశ్వాసం మీదను ఆధారపడివున్నది. సిలువలోని యేసు మరణము మనకు స్వేచ్ఛను, పరలోకపు తండ్రి యొద్దకు నిరాటంకమైన ప్రవేశాన్ని ఇస్తుంది,

మరియు మన విశ్వాసము, దేవునితో సన్నిహిత, శక్తివంతమైన సంబంధం కలిగివుండుటను సాధ్యంచేస్తుంది కాబట్టి మనము ఆ సంబంధంలో ఆనందించగలము.

ఈ మధ్య నేను ఎఫెసీ 3:12 చదివాను, అది ఈ విధంగా చెప్తుంది : "ఆయనయందలి విశ్వాసముచేత ధైర్యమును, నిర్భయమైన ప్రవేశమును ఆయనను బట్టి మనకు కలిగియున్నవి" సామాన్య మానవులముగానే మనము ప్రార్థన ద్వారా దేవునియొద్దకు నిర్భయమైన ప్రవేశము కలిగియున్నామనీ గ్రహించినపుడు నేనెంతో ఆనందించాను. మనము ఆయనను దాపరికము, భయము లేకుండా సంపూర్ణమైన స్వేచ్ఛతో చేరవచ్చును.ఇది ఎంత ఆశ్చర్యకరమైనది! దేవునిపై వ్యక్తిగత విశ్వాసము అనునది ఆయన నుండి మితిలేని సహాయానికి ద్వారాలు తెరుస్తుంది.

నా ప్రార్థనా జీవితపు ప్రారంభదినాలలో, కొన్ని వేలమంది విశ్వాసులకు, అనేక సంవత్సరాలుగా సహాయపడిన ఒక అద్భుతమైన పుస్తకాన్ని చదివాను. ***ప్రార్థనా పాఠశాలలో క్రీస్తుతో కలసి*** అను ఈ పుస్తక పత్రికలో, దేవుని ప్రార్థించుట నేర్పమని అడుగు విషయమును గురించి **ఆండ్రూ ముర్రే** వ్రాస్తూ: ఇలా అన్నారు "యేసు వలె ఎవరూ బోధించలేరు, కాబట్టి ఆయనను తప్ప ఎవరినీ నేర్పించమని అడుగలేము. ప్రజలకు తన పని తెలిసిన, బోధించు తలాంతు కలిగిన, ప్రజల అవసరతలను ప్రేమతోను, ఓర్పుతోను తీర్చగల బోధకుడు కావలెను. దేవుడు మహిమ పరచబడును గాక! యిటువంటి బోధకుడు క్రీస్తే …… యేసు మనకు ప్రార్థించుట నేర్పుటకు ఎంతో ఇష్టపడు తున్నాడు." కేవలం ప్రార్థించుటకు ప్రయత్నించవద్దు, ప్రార్థించుట నేర్పమని యేసును అడుగు!

యేసు మనకు సామూహి కంగా ప్రార్థించుట మాత్రమే నేర్పుటకు ఇష్టపడుట లేదు, కాని వ్యక్తిగతముగా మనలో పని చేయుటకు ఇష్టపడుచున్నాడు. మనమున్న రీతినే మనలను అంగీకరించి, మనలోని స్వంత ప్రార్థనాధోరణిని కనుగొనుటకు, ఆయనతో మనవ్యక్తిగత సంబంధాన్ని పెంపొందించే ప్రార్థన విధానాన్ని అభివృద్ధి చేసుకొనుటకు సహాయం చేస్తాడు. మన హృదయాన్ని ఆయనతోను, ఆయన హృదయాన్ని మనతోను పంచుకొనుచుండగా, ప్రార్థన అనునది ఒక సులభమైన, సహజమైన, జీవమిచ్చు సంభాషణయై వుండాలని ఆయన కోరుకొంటున్నాడు. ప్రార్థన ఎంతో సులభమైనది, అది దేవునితో మాట్లాడుటయే. దీనిలో ఆయన మాట్లాడు మాటలను వినుట కూడా మిళితమైయుంది. దేవుడు మనతో అనేక విధాలుగా మాట్లాడుతాడు. దేవుడు ఎలా మాట్లాడుతాడో తెలుసుకోవాలనుకుంటే, నేను వ్రాసిన *దేవుని స్వరం వినుట ఎలా* అను పుస్తకం చదువమని మిమ్మల్ని ప్రోత్సాహపరుస్తున్నాను.

ప్రతి వ్యక్తి తనతో ఒకే విధంగా సంభాషించవలెనని దేవుడు కోరుకొనుటలేదు, ఎందుకంటే ఆయన సృజనాత్మకత కలవాడు. ఆయన మనందరిని వేరు వేరుగా సృష్టించి, ఆ వైవిధ్యములో ఆనందించుచున్నాడు. నేను ఇంతకుముందు చెప్పినట్లుగా, విశ్వాసులు అన్వయించుకొనుటకై

"ప్రార్థనా నియమాలు" కలవు కాని దేవుడు మనలనందరినీ వ్యక్తిగతముగా నడిపిస్తాడు. మనమందరము ఆయనతో మన నడకలో విభిన్న స్థలాలలోను, ఆత్మీయ పరిణితిలో విభిన్న స్థాయిలలోను వున్నాము, ప్రార్థనలో విభిన్న అనుభవాలు కలిగివున్నాము. మనం ప్రార్థనా నియమాలు నేర్చుకొనునప్పుడు, ఎలా ప్రార్థించాలన్న విషయములో మన స్వబుద్ధిని ఉపయోగించకుండా, వాటిని ప్రభువు వద్దకు తీసికొనివెళ్ళి, "వీటిని నా జీవితానికి, నా పరిస్థితులకు, నా హృదయానికి అన్వయించుకొనుటకు నేర్పించు. ఈ విషయం నాకు ఎలా ఉపయోగపడుతుందో చెప్పు. దేవా, ఎలా ప్రార్థించాలో నేర్పించునట్లుగా, ప్రార్థనలో ప్రభావవంతమవునట్లుగా, నా జీవితములో గొప్ప, విలువైన దశలో నీతో సంబంధాన్ని కలిగివుండునట్లుగా నీపై ఆధారపడుతున్నాను." అని చెప్పు.

## నీ ప్రత్యేకతను హత్తుకో

మనము దేవునితో వ్యక్తిగతముగా సంబంధం కలిగియున్నాము – ఆయన అటువంటి సంబంధాన్ని ఇష్టపడుతున్నాడు కాబట్టి – మనము ప్రత్యేకమైన వ్యక్తులముగా ఆయనను ప్రార్థిస్తున్నాము. ఇతరులతో కలసి సామూహికంగా ప్రార్థిస్తున్నప్పటికీ, మనము ప్రత్యేకమైన వ్యక్తులముగానే వున్నాము మనము కేవలము మన హృదయాలను ఇతరులతో కలిపి, ఏక స్వరములా ప్రార్థిస్తున్నాము. ఈ సామూహిక ప్రార్థనా సమయాలలో, దేవుడు మనము ఏక విధానాలననుసరించుటకంటే, ఏక మనస్సు కలిగినవారమై యుండవలెనని కోరుకుంటున్నాడు. మనము "ప్రభువా, నాకు ప్రార్థించుట నేర్పించు" అని చెప్పునపుడు, మనకు ప్రత్యేక పద్ధతిలో ప్రార్థన నేర్పమనియు, మన ప్రార్థనలు మన యొక్క సహజ భావాలను సులువుగా వ్యక్తపరచే విధానంలో నేర్పమని అడుగుచున్నాము. మనము ప్రార్థనా గది వద్ద మన ప్రత్యేకతను పరీక్షించు కొనకూడదు. మనము దేవుని వద్దకు మనము ఏలాగైతే ఉన్నామో అలానే వెళ్ళి, మనలను ఆయన ఎలా చేసియున్నాడో ఆ "మూలము" ను ఆయన ఆనందించు విధముగా వుండవలసియున్నది. మనము మన బలము, బలహీనతలు, ప్రత్యేకత, మరియు మనలను

> దేవుడు మన హృదయాలను ప్రత్యేకముగా రూపొందించాడు కనుక, మన ప్రార్థనలు మన హృదయాలనుండి సహజంగానూ, మనము రూపింపబడిన విధానానికి అనుగుణంగానూ వుండవలసియున్నది.

ప్రపంచములోని యితరుల నుంచి ఆద్భుతముగా వేరుపరచు వాటన్నిటితో దేవుని చేరవలసి యున్నది. మనమున్న చోటనే మనలను కలసి, మనతో వ్యక్తిగత సంబంధమును పెంచుకుని, ఆయన వుండవలెనని కోరుకొనిన విధముగా ఎదుగుటకు మనకు సహాయపడుటలో ఆయన ఆనందించువాడై యున్నాడు.

కీర్తనలు 33:15 “ఆయన వారందరి హృదయములను ఏకరీతిగా నిర్మించినవాడు, వారి క్రియలన్నియు విచారించు వాడు, వారిని దర్శించువాడు” అని చెప్తుంది. దేవుడు మన హృదయాలను ప్రత్యేకముగా రూపొందించాడు కనుక, మన ప్రార్థనలు మన హృదయాలనుండి సహజంగానూ, మనము రూపింపబడిన విధానానికి అనుగుణంగానూ వుండవలసియున్నది. మనము దేవునితో మన ప్రత్యేక సంభాషణగా విధానాలు అభివృద్ధి చేసుకొనుచుండగానే, మనకంటే ఎక్కువ అనుభవం గల వారి వద్ద నేర్చుకొనవచ్చును, కాని వారిని మనకు మాదిరిగా నుంచుకొనకుండా జాగ్రత్తపడవలసియున్నది. నేను అనేకులకు ఉదాహరణగా ఉండాలని ఇష్టపడతాను, కాని యేసు వారికి మాదిరిగా వుండాలని కొరుకుంటాను. నీవు నిజముగా దేవుని ఆత్మచే నడిపింపబడుతున్నావని నీకు తెలిసినపుడు, యితరులు చేస్తున్నది, చేయుటకు ఇష్టపడకపోవుటలో తప్పులేదు. కాని నీ ఆత్మకు అసౌకర్యముగా వున్నప్పటికినీ, ఇతరులవలే చేయాలని బలవంతముగా ప్రయత్నించుట తప్పు. ఇతరుల ప్రార్థనా విధానాన్ని అనుకరించాలని ప్రయత్నించవద్దు నీవు ప్రార్థించునపుడు నేర్చుకొను ప్రార్థనా విధానాలను చేయుటకు నిర్బంధింపబడినట్లు అనుకొనవద్దు.

ఇతరులవలె వుండకపోవుటను బట్టి అనేకులు భయపడతారు అనేకులు దేవుని ఆత్మ నడిపింపును ధైర్యముగా అనుసరించుటకంటే, నియమిత నిబంధనలను అనుసరించుటను సౌకర్యంగా అనుకుంటారు. మనము మానవ నిర్మిత నిబంధనలను అనుసరించునపుడు, వారిని సంతోషపరుస్తాము, కాని ఎప్పుడైతే విశ్వాసముతో అడుగు వేసి దేవుని ఆత్మను అనుసరిస్తామో, అప్పుడు మనము దేవుని సంతోషపరుస్తాము, ఇతరులు చేస్తున్నారు గనుక ఒకనిర్ధిష్ట విధానంలో లేక ఒక నిర్ధిష్ట సమయం లేక కొన్ని నిర్ధిష్ట విషయాల గురించి మాత్రమే చేయుటకు ఒత్తిడి అనుభవించనవసరం లేదు. దానికి బదులుగా, దేవుడు మనకు ప్రత్యేకముగా నేర్పించుచున్న ప్రార్థనా విధానంలో మన ప్రత్యేకతను స్వేచ్ఛగా వ్యక్త పరచవలసియున్నది.

ఎందుకోగానీ, అందరూ చేస్తున్నట్టు చేయుటలో మనము ఒక విధమైన సురక్షిత భావాన్ని పొందుతాము. కాని బాధాకరమైన విషయం ఏమిటంటే దేవుని ఆత్మ అనే సముద్రము తన చిత్తప్రకారమైన స్థలమునకు మనలను తీసికొని వెళ్ళినట్లు “మన నావకు కట్టిన తాళ్ళను విప్పుట” నేర్చుకునే వరకు అసంపూర్ణ అనుభూతులు పొందుతాము. మనం నియంత్రణలో ఉన్నపుడు, తర్వాత ఏమి జరుగుతుంది అన్నది మనకు తెలుసు,కాని ఎప్పుడైతే దేవుని ఆత్మ నడిపింపునకు ఒప్పుకుంటామో అప్పుడు మన జీవితంలో అనేక ఆశ్చర్యకార్యాలను

చూస్తాము. ఇతరుల వలె ఉండుట లేదన్న అపార్థాన్ని విస్మరిస్తామన్న నిర్ణయాన్ని మనము తీసికొన వలసి వున్నది.

నా భర్త, డేవ్ సంయుక్త రాష్ట్రాలను గూర్చి ప్రార్థించవలెనన్న ఆకాంక్ష కలిగి క్రమముగా ప్రార్థించే వాడు. నేను దేవుని బిడ్డల పరిణితిని గూర్చిన ఆకాంక్ష కలిగివుండే దానిని. మరియు నాకు పేద వారు, బాధపరచబడు వారిని గూర్చిన భారము ఉండేది, కాబట్టి నేను ప్రతిదినము ఎక్కువ సమయాన్ని వీటి గురించి ప్రార్థించుటలో గడిపే దానిని. గర్భస్రావాల గురించి బలముగా ప్రార్థించే వారిని, సేవాకార్యక్రమాల గురించి అంతే బలముగా ప్రార్థించే వారిని నేనెరుగుదును. నేను చెప్పే విషయం ఏమిటంటే, దేవుడు ఒక్కొక్కరి హృదయంలో ఒక్కొక్క విషయాన్ని గూర్చిన ఆశక్తి పెట్టటంతో అన్ని విషయాలను చూచుకుంటున్నాడు. ప్రతీ రోజూ అవసరమైన అన్ని విషయాలను గురించి ఎవరూ ప్రార్థించలేరు. కాని దేవుని ఆత్మ మనలను నడిపిస్తుంది.

ఇప్పుడు నేను మీతో పంచుకుంటున్న దానిని నేర్చుకొనక ముందు నేను చాలా బాధపడవలసివచ్చింది. అయితే మీరు కూడా ఇలా బాధపడుట నాకిష్టము లేదు. నా బాధ మీకు లాభాన్ని పొందనివ్వండి! నీ పద్ధతిలో నీవు నేర్చుకున్న ప్రతీ ప్రార్థనా నియమమును నీ జీవితానికి ఎలా అన్వయించుకోవాలో ఈరోజే యేసుని అడగండి. ప్రతీ దానిని ప్రార్థనతో కూడా ఆనందించుటకు వైవిధ్యమనేది ఒక తాళపు చెవి అయివున్నది. కాబట్టి మీ జీవితములో వ్యక్తిగత సందర్భాలకవసరమైన వివిధ నియమాలను ఉపయోగించునట్లు దేవుని ఆత్మ మిమ్ములను నడిపించనీయండి.

## ప్రార్థనకు తాళంచెవి

ప్రభావవంతమైన ప్రార్థనకు ముఖ్యమైన తాళం చెవి ఏదో నేను గుర్తించవలసివస్తే, అది దేవుని దగ్గరకు ఒక స్నేహితునివలె చేరుట అని నేను చెప్తాను. దేవుడు మనలను స్నేహితుల వలె చూస్తున్నాడని నమ్ముతూ ఆయనను చేరినపుడు, మన కొరకు క్రొత్త అద్భుతాలు తెరువబడతాయి. ప్రభావవంతమైన ప్రార్థనకు అవసరమైన స్వేచ్ఛను, ధైర్యాన్ని మనము అనుభవిస్తాము.

మనము దేవుని స్నేహితులమని మనకు తెలియక పోయినా, ఆయన మనలను స్నేహితులుగా చూస్తున్నాడన్న నమ్మకం లేక పోయినట్లయితే, మనకేది అవసరమో చెప్పుటకు లేక ఏదైనా అడుగుటకు సమ్మతిలేని వారముగా వుంటాము. మనము దేవునితో దూరపు సంబంధాన్ని కలిగివున్నట్లయితే, మన ప్రార్థనలు కేవలం శాస్త్రోక్తంగా వుంటాయి. అయితే, ఆయన యెడల భయ భక్తులు కోల్పోకుండా, మన స్నేహితునిగా కలిగివున్నట్లయితే, మన ప్రార్థనలు స్వేచ్ఛగాను, ఆసక్తిగాను, మరియు సన్నిహితముగాను వుంటాయి.

సామాన్యమైన స్నేహములో ప్రేమించుట, ప్రేమింపబడుట మిళితమైవుంటాయి. అంటే నీ పక్షాన వున్నవారు, నీకు సహాయపడాలని ఆశపడేవారు, నిన్ను ప్రోత్సాహపరచేవారు, నీ ఆశలన్నిటిని మనసులో వుంచుకున్నవారు ఒకరు వున్నారని తెలుసుకోవటం మంచిది. స్నేహితుడంటే, నీకు విలువనిచ్చేవాడు, నీతోనుండువాడు, నీకు సహకారి, నీకు ప్రియమైనవాడు, నీతో సమయం గడుపుటకు యిష్టపడువాడు, నీకు సంతోషాన్నిచ్చువాడు. ఒక వ్యక్తితో సమయాన్ని గడుపుట ద్వారా, నీ జీవితాన్ని ఆ వ్యక్తితో పంచుకొనుటద్వారా నీవు ఆ వ్యక్తికి స్నేహితుడివి కాగలవు.

దేవునితో స్నేహాన్ని పెంపొందించుకొనుట అనునది, ఈ లోకంలో ఒక వ్యక్తితో స్నేహాన్ని పెంపొందించుకొనుట అని అర్ధము. దీనికి కొంత సమయం పడుతుంది. ఇది సమయాన్ని తీసుకుంటుంది. సత్యమేమిటంటే, దేవునితో నీవు ఎంత సన్నిహితంగా వుండగలవో అంత సన్నిహితంగా వుండవచ్చును. అది నీవు ఆయనతో గడిపే సమయంపై ఆధారపడి వుంటుంది. ప్రార్థనలోను, వాక్యములోను సమయం గడుపుటద్వారా ఆయనను తెలుసుకొనమని మిమ్మల్ని ప్రోత్సాహిస్తున్నాను. నీవు ఆయన విశ్వాస్యతను అనుభవిస్తూ, క్రమముగా ఆయనతో సమయం గడుపుకొలది, దేవునితో నీ సంబంధం లోతుగాను, మరింత సన్నిహితంగాను మారుతుంది. మనుష్యులతో సంబంధాలను పెంపొందించుకొనుట లోను,దేవునితో సంబంధాన్ని పెంపొందించుకొనుటలోను వున్న తేడా ఏమిటంటే దేవుని విషయంలో నీవు చివరకు ఒక పాపరహితుడైన స్నేహితుని, నిన్ను ఎప్పుడు విడువని, ఎడబాయని స్నేహితుని పొందుకుంటావు. ఆ స్నేహితుడు నమ్మదగినవాడు, మనము ఆధారపడతగినవాడు, ప్రేమించి, క్షమించేవాడు.

> దేవునితో నీవు ఎంత సన్నిహితంగా వుండదలచుకుంటే అంత సన్నిహితంగా వుండవచ్చును. అది నీవు ఆయనతో గడిపే సమయంపై ఆధారపడివుంటుంది.

దేవునితో మన యొక్క స్నేహాన్ని అభివృద్ధి చేసుకొనుటకు ప్రాధాన్యతనిచ్చి, ప్రతిదినం నీవు చేసే అన్ని పనులలో ముఖ్యముగా ఆయనను ఆహ్వానించుట అనునది ఒక చిన్న ప్రార్థనతో మొదలవుతుంది ఆయనతో మాట్లాడుతూ, నీ జీవితాన్ని పంచుకుంటూ, నీవు చేయు అన్ని పనులను గురించి ఆయనకు చెప్పు. నీ ఆలోచనలలో, నీ సంభాషణలో, ప్రతిదినం నీ పనులన్నిటిలో ఆయనను చేర్చు. నీవు నిరాశ చెందినప్పుడు మాత్రమే ఆయన వద్దకు పరిగెత్తకు, పచారీ కొట్టులోను, కారు నడుపుతున్నపుడు, తల దువ్వుకుంటున్నపుడు, నీ కుక్కని బయట నడిపిస్తున్నపుడు, లేక భోజనం వండుతున్నపుడు దేవునితో మాట్లాడు.

నీ స్నేహితునిలా, నీ సహకారిలా ఆయనను చేర్చుకో, ఆయన లేకుండా ఏమి చేయుటకు ఒప్పుకొనకు. ఆయన నీ జీవితంలో వుండవలెనని నిజంగా కోరు కుంటున్నాడు. చాలా మందిలా దేవుని నీవు ఆదివారానికి మాత్రమే పరిమితం చేయకుండా, నీ యొక్క సోమ, మంగళ, బుధ,గురు, శుక్ర, శని వారాలకు కూడా ఆహ్వానించు. ఆయనను కేవలం మతపరమైన కట్టడిలో వుంచవద్దు. ఎందుకంటే ఆయన నీ జీవితంలోని ప్రతీ విషయంలో ప్రవేశము కోరుచున్నాడు. ఆయన నీ స్నేహితునిగా వుండాలని కోరుకుంటున్నాడు.

## *అబ్రాహాము*

బహుశా బైబిలులో అబ్రహాము కంటే ఎక్కువ సార్లు ఎవరూ “దేవుని స్నేహితుడు” గా పిలువ బడలేదు. (యెషయా 41:8)లో, దేవుడు అబ్రహామును “నా స్నేహితుడు అని పిలుస్తున్నాడు”. మరియు యోహాను 2:23 ఈ విధంగా చెప్తుంది,” …అతడు దేవుని స్నేహితుడని పిలువబడెను”. పాత నిబంధనలో యెహోషాపాతు రాజు ఒక దినము దేవునితో మాట్లాడుతూ “నీస్నేహితుడైన” అబ్రహాము అని సంబోధిస్తాడు (2 వ దినవృత్తాంతములు 20:7). దావీదును “దేవుని చిత్తానుసారుడు” అనియు యోహానును “యేసుప్రేమించిన శిష్యుడు అని బైబిలు చెప్పుచుండగా అబ్రహాము మాత్రము ఒకటికంటే ఎక్కువ లేఖన భాగాలలో ***దేవుని స్నేహితునిగా*** పిలువబడు వైవిధ్యమైన గౌరవాన్ని పొందగలిగాడు.”

దేవుడు సొదొమ, గొమొఱ్ఱా పట్టణప్రజల దుష్టత్వాన్ని బట్టి వారికి తీర్పు తీర్చ వెళ్ళునపుడు తన ప్రణాళికను దేవుడు అబ్రహాముతో చెప్పెను. దీనిని గూర్చి మనము “అప్పుడు యెహోవా, నేను చేయబోవు కార్యమును అబ్రహామునకు దాచెదనా?” అని ఆదికాండము 18:17 లో చదువుతాము ఎందుకు? ఎందుకంటే వారు స్నేహితులు కాబట్టి.

స్నేహములో, తాము చేయబోవుతున్న విషయాలను ఒకరితోఒకరు పంచుకుంటూ ఉంటారు. ఎన్ని సార్లు నీ స్నేహితుడు నిన్ను “ఈ రోజు నీవు ఏమి చేస్తున్నావు?” అని అడిగినపుడు నువ్వు “ఈ రోజు ఉదయం నేను పచారి కొట్టుకు వెళ్ళి రాత్రికి బంతి ఆటకి వెళ్తున్నాను” అని చెప్తావు. లేక ఎంత తరచుగా నీవు నీ స్నేహితులను “వచ్చేవారం నీ ఉద్దేశాలేంటి” అని అడిగావు, అప్పుడు వారు “మంగళవారం డాక్టర్‌ని కలవాలి, గురువారం ఒక మీటింగ్ వుంది. కానీ బుధవారం నాతో కలసి భోజనం చేస్తావా” అని చెప్పారు.

నీవు నీ స్నేహితునితో లేక స్నేహితురాలితో చెప్పినట్లే, దేవుడు కూడా అబ్రహామును స్నేహితునిలా తలంచాడు గనుక, తాను చేయునది చెప్పినాడు. సామెతలు 3:6 లో ‘*నీ ప్రవర్తన అంతటి యందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును*’ అని బైబిలు చెప్తుంది. అధికారమునకు ఒప్పుకొనుట అనగా వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారన్న విషయాన్ని మీద శ్రద్ద చూపుట. మనప్రాణ స్నేహితుడు మన గురించి ఏమి ఆలోచిస్తున్నాడో అని శ్రద్ధ చూపునట్లు, మన

ప్రణాళికలను గూర్చి దేవుడు ఎలా ఆలోచిస్తున్నాడని మనం శ్రద్ధ చూపవలసియున్నది. భార్య లేక ప్రాణ స్నేహితునితో ఎలా చర్చిస్తామో, అలా సంభాషించునట్లుగా మనం ప్రతి దానిని గూర్చి దేవునితో చర్చించవలసియున్నది.

సొదొమ, గొమొఱ్ఱాలకు వ్యతిరేకంగా దేవుడు నిర్ణయించిన నాశనమును తెలిసికొనినప్పుడు, అబ్రహాము (ఆదికాండము 18:23) వారు స్నేహితులు కనుక దేవుడు తన తలంపుల అబ్రహాముతో పంచుకున్నట్లుగానే, అబ్రహాము కూడా "సమీపించి" తన ఆలోచనలను ప్రశ్నించాడు వారు స్నేహితులు కనుక తాము స్వతంత్రంగా, బాహాటముగా మాట్లాడుకొనగల సంబందాన్ని వారు కలిగియున్నారు. సర్వోన్నతుడైన దేవుని ప్రశ్నించగలిగిన నమ్మకం అబ్రహాముకు తమ సంబంధంపై కలదు! అదే సన్నిహితత్వం, సంబంధంలోని సురక్షితం.

ఈ విషయం ఆదికాండము 18:17–33 లో పొందుపరచబడి యున్నది, కానీ దాని అంతమేమైనదో మీకు తెలిసేయుండవచ్చును. అబ్రహాము, దేవునితో సంభాషణ కొనసాగుతుంది. ఆ పట్టణములోని నీతిమంతులు, దుష్టులతో కూడా బాధ పరచబడకుండునట్లు తీర్పును ఆపమని అడుగుతూ, అబ్రహాము విజ్ఞాపనా ప్రార్థన చేస్తున్నాడు. 50 మంది నీతిమంతులున్న యెడల ఆ పట్టణములను నాశనం చేయవద్దని మొదలుపెట్టాడు, కానీ తర్వాత అది అసాధ్యమని తెలుసుకున్నాడు. కొంత వాదన తర్వాత 10 మంది నీతిమంతులున్న యెడల నాశనం చేయవద్దని అడిగాడు దేవుడు అంగీకరించాడు. అంత ధైర్యంగా అబ్రహాము ఎలా విజ్ఞాపన చేయగలిగాడు? ఎలా అంటే దేవుడు తన స్నేహితుడని తెలిసి, ఆ సంబంధాన్ని బట్టి అబ్రహాము ప్రార్థించాడు.

## నీవు

నీవు కూడా ఆయన స్నేహితుడవైతే – ఆయన అబ్రహాముతో పంచుకొనినట్లే నీతో కూడా తన హృదయాన్ని, కోరికలను, తన ఉద్దేశాలను మరియు తలంపులను పంచుకొంటాడు. నీ జీవితంలో ఏమి సంభవించబోతుందో దానిని, ఆ సమయంలో నీవేమి చేయాలో అర్థంచేసుకునే శక్తిని ఆయన నీకు అనుగ్రహిస్తాడు. భవిష్యత్తుకై నిన్ను సిద్ధపరచి, నడిపిస్తాడు. నీవు దేవుని స్నేహితుడవైతే, నీ పరిస్థితులచే నీవు పట్టబడి, కాయబడి, అకస్మాత్తుగా ఎదుర్కొననవసరంలేదు. నీవు దేవుని స్నేహితుడవు గనుక – నీకు ముందుగా తెలియజేయబడింది కనుక సిద్ధంగా వుంటావు. నీవు తెలుసుకోవాలనుకున్న ప్రతి దానిని ఆయన నీకు తెలుపడు గాని, నీవు ఓపికతో నమ్మినపుడు అర్థం చేసుకునే శక్తిని నీకు ఇస్తాడు.

"నేను దేవుని స్నేహితుడిని ఎలా అవ్వగలను?" అని నీవు అడగవచ్చు. యోహాను 15:15 ననుసరించి నీవు యిప్పటికే దేవుని స్నేహితుడవు. ఈ వచనంలో, యేసు తన శిష్యులతో "ఇక మిమ్మును దాసులని పిలువక స్నేహితులని పిలుచుచున్నాను" అని చెప్తున్నాడు. నీవు క్రీస్తు అనుచరుడవైతే, నీవు నవీన – కాలపు దేవుని శిష్యునివి మరియు ఆయన

స్నేహితునివి. స్నేహములోని కోణాలవలె, నీవు మామూలు స్నేహితునివి కావచ్చు, ఇంకా దగ్గర స్నేహితునివి కావచ్చు, సన్నిహిత, ప్రాణ స్నేహితునివి కావచ్చు. ఇతరులతో నీ స్నేహం పెరిగి, అభివృద్ధి చెందునట్లే, దేవునితో నీ స్నేహం పెరిగి అభివృద్ధి చెందుతుంది. సహజంగా స్నేహం అభివృద్ధి కావటానికి సమయం, బలం అవసరమైనట్లే, దేవునితో స్నేహానికి కూడా అవసరం.

> దేవునితో లోతైన స్నేహాన్ని మరింత నిశ్చయపరచు ఉత్తమ మార్గాలలో ఒకటి ఆయనకు లోబడే హృదయాన్ని కలిగి ఉండుటయే

దేవునితో లోతైన స్నేహాన్ని మరింత నిశ్చయపరచు ఉత్తమ మార్గాలలో ఒకటి–ఆయనకు లోబడే హృదయాన్ని కలిగి ఉండుటయే. మన హృదయాలు ఆయన నడిపింపునకు స్వచ్ఛంగాను, సున్నితంగానూ వుండి, ఆయనకు లోబడుటకు ఆశక్తితో ఉన్నట్లయితే, దేవుని స్నేహాన్ని అనుభవించుటకు గొప్ప స్థితిలో వున్నామని అర్థం. మనం ఎప్పుడూ ఉద్దేశ పూర్వకముగా అవిధేయులముగా తిరుగుబాటు తనంగా మాటవినని వారముగా ఉండమని నా ఉద్దేశ్యము. నా ఉద్దేశ్యము ఏమిటంటే మనం ఆయనను ప్రేమిస్తున్నాము, స్నేహితునిగా ఆయనను నమ్ముతున్నాము ఆయన మన కొరకు చేసే ప్రతీది ఉత్తమమైనదని మనకు తెలుసు మన సొంత కోరికలకు ముందు ఆయన ఇష్టాలను పెట్టుకుంటాము.

దేవునితో నీ సహవాసములో నీవు ఎదుగుచుండగా, నీ సంబంధము ఆయన నీ కొరకు ఏమి చేస్తాడు అన్నదానిపైకాక ఆయన ఎవరైయున్నాడో దానిపై ఆధారపడియున్నదని మర్చిపోవద్దు. ఆయన బహుమానాలను కాక ఆయన సన్నిధిని వెదుకు, ఆయన చేతిని కాక ఆయన ముఖాన్ని వెదుకు. దేవునితో పరిణితి కలిగిన బలమైన సంబంధానికి ఉన్న ఒక అడ్డంకు ఆయనను స్నేహితునిగా మన దృష్టి కేంద్రీకరించుటకాక ఆయన ద్వారా కలిగే లాభాలపై మన దృష్టి కేంద్రీకరించుట అని మీరు తప్పకుండా తెలుసుకొనవలసియున్నది. మానవులముగా, మన ద్వారా లాభము పొందాలనుకునే వారు మన స్నేహితులవ్వాలని ఆశపడినప్పుడు మనం దానిని ఒప్పుకోలేము, ఎవరైనా కేవలం మనమేమైయున్నామో దానిని బట్టి మనల్ని నిజంగా ఇష్టపడి మనతో స్నేహం చేయదలిస్తే మనం దానిని ఎంతో గౌరవంగా భావిస్తాము దేవునికి కూడా ఇదే నియమం వర్తిస్తుంది.

## స్నేహం ధైర్యాన్ని పుట్టిస్తుంది

మనము దేవునితో మన స్నేహాన్ని అర్థంచేసుకొనుట మొదలుపెట్టి, మనలను మనం ఆయన స్నేహితులుగా చూచుట మొదలుపెట్టినప్పుడు, మన ప్రార్థనలు మరింత ఆత్మచే

నడిపింపబడి మరింత విశ్వాసపూరితమై, మరింత ధైర్యాన్ని పుట్టిస్తాయి. యేసు తన శిష్యులకు పరలోక ప్రార్థన నేర్పించిన వెంటనే, లూకా 11వ అధ్యాయంలో ఒక కథను చెప్పాడు. ప్రార్థన గురించిన తన పాఠానికి ఉదాహరణగా ఆయన చెప్పాడని మనం భావించవచ్చు. ఆయన యిలా చెప్పాడు. "మరియు ఆయన వారితో ఇట్లనెను మీలో ఎవనికైన ఒక స్నేహితుడుండగా అతడు అర్థరాత్రివేళ ఆస్నేహితుని యొద్దకు వెళ్ళి–స్నేహితుడా, నాకు మూడు రొట్టెలు బదులిమ్ము, నా స్నేహితుడు ప్రయాణము చేయుచు మార్గములో నాయొద్దకు వచ్చియున్నాడు, అతనికి పెట్టుటకు నా యొద్ద ఏమియు లేదని అతనితో చెప్పిన యెడల అతడు లోపలనేయుండి–నన్ను తొందరపెట్టవద్దు, తలుపు వేసియున్నది, నా చిన్నపిల్లలు నాతో కూడ పండుకొనియున్నారు, నేను లేచి ఇయ్యలేనని చెప్పునా? అతడు తన స్నేహితుడైనందున లేచి ఇయ్యక పోయినను, అతడు సిగ్గుమాలి మాటి మాటికి అడుగుటవలననైనను లేచి అతనికి కావలసియున్నవన్నియు ఇచ్చును అని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను." (లూకా 11:5–8).

రొట్టె అవసరమైన వ్యక్తి "సిగ్గుమాలి మాటిమాటికి అడుగుట వలననే" దానిని పొందు కున్నాడని గమనించండి. మనం మన స్నేహితులను మాత్రమే "సిగ్గుమాలి మాటిమాటికి" అడుగగలము – ఎందుకంటే స్నేహం మనకు ధైర్యం ఇస్తుంది. మన స్నేహాలలో మనం ఎంతబాగా ఎదుగుతుంటే, అంత ధైర్యం కలుగుతుంది. హెబ్రీ గ్రంథకర్త ద్వారా, దేవుడు మనలను "మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృపపొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము". అని ఆహ్వానిస్తున్నాడు.

మనకు అంతగా తెలియని వారితో మనం ధైర్యంగా ఉండలేము. ఉదాహరణకు, నేను, డేవ్ ఒక రెస్టారెంట్‌కు భోజనానికి వెళ్ళినపుడు మాకు భోజనం వడ్డించు వ్యక్తి పేరు జాన్ అనుకుందాం. మొదటి సారి మేము వెళ్ళినపుడు అతను మమ్మల్ని పరిచయం చేసుకుంటాడు. డేవ్ అతనితో "నిన్ను కలుసుకోవటంచాలా సంతోషం జాన్ ఈమె నా భార్య, జాయిస్, మరుసటి గురువారం ఆమె తన పనికి వెళ్ళవలసివున్నది. నీవు ఆమెను తీసుకెళ్ళగలవా?" అని అడగడు. మేము మాకు పరిచర్య చేసే వ్యక్తితో స్నేహంగానేవున్నా అతనిని ఒక సహాయం చేయమని అడిగేంత సన్నిహిత స్నేహం మా మధ్య లేదు.

జాన్ పని మాకు భోజనం వడ్డించుట కాబట్టి అతన్ని మరికొంత వడ్డించమని అడుగుటకు నేను వెనుకాడను. కాని మేము స్నేహితులము కాదు గనుక, నా కారు, షెడ్డులో వున్నందున నన్ను వచ్చే గురువారం నా పని వద్ద వదిలిపెట్టమని అడుగుటను నేను కలలో కూడా ఊహించలేను. కానీ, నా స్నేహితురాలిని అలా అడగగలను. ఒక వేళ నేను అక్కడ ఉదయాన్నే ఐదు గంటలకు వుండవలసి వచ్చినా, సంతోషంగా అలా చేసే స్నేహితులు నాకున్నారు–మా మధ్యగల సంబంధాన్ని బట్టి నేను వారిని ధైర్యంగా అడగగలను.

సమానంగా, దేవునితో సహవాసం ప్రార్థనలో ధైర్యాన్ని ఇస్తుంది. ఈ విషయాన్ని గురించి వ్రాస్తూ చార్లెస్ స్పర్జన్ "దేవుని ద్వారం తెరుచుకునే వరకు ప్రేమ తడుతూనే వుంటుంది" అని చెప్తాడు. మనం ఆయన స్నేహితులం కాబట్టి ఆయన మనం కోరుకునేది, మనం ఇష్టపడేది ఇవ్వాలని, మనతో పంచుకోవాలని ఆశపడుతున్నాడని తెలిసినవారిని మనం మాటి మాటికీ, ఒత్తిడి చేసి అడగగలము. అదేవిధంగా, ఆయనతోవున్న సంబంధంలో మనం సురక్షితంగా లేనట్లయితే మనం ఆయనను చేరునపుడు వెనుకాడుతూ, ఇబ్బందిపడుతూ వుంటాము.

ధైర్యంగా ప్రార్థించే స్త్రీ, పురుషుల కొరకై దేవుడు చూస్తున్నాడని నేను నమ్ముతాను అందరూ తరచుగా ప్రార్థించే ప్రార్థన, నేను అనేక సార్లు చేసిన ప్రార్థనను నేను "కేవలం" ప్రార్థన అంటాను. అనేక సార్లు మనం ఈ ప్రార్థన చేస్తూ వుంటాము కానీ దానిని అంతగా పట్టించుకోము "కేవలం" ప్రార్థన ఇలా ఉంటుంది! "యిప్పుడు ప్రభువా ఈ ఆహారంకై వందనాలు", "దేవా మమ్మల్ని రక్షించుమని అడుగుచున్నాను", "తండ్రీ ఈ రాత్రి నీ వద్దకు వచ్చియున్నాము", "ఓ దేవా, నీవు ఈ సమయంలో మాకు సహాయం చేసినట్లయితే, ఋణపడివుంటాము" నేనేం చెప్తున్నానో మీకు అర్థమైందా? దేవుడ్ని ఎక్కువ అడగటానికి మనం భయపడుతున్నట్లనిపిస్తుంది. మంచి స్నేహితులతో మాట్లాడే విధానం అది కాదు.

ఇక్కడ నేను ఉపయోగించిన "కేవలం" అనే పదం నీతి, మంచి అనే అర్థాన్ని యిస్తుంది. అయితే దీనికి కష్టంగా తగినంత పొందుకొనుటకు లేక ఇరుకైన స్థలం ద్వారా అనే అర్థంకూడా వస్తుంది. మనము అడుగుటకు, ఆశపడుటకు, ఆలోచించుటకు సాహసించుదానికంటే ఎక్కువగా, అత్యధికముగా, సమృద్ధిగా యిచ్చుటకు దేవుడు యిష్టపడుతున్నాడు (ఎఫెసీ 3:20చూడండి). అతి కష్టంగా తగినంత పొందుకొనుటకు మనమెందుకు దేవుని చేరాలి? ఎక్కువ అడుగుటకు భయపడుతున్నట్లుగా మనం మన స్నేహితుడైన దేవుని ఎందుకు అడగాలి? మనం ఆయనను అలా చేరినట్లయితే, ఆయన మంచితనాన్ని, ఔదార్యమును మనం నమ్మనట్లుగా అది కనిపిస్తుంది. ఆయన అతి కష్టంగా తగినంత యిచ్చు దేవుడు కాదు కాని, ఆకాశపు వాకిళ్ళు విప్పి పట్టజాలనంత విస్తారముగా దీవెనలు కుమ్మరించుటకు ఇష్టపడు దేవుడైయున్నాడు (మలాకీ 3:10 చూడండి).

> ఆయన, తనతో సహవాసములో నిశ్చయత కలిగిన యధార్థవంతులు, నీతిమంతులైన వారు చేసే, ధైర్యము, నమ్మకము, విశ్వాసము–నిండిన ప్రార్థనలు వినుటకు ఇష్టపడుతున్నాడు.

కొన్నిసార్లు మన ప్రార్థనలను "కేవలం" ప్రార్థనలుగా అలవాటు

చేసుకుంటాము, అలా వున్నట్లయితే, మనం దానిని తుంచవలసియున్నది. దేవుడు పిరికి, నిశ్చయత లేని ప్రార్థనలు వినదలచుకోవటం లేదు. ఆయన, తనతో సహవాసములో నిశ్చయత కలిగిన యథార్థవంతులు, నీతిమంతులైన వారు చేసే, ధైర్యము, నమ్మకము, విశ్వాసము–నిండిన ప్రార్థనలు వినుటకు ఇష్టపడుతున్నాడు. దేవుని చేరునపుడు, ఎల్లప్పుడు ఆయన యెడల గౌరవాన్ని కలిగియుండు, కాని భయపడవద్దు! బైబిలు మనకు గౌరవప్రదమైన భయాన్ని, భక్తిని కలిగివుండమని సూచిస్తుంది, కాని భయంతో వెనుకడుగు వేయమని మాత్రం చెప్పటం లేదు. నిజానికి, మనం భయంతో వెనుకడుగు వేసినట్లయితే, దేవుని ఆత్మ మనయందు ఆనందించదు అని హెబ్రీ 10:38 చెప్తుంది.

## స్నేహం ఇతరులకు లాభం చేకూరుస్తుంది

మనం దేవునితో స్నేహంగా వున్నప్పుడు, ఆ స్నేహం మనకే కాకుండా మన చుట్టూ వున్నవారికి కూడా లాభాన్ని చేకూరుస్తుంది. ప్రజలు కొన్ని అవసరతలతో, బాధలతో మన వద్దకు వచ్చినపుడు, మనం వారికి కొంత సహాయపడగలము కాని వారి అవసరతలన్నిటినీ పూర్తిగా తీర్చలేము, కాని దేవుడు తీర్చగలడు. మనం ప్రజలతో స్నేహంగా వున్నప్పుడు, మనం వారితో “నీకు అవసరమైనది నా వద్ద లేదు, కాని అది చేయగల వ్యక్తి నాకు తెలుసు. నేను నా స్నేహితుని అడుగుతాను! నీ గురించి నేను దేవుని యెదుట విజ్ఞాపన చేస్తాను.” అని చెప్పగలము. మనం దేవుని స్నేహితులమైనపుడు, దేవునికి మనుష్యుల పరిస్థితుల మధ్యకు వచ్చి, వారి పిల్లలు మత్తు పదారాలు వాడకుండా, ఆర్థిక ఇబ్బందులు లేకుండా, వైద్య పరమైన అద్భుతాలు చేస్తూ, వైవాహిక బంధాలను తిరిగి కడుతూ సహాయ పడగల శక్తి కలదని ఎరిగివుంటాము. దేవునికి ఎంత సన్నిహితంగా వుంటామో, ప్రజలకు సహాయపడుటకు దేవుని ఇష్టాన్ని, చిత్తాన్ని అంత విశ్వాసంగా ఎరిగివుంటాము, నమ్మకం కలిగివుంటాము. వారు మన వద్దకు వచ్చినపుడు, మనం దేవుని వద్దకు వెళ్లి వారి కొరకు ఆయన సహాయం పొందగలము. మనం ప్రేమించువారు దేవుని సహాయం పొందుటకు అర్హులు కారని మనకు తెలిసినప్పటికీ, మనం దేవుని వద్దకు వెళ్లి వారికి సహాయపడునట్లుగా, మనకు సహాయం చేయమని దేవుని అడుగగలము. ప్రేమ, దయ నిండిన హృదయాలతో మనం ప్రార్థించగలము – ఆ ప్రార్థన దేవుడు వింటాడు.

నా తండ్రి ఆత్మీయ జీవితం గురించి బాధపడుట నాకు జ్ఞాపకం వుంది. నేను చిన్నదానిగా వున్నపుడు అతను నన్ను చాలా బాధించాడు, అందుకు చాలా సంవత్సరాలు నేనతన్ని నిజంగా ద్వేషించాను, చాలా ప్రతీకారం కలిగివున్నాను. అతని కొరకు ప్రార్థించుట అనేది నేను చేయదలచుకున్న ఆఖరు పని. ఏదేమైనా, నేను దేవునికి దగ్గరై, ఆయన మార్గాలు నేర్చుకొంటుండగా, నేను నా తండ్రిని పూర్తిగా క్షమించటమే కాకుండా, అతని రక్షణ కొరకు ప్రార్థించవలసియున్నదని గ్రహించాను. నా తండ్రిని క్షమించే కృపను, అతని కొరకు కనికరం కలిగిన మనస్సును దేవుడు నాకిచ్చాడు.

అనేక సంవత్సరాలు, నా తండ్రి దేవుని వద్దకురావాలని వివిధ సమయాలలో ప్రార్థించాను, కాని అతనిలో చిన్న మార్పును కూడా నేనెన్నడూ చూడలేదు. అతను ఎప్పుడూ కఠిన హృదయం కలిగిన వ్యక్తిగా వుంటువున్నాడు, అతని హృదయం కొంచెం కూడా మెత్తన పరచ బడుతుందన్న సూచనయేది నాకు కనబడలేదు. అతని కొరకు ప్రార్దించుట అనవసరం అనుకున్నాను.

అప్పుడు దేవుడు, తాను నాకు చేయమని చెప్పిన వాటన్నిటిలో కూడా కష్టమైన పని చెప్పాడు. మేము వుంటున్న స్థలానికి దగ్గరలో ఒక యిల్లు కొని, అందులో నా తల్లిదండ్రులనుంచి, వారు చనిపోయే వరకు వారిని గూర్చిన శ్రద్ధ తీసుకొమ్మని చెప్పాడు. ఆ సమయంలో వారు, 70 యేళ్ళవారైవున్నారు. మా కుటుంబాలలో అనేక సంవత్సరాలు బ్రతికినారు వారు. కనుక, వారిని మాకు దగ్గరగా తెచ్చుకోవటం అంటే, నన్ను బాధపెట్టటం తప్ప మరేమీ చేయనివారిని సంవత్సరాల తరబడి చూడడమే అనిపించింది. నేను ఆ విషయంలో ఆసక్తి చూపలేదు కాబట్టి నేను లోబడేవరకు దేవుడు నన్ను విడువలేదు.

మరి 3 సంవత్సరాలు గడచిపోయాయి. నేనింకా నా తండ్రిలో ఏ మార్పూ చూడలేదు. కొన్నిసార్లు, చాలా నెలలు అతనికోసం ప్రార్థించేదానను కాను, తరువాత దేవుడు మరల అతన్ని నా హృదయంలో పెట్టేవాడు. ఒకరోజు ఉదయాన్నే పనికి వెళ్తూ ఈ విధంగా మాట్లాడటం నాకు జ్ఞాపకం వుంది: “తండ్రీ, నా స్వంత తండ్రి అవిశ్వాసంతో చనిపోయి, నరకానికి వెళ్ళుచుండగా, యేసునందలి విశ్వాసం ద్వారా నీతో వ్యక్తిగత సంబంధం కలిగియుండునట్లుగా ప్రపంచంలోని ప్రజలను నడిపించుటకు నీవు నన్ను వాడుకొనుట అవమానకరమని నేను తలుస్తున్నాను. నువ్వు చెప్పింది నేను చేశాను, ఇప్పుడు ఒక వ్యక్తిగతమైన పని నాకు చేసిపెట్టు నా తండ్రని రక్షించు, అతని పాపాలు క్షమించి, నీతో వ్యక్తిగత సంబంధంలోనికి అతన్ని నడిపించు.” నేను యిటువంటి ప్రార్థనలే ఇంతకు మునుపు కూడా చేసినప్పటికీ, అవి ఇంత హృదయపూర్వకముగా లేవు.

కొన్ని వారాల తర్వాత, నా తల్లి నాకు ఫోన్ చేసి, నా తండ్రి 3 దినాల నుండి ఏడుస్తూ, నన్ను చూడాలని అంటున్నాడని చెప్పింది. నేను, డేవ్ కలసి వారి ఇంటికి వెళ్ళాము. నా తండ్రి, నన్ను చిన్నతనంలో బాధపరచినందుకు నాకు క్షమాపణ చెప్పాడు. అతను ఏడుస్తూ, తానెంత బాధపడుతున్నాడో చెప్తూనే వున్నాడు. నేను అతన్ని నీవు యేసును ప్రభువుగా అంగీకరించటానికి సిద్ధంగా వున్నావా? అని అడిగినప్పుడు, అతను ఔనని చెప్పాడు. ఆ దినం మేమతన్ని ప్రార్థనలోనికి నడిపించి, కొన్ని వారాల తర్వాత బాప్తీస్మమిచ్చాము.

కొద్దికాలం క్రితమే నా తండ్రి చనిపోయాడు, అతను క్రీస్తుతో కూడా నిత్యత్వంలో నున్నాడని ఎరిగి మేము సంతోషిస్తున్నాము. ప్రార్థనా శక్తిని ఎప్పుడూ అనుమానించవద్దు. దేవునితో నీ సంబంధం నీవు ప్రేమించే వారి జీవితంలో గొప్ప వైవిధ్యాన్ని కలుగజేస్తుంది.

> కృపాసనం యొద్దకు ధైర్యముగా చేరగల సౌకర్యము, యేసుక్రీస్తు ద్వారా పొందియున్నాము.

మన ప్రార్థనలతో ఇతరుల్ని నియంత్రణలో పెట్టలేము, కానీ వారి తరఫున దేవుని వద్దకు ధైర్యంగా వెళ్ళుట అనేది వారి జీవితాలలో దేవుడు బలంగా, శక్తివంతమైన మార్గాలలో పని చేయుటకు ద్వారాలు తెరుస్తుందని నేను నమ్ముతాను. నా తండ్రి ఇంకను నిర్ణయం తీసికొనవలసియున్నది. కాని, దేవుడు అతనిలో పని జరిగించినాడని నాకు తెలుసు. ఎందుకంటే నేను ధైర్యంగా, పట్టుదల కలిగి ప్రార్థించాను.

నిజంగా, దేవునితో మన స్నేహం ఇతరులకు లాభం చేకూర్చుతుంది. అవి మనకు కూడా గొప్ప లాభాన్ని చేకూరుస్తాయి. దేవుని స్నేహితురాలిగా వుండటం కంటే అత్యద్భుతమైనదేదీ నేను అలోచించలేను. దేవుడు "ఆ జాయిస్ మేయర్, నా స్నేహితురాలు" అని చెప్పుట కంటే ఏదీ నాకు గొప్పగా అనిపించదు. "నీకు తెలుసా – జాయిస్ మేయర్ కు ప్రార్థనా నియమాలన్నీ తెలుసు, సరైన ప్రార్థనను ఆమె చేస్తుంది, ఆమెకు మంచి స్వరం వుంది, ప్రార్థించునపుడు ఆమె చాలా మాటల చాతుర్యం కలిగిస్తుంది!" అని చెప్పటం నాకిష్టం లేదు! దేవుడు నన్ను స్నేహితురాలిగా చూస్తున్నాడని తెలుసుకొనుటకు నేనిష్టపడుతున్నాను, మీరు కూడా ఆ విధంగా కోరుకోవాలని నేను ఆశపడుతున్నాను. యితరుల మరియు మన అవసరతల కొరకు సహాయమునకై మనం కృపాసనం యొద్దకు ధైర్యముగా చేరగల సౌకర్యము, యేసుక్రీస్తు ద్వారా పొందియున్నాము (హెబ్రీ 4:16 లో చూడండి).

నీవు ఎప్పటికైనా చేయగల ఉత్తమమైన క్రియ ఏమిటంటే, దేవునితో నీ స్నేహాన్ని అభివృద్ధి పరచుకొనుట. సిలువలో కార్చిన తన రక్తం ద్వారా యేసు, మనలను నీతిమంతులుగా తీర్చినాడు గనుక, ఈ లోకంలోని నీ ప్రాణ స్నేహితుని చేరినంత ధైర్యముగా, సామాన్యంగా దేవుని చేరవచ్చును. దేవునితో నీ సహవాసం కొంత సమయాన్ని, బలాన్ని కోరుకుంటుందని జ్ఞాపకముంచు కోండి. అయితే, నీ స్నేహం లోతయ్యే కొద్దీ, నీ ప్రార్థనా జీవితం అభివృద్ధి చెందుతుంది. దేవునిలో అభివృద్ధి చెందుతున్న, గొప్ప, సన్నిహిత సహవాసం, సహజంగా అభివృద్ధి చెందుతున్న, గొప్ప, ప్రభావవంతమైన ప్రార్థనా జీవితానికి నడిపిస్తుంది.

## సారాంశం

ఎప్పుడైతే మన హృదయాలు "ప్రభువా, నాకు ప్రార్థించుట నేర్పించు" అని మొరపెడ్తాయో, దేవుడు జవాబిస్తాడు. కేవలం క్రైస్తవులమవుట వలననో, సంఘానికి వెళ్ళుట వలననో –

కొన్ని సంవత్సరాల తరబడి ఆరాధనకు వెళ్ళుట ద్వారా కూడా మనం ఎలా ప్రార్థించాలో నేర్చుకొనలేము. దేవునితో వ్యక్తిగత సంబంధం పెంచుకునే కొలది మనం ప్రభావవంతంగా ప్రార్థించుట నేర్చుకుంటాము. దేవుడు మనలో ప్రతి ఒక్కరినీ ప్రత్యేకంగా చేసినాడు. మనల్ని ఆయన చేసిన విధానాన్ని ప్రకటించు రీతిగా మనకు ప్రార్థించుట నేర్పిస్తాడు. వ్యక్తిగతంగా మనం ఆయనతో ప్రత్యేక సంబంధాన్ని ప్రార్థన ద్వారా కలిగివుండాలని ఆయన ఆశిస్తున్నాడు.

దేవునితో మన వ్యక్తిగత విశ్వాసం మరియు వ్యక్తిగత సంబంధం మన ప్రార్థనా నాణ్యతను, ప్రభావాన్ని పెంచుతుంది. నిజానికి, శక్తివంతమైన, బలమైన ప్రార్థనా జీవితానికి తాళపు చెవి, దేవుని స్నేహితునిగా వుండుటయే. ఆయన మనలను దగ్గరకు చేర్చుకోవాలని, మనం ఆయనను నమ్మాలని, ప్రేమించాలని, మన హృదయాలు ఆయనతో పంచుకోవాలని, తన హృదయం పంచుకొంటుండగా వినాలని కోరుకుంటున్నాడు. ఆయనతో స్నేహితులముగనే మనం ప్రార్థించుట ఎలాగో నేర్చుకొనుట కొనసాగించగలము.

## ప్రార్థనాంశములు

- నీవు నీ ప్రార్థనా జీవితంలో విసిగి, నా ప్రార్థనలు నిజంగా ప్రభావవంతంగా వున్నాయా? అని ఆలోచిస్తున్నట్లయితే, నీ హృదయంలోనుండి "ప్రభువా, నాకు ప్రార్థించుట నేర్పించు" అని ఎలుగెత్తి ప్రార్థించు.
- మన ప్రార్థనా జీవితాల లోతు మరియు బలము, దేవునితో మన వ్యక్తిగత సంబంధపు లోతు మరియు బలానికి ప్రత్యక్షంగా సంబంధం కలిగి వుంటుంది.
- ప్రార్థన సులువైనది. అది దేవునితో మాట్లాడుట, ఆయన మాటలు వినుటయే.
- మనకు ప్రార్థన నేర్పించుటలో దేవుడు మనలను, ప్రత్యేక వ్యక్తిత్వములు, వైవిధ్య గుణాలు, వైవిధ్యమైన సంభాషణా విధానాలను కలిగిన వారిగా పరిగణిస్తాడు. ఇతరులతో పోల్చుకొనకుండా, మనవలెనే వుంటూ ఆయన వద్ద నేర్చుకొనుటకు మనం జాగ్రత్తపడవలసియున్నది.
- ఆయన స్నేహితునిగా – దానికి సంబంధించిన అన్ని హక్కులను కలిగివుండటం అనేది ప్రభావవంతమైన ప్రార్థనకు తాళపుచెవి.
- దేవునితో గొప్ప స్నేహాన్ని అభివృద్ధి చేసుకొనుటకు, సమయం, శక్తి అవసరమైయున్నది. కాని, అది మనం చేయగల ఉత్తమమైన పెట్టుబడియైన్నది.
- స్నేహితులముగా దేవుని చేరుట మనకు ధైర్యంగా ప్రార్థించగల శక్తినిస్తుంది. మనము సన్నిహితమయ్యే కొద్దీ, మరింత ధైర్యంగా ప్రార్థించగలము.

# 2

# సులభమైన ఆధిక్యత

ప్రార్థన అనేది మన జీవితాలలో అత్యధిక ఆధిక్యత అని నేను నమ్ముచున్నాను. అది మనం చేయవలసినది కాదు, మనం చేయదగినది. ఆండ్రూ ముర్రే, దీనిని గమనించి ఈ విధంగా చెప్తున్నాడు "ప్రార్థన అనేది అతి సహజమైన చిన్నవాడు కూడా చేయగలిగినంత సులభమైనది, అయినప్పటికీ, అదే సమయంలో ఒక మనిషి చేయగలిగిన అత్యున్నతమైన, అతి పరిశుద్ధమైన క్రియయైవున్నది. అది అదృశ్యుడైన, అతి పరిశుద్ధుడైన వానితో సహవాసమైయున్నది. దీనిని ఉప యోగించుటలో నిత్యత్వపు శక్తులు నిగూఢమైవున్నాయి".

మన జీవితాలలోనూ, మనం ప్రేమించే వారి జీవితంలోనూ దేవుని ప్రణాళికలు, ఉద్దేశ్యాలు నిజమగునట్లు దేవునితో సహకారులముగా ఉండు మార్గమే ప్రార్థన. దీని ద్వారానే భూమిపై మానవులమైన మనం అత్యద్భుతమైన దేవుని సన్నిధిలోనికి ప్రవేశించగలుగుతున్నాము. మన హృదయాలు దేవునితో పంచుకోవటం, ఆయన స్వరం వినటం, ఆయన మన కొరకై వుంచిన గొప్ప విషయాలను కనుగొని, ఆనందించుటకు ప్రార్థన మనలను నడిపిస్తుంది. నా ఊహలో, దేవునితో సంభాషించుట అత్యధిక ఆధిక్యత, అయితే ఈ ఉన్నత, పరిశుద్ధక్రియయే నాకు తెలిసిన సులభమైన ఆధిక్యత కూడా.

మొట్ట మొదటి నుంచి దేవునితో దినమంతా, ప్రతిదినం, సంభాషించుటకు వీలుగా, సహజంగా, సులభంగా ఈ ప్రార్థన వుండాలి. దేవుడు తలంచినందున, ప్రార్థన ఎప్పటికీ చిక్కైనది కాదని నా అభిప్రాయం. తన క్రైస్తవ విశ్వాసమును బట్టి 1700 సంవత్సరంలో ఖైదీ చేయబడిన మేడమ్ జానే గుయోన్, తన "యేసుక్రీస్తు లోతులను అనుభవించుట" అను పుస్తకములో దేవుడు అసహజమైన దానిని ఎప్పటికీ కోరడు దానికి విరుద్ధంగా, ఆయన సులభమైన, చిన్న బిడ్డ వంటి స్వభావము వలన ఆనందిస్తాడు. దీనిని ఈ విధంగా

చెప్పగలను: ఉన్నతమైన ఆత్మీయ సంపాదనలు, నిజానికి చాలా సులువుగా చేరగలిగినవి. చాలా ముఖ్యమైన విషయాలు, చాలా సులువైనవైయున్నవి.”

ప్రార్థన సామాన్యంగా వుండాలని దేవుడు నిజంగా కోరుకుంటున్నాడు, కాని, సాతాను ప్రార్థన విషయంలో మన ఆలోచనలను త్రిప్పివేస్తున్నాడు. ఎందుకంటే, వాడికి అది ఎంత శక్తివంతమైనదో మాత్రమే కాదు, అది మనకు ఎంత సులువైనదో కూడా తెలుసు. ***దేవుడు మనలను తనతో సంభాషించుటకు, సహవాసము చేయుటకు చేసికొని, దానిని ఎందుకు కష్టతరం చేశాడు?*** అని నిన్ను నీవు ప్రశ్నించుకొనుము. దేవుడు దేనిని కష్టమైనదిగా చేయలేదు, ఆయన మనకొరకు ప్రార్థించుటకు సులభమైన, ఆనందకరమైన మార్గాన్ని, ఆయనతో గడుపుటలో సంతోషించు మార్గాన్ని యిచ్చియున్నాడు. ప్రార్థన ఎల్లప్పుడు ఎక్కువ సమయం తీసుకుంటుంది కనుక మనం ఒక నిర్దిష్ట విధానంలో చేయాలని సాతాను చెప్తాడు. వాడు ప్రార్థన చుట్టు వున్న నియమ, నిబంధనలను దేవుడు మనము ఆనందించాలని మనకిచ్చిన సృజనాత్మకతను దొంగిలిస్తాడు. వాడు మనలను విశ్వాసం నుంచి దూరపరచి, దేవునితో మాట్లాడుటకు మనకు అర్హత లేదని మనలను ఒప్పింపచేస్తాడు. వాడు ప్రార్థనను శాస్త్రోక్తంగా, లేక చేయక తప్పదు అనే పనిలా చేసి, నీవు సరిగా ప్రార్థించుట లేదని, నీ ప్రార్థన ప్రభావవంతముగా లేదనని నీపై నేరం మోపుతుంటాడు. వాడు మనలను కలవరపరచి, మన సమయాన్ని దొంగిలించి, మన ప్రార్థనలు ఎటువంటి మార్పు కలుగజేయలేదని చెప్పి, దేవుడు చిన్న, సులువైన ప్రార్థనలు వింటాడా? అను అనుమానాన్ని మనలో పుట్టిస్తాడు. ఈ కారణాల వలననే, నేను మొదటి అధ్యాయంలో చెప్పిన మనుష్యులు, తరచుగా తమ ప్రార్థన సరియైనది కాదేమో, ఎక్కువ సేపు ప్రార్థించ లేదేమో, అవి నిజంగా దేవుని చేరలేదేమో, అవి ఎందుకూ పనికిరావేమో అని అనుకుంటూవుంటారు.

సాధారణంగా, చాలా మంది తమ ప్రార్థనా జీవితాలతో అసంతృప్తిగా వుంటారు వారు ప్రార్థిస్తారు, కాని తరువాత అపరాధ భావనతోను, తీర్పు భావనతోను నింపబడతారు, సరిగా దానినే అపవాది కోరు కుంటున్నాడు. *నమ్మకం కలిగిన* ప్రార్థన అనేది దేవుడు జవాబిచ్చు ప్రార్థన. కాబట్టి, సాతాను ఎందుకు మన ప్రార్థనల శక్తి, ప్రభావం, విలువల యెడల మనలో అనుమానాలు కలుగ జేస్తున్నాడో మనం సులువుగా అర్థం చేసుకొనవచ్చు.

> క్లుప్తమైన ప్రార్థన కూడా ప్రభావవంతమైనదని నేను చెప్పినపుడు, దీర్ఘ ప్రార్థన చేసే సమయాలు అనవసరమైనవి, విలువలేనివి అవి అర్థం కాదు.

క్లుప్తమైన ప్రార్థన కూడా ప్రభావవంతమైనదని నేను

చెప్పినప్పుడు, దీర్ఘ ప్రార్థన చేసే సమయాలు అనవసరమైనవి, విలువలేనివి అని అర్థం కాదు. అవి కూడా ఖచ్చితంగా అవసరమైనవి, విలువైనవి. నిజానికి, ప్రతిదిన ప్రార్థనతోపాటుగా, కొన్ని దినాలు క్రమముగా, కేవలం ప్రార్థనలోను, ఉపవాసములోను, వాక్యం చదువుటలోను దేవుని వెదకుమని నేను మీకు ఆజ్ఞాపిస్తున్నాను. ప్రార్థన సులువుగా వుండి, సమస్యలేనిది అయినప్పటికీ, కొన్నిసార్లు అది పనిగా వున్నది. కొన్నిసార్లు దేవుడు మన హృదయాలలో వుంచిన విషయాన్ని ఎత్తిపట్టుకొని కష్టపడవలసివస్తుంది. అయితే, అదే సమయంలో, ప్రార్థన కష్టమైనదని, చిక్కైనదని నమ్మించు నట్లుగా సాతానును అనుమతించకూడదు.

దేవునితో మాట్లాడే ఘనతను మన నుండి దొంగిలించుటకు, సాతాను చాలా కష్టపడి పనిచేస్తుంటాడు. ఈ ఆధ్యాయంలో, అపవాది ప్రార్థన గురించి తరచుగా ఉపయోగించు అబద్ధాలను చెదరగొట్టదలచుకున్నాను, అది మీకు గొప్ప, నింపుదల కలిగిన, గౌరవనీయమైన సులభ ప్రార్థనా జీవితాన్ని తిరిగి అనుభవించుటకు సహాయపడుతుంది.

## ఇది - సులువైనది

అనేకులు ఆలోచించేదానికంటే ప్రార్థన ఎంతో సులువైనది. చాలా తర్క వేదాంత మనసు కలిగిన, చార్లెస్ స్పర్జన్, క్లుప్తంగా యిలా చెప్పాడు: "మనం ప్రార్థించునపుడు, మన ప్రార్థనలు ఎంత క్లుప్తంగా వుంటే, అంత ఉత్తమంగా వుంటాయి." దేవుడు సులువైన, బలహీనమైన మొరను వింటాడు, చిన్నపిల్లల వంటి విన్నపాలు అంగీకరిస్తాడు. నేను నలుగురు పిల్లలను పెంచాను, ఈ పుస్తకం వ్రాసే సమయానికి నాకు 8 మంది మనవరాళ్ళు మనవళ్ళు వున్నారు - కాబట్టి, చిన్నపిల్లలు కష్టమైనవారు కాదని నేను చెప్పగలను. తమకు కావలసినది తెలియజేయటానికి పిల్లలెప్పుడూ వెనుకాడరు, భయపడి నప్పుడు పరిగెత్తుకుంటూ నీ వద్దకు వస్తారు, కొన్నిసార్లు ఖచ్చితమైన కారణమేమీ లేకుండానే ఒక పెద్ద ముద్దు పెడ్తారు. కష్టమైన పనులు చేయటానికి వాళ్లని ప్రోత్సాహపరచాలి, అయితే, సులువైన ప్రతిదానిని వారు సంతోషంగా చేస్తారు. తమ హృదయాలు లేక భావాలు దాచుకునేంత తెలివి వారిలో లేదు, ఫలితంగా, వారితో మాట్లాడటం చాలా సులువుగా, ఉత్సాహపూరితంగా కూడా వుంటుంది.

దేవునితో మాట్లాడునపుడు మనం కూడా అలా వుండాలని ఆయన కోరుకుంటున్నాడు. చిన్నపిల్లలవంటి మనస్సుతో, విశ్వాసంతో మనం దేవుని చేరవలసియున్నది. చిన్నబిడ్డలు తమ తల్లిదండ్రులను పూర్తిగా నమ్ముటకు ఏ విధంగా ఇష్టపడతారో, అదేవిధంగా మనం కూడా దేవుని నిష్కపటంగా, పవిత్రంగా, ఏ అనుమానం లేకుండా దేవుని చేరవలసివున్నది. ఎప్పుడైతే మనం సులువుగా, చిన్న బిడ్డవలే విశ్వాసంతో ప్రార్థిస్తామో అప్పుడు మనం దేవుని అద్భుతాలు చేసే శక్తిని, పరిస్థితులు మారుటను చూస్తాము.

మనం మన విశ్వాసంలోను లేక మన ప్రార్థనలలోను చిన్నపిల్లల తత్వముగా, బలహీనంగా వుండకూడదు, మనం చిన్నబిడ్డల వలె వుండాలి. దేవుడు కష్టంతో కూడిన సంబంధాలను కోరుకొనుటలేదు, దేవుడు నిజాయితీ కలిగిన హృదయాలను కోరుకొంటున్నాడు. ఎందుకంటే అతను దైవ హృదయము కలిగినవాడు కనుక ఆయన విశ్వాసం కొరకు కూడా చూస్తున్నాడు, కేవలం ఉద్రేకమే కానిది, కంటికి కనిపించని రాజ్యాన్ని ఆవిష్కరించగల ఆత్మీయ శక్తియై వున్నది. అంతకంటే ముందుగా మన దేవుడు క్రమమునకు కర్తయైయున్నాడు. కాని నియమనిబంధనలకు మరియు ధర్మశాస్త్రమునకు కాదు కాబట్టి ఆయన! ఆత్మలో నడిపింపబడిన, పెద్ద పెద్ద ప్రార్థనలు మనము చేయాలి అని కోరుకొనుటలేదు. మరియు **"అక్షరము చంపును కాని ఆత్మ జీవింపజేయును"** (2 కొరింధీ 3:6 చూడండి).

మనం పరిశుద్ధాత్ముని నడిపింపును అనుసరించినపుడు, మన ప్రార్థనలు జీవంతో నింపబడివుంటాయి. మనం గడియారం చూసుకొని, నిర్ణయించుకొనిన కొంత సమయాన్ని మాత్రమే గడుపుటకు కష్టపడనవసరం లేదు. ప్రార్థనను మనం ఒక కర్తవ్యంలా, మన శరీర అవసరంలా చూస్తున్నపుడు, ఐదు నిమిషాలు కూడా ఒక గంటలా అనిపిస్తాయి, మనం ఆత్మశక్తితో నడిపింపబడినపుడు గంటకూడా ఐదు నిమిషాలుగా అనిపిస్తుంది.

దేవునితో నేను ప్రయాణం చేస్తున్నప్పుడు, నాకు అవసరమైనవి, నాకిష్టమైన వాటిని క్లుప్తంగా అడుగుటకు ప్రయత్నించమని దేవుడు నాకు సవాలు చేసిన సమయాన్ని నేను మరల జ్ఞాపకం తెచ్చుకొంటున్నాను. ప్రార్థనలో అతిగా మాట్లాడే చెడ్డ అలవాటు నాకుంది. క్లుప్త ప్రార్థనలు మంచిది కాదు అని నేను పొరబడేదానను కనుక, నేను దీర్ఘంగా ప్రార్థిస్తూపోయేదానను.

మనం పరిశుద్ధాత్మ దేవుని సహాయంతో మొదలుపెట్టి, ఆయన పూర్తి చేసినప్పుడు దానిని పూర్తి చేయాలి, కానీ మన శరీర సంబంధమైన బలంతో కొనసాగించకూడదు, అలా చేయుట, మన ప్రార్థనా సమయాన్ని సంతోషకరమైనది కాకుండా కష్టమైనదిగా అనిపింపజేస్తుంది. చిన్న బిడ్డవంటి విశ్వాసంతో దేవుని చేరి, దేవుని ఆత్మ నడిపించినంతసేపు ప్రార్థించు. ప్రార్థనలను ప్రభావవంతంచేసేది, ప్రార్థనా సమయం కాదు గాని, వాటి వెనకున్న నిజాయితీ, విశ్వాసం మాత్రమే.

## *అవి దీర్ఘమైనవిగా వుండనవసరంలేదు*

బహుశా, సాతాను ప్రజలకు చెప్పే పెద్ద అబద్ధం, అది ఎక్కువ సమయం చేయాలని చెప్పటమే నిజంగా ప్రార్థించుటకు ముందు నువ్వు కొన్ని గంటలు ప్రార్థించాలని అనుకునేలా వాడు చేస్తాడు, అయితే ప్రార్థన శక్తివంతముగా ఉండుటకై అది దీర్ఘప్రార్థనే కానవసరం లేదని నేను మీతో చెప్తున్నాను. అవి శక్తివంతంగా వుండటానికి క్లుప్త పార్థనలు కూడా కానవసరంలేదు. మన ప్రార్థనా సమయపు కాలం దేవునికి ఏబేధము కలిగించదు. ఆయనకు

అవసరమైనది ఆయన మనకు నేర్పించినట్లు ఆత్మచే నడిపింపబడి, మనస్ఫూర్తిగా నిజ విశ్వాసముతోడుగా వున్న ప్రార్థనలు. నా ఆత్మలో నింపబడి, సంతృప్తి చెందేవరకూ ప్రార్థించుట నేను నేర్చుకున్నాను–కొన్నిసార్లు అది మిగిలిన రోజులకంటే ఎక్కువ సమయం తీసుకుంటుంది.

మనం మన మాటలకు కష్టపడి ప్రార్థనా శక్తిని పోగొట్టుకుంటామని నేను అనుకుంటాను. మరల చెప్తున్నాను, ఎక్కువ సమయం ప్రార్థించుటలో తప్పు లేదు. ఇంతకు ముందు చెప్పినట్లు, మనందరం కొన్ని రోజులు ప్రార్థనకు నిర్ణయించుకోవాలి, దాని ద్వారా దేవుని సన్నిహిత్యమునకు మనం ఇష్టపడుతున్నామా, లేదా అన్నది తెలుస్తుంది.

అయితే శారీరక, కర్తవ్యంగా కాకుండా, పరిశుద్ధాత్మ నడిపింపుతో కొన్ని నిర్దిష్ట గంటలు ప్రార్థనలో వుండవలసిన అవసరం లేదని నేను నమ్ముచున్నాను. మన జీవితంలోని సమస్యలు ఎక్కువ సేపు ప్రార్థించ వలసినవైతే అలా చేయవచ్చు. కాని కేవలం సమయాన్ని గడపటానికి ప్రార్థించకూడదు.

దేవుడు నన్ను నా సమస్యలకై క్లుప్తంగా ప్రార్థించమని సవాలు చేసినప్పుడు ఆయన నన్ను సంగ్రహముగా, కేవలం ఆ విషయాన్ని గురించి ప్రార్థించి తర్వాత మౌనంగా ఉండమన్నాడు. నేను అలాచేసినప్పుడు, నా ప్రార్థనా జీవితంలోనికి వచ్చిన శక్తిని నమ్మలేక పోయాను. అత్యంత శక్తివంతమైన, ప్రభావవంతమైన ప్రార్థనలు ఈ విధంగా వుంటాయి. “వందనాలు ప్రభువా, ఓ దేవా!, నాకు నీ జ్ఞానం కావాలి,” “నేను కొనసాగుటకు నీ బలమిమ్ము, ప్రభువా!” నేను నిన్ను ప్రేమిస్తున్నాను”. బహుశా అన్నిటికంటే అత్యంత శక్తివంతమైనది, “సహాయం చేయి!” చూశారా?మనం మన తరుపున పని చేయునట్లు పిలువగా కేవలం కొద్ది మాటలు మనలను పరలోకంతో కలుపుతాయి.

> క్లుప్త ప్రార్థన కూడా ప్రభావవంతమైనదని నేను చెప్పిన ప్పుడు, దీర్ఘ ప్రార్థన చేసే సమయాలు అనవసరమైనవి, విలువలేనివి అని అర్థం కాదు.

త్వరగా పనిచేయు, ప్రభావవంతమైన ప్రార్థనకు ఒక ఉదాహరణ ఇస్తాను. ఒకసారి నేను డేవ్ కలసి ఒక పుస్తకం పూర్తి చేయుటకు, నిరాటంకమైన సమయం గడుపునట్లు మా లేక్ హౌస్‌కు వెళ్ళాను. నేనక్కడ వుండగానే, మా పొరుగు వారు చాలా మంది యౌవనస్తులతో పెద్దగా సంగీతం వాయిస్తారు. మోకాళ్ళపై ఉండి, ప్రభువుకు నా పుస్తకం ఎంత ముఖ్యమైనదో, వేల జనానికి ఎలా సహాయపడుతుందో, ఇది పూర్తి చేయుటకు నేనెంత కష్టపడుచున్నానో, ఆ సంగీతం ఎంత కష్టతరంగా వుందో చెప్పుటకు బదులుగా, నేను “ప్రభువా!, నాకు నా లేక్ హౌస్‌లో ఆనందించటానికి ఎంత హక్కుందో, వారికి కూడా అంతే హక్కుంది, కానీ,

నేను నీ కొరకు చేస్తున్న ఈ పనిపై దృష్టి కేంద్రీకరించునట్లుగా నాకు కొంత సమాధానాన్నివ్వగలవా" అని ప్రార్థించాను. నేను ఆ చిన్న ప్రార్థన చేసిన అర నిమిషానికి, ఆ సంగీతం ఆగిపోయింది. నేను బ్రతిమలాడి, ఒక పెద్ద దృష్టాంతముగా దానిని చేయలేదు. నేను సాతాను శక్తులను బంధించి "ఆత్మలో యుద్ధం" చేయలేదు, నేను చేసినదంతా అడగటం. చిన్న, సామాన్యమైన ప్రార్థన, పని చేయునట్లు దేవుని ద్వారాన్ని తెరచింది. నేను కేవలం కొన్ని నిమిషాలు ప్రార్థించినపుడు దేవుడు వెంటనే జవాబిచ్చాడు.

చిన్న, సామాన్యమైన ప్రార్థనా శక్తిని యేసు ఎరిగియున్నాడు. కొండ మీద ప్రసంగంలో ఆయన ప్రార్థన గురించి చెప్పినపుడు, "మరియు మీరు ప్రార్థన చేయునపుడు అన్యజనులవలె వ్యర్థమైన మాటలు వచింపవద్దు; విస్తరించి మాటలాడుట వలన తమ మనవి వినబడునని వారు తలంచుచున్నారు" (మత్తయి 6:7). నిజానికి, బైబులంతటిలో అసాధారణంగా వున్నవి, అయితే అత్యద్భుతంగా శక్తి కలిగిన ప్రార్థనలు కొన్ని క్రింద యివ్వబడినవి.

- "కాబట్టి నీ కటాక్షము నా యెడల కలిగిన యెడల నీ కటాక్షము నా యెడల కలుగునట్లుగా దయచేసి నీ మార్గమును నాకు తెలుపుము. అప్పుడు నేను నిన్ను తెలిసికొందును" (నిర్గమకాండము 33:13).
- "మోషే యెలుగెత్తి - దేవా, దయచేసి ఈమెను బాగు చేయుమని యెహోవాకు మొఱ్ఱపెట్టెను" (సంఖ్యాకాండము12:13).
- "యెహోవా, నేను ఇరుకున పడియున్నాను, నన్ను కరుణింపుము (కీర్తనలు 31:9).
- "ఆ చిన్న వానిమీద ముమ్మారు తాను పారచాచుకొని–యెహోవా నా దేవా, నా మొఱ్ఱ ఆలకించి యీ చిన్నవానికి ప్రాణము మరల రానిమ్మని యెహోవాకు ప్రార్థింపగా" (1 రాజులు 17:21).
- "యబ్బేజు ఇశ్రాయేలీయుల దేవునిగూర్చి మొఱ్ఱపెట్టి–నీవు నన్ను నిశ్చయముగా ఆశీర్వదించి నా సరిహద్దును విశాలపరచి నీ చెయ్యి నాకు తోడుగా ఉండ దయచేసి నాకు కీడురాకుండ దానిలోనుండి నన్ను తప్పించుము"

  (1 దినవృత్తాంతములు 4:10).
- "యేసు–తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని చెప్పెను" (లూకా 23:34).
- "ప్రియుడా, నీ ఆత్మ వర్ధిల్లుచున్న ప్రకారము నీవు అన్ని విషయములలోను వర్ధిల్లుచు సౌఖ్యముగా ఉండవలెనని ప్రార్థించుచున్నాను" (3 యోహాను1:2).
- "మరియు మీరు ప్రార్థన చేయునపుడు అన్యజనులవలె వ్యర్థమైన మాటలు వచింపవద్దు; విస్తరించి మాటలాడుట వలన తమ మనవి వినబడునని వారు తలంచుచున్నారు" (మత్తయి 6:7).

నీ ప్రార్థనలు ప్రభావవంతమగుటకు అవి దీర్ఘంగా వుండాలని నీవింత వరకు తలంచినట్లయితే, నీవిప్పుడు ఆ భారము నుండి విడుదలపొందాలని నేను ఆశిస్తున్నాను. మనం ప్రార్థించే కాలం మీద మన ప్రార్థనా శక్తి ఆధారపడి వుండదు. ఇన్ని నిమిషాలు ప్రార్థిస్తే దేవుడువింటాడను బేధము లేదు. ఆయనతో మనస్ఫూర్తిగా, విశ్వాసముతో పలికిన ఒక్క మాట ఆయన హృదయాన్ని చేరి ఆయన చేతిని కదిలించగలదు.

మన ప్రార్థనలు దీర్ఘంగా విస్తరించివుండాలని దేవుడు ఎల్లప్పుడూ కోరుకుంటే, ఆయన బైబులంతటిలో దీర్ఘ, విస్తార ప్రార్థనలు పెట్టివుండేవాడని నేను నిజంగా నమ్ముతున్నాను. ఆయన ఎప్పుడూ మనకి ఉదాహరణలిస్తాడు. బైబులులోని అనేక ప్రార్థనలు సంగ్రహంగా క్లుప్తంగా వున్నాయి. గంటలకొలది ప్రార్థించాలని సాతాను మనతో చెప్పి, అలా చేయనందుకు మనం అపరాధభావన పొందేలా చేస్తాడు. అనవసరమైన మాటలు వాడకుండా కొద్ది మాటలతోనే ప్రార్థించుట దేవునికిష్టమే, అని యేసు చెప్పినది జ్ఞాపకం చేసుకోండి.

## అది కష్టతరమైనదిగా ఉండవలసిన అవనవసరం లేదు

సాతాను ప్రజలకు చెప్పు మరొక అబద్దం – ప్రార్థన చిక్కులతో కూడినది, అది కష్టమైనది, దాని కొరకొక నిర్దిష్ట విధానాన్ని, నిర్దిష్ట క్రమాన్ని అనుసరించాలి, మనం కొన్ని ముఖ్య విషయాల గురించి మాత్రమే ప్రార్థించాలి, దేవుని ఎక్కువ విషయాలు అడుగకపోవుట మంచిది, మనం ఏమి అడుగుతున్నామనే విషయంలో జాగ్రత్తగా వుండాలి, మరియు ఆయన చిత్తానికి వ్యతిరేకంగా ప్రార్థించకుండునట్లు, మనం ప్రార్థించుటకు ముందే దేవుని చిత్తాన్ని పూర్తిగా ఎరిగివుండాలి. మనం దేవుని చిత్త ప్రకారం ప్రార్థించాలి, అయితే మన హృదయాలలోని విషయాలు అడుగకుండా భయపడునట్లు, సాతాను మనలో అత్యధిక భయాన్ని పెట్టనివ్వకూడదు. దేవుని చిత్తానికి మించినది అడిగితే జరిగే నష్టం ఏమిటంటే, దానిని మనం పొందుకోలేము – అది కూడా మన మంచికే! దేవుడు మన హృదయాలను ఎరిగిన వాడు మరియు ఆయన చిత్తం కాని దానిని అడిగి, చిన్న పొరపాటు చేయుట ద్వారా ఆయన కోపపడడు. మనం పొరపాటు చేస్తామేమో, ఎక్కువ అడిగితే ఆయన ఇష్టపడడేమో అన్న భయంతోనో మనం ఆయనను చేరనవసరం లేదు. మనం ఆయనను ధైర్యంగా, విశ్వాసంతో, స్వేచ్ఛగా చేరవలసియున్నది.

> దేవుడు మన హృదయాలను ఎరిగినవాడు మరియు ఆయన చిత్తం కాని దానిని అడిగి, చిన్న పొరపాటు చేయుట ద్వారా ఆయన కోపపడడు.

నేనిప్పుడు వరుసగా లెక్కించిన, అబద్దాలన్నీ మీరు నమ్మినట్లయితే, ప్రార్థన

కష్టమైనదిగానే వుంటుంది. అయితే సాతాను మనలను కష్టపెట్టాలని చూస్తున్న ఆలోచనలను, ఆలోచించుటకు మనం తిరస్కరించినప్పుడు మనం దానిని సులభమైన మార్గాన్ని హత్తుకొంటాము. మనం అది కష్టపెట్టాలని కాదని, నిజానికి ప్రపంచంలోకెల్లా సులువైనదని తెలుసుకొంటాము. ప్రార్థన అనేది ఊపిరిపీల్చుట అంత సులువైనదని, జ్ఞాపకముంచుకోండి.

కొంతమంది కళ్ళు మూసికొని, చేతులు జోడించి, తలవంచి చేస్తేనే అది ప్రార్థన అని పొరపడతారు. అది సత్యదూరమైన విషయం కాకూడదు! "ప్రార్థనా హస్తాలు" అని నేను నమ్మే ప్రసిద్దమైన చిత్రాన్ని మీరు చూసేవుంటారు. ఒక పెద్ద వయస్సు గల వ్యక్తి తలవంచి, కళ్లు మూసికొని, చేతులు జోడించి వున్న దృశ్యాన్ని అది చూపిస్తుంది. ఇది ఒక అందమైన చిత్రం, అది ఒక్క విధానాన్నే చూపిస్తున్నప్పటికీ, ప్రార్థిస్తున్నప్పుడు, అది ఒక్కటే అంగీకార యోగ్యమైన విధానం కాదని మనం గ్రహిస్తున్నాము.

కన్నులు మూసికొని ప్రార్థించుటకు నాకు ఒక కారణం వుంది – ఆ విధంగా నేను బాగా దృష్టిని కేంద్రీకరించగలను, అంతే కాని కళ్ళు తెరిస్తే ప్రార్థనా నియమాలను ఉల్లంఘిస్తానేమో అని కాదు. అయితే, డేవ్ సాధారణంగా కళ్ళు తెరచి ప్రార్థిస్తాడు. చాలా కాలం క్రితం, నేను ప్రార్థనతో సహా ప్రతి విషయంలోను నియమ నిబంధనలను చాలా ఖచ్చితంగా పాటించేదానను. నా ప్రార్థనలు బిగ్గరగాను, అధికారికంగాను వుండాలని తలంచేదానను, కాబట్టి నేను ప్రార్థించేటప్పుడు బిగ్గరగా ప్రార్థించేదానను. ప్రార్థించేటప్పుడు నేను నడచేదాననుకూడా, అయితే కళ్లు మూసికొని ప్రార్థించేదానను, కాబట్టి, అలా బిగ్గరగా ప్రార్థిస్తూ నేరుగా గోడకు గుద్దుకొనిన, లేక యింటి ఉపకరాల మీద కాలు వేసి పడిన సందర్భాలు చాలా వున్నాయి. దేవుడు కూడా నా అమాయకత్వాన్ని, బుద్ధిహీనతని చూసి నవ్వుకొనివుంటాడని అనుకుంటుంటాను.

అదే సమయంలో, డేవ్ కుర్చీలో కూర్చుని, కిటికీలోంచి బయటకు చూస్తూ, మౌనంగా, స్వచ్ఛంగా దేవునితో సంభాషిస్తుండేవాడు. కొన్ని సార్లు మాత్రమే తన పెదాలు కదిలించేవాడు, పెద్దగా మాట్లాడేవాడుకూడా కాదు. ఎప్పుడైనా తనను చూడటానికి నా కళ్లు తెరచినపుడు. నేను "నువ్వు ప్రార్థించటం లేదు. నువ్వు కనీసం కళ్లు కూడా మూయలేదు" అనుకునేదానను. అయితే, డేవ్ ప్రార్థిస్తున్నాడు నేను అనవసరంగా తీర్పు తీర్చుతున్నాను. నేను మాత్రం ''నియమాలను'' పాటించక పోయినట్లయితే, నిజంగా ప్రార్థించినట్లు కాదని మోసపరచబడుతున్నాను.

ప్రార్థనను గురించి నాకున్న తప్పుడు తలంపులు, సమస్యగా మార్చి, దేవుడు ప్రార్థనలో నాకివ్వదలచిన ఆనందాన్ని పొందకుండా చేస్తున్నాయి. బైబిలు "మీ సంతోషము పరిపూర్ణమగునట్లు అడుగుడి, మీకు దొరకును" (యోహాను 16:24). అది నాకంత సమస్యాపూరితంగా అనిపించలేదు.

కళ్లు మూసికొని మాత్రమే ప్రార్థించాలి అనే విషయంతో సమ్మతించేవారు, సమ్మతించనివారు వున్నారు, అయితే మోకాళ్లపై వుంటేనే ప్రార్థన లేకపోతే కాదు అని మాత్రం తలంచవద్దు. అది నిజంగా నాకైతే కష్టమైన పనే, ఎందుకంటే కొంత సమయంకంటే ఎక్కువ సేపు మోకాళ్ళపై వున్నట్లయితే, నా మోకాళ్ళు చాలా నొప్పి పెడతాయి. నేను ఆ విధంగా ప్రార్థించినట్లయితే, దేవుని పై దృష్టి కేంద్రీకరించకుండా, నా మోకాళ్ళు ఎంత నొప్పి పుడుతున్నాయో ఆలోచిస్తూ నేను ముగిస్తాను. గంటలకొలది మోకాళ్ళపై గడిపే స్నేహితురాలు నాకుంది, ఆమె ప్రార్థనలు చాలా ఆత్మీయంగా ఉంటాయి, అయితే నేను మోకాళ్ళపై వుండనప్పటికీ, నా ప్రార్థనలు కూడా ఆత్మీయంగానే వున్నాయని నేను తెలుసుకున్నాను.

నేలపై సాగిలపడి ప్రార్థించుట నాకు చాలా ఇష్టం అలా ఉన్నప్పుడు నేను దేవునితో ఏకాంతంగా వున్నట్లు అనిపిస్తుంది. నా వీపు నొప్పి పుట్టేవరకు ఆవిధంగా చేసి, మాని వేశాను. ప్రార్థనలో నా విధానం మారినంత మాత్రాన నేను ఆత్మీయత లోపించినట్లు భావించనందుకు చాలా సంతోషిస్తున్నాను. నేను మీకు చెప్పదల్చుకున్నదంతా ఏంటంటే ప్రార్థించుటకు ఏ ప్రత్యేక భంగిమ లేదు. నీ మోకాళ్ళు; నొప్పిగా వుంటే, నేలపై పడుకో, నీ వీపు బాధ పెట్టినా లేక నీకు నిద్రవచ్చినా లేచి నడుస్తూ ప్రార్థించు. నీవు డేవ్ లాంటి వాడివైతే, ఒక చర్చిలో కూర్చుని కిటికీలోంచి చూస్తూ ప్రార్థించు. ప్రభువు పై దృష్టి కేంద్రీకరించునట్లుగా చేయగల ఒక విధానాన్ని స్థలాన్ని కనుగొను అది నిన్ను సౌకర్యంగా వుంచుతుంది.

ప్రార్థన గురించి నీవు వినిన నియమాలు నిర్దేశక సూత్రాలన్నింటి నుండి విడుదల పొందు – కేవలం ప్రార్థించు! నీ ప్రార్థనలను సమస్యారహితంగా చేసుకొమ్మని నిన్ను సవాలు చేస్తున్నాను, ప్రార్థనను చిక్కైనదిగా చేయు ప్రతి ఆలోచననుతిరస్కరించి, దేవుడు నీకు ఇవ్వదలచిన సులభ భాగ్యాన్ని ఆనందించు.

## *అది వాక్చాతుర్యము కలిగినదిగా వుండనక్కర లేదు*

ప్రార్థనను గూర్చి సాతాను చెప్పే మరొక అబద్ధం – అది "సరియైన మాటలతో", వాక్చాతుర్యము కలిగినదిగా వుండాలి అనునది.

చాలా మంది ప్రార్థించునపుడు తమ భాషను, మాటలను పూర్తిగా మార్చివేస్తారు. ఎందుకో నాకు తెలియదు, కాని కొందరైతే బైబిలు భాషలోనే, తమ అనుదిన జీవితంలో వాడని మాటలతోనే, యిలా

> ప్రభువును నీవు వాక్చాతుర్యముతో చేరుతున్నట్లయితే, వెంటనే ఆపివేసి, నీవలెనే వుండు.

"అత్యంత మహత్త్వము కలిగిన పరలోకపు తండ్రి, నీవు సర్వజ్ఞుడవైన పరిశుద్ధ దేవుడవు, నీ అధిష్టమైన శ్రద్ధను బట్టి నీకు వందనాలు చెల్లిస్తూ నీ సమృద్ధికరమైన ఆశీర్వాదాలను గూర్చి నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము" అని ప్రార్థిస్తారు.

నీవు బైబిలు వ్రాయబడిన (కింగ్ జేమ్స్) కాలంలో జీవించివుంటే తప్ప, యిటువంటి మాటలు నీ వ్యక్తిత్వాన్ని మించినవై వుంటాయి అవి అసహజంగాను, అసౌకర్యంగాను వుంటాయి. నీవు దేవునితో సౌకర్యంగా వుండాలని దేవుడు కోరుకుంటున్నాడు, కనుక నీ స్నేహితులతో మాట్లాడినట్లుగా దేవునితో మాట్లాడు. నీ ప్రాణ స్నేహితునితో, ఫోన్‌లో నీవు కవిత్వం చెప్పేటట్లయితే, దేవునితో కూడా అదే విధంగా మాట్లాడు. అయితే, ప్రభువును నీవు వాక్చాతుర్యముతో చేరుతున్నట్లయితే, వెంటనే ఆపివేసి, నీ స్వంత ధోరణిలో మాట్లాడు. నీవు పుట్టిన, పెరిగిన స్థలాన్ని బట్టి నీవు ఒక నిర్దిష్టమైన యాసను కలిగివున్నట్లయితే, ప్రతిదినం నీవు సంభాషించునపుడు, వింత ముఖకవళికలు ఉపయోగించువాడవైతే, దేవునితో మాట్లాడునపుడు వాటిని మార్చుకోనవసరం లేదు. ఆయన హాస్య బావనలు కూడా కలిగివున్నాడు, నేను చెప్పదలచుకున్న విషయం ఏమిటంటే మన ప్రార్థన మన ప్రత్యేక సంభాషణా విధానానికి పొడిగింపుగా ఉండాలి. ప్రార్థన అనేది నీవు సంతోషంగానూ, సౌకర్యంగానూ వుండాలి, నీ హృదయం నుండి రావాలి.

నేను ఎక్కువ వాక్చాతుర్యముతో మాట్లాడుతానని నేననుకొనను, నీ సంభాషణా ధోరణికి తర్కంతో వుంటుందని నీవు తలంచవు. నేనింకను నా ప్రార్థనా భాష గురించి చింతపడను – నేను ప్రభువుతో సులువుగా నా హృదయంలో వున్న దానిని–తేటగా, సులభంగా, సూటిగా చెప్పేస్తాను. నేను నా భర్తతో అలానే మాట్లాడుతాను; నా పిల్లలతో అలానే మాట్లాడుతాను నాతో కలసి పనిచేసేవారితో కూడా అలానే మాట్లాడుతాను కాబట్టి ప్రభువుతో కూడా అలానే మాట్లాడుతాను– ఆయన కూడా నాతో అలానే మాట్లాడుతాడు. నేను ఆయన మనస్సులో ముద్ర వేయాలనుకోవటం లేదు, నేను ఆయనతో నా హృదయాన్ని పంచుకోవాలని అను కుంటున్నాను– నేను నాలా వున్నప్పుడే నేనది చేయగలను మనం ఉన్న రీతిగానే ఆయన మనలను చేశాడు, కాబట్టి నటించకుండా, ఒక ఖచ్చితమైన విధానంలోనే ప్రార్థించాలని తలంచకుండా ఆయనను చేరాలి, మనం నిజాయితీగా వున్నంతకాలం, ఆయన మన హృదయాలలోని దానిని స్పష్టంగా ఉచ్ఛరించలేకపోయినప్పటికీ, ఆయన విని అర్థం చేసుకుంటాడు. ఆయన వైపు ఎత్తి పట్టుకున్న హృదయం ఆయన దృష్టికి అమూల్యమైనది, అది ఉచ్ఛరింపలేని పదాలు కూడా ఆయన వింటాడు. కొన్ని సార్లు మనం ప్రార్థించలేనంత బాధపరచబడతాము, మనం కేవలం నిట్టూర్పులు విడుస్తూ బాధపడగలము, దేవుడు అది కూడా అర్థం చేసుకుంటాడు.

## *నీవు ఖచ్చితంగా వుండనవసరంలేదు*

యాకోబు 5:16 ఈ విధంగా చెప్తుంది "నీతిమంతుని విజ్ఞాపన హృదయపూర్వకమైనదై బహు బలము గలదై ఉండును" అని వ్రాయబడి వుంది తమ ప్రార్థనా జీవితాలతో

పోరాడేవారు, కొన్ని సార్లు “సరే నేను నీతిమంతుని కాదు గనుక, నా ప్రార్థనలు పని చేయటంలేదు నేను పరిశుద్ధంగా వుంటూ అన్ని సరిగా చేస్తుంటే, నేను ఎక్కువ నీతిమంతుని అవుతాను, అప్పుడు నా ప్రార్థనలు ఎక్కువ ప్రభావం కలిగి వుంటాయి” అని అనుకుంటారు.

“వాదించునట్లుగా స్వంత నీతి కలిగియుండని వారు సంతోషవంతులు” అని ఇ.యమ్.బౌండ్ వ్రాస్తున్నాడు. అయితే, మనం తిరిగి జన్మించినట్లయితే మనం నీతిమంతులం మనం ప్రతీది సరిగా చేయలేకపోయినా, మనం అన్ని వేళలా 100 శాతం నీతిమంతులము. 2వ కొరింథీయులు 5:21 **“ఎందుకనగా మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను”** అని చెప్తుంది. నీతికి, సరియైన ప్రవర్తనకు బేధం ఉంది. నీతి అనునది దేవుని యెదుట–“*క్రీస్తు రక్తము ద్వారా*” మనకు కలిగిన స్థానాన్ని వివరిస్తుంది. మనకు మనం నీతిమంతులము కాలేము, యేసు రక్తము మాత్రమే మనలను నీతిమంతులుగా, ఎన్నడూ పాపం చేయనివారిగా చేస్తుంది. మనం పొరపాట్లు చేస్తున్నప్పటికీ, దేవుడు మనలను నీతిమంతులుగానే చూస్తున్నాడు. మనలను నీతిమంతులుగా చూసే దేవుడు మనకున్నాడు గనుక మన ప్రార్థనలు వినబడతాయని మనం ఊహించవచ్చుని.

“నీతిమంతుని ప్రార్థన హృదయపూర్వకమైనదై బహు బలము గలదై యుండును” అని చూచిన వెంటనే “ఏలియా మనవంటి స్వభావముగల మనుష్యుడే వర్షింపకుండునట్లు అతడు ఆసక్తితో ప్రార్థన చేయగా మూడున్నర సంవత్సరముల వరకు భూమిమీద వర్షింపలేదు. అతడు మరల ప్రార్థనచేయగా ఆకాశము వర్షమిచ్చెను, భూమి తన ఫలము ఇచ్చెను” (యాకోబు 5:17–18). అని చదువుతాము. యాకోబు ప్రార్థనపై మరియు మనుష్యులను అసత్యం నుండి సత్యంలోనికి నడిపించుట గురించి వ్రాసిన వాటి మధ్యలో ఈవాక్యం యిమిడి నట్లుగా అనిపించటం లేదని అనిపిస్తున్నాయా?

నిజానికి, అవి చక్కగా అమర్చబడ్డాయి, ఎందుకంటే మనుష్యులు “నీతి” అనే మాట వద్ద తొట్రిల్లుతారని ఆయకు తెలుసు. తాము అవినీతి మంతులము కనుక–తమ ప్రార్థనలకు జవాబివ్వబడితే తప్ప మనుష్యులు ప్రార్థన చేయకూడదని సాతాను చేస్తాడు, మనమందరము బాధపడుతున్నాము, లోపరహితులం కాదు, మనందరం గెలుపు, ఓటమిలు కలిగిన వారము, చివరికి ఆ గొప్ప ప్రవక్త కూడా అవి కలిగియున్నాడని మనకు గుర్తు చేయుటకు ఏలియా కథ చెప్పబడింది. అతను ఒకసారి చిందరవందర చేసుకున్నప్పటికీ, అతని ప్రార్థనలు జవాబివ్వబడినట్లయితే, మనది కూడా జవాబివ్వబడతాయి. దేవుడు ఏలియాని తరచుగా బలంగా వాడుకున్నాడు, అయినప్పటికీ, ఏలియా భయం, నిరాశ, నిస్పృహలను అనుభవించిన రోజులున్నాయి. ఏలియా దేవుని మనిషి, అయితే ఆయన కూడా పొరబాట్లు చేసి బలహీనతలు చూపించాడు. అతను ప్రభావవంతమైన ప్రార్థనలు ప్రార్థించినపుడు మనము కూడా

ప్రార్థించగలము. మనము కూడా ఏలియా అంత నీతిమంతులము చెప్పాలంటే! ఇంకా ఎక్కువే, ఎందుకంటే క్రీస్తు మనలో నివసించి, మన నీతిని స్థిరపరుస్తున్నాడు.

యెషయా 41:10–14 చూడండి – "నీవు నా దాసుడవు నేను నిన్ను ఉపేక్షింపక ఏర్పరచుకొంటిననియు నేను నీతో చెప్పియున్నాను నీకు తోడైయున్నాను భయపడకుము నేను నీ దేవుడనై యున్నాను దిగులుపడకుము. నేను నిన్ను బలపరతును నీకు సహాయము చేయువాడను నేనే. నీతి అను నా దక్షిణ హస్తముతో నిన్ను ఆదుకొందును. నీ మీద కోపపడినవారందరూ సిగ్గుపడి విస్మయమొందెదరు నీతో వాదించువారు మాయమై నశించిపోవుదురు. నీతో కలహించు వారిని నీవు వెదుకుదువు గానీ వారిని కనుగొనలేక పోవుదువు. నీతో యుద్ధము చేయువారు మాయమై పోవుదురు అభావులగుదురు. నీ దేవుడైన యెహోవానగు నేను భయపడకుము నేను నీకు సహాయము చేసెదనని చెప్పుచు నీ కుడిచేతిని పట్టుకొనుచున్నాను. పురుగువంటి యాకోబూ, స్వల్పజనమగు ఇశ్రాయేలూ, భయపడకుడి నేను నీకు సహాయము చేయుచున్నాను అని యెహోవా సెలవిచ్చుచున్నాడు నీ విమోచకుడు ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడే".

ఈ వాక్య భాగం నన్ను చాలా ప్రోత్సహపరుస్తుంది, మిమ్మల్ని కూడా ప్రోత్సాహ పరుస్తుందని నమ్ముతున్నాను. మనం 10వ వచనం చదివేటప్పుడు, మనం ఆలోచిస్తాము *"తప్పకుండా కలసి పని చేస్తున్న వారితో దేవుడు మాట్లాడాడు. నిజంగా గొప్ప నీతిమంతులతో ఆయన మాట్లాడాడు"* అని ఆలోచిస్తాము. కానీ ఆయన అలా చేయలేదు, దేవుడు "నీవు భయంతో నివసించనసరం లేదు, నేను నీతో వున్నాను. నేను నీ చేయి పట్టుకొనివున్నాను. నా ఆత్మ నీ మీద వున్నది. నేను నీకు సహాయంచేయబోవుచున్నాను, నీకు విరోధంగా లేచు ప్రతి శత్రువును అణచివేస్తాను. "మనం ఈ వచనాలు చదివి నపుడు ఆహా, నేను, దేవుడు ఈ విధంగా సహాయం చేయునట్లు జీవించ గలిగితే ఎంత బావుంటుంది అని ఆలోచిస్తాము. ఆయన మరలా మాట్లాడుచూ, ఎటువంటి వారితో తాను ఆ మాటలు అన్నాడో ప్రత్యక్ష పరుస్తున్నాడు, మన ప్రభువును విమోచకుడును ఇశ్రాయేలు పరిశుద్ధుడు ఈ విధంగా చెప్పుచున్నాడు, "భయపడవద్దు, పురుగువైన యాకోబు, నీవు ఇశ్రాయేలియుల వాడవు! నేను నీకు సహాయం చేస్తాను".

దేవుడు యాకోబును పురుగు అని పిలుస్తున్నాడు! పురుగు కంటే తక్కువ స్థితిని మనము చూడము మరియు ఒక వ్యక్తిని పురుగు అని పిలుచుట చాలా కలవరపరుస్తుంది! అయితే యెషయా 41:10–14 లో చెప్పబడిన సహాయాన్ని ప్రపంచంలోని పురుగులకు చేస్తున్నాడన్నది తెలుసుకొనుట సంతోషంగా లేదా? నన్ను నేను పురుగు వలె భావించుకొని, ప్రవర్తించిన సమయాలున్నాయి గనుక నేను దానిని యిష్టపడుచున్నాను. అయితే నీవు గానీ, నేను గానీ చింతపడనవసరంలేదు, ఎందుకంటే మనం పురుగులవలె ప్రవర్తిస్తూ ప్రతీది సరిగా చేయకపోయినప్పటికీ, దేవుడు మనకు ఆశ్చర్యకరంగా సహాయం చేయుటకు ఆశక్తి కలిగియున్నాడు. ఆయన కృప అద్భుతమైనది!

## ప్రతి విధమైన, పరిస్థితిని నిర్వహించుటకు

చార్లెస్ స్పర్జన్ "ఊరటనొందదగిన అన్ని మార్గాలలో ఓటమి ద్వారా, దేవునితోని సహవాస కోరిక తీవ్రత చెందుతుంది." అని వ్రాస్తున్నాడు. ఎంత సత్యం! క్రైస్తవులు ప్రార్థించుటకు ముందు ఎంతకాలం కష్టపడుతూవుంటారు అనినేను కొన్నిసార్లు ఆశ్చర్యపడుతుంటాను. మనం మన సమస్యలను గురించి ఫిర్యాదు చేస్తాము, గొణుగుతాము, సణుగుతాము, మన స్నేహితులతో చెప్పుకుంటాము దీని విషయంలో దేవుడు ఏమి చేయవచ్చో చెప్తాము. దీనికి సులభమైన పరిష్కారం: ప్రార్థన వుండగా దానికి సాహసించవలసిన సమయంలో, మన మనస్సులోను, ఉద్రేకాలలోను ఆ పరిస్థితితో పోరాడతాము. అయితే దానికంటే అధ్వాన్నంగా, తరువాత మనం మనుష్యులకు తెలిసిన అతి బుద్ధిహీనమైన వివరణ ఇస్తాము "సరే, నేను చేయగలిగినదంతా ప్రార్థనేనని నేను కనుగొన్నాను." నీవు ఈ మాటను ఇంతకు ముందే విని వుంటావు, లేక నీవే అని వుంటావని నేను ఖచ్చితంగా చెప్పగలను. ప్రార్థనను చివరి ప్రయత్నంగా చేసి "సరే, మిగిలినవేవీ పని చేయటం లేదు, కాబట్టి, ప్రార్థించాలేమో" అని అన్న అపరాధ భావనను కలిగివున్నాము. అది నాకు ఏమి చెప్తుందో మీకు తెలుసా? మనం నమ్మవలసినంతగా ప్రార్థనా శక్తిని మనం నమ్ముటలేదని అది నాకు చెప్తుంది. మనం భరించనవసరం లేని భారాలు మోస్తున్నాము – జీవితం వుండవలసినంతకంటే ఎక్కువ కష్టంగా వుంటుంది – ఎందుకంటే ప్రార్థన ఎంత శక్తివంతమైనదో మనం గ్రహించలేదు గనుక. గ్రహించినట్లయితే, మనం అన్నిటి గురించి ప్రార్థిస్తాము, అయితే, ఆఖరి ప్రయత్నంలా కాక, మొదటి స్పందనగా చేస్తాము.

యాకోబు 5:13–14 ఈ విధంగా చెప్తుంది "మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా? అతడు ప్రార్థన చేయవలెను ఎవనికైనను సంతోషము కలిగెనా? అతడు కీర్తనలు పాడవలెను. మీలో ఎవడైన రోగియై యున్నాడా? అతడు సంఘపు పెద్దలను పిలిపింప వలెను వారు ప్రభువు నామమున అతనికి నూనె రాచి అతని కొరకు ప్రార్థన చేయవలెను". ఈ వాక్యముపై ఆధారపడి, శ్రమనొందిన వ్యక్తి ఏవిధంగా ప్రతిస్పందించాలి? అతను ప్రార్థించాలి. చాలా సులువైన, మూడు మాటల పరిష్కారం: అతను ప్రార్థించవలెను.

> మనం భరించనవసరం లేని భారాలు మోస్తున్నాము – జీవితం వుండవలసినంతకంటే ఎక్కువ కష్టంగా వుంటుంది – ఎందుకంటే ప్రార్థన ఎంత శక్తివంతమైనదో మనం గ్రహించలేదు గనుక.

బైబులు మనం ఏమి చేయాలి అన్న దానిని గురించి 25 భాగాల వివరణ ఇచ్చుటలేదు కాని, అది కేవలం "అతను ప్రార్థించవలెను" అని చెప్తుంది. కాబట్టి:

- నీకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు, ప్రార్థించు.
- నీకు ఏదైనా అవసరం వచ్చినప్పుడు, ప్రార్థించు.
- నీ భావాలను ఎవరైనా బాధపెట్టినప్పుడు, ప్రార్థించు.
- నీవు హాని జరిగినప్పుడు, ప్రార్థించు.
- నీవు రోగివైవున్నప్పుడు, ప్రార్థించు.
- నీవు పూర్తిగా నిస్సహాయుడవైనప్పుడు, ప్రార్థించు.
- నీవు ప్రేమించువారు బాధపడుతున్నప్పుడు, ప్రార్థించు.
- నీవు నిరాశచెందినప్పుడు, ప్రార్థించు.
- నీవు ఏమి చేయాలో నీకు తెలియనప్పుడు, ప్రార్థించు.

నీవు ఏ పరిస్థితిలో వున్నప్పటికీ నీవు ప్రార్థించవలసియున్నది – మరియు ఏదైనా చేయుటకు ముందు ప్రార్థించవలసియున్నది, ఒకసారి, విస్తరించిన నా కుటుంబములోని ఒక వ్యక్తి, నన్ను నిజంగా బాధపెట్టే దానిని చేసినారు, దాని ఫలితంగా నేను తిరస్కారభావనను పొందినాను. ఇది జరిగిన తరువాత, నేను కారులో కూర్చునియుండి, మనసులో చాలా బాధపడుటవలన, ఈ విధంగా చెప్పాను. "దేవా!, నీవు నన్ను ఓదార్చవలసియున్నది. ఓదార్చుటకు నాకు నీవు అవసరం. నేనిలా ఉండాలని అనుకోవటం లేదు: నేను మనసులో నొచ్చుకొవాలనుకోవటం లేదు. నేను ప్రతీకారాన్ని పెంచుకోదలచు కోవటం లేదు. ఈ వ్యక్తి నుంచి నేను ఇంతకు ముందు వరకు కూడా ఇదేవిధమైన బాధను పొందియున్నాను. అది నన్ను వేధించదలచుకోవటం లేదు. దీనిని పరిష్కరించుటలో నేను సమస్యను ఎదుర్కొంటున్నాను, నాకు నీ సహాయం కావాలి".

ఏం జరిగిందో తెలుసా? దేవుడు పరలోకం నుండి దిగి నన్ను తాకినట్లే, నా చెడు భావనలన్నీ పోయాయి! అయితే, ఆయన వైపు తిరుగకుండా, మనం ఇతరుల వైపు తిరిగి ఎన్నిసార్లు "వాళ్లు ఏమన్నారో నీవు నమ్మలేవు, వాళ్ళ చేసిన దానిని కూడా నీవు నమ్మలేవు. ఇప్పుడు నేను బాధపరచబడ్డాను, వాళ్లు నాతో ప్రవర్తించే తీరుతో నేను విసిగిపోయాను, అలసిపోయాను. అది సరియైనది కాదు." మనం ఆలోచించు ప్రతి దానిని మనం చేయాలని భావిస్తాము, అది పరిస్థితిని ఎన్నటికీ మార్చదు. ప్రతి అత్యవసరానికి, ప్రతి విధమైన ఉద్రేకానికి మన మొదటి స్పందన ప్రార్థన అయితే, మనం చాలా ఉత్తమ ఫలితాలను పొందుతాము. మనం ఏమైనా చేసే ముందు ప్రార్థన చేయగలిగితే, మన జీవితాలలో గొప్ప మలుపులు చవిచూస్తాము.

మనం జీవితంలో జయిస్తామని దేవుడు వాగ్దానం చేసియున్నాడు. అయితే, చాలా మంది క్రైస్తవులు తమ జీవితాలలో ఎక్కువ విజయాన్ని పొందుతున్నట్లు కనిపించరు. మనకుఅందుబాటులో వున్న విజయానికి, తక్కువలో జీవించుటకు కారణం వుంది. దేవుడు మనలను క్రీస్తుయేసునందు విజయోత్సవముతో ఊరేగించుచున్నాడు (2 కొరింధీ 2:14) చెప్తుంది. కాబట్టి మనము విజయోత్సాహముతో, ప్రపంచానికి విజయవంతమైన జీవిత విధానాన్ని చూపిస్తూ మిగిలిన ప్రజలు మనం కలిగివున్న దానికై ఆకలిగొనేటట్లుగా చేయవలసి యున్నది. దేవుడు మనల్ని ఉంచిన విధంగా మనం ఉన్నట్లయితే, మనం కలిగివున్నదానికై వారు ఆశపడతారని నేను నమ్ముతున్నాను.

> మన మొదటి స్పందన ప్రార్థించుట అయితే, మన నోరు తెరచి చూచేంతటి ఆశ్చర్యకరమైన మార్గాలలో దేవుని శక్తి మన జీవితాలలోనికి వచ్చుట మనం చూస్తాము.

మన వ్యక్తిగత జీవితాలలోను, ఇతరులకు మన సాక్ష్యంలోను మనం కోల్పోతున్న అంశము, ప్రార్ధనా శక్తి అని నేను అనుకుంటాను. అవును, మనుష్యులు ప్రార్ధిస్తారు, మన చుట్టుప్రక్కల, మన సంఘాలలోను మనకు ప్రార్థనా కూడికలు జరుగుతుంటాయి, కాఫీ షాపుల్లోను, ఫోనులోను కూడా ఆకస్మిక ప్రార్థనా సమయాలు జరుగుతుంటాయి. అయితే, ప్రస్తుతం నేను మన వ్యక్తిగత ప్రార్థనా జీవితాల గురించి మాట్లాడుతున్నాను. మనకు ప్రార్థనా అవసరతలుగా కనిపించే వాటన్నిటినీ నేను చేర్చుట లేదు: దేశ ఇబ్బందులు, ప్రస్తుత సంఘటనలు, ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు, లేక ఇ-మెయిల్ ద్వారా మనం పొందుకునే అనేక భయంకరమైన ప్రార్ధనా విన్నపాలు. మన జీవితాలలోనూ, మనపట్ల సంభవించే విషయాల మీద నేను కేంద్రీకరిస్తున్నాను మన దారిలో వచ్చే ప్రతి పరిస్థితిని గురించి మనం ప్రార్థిస్తున్నామా? మనము ఈ విషయంలో ఏమి చేయలేము అనుకున్న వాటిని గురించి మాత్రమే ప్రార్థిస్తున్నామా? మన మొదటి స్పందన గనుక, ప్రార్థించుట అయితే, ఆశ్చర్యంతో మన నోరు తెరచి చూచేంతటి దేవుని శక్తి మన జీవితాలలోనికి వచ్చుట మనం చూస్తాము.

మనం ఈ అధ్యాయాన్ని ముగిస్తుండగా, తమ మొదటి స్పందనగా ప్రార్థించని ఒక కుటుంబం గురించి మీకు ఒక ఉదాహరణ చెప్తాను. మా మనవరాలు ప్రతిరోజు మధ్యరాత్రిలో నిద్ర లేచేది, ఆమె లేస్తూనే బిగ్గరగా అరుస్తూ లేచేది. ఆమె బాగా తినేది గనుక, నిద్రలో ఆకలేసిందేమో అని అనుకునే దానను. రెండున్నర సంవత్సరాలు ఆమె ఆ విధంగా అరుస్తూ

నిద్ర లేచి, కుటుంబం మొత్తాన్ని నిద్ర లేపేది. ఆ సమయమంతా ఎవరూ సరియైన నిద్ర లేకుండా వుండేవారు. ఏం జరుగుతుందో మాకందరికీ తెలిసినప్పటికీ, మేమందరం "ఆమెను, ఇది నిజంగా చాలా సిగ్గుకరం, ఆమెకు ఏమయిందో నాకు అర్థం కావటంలేదు, ఒకవేళ మనం యిలా చేయాలేమో, లేకపోతే మనం అలా చేయాలేమో." తరువాత మేము ఒకరినొకరము చూచుకొని, "మనం ఏమి చేయాలని మీరనుకుంటున్నారు?" అనుకొనేవారము.

ఒక సందర్భము గురించి ప్రార్థించుటకు ఒక బోధకురాలికి రెండున్నర సంవత్సరాలు పట్టిందని మీరు ఆలోచించగలరా, ఊహించగలరా? అయితే, ఎవరో ఒకరు చివరకు మనం ప్రార్థించాలన్న ప్రత్యక్షతను పొందుకొనేవరకు మేమిలా ఆలోచిస్తూనే వున్నాము. ఈ రెండున్నర సంవత్సరాలలో మేము నలుగురమో, ఐదుగురమో చేరి: "ప్రభువా, యేసునామంలో చేరియున్నాము, ఇక్కడ లోపమేమిటో మాకు తెలియజేయి. మేము ఏమి చేయవలసియున్నదో మాకు తెలియజేయి. ఈ చిన్నబిడ్డను స్వస్థపరచి, రాత్రివేళలలో చక్కగా నిద్రపోవునట్లు చేయుమని అడుగుతున్నాము." మేము ప్రార్థించినపుడు, ఆ చిన్నబిడ్డ ప్రతి రాత్రి ప్రశాంతంగా నిద్రపోవటం మొదలుపెట్టింది. మేము సులువైన, నీతి కలిగిన ప్రార్థనను చేసినాము– దేవుడు మాకు జవాబిచ్చాడు. మేము మొదటే ప్రార్థించాలన్న ఆలోచన కలిగియుండవలసియున్నది.

## సారాంశం

ప్రార్థన అనేది నిజంగా అత్యద్భుతమైన భాగ్యం, అయితే అదే సమయంలో, చాలా సులభమైనది. ప్రార్థన పెద్దదిగా, సాగదీసినదిగావుండనవసరం లేదు. ఒక్క మాట, లేక ఒక చిన్న వాక్యం అద్భుతమైన ఫలితాలనిస్తుంది. ప్రార్థన కష్టమైనది లేక సంకీర్ణమైనది కాదు. ప్రార్థించునపుడు నియమ నిబంధనలను పాటించనవసరం లేదు, సరియైన మాటలకోసం వెతుక్కోనవసరం లేదు. మనం క్రీస్తు రక్తము ద్వారా పొందిన నీతితోను, ఆయన మన ప్రార్థన విని మనకు జవాబిస్తాడని నిజాయితీ కలిగిన హృదయంతో నమ్ముతూ దేవుని చేరాలి. ప్రార్థన అనునది మహా గొప్ప "భాగ్యమే" గాని "బాధ్యత" కాదు.

ప్రార్థన అనునది మనకు అందుబాటులోని గొప్ప శక్తియే కాకుండా, మనకు వచ్చు ప్రతి పరిస్థితిని పరిష్కరించగల ఉత్తమమైన, సులభ మార్గమైయున్నది. ప్రతి పరిస్థితిలో ప్రార్థన మన తొలి ప్రతి స్పందనై వుండాలి. ఏమి జరిగినప్పటికీ, అన్నిటికంటే ముందుగా దేవుని వద్దకు వెళ్లవలసివున్నది. యాకోబు మనం ఆచరించదగిన– గొప్ప సలహా యిస్తున్నాడు – "మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా, వాడు ప్రార్థన చేయవలెను" అని చెప్తున్నాడు. మనమైతే ఏ స్థితిలో వున్నప్పటికీ, ప్రార్థించుదాం.

## ప్రార్థనాంశములు

- విశ్వాసులముగా, మన జీవితాలలో ప్రార్థన అనేది, గొప్ప మరియు సులువైన ఆధిక్యతయై వున్నది.
- సాతాను ప్రార్థనను గురించి మనకు అబద్ధాలు చెప్పియున్నాడు, అయితే నిజం ఏమిటంటే, ప్రార్థన ఊపిరి పీల్చుటమంత సుళువు.
- శక్తివంతముగా వుండుటకు ప్రార్థన దీర్ఘమైనదిగా వుండనవసరం లేదు. నిజానికి మనం ప్రార్థించగలిగిన కొన్ని శక్తివంతమైన ప్రార్థనలు సంగ్రహమైనవి, కేవలం విషయానికి సంబంధించినవి.
- ప్రార్థన కష్టమైనది కానవసరం లేదు. అది హృదయం నుండి వచ్చినదై యుండాలి. అందుకు ఏ విధమైన స్థాయిలు, నియమాలు అవసరం లేదు.
- ప్రార్థన వాక్చాతుర్యము కలదిగా వుండనక్కరలేదు. ఇతరులతో మాట్లాడినట్లే దేవునితోనూ మాట్లాడవచ్చు.
- దేవుడు మన ప్రార్థనలు వినుటకు, మనం లోపరహితులముగా వుండనవసరం లేదు.
- ఏ పరిస్థితినైనా పరిష్కరించునట్లు, ప్రార్థన సులభమైన, ఉత్తమమైన మార్గము. మన జీవితాలలో జరిగేదానికి ప్రతిస్పందనగా ఏదైనా చేయుటకు ముందుగా మనం ప్రార్థించవలసియున్నది.

# 3

# ఊపిరిపీల్చుట వంటిదే

మనం "ఆత్మవలన ప్రతి సమయమందును, ప్రతి విధమైన ప్రార్థనలు విజ్ఞాపనను చేయుచు" వుండాలని ఎఫెసీ 6:18 చెప్తుంది. మరొక విధంగా చెప్పాలంటే మనం పరిశుద్ధాత్మ నిర్దేశకత్వాన్ని అనుసరిస్తూ, ప్రతి పరిస్థితిలో, వివిధ సమయాలలో వివిధ ప్రార్థనలు చేయాలని పౌలు వ్రాస్తున్నాడు. అన్ని సమయాలలో ప్రార్థించుట అంటే "విసుగక ప్రార్థించుట" (1 థెస్సలోనికయులకు 5:17), కాని దాన్ని ఎలా చేయగలము? కృతజ్ఞతా స్వభావము కలిగి ఉండి, మన దయనొందిన జీవితాలలో దేవునిపై పూర్తిగా ఆధారపడి, మనం చేయవలసిన అన్ని పనుల మధ్యలో మన తలంపులను ఆయన వైపు త్రిప్పుకొనుట ద్వారా అలా చేయగలము. మనము ప్రార్థనను ఒక కార్యక్రమముగా కాకుండా ఒక జీవిత విధానము వలన, మనం చేసే పనులన్నిటిలో అంతరంగంలో సాగిపోయే క్రియ వలె మారాలని దేవుడు నిజంగా కోరుకుంటున్నాడని నేను నమ్ముతున్నాను. నిరంతరంగా మనమాయనతో మాట్లాడాలని ఆయన మాటలు వినాలని-మన హృదయాలు ఆయన వైపు త్రిప్పబడియుండగా నిరంతరం ప్రార్థించాలని దేవుడు కోరుకుంటున్నాడు.

## ఎప్పుడైనా, ఎక్కడైనా

మనం ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రార్థించగలం. మనం అన్ని సమయాలలో, అన్ని సందర్భాలలో, అన్ని విషయాలను గూర్చి ప్రార్థించాలని, విసుగక ప్రార్థించాలని మనకు సూచనలు యివ్వబడ్డాయి. అయితే, ఒక మూల కూర్చుని రోజంతా దేవునితో మాట్లాడుతూ గడుపలేమని మనకు తెలుసు. అలా చేస్తే మనం మన జీవితాలు జీవించలేము. ప్రార్థన, ఊపిరి

పీల్చుట లాగా–నిరంతరంగా, సులువుగా, వ్యక్తిత్వంలా– మరియు మన జీవిత విధానం వలెనే ప్రార్థించవలసియున్నది. నిజానికి, మన భౌతిక జీవితాలు ఊపిరి పీల్చుట వలన బ్రతుకుతున్నట్లుగా, మన ఆత్మీయ జీవితాలు ప్రార్థన వలన బ్రదుకుతాయి. మనము బిగ్గరగా ప్రార్థనచేయవచ్చు లేక మౌనంగా ప్రార్థించవచ్చు మనము కూర్చుని, నిలుచుని, నేలపై పడుకొని ప్రార్థించవచ్చు. మనము కదులుతున్నప్పుడు మనము స్థిరముగా వున్నప్పుడు ప్రార్థించవచ్చు. మనము కొనుగోలు చేస్తున్నప్పుడు, ఎవరినైనా కలవడానికి వేచియున్నప్పుడు, బిజినెస్ మీటింగ్‌లో వున్నప్పుడు, ఇంటిపనులు చేస్తున్నప్పుడు, కారు నడుపుతున్నప్పుడు లేక స్నానము చేస్తున్నప్పుడు కూడా ప్రార్థించవచ్చు. మనము "నీవు చేసిన వాటన్నిటికై వందనాలు ప్రభువా" లేక "స్తోత్రం ప్రభువా నాకు సహాయం చేయి" లేక "ఓ యేసు అక్కడ బాధగా కన్పిస్తున్న స్త్రీకి సహాయం చేయి" ఈవిధంగా ప్రార్థించవచ్చు. నిజానికి ఇలా ప్రార్థిస్తూ దేవుని చేరుట దేవుని చిత్తమై యున్నది. అయితే ఒక ఖచ్చితమైన విధానంలో ప్రార్థనను అనుసరించాలని అనుకుంటూ ప్రార్థనలేని జీవితం అనేది సాతాను చిత్తమై యున్నది.

తరచుగా మనం ఏదైనా ప్రార్థనా అవసరతని, పరిస్థితిని గురించి విన్నప్పుడు, దీని గురించి తర్వాత నేను ప్రార్థించే సమయం ప్రార్థించాలి అని అనుకుంటాము. ఆ ఆలోచన సాతాను యొక్క ఎత్తుగడైయున్నది. ఆ నిమిషమే ఎందుకు ప్రార్థించకూడదు? ప్రార్థన పట్ల మనకున్న తప్పుడు మన:స్వభావమును బట్టి మనం వెంటనే ప్రార్థించము. మనం కేవలం మన మనస్సులను అనుసరించినట్లయితే సులువుగానే వుంటుంది, అయితే సాతాను, ప్రార్థనను కష్టమైనదిగా చేయాలని అనుకుంటున్నాడు. మనం ఆ విషయాన్ని పూర్తిగా మర్చి పోతామనే ఆశతో ఆలస్యము చేయాలని చూస్తున్నాడు. మనకు ప్రార్థించాలన్న ఆశ లేక అవసరత వచ్చిన వెంటనే ప్రార్థించుట సులువైనది, మరియు దినమంతా, ప్రతి సందర్భంలో దేవునితో నిరంతరంగా సంధింపబడి వుండుటకు యిది ఒక మార్గమైయున్నది.

పాస్టర్ టామీ బార్నెట్ మాట్లాడిన "అర్ధగంట" అనే ఒక టేప్ నేను విన్నాను. ఆ ప్రసంగంలో, సమయాన్ని జ్ఞానంగా వాడమని మనల్ని ప్రోత్సాహ పరుస్తున్నాడు– సమయం సరిపోవటంలేదని గొణుగుటకు బదులుగా వున్న సమయాన్ని తెలివిగా ఉవుపయోగించమని చెప్తున్నాడు. విమానం ఎక్కుట కోసం ఎదురుచూస్తూ విమానాశ్రయంలో అన్నీపుస్తకాలు వ్రాశానని చెప్పాడు.

> మనకున్న కొద్ది సమయంతో దేవుని గౌరవించుట మొదలు పెట్టినపుడు దేవుడు దానిని అభివృద్ధి చేస్తాడు.

ప్రార్థించుటకు సమయం లేనంతగా పనుల్లో మునిగి

యున్నామనుకునే వారికి యిది నిజంగా గొప్ప ప్రోత్సాహకరం. "నాకు ప్రార్థించటానికి నిజంగా అర్థగంట సమయం కూడా లేదు", అని కొన్ని సార్లు కొంతమంది చెప్తుంటారు. అది సరే, మనం విసుగక నిత్యము ప్రార్థిస్తున్నప్పుడు, 30 సెకెన్లలో చాలా ప్రార్థించగలము. మనకున్న కొద్ది సమయంతో దేవుని గౌరవించుట మొదలు పెట్టినపుడు దేవుడు దానిని అభివృద్ధి చేస్తాడు.

మనం నిజంగా సమయాన్ని తినేసే లోకంలో జీవిస్తున్నాము, ఇందులో ప్రతీది అవశ్యముగానే అనిపిస్తుంది. మనల్ని తీరిక లేకుండా వుంచి, వాక్యం చదువుటకు ప్రార్థించుటకు సమయం మిగలకుండా వుంచుటలో సాతాను పూర్తిగా విజయవంతమైనాడు. మనం అసామాన్యమైన ఒత్తిడిలో ఒకదానినుంచి మరియొకదానికి, దాని నుంచి ఇంకొకదానికి పరుగెడుతూ చివరకు జీవితంలో నిజంగా ముఖ్యమైన వాటిని కుటుంబం, మన ఆరోగ్యం, దేవుడు, ఆత్మీయ జీవితాలను పట్టించుకొనుట అను వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసే స్థితికి వస్తున్నాము. తర్వాత మనం, మరింత అలసిపోతాము – దానిని పరిష్కరించుటకు వున్న ఒకే ఒక మార్గం దేవుని వద్దకు వచ్చుట, ఇది నిజం, ఆయనకు వేరుగా మనం జీవించలేము. మన వైవాహిక జీవితాలు బాధింపబడతాయి, మన పిల్లలు బాధ పడతారు. మన ఆర్థిక స్థితి గందరగోళమవుతుంది, మన సంబంధాలు వృద్ధిచెందవు – ఇవన్నీ మనం ప్రార్థనలో, వాక్యంలో సమయం గడపకపోవుట వలన సంభవిస్తాయి. రోజంతటిని గడపటానికి మాత్రమే మనం ప్రయత్నించకుండా వాటిని గూర్చి ప్రార్థించుట మనం మొదలు పెట్టినట్లయితే జీవితాన్ని ప్రశాంతంగా, జ్ఞానంగా గడుపుకొనుటకు దేవుడు మనకు శక్తిని, సమర్థతని ఇస్తాడు. మనం దేవునికే సమయమిస్తే, ఆయన మన బలాన్ని నూతనం చేసి,అలసిపోకుండా జీవించుటకు సమర్థుల్ని చేస్తాడని (యెషయా 40:31 చూడండి) బైబిలు చెప్తుంది. అయితే మనకున్న సమయాన్ని ఉపయోగించుకుంటూ మనం మొదలు పెట్టాలి.

నీవు తీరిక లేని తల్లివి, ఉపాధ్యాయురాలివి, సంఘకాపరివి, కంప్యూటర్ పనిచేసేవాడివి, పరిపాలన చేయువాడివి, మెకానిక్‌వి, మెదడుకు శస్త్రచికిత్స చేయు డాక్టర్‌ని ఎవరినైనా సరే, నీవు తీరిక లేకుండా వున్నావా! నీవు నీ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడమే కాకుండా నీకుటుంబ బాధ్యతలు నిర్వర్తించవలసియున్నది. నీకు సాంఘిక కర్తవ్యాలు లేక సంఘ కర్తవ్యాలుంటాయి నీవు షాపింగ్ చేయవలసివుంటుంది, ఇల్లు శుభ్రపరచుకొనవలసివుంటుంది మరియు బిల్లులు కట్టవలసివుంటుంది. వీటన్నిటిమధ్యలో ఎక్కడో, నీకు ఊపిరి తీసుకోవటానికి కొన్ని నిమిషాలు కావలసియున్నది! కాబట్టి, ఇన్ని అవసరతలు, పనుల మధ్య నీవెలా ప్రార్థించగలవు? ఉదాహరణకు రోజంతా యిల్లు శుభ్రం చేసుకోవటం, పసిపిల్ల బట్టలు మార్చటంలో తీరికలేకుండా వుండి విసిగిపోయిన తల్లివైతే, ఒక్క క్షణం ఆగి, "ఓ యేసూ, నేను నిన్ను ప్రేమిస్తున్నాను. ఈ క్షణమే నన్ను బలపరచు. దేవా, నాకు కొంత బలం, కొంత సహనం అవసరమైయున్నది. నాకు ఇంకా ఓపిక లేదు నాకు కృపనివ్వు దేవా. ఆత్మ ఫలాలలో నా బిడ్డలతో కలిసి నడుచుటకు నాకు సహాయం చేయి. నా భర్త పని నుండి

ఇంటికి వచ్చునపుడు, ఆయనతో సరిగా ప్రవర్తించునట్లు నాకు సహాయం చేయి. వందనాలు యేసయ్యా నా బిడ్డ ఏడుస్తుంది ప్రభువా నేను వెళ్ళాలి!"

(దేవునితో కూడా అదే విధంగా మాట్లాడవచ్చు ఈ విధమైన ప్రార్ధన నీవు) చేయుటకు బదులుగా, నీకున్న సమయాన్ని ఉపయోగపరచుకో.

రాత్రంతా తమ పడకలపై వుండి ప్రార్థించేవాళ్లు "ఈ రోజుకై వందనాలు ప్రభువా! నీవు చేసిన వాటన్నిటికై వందనాలు. నిన్ను స్తుతిస్తున్నాను. నీవు అద్భుతకరుడవు, ఈ రాత్రికి నన్ను గుర్తుచేసుకో. నాకు మంచి కలలనివ్వు. నేను నిద్రించునపుడు కూడా దేవా! నాకు బోధించు, నీ నామానికి ఘనత కలుగును గాక!". అటువంటివారు, మధ్య రాత్రిలో నిద్రలేచి, మరల నిద్రకు ఉపక్రమిస్తూ "నేను నిన్ను ప్రేమిస్తున్నాను యేసూ" అని "ఈ నూతన దినానికై వందనాలు ప్రభువా. నీవు లేకుండా ఈ దినాన్ని నేను గడపలేను. యేసయ్యా, నేను చాలా కృతజ్ఞురాలినైయున్నాను. నీ చిత్తములో నడుచుటకు నాకు సహాయం చేసినందుకై వందనాలు ప్రభువా. ఈ దినం నాకు జ్ఞానాన్ని ఇవ్వు. నేను నీ నామాన్ని ఘనపరుస్తున్నాను. నీవు ఆశ్చర్యకరుడవు" అనే ప్రార్థన వారి పెదవులపై వుంటుంది.

ఇప్పుడు నేను మీకు వివరించిందేమిటంటే, నేను నిరంతరంగా ప్రార్థించుటకు అభ్యాసం చేశాను. మనందరం ఆ విధంగానే చేయాలని – చిన్న చిన్న విషయాలు ఆయనకు చెప్తూ, క్లుప్త విన్నపాలు చేస్తూ, క్లుప్త కృతజ్ఞతలు చెల్లిస్తూ గడపాలని దేవుడు కోరు కుంటున్నాడని నేను నమ్ము తున్నాను. నిన్ను కలిసిన ప్రతి సారీ నీ బిడ్డలు "అమ్మా, నేను నిన్ను ప్రేమిస్తున్నాను" లేక "నాన్నా నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అని చెప్పినపుడు ఎలా వుంటుందో ఆలోచించండి. నా బిడ్డలలో ఎవరైనా నా ఆఫీసు ముందు ఆగి "అమ్మా, నువ్వు నిజంగా చాలా అద్భుతమైన దానవు! మళ్ళీ కలుద్దాం" అని చెప్తే నాకింకేం కావాలి! నువ్వు ఇతరుల గురించి వారు గొప్పవారని అనుకుంటున్నట్లుండే సంభాషణ, సంబంధాలను పెంపొందిస్తుంది. మన ప్రభువుతో ఆవిధంగా వున్నట్లయితే, ఆయనతో మన సంబంధం మరింత లోతుగా వెళ్తుంది బలంగా ఎదుగుతుంది, మరియు మనం ఆయనతో "ఎప్పుడైనా, ఎక్కడైనా" ప్రార్థన ద్వారా నిరంతరం కలసి వుంటాము. దానిని ఆయన ప్రేమిస్తున్నాడు.

> చిన్న చిన్న విషయాలు ఆయనకు చెప్తూ, క్లుప్త విన్నపాలు చేస్తూ, క్లుప్త కృతజ్ఞతలు చెల్లిస్తూ గడపాలని దేవుడు కోరుకుంటున్నాడని నేను నమ్ముతున్నాను.

ఇతర పనులలో తీరిక లేకుండా ఉండగా ప్రార్థించమని నేను సలహాయిచ్చుట లేదు. మనం ఆయన కొరకు ఇష్టంగా సమయాన్ని కేటాయించి ఆయనను గౌరవించవలసియున్నది,

అయితే దినమంతా ప్రార్థించుట కూడా ఆయనకు సమయాన్ని కేటాయించుట అన్నంత ముఖ్యమైనది. సాధ్యమైతే రెండూ చేయండి, అయితే నీవు చేయవలసినదంతా చేయలేనపుడు "ఏమీ చేయక పోవుటకంటే, ఏదో ఒకటి చేయండి!" నీకు కేటాయించిన సమయం ప్రార్థించలేకపోయినందుకు అపరాధ భావనను పొందకండి, సాగిపోయి దినమంతా పనుల మధ్యలో ప్రార్థించుటలో గడపండి.

## "ఈ ఆత్మలో"

అదనంగా అన్ని సమయములలో ప్రార్థించుటకు, "ఆత్మలో ప్రార్థించండి" అని ఎఫెసీ 6:18 సూచిస్తుంది. సులభంగా చెప్పాలంటే, "ఆత్మలో ప్రార్థించుట" అంటే మనకిష్టం వచ్చినట్లు ప్రార్థించుటకు బదులుగా, మనం ప్రార్థించు చుండగా పరిశుద్ధాత్ముని నడిపింపునకు ఒప్పుకొనుట. క్రీస్తు శరీరంలోని వివిధ వ్యక్తుల గుంపులు "ఆత్మలో ప్రార్థించుట" ను వివిధ రకాలుగా అనువదించారు. వాటిని నేను తరువాత చెప్తాను. అయితే, విస్తారమైన వివరణలో అది పరిశుద్ధాత్ముని ప్రార్థనలో అనుసరిస్తూ, ఆయన ప్రేరేపించిన అంశముల కొరకు ప్రార్థించుటయైవున్నది. మనకు ప్రార్థించాలని అనిపించిన వాటిని గురించి కాకుండా, ఆయన వేటిని గురించి ప్రార్థించుటకు నడిపిస్తాడో, వాటిపై దృష్టిని కేంద్రీకరించుట. దీని కొరకై ఆయన మన హృదయంలో ఒక విషయమునుంచు వంకు దేవుని సన్నిధిలో మౌనంగా వేచివుండవలసియున్నది.

అనేక సార్లు, మనం మన తీరిక లేని జీవితాలతో చుట్టబడి, మన సమస్యల గురించి మాత్రమే ఆలోచిస్తూ వుండి, దేవునితో మాట్లాడునపుడు కేవలం మన "విషయాలు" చెప్తుంటాము. తరచుగా మనం మన సమయాన్ని, బలాన్ని "మన" ప్రార్థనలు ప్రార్థించుటలో పెడుతుంటాము, దేవుని మనకు అనవసరమైనదంతా దిగుమతి చేయు ఒక ప్రదేశంగా చూస్తుంటాము. దేవుడు మనలను ప్రార్థించమని నడిపించినవి గాకుండా, మన ప్రార్థనలు – మనకు మంచిగా అనిపిస్తాయని తలంచిన, ఖచ్చితంగా ప్రార్థించదగినవి అని మనకు అనిపించిన, మన కు ప్రత్యేకంగా కనిపించిన ప్రార్థనలు చేయాలని భావిస్తాము.

కొన్నిసార్లు ప్రార్థనలో నింపుదల లేనట్లుగా లేక ఒక విషయం గురించి ప్రార్థిస్తున్నపుడు ప్రార్థన "పూర్తి చేయలేదు" అనిపించుటకు కారణం, మనం ఎక్కువ సమయాన్ని కేవలం మన ప్రార్థనలు ప్రార్థించుటలో గడుపుటే అని నేను తలుస్తున్నాను. అయితే, ఉత్తమమైన, ఉన్నతమైన, మరింత ప్రభావ వంతమైన మార్గం ఒకటుంది అది దేవుని ప్రార్థనలు ప్రార్థించుట. నిజాయితీగా చెప్పాలంటే నేను నా ప్రార్థన, కొనసాగిస్తునట్లయితే, నేను పదిహేను నిమిషాలు ఒక విషయం గురించి ప్రార్థించినా పూర్తికానట్లుగా భావిస్తాను; అయితే నేను పరిశుద్ధాత్మచే నడిపింపబడి, దేవుని ప్రార్థన ప్రార్థిస్తున్నట్లయితే, నేను రెండు వాక్యాలు ప్రార్థించి, పూర్తిగా

> మనం మన అంతరంగ జీవితాలను గురించి – మన ఆలోచనలు, ఉద్దేశాలు మరియు దేవునితో మన సంబంధం గురించి ప్రార్థించినట్లయితే, ఆయన మన బాహ్య జీవితం గురించిన శ్రద్ధ తీసుకుంటాడు.

సంతృప్తిచెందగలను. "మన" ప్రార్థనలు ప్రార్థించ వద్దని వ్రాసినపుడు, నా ఉద్దేశమేమిటంటే, మనం శారీరకమైన, ఉద్రేకంతో కూడిన ప్రార్థనల నుండి ఆత్మతో నింపబడిన, ఆత్మచే నడిపింపబడిన ప్రార్థనలకు నడిపింపబడగలము. మనం దేవుని చేరుటను గూర్చి, ప్రార్థనను గురించి మన ఆలోచన ధోరణిని కొంత మార్చుకొన గలిగితే, మనం మన ప్రార్థనలకు బదులుగా దేవుని ప్రార్థనలను కొనసాగిస్తాము. ఉదాహరణకు, మనం మన ప్రార్థనలు ప్రార్థించునపుడు మనపై – మన ఆరోగ్యం, మంచి స్థితి, మన ఆర్థిక అవసరతలు, ఎదుర్కొంటున్న సవాళ్లు, కుటుంబాలు, ఇంకా మనకు సంబంధించిన ఇతర విషయాలపై దృష్టిని పెడతాము. అయితే మనం మన అంతరంగ జీవితాలను గురించి – మన ఆలోచనలు, ఉద్దేశాలు, దేవునితో మన సంబంధం గురించి ప్రార్థించినట్లయితే, ఆయన మన బాహ్య జీవితం గురించిన శ్రద్ధ తీసుకుంటాడు. మన లోపలి జీవితాన్ని కట్టుకొనుటకు మనం ప్రార్థిస్తే, దేవుడు బాహ్య జీవితం గురించి శ్రద్ధ తీసుకుంటాడు.

నేను అనేక శరీర సంబంధమైన, ఉద్రేకపూరిత విషయాలను గురించి ప్రార్థించుట మాని, యేసు ప్రార్థించిన విధంగా, ప్రార్థన చేసిన తరువాత అత్యద్భుత నింపుదలను గ్రహించాను. నేను మరల చెప్తున్నాను – దేవుని మన అవసరతలు తీర్చమని అడుగుటలో తప్పులేదు. నిర్భయమైన ప్రవేశం గలవారమై మనం ఆయనను స్వేచ్ఛగా అడుగవచ్చని నేను నమ్ముతున్నాను, అయితే మనం ప్రార్థించు విషయాలు మన ఆత్మీయ పరిణితిని తెలుపుతాయని నేను అర్థం చేసుకున్నాను.

మనకు అవసరమైనవాటిని, కోరుకున్నవాటిని అడుగుటలో ఖచ్చితంగా తప్పులేదు, అయితే అవి ఎక్కువ భాగాన్ని ఆక్రమించకూడదు. మనం అడుగకముందే మనకు కావలసినవి ఆయనకు తెలుసని బైబిలు చెప్తుంది. కాబట్టి మనం చేయవలసినదంతా కేవలం ఆయననడిగి మనం మన ప్రార్థనా సమయాన్ని ఇతరుల అవసరతలు (శారీరక, ఆత్మీయ), ఆయన రాజ్య వ్యాప్తి, మరియు మన ఆత్మీయ అవసరతలగురించి మన ప్రార్థనాసమయంలో ఎక్కువ భాగాన్ని గడుపుతుండగా మన అవసరతలను ఆయనే తీరుస్తాడన్న నమ్మకం కలిగి వున్నామని దేవునికి తెలియనివ్వాలి. ఉదాహరణకు, పార్టీ కొరకు క్రొత్త డ్రస్ కంటే నా దారిలోకి ఎదురయ్యే ప్రతి దానిని సహనంతో ఎదుర్కొనుటను నేర్చుకొనుట నాకు అవసరమైనదై

యున్నది. ఒక పెద్ద ఇంటికంటే అన్నీ సమయాలలో నా చుట్టూ వున్న వారితో ప్రేమతో కట్టుబడివుండి దయను చూపించటం నాకు అవసరమైవున్నది. పనిలో ఉన్నతస్థాయి కంటే నేను మాట్లాడే మాటలలో జ్ఞానము అవసరమైవున్నది.

ఆత్మచే నడిపింపబడే ప్రార్థన ఎలా ప్రార్థించాలి అనే దానికి ఇక్కడ మరొక ఉదాహరణ వుంది. మీ ఇంటిలో ఇద్దరు రౌడీ, తిరుగుబాటు చేయు యౌవనస్థులైన పిల్లలు వున్నారనుకుందాం. నువ్వు ప్రార్థన చేసేటప్పుడు దేవుని గురించి చెప్పటం మొదలు పెట్టినప్పుడు, వాళ్ళిద్దరు చేసే అల్లరికి మీకు అరవాలనిపిస్తుంది అనుకుందాము. అప్పుడు నువ్వు ఎంత బాధపడుతున్నావో దేవునికి ఫిర్యాదు చేస్తావు. నేను ప్రార్థించిన తర్వాత, ఆ పిల్లలను తిట్టి, వారెంత భయంకరంగా ఉన్నారో చెప్పి, మీ జీవితాలు ఎందుకూ పనికిరావని వారికి చెప్తావు. ఒక వేళ ఇదే గనుక జరుగుతున్నట్లయితే మీ ఇల్లు పోట్లాటలతో నిండి వుంటుంది నీకుటుంబంలో ఎప్పటికీ సమాధానం వుండదు, నీ జీవితభాగస్వామి నీవలెనె కోపంగా అసంతోషంగా వుంటుంది. మన ప్రార్థనా సమయం నిజమైన ప్రార్థన కంటే “ఫిర్యాదుల భాగం” గా మారుట చాలా సులువు. ఈ విధమైన ప్రార్థనలు ఒక పరిస్థితిలోనికి దేవుని సహాయాన్ని ఎప్పటికి తీసుకొని రాలేవు.

నీ ఫిర్యాదులన్నింటితో ఆయన వద్దకు పరుగెత్తుటకు బదులుగా ఆ పరిస్థితిని గూర్చి దేవుని ప్రార్థనలు చేయుటకు మొదలుపెట్టినట్లయితే, నీవు మార్పును చూచుటకు మొదలు పెడతావు. “దేవుని ప్రార్థన” ఈ విధంగా వుంటుంది: “దేవా, ఈ రోజు ఈ యౌవనస్తులతో చాలా విసిగిపోయాను అయితే కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము, గర్భఫలము బహుమానమని మరియు వారు బలవంతుని చేతిలో బాణములవంటివారని నీ వాక్యం చెప్తుంది. వారి సమాధానము గొప్పదని కూడా నీ వాక్యం చెప్తుంది. కాబట్టి, దేవా, కృతజ్ఞతతో నీ ఎదుటికి వచ్చి యున్నాను. నా యౌవనస్తులతో ప్రవర్తించుటకు నా జ్ఞానమును దయచేయండి. ప్రభువా, వారి పరిస్థితులను నాకు అర్ధమవునట్లుగా చేయండి, వారికి సహాయపడగల సమర్ధతను నాకు దయచేయండి. వారిని గురించిన నీ ప్రేమను నా హృదయంలో క్రుమ్మరించు నీ ప్రేమ నాలో సమృద్ధిగా వుండునట్లు చేయమని, నీ కృప నాలో ప్రవహించునట్లు చేయమని నా హృదయం నీ యెదుట నా కుటుంబం పట్ల సరియైనదిగా వుండునట్లు చేయమని ప్రార్థిస్తున్నాను. క్రీస్తు సమాధానము నా హృదయంలోనూ, నా కుటుంబంలోనూ రాజ్య మేలును గాక”.

పైన ఉదాహరణ ప్రకారముగా నీవు ప్రార్థించినట్లయితే నీ కోపం మాయమౌతుంది. నీ యౌవనస్తు లను దేవుని ప్రేమతో ప్రేమించుటకు మొదలుపెడతావు మరియు నీ కుటుంబంలో సమాధానాన్ని స్థాపించుకుంటావు. నీ పరిస్థితులలో దేవుడు పని చేయుటకు మొదలుపెడతాడు, ఎందుకంటే మనం మన పరిస్థితుల గురించి ఉద్రేకపూరితమైన ప్రార్థనలు చేయుట ఆపివేస్తాము. ఆయన మన కిచ్చిన బిడ్డలగురించి ఫిర్యాదు చేయుట గొణుగుట మాని వేశాము ఆయనకు

అత్యంత ముఖ్యమైన విషయాన్ని గురించి – నీ హృదయ స్థితిని గురించి ప్రార్థించుట మొదలు పెట్టావు.

## *పరిశుద్ధాత్మను నడిపించనీయండి*

మనకు ప్రార్థన నేర్పించుటలో దేవుడు ఉపయోగించు మార్గములలో ఒక భాగము, మనకు ప్రార్థించుటలో పరిశుద్ధాత్మను అనుసరించుటకు సహాయపడుట. అనుమానానికి తావు లేకుండా, దేవుని ప్రార్థనలు ప్రార్థించుటకు అతి ప్రభావవంతమైన మార్గము పరిశుద్ధాత్మ మనలను నడిపించనీయుటయే, అది మన మనసులలో కాక దేవుని హృదయములో నుండి వచ్చిన విషయాలను గురించి ప్రార్థించుటకు మన హృదయాలలో వాటిని ఉంచమని ప్రభువుని అడుగుతూ ఆయన ఎదుట వేచివుండుట వలన సాధ్యము. నేను ఇంతకు ముందు వ్రాసినట్లుగా, మనకు కావలసిన వాటిని గురించి మన సొంత ప్రార్థనలు చేయుటకు అతీతంగా మనము ఖచ్చితంగా కదలవలసి వున్నది. ప్రార్థన అనేది అంతకంటే గంభీరమైన విషయం – ఏమి ప్రార్థించాలి అని అడిగినట్లయితే, జవాబుకై వేచివున్నట్లయితే, ప్రార్థనలో ఆశ్చర్యకరమైన సాహస కార్యములలోకి పరిశుద్ధాత్ముడు మనలను నడిపిస్తాడు.

మనం ప్రార్థించుచుండగా ఆయన నడిపించునట్లు దేవునికై వేచియుండుటకు సమయం లేదని అన్నట్లయితే అది నిజంగా చాలా అజ్ఞానమైయున్నది. ఒక పెద్ద రెస్టారెంట్‌లో స్థలం కోసం 45 నిమిషాలు వేచియుండగలము, అయితే దేవుని కొరకు వేచియుండుటకు సమయం లేదని చెప్తాము. ఇప్పుడు దేవుని కొరకై వేచివున్నట్లయితే తరువాత అన్ని రకాలైన సమయాల్ని, బలాన్ని పొందుకుంటాము. ఏం ప్రార్థించాలని ఆలోచించుట, పెద్దగా శబ్ధం చేయు ప్రార్థనలు చేయుటకు ప్రయాసపడుట అలసట నిస్తుంది. శరీరంలో ఈ విధమైన కష్టము ఫలవంతమైనది కాదు. మన ప్రార్థనలు ప్రభావవంతంగా లేనప్పుడు, మనం ఆత్మీయంగా ఏమీ సాధించలేనప్పుడు – మన మనస్సు మనలను ఒప్పింపచూసేనా – మన ఆత్మలకు తెలుస్తుంది.

ప్రభావవంతమైన ప్రార్థనలు ప్రార్థించు క్రమంలో నా బిడ్డలగురించి, నా గురించి, పరిచర్య గురించి, పొరుగువారి గురించి, ప్రపంచం అవతలివైపు సంక్షోభం గురించి, అది దేని గురించైనా ప్రార్థించునప్పుడు – దేవుని వద్ద వేచియుండి ఆయనను నడిపించనివ్వాలని నేను నేర్చుకున్నాను. నేను కొద్ది నిమిషాలు సమయం తీసికొని "ప్రభువా, నా మనసులో ఫలానా ఫలానా విషయాలున్నాయి. ఇక్కడ నీవేం చెప్పాలను కుంటున్నావు? ఆ వ్యక్తి లేక పరిస్థితి గురించి నేనెలా ప్రార్థించాలని నీవు కోరుకుంటున్నావు" అని అడుగుతాను. చాలా సార్లు, కొన్ని క్షణాలలోనే నా హృదయంలోనికి తలంపులు రావటం మొదలుపెడతాయి. నేనెలా ప్రార్థించాలో అర్థం చేసుకుంటాను, మామూలుగా చేసే దానికంటే దృఢంగా ప్రార్థిస్తాను, త్వరగా తృప్తి చెందుతాను.

మన ప్రార్థనలను పరిశుద్ధాత్ముని నడిపింపునకు అప్పగించుట అనేది, మన జీవితాలకు గొప్ప స్వేచ్ఛను తీసికొని వచ్చి, ప్రార్థనను మరింత సులువుగాను, సంతోషకరంగాను చేస్తుంది.

పరిశుద్ధాత్మ నడిపింపు అడుగుతూ మన ప్రార్థనలు ప్రారంభించినట్లయితే మనం ఒకే విషయం, లేదా ఒకే వ్యక్తుల గురించి ప్రార్థించము గనుక మనకు విసుగనిపించదు. స్పష్టంగా లేక పోయినట్లయితే ప్రార్థన విసుగనిపిస్తుంది, అయితే పరిశుద్ధాత్ముడు సృజనాత్మకతతో నిండివున్నాడు. ఆయన నడిపించునపుడు మనం కర్తవ్యం వలె కాకుండా ప్రార్థిస్తాము, మన ప్రార్థనలు ఆచారబద్ధంగా ఉండవు. మనం కేవలం దేవుని హృదయాన్ని ఎరిగి, ఆయనతో మన సంభాషణ తాజాగా, స్పష్టం కలదిగా వుండునట్లు పరిశుద్ధాత్మ సహాయం పొందుకోవాలి.

మన ప్రార్థనలను పరిశుద్ధాత్ముని నడిపింపునకు అప్పగించుట అనేది, మన జీవితాలకు గొప్ప స్వేచ్ఛను తీసికొనివచ్చి, ప్రార్థనను మరింత సులువుగాను, సంతోషకరంగాను చేస్తుంది. మనం చదివిన లేక విన్న ప్రతిదాని గురించి ప్రార్ధించాల్సిన బాధ్యత కలిగివున్నామన్న భావన నుంచి విడుదలనిస్తుంది. ఎందుకంటే, మన బాధ్యతా పరిధిలో నున్న మనుషులు, పరిస్థితులలో వేటినైతే దేవుడు మన హృదయంలో ఉంచుతాడో వారిని లేక వాటిని గురించి మాత్రమే మనం ప్రార్ధించవలసియున్నదని మనం అర్ధంచేసు కుంటాము గనుక వ్యక్తిగతంగా, ఇతరులు ప్రార్ధిస్తున్న విషయాలు నేను ప్రార్ధించనందుకు నేనెపుడూ తప్పుచేస్తున్నట్లు భావించలేదు, ఎందుకంటే, దేవుడు వివిధ మనుష్యుల్ని, వివిధ విషయాల గురించి ప్రార్ధించుటకు ఉపయోగించుకుంటాడని నాకు తెలుసు. ప్రతివ్యక్తిని దేవుడు ప్రార్ధించమన్న విషయాలగురించి ప్రార్ధించుటకై పరిశుద్ధాత్ముని నడిపింపునకు లోబడినట్లయితే, ప్రపంచం మొత్తం గురించి ప్రార్ధనలు చేయబడతాయి.

మనం ప్రార్ధించుచుండగా శాస్త్రోక్తంగా, కర్తవ్యంలా ప్రార్ధించుట నుంచి కూడా విడుదల పొందవలసియున్నది. మనం ప్రార్ధించవలసినవారమైయున్నామని తలంచి కేవలం అందుకు ప్రార్ధించాలని దేవుడు కోరుకొనటం లేదు. మనం పరిశుద్ధాత్ముని నడిపింపును అనుసరించి, ఆయన దేని గురించి ప్రార్ధించమంటాడో, ఎంతసేపు ప్రార్ధించమంటాడో ఎరిగి ప్రార్ధించవలసి యున్నది. మన ఆత్మీయ చెవులు ఆయన వైపు తిరిగివున్నపుడు, ఆయన సూచనలను, ప్రోత్సాహాన్ని వినగలము. ఆయనకు అవసరమైనదేదో ఎరిగి, ఆయన మనలను ప్రార్ధింపగోరిన మార్గంలో ఖచ్చితంగా ప్రార్ధించగలము – అది ఎల్లపుడు అద్భుతకరమైన ఫలితాలనిస్తుంది.

# మనసుతో ప్రార్థించుట

తన ''ఆత్మీయమైన మనిషి' అను పుస్తకములో వాచ్‌మన్ ఆత్మ మౌనంగా వున్నట్లు కన్పించినపుడు మనస్సు ఆత్మకు తోడ్పడునట్లుగా చేయుటను గురించి వ్రాశాడు. ఆయన ఉద్రేకపూరితమైన ప్రార్థనలు చేయమని చెప్పుట లేదని నేను ఖచ్చితంగా చెప్పగలను, అయితే మనమేదైనా అవసరతను చూచినపుడు లేక ఏవిషయమైనా ప్రార్థించబడాలని తలచినపుడు, మనము వెంటనే మన మనస్సులలో మనకేమి తెలుసో దాని ఆధారంగా ప్రార్థించుట ప్రారంభించి, మన ఆత్మలు మనము ప్రార్థిస్తున్న దిశను అంగీకరిస్తాయో లేదో వేచి చూడాలి. 1 కొరింథీ 14:15లో పౌలు ఈ విధంగా చెప్తున్నాడు. "కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సుతోను ప్రార్థన చేతును, ఆత్మతో పాడుదును, మనస్సుతోను పాడుదును".

ప్రార్థనలో, ప్రతీసారి ప్రార్థించుటకు ముందు దేవుని భారము మనపై వచ్చు వరకు వేచివుండవలసిన అవసరంలేదు. మన మనస్సులో ప్రారంభించి, మన ఆత్మ సహాయ పడుతుందో, లేదో అని వెదకవచ్చు మనం ఎల్లప్పుడూ ఆత్మ యొక్క ప్రవాహాన్ని, క్షీణతను అర్థం చేసుకొనలేము కొన్ని సమయాలలో పరిశుద్ధాత్మ సమృద్ధిగా ఉండి మనం ఒక మార్గంలో బలంగా నడిపింపబడుతున్నట్లు భావిస్తాము, అయితే, ఇతర సమయాలలో ఆయన పూర్తిగా మౌనంగానున్నాడని మనం ఒప్పుకొనవలసి వుంటుంది. ఆ సమయాలలో మన మనస్సులలోని జ్ఞానాన్ననుసరించి ప్రార్థించవలసి వుంటుంది. అలా చేస్తున్నప్పుడు, మనం ఆత్మనుంచి బలాన్ని, పట్టుదలను పొందు కుంటాము లేక అదే మౌనాన్ని, నిస్సహాయాన్ని పొందుతాము. ఆ విషయంలో మనం వేరొక పరిస్థితిని గురించి యిలానే ప్రార్థిస్తూ, దేవుని హృదయంలో దేని నిమిత్తం ప్రార్థించవలెనని వున్నదో కనుగొనువరకూ చేయవలసివున్నది.

మన చుట్టూ అవసరతలను చూస్తున్నప్పుడు, ఒక గొప్ప భావన మనల్ని దాటివెళ్ళి పోతాయి. ప్రార్థించునట్లుగా బలపరిచే వరకూ వేచివుండమని. మనం విశ్వాసంతో, మనకు తెలిసిన ఒక అవసరత గురించి ప్రార్థించుట మొదలు పెట్టినపుడు, త్వరలోనే అది దేవుని చిత్తమైనదో కాదో కనుగొంటాము, మనం ఆ పరిస్థితిని గురించి ప్రార్థన చేయాలనుకున్నాము గనుక మనం దాని ఆత్మీయంగా చేయవలసి యున్నది. మాటల కొరకు ఇబ్బంది పడకుండా, ప్రార్థనలో ఒక గొప్ప ప్రవాహాన్ని చూస్తావు. లేదా ఏదో ఆత్మీయత ద్వారా ఇబ్బందులలో నుండి పైకి రావాలని గ్రహించుట ఎందుకంటే మనము పరిస్థితిని గూర్చి ప్రార్థిస్తున్నాము అని అనుకొంటున్నాము కాబట్టి ఆత్మలో ప్రార్థించుట అంటే ఆయన లేకుండా ప్రార్థించలేమని నిశ్చయించుకోవాలి అని అర్థము. మనం స్వంతగా ప్రారంభించినప్పటికీ, పరిశుద్ధాత్మ తన అంగీకారాన్ని, దైవిక బలాన్ని ఇచ్చు వరకూ మనం ఏమీ చేయలేము.

## ప్రార్థనలో వ్యతిరేకత

ప్రార్థనలో పరిశుద్ధాత్ముని అనుసరించుటకు వెదకుచున్నపుడు, మనం ఆటంకాలను ఎదుర్కొంటాము, ఈ ఆటంకం భయం రూపంలో వస్తుంది – పెద్ద భయాల వలెనే సహజ ఆపదలు లేక భయంకరమైన రోగం లేక కొన్ని యితర మహా విపత్తులు – కాని మామూలుగా విశ్రాంతి లేకపోవటం మరియు మనస్తాపము అనేవి, సామాన్యమైన విషయాలు ధైర్యంగా. ప్రార్థించటానికి కూడా భయపడేటట్లు చేయటానికి సాతాను ప్రయత్నిస్తాడు. విశ్వాసంతోకాకుండా, భయముతో దేవుని దగ్గరకు చేరులాగున చేస్తాడు. వాడు మనకు మన పాపాలు, తప్పిదాలు జ్ఞాపకం చేసి, దేవుని ఎక్కువ అడిగే హక్కు మనకు లేదేమో అని భావించేలా చేస్తాడు. ఆయన సింహాసనం వద్దకు “ధైర్యంగా రమ్మని” బైబులు మనకు బోధిస్తుంది (ఎఫెసీ 3:12 హెబ్రీ 4:16 చూడండి).

కొంతమంది నిరంతరం చిన్నచిన్న భయాల క్రింద బ్రతుకుతూ, ఈ విధంగా మాట్లాడుతూ ఉంటారు. “ఈ ట్రాఫిక్‌లో సమయానికి పనికి వెళ్ళలేనేమో అని భయంగా వుంది”, లేక “ఈ రొట్టె మాడిపోతుందేమో అని భయపడుతున్నాను”, “శనివారం బాల్ ఆట సమయానికి వర్షం పడుతుందేమో అని భయపడుతున్నాను”. ఈ ప్రతి దినం వచ్చే భయాలు చాలా చిన్నవి, కాని అవి మనుష్యుల దృష్టిని తమపై కేంద్రీకరించునట్లు చేసి వారి ప్రార్థనా జీవితానికి ఆటంకాలవుతాయి. ఇలాంటి చిన్న విషయాలను ఎత్తిచూపుటకు సాతానును రానియుటకు బదులుగా, మనము దేవుని నమ్మి ప్రార్థించాలి.

ఎందుకంటే మన జీవితాలు తక్కువైనవి, భయం తక్కువైనవి, భయంతో కొనసాగేవి కాబట్టి మన దయనొందిన జీవితాలలోని భయంతో కూడిన ఆలోచనలు మరియు సంభాషణలను, చిన్న, సులువైన ప్రార్థనలతో నింపవలసియున్నది. నేను అనుసరించేది “ప్రతిదాని గురించి ప్రార్థించు, దేనికీ భయపడకు”, మన ప్రార్థనా జీవిత విధానాన్ని అభివృద్ధి చేసుకుంటున్నప్పుడు, ప్రార్థనకు బలాన్నిఇవ్వని ప్రతి అలవాటును, ఆలోచనా విధానాన్ని నశింపజేయవలసివున్నది. పరిశుద్ధాత్మ ఆ విషయంలో మనకు సహాయం చేస్తాడు, కాబట్టి, వ్యతిరేక అలవాట్ల నుండి దినమంతా దేవుని యందలి విశ్వాసం ద్వారా దేవునితో కలసివుండే ప్రార్థనలోనికి మనల్ని నడిపించమని ఆయనను అడగాలి. ఊపిరి పీల్చుట వలే, ప్రార్థన సుళువు అవుతుంది.

## మనం వెళ్ళుచుండగా, అభివృద్ధి చెందుతాము

మనం ఎదుగుటకు ఊపిరి పీల్చుట సహజంగా ఎలా సహాయపడుతుందో, ఆత్మీయంగా ఎదుగుటకు ప్రార్థనా జీవిత విధానం సహాయపడుతుంది. తర్వాత, మనం ఆత్మీయ పరిణితి

చెందుచుండగా, మన ప్రార్థనా జీవితాలు అభివృద్ధి పొందుతాయి, మన ప్రార్థనలు అత్యంత ప్రభావవంతమవుతాయి. ప్రార్థనను గురించి ఉత్తమమైన వాటిలో ఒకటి–యిది అభివృద్ధి చెందునది యిది ఒక కళ కాదు మనం సంతోషించు సంబంధమైయున్నది. ఇది వికసించుచుండగా, మనం మరింత తరచుగా, మరింత ప్రభావవంతంగా ప్రార్థించుట నేర్చుకుంటాము పరిశుద్ధాత్మని మరింత దగ్గరగా అనుసరించుట నేర్చుకుంటాము దేవునితో లోతుగా సంభాషించుటకు, ఆయన స్వరం మరింత స్పష్టంగా వినుటకు నేర్చు కుంటాము.

ప్రార్థనను గురించి ఉత్తమమైన వాటిలో ఒకటి–ఇది అభివృద్ధి చెందునది. ఇది ఒక కళ కాదు మనం సంతోషించు సంబంధమైయున్నది.

నీ ప్రార్థనా జీవితంలో నీవు ఆనందంగా వుండి, అంతా సవ్యంగా జరుగుతుందను కున్న కొన్ని రోజులకే, సరైన కారణం లేకుండగనే నీకు అశాంతిగా, విసుకుగా, నిరాశగా, అలసినట్లుగా అన్పించిందా? నీ ప్రార్థనలో ఏదో సరిగా లేదన్న అనుభవాన్ని లేక వైవిధ్యంగా ఏమైనా చేయాలన్న ఆలోచనను కలిగి వున్నప్పటికీ, ఏమి చేయాలో ఖచ్చితంగా తెలియని అనుభవము కలిగిందా? నీకు ఇష్టం లేకపోయినప్పటికీ ప్రార్థించుటకు కష్టపడుతున్నట్లు అనిపిస్తుందా, లేక ప్రార్థన అతి ప్రయాసంగా అనిపిస్తుందా? నీకు ఈ విధమైన అనుభూతులు కలిగిన అనేక పర్యాయాలు, పరిశుద్ధాత్ముడు నీకు ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నాడు.

నీ అంతరంగ పురుషుడు (నీ ఆత్మ నీలో దేవునితో సంభాషించు భాగము) నీ ప్రార్థనలో ఏదైనా సరిగ్గా లేనపుడు నీకు తెలియజేస్తాడు. ఎందుకంటే, పరిశుద్ధాత్ముడు నీ ఆత్మలో నుండి నీ ప్రార్థనలు సరిగ్గా లేనపుడు లేక నీలో ఏదైనా మారవలసి వచ్చినపుడు నీకు తెలియజేస్తాడు. మంచివార్త ఏమిటంటే, అనేక సార్లు మనం ఈ విధంగా అనుకున్నపుడు మనం యింకా ఎక్కువదానికై సిద్ధంగా వున్నామని ఎరిగి, మరుసటి స్థాయికి దేవుడు మనలను ప్రోద్భలము చేస్తాడు. కొన్ని సమయాలలో మన ప్రార్థనా జీవితాలతో మనం సౌకర్యంగా లేనపుడు, తనతో మన సంబంధంలో ఎదుగుటకు దేవుడు మనకు సహాయకరంగా కొంత నేర్పించాలని అనుకుంటున్నాడని అర్థం. మనం వున్న స్థితిలోనే మనలను ఆయన ఎల్లప్పుడూ ప్రేమిస్తున్నాడు, అయితే ఆ స్థితిలోనే మనలను విడువడు, అది మన జీవితంలోని యితర ప్రదేశములలో వలెనే, ప్రార్థనలోను సత్యము.

మనం సంతోషకరమైన, సంతృప్తికరమైన జీవితాలు జీవించాలని దేవుడు కోరు కుంటున్నప్పటికీ, మనం అదే పాత విషయాలు చేయటం ఇష్టపడనప్పుడు, కొన్నిసార్లు మనలో ఆయన యొక్క అసంతృప్తిని, ఏదో గురిచేసుకోవాలన్న భావనను వుంచుతాడు.

మనలను ఆయన క్రొత్త స్థానానికి తీసుకువెళ్ళాలి అనుకుంటున్నాడు, గనుక ఆయనను వెదకునట్లుగా మనలను ప్రోద్భలం చేస్తాడు. నూతన విధానంలో ప్రార్థించమని, లేక ప్రార్థనకు ఎక్కువ సమయాన్నివ్వమని, ఆయన మనలను కోరుతుండవచ్చు. ఉదయాన్నే తక్కువ సమయం ప్రార్థించే వ్యక్తిని, మధ్యాహ్న భోజన సమయం తనతో సంభాషించుట ఆరాధించుటకు ఆయన నడిపిస్తుండవచ్చును. ఒక వ్యక్తి తరువాత ఏమి చేయాలో తెలుసుకొనునట్లుగా, ఆ వ్యక్తిని దేవుడు ప్రార్ధనను గురించి ఎక్కవగా నేర్చుకొమ్మని నడిపిస్తుండవచ్చును. తరచుగా ఒంటరిగా ప్రార్థించు ఒక వ్యక్తి, క్రమంగా ప్రార్థించుటకు కూడుకొను ఒక గుంపుతో చేరుటకు నడిపిస్తుండవచ్చును.

దేవుడు ఎల్లప్పుడు మనము తనతో సన్నిహితత్వంలో అభివృద్ధి పొందాలని, బలంగా ఎదగాలని, లోతుగా వెళ్ళాలని కోరుకుంటాడు. అనేక సమయాలలో, గతంలో మనము సౌకర్యంగా భావించిన ప్రదేశాలనుండి బయటికి నడిపించుట ద్వారా ఆ పరిణితి చెందించు ప్రక్రియలోనికి మనలను నడిపిస్తాడు. ఈ విధానంలో, దీనిని గ్రహించుట ప్రాముఖ్యమై యున్నది: దేవుడు మనకు ప్రార్థించుట నేర్పిస్తూ, ప్రార్థనా విధానంలో మనలను నడిపించుచుండగా, మనము శిక్షపొందుతున్నట్లుగా భావించి నిరాశతో వుండనవసరంలేదు నూతన ప్రదేశానికి దేవుడు మనలను పిలుస్తున్నాడా లేక సాతాను మనలను యిబ్బంది పెడుతున్నాడా అన్నది మనము కనుగొనవలసివున్నది. ఎందుకంటే, మన ప్రార్ధనా జీవితాలలో అసౌకర్యము, అసంతృప్తి, మరియు శాంతి లేకపోవుట అనునవి సాతాను పని కూడా అయివుండవచ్చును మనం ప్రార్థించుటకు ప్రయత్నించునపుడు, వాడు మనలను ఆటంకపరచాలని చూస్తాడు.

సాతాను అబద్ధీకుడు, వాడు మన ప్రార్థనలు నిరుపయోగకరమైనవని, విలువలేనివని తలంచునట్లు చేయుట ద్వారా వాడు సంతోషిస్తాడు. మన ప్రార్థనా జీవితాలు సరిగ్గా లేవనే స్థాయికి వచ్చినప్పుడు మనము ఏమి జరుగుతుందో దేవుని అడిగి ఆయన జవాబుకై వేచి చూడవలసియున్నది. ప్రార్థనలో నూతన స్థాయికి ఆయన మనలను పిలుచుచున్నాడో లేక మనము వృద్ధి చేసుకున్న ప్రార్థనా జీవితాన్ని దొంగిలించుటకు సాతాను ప్రయత్నిస్తున్నాడో ఆయన మనకు తెలియచేస్తున్నాడు. సాతాను ప్రార్థనను ద్వేషిస్తూ దానిని ఏ స్థాయిలోనైనా అటంకపరచుటకు చూస్తాడని ఎల్లప్పుడు జ్ఞాపకముంచు కొనవలసియున్నది. మనం ప్రార్థించుట దేవునికిష్టమైతే (ఆయనకు ఇష్టమే), దానిలో మనం సంతోషించాలని కోరుకుంటాడు. మనం వున్న రీతినే మనలను అంగీకరిస్తాడు గానీ తీర్పు తీర్చడు. మన హృదయాలలోనుంచి వచ్చిన జాలికరమైన, అతి చిన్న ప్రార్థనను కూడా విని జవాబిస్తాడు, ఆయన ఎల్లప్పుడూ నిజాయితీని, విశ్వాసాన్ని గౌరవిస్తాడు. అదే సమయంలో, అపరిణిత ప్రదేశాలలోనూ మనలను నిలువనీయడు, అయితే విశ్వాసంలోను, శక్తిలోను మరియు ప్రభావంలోను ఉన్నత స్థాయిలో కదలవలసిందిగా మనలను పిలుస్తాడు.

ప్రతి ఒక్కరి జీవితంలో ప్రార్థన వేరు వేరు కోణాల్లో వుంటుంది. కాబట్టి, దేవుడు నడిపించు ప్రార్థనా మార్గంలో స్వేచ్ఛగా వుండి ప్రార్థనలో ముందుకు వెళ్ళుము. ప్రార్థనా అనేది కష్టపడి, ప్రయాసపడి, నెరవేర్చునది కాదు: అది కేవలం దేవునితో మాట్లాడుటయే. 2 అధ్యాయంలో చెప్పినట్లుగా, ఒక వ్యక్తి కొన్ని సంవత్సరాలు అభ్యసించి, అలవరచుకున్న ప్రార్థనా జీవితాన్ని, దేవునితో నీ నడకను చూచి, అతనివలె నిపుణత కలిగి ప్రార్థించాలని ప్రయత్నించనవసరం లేదు. ప్రార్థనలో ఇతరులకంటే "చిన్నబిడ్డ" వలె వుండుటలో తప్పులేదు, మన అనుభవంతో నిమిత్తంలేకుండా దేవుడు మన ప్రార్థనలు విని జవాబిస్తాడు. ఇతరులతో పోల్చుకొనుట, కేవలం బాధపరుస్తుంది. మనం నేర్చుకుంటూ, ఎదుగుతున్నందుకు దేవుడు సంతోషిస్తాడు.

కొందరు యితరులకంటే ప్రభావవంతమైన ప్రార్థనలు ప్రార్థించగలరు కొందరు యితరులకంటే ఎక్కువ విశ్వాసం కలిగివుంటారు కొందరు యితరులకంటే బాగా దేవుని మార్గాలు అర్థం చేసుకుంటారు కొందరు యితరులకంటే త్వరగా దేవునికి లోబడతారు కొందరు వాక్యంలో యితరులకంటే ఎక్కువ సమయం గడుపుతారు. కొన్ని సమయాలలో, కొందరు నూతన స్థాయికి వెళ్ళుటకు సిద్ధంగా వుంటారు, అయితే అవసరమైన కొన్ని పనులు చేయవలసివుండుటవలన వెళ్ళలేరు. ఉదాహరణకు, దేవునితో తమ సంబంధం వృద్ధి చెందుటకు ముందుగా వారు కొందరిని క్షమించవలసి వుంటుంది. లేక, ఒక వ్యక్తి, వ్యక్తిగతంగా లేక పరిచర్యలో సాహసవంతమైన అవకాశాన్ని పొందుటకు ముందుగా దేవుని ప్రేమ యొక్క లోతైన ప్రత్యక్షతను పొందవలసివుంటుంది. నిర్లక్ష్యంగా, మనందరం ఒక చోట ప్రారంభించి, మరొకచోటికి వెళ్తాము. మనం ఎక్కడున్నా కూడా మొదలుపెట్టి, ఎదుగుటక ఆయన సహాయపడతాడు.

ప్రార్థన అభివృద్ధికరమైనది, మనము ఒక స్థాయి నుండి మరొక స్థాయికి వెళ్ళవలసినది. ఎవరూ ప్రార్థనలో ఎప్పటికీ "పట్టభద్రులు" కాలేరు. ఎందుకంటే దేవునితో మన సంబంధం యొక్క లోతునకు హద్దులు లేవు అది లోతుగాను, మరింత బలంగాను ఎదుగుతూనే వుంటుంది. మన ప్రార్థించు సామర్థ్యము ఎక్కువగా మారుతుంది. మనం ప్రార్థనలో ఎప్పటికీ "పట్టభద్రులు" కాలేము, దేవునితో సంభాషించుట నేర్చుకొనుటను ఆపలేము మన అనుభవం గొప్పగా, ఉత్తమంగా మారుతూనే వుంటుంది.

మనం ప్రార్థనలో ఎప్పటికీ "పట్టభద్రులు" కాలేము, దేవునితో సంభాషించుటను నేర్చుకొనుటకు ఆపలేము మన అనుభవం గొప్పగా, ఉత్తమంగా మారుతూనే వుంటుంది.

నీవు నీ అంతిమ లక్ష్యానికి చేరకపోవచ్చును, కాని, నిన్ను అక్కడకు తీసుకొని వెళ్ల మార్గంలో నీవున్నందుకు దేవునికి వందనాలు చెల్లించవచ్చును. నీవు అభివృద్ధి చెందుతున్నంత కాలం నీవు ప్రాకుతున్నా, నడుస్తున్నా, పరుగెడుతున్నప్పటికీ, నేర్చుకుంటూనే వుండు.

## సారాంశం

మనం కేటాయించిన సమయాన్ని ఆనందించాలని దేవుడు కోరుకుంటున్నాడు, అయితే, మనకొరకు యింకా ఎక్కువ కలిగియున్నాడు! నిరంతరంగా చిన్న, సులువైన ప్రార్థనలు ప్రార్థించాలని దేవుడు కోరుతున్నాడు. మనం ప్రార్థనా జీవితాన్ని కలిగివుండి, దినమంతా మన మార్గంలో ప్రార్థించాలని దేవుడు కోరుతున్నాడు. మన హృదయాలు సున్నితంగా వుండి, ఆయన చేసిన ప్రతి కార్యానికీ "వందనాలు ప్రభువా" అని చెప్పాలని ఆయన యిష్టపడుతున్నాడు. మన దయనొందిన జీవిత క్రియలు చేస్తుండగనే, మనకు ప్రతి పరిస్థితిలో అవసరమైన ప్రతి దానినీ అడగాలని ఆయన ఆసక్తితో ఎదురుచూస్తున్నాడు. దేవుడు మనలను ప్రేమిస్తున్నాడు. అన్ని సమయాలలో ఆయన సన్నిధిని గుర్తెరగాలని కోరుతున్నాడు మనము ప్రార్థనను జీవిత మార్గంగా చేసుకొనునట్లుగా, నిరంతర సంభాషణ కలిగివుండాలని ఆశపడుతున్నాడు.

ప్రభావవంతమైన ప్రార్థనను నేర్చుకొనుటను మనం ఎప్పుడూ ఆపలేము, అలాగే దేవునితో సంభాషించుటలోని ఉన్నతత్వమును గ్రహించుటకు ఆపలేము. మనలను నడిపించునట్లు పరిశుద్ధాత్మని మనం ఆహ్వానించినపుడు, మన ప్రార్థనా జీవితాలు మరింత లోతుగా, ఆసక్తికరంగా, మరింత ప్రభావవంతంగా మారుతాయి. ప్రార్థన అనునది అభివృద్ధికరమైనది గనుక మనం సాగిపోచుండగా ఎదుగుతాము. మనం పరిశుద్ధాత్మునికి సులువుగా స్పందిస్తూ, దేవుని ప్రార్థనలు ప్రార్థిస్తూ, ఆయన నిర్దేశకత్వంలో మార్పులు చేసుకుంటున్నట్లయితే, మనలను ఆయన ఆత్మీయ జీవితపు పరిణితిలోని నూతన ప్రదేశాలకు తోడుకొనిపోయి, ప్రార్థనాసన్నిహితత్వంలోని నూతన స్థాయిలకు నడిపిస్తూనేవుంటాడు.

### ప్రార్థనాంశములు

- మనం "అన్ని సమయాలలో, అన్ని సందర్భాలలోను, ప్రతి పరిస్థితిలోను" ప్రార్థించవలసియున్నది. మనం ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రార్థించవచ్చును, మరియు ప్రార్థన అనునది ఊపిరి పీల్చుటంత సులువైనదై వుండాలి.
- *నేను ప్రార్థించునపుడు ఫలానా – ఫలానా వాటి గురించి ప్రార్థించాలి* అని తలంచుట, సాతాను యొక్క యుక్తియైవున్నది. యితర ప్రార్థనలన్నిటి వలెనే దేవుడు స్వల్పమైన, నిజాయితీ కలిగిన, తక్షణమే చేసే ప్రార్థనలు కూడా వింటాడు.

- మనలో అనేకులం తీరిక లేని జీవితాలు కలిగివున్నాము, అయితే యితర విషయాల మధ్యలో మనం ప్రార్థించవచ్చును. మనకు కలిగిన ఎక్కువ సమయాన్ని మనం ఉపయోగించుకోవలసియున్నది.
- మనం "ఆత్మలో" కూడా ప్రార్థించవలసియున్నది. అంటే మన ప్రార్థనలకు బదులుగా, దేవుని ప్రార్థనలు ప్రార్థిస్తూ, మనలను నడిపించునట్లుగా పరిశుద్ధాత్ముని ఆహ్వానించుటయే.
- ప్రార్థన అభివృద్ధికరమైనదని జ్ఞాపకముంచుకోండి. మన ప్రార్థనా జీవితములో ఏదైనా కోల్పోయామని అనిపిస్తున్నప్పుడు, దేవుడు మనలను పరిణితిలోను, విశ్వాసంలోను, లేక ప్రార్థనలోని ప్రభావంలోను నూతన స్థాయికి తీసికొని వెళ్లుటకు యిష్టపడుతున్నాడని అర్థం.
- మనం ప్రార్థించాలని, ఆ ప్రార్థనలో ఆనందించాలని దేవుడు కోరుకుంటున్నాడు.

# 4

# ప్రార్థనా శక్తి

విశ్వమంతటిలో మనకు అందుబాటులో వున్న గొప్ప శక్తులలో ఒకటి ప్రార్థనేనని నేను నమ్ముతాను. ఇది నిర్భయమైన వివరణ, ఈ రోజులలో అందుబాటులో వున్న ఇతర శక్తుల గురించి కూడా నాకు తెలుసు, అయితే ఏ అనుమానము లేకుండా ఇది నిజమని నేను ఒప్పింపబడ్డాను. అణు శక్తిని గురించి మనము ఆలోచించినపుడు మనము ఊహించగలిగినంతకంటే ఎక్కువ వేగాన్ని మనము ఆలోచిస్తాము. రహదారి మీద మోటర్ సైకిల్‌లోని ఇంధనం శక్తి గురించి మనము ఆలోచించినపుడు, మనం దాని ద్వారా కలిగే శక్తివంతమైన అపాయాన్ని గురించి కూడా ఆలోచిస్తాము.

అయితే, ఈ లోకంలో మనము ఎదుర్కొనే ఏ శక్తయినా, పరలోకంలో ఎందుకూ పనికిరాదు. అణు శక్తి ఒక పట్టణంలోని ప్రజలందరినీ తుడిచిపెట్టగలదు కాని, అది వారికి నిత్యజీవాన్నివ్వలేదు. ఒకానొకప్పుడు సాతాను శక్తి భూమిపైని రాజ్యాలన్నిటిని చూపించి తనవైపుకు త్రిప్పుకుంది, అయితే యిది పగిలిన హృదయాలను ఎన్నటికీ బాగుచేయలేదు. ఇంధనపు శక్తి ప్రపంచంలో మనల్ని ఎక్కడికైనా తీసికెళ్తుంది. అయితే అది మన జీవితాలలో ఆత్మీయ అభివృద్ధికి లేక దేవుని వైపు నడవటానికి ఏ మాత్రం సహాయపడదు. ఈ భౌతిక లోకంలో మనకు తెలిసిన శక్తులు సహజమైనవి, అయితే ప్రార్థనా శక్తి ఆత్మీయమైనది. ఇంతకు ముందు నేను చెప్పిన విధంగా ప్రార్థన అనేది దేవుడు పని చేయుటకు ద్వారాన్ని తెరుస్తుంది. మన జీవితాలలో జ్ఞానము, నిర్దేశకత్వము, ప్రోత్సాహము లేక ఒక అద్భుతమైన మలుపు కలుగునట్లుగా మనకు పరలోకపు శక్తి అవసరమైనప్పుడు ఈ భూమిపై నుండి మనము చేయగలిగిన క్రియ ప్రార్థనే. మన జీవితాలలో సర్వశక్తివంతుడైన దేవుని శక్తిని విడుదల చేసేది-ప్రార్థన. ప్రార్థనాశక్తి దేవునిశక్తితో మనలను కలుపుతుంది-అందుకే ఇది మనము ఊహించిన వాటన్నిటికంటే గొప్ప శక్తియైయున్నది.

ప్రార్థనా శక్తి మాత్రమే దేవుని చేతిని కదిలించగలదు. దేవుని శక్తి మాత్రమే ఒక వ్యక్తి హృదయాన్ని మార్చగలదు, బంధకాల నుండి హింసల నుండి ఒక వ్యక్తిని విడుదల చేయగలదు, నిరాశ, నిస్పృహలను మార్చివేయగలదు, వ్యసనాన్ని త్రుంచి వేయగలదు, లేక ఒక వ్యక్తి యొక్క ఉద్రేకాలను స్వస్థపరచగలదు. దేవుని శక్తి మాత్రమే శాంతిని తేగలదు, సంతోషాన్ని నింపగలదు, జ్ఞానాన్ని అనుగ్రహించగలదు, జీవితంలో ఏమి చేయాలో దిక్కుతోచని వ్యక్తిలో ఉత్సాహాన్ని ఒక లక్ష్యాన్ని నింపగలదు, మరియు ప్రతి విధమైన అద్భుతాన్ని చేయగలదు. భార్యాభర్తలిద్దరూ చాలా కోపపడి, బాధపడి, విడాకులు మాత్రమే మార్గమనుకొను వైవాహిక జీవితంలో తిరిగి సన్నిహితత్వాన్ని, నమ్మకాన్ని నింపగలిగినది దేవునిశక్తి మాత్రమే. నిజానికి సంయుక్తరాష్ట్రాలలో విడాకులు తీసుకునేవారు 50 శాతం మంది, అయితే ఆ జంటలు తమ గృహంలో కలిసి ప్రార్థన చేసినట్లయితే, ఆ శాతం 3 అవుతుంది? అది దేవునిశక్తికి, ప్రార్థనాశక్తికి, ఒక సాక్ష్యమైయున్నది.

అద్భుతమైన, ఆశ్చర్యమైన దేవుని శక్తి–విశ్వమంతటిలోని అతి గొప్ప శక్తి–మన జీవితాలలో ఒక సులువైన, శక్తి–నిండిన ప్రార్థన వలన విడుదలవుతుంది. ఎందుకంటే మనం ప్రార్థించగలము, మనము అసాధారణ శక్తి కలిగిన సాధారణ మనుష్యులము, అసామాన్య జీవితాలు జీవించు సామాన్య మనుష్యులము. ప్రార్థన ద్వారా మాత్రమే సాధ్యమైన, దేవుని శక్తితో సంబంధాన్ని కలిగియున్నంత కాలం–మనం ఎప్పటికీ జయించలేమని తలంచిన సమస్యలని మనం జయించగలం, మనము చేస్తామని ఎవ్వరూ నమ్మని పనిని మనము చేయగలం, మనము జ్ఞానవంతమైన నిర్ణయాలు తీసుకోగలం, మన జీవితాలలోని పెద్ద, పెద్ద సవాళ్ళలో జయకరంగా నడవగలం.

ఎందుకంటే మనం ప్రార్థించగలము,
మనము అసాధారణ శక్తి కలిగిన సాధారణ
మనుష్యులము, అసామాన్య జీవితాలు
జీవించు సామాన్య మనుష్యులము.

## ప్రార్థన దేవునిశక్తిని విడుదల చేస్తుంది

మనందరి జీవితాలలో దేవుని యొక్క శక్తి అవసరమైయున్నది, కొన్నిసార్లు నాటకీయంగా కూడా దేవునిశక్తిని విడుదల చేసే బలము ప్రార్థనే. దీనికి బైబిలులోని ఒక ఉత్తమమైన ఉదాహరణ యూదారాజైన యెహోషాపాతు కథ, 2వ దినవృత్తాంతములు 20లో– మోయాబీయులు, అమ్మోనీయులు, మెయోనీయులు – యెహోషాపాతుపై యుద్ధమునకు

వచ్చియున్నారు. ఈ రాజ్యాలు “గొప్ప సైన్యంగా” యూదాకు విరోధముగా కూడి వచ్చినపుడు, యెహోషాపాతు రాజు భయపడినాడు, అయితే, అతను ఉపవాసముండి, ప్రార్థించ మొదలుపెట్టినాడు, తన ప్రజలైన యూదావారిని కూడా యిదే విధంగా చేయమని చెప్పినాడు. దేవుని ఆత్మ యెహజీయేలుపైకి వచ్చి అతను ఈ విధంగా ప్రవచించినాడు: “యూదావారలారా, యెరుషలేము కాపురస్థులారా, యెహోషాపాతురాజా, మీరందరును ఆలకించుడి యెహోవా సెలవిచ్చున దేమనగా–ఈ గొప్ప సైన్యమునకు మీరు భయపడకుడి, జడియకుడి, ఈ యుద్ధము మీరు కాదు దేవుడే జరిగించును. రేపు వారి మీదికి పోవుడి వారు జీజు అను ఎక్కుడు మార్గమున వచ్చెదరు, మీరు యెరూవేలు అరణ్యము ముందర నున్న వాగుకొన దగ్గర వారిని కనుగొందురు. ఈ యుద్ధములో మీరు పోట్లాడవలసిన నిమిత్తం లేదు యూదా వారలారా, యెరుషలేము వారలారా, మీరు యుద్ధపంక్తులు తీర్చి నిలువబడుడి మీతో కూడ నున్న యెహోవా దయచేయు రక్షణను మీరు చూచెదరు భయపడకుడి జడియకుడి రేపు వారి మీదికి పోవుడి, యెహోవా మీతో కూడ ఉండును” (2వ దినవృత్తాంతములు 20:15–17).

ఉపవాసముండి ప్రార్థించి, దేవుని ఒక సంఘముగా వెదకి, దేవుడు జయమిస్తాడని చెప్పిన ప్రవచనమును వినిన తర్వాత, యెహోషాపాతు రాజు విజయానికి వ్యూహం అమలు చేయటం మొదలు పెట్టాడు. అతను “మరియు అతడు జనులను హెచ్చరించిన తర్వాత యెహోవాను స్తుతించుటకు గాయకులను ఏర్పరచి, వారు పరిశుద్ధాలంకారములు ధరించి సైన్యము ముందర నడుచుచు – యెహోవా కృప నిరంతరముండును, ఆయనను స్తుతించుడి అని స్తోత్రము చేయుటకు వారిని నియమించెను” (2వ దినవృత్తాంతములు 20:21). మనం ఇంకా ముందుకు వెళ్ళకముందే, ఈ స్తుతి, ఆరాధనలు కూడా ప్రార్థనలో రకాలని మీరు గ్రహించాలని కోరుచున్నాను. 5వ అధ్యాయంలో దీనిని గూర్చి ఎక్కువగా వివరిస్తాను, అయితే ప్రస్తుతం ఈ ప్రార్థనా ఫలితాలపై ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించమని కోరుచున్నాను: “వారు పాడుటకును, స్తుతించుటకును మొదలుపెట్టగా, యెహోవా యూదా వారిమీదికి వచ్చిన మోయాబీయుల మీదను, అమ్మోనీయుల మీదను, శేయీరు మన్యవాసుల మీదను మాటుగాండ్రను పెట్టెను గనుక వారు హతులైరి” (2వ దినవృత్తాంతములు 20:22).

మనం ప్రార్థించినపుడు, దేవుడు క్రియ చేస్తాడు. నేను మరల మీకు జ్ఞాపకం చేస్తున్నాను: దేవుడు పనిచేయునట్లుగా, ప్రార్థన ద్వారం తెరుస్తుంది. యెహోషాపాతు విషయంలో యూదాప్రజలు దేవుని విడుదల చూచుచుండగా, శత్రువులు కలవరపడి, తమ్మును తామే పొడుచుకుని చనిపోయారు.వారు తమ ప్రార్థనలో విశ్వాసం కలిగి వున్నారు, దాని ఫలితంగా, దేవుడు వారి పక్షాన యుద్ధం చేసి, జయించాడు. ప్రార్థనాశక్తి వారికి బలమునిచ్చింది.

## ఆధునిక అద్భుతము

మన జీవితాలలో దేవునిశక్తి ఏ విధంగా విజయాన్నిస్తుందో చెప్పే అద్భుతమైన కథ యూదా వారిది. ప్రార్థన ద్వారా దేవుని శక్తి విడుదలగుట పాతనిబంధన దినములలో వలె ఈ దినములలో కూడా యథార్థము, సాధికారమైనది. ఈ మధ్యనే నేను ప్రార్థనాశక్తి యొక్క సాక్ష్యాన్ని విన్నాను.

1999 ఏప్రిల్‌లో, కొలరాడొ, కొలంబైన్ హైస్కూల్, లిటిల్‌టన్‌లో జరిగిన భయంకరమైన, విషాదకరమైన కాల్పులు గురించి అమెరికా ప్రజలకు, ప్రపంచంలో అనేక మందికి గుర్తుండేవుంటుంది. ఆ కాల్పులలో గాయపడిన ఒక యౌవనస్తుడు, మార్క్‌టేలర్ కథనం "రాకీ మౌంటన్ న్యూస్" పత్రికలో ప్రచురించబడినది.

ఆ దినం కాల్చబడిన మొదటి విధ్యార్థి మార్క్, అతను ఆ కాల్పులు మొదలైనప్పుడు, కాఫీ త్రాగుటకు వెళ్ళి బయట వేచి నిల్చున్నాడు. మొదటి కాల్పుకు భరించలేని బాధను అనుభవిస్తూ, తన శరీరంలో నుంచి రక్తం వస్తుండగా "ఓ, నాదేవా, నాకు సహాయం చేయి!" అని అరవటం తనకు జ్ఞాపకం వుంది. కాల్పులు ముగిసే సమయానికి అతని వీపుపై రెండు సార్లు, ఛాతీపై ఐదు సార్లు కాల్చబడ్డాడు, అవి అతని ప్లీహాన్ని చీల్చుతూ అతని గుండెకు ఎడమవైపున్న రక్త నాళం వెనుక దిగబడ్డాయి. "నేను కష్టంగా ఊపిరి పీల్చేంత, బాధపడ్డాను" అని మార్క్ గుర్తుచేసుకున్నాడు. కాల్చేవారి నుంచి తప్పించుకొనుటకు పరుగెడుతూ అనేక మంది విద్యార్థులు అతని శరీరాన్ని తొక్కుట అతనికి జ్ఞాపకముంది, అతను చనిపోయాడని వారనుకున్నారు. "ఎవరూ నాకు సహాయం చేయుట లేదు" "అయితే దేవుడు నాకు సహాయంచేశాడు" అని మార్క్ చెప్పాడు.

దగ్గరలో వున్న హాస్పిటల్‌కు అంబులెన్స్‌లో తీసుకు వెళ్తుండగా, చనిపోతానేమోనని మార్క్ భయపడ్డాడు. "దేవా నన్ను రక్షించమని నేను ప్రార్థించాను, ఆయన నాకు జవాబిచ్చాడు. ఆ క్షణమే, నా ప్రాణాన్ని దేవుడు కాపాడుతున్నాడని నాకు నిశ్చయత కలిగింది" అని మార్క్ చెప్పాడు.

మార్క్‌కు చికిత్స చేస్తున్న వైద్యుడు "నేనొక శవాన్ని చూస్తున్నానని" అనటం, మార్క్ కుటుంబవైద్యుడు జ్ఞాపకం చేసుకున్నాడు. కాని అది కాదు విషయం. దేవుడు మార్క్ ప్రార్థనలను విన్నాడు, ఆ శస్త్రచికిత్స కొంతకాలం ఆస్పత్రిలోవున్న తరువాత, మార్క్ కోలుకున్నాడు.

## ఈ దినాలలో ప్రార్థనాశక్తి

ప్రార్థన యొక్క శక్తి గురించి మార్క్ వంటి వారి కథలు చదవటం, వినటమే కాకుండా, నా జీవితంలో, కుటుంబంలో, ఇంకా నేను లెక్కపెట్టలేనంతమంది యితరుల జీవితాలలో

క్రియారూపంగా చూశాను. అనేకసార్లు, సమావేశాలలో, టెలివిజన్ ప్రసారాలలో, ప్రేక్షకుల అవసరాల కొరకు ప్రార్థించాను. ప్రతి వ్యక్తి పరిస్థితిని గూర్చి నేను పూర్తిగా తెలుసుకోనవసరం లేదు కేవలం వారి అవసరతలు, వారికేది ఉత్తమమో దేవుడు ఎరిగివుంటాడన్న నమ్మకంతో నేను ప్రార్థిస్తాను. మేము ఫోన్ ద్వారా, వెబ్‌సైట్ ద్వారా అనేక ప్రార్థనా అవసరతలు అందుకుంటాము, మా ప్రార్థనా టీమ్ వాటికొరకు ఎంతో శ్రద్ధగా ప్రార్థిస్తారు. అనేక సంవత్సరాలుగా ఆశ్చర్యకరమైన కథనాలు మేము విన్నాము. వాటిలో కొన్నింటిని ప్రార్థనా శక్తికి సాక్ష్యాలుగా మీతో పంచుకోవాలనుకుంటున్నాను:

- ఈ మధ్యనే జరిగిన మా స్త్రీల కూడికకు హాజరుకాక ముందు సూజీ డాక్టర్ వద్దకు వెళ్లింది. అతను పరీక్షించి, ఆమె గాలబ్లాడర్‌లో రాళ్లున్నాయని చెప్పాడు. ఆ కూడికలో నేను దేవుని స్వస్థత కొరకు ప్రార్థించాను. సూజీ యింటికి వెళ్లి మరల అవే పరీక్షలు చేయించుకున్నప్పుడు ఆ రాళ్లు కనబడలేదు.

- ఆదాయము లేక నిరాశలోనున్న ఒక స్త్రీ కొరకు మా ప్రార్థనా సభ్యుడు ఫోన్‌లో ప్రార్థించినాడు. ఆమె ఎన్నో సంవత్సరాలుగా ప్రేమించిన ఉద్యోగంలో స్వచ్ఛందంగా పనిచేస్తున్నది. ఆమె గురించి మేము ప్రార్థించినపుడు అదే ఉద్యోగం ఆమెకు ఆదాయముతో వచ్చియున్నది.

- 25 సంవత్సరాలుగా పొగ త్రాగుటకు అలవాటుపడిన ఒక స్త్రీ, చివరగా మా కూడికలలో ఒకదానికి హాజరైన తరువాత మానివేయగలిగినది.

- డెనైస్ నాలుగు సంవత్సరాలుగా తిన్నగా నిలువబడలేకపోయేది, భయంకరమైన బాధను అనుభవిస్తుండేది. ఒక టెలివిజన్ కార్యక్రమంలో నేను స్వస్థత కొరకు ప్రార్థించుట వినిన తర్వాత, ఆమె నిద్ర పోయింది. నిద్ర లేచినపుడు ఏ నొప్పి అనిపించలేదు, లేచి నిలువబడినపుడు, తిన్నగా నిలువబడగలిగింది.

- తమ భార్యభర్తలిద్దరి వద్ద డబ్బులు లేనందు వలన బాగా కలవరపడిపోయి మేరీ ప్రార్థనా సహాయానికై ఫోన్ చేసింది, అతనికి ఈ మధ్యనే ఉద్యోగం వచ్చింది, అయితే ప్రతి రోజూ 100 మైళ్ళకంటే ఎక్కువ దూరం కారు నడపవలసివచ్చేది, అతను ఉద్యోగంలో చేరిన కొద్దిరోజులకే కారు ఇంజను పాడైపోయింది. అది బాగు చేయించుకొనుటకు వారి యొద్ద డబ్బులు లేవు. వారి గురించి మా ప్రార్థనా సభ్యులందరు కలసి ప్రార్థించిన ఒక గంటకే ఆమెకు తమ కంపెనీ నుండి ఫోన్ వచ్చింది. వారు డబ్బు లెక్క చూచిన్నప్పుడు తేడా వచ్చిందని దాని వలన యింకనూ వారికి రావలసివున్న 1,200 డాలర్లు ఇప్పుడు పంపిస్తున్నామని చెప్పారు.

- ఒక పెద్ద కారు యాక్సిడెంట్‌లో తగిలిన దెబ్బల వలన తన మనుమడు చనిపోయే స్థితిలో వున్నాడని విక్టోరియా మా ప్రార్థనాకూటానికి ఫోన్ చేసింది. మేము

ప్రార్థించునపుడు ఆమె తన మనుమడి హాస్పిటల్ రూమ్ బయట నిలువబడి డాక్టర్లు అతనికి పెట్టిన ట్యూబ్‌లు తీసివేయుట చూస్తూవుంది. తర్వాత ఆమె మరలా ఫోన్ చేసి తన మనుమడు ఆశ్చర్యంగా బాగైనాడని చెప్పింది.

- ఒకామె తన యవ్వనస్థుడైన కుమారుని గురించి ప్రార్థించమని మాకు వ్రాసింది. అతడు కషింగ్స్ అనే వ్యాధితో బాధపడుతూ 6 సంవత్సరముల నుండి చికిత్స పొందుతున్నాడు. ఆ తల్లి ప్రార్థించిన తర్వాత, మా ప్రార్థనా టీమ్ ప్రార్థించిన తర్వాత, తన కుమారునిలో ఆ వ్యాధి ఛాయలు కనబడుట లేదని డాక్టర్స్ చెప్పారని ఆమె మరియొక ఉత్తరం వ్రాసింది.

జాయిస్ మేయర్ సేవకు వచ్చినవారిలో గుర్తుంచుకొనదగిన సాక్ష్యాలలో మరికొన్నింటిని మీతో పంచుకోవాలనుకుంటున్నాను, మీ విశ్వాసాన్ని బలపరుస్తుందని మీ ప్రార్థనా జీవితము ఎదుగుదలకు గొప్ప ప్రోత్సాహకరంగా వుంటుందని నేను నమ్మువాటిలో ఒకటి.

*నా తల్లి గర్భాశయపు క్యాన్సర్‌తో బాధపడుతుంది. మేము డాక్టర్‌ని కలిసినపుడు ఆమెకు మూర్ఛ మరియు కోలోస్టమీ (ఒక క్యాన్సర్ ఆమె పేగులలో చేరుతుంది) లకు కూడా అవకాశం వుందని తెలిసింది. ఆమె కోసం ప్రార్థించమని నేను మీకు వ్రాశాను. మీరు నాకు ఆమె కొరకు ప్రార్థించుటకు ప్రార్థనాగుంపులు వున్నాయని చక్కని బదులు వ్రాశారు. న్యూయార్క్ నుంచి మియామి వరకు వున్న నా స్నేహితులందరిని నేను సహాయం అడిగాను. నా భర్త మరియు సహోదరి కూడా తమ స్నేహితులందరినీ ప్రార్థించమని అడిగారు. దేవుడు నా చిన్న ప్రార్థనకు జవాబిస్తాడని నాకు తెలిసినప్పటికీ, అనేక స్వరములు పరలోకంలో వినబడి, ఆయన వింటాడను నిశ్చయతనివ్వాలని నేను ఆశించాను.*

*శస్త్రచికిత్స చేసే రోజు, ఆమెను తీసుకు వెళ్ళేముందు నేను ప్రార్థించవచ్చా, అని ఆస్పత్రి సిబ్బందిని అడిగాను. వారు అంగీకరించారు. నా తల్లిదండ్రుల సమక్షంలో నేను ఆ సిబ్బందికి "వారి చేతులకు నైపుణ్యాన్ని, హృదయాలకు కనికరాన్ని, మనుష్యులకు జ్ఞానాన్నివ్వమని" అడిగాను, తాము ప్రేమించిన వారి వలె నా తల్లిని చూచుకొనునట్లు చేయమని కూడా దేవుని అడిగాను. ఆసమయం వరకు నేను ధైర్యంగావున్నాను. అయితే తరువాత నేను ఏడ్చాను. అప్పుడు ఆమెను ఆపరేషన్‌కు తీసికొని వెళ్ళారు.*

*ఆపరేషన్ అయిన రెండుగంటల తర్వాత, డాక్టర్ బయటకు వచ్చాడు. ఆయన నన్ను, నా తండ్రిని సమావేశపు గదిలోకి రమ్మన్నాడు. ఆ సమయంలో మమ్మల్ని భయం ఆవరించింది.*

*మేము కూర్చున్నాము, ఆ డాక్టర్ తన జుట్టులోనికి వ్రేళ్ళుపోనిచ్చాడు. ఆయన సూటిగా కళ్ళలోకి చూస్తూ చెప్పిన ఈ మాటల్ని నేను జీవితాంతం మరచిపోలేను*

*"నేను ఏ క్యాన్సర్‌ను కనుగొనలేకపోయాను. నేను ప్రతిచోట చూశాను అది దాగి వుంటుందనుకున్న ప్రదేశాలను విప్పి చూశాను ఆ క్యాన్సర్ కణితి ఎక్కడుందో నేను కనుగొనలేకపోయాను.*

ఆ ఉత్తరం ఇంకా ఈ విధంగా చెప్తుతుంది, మామూలుగా బాధాకరమైన ఆపరేషన్ స్త్రీకి ఎక్కువ బాధనివ్వలేదు, మూడు దినాలలో ఆమె ఆస్పత్రి నుంచి బయటకు వచ్చినది. ఇది నిజంగా ప్రార్థనాశక్తిని గూర్చిన అద్భుతకరమైన సాక్ష్యం.

మా పరిచర్యకు ఫోన్ చేసేవారు, ప్రార్థనా అవసరతలు పంపేవారు, కూడికలకు హాజరయ్యే వారు, టెలివిజన్ ప్రసారాలు చూసేవారు అందరూ నీ వలె నా వలె మామూలు మనుష్యులు. వారి పరిస్థితులు నీ వలె, నా వలె నిజమైనవి. అధిగమించలేని ఆటంకాలవలె కనిపించు పరిస్థితుల మధ్యలో ప్రార్థనాశక్తి వారి జీవితాలలో మార్పు కలుగజేసింది ప్రార్థనా శక్తి నీ జీవితంలో కూడా మార్పు కలుగజేస్తుంది. ప్రార్థన అనేది మన జీవితాలలోని పరిస్థితులు భరించునట్లుగా దేవుని శక్తిని తెస్తుంది, దేవుని యొక్క శక్తి ఒక పరిస్థితిని తాకినప్పుడు, అది తప్పకుండా మారుతుంది.

> ప్రార్థన అనేది మన జీవితాలలోని పరిస్థితులు భరించునట్లుగా దేవుని శక్తిని తెస్తుంది.

## పట్టుదలలోని శక్తి

అనేక మార్లు, "శక్తి" అనగానే, అద్భుతమైన వేగంతో, ఒత్తిడితో జరుగునదని ఊహిస్తాము. వెంటనే లేక నాటకీయంగా ఫలితాలు వస్తాయా, రావా అన్నదాని ననుసరించి ప్రార్థన యొక్క శక్తి నిర్ణయించబడదు. నిజానికి, ఈ పుస్తకంలో నేను తరచుగా చెప్పిన యాకోబు 5:16. "ఆసక్తి తోకూడిన "నమ్మకమైన (హృదయ పూర్వక, నిరంతర) ప్రార్థన" మనము చేయునట్లుగా ఒక రకమైన అధ్భుత శక్తి, మనకు అందుబాటులోకి వస్తుందని ఈ పుస్తకములో నేను తరచుగా చెప్పింది మనకు బోధిస్తుంది. నమ్మకమైన, విశ్వాసపూరితమైన ప్రార్ధనలు ప్రార్ధనకు

> వెంటనే లేక నాటకీయంగా ఫలితాలు వస్తాయా, రావా అన్నదానిని బట్టి ప్రార్థన యొక్క శక్తి నిర్ణయించబడదు.

అవసరము. మరియు మనము ఏదో ఒకటి చేయుట ద్వారా మన ప్రార్థనకు, దేవుడు ఎప్పుడైనా స్పందించవచ్చును, అది చుట్టు ఉన్నవారికి దాని శక్తిని సాక్షమిచ్చుటకు పూర్తిగా అసాధ్యంగా వుంటుంది.

సంవత్సరాల క్రితం, నాకు డేవ్‌తో పెళ్ళైన కొత్తలో–చిన్న బిడ్డగా, యౌవ్వనస్తురాలిగా నేను పొందిన బాధవలన ఏర్పడిన నా వ్యక్తిత్వాన్ని డేవ్ అర్థం చేసుకొనలేకపోయాడు, ఎందుకంటే, నాతో సంబంధం కలిగి ఉండటం చాలా కష్టం. డేవ్ తరచుగా–నన్ను మార్చుమని, మా వివాహానికి కట్టుబడి వుండే సహనం తనకివ్వమని ప్రార్థిస్తూ దేవునితో ఒంటరిగా గడిపేవాడు. తనకేంచేయాలో తోచేదికాదని, ప్రార్థించిన తర్వాత నాలో చిన్న మార్పులు చూడటం మొదలు పెట్టానని డేవ్ నాతో పంచుకున్నాడు, సమయం గడిచే కొలది, తన ప్రార్థన యొక్క శక్తివంతమైన ఫలితాలని చూశాడు. నా ఆవేశాన్ని స్వస్థపరచుట ద్వారా దేవుడు నన్ను మార్చుట మొదలుపెట్టాడు. ఈ దినం ఆయన నన్ను పూర్తిగా రూపాంతరం చెందించాడని నేను నిజాయితీగా చెప్పగలను.

డేవ్, నిరాశచెంది వదిలివేయాలనుకున్న సమయాలు కూడా వున్నాయని నేను ఖచ్చితంగా అనుకుంటాను. నా గురించి నిత్యము ప్రార్థించటం కష్టమైనప్పటికీ, అతను ప్రార్థిస్తూనే వున్నాడు, అభివృద్ధి కన్పించకపోయినప్పటికీ ప్రార్థించాడు. అతను పట్టుదలకలిగిన ప్రార్థన యొక్క శక్తిని తెలుసుకొన్నాడు, మరియు అతని ప్రార్థనలు నా జీవితంలో మార్పును కలుగ జేశాయి. నా గురించి, మా పరిస్థితిని గురించి డేవ్ బలంగా నిలువబడి ప్రార్థించక పోయినట్లయితే, ఈ దినం నేను ఈ పరిచర్యను కలిగి వుండేదానని నేననుకోవటంలేదు.

నీవు ఎవరి గురించి అయినా, ఏ పరిస్థితి గురించి అయినా రోజులు, నెలలు, సంవత్సరాల నుంచి ప్రార్థిస్తున్నప్పటికీ వెంటనే నీవు ఫలితాలు చూడకపోయినా, నీ తరుపున దేవుడు పని జరిగిస్తున్నాడన్న నిశ్చయత కలిగివుండు. ప్రార్థన శక్తివంతమైనది జవాబులు చాలా ఆలస్యంగా వస్తున్నట్లు కన్పించినప్పటికీ, నీ జీవితంలో మరింత నిరాశాపూరితంగా కన్పిస్తున్న పరిస్థితులను దేవుడు మార్చుటకు ప్రార్థనా ద్వారం తెరువగలదు.

సంవత్సరాల క్రితం, మరియొక కుటుంబ సంఘటనలో, నా పెద్ద కుమారుడు డేవిడ్ జీవితంలో నేను కోరుకున్నది మలుపు చూచు వరకు నేను చాలా ప్రార్థించాను. అనేక సంవత్సరాలవరకు డేవిడ్, నా యొక్క “మాట వినని” కుమారుడు, మా వ్యక్తిత్వాలు ఒకరికొకరికి ఇష్టం కలిగించేవి కాదు, డేవిడ్ నేను ఏమి చేసినా వ్యతిరేకిస్తున్నాడని అనుకునే దానను. అతను వెంటనే కోపపడేవాడు, సంతోషపరచుట కష్టము, చాలా అసంరక్షణగా భావించేవాడు. నేను, డేవ్ ఎప్పుడు తనను ప్రేమిస్తున్నామని ఎల్లప్పుడూ చూపించాలని కోరేవాడు.

అతను పెద్దవాడయే కొద్దీ, మరింత కష్టంగా తయారయ్యాడు. అతనికి మంచి మనస్సు వున్నది, కాని అతడు శారీరకంగా మూర్ఖుడు! అతను మాతో కలసి పని చేశాడు, అదే మా

సవాళ్ళను పెంచింది, ఎందుకంటే మేము అన్ని సమయాలలో కలిసే వున్నాము. అతనిలో మార్పు చెందవలసియున్నదని నాకు తెలిసిన అనేక విషయాల గురించి నేను ప్రార్థించాను. కొన్ని సమయాలలో, నేను కొన్ని ఫలితాలను చూశాను, అయితే, అతను తిరిగి వెనుకకు వెళ్ళేవాడు వివిధ సందర్భాలలో, నేను, డేవ్ అతనిని కూర్చుండబెట్టి, కఠినంగా తప్పు సరిదిద్దేవారము. అలా చేసినప్పుడు, కొంతకాలం మారేవాడు, అయితే మళ్ళీ అంతా మామూలే. సరిగ్గా చెప్పాలంటే, నేను ఒకప్పుడు ఎలా వున్నానో, అనేక విషయాలలో అతను కూడా అలానే వున్నాడు, అయితే, దేవుడు నా జీవితంలో కార్యము చేస్తూ నన్ను మార్చుకున్నాడు గనుక నేను ఎక్కువగా కష్టపడుతూ అతనితో సహనంగా వుండటానికి ప్రయత్నించాను.

ఒక రోజు నా సహనం చనిపోయి, మేము కలసి పని చేయటం కుదరదనే నిర్ణయానికి రావటం నాకు గుర్తుంది. మేము తల్లి–కొడుకు సంబంధంలో కొనసాగాలంటే, ఇలా రోజంతా కలసి పని చేయటం ఆపి వేయాలని అనుకున్నాను. నేను ప్రార్థించుటలో విసిగి, ఈ విషయంలో నా చేతులు కడుగుకోవాలనుకున్నాను. ప్రాముఖ్యంగా అతను మారుతాడన్న ఆశ వదిలివేసుకుని, ఆ పరిస్థితిని ఎక్కువ కాలం భరించలేననుకున్నాను. నిస్సహాయంగా కనిపిస్తున్న పరిస్థితులలో కూడా, ప్రార్థన శక్తివంతమైనదని నేను మర్చిపోయాను.

నేను అతనితో మాట్లాడుటకు పనికి వెళ్తుండగా, దేవుడు నా హృదయంతో మాట్లాడుట విన్నాను, "జాయిస్, డేవిడ్ విషయంలో ఆశ వదలవద్దు." నా హృదయానికి ఆయన సందేశం కాదనలేనిది, కాబట్టి నేను ప్రార్థనలో, వేచియుండుటలో గడపవలసియున్నదని నేను గ్రహించాను.

> దేవుడు ఏమి చేయుటకైనా సమర్థుడు ఆయనకు సమస్తము సాధ్యమే, అయితే మనం ప్రార్థించుట ఆపకూడదు.

చివరికి, డేవిడ్ మార్పు చెందాడు, ఒక్క రాత్రిలో ఇది జరుగలేదు, కానీ మనందరివలెనే కొద్ది కొద్దిగా మారాడు. ఇప్పుడు మేము మంచి బంధుత్వంతో సంతోషిస్తూ, దేవుని సేవా పరిచర్యలో కలిసి పనిచేస్తున్నాము, మా "వరల్డ్ మిషన్ ప్రోగ్రామ్" లో డేవిడ్ సి.ఇ.ఒ గా చాలా అద్భుతంగా పనిచేస్తున్నాడు. మేము కలసి ప్రయాణించాము మరియు కొన్ని సార్లు మేము ఇద్దరం సమయం వచ్చినప్పుడు, ఎంత ఎక్కువ స్థిరత్వము ఉండగలదో అంత ఎక్కువగా, రెండు మూడు వారాలపాటు గడిపేవారము, కానీ ఒక చిన్న మనస్పర్థ కూడా మా మధ్య వుండదు.

దేవుడు ఏమి చేయుటకైనా సమర్థుడు ఆయనకు సమస్తము సాధ్యమే, కాని మనం ప్రార్థించుట ఆపకూడదు. కొన్ని ప్రార్థనలకు వెంటనే జవాబు వస్తాయి, కొన్నింటికి సమయం పడుతుంది. నిన్ను బాగా బాధపెట్టే బిడ్డ గానీ, నీవు ప్రార్థించి, ప్రార్థించి విసిగిపోయిన పరిస్థితిగానీ నీకున్నట్లయితే, సొమ్మసిల్లవద్దు, ఆశ వదలవద్దని నేను మిమ్మల్ని ప్రోత్సాహపరుస్తున్నాను. నేను ఆ రోజున ఆశ వదలనందుకు, ఇప్పుడు సంతోషపడుచున్నాను. నీవు కన్నీళ్ళతో విత్తిన దానిని, సంతోషగానముతో కోసే రోజును నీవు చూస్తావు. దేవుని నమ్ముతూనే వుండు, ఒక గొప్ప మలుపు కొరకు నమ్ముతూనే వుండు, ప్రార్థన నిజంగా శక్తివంతమైనదని-నీవు మార్పు చూడగలవని జ్ఞాపకం చేసుకుంటూనే వుండు.

## దేవుని ప్రజలు ప్రార్థించినపుడు

మనుష్యుల జీవితాలలో ప్రార్థన యొక్క శక్తిని గురించి చదివినపుడు నీ విశ్వాసం బలపడుతుందని నేను నమ్ముతున్నాను, మరియు దేవుడు పక్షపాతి కాడని నీవు గ్రహించాలని కోరుకుంటున్నాను. ఈ పుస్తకంలో నేను వ్రాసిన వారి జీవితాలలో, దేవుడు వారి ప్రార్థనలకు ఎంత సామర్థ్యంగా ప్రవర్తించి, శక్తివంతంగా స్పందించాడో, నీ జీవితంలో కూడా అలానే చేయుటకు ఇష్టపడుతున్నాడు, సమర్థుడైయున్నాడు. ప్రార్థన యొక్క శక్తి క్రొత్తదేమీ కాదు, బైబిల్‌లో దీనిని గూర్చిన అనేక గొప్ప కథనాలను మనం కనుగొంటాము. దేవునికి ప్రార్థిస్తూ, యిర్మియా "నీకు అసాధ్యమైనదేదియు లేదు" అని సరిగ్గానే ప్రార్థించాడు. (యిర్మియా 32:17). పాత, క్రొత్త నిబంధనలు రెండింటిలో, అసాధ్యమైనదేది లేని దేవునికి ప్రజలు ప్రార్థించినపుడు ఆయన అద్భుతకరమైన మార్గాలలో వారికి జవాబిచ్చినాడు. వాటిలో కొన్నింటిని మనమిప్పుడు చూద్దాం.

### *హన్నా*

నిరాశతోనున్న పిల్లలు లేని ఒక గొడ్రాలైన స్త్రీ. ఈ దినాలలో అభివృద్ధి చెందిన వైద్యశాస్త్రజ్ఞానం ఇటువంటివారికి చాలా సహాయం చేస్తుంది, అయితే పాత నిబంధనా దినాలలో ఏ వైద్యశాస్త్రజ్ఞానం అందుబాటులో లేదు. గొడ్రాలైన స్త్రీకి ఏ విధమైన నిరీక్షణ వుండదు. కొన్ని సంవత్సరాలుగా ప్రపంచంలో అన్నింటికంటే ఎక్కువగా హన్నా ఒక బిడ్డను కోరుకుంది. ఆమె దేవుని ప్రార్థించి అసాధ్యాన్ని చేయమని అడిగే రోజు వచ్చింది. అన్నిటికీ భిన్నంగా, సమూయేలు జన్మించి, ఇశ్రాయేలులో గొప్ప ప్రవక్త మరియు యాజకుడైనాడు.

### *ఎలీషా*

చనిపోయిన వారిలో జీవాన్ని తేగలిగింది దేవుని శక్తి ఒక్కటే. 2 రాజులు 4:8-36 లో ఏలీషా ప్రవక్త ఆయన ప్రయాణంలో దయచూపించిన "షూనేమీయురాలుయైన" ఒక స్త్రీ

గూర్చి మాత్రమే చెప్పబడింది. ఆమె, ఆమె భర్త ఒక నిర్దిష్ట సమయంలో ఒక మగపిల్లవానిని కలిగివుంటారని ఎలీషా ప్రవచించాడు. అలాగే జరిగింది. అయితే, చాలా సంవత్సరాల తరువాత, ఆ చిన్నవాడు చనిపోయినపుడు ఆమె ఎలీషాను పిలచినది. ఎలీషా వచ్చినపుడు ఆ చిన్నవాడు చనిపోయాడని తెలుసుకున్నాడు. ఆ చిన్నవాని గదిలోనికి వెళ్ళి తలుపు మూసి "ప్రభువునకు ప్రార్థించెను" (2 రాజులు 4:33). మొదట, ఆ చిన్నవాని శరీరం వేడెక్కినది, తరువాత వాడు 7 సార్లు తుమ్మి, తన కళ్లు తెరిచాడు.

## హిజ్కియా

ప్రవక్తయైన యెషయా దేవుని వద్దనుండి ఒక సందేశంతో, పాత నిబంధన రాజు హిజ్కియాను కలిసినపుడు, అతడు రోగియై, చావనైయున్నాడు. "నీవు మరణమవుచున్నావు, బ్రదుకవు గనుక నీవు నీ యిల్లు చక్కబెట్టుకొనుమని యెహోవా సెలవిచ్చుచున్నాడని – చెప్పగా" (2 రాజులు 20:1). అయితే, హిజ్కియా బ్రతకాలని ఆశించాడు. కాబట్టి, అతను వెంటనే కన్నీరు కార్చుతు, పట్టుదల కలిగి ఈ విధంగా ప్రార్థించాడు : "యెహోవా, యథార్థ హృదయుడనై, సత్యముతో నీ సన్నిధిని నేనెట్లు నడుచుకొంటినో, నీ దృష్టికి అనుకూలముగా సమస్తమును నేనెట్లు జరిగించితినో, కృపతో జ్ఞాపకము చేసికొనుము". యెషయా నడిమిశాలలో నుండి అవతలకు వెళ్లకమునుపే, దేవుడు అతనితో మరల మాట్లాడి, హిజ్కియా వద్దకు మరల వెళ్లి ఈ విధంగా చెప్పమన్నాడు: "...యెహోవా నీకు సెలవిచ్చునదేమనగా: నీవు కన్నీళ్ళు విడచుట చూచితిని నీ ప్రార్థన నేనంగీకరించియున్నాను నేను నిన్ను బాగుచేసెదను." (2 రాజులు 20:5). హిజ్కియా ప్రార్థన శక్తి కలిగివున్నది. దేవుడు అతనిని కేవలం బాగుచేయటమే కాదు కాని అతనికి 15 సంవత్సరముల ఆయుష్షును ఇచ్చియున్నాడు.

## జెకర్యా

పాత నిబంధనలోని అబ్రాహాము, శారాలవలెనే, నూతన నిబంధనలో పిల్లలు లేని (పుట్టుటకు సాధ్యం కాని) వృద్ధ దంపతులు వున్నారు. నేను వైద్యశాస్త్రపరంగా పిల్లలు పుట్టుట అసాధ్యమైన వారి గురించి మాట్లాడుతున్నాను. అయితే, ప్రార్థన శక్తివంతమైనదని మనం గుర్తు చేసుకోవాలి. తన భార్య, ఎలిజిబెత్ బిడ్డను కనాలని కోరిన యాజకుడైన జెకర్యాను దూత దర్శించి " జెకర్యా భయపడకుము నీ ప్రార్థన వినబడినది, నీ భార్యయైన ఎలీసబెతు నీకు కుమారుని కనును, అతనికి యోహాను అని పేరు పెట్టుదువు" (లూకా 1:13) అని చెప్పినది. తన తల్లిదండ్రుల ప్రార్థనా ఫలితంగా జన్మించిన ఈ అద్భుతమైన బిడ్డ, యేసు రాకను ముందుగా బాప్తిస్మమిచ్చు యోహానుయే ప్రకటించిన.

## పేతురు

ప్రార్థన యొక్క ప్రత్యక్ష ఫలితంగా, 16 మంది సైనికుల కావలిలో యుండి సంకెళ్ళతో బంధింపబడిన పేతురు, చెరసాల నుండి అద్భుతంగా విడుదలైనాడు (అపొ.కా 12:4,6)

అతను చెరసాలలో ఉంచబడిన తరువాత చేయబడిన తరువాత సంఘం అతని కొరకు అత్యాసక్తితో, పట్టుదల కలిగి ప్రార్థించింది (అపొ.కా 12:5) దేవుడు వారి ప్రార్థనలు విని, పేతురును నిద్రలేపి, చెరసాల బయటకు నడిపించుటకు ఒక దూతను పంపాడు. దూత అతనిని నిద్రలేపినపుడు, సంకెళ్ళుతెగి, పడిపోయాయి. చెప్పులు వేసికొని, పై వస్త్రము తీసికొని తనవెంట రమ్మని ఆ దూత పేతురుకు సూచించాడు. ఆ సంఘటన చాలా అద్భుతమైనది. కాబట్టి, పేతురు తాను దర్శనం చూస్తున్నానని అనుకున్నాడు. అతను ఆ దూతను అనుసరిస్తూ సైనికులను, ఇనుప ద్వారాన్ని దాటి పట్టణంలోనికి అడుగుపెట్టాడు. ఆ ద్వారం తనంతట తానే తెరుచుకుంది; ఆ దూత మాయమయ్యాడు, పేతురు విడుదలనొందాడు. మనుష్యులు ప్రార్థించినపుడు, అద్భుతాలు జరుగుతాయి.

మరియొక సందర్భంలో యొప్పే అను పట్టణంలో తబిత అను ప్రియమైన స్త్రీ చనిపోయింది. ఆ ప్రజలు, పేతురు పొరుగు ఊరిలో వున్నాడని తెలిసికొని, అతని కోసం కబురు పంపగా, అతను వచ్చాడు. అతను వచ్చినపుడు, తబిత యొక్క స్నేహితులు అనేక మంది చాలా బాధపడుతూ, ఆమె గదిలో వుండుట చూచాడు. అ.కా 9:40 ఈ విధంగా చెప్తుంది: "పేతురు అందరిని వెలుపలికి పంపి మోకాళ్ళూని ప్రార్థనచేసి శవము వైపు తిరిగి–తబితా, లెమ్మనగా ఆమె కన్నులు తెరచి పేతురును చూచి లేచి కూర్చుండెను." ప్రార్థన యొక్క శక్తి గురించి మాట్లాడండి.

## యేసు ప్రార్థనల యొక్క శక్తి

ఈ అధ్యాయమును ముగిస్తుండగా, నాలో ఒకానొకదినమున దేవుడు నిజం చేసిన, నా ప్రార్థనా జీవితంలో నన్ను నిజంగా ప్రోత్సాహపరచిన సత్యాన్ని మీతో పంచుకోవాలని అనుకుంటున్నాను. అది యేసు క్రీస్తు ప్రార్థనల యొక్క శక్తిని గురించి.

నేను ప్రార్థించుటలో విసిగి, నా ప్రార్థనా జీవితంలో ఏదో సరిగా లేదని అనిపించి, చివరిగా ఒక దినం ప్రభువును "ఎందుకిలా అనిపిస్తుంది ప్రభువా? నేను ప్రతిరోజూ ప్రార్థిస్తున్నాను. రోజులో ఎక్కువ సమయాన్నే ప్రార్థనలో గడుపుతున్నాను. మరి నా ప్రార్థనాసమయం చివరలో నేనెందుకు అసంతృప్తి పొందుతున్నాను? ఇది పని చేయదని అనిపిస్తుంది నేను ఇంకా ఏమిటో చేయాలని తెలుపుతుంది. ఒకవేళ ఇంకా ఎంతకాలం ప్రార్థించాలి........" అని అడుగుతున్నప్పుడు, ప్రభువు "ఎందుకంటే నువ్వు లోపం లేని ప్రార్థనలు చేయటం లేదని నువ్వు భావిస్తున్నావు. నీ ప్రార్థనలు సరిగా లేవేమో అని, నీవు అనుకుంటున్నావు. నువ్వు సరిగా లేవేమో అనుకుంటున్నావు" అని జవాబిచ్చాడు.

నేను గ్రహించాను అదీ నిజమే. నేను "సరిగ్గా" లేనని నేను తలంచాను. నాలో నేనెల్లప్పుడు "నేను సరైనంత విశ్వాసంతో ప్రార్థించటం లేదు (లేక) నేను సరిపోయినంత సమయం

ప్రార్థించటం లేదు (లేక) నేను సరైన విషయాల గురించి ప్రార్థించటం లేదు" అనే భయాన్ని కలిగివుండేదానను.

జాయిస్ నీకు ఇది తెలుసా? నువ్వు సరిగ్గానే ఆలోచించావు, నువ్వు సంపూర్ణ ప్రార్థనే చేయటంలేదు, నువ్వు పరిపూర్ణురాలివి కాదు. అందుకనే నీకు యేసు క్రీస్తును మధ్యవర్తిగా ఉన్నాడు అను మంచి భావనను నాలో కలిగించుట ద్వారా ఆయన నాలోవున్న భయము నుండి నన్ను విడుదల చేసినాడు.

ఆయన ఇంకా ఇలా చెప్పాడు: "నీ ప్రార్థనలు నాకు చేరే సమయానికి, నేను ధృడమైన ప్రార్థనలు వింటాను, ఎందుకంటే, యేసు క్రీస్తు వాటికి మధ్యవర్తిత్వము చేయుచున్నాడు – అదే ఒక విజ్ఞాపనకర్త చేసే పని. ఆయన వాటిని ఆపుతున్నాడు వాటిని అనువదిస్తున్నాడు వాటిని మరల సరిగా అమర్చుతున్నాడు. అవి నా వద్దకు వచ్చు సమయానికి ఒక పరిపూర్ణమైన వ్యక్తి చేసిన, పరిపూర్ణ ప్రార్థనల వలె ధ్వనిస్తాయి."

నేను ఒకసారి దానిని అర్థంచేసుకున్న తరువాత, నాకు ప్రార్థన చాలా సులువుగా మారింది. ఎందుకంటే, నేను సంపూర్ణంగా లేనన్న భావననుంచి బయటపడ్డాను. నేను చేయగలిగినంత బాగా ప్రార్థనలు చేసి, యేసు వాటిని తండ్రికి అంగీకారయోగ్యంగా మార్చుతాడని నమ్ముట మొదలుపెట్టాను.

యేసు మన కొరకు ప్రార్థిస్తాడని మనకు తెలుసు. లూకా 22:32 లో ఆయన పేతురుతో "అయితే నేను నీ కొరకు ప్రత్యేకంగా ప్రార్థించాను..." అని, యోహాను 17:19 నందు తన శిష్యుల గురించి "నేను వారికొరకు ప్రార్థించాను" అని చెప్తున్నాడు. అదే అధ్యాయంలో "వారి కొరకు మాత్రము ప్రార్థించుట లేదు, వారి వాక్యము వలన నాయందు విశ్వాసముంచువారందరును ఏకమైయుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను." అని చెప్తున్నాడు. అంటే నీ గురించి, నా గురించి ప్రార్థిస్తున్నాడు (యోహాను 17:20). హెబ్రీ 7:25 "ఈయన తన ద్వారా దేవుని యొద్దకు వచ్చు వారి పక్షమున విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు, గనుక వారిని సంపూర్ణముగా రక్షించుటకు శక్తిమంతుడైయున్నాడు" అని చెప్తుంది, రోమా 8:34 "దేవుని కుడిపార్శ్వమున వున్నవాడును, మన కొరకు విజ్ఞాపనము కూడా చేయువాడును ఆయనే." అని బోధిస్తుంది. యేసు మన విజ్ఞాపనకర్త, మనకొరకు ప్రార్థించుటకు ఆయన జీవించును.

ఒక విజ్ఞాపనకర్త ఏమి చేస్తాడు? దేవునికి, ఒక వ్యక్తికి మధ్య ఖాళీ స్థలంలో నిలువబడతాడు. మనందరం ఈ ఖాళీ స్థలాన్ని కలిగివున్నాము. మరొక మాటలో, మనందరం ఆయన వలె పరిశుద్ధులము కాదు, ఆయనవలె సంపూర్ణులము కాదు, ఆయనవలె జ్ఞానులము కాదు, అయితే, యేసు అక్కడే వున్నాడు, ఆ ఖాళీ స్థలంలో నిలువబడివున్నాడు. దేవునికి, మనతోను – లేక మనకు, దేవునితోను సహవాసము కలుగజేస్తున్నాడు, ఆయన మన

మనందరి ప్రార్థనలు, యేసు విజ్ఞాపన ద్వారా తేటపరచబడతాయి.

ప్రార్థనలకు జవాబిస్తున్నాడు. మన హృదయాలు యేసుని నమ్ముతూ, సరిగా వున్నంతకాలం, మనం చేసే ప్రతి ప్రార్థనలకు ఆయన అడ్డుకొని, సరిచేసి, శ్రద్ధ తీసుకుంటాడని తెలుసుకొనుట మహా ఆశ్చర్యం కాదా!

మనం ప్రార్థిస్తున్నందుకు కాదుగానీ, యేసును బట్టి, ఆయన విజ్ఞాపనను బట్టి – మనం ప్రార్థించి, మన ప్రార్థనలు ఆత్మీయ సామ్రాజ్యంలో శక్తివంతమైయుండాలని కోరుకోవాలి. మనం 100 శాతం సరియైన ప్రార్థనలు ప్రార్థించలేము, కాని యేసు ప్రార్థించగలడు. ఆంద్రూ ముర్రే మాటలలో, యేసు పరిచర్య : “మన అర్హత లేని ప్రార్థనలను అంగీకారయోగ్యంగా చేయు విజ్ఞాపన”. మనందరి ప్రార్థనలు, యేసు విజ్ఞాపన ద్వారా తేటపరచబడతాయి. మన ప్రార్థనలను దేవునికి అంగీకారయోగ్యంగా చేస్తూ, యేసు ఎల్లప్పుడూ విజ్ఞాపన చేస్తున్నాడు. మన ప్రార్థనలు దేవునికి అంగీకారయోగ్యం అయినపుడు, ఆయన విని, తనకు బదులుగా తన శక్తిని విడుదల చేస్తాడు.

## సారాంశం

ప్రార్థన యొక్క శక్తి కంటే గొప్ప శక్తి ఎవరికీ అందుబాటులో లేదు. ఈ లోకంలో అత్యంత శక్తివంతమైన, అద్భుతమైన, ప్రభావవంతమైన శక్తి కూడా దేవుని శక్తితో పోల్చినపుడు శక్తిహీనమైయున్నది. మన అనుదిన పరిస్థితులలో, సంఘటనలలో దేవుని శక్తి మనకు అవసరమైయున్నది. దేవుని శక్తితో మనలను కలిపి, ఆయన శక్తి మన జీవితాలలో విడుదలగుటను సాధ్యం చేసేది ప్రార్థనయే.

ప్రార్థన యొక్క శక్తిని గూర్చి అనేక మందికి అద్భుతమైన కథనాలు కలవు. యిటువంటివి నీవు వినినపుడు లేక చదివినపుడు, అవి నిన్ను ప్రోత్సాహపరచి, నీ విశ్వాసాన్ని పెంపొందించనివ్వు. దేవుడు శక్తివంతముగా నీ జీవితంలో క్రియ జరిగించినప్పుడు, అది ఇతరులతో పంచుకొనునట్లు జాగ్రత్తపడు. ఆ విధంగా, వారు కూడా దేవుడెంత గొప్పవాడో, ప్రార్థన ఎంత శక్తివంతమైనదో తెలిసికొంటారు.

మనం లోపరహితమైన ప్రార్థనలు చేయుటకు కష్టపడనవసరం లేదు, ఎందుకంటే యేసు మన కొరకు విజ్ఞాపన చేయుచున్నాడు. ఆయన విజ్ఞాపణ ఎల్లప్పుడూ సరియైనది, మరియు ఆయన మనకొరకు నిత్యము విజ్ఞాపన చేయుచున్నాడు. కాబట్టి, మనము

ప్రార్థించుచుండగా దేవుడు మన హృదయాలను చూస్తున్నాడని, మన ప్రార్థన వింటున్నాడని, వాటికి నమ్మకంగా బదులిస్తాడని నమ్మగలము. ప్రార్థన శక్తివంతమైనది, కాబట్టి, నీ జీవితంలో, నీ పరిస్థితులలో, నీ సంబంధాలలో, మంచి నిర్ణయాలు తీసికొనుటకు, విజయం సాధించుటకు శక్తి కావాలనుకుంటే ప్రార్థించు!

## ప్రార్థనాంశములు

- ఈ విశ్వంలో ప్రార్థన గొప్ప శక్తియై వున్నది. అన్ని శక్తులకంటే ఇది గొప్పదైయున్నది, ఎందుకంటే, ఇది ప్రకృతి సంబంధమైనది కాక ఆత్మీయమైనదైయున్నది. ప్రార్థన అనునది, మన జీవితాలలోనికి, పరిస్థితులలోనికి దేవుని శక్తిని విడుదల చేస్తుంది.
- ప్రార్థనా శక్తి యొక్క సాక్ష్యాలను చదవండి, వినండి. మీ సాక్ష్యాలను ఇతరులతో పంచుకోండి. ఇది నీ యొక్క మరియు ఇతరుల యొక్క విశ్వాసాన్ని పెంచుతుంది.
- నీకు ఇష్టమైనంత సమయం కంటే ఎక్కువ సమయం ప్రార్థించాలని, లేక జవాబు రాదేమో అని నీవు తలంచినప్పటికీ ప్రార్థన శక్తివంతమైనది. ఎన్నటికీ ప్రార్థన యొక్క శక్తిని శంకించవద్దు.
- పాత నిబంధనా దినముల నుంచి, ఇప్పటి వరకు ప్రజలు ప్రార్థన యొక్క శక్తిని అనుభవించారు.
- యేసు మన విజ్ఞాపనకర్త. ఆయన మన యొక్క అపరిపూర్ణమైన ప్రార్థనను అడ్డగించి, పరిపూర్ణ వ్యక్తి చేసిన, పరిపూర్ణ ప్రార్థనలుగా తండ్రికి వినిపిస్తాడు.

# 5

# స్తుతి, ఆరాధన మరియు కృతజ్ఞతాస్తుతులు

వివిధ రకాలైన ప్రార్థనలను గురించి బైబిలు మనకు బోధిస్తుంది, మిగిలిన అధ్యాయాలలో వాటిలో చాలా వాటిని మనం చూడబోతున్నాం, ఎందుకంటే, ప్రార్థనలోని వైవిధ్యాలను గురించి నీవెంత తెలుసుకుంటే, అంత ప్రభావవంతంగా ప్రార్థించగలవు. మొదట, నేను స్తుతి, ఆరాధన మరియు కృతజ్ఞతాస్తుతులను గురించి చెప్పదలచుకున్నాను, ఎందుకంటే ఇవి మనం ప్రార్థించగలిగిన కొన్ని సులువైన ప్రార్థనలు, మరియు ఇవి మన జీవితాలలో గొప్ప శక్తిని విడుదల చేస్తాయి. నీవు నీ స్తుతి, ఆరాధన, లేక కృతజ్ఞతాస్తుతులను ప్రార్థనలుగా తలంచియుండవు. కానీ అవి ప్రార్థనలే–ఎందుకంటే వాటిలో ప్రతి ఒక్కటీ నీ హృదయాన్ని దేవునికి వ్యక్తపరచు మార్గము, ఆయనతో సంభాషించు మార్గమైయున్నవి.

నేను "స్తుతి", "ఆరాధన", "కృతజ్ఞతాస్తుతి" అని వ్రాసినపుడు, అవి మనలో అనేకులు సంఘంలో చేసే ఆరాధన కంటే లోతైనది, మన:పూర్వకమైనది అని అర్థం, దేవునితో పూర్ణహృదయంతో, పూర్ణ నిజాయితీతో, గొప్ప ఆపేక్షతో సంభాషించుటను గురించి నేను మాట్లాడుతున్నాను. స్తుతి, ఆరాధన, మరియు కృతజ్ఞతాస్తుతులను వేరు వేరుగా వివరించదలచుకోవటం ఒక సవాలు. ఎందుకంటే అవి స్వభావంలోనూ, ఆత్మీయ రాజ్యములో పని జరిగించుటలోనూ సమానంగా వుంటాయి. కాబట్టి, సులువుగా వుండుటకై, "స్తుతి" ని దేవుడు చేసిన, చేస్తున్న, చేయబోవుచున్న, దానికి ప్రతి స్పందనగా "ఆరాధన" ను ఆయన ఎవరైయున్నాడో దానికి ప్రతిస్పందనగా నన్ను వివరించనీయండి. మరొక మాటలో స్తుతి దేవుని క్రియలకు, ఆరాధన ఆయన వ్యక్తిత్వానికి సంబంధించినవై యున్నవి. "కృతజ్ఞతాస్తుతి" ఆయన క్రియలను మరియు వ్యక్తిత్వాన్ని కృతజ్ఞతతో ఒప్పుకొనుట అని వివరిస్తాను.

సంఘ ఆరాధనలో లేక సువార్త కూటాలలో మనము తరచుగా ఈ స్తుతి, ఆరాధన మరియు కృతజ్ఞతాస్తుతులను అనుభవిస్తాము. ఈ కూడికలు సామాన్యంగా ఒక కీర్తన లేక స్తుతి పాటలతో మొదలవుతాయి తరువాత ఎవరైనా ఒకరు కృతజ్ఞాతాపూర్వక ప్రార్థన చేస్తారు, ఒక సందర్భం గురించి పాటలు పాడి ఏదైనా చదువుతారు. కొన్ని సమయాలలో, ఈ విధమైన క్రమాలలో, ప్రజలు నిజంగానే స్తుతి, ఆరాధనలతో దేవుని ఆరాధిస్తూవుంటారు, కొన్ని సమయాలలో వారు విసిగినట్లు, ఆచార క్రమమైన కదలికలు, బాహ్య ప్రవర్తన కలిగినట్లుగా కనిపిస్తుంటారు. అయితే స్తుతి, ఆరాధన, కృతజ్ఞతాస్తుతులు చాలా శక్తివంతమైనవి, అందుకు నేను మీతో ఈ విషయం చెప్పాలి: మా సంఘాలలో స్తుతి ఆరాధనల పట్ల గొప్ప గౌరవాన్ని చూడాలని నేను ఎంతో ఆశక్తి కలిగివుంటాను. ఎందుకంటే, దేవుని స్తుతించి, ఆరాధించుటలోని శక్తిని నేను ఎరిగియున్నాను. నీవు కాదనలేని అత్యవసరతను కలిగివుంటే తప్ప సంఘంలో ఆరాధన మొదలుపెట్టినప్పుడు ఎల్లపుడూ మీ స్థలంలో వుండమని నేను మిమ్మును ప్రోత్సాహపరుస్తున్నాను. దైవ వాక్యం బోధించుటను మనం ఎంత విలువిస్తామో, స్తుతి, ఆరాధన సమయాలకు కూడా అంతే విలువను గౌరవాన్ని యివ్వాలని నేను నమ్ముతాను. ఒక వేళ ఏదైనా కారణం వలన మనం ఆలస్యంగా ఆరాధనకు వెళ్ళినట్లయితే, ఆరాధించుచున్న యితరులకు భంగం కలుగకుండా నెమ్మదిగా, ఒక స్థలాన్ని వెదుకుకోవాలి.

మేము సువార్త కూడికలు లేక సంఘ ఆరాధనకు వెళ్ళేసరికి అందరూ అపేక్షతో, కోరికతో, పూర్తిగా లీనమై స్తుతిస్తూ, ఆరాధిస్తూ, దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తూ వుండే రోజుకోసం నేనెంతో కాలముగా ఎదురుచూసాను. దేవుని స్తుతించుటకై సమస్యలు, ఒత్తిడిలు అన్నీ ప్రక్కనపెట్టి–స్తుతి, ఆరాధన, కృతజ్ఞతాస్తుతులతో నింపబడి, అవి మన హృదయంలో నుండి సంభాషణ, పాటలద్వారా ప్రవహిస్తుండగా చూడాలని నేను ఆశక్తితో ఎదురుచుసాను. ఆరాధించునపుడు ఆరాధనకు ఎవరు వచ్చారో, వాళ్ళు ఏం ధరించుకున్నారో చూడాలని కూడా అనిపించనంతగా ప్రభువుచే పట్టబడి, కృతజ్ఞతలచే నింపబడే రోజు చూడాలని నేను ఆశపడుచున్నాను.

అటువంటి గౌరవప్రదమైన, మన:పూర్వకమైన సంఘ ఆరాధనకు దేవుడు ప్రతిస్పందిస్తాడు. తనను నిజంగా స్తుతిస్తూ ఆరాధించువారి పైకి ఆయన తన మహిమ ప్రత్యక్షతా సన్నిధి మరియు శక్తిని పంపుతాడు. ఆయన మహిమ వచ్చినపుడు,

> మనము దేనిగురించి ప్రార్థిస్తున్నప్పటికీ, దానిని మొదలుపెట్టుటకు ఉత్తమమార్గం స్తుతి, ఆరాధన మరియు కృతజ్ఞతా స్తుతి చెల్లించుట.

అద్భుతాలు జరుగుతాయి, ప్రజలు స్వస్థపరచబడతారు, జీవితాలు మార్పు చెందుతాయి, అంతరంగము నుంచి రూపాంతరం చోటు చేసుకుంటుంది.

నీ ప్రార్థనా జీవితంలో నీవు నిజంగా కోరుకునేది అదేకదా? నీ జీవితంలోని కొన్ని విషయాలు మార్పు చెందాలని, రూపాంతరం చెందాలని ప్రాముఖ్యంగా నీవు ప్రార్థించుట లేదా? నీవు క్రొత్త ఉద్యోగం కోసం ప్రార్థిస్తున్నట్లయితే – అది మార్పు. నీవు ప్రేమించువారు ప్రభువును తెలుసుకోవాలని ప్రార్థిస్తున్నట్లయితే – అది మార్పు. నీవు ఆత్మీయ పరిపూర్ణతలోనికి ఎదుగునట్లుగా సహాయపడుటకు తనను ప్రత్యక్ష పరచుకొనమని ప్రభువును నీవు ప్రార్థిస్తున్నట్లయితే – అది మార్పు. నీ వైవాహిక జీవితం సరైనదిగా వుండునట్లు ప్రార్థిస్తున్నట్లయితే – అది మార్పు. మీ వీధి చివరలో నివసించు యౌవనస్తుడు మత్తు పదార్ధాలను మానివేసి, సరైన దారిలోనికి రావాలని ప్రార్థిస్తున్నట్లయితే – అది మార్పు. త్వరగా కోపపడకుండునట్లుగా వుండాలని ప్రార్థిస్తున్నట్లయితే–అది మార్పు.

మనము దేనిగురించి ప్రార్థిస్తున్నప్పటికీ, దానిని మొదలుపెట్టుటకు ఉత్తమమార్గం స్తుతి, ఆరాధన మరియు కృతజ్ఞతాస్తుతి చెల్లించుట. అవి మన హృదయాన్ని దేవుని యెదుట సరియైనదిగా వుంచి, మార్పు చోటు చేసుకొనుటకు దారిని ఏర్పరుస్తాయి. అవి సులువైన ప్రార్థనలు, అయితే అవి బలమైన ఆత్మీయ ఆయుధాలు కూడా, మరియు మన జీవితం యొక్క ప్రతి దశలో అనుభవించుటకు సాధ్యమైనవైయున్నవి.

## స్తుతి

చాలా మంది ఈ మాట వినే వుంటారు "స్తుతిలో శక్తి వుంది!" ఇది నిజం, మన హృదయాలలోనుండి దేవుని స్తుతిస్తున్నప్పుడు మనం ఆత్మీయ ప్రదేశంలో శక్తిని వినియోగపరుస్తాము. లేఖనాలను అనుసరించి ప్రభువు తన ప్రజల స్తుతులలో నివాసము చేస్తాడు (కీర్తనలు 22:3). నా ప్రార్థనాకూటంలో స్తుతి ఆరాధనలు మొదలయిన వెంటనే నేను వుండేటట్లుగా చూచుకుంటాను, ఎందుకంటే ఆయన సన్నిధిలో వుండుట నాకు ఎంతో ఇష్టము. నిజానికి, ప్రేక్షకులతో మాట్లాడుటకు ముందు స్తుతి ఆరాధనలో నేను ప్రవేశించేటట్లుగా జాగ్రత్తపడతాను–అది దేవునికి అవసరమని కాదుగానీ అది నాకు అవసరం. ఆయన నాకొరకు చేసిన, చేయబోతున్న ప్రతీ విషయంలో నా ఆనందాన్ని వ్యక్తపరచవలసి వున్నది నా హృదయం ఆయన వైపు కేంద్రీకరించునట్లుగా, నా నోరు ఆయన గురించి మాట్లాడునట్లుగా, నేను ఒడంబడిక చేసుకొనవలసి వున్నది స్తుతి ద్వారా విడుదలైన శక్తిని నేను గ్రహించి పరలోకంతో నాకు స్పష్టమైన సంబంధం వున్నదని తెలుసికొన వలసియున్నది. నేను దేవుని ప్రేమిస్తున్నాను గనుక ఇవన్నియూ చేస్తాను, ప్రజలు మాట స్పష్టంగా వినుటకు, దానిని పొందుటకు, మరియు విశ్వాసంద్వారా దానిని గట్టిగా పట్టుకొనుటకు, ఏదైతే ప్రజలకు

సాధ్యపడదో, అవన్నీ నేను చేస్తాను ఎందుకంటే నేను దేవుని ప్రేమిస్తున్నాను కాబట్టి. అంతే కాదు స్తుతి ఆత్మీయ వాతావరణము నెలకొల్పుటకు దారి తీస్తుంది కనుక దీనిని గూర్చి ఆలోచించండి.

ఎన్నో సార్లు మనము ఒక సంఘూరాధనకు లేక ప్రార్థనా కూడికకు వెళ్ళిన మొదటి సారిగా ఏమీ లేనట్లుగా అనిపించి తరువాత కొన్ని నిమిషాలు దేవున్ని స్తుతించిన తరువాత బాగానే వుందని అనిపిస్తుందా? స్తుతి మన భారాల నుండి విడుదలను తెస్తుంది. అది మన సమస్యలను మన మీద నుండి తీసివేసి దేవునిపై పెడుతుంది–అది ఎల్లప్పుడు మనకు హాయిని కలిగిస్తుంది.

అది మాత్రమే కాదు, స్తుతి అనేది ఆత్మీయ యుద్ధానికి ఒక రూపమైయున్నది. దేవుని స్తుతించుట సాతాను శక్తులను సాతానును ఓడిస్తుంది (యెహోషాపాతు కథనాన్ని జ్ఞాపకము చేసుకొనండి). పాడుతూ, అరుస్తూ చేసే స్తుతులు మనలో నుండి భయం యొక్క శక్తిని విరుగ కొడుతుంది. అనుమానం నుండి అపనమ్మకం నుండి విడుదల కలిగిస్తుంది. దైవ సంబంధంకాని ఆత్మలు పారిపోతాయి. ఉదాహరణకు భయాన్ని కలిగించు ఆత్మ మనల్ని ఎదుర్కొని మనకు భయం పుట్టించే ఆలోచనలను కలుగజేస్తున్నప్పుడు, మనం ఈ విధంగా చెప్పాలి: "ప్రభువా నిన్ను స్తుతిస్తున్నాను, నీ నామమును ఘనపరుస్తున్నాను, నీవు స్తుతులకు అర్హుడవు. హల్లెలూయా, వందనాలు ప్రభువా, నీవు అత్యద్భుతమైనవాడవు! నీ వంటివారెవరూ లేరు!" ఈ యుద్ధపు మాటలు ఎప్పుడైనా ఎక్కడైనా ఉపయోగించవచ్చు. చింతపడుటకంటే పాటపాడుట ద్వారా సాతానును త్వరగా ఓడించగలము. అందుకే బైబులంతా స్తుతిని గూర్చిన ఉదాహరణలతోనూ మనము దేవుని స్తుతించి పాడుటకు కారణాలు సూచనలతో నింపబడింది. వాటిలో కొన్నింటిని చూద్దాం:

- "దేవుడు నాకు ఎత్తయిన కోటగాను కృపగల దేవుడు గాను ఉన్నాడు నా బలమా, నిన్నే కీర్తించెదను" (కీర్తనలు 59:17)
- "యెహోవాను స్తుతించుడి, యెహోవాకు క్రొత్త కీర్తన పాడుడి, భక్తులు కూడుకొను సమాజములో ఆయనకు స్తోత్ర గీతము పాడుడి ఇశ్రాయేలీయులు తమ్మును పుట్టించినవానిని బట్టి సంతోషించుదురు గాక, సీయోను జనులు తమ రాజును బట్టి ఆనందించుదురు గాక, నాట్యముతో వారు ఆయన నామమును స్తుతించుదురు గాక, తంబురతోను సితారతోను ఆయనను గూర్చి గానము చేయుదురు గాక" (కీర్తనలు 149:1–3)
- "ఎల్లప్పుడును ప్రభువునందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి" (ఫిలిప్పీయులకు 4:4)

- "అయితే మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచిన వాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు" (1 పేతురు 2:9)

దేవునిని పాడి స్తుతించమని బైబిలెందుకు చెప్తుంది? "యెహోవాకు క్రొత్త కీర్తన పాడండి" అని కీర్తనలు 149:1 ఎందుకు చెప్తుంది. దేవుడు మనలో సంగీతాన్ని ఎందుకు వుంచాడు ఆయన మన హృదయాలలో పాటలెందుకు వుంచాడు? ఎందుకంటే స్తుతిలో శక్తి వుంది.

## స్తుతి శక్తిని తీసుకొని వస్తుంది

మీకు అబ్రాహాము కథ తెలిసే యుండవచ్చు, లేకపోతే దానిని ఆదికాండము 12:1-21:7లలో కనుగొనవచ్చు. దేవుడు అబ్రాహాముకు కుమారుడిని ఇస్తానని వాగ్దానం చేశాడు, కానీ, సమస్య ఏమిటంటే అబ్రాహాము అతని భార్య శారా ఇద్దరూ వృద్ధులు- బాగా వృద్ధులు. అతనికి 100 యేండ్లు, ఆమెకు తొంబది యేండ్లు. వారికి పిల్లలను కనే వయస్సు దాటి చాలా కాలమైంది. కాని ప్రకృతి సిద్ధముగా, సాధ్యం కానివాటి గుర్చి ఆలోచించుటకు నిర్ణయించు కొనుటను దేవుడు మాట్లాడినాడని అబ్రాహాముకు తెలుసు కాని ప్రకృతి సిద్ధముగా అతను మరియు శారా బిడ్డను కలిగివుంటారనుటకు అసాధ్యాన్ని గూర్చి ఆలోచించకుండుటకు, దేవుడు మాట్లాడినాడని అబ్రహాముకు తెలుసు, దానికి బదులుగా దేవుని యొక్క వాగ్ధానములో తన విశ్వాసమును నాటినాడు. మరియు దేవుని స్తుతించుట ద్వారా దానిని గట్టిగా పట్టుకొన్నాడు అతని కథ గుర్తుంచుకోదగినది అని పౌలు రోమా 4:18-21 లో వివరించినాడు.

"నీ సంతానము ఈలాగు ఉండునని చెప్పినదానిని బట్టి తాననేక జనములకు తండ్రియగునట్లు, నిరీక్షణకు ఆధారము లేనప్పుడు అతడు నిరీక్షణ కలిగి నమ్మెను. మరియు అతడు విశ్వాసమునందు బలహీనుడు కాక, రమారమి నూరేండ్ల వయస్సుగలవాడైయుండి, అప్పటికి తన శరీరము మృతతుల్యమైనట్టును, శారా గర్భము మృతతుల్యమైనట్టును ఆలోచించెను గాని, అవిశ్వాసము వలన దేవుని వాగ్ధానమునుగూర్చి సందేహింపక దేవుని మహిమపరచి, ఆయన వాగ్ధానము చేసిన దానిని నెరవేర్చుటకు సమర్ధుడని రూఢిగా విశ్వసించి విశ్వాసము వలన బలమునొందెను"

18వ వచనం ను మరలా చూడండి "నీ సంతానము ఈలాగు ఉండునని చెప్పినదానిని బట్టి తాననేక జనములకు తండ్రియగునట్లు, నిరీక్షణకు ఆధారము లేనప్పుడు అతడు నిరీక్షణ కలిగి నమ్మెను", నిజానికి ఈ వ్యక్తి నిరీక్షణ వుంచుటకు ఏ కారణము లేదు, నిరీక్షణకు అతీతంగా ఏదైనా పరిస్థితి వుందంటే, అది తొంబైయేండ్లు దాటిన ఇద్దరు

వ్యక్తులు బిడ్డలను కనగలుగుటయే. అయినప్పటికీ అబ్రాహాము నిరీక్షణనుంచాడు అతను దేవుని వాగ్దానమును నమ్ముతూనేవున్నాడు. 19వ వచనం "మరియు అతడు విశ్వాసమునందు బలహీనుడు కాక, రమారమి నూరేండ్ల వయస్సుగలవాడైయుండి, అప్పటికి తన శరీరము మృతతుల్యమైనట్టును, శారా గర్భము మృతతుల్యమైనట్టును ఆలోచించెను గాని" అని చెప్తుంది. మరొక మాటలో, అబ్రహాము తన పరిస్థితులను చూసుకొని తనకు విరోధముగా వున్న విషమ పరిస్థితులన్నింటిని బాగా తెలుసుకున్నాడు, అతని శరీరము "మృతతుల్యమైనట్టు", అతని భార్యయైన శారా గొడ్రాలు ఆమె గర్భము "మృతతుల్యము" అని బైబిలు చెబుతున్నప్పటికి అతను ఆశ వదలలేదు. ప్రకృతి పరమైన అసాధారణల మధ్య అబ్రాహాము అవిశ్వాసములో పడిపోలేదు తన విశ్వాసములో విసిగి పోయి దేవుని వాగ్ధానమును ప్రశ్నించలేదు. దానికి బదులుగా, "అతను విశ్వాసము వలన శక్తిని, బలమును పొందుకొని" దేవుని స్తుతించాడు.

> మనం మరింత బలమును పొందుకుంటాము, మన విశ్వాసములో వృద్ధి పొందుతాము. ఆయనను స్తుతించుచుండగా మనలను ఓడించటానికి వచ్చిన ప్రతి పరిస్థితి చెదరగొట్టబడుతుంది.

స్తుతించునపుడు మనకు కూడా ఇదేవిధంగా జరుగుతుంది. మనం మరింత బలమును పొందుకుంటాము, మన విశ్వాసములో వృద్ధిపొందుతాము. ఆయనను స్తుతించుచుండగా మనలను ఓడించటానికి వచ్చిన ప్రతి పరిస్థితి చెదరగొట్టబడుతుంది. అందుకే మనం స్తుతి ఆరాధన సంగీతాన్ని వినుటకు శ్రద్ధ కలిగి వుండాలి. మనం దానిని మన ఇండ్లలోను, కారులోను వినాలి మనం వాటిని నేర్చుకొని పాడాలి. మనకు అవకాశమున్న ప్రతిసారి, అది ఒకటి లేక రెండు నిమిషాలైనా దేవుని స్తుతించి ఆరాధించాలి. కొంత కాలం తరువాత స్తుతి ఎంత సాధారణమై పోతుందంటే మనము ఒక నిర్ణయము తీసికొనకుండానే మనలో నుండి అది ప్రవహిస్తుంది. ఆయన మంచితనాన్ని, కృపను, దయను గ్రహించిన ప్రతిసారి అసంకల్పితంగానే దేవుని స్తుతిస్తాము.

## *కథ చెప్పండి*

*పాత, క్రొత్త నిబంధనల పదాల వైన్స్ ఎక్స్‌పోజిటరీ నిఘంటువు* "స్తుతి"ని ఒక కథను చెప్పుట లేక వివరించుటగా వివరించింది. వేరొక విధంగా, ఆయన చేసిన గొప్ప కార్యాలను బిగ్గరగా చెప్పుట లేక తిరిగి లెక్కించుటయే స్తుతించుట. మనం మధ్యాహ్న భోజన సమయంలో ఒక స్నేహితునితో కూర్చుని, దేవుని అద్భుత కార్యాలను గురించి మాట్లాడుతున్నట్లయితే,

మనం ఆయనను స్తుతిస్తున్నాము. నిజానికి, దేవుడు యిటువంటి సంభాషణలను ఇష్టపడతాడని, ఆయన వాటిని వినినప్పుడు, వారికి జ్ఞాపకార్థముగా ఒక గ్రంథము వ్రాసుకుంటాడని బైబిలు చెప్తుంది (మలాకీ 3:16). మన సణుగులు, సాధింపులు, లేక ఫిర్యాదులు కాదు గానీ మన పెదవులపై ఆయన స్తుతి వున్నపుడు మనం మాట్లాడిన మాటలను ఆయన వ్రాసుకుంటాడు.

నీ బిడ్డలు కూర్చుని, నీ గురించి "మన అమ్మ చాలా అద్భుతమైనది, ఈ ప్రపంచంలోకెల్లా గొప్ప అమ్మ మనకుంది. మన అమ్మ కంటే గొప్ప అమ్మలెవరూ లేరు! మనకి నిజంగా చాలా మంచి, గొప్ప తల్లిదండ్రులున్నారు కదా? అందరికంటే వాళ్లే గొప్ప తల్లిదండ్రులు." అని మాట్లాడుకొనుట, అనుకోకుండా నీవు విన్నట్లయితే నీకెలా వుంటుంది. అలా నీవు విన్నప్పుడు, వారికిష్టమైనవి చేసి, వారిని ఆశీర్వదించకుండా వుండలేవని నేను ఖచ్చితంగా చెప్పగలను.

అయితే, నీవు అనుకోకుండా గదిలోనికి వెళ్లినపుడు నీ బిడ్డలు "అబ్బ, అమ్మానాన్నలతో నేను విసిగిపోయాను. వాళ్లు మనకోసం ఏమీ చేయరు. మనల్ని సంతోషంగా వుండనివ్వరు, ఎప్పుడూ నిబంధనలు పెడతారు. అమ్మయితే ఎప్పుడూ యింటిపని చేయమని విసిగిస్తుంది. మన తల్లిదండ్రులు నిజంగా మనల్ని ప్రేమిస్తే, మనకేది మంచిదనిపిస్తుందో, ఏది కోరుకుంటామో అది మనకిస్తారు." అని మాట్లాడుకుంటుంటే ఎలా వుంటుంది.

పైన నేను వివరించిన రెండు భాగాలకు, దేవునితో మన సంబంధానికి పెద్ద తేడా లేదు. మనం దేవుని పిల్లలం! మనం చెప్పే ప్రతి మాట ఆయన వింటున్నాడు, మనం చెప్పకపోయినప్పటికీ మన హృదయాలలో ఏమివున్నదో ఆయనకు తెలుసు. మనం ఏమి మాట్లాడాలని ఆయన కోరుకుంటున్నాడు? ఆయన ఎంత గొప్పవాడో! ఆయన ఎంత అద్భుతమైనవాడో! ఆయన చేసిన అద్భుతకార్యాలు! ఆయన ఏమి చేయగలడో! ఆయన నిజానికి ఏమి చేస్తున్నాడో మనకు తెలియకపోయినప్పటికీ, ఆయన ఏమి చేస్తాడో! ఇవన్నీ చెప్తూ ఆయనను స్తుతించాలని ఆయన కోరుకుంటున్నాడు.

హెబ్రీ 13:15 ఈ విధంగా చెప్తుంది: "ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదము.'' తరచుగా మనం ''స్తుతియాగమును'' మనకు స్తుతించాలని అనిపించకపోయినప్పటికీ స్తుతించుట, ఒకవిధంగా యాగము గనుక అదే స్తుతియాగముగా అనువదిస్తాము. ఏదేమైనా, హెబ్రీ గ్రంథకర్త ప్రజల పాప క్షమాపణకై పశువుల రక్తం అవసరమైన పాతనిబంధనా బలియాగమును అన్వయిస్తూ చెప్పాడని నేను అనుకుంటాను.

వధింపబడిన గొర్రెలను, మేకలను బలిపీఠముపై వుంచవలసిన అవసరం లేని క్రొత్త నిబంధనా కాలంలో మనం వున్నాము. వాటికి బదులుగా, దేవుడు మన పెదవుల నుండి సరియైన మాటలు, ఆయన సింహాసనాన్ని బలిగా – కానుకగా చేరటం ఆయన కోరుకుంటున్నాడు.

పాత నిబంధనలో జంతుబలుల ధూపం, సువాసన ఎలా ఆయన సింహాసనం ఎదుటికి చేరాయో, నేడు మన హృదయాల నుంచి స్తుతులు ఆ విధంగా ఆయనను చేరుతాయి. హెబ్రీ 13:15 నందు ప్రభువు, *ప్రస్తుతం నేను కోరుకునే బలి, కృతజ్ఞతతో నాకు అర్పించు జిహ్వా ఫలమని* నిజముగా చెప్పుచున్నాడు.

మనకు అవకాశం దొరికిన ప్రతీసారి ఆయనను స్తుతిస్తూ, ఆ వాక్యాన్ని మన జీవితాలకు అన్వయించుకొనవలసివున్నది. మన కొరకు ఆయన చేస్తున్న ప్రతి గొప్ప విషయాన్ని, ప్రజలకు చెప్పవలసి వున్నది; ఆయనకు కృతజ్ఞతలు చెప్తూ, మన ప్రేమను తెలుపవలసి యున్నది. మన నోటితోను, మన హృదయాలలోను "ప్రభువా నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నా జీవితంలో నీవు చేస్తున్నవాటన్నిటికై నీకు వందనాలు. ఈ దినం నా కుటుంబాన్ని నీవు కాపాడినందుకు వందనాలు. ప్రభువా, మాకు వున్న కరెంటును బట్టి, వేడి నీళ్లను బట్టి కూడా నేను వందనాలు చెప్తున్నాను. ప్రతి పరిస్థితిలో అన్నిటిని నా మేలుకై సమకూర్చుతున్న విధానాన్ని బట్టి వందనాలు." అని చెప్తూ మన దినములు గడుప వలసియున్నది. మనం దేవుని "అన్ని విషయాలలో గుర్తిస్తూ" నిరంతరంగా స్తుతియాగాలు అర్పించు వారముగా వుండ వలసియున్నది.

## ఆరాధన

*పాత, క్రొత్త నిబంధనల పదాల వైన్స్ ఎక్స్‌పోజిటరీ నిఘంటువు* "దేవుని ఆరాధన వాక్యభాగాలలో ఎక్కడా నిర్వచింపబడలేదు" అని చెప్తుంది. ఆరాధన ఎందుకు నిర్వచింపబడలేదని నేననుకుంటున్నానో, మీకు తెలుసా? ఎందుకంటే అది నిర్వచింపలేనిదని నేను అనుకుంటున్నాను. ఆరాధన చాలా లోతైనది అది చాలా అమూల్యమైనది, చాలా భయభక్తులతో కూడినది, అది మనలో చాలా లోతైన స్థానం నుండి వస్తుంది. యిది ప్రభువు యెదుట మన హృదయాలు కుమ్మరింపబడు శక్తివంతమైన మార్గము, మరియు మనం మాటలలో చెప్పలేని ప్రేమ, కృతజ్ఞత, భక్తిని సూచిస్తుంది. యధార్థమైన ఆరాధనను మానవ భాష వివరించలేదు. నిజానికి, ఆరాధన చాలా వ్యక్తిగతమైనది, చాలా సన్నిహితమైనది, కాబట్టి, మనం దానిని మాటలతో నిర్వచించుటకు ప్రయత్నం కూడా చేయలేము.

ఆరాధనకు నిర్వచనం కాకుండా *పాత, క్రొత్త నిబంధనల పదాల వైన్స్ ఎక్స్‌పోజిటరీ నిఘంటువు* ఈ విధంగా చెప్తుంది "యిది స్తుతి యొక్క మేరలో లేదు వివరంగా, యిది దేవునితో, ఆయన వ్యక్తిత్వముతో, లక్షణాలతో, మార్గాలతో మరియు అధికారాలతో ప్రత్యక్ష జ్ఞానముగా చెప్పబడినది." మరియు అది "పరిచర్య చేయుట" అనే అర్థాన్నిస్తుంది. కొన్ని మూలాలు దీనిని గొప్ప వాత్సల్యతను మరియు సన్నిహితత్వం అని అర్థమిచ్చు "ముద్దుపెట్టుకొనుట" అనే అర్థమిస్తుంది.

బైబిల్‌లో ఆరాధనను గురించిన వివరణ లేకపోయినప్పటికీ, ఆరాధనను గూర్చిన తమ నిశిత దృష్టిని, సూచనలను వాక్యభాగాలు స్పష్టంగా చెప్తున్నాయి. ఉదాహరణకు:

- "యెహోవా నామమునకు తగిన మహిమను ఆయనకు చెల్లించుడి....... పరిశుద్ధాలంకారములగు ఆభరణములను ధరించుకొని ఆయన యెదుట సాగిలపడుడి." (1 దినవృత్తాంతములు 16:29).
- "రండి నమస్కారము చేసి సాగిలపడుదము, మనలను సృజించిన యెహోవా సన్నిధిని మోకరించుదము (గౌరవప్రదమైన స్తుతి మరియు విజ్ఞాపనలతో)" (కీర్తనలు 95:6).
- మన దేవుడైన యెహోవా పరిశుద్ధుడు. మన దేవుడైన యెహోవాను ఘనపరచుడి. ఆయన పరిశుద్ధ పర్వతము ఎదుట సాగిలపడుడి. (కీర్తనలు 99:9).
- నీ పరిశుద్ధాలయము తట్టు నేను నమస్కారము చేయుచున్నాను. నీ నామమంతటి కంటే నీవిచ్చిన వాక్యమును నీవు గొప్పచేసియున్నావు. నీ కృపాసత్యములను బట్టి నీ నామమునకు కృతజ్ఞతాస్తుతులు నేను చెల్లించదను. (కీర్తనలు 138:2).

## *శక్తి యొక్క రీతి*

స్తుతి వలెనే, ఆరాధన కూడా కేవలం పాటలు పాడుటకంటే ఎంతో ఘనమైనది. నిజం చెప్పాలంటే, ఆరాధన అనునది హృదయ స్థితి, మానసిక దశయైయున్నది. ఒక్క చిన్న రాగం కూడా పాడకుండా మనం అపేక్షతో ఆరాధించవచ్చును. ఆరాధన మన హృదయాలలో పుడుతుంది అది మన ఆలోచనలను నింపి, మన శరీరం మరియు నోటిద్వారా వ్యక్తపరచబడుతుంది. ఉదాహరణకు, మనం నాట్యం చేయుట, చప్పట్లు కొట్టుట, చేతులెత్తుట, వాయిద్యములు వాయించుట, దశమభాగాలు, కానుకలు ఇచ్చుట, చుట్టూ నడుచుట, మౌనంగా, స్థిరంగా కూర్చొనుట ద్వారా ఆరాధించవచ్చును, అయితే మన క్రియలు లేక మన స్థితులు మన హృదయాలను ప్రతిబింబిస్తాయి.

> ఆరాధన అనునది హృదయ స్థితి,
> మరియు మానసిక దశయైయున్నది.

ఆరాధనలోను, ప్రార్థనలోను తరచుగా ఉపయోగించు రీతి మోకాళ్లపై నుండుట. మోకాళ్లపై నుండుట తగ్గింపును సుచిస్తుంది, అయితే ఇది అసామాన్యమైన శక్తి యొక్క రీతి కూడా అయివున్నది. తగ్గింపును తెలుపు క్రియగా, మోకాళ్లపై నుండుట అనేది మనకు భావార్థకముగా వుంటుంది. ఎందుకంటే యిది ప్రభువుపై సంపూర్ణంగా ఆధారపడివున్న

మన హృదయ శబ్ద స్పందనను తెలుపుతుంది. మోకాళ్లపై నుండుట అంటే, దేవునితో "దేవా, నువ్వు నాకు అవసరం. నన్ను నేను నీకు అప్పగించుకొనుచున్నాను. నిన్ను అనుసరించాలని, నీకు విధేయుడవ్వాలని నేను ఇష్టపడుతున్నాను. నువ్వు లేకుండా నేను జీవించలేను. నువ్వు లేకుండా నేనేమీ చేయలేను. నీ కొరకు నేను తృష్ణగొనియున్నాను." అని చెప్పుటయే.

శక్తి గల విధానంగా, మోకాళ్లపై నుండుట అనునది సాతానుకు బలమైన సందేశాన్ని పంపుతుంది. సాతాను దీనిని ద్వేషిస్తాడు! మనం పాట పాడుచున్నప్పుడు, వాడు మన హృదయాలలో ఏమున్నదో ఎరుగడు, కానీ, మనం మోకాళ్లపై నుండుట లేక చేతులెత్తుట లేక చప్పట్లు కొట్టుట లేక నాట్యమాడుటను వాడు చూచినపుడు వాడు భయంతో కంపించిపోతాడు. ఆరాధనతో నింపబడిన విశ్వాసి, వాడిని ఓడించు సైనికుడు! ఎక్కువ సమయం నేను మోకాళ్లపై గడపలేక పోయినప్పటికీ, తరచుగా దేవుని ముందు తలవంచి, "నా కొరకు చేసిన వాటన్నింటికై వందనాలు ప్రభువా. ఈ దినం నాకు సహాయం చేసినందుకై వందనాలు" అని చెప్తాను. కొన్నిసార్లు చాలా తీరిక లేకుండా పనిచేస్తూ, మధ్యలో ఆ పనిని ఆపి, అలా చేస్తాను. కొన్ని సమయాలలో, టెలివిజన్ కొరకు మాట్లాడుతున్నపుడు, ఒక్కొక్క భాగానికి మధ్య సమయంలో సిద్ధపడునపుడు, ఆ గదిలో యిలా చేస్తాను. కొన్నిసార్లు, ఉదయాన్నే మొదటగా, నా మంచం ప్రక్కనే మోకరించి "ప్రభువా, నేను నిన్ను ప్రేమిస్తున్నాను. ఈ దినం నా కొరకై నీవు చేసిన ప్రణాళికంతటి కొరకై నీకు వందనాలు." అని చెప్పటాన్ని యిష్టపడతాను. వీటిలో కొన్నింటిని అలవాటు చేసికొమ్మని నేను మిమ్మల్ని ప్రోత్సాహ పరుస్తున్నాను. సాతాను స్తుతి, ఆరాధనల వలన ఓడిపోతాడు గనుక వాడు వాటిని ద్వేషిస్తున్నాడు.

వాడు ఆరాధనను అంతగా ద్వేషించుటకు కారణం ఏమిటంటే, మొదట వాడు పరలోక మందు ఆరాధనను నిర్వహించు దూతగా వున్నాడు. వాడు ప్రధాన దూతయైన లూసీఫర్, వాడి శరీరం సంగీత వాయిద్యములతో చేయబడినది. వాడు గర్వించి, అతిగా ప్రవర్తించినపుడు, దేవుడు వానిని పరలోకం నుండి త్రోసివేశాడు, అప్పుడు వాడు మెరుపువలె ఆకాశమునుండి పడిపోయినాడు (యెషయా 14:12-15 లూకా 10:18). వాడు యింకా దేవుని మీద కోపముంచుకొని, ప్రజలు ఆయనను నిజముగా ఆరాధించకుండుటకు ఏమైనా చేస్తుంటాడు. సహజంగా, మనం వాడి పని చేయటం వాడికి యిష్టంలేదు! కానీ, దానికంటే ఎక్కువగా, సాతాను దేనికైనా ఎక్కువగా ఆటంకపరుస్తున్నప్పుడు, అది వాడికి వ్యతిరేకంగా శక్తిని విడుదలచేస్తుంది, అది దేవుని సంతోషపరుస్తుంది గనుక, అది మనకు మేలే చేస్తుందని మనం తెలుసుకొనవచ్చు.

దేవునితో నా సంబంధం విషయంలో నేను చాలా ఉద్రేకపూరితంగా వుంటానని నేను ఒప్పుకుంటున్నాను. నేను ఉత్సాహంతోను, ఆసక్తితోను, ప్రేరేపణతోను నింపబడివుంటాను. కొన్ని సార్లు మౌనంగా వుండటం నాకిష్టం, అయితే స్తుతి, ఆరాధనలలో భావవ్యక్తీకరణాన్ని నేను ఆనందిస్తాను. మీరు కూడా ఆరాధనలో మిమ్మల్ని మీరు వ్యక్తపరచుకొమ్మని

ప్రోత్సాహపరుస్తున్నాను. దేవుని పట్ల నీ హృదయంలోని భక్తిని సాధ్యమైన ప్రతి రీతిలోను, భౌతికంగాను చెప్పుటకు, నీ జీవితంలో సాతానును వెనుకకు త్రోసి, దేవుని యొక్క విజయాన్ని సంతోషించునట్లుగా, నీ హృదయమంతటితో కీర్తించు, దానికి అదనంగా మోకాళ్లపై నుండు, లేక చేతులెత్తు, లేక చప్పట్లు కొట్టు, లేక నాట్యమాడు. దేవుడు నీకు ఉద్రేకాలనిచ్చాడు, కాబట్టి వాటిని ఆయనను గౌరవించుటకు ఉపయోగించుటకు భయపడవద్దు. మనుష్యులు ఒక బాల్ ఆట చూస్తున్నపుడు తమ ఉద్రేకాలను ప్రదర్శించుటను చక్కగా అంగీకరిస్తారు, అయితే స్తుతి, ఆరాధనలలో ఉద్రేకాలను ప్రదర్శించుటను "కేవలం ఉద్రేకపూరితంగా" తీర్పు తీర్చుట నాకు చాలా ఆశ్చర్యం అనిపిస్తుంది.

## *నీ హృదయాన్ని దీనిపై వుంచు*

ఆరాధన అనే మాట తరచుగా "మత" సంబంధమైనదిగా తలంచబడుతుంది. అది ఆరాధన గురించి బైబులు భావనకు దూరతరమైనది కాదు. ఆరాధన గురించి బైబులులో చదువుతున్నపుడు, మనం దేవుని తమ పూర్ణ హృదయంతో ప్రేమించి, ఆరాధించు ప్రజల వ్యక్తిగత సంబంధం, ఆత్మీయ సన్నిహితత్వం, మరియు అపేక్షతో నిండిన భావ వ్యక్తీకరణలను గురించి చదువుతాము. దేవుని అగ్నినిమన జీవితాలలో వున్నప్పుడు అది పైకి పొగలుగ్రక్కుతూ వస్తే, ఆయన పట్ల మన ప్రేమ అన్నిటిపై చిందినపుడు, ఆయనతో మన బలమైన సహవాసం గురించి మనం రోషం కలిగి, ఉత్సాహకత కలిగి వుంటే–అది యథార్థమైన ఆరాధన.

యోహాను 4:23 ప్రకారం ఆ విధమైన ఆరాధనను ఆయన కోరుతున్నాడు, ఈ విధంగా ఆరాధించే వారి కోసం వెదుకుతున్నాడు. ఆ వచనం యిలా చెప్తుంది: "అయితే యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది అది ఇప్పుడును వచ్చేయున్నది తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు." తమ పూర్ణ హృదయముతో ఆరాధించు, యథార్థమైన, స్వచ్ఛమైన ఆరాధకులు కావాలని దేవుడు వెదకుచున్నాడు.

దేవుడు యథార్థంగా ఆరాధించువారి కొరకు వెదకవలసి వచ్చినందుకు నేను ఎప్పుడూ బాధపడతాను. అటువంటి వారు సమృద్ధిగా వుండవలసివున్నది గనుక దేవుడు కోరిన ఆరాధకుల వలె వుండుటకు మనలను మనం సమర్పించుకోవలెనని నేను తలుస్తాను. కాని, తనను ఆరాధించుటకు ఎవ్వరిననీ దేవుడు కోరుకొనుట లేదు, ఆయన *యథార్థమైన,* స్వచ్ఛమైన ఆరాధకులను కోరుకొంటున్నాడు. తనను భయముతోను, బాధ్యతాయుతంగాను, మతపరంగాను

> దేవుడు కోరిన ఆరాధకుల వలె వుండుటకు మనలను మనం సమర్పించుకోవలెను

ఆరాధించువారికోసం కాదు గానీ ప్రేమ కలిగిన సంబంధంతో ఆరాధించువారికొరకు ఆయన వెదకుచున్నాడు.

ఇ.యమ్. బౌండ్స్ ఈ విధంగా వ్రాస్తున్నాడు: "మతం మన హృదయాలతో తప్ప అన్నిటితో పనిచేస్తుంది." అది సత్యమే, అయితే నిజ ఆరాధనకు మన హృదయాల కంటే దేనితో పనిలేదన్నది కూడా అంతే సత్యం. ఆరాధించునట్లు కనిపించు ప్రతివారు స్వచ్ఛమైన ఆరాధకులు కారు. యధార్థమైన, నిజాయితీ గల ఆరాధన హృదయంలోనుండి, దేవునితోని సన్నిహితత్వంలో నుంచి వస్తుంది. అందుకే, మన ప్రార్థనా జీవితాలలో ఆరాధన చాలా ప్రాముఖ్యమైనదై వున్నది.

ఒక నిర్థిష్ట ప్రదేశంలో, ఒక నిర్థిష్ట సమయానికి వెళ్లి ఒక నిర్థిష్టమైన ఆచారాలను మరల చేయునట్లు, మనం నేర్చుకున్న ప్రవర్తన, అలవాట్ల కంటే, ఆత్మతో, సత్యముతో చేయు ఆరాధన ఎంతో గొప్పది. సంఘం అని పిలువబడే కట్టడం లోనికి వెళ్లటం, ఒక సమయంలో మోకాళ్లపై వుండటం, ఒక సమయంలో నిల్చుండటం, కొన్ని వాక్యాలు తిరిగి చెప్పటం, లేక ఒక పుస్తకం నుంచి చదవటం, యివన్నీ నీ హృదయంలోనుంచి వచ్చినట్లయితే అది ఆరాధన అవుతుంది. అలా కాకుండా అవి కంఠత వాక్యాలు అయివుండి, ఆ క్రియలు నిజాయితీలో నిండినవి కానట్లయితే అది ఒక ఆచార వ్యవహారం అవుతుంది.

కొన్ని సంఘాలు ఆరాధన పుస్తకాలు, నియమించబడిన ఆరాధన విధానాలు కలిగివుండవు, అటువంటి చోట్ల మనం *ఆరాధిస్తున్నాను. నేను పాడుతున్నాను, నేను చప్పట్లు కూడా కొడుతున్నాను* అని ఆలోచిస్తాము. నీ హృదయంలోనుంచి రానట్లయితే అవి కూడా ఆరాధన కావు. మనం ప్రతి ఆదివారం ఒకే స్థలంలో కనిపిస్తూ, కొంత సమయాన్ని గడుపుతూ, తరువాత యింటికి వెళ్లి మరల ఆదివారం వరకు ఆయన గురించి ఆలోచించము గనుక ఆయన సంతోషించడు. మన హృదయాలు మనం చేస్తున్న దానితో సంబంధం కలిగివుండి, ఆయనపై కేంద్రీకరించబడివుండాలి, లేకపోతే మనం యథార్థమైన స్తుతి, ఆరాధనలో వుండినట్లు కాదు. యథార్థమైన ఆరాధనలో మనం కేవలం పెదవులతో స్తుతించము, మనము మన హృదయాలను ఇవ్వవలసియున్నది, మరియు తమ హృదయాలలో వున్న ఆరాధనను, తమ నోటి ద్వారా వ్యక్తపరచువారు యథార్థమైన ఆరాధకులు.

మత్తయి 15:7–9 లో యేసు "......ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని, వారి హృదయము నాకు దూరముగా వున్నది మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు. అని యెషయా మిమ్మును గూర్చి ప్రవచించిన మాట సరియే" అని వారితో చెప్పెను. మన ఆరాధన – లేక మన ప్రార్థనలు – నిరుపయోగకరమగుట మనమిష్టపడము, కాబట్టి, వాటిని తాజాగా, బలంగా, యథార్థంగా వుంచుటకు మన హృదయాలను వాటిపైనుంచుదాము.

# కృతజ్ఞతాస్తుతులు

ఈ అధ్యాయంలో ఇంతకు ముందు చెప్పినట్లు, సులువుగా వుండుటకై, "స్తుతి" ని దేవుడు చేసిన, చేస్తున్న, చేయబోవుచున్న దానికి ప్రతి స్పందనగా "ఆరాధన" ను ఆయన ఎవరైయున్నాడో దానికి ప్రతిస్పందనగా నన్ను వివరించనీయండి. మరొక మాటలో స్తుతి దేవుని క్రియలకు, ఆరాధన ఆయన వ్యక్తిత్వానికి సంబంధించినవైయున్నవి. "కృతజ్ఞాతాస్తుతి" ఆయన క్రియలను మరియు వ్యక్తిత్వాన్ని కృతజ్ఞతతో ఒప్పుకొనుట అని వివరిస్తాను. ఇది ఈ క్రియలను ఎరుగుట కాదు కాని, కృతజ్ఞతతో ఎరుగుట. యిది యథార్థమైన, మన:పూర్వకమైన అభినందనను వ్యక్తపరచుటయైయున్నది.

కృతజ్ఞాతాస్తుతి అనునది మన హృదయలోతుల్లో మనమేమైయున్నామో అందులో భాగమైయున్నది. యిది పవిత్రంగా, కల్పించినది కాకుండా సహజంగా మన హృదయాల నుంచి ప్రవహించునదిగా వుండాలి. కృతజ్ఞత కలిగివుండటమంటే, మన కొరకు దేవుడు యింకా ఏమైనా చేయునట్లుగా, లేక కొన్ని ఆత్మీయ అవసరతలు తృప్తిపరచబడుట్లుగా లేక దేవుని సంతోషపరచునట్లుగా దినాంతంలో కూర్చుని. ఆ రోజు దేవుడు చేసిన మేలులు జ్ఞాపకము చేసుకొనుట కాదు. కాని దానికి బదులుగా, మన ప్రతిదిన జీవితాలలో దేవుని క్రియలకు స్పందించే హృదయాన్ని కలిగివుండటం, మన జీవితాలలో ఆయన క్రియచేయుట లేక ఆశీర్వదించుట చూచిన ప్రతిసారి ప్రార్థనలతో ఆయనకు కృతజ్ఞతలు చెప్పటమైయున్నది. ఉదాహరణకు, "దేవా మంచి నిద్రను యిచ్చినందుకు వందనాలు" లేక "దేవా నేను దంతవైద్యుని వద్దకు వెళ్లినపుడు, అది నేను తలచినంత, బాధాకరంగా వుండనందుకు వందనాలు"లేక "తండ్రీ, ఈ దినం మంచి నిర్ణయాలు తీసికొనుటకు నాకు సహాయం చేసినందుకు వందనాలు" లేక "నన్ను ప్రోత్సాహపరచినందుకు వందనాలు". దేవుడు మన యెడల ఎల్లప్పుడూ మంచివాడు, నమ్మదగినవాడైయుండి, మన జీవితాలలో ఎల్లప్పుడూ శ్రద్ధ కలిగి పనిచేయుచున్నాడు. ఆయన ఎల్లప్పుడూ మనకొరకు ఏదో ఒకటి చేస్తూవున్నాడు, కాబట్టి మనం ప్రతిస్పందించి, ప్రతిదానికి మన అభినందనను ఆయనకు తెలియజేయాలి. మనం మౌనంగా హృదయాలలో ఆయనకు కృతజ్ఞతలు తెలియజేయవచ్చు, బిగ్గరగా కూడా కృతజ్ఞతలు తెలియజేయవచ్చు, ఎందుకంటే అది మనలను ఆయన మంచితనం ద్వారా బయల్పడుతున్న ప్రేమయొక్క జ్ఞానంలో వుంచుతుంది.

దేవుని స్తుతించమని, ఆరాధించమని బైబులు సూచిస్తున్నట్లే, ఆయనను స్తుతించుటకు కారణాలు యిస్తుంది, మన కృతజ్ఞతను ఆయనకెలా తెలియజేయాలో బోధిస్తుంది. అటువంటి వాక్యభాగాలు కొన్ని క్రింద ఇవ్వబడినాయి.

- "దేవా, మేము నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. నీవు సమీపముగా నున్నావని కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. నరులు నీ ఆశ్చర్యకార్యములను వివరించుదురు." (కీర్తనలు 75:1).

- "యెహోవాను స్తుతించుట మంచిది. మహోన్నతుడా, నీ నామమును కీర్తించుట మంచిది." (కీర్తనలు 92:1).
- కృతజ్ఞతా స్తుతులతో ఆయన సన్నిధికి వచ్చెదము. కీర్తనలు పాడుచు ఆయన పేరట సంతోషగానము చేయుదము. (కీర్తనలు 95:2)
- "కృతజ్ఞతార్పణలు చెల్లించుచు ఆయన గుమ్మములలో ప్రవేశించుడి. కీర్తనలు పాడుచు ఆయన ఆవరణములలో ప్రవేశించుడి, ఆయనను స్తుతించుడి, ఆయన నామమును ఘనపరచుడి." (కీర్తనలు 100:4)

## *ఇది దేవుని చిత్తము*

అనేకమంది క్రైస్తవులు దేవుని చిత్తాన్ని తెలుసుకోవాలని అనుకుంటుంటారు. నా పరిచర్యలోని యిన్ని సంవత్సరాలుగా, ప్రజలు తమ వ్యక్తిగత జీవితాలలో, తమ కుటుంబాలలో, తమ పరిచర్యలు, భవిష్యత్తుల పట్ల దేవుని చిత్తమును తెలుసుకొనుటకు చాలా ఆసక్తి కలిగివుండుటను చూశాను. కొన్ని సార్లు మనుష్యులు దేవుని చిత్తాన్ని ప్రపంచంలోకెల్లా చిక్కుతోకూడిన మర్మంగా భావించి, ఈ విధంగా మాట్లాడుతుంటారు,

"నేను దేవుని చిత్తాన్ని తెలుసుకొనివున్నట్లయితే, లోబడతాను." లేకపోతే "నేను నిజంగా దేవుని వెంబడించాలని అనుకుంటున్నాను కాని నీజీవితములో దేవుని చిత్తాన్ని తెలుసుకొని లోబడి వుండుటకు ఖచ్చితమైన మార్గము నేను నాకు ఆయన చిత్తమేమిటో ఖచ్చితంగా తెలియటం లేదు."

> నీ జీవితంలో దేవుని చిత్తాన్ని తెలుసుకొని, లోబడివుండుటకు ఖచ్చితమైన మార్గం నేను చెప్పగలను కృతజ్ఞత కలిగివుండు.

దేవుని చిత్తంలో కనీసం ఒక భాగాన్ని మీతో పంచుకోనివ్వండి. నీవు వేరొక వూరికి వెళ్లాలా, వద్దా? మీ పిల్లలను ఏ బడికి పంపించాలి? లేక సంఘంలో ఈస్టర్ పండుగ నడిపించాలా, వద్దా? అనే విషయాలు నేను చెప్పలేను. అయితే, నీ జీవితంలో దేవుని చిత్తాన్ని తెలుసుకొని, లోబడి వుండుటకు ఖచ్చితమైన మార్గం నేను చెప్పగలను – కృతజ్ఞత కలిగివుండు. నీవు వున్న పరిస్థితితో సంబంధం లేకుండా, అన్ని సమయాలలో – కృతజ్ఞత కలిగివుండు. అది సరియైనది ప్రతి పరిస్థితిలో కృతజ్ఞత కలిగిన హృదయాన్ని కలిగివుండు. కొన్నిసార్లు కృతజ్ఞత సులువుగా వస్తుంది, కొన్నిసార్లు అది కష్టమైనది. అయితే నీవు కృతజ్ఞత

భావనను అభివృద్ధి చేసుకుని, నిలిచివున్నట్లయితే, నీవు దేవుని చిత్తములో వున్నట్లే. నేనింత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగు తున్నాను? ఎందుకంటే, నేను 1 థెస్సలోనీకయులకు 5:18 చదివాను, అది యిలా చెప్తుంది: "ప్రతి విషయమునందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఈలాగు చేయుట యేసు క్రీస్తునందు మీ విషయములో దేవుని చిత్తము."

ఇక్కడ చూచినట్లయితే, ఈ వచనం మనకు అన్ని విషయాల కొరకు కృతజ్ఞత చెప్పమని బోధించుట లేదు కాని; అన్ని విషయాలలో కృతజ్ఞత కలిగివుండమని చెప్తుంది. ఉదాహరణకు నీ రిఫ్రిజిరేటర్ తెరచి చూసినప్పుడు దానిలో ఉన్న లైటు వెలగటం లేదనుకోండి మరియు అందులో ఉన్న ఆహారము చల్లబడవలసినంత పడలేదని అనుకోండి. అప్పుడు ఓ దేవా! నా రిఫ్రిజిరేటర్ విరిగిపోయింది అని నువ్వు కృతజ్ఞతాస్తుతులు చెప్పనక్కరలేదు లేదా తండ్రి! నా పాలు పాడై పోయినందుకు కృతజ్ఞతాస్తుతులు. ప్రభువా, ఈ రిఫ్రిజిరేటర్ పాడైపోవటం నిజంగా గొప్ప భాగ్యం. దానికై నీకు వందనాలు." అని చెప్పనవసరం లేదు, అది హాస్యాస్పదం అవుతుంది. అయితే, కృతజ్ఞత కలిగివుండటం అంటే, నీకు ఒక రిఫ్రిజిరేటర్ వున్నందుకు, అందులో నువ్వు ఆహారపదార్థాలు వుంచుకోగలుగుతున్నందుకు వందనాలు చెల్లించు. అది మరల బాగుపడనందుకు వందనాలు చెల్లించి, అది బాగుపడు వరకు ఓపికతో ఎదురుచూడు. ప్రతి విషయంలో కృతజ్ఞత కలిగివుండటం అంటే అదే, అదే దేవుని చిత్తము. ఆ విధంగా జీవించు, నీవు దేవుని చిత్తంలో వుంటావు.

ప్రతి విషయంలో కృతజ్ఞత కలిగివుండటం అంటే మన ప్రతిదిన దీవెనలను బట్టి– మన ఆరోగ్యం, స్వాతంత్ర్యం, పనులు చేసుకొనుటకు మన సామర్ధ్యం, వీటిని బట్టి వందనాలు చెల్లించుట. మన జీవితాలలో ఆయన వుంచు మనుష్యులను బట్టి కూడా కృతజ్ఞతలు చెల్లించాలి. మనల్ని మద్దతు చేసే మనుష్యులు, మనతో కలిసి నవ్వేవారు, మనల్ని సవాలు చేసేవారు, జ్ఞానమిచ్చేవారు, మనతో కలసి జీవితాన్ని సంతోషించేవారు.

ఉదాహరణకు, నాతో, డేవ్‌తో కలసి ఒక యౌవనస్తురాలు ప్రయాణం చేస్తుంది. తాను మాకు సహాయం చేయుటకు పిలువబడ్డానని ఆమె అనుకుంటూ వుంటుంది. మేము ఎక్కువగా ప్రయాణాలు చేస్తుంటాము. ఈ యౌవనస్తురాలు, మా కంటే ముందుగా మేము వెళ్లవలసిన ప్రదేశానికి వెళ్లి, మా సామాను అందుకొని, ఆ హోటల్ గదిని ఇంటిలా చేయుటకు తాను చేయగలిగినదంతా చేసేది. మేము వెళ్ళేసరికి మా బట్టలు బీరువాలో వ్రేలాడుతూ వుండేవి అంతా మాకిష్టమైనట్టుగా చక్కగా అమర్చబడి వుండేవి.

మీరు ఎక్కువగా ప్రయాణాలు చేయని వారైతే ఇది ఎంత ఆశీర్వాదమో మీరు అర్థం చేసికొనలేరు. మీరు ఎక్కువ సమయం ఇంటిలోనే వుండేవారైతే, ఎవరైనా కొద్ది రోజులకు ఒక సారి మీ ఇంటికి వచ్చి, మీకు అవసరమైన పనులన్నీ చేసి పెట్టి, నీకు తాజా పువ్వులిస్తే ఎలా వుంటుందో ఆలోచించండి. నీవు ఎక్కువగా ప్రయాణాలు చేస్తూ, బయట గడుపుతూ వుంటే మా టీమ్‌లో వున్న యౌవనస్తురాలిని కలిగియుండటం ఎంత మంచి విషయమో

నీవు అర్థం చేసికొంటావు, అభినందిస్తావు. ఈ విధంగా మాకు సహాయం చేయుటకు ఆమె పిలువబడినప్పటికీ, ఆమె నిజంగా ఈ పనిలో సంతోషిస్తుందని నాకు తెలిసినప్పటికీ, నేను ఆమెను గురించి దేవునికి వందనాలు చెప్పుట ఈ మధ్యనే మొదలు పెట్టాను. నాకు పరిచర్యచేయుటకు, మరియు మా జీవితాలు సులభతరంచేయుటకు, ఆమె చేసిన ప్రతివిషయాన్ని గురించి ఆలోచించినపుడు నా హృదయం కృతజ్ఞతతో నింపబడింది. నేను, "ఓ దేవా మాకు సహాయం చేసే వారి కొరకు నీకు వందనాలు. మా టీమ్‌లో మంచి వారిని ఇచ్చుట ద్వారా నీవు మమ్ములను చాలా ఆశీర్వదించి సహాయం చేశావు, ఈ విధమైన నీ సహాయమునకై కృతజ్ఞత కలిగియున్నాను." అని చెప్పాను.

ప్రతి పరిస్థితిలో సులువైన ప్రార్థన యొక్క భాగ్యాన్ని అభ్యసించుట మనం నేర్చుకొనవలసియున్నది మరియు మన జీవితాలలో ఆయన వుంచిన మనుష్యులను గూర్చి దేవునికి వందనాలు చెల్లించుట దానికి ఒక మార్గము. ఆయన ఇచ్చు వాటన్నిటిని మనం పొందుకుని ఆనందించవలసియున్నది. ఆయన మనకు చేసిన వాటన్నిటి నిమిత్తం ఎల్లప్పుడు ధన్యవాదములు చెప్పవలసియున్నది. మన జీవిత క్రమములో కృతజ్ఞతాస్తుతి నిరంతరంగా వుండునట్లు చూచుకొనుట ఒక భాగమైయున్నది.

## ఫిర్యాదుల ద్వారాన్ని మూసివేయి

ఇ.యమ్ బౌండ్స్ "ధన్యవాదాలు మరియు కృతజ్ఞతాస్తుతులు ఎల్లప్పుడు మన విషయాలలో దేవునిపై మన సణుగులు, ఫిర్యాదులకు వ్యతిరేకంగా నిలువబడతాయి... యదార్థమైన ప్రార్థన ఫిర్యాదులను సరిదిద్ది ధన్యవాదాలను కృతజ్ఞతాస్తుతులను వృద్ధిచేస్తుంది." మనము ఎప్పుడైతే కృతజ్ఞతాస్తుతులు నిరంతరం అలవాటు కలిగివుంటామని అప్పుడు, ఏదైతే చట్టానికి మన జీవితంలో ఎప్పుడూ శోధన, ఫిర్యాదులకు, మనము తలుపులను మూసి వేస్తాము. నేనెప్పుడూ ఫిర్యాదుల ధోరణిని పెంపొందిచిలేదు, నేను ఒకలాగ పుట్టాను, వేరేవిదంగా కృతజ్ఞత పూర్వకమైన స్వభావమును నేను పెంచియుండవలసినది మన జీవితాలలోకి నాశనము తెచ్చునట్లుగా సాతానును అనుమతిస్తుందని. నేను వాక్య భాగాల ద్వారా నేర్చుకున్నాను. కృతజ్ఞతాస్తుతి అనేది దేవుడు మనలను ఆశీర్వదించునట్లుగా ద్వారం తెరుస్తుంది, ఫిర్యాదులు చేయుట అనేది సాతాను మనలను శపించునట్లుగా చేస్తుంది.

దేవుని స్తుతించుటలోను, ఆరాధించుటలోను, కృతజ్ఞతలు చెల్లించుటలోను మనం తీరిక లేకుండా వున్నట్లయితే, ఫిర్యాదులకు, తప్పులెంచుటకు, మరియు గొణుగుటకు చోటేవుండదు. ఫిలిప్పీ 2:14లో "మీరు మూర్ఖమైన వక్రజనము మధ్య నిరపరాధులును, నిష్కళంకులును, అనింద్యులునైన దేవుని కుమారులగునట్లు, సణుగులును సంశయములును మాని, సమస్త కార్యయములను చేయుడి" అనియు 1 కొరింథీ 10:9-10 "మనము

ప్రభువును శోధింపకయుందుము వారిలో కొందరు శోధించి సర్పములవలన నశించిరి.” అనియు బైబిలు చెప్తుంది.

## *ప్రార్థనకు తాళంచెవి*

కృతజ్ఞతలు చెల్లించుట అనేది ప్రార్థనకు చాలా ప్రాముఖ్యం, ఎందుకంటే, స్తుతి, ఆరాధనలవలె ఇది కూడా దేవుని స్పందింప జేస్తుంది. ఇది దేవుడు ప్రేమించేది ఆయన హృదయాన్ని కదిలించేది అయివున్నది. మనం ఈ విధంగా దేవుని సంతోషపరచిన ప్రతిసారి, ఆయనతో మన సన్నిహిత్యం పెరుగుతుంది. అది ఉత్తమమైన ప్రార్థనా జీవితం అవుతుంది.

అంతే కాకుండా, మనం కృతజ్ఞత కలిగివున్నప్పుడు, దేవుని నుంచి ఇంకా ఎక్కువ పొందుకునే స్థితిలో వుంటాము. మనకు వున్న దానితోనే మనం కృతజ్ఞత కలిగి వుండకపోతే, గొణుగు కొనునట్లుగా, దేవుడు ఇంకా ఎందుకిస్తాడు? మరొక విధంగా, మనం అన్ని విషయాలకు యదార్థంగా ధన్యవాదాలతోను, కృతజ్ఞతతోను వున్నామని దేవుడు చూచినప్పుడు, మనలను ఇంకా ఆశీర్వదించుటకు ఇచ్చకలిగి యుంటాడు. ఫిలిప్పీ 4:6 “దేనిని గూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయము లోను ప్రార్థన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియ జేయుడి.” అని చెప్తుంది, మనం దేవుని అడుగు ప్రతి విషయం కృతజ్ఞతను కలిగివుండాలి–ఆ తరువాత ఆయన మన ప్రార్థనలు విని, జవాబు ఇస్తున్నందుకు వందనాలు చెల్లించాలి. మనం ఏ విషయం ప్రార్థిస్తున్నప్పటికీ, కృతజ్ఞతాస్తుతి అందులో ఇమిడి వుండాలి. మన ప్రార్థనలన్నింటినీ, కృతజ్ఞతాస్తుతితో ప్రారంభించుట అనే అలవాటును మనం అభివృద్ధి చేసుకోవాలి ఉదాహరణకు, “నా జీవితంలో చేసిన వాటన్నిటికై వందనాలు, నీవు అద్భుతమైన వాడవు, నేను నిన్ను యధార్థంగా ప్రేమించి అనుభవిస్తున్నాను.”

> మనం దేవుని అడుగు ప్రతి విషయం కృతజ్ఞతను కలిగివుండాలి–ఆ తరువాత ఆయన మన ప్రార్థనలు విని, జవాబు యిస్తున్నందుకు వందనాలు చెల్లించాలి.

నిన్ను నీవు పరీక్షించుకొని, నీ మాటలను, ఆలోచనలను గమనించి, నీవెంత కృతజ్ఞతను వ్యక్త పరుస్తున్నావో చూచుకొమ్మని ప్రోత్సాహపరుస్తున్నాను. నీవు బాధ పడి ఫిర్యాదులు చేస్తున్నావా? లేక నీవు కృతజ్ఞత కలిగివున్నావా? నీకు సవాలు కావాలంటే, ఒక ఫిర్యాదు కూడా చేయకుండా ఒక్క దినం గడుపు. మేడమ్ గుయోన్ ఇలా చెప్పినారు “మనం మన జీవితాలలో సంతోషంగా లేమని, ఒక నిట్టూర్పు కూడా చెప్తుంది” అన్న మాటలు నాకు

ఇష్టం. ప్రతి పరిస్థితిలో కృతజ్ఞతాధోరణిని పెంపొందించుకో నిజానికి, బలవంతంగా కృతజ్ఞతాపూర్వకంగా మీరు దేవునితో నీ సన్నిహితత్వం పెరుగుట మరియు ఆయన ఇంతకు మునుపు కంటే గొప్ప ఆశీర్వాదాలను కుమ్మరించుట గమనించు.

## సారాంశం

స్తుతి, ఆరాధన మరియు కృతజ్ఞతాస్తుతులు మనం చేయదగిన కొన్ని సులువైన ప్రార్థనలు, అయినప్పటికీ శక్తివంతమైన ఆత్మీయ బలాలు. అవి ప్రార్థనలో రకాలు – ఎందుకంటే వాటి ద్వారా మనం ప్రభువు పట్ల మన హృదయాన్ని వ్యక్తపరుస్తాము స్తుతి, ఆరాధన, కృతజ్ఞతాస్తుతులు చేస్తున్నప్పుడు మనం దేవునితో మాట్లాడుతున్నాము – అదే యధార్థమైన ప్రార్థన.

స్తుతి, ఆరాధన మరియు కృతజ్ఞతాస్తుతులు మన ప్రార్థనా జీవితాలను అభివృద్ధి మరియు శక్తివంతం చేస్తాయి. ఎందుకంటే, అవి మన హృదయాలను మనపై కాక దేవునిపై కేంద్రీకరించునట్లుగా చేస్తాయి. అవి మనలను దేవునితో అపేక్ష కలిగిన సంబంధం కలిగివుండునట్లుగాను, మరియు మన అనుదిన జీవితాలో ఆయన సన్నిధిని ఎదుర్కొనునట్లుగాను చేస్తాయి. స్తుతి, ఆరాధన మరియు కృతజ్ఞతాస్తుతులను వ్యక్తపరచుటకు లేక అనుభవించుటకు మనం సంఘ ఆరాధన కొరకు గాని, లేక కూడికకు గాని వేచియుండనవసరం లేదు దినమంతా మన పనుల మధ్యలో, ప్రతి దానిలో మనం దానిని చేయవచ్చును.

### ప్రార్థనాంశములు

- స్తుతి, ఆరాధన మరియు కృతజ్ఞతలు చెల్లించుట అనునవి ప్రార్థనలోని రకాలు ఎందుకనగా మనం వాటి ద్వారానే దేవునితో మనము మాట్లాడగలము.
- సులభంగా చెప్పాలంటే, దేవుడు మన జీవితాలలో చేసిన దానికి మరియు చేయబోయే దానికి మనం అందించే స్పందనయే స్తుతి. దేవుడు ఏమైయున్నాడనే విషయానికి మనం స్పందించుటయే ఆరాధన. దేవుని గుణలక్షణములను మరియు దేవుడు మన జీవితాల్లో చేసియున్న, చేయుచున్న మరియు చేయబోతున్న కార్యములను గురించి ఒప్పుకొనుటయే కృతజ్ఞత చెల్లించుట.
- ఆత్మీయ పరిధిలో స్తుతి అనునది శక్తిని విడుదల చేస్తుంది మరియు మనల్ని ఎప్పుడూ విజయపథంలో నడిపించే ఆత్మీయ యుద్ధమునకు ప్రతిరూపమైయున్నది.

- బైబిలులో ఆరాధన నిర్వచింపబడలేదు గానీ, ఆరాధన ఎలా పనిచేస్తుందో మనకు తెలియజేస్తుంది. మన హృదయములను దేవునియెడల లోతైన, వ్యక్తిగతమైన, సన్నిహితమైన మార్గములలో క్రుమ్మరించినప్పుడు అది మన భారభరితమైన భక్తి, కృతజ్ఞత మరియు ఆయన యెడల మనము కలిగియున్న ప్రేమను ప్రతిబింబిస్తుంది.
- ఆరాధన అనునది పాటలు పాడుట కంటే ఉన్నతమైనది; అది హృదయమునకు సంబంధించిన స్థితి మరియు అభినయం.
- ఫిర్యాదుచేయుట, తప్పులు వెదకుట, గొణుగుట మరియు సణగుట అనునవి చాలా భయంకరమైనవి ఎందుకంటే అవి మన జీవితాల్లో సాతాను పనిచేయునట్లు మార్గములు తెరుస్తాయి. కానీ దేవునికి స్తోత్రము, ఎందుకంటే స్తుతి అనునది ఆ ద్వారాలను మూసివేస్తుంది.
- దేవుడు ఎల్లప్పుడు మన కొరకు గంభీరమైన కార్యములు చేయును మరియు ఆయన ఎల్లప్పుడు నమ్మదగినవాడు. మనం ప్రజలకు ఎల్లప్పుడూ కృతజ్ఞత కలిగిన ప్రజలముగా ఉంటూ ప్రతి పరిస్థితిలోను మన కృతజ్ఞతను ఆయనకు తెలియపరుస్తూ ఉండాలి.

# 6

## సమర్పించుకొనుట మరియు కట్టుబడియుండుట

మీరు ఇంతకు ముందు చదివిన, ఎఫెసీ 6:18, "ఆత్మ వలన ప్రతి సమయము నందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు, ఆ విషయమై సమస్త పరిశు ద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుచు మెలకువగా ఉండుడి." అని చెప్తుంది. అన్ని సమయాలలో ప్రార్థించాలని మనకు చెప్పబడింది ఇప్పుడు ఆత్మలో ప్రార్థించుట అంటే అర్థమేమిటో చూశాము ఇప్పుడు మనం వివిధ రకాలైన ప్రార్థనలను లేక పౌలు చెప్పినట్లు "ప్రతి విధమైన ప్రార్థనను" గూర్చిన అధ్యాయాల మధ్యలో వున్నాము.

మనం అన్ని సమయాలలో ఆత్మలో ప్రార్థిస్తున్నట్లయితే, పరిశుద్ధాత్ముడు మన ప్రార్థనా జీవితాలలో వివిధ కాలములలో నుండి నడిపించుటను నీవు గ్రహిస్తావు ఆయా కాలములకు ఆయా ప్రార్థనా రకాలున్నవి. మనం వివిధ రకాలయిన ప్రార్థన మనం ఇస్తువుంటాము, స్తుతి ఆరాధానా, కృతజ్ఞతాస్తుతులు అనే ప్రార్థన యొక్క వేరు వేరు రకాలను ప్రతిరోజు చేస్తువుంటాము మన ఆత్మలను తేలికగానూ స్వేచ్ఛగానూ వుంచుటకు, అపవాది విరోధంగా ఆత్మీయ యుద్ధంలో ఇవి చాలా విలువైనవి. నిరాశను మరియు నిరుత్సాహమును స్తుతి నివారిస్తుంది. స్తుతి, ఆరాధనలు దేవుని గౌరవిస్తాయి, కాని మనం ఇతర రకాలైన ప్రార్థనలు కూడ ఇతర విషయముల కొరకై చేయవలసిన సమయాలున్నాయి. సమర్పణ మరియు అధీనము చేసికొను ప్రార్థనలను గురించి నేను మీతో పంచుకొనాలనుకుంటున్నాను, దీనినే "చేతులెత్తి" ప్రార్థన అని కూడా అంటారు, ఎందుకంటే, అది మనలను మనం దేవునికి అప్పగించుకొనుట (సమర్పణా ప్రార్థన), మన పరిస్థితులను దేవునికి అప్పగించుట (అధీనము చేయు ప్రార్థన) ఫలితముగా వస్తుంది.

## సమర్పణా ప్రార్థన

ఉదయాన్నే నా చేతులెత్తి, కీర్తనలు 25:1 నందున్న "యెహోవా నీ దిక్కునకు చూచి నా ఆత్మను ఎత్తికొనుచున్నాను." అను సమర్పణ ప్రార్థనను ప్రార్థించుట నాకు చాలా ఇష్టం. ఈ మాటలు నిజమైన సమర్పణను – సంపూర్ణంగా, స్వచ్ఛందంగా దేవునికి అప్పగించుకొనుటను వివరిస్తున్నాయి. సమర్పణా ప్రార్ధనలో నీవు దేవునితో యిలా చెప్తున్నావు "దేవా, ఇక్కడ నేను, నన్ను నేను నీకు అప్పగించుకొంటున్నాను. కేవలం, నా ధనం కాదు, నన్ను నేను అర్పించుకొంటున్నాను. ఆదివారం ఉదయం ఒక్క గంట కాదు, నన్ను నేనుగా అప్పగించుకొంటున్నాను. రోజులో కొంత భాగాన్ని కాదు, నన్నే అప్పగించుకొంటున్నాను. నా 'సంఘ స్నేహితులతో' నా సంబంధాన్ని మాత్రమే కాదు,నన్నే అప్పగించుకొంటున్నాను. నా జీవితమంతటిని నీ యెద్దకు తెచ్చియున్నాను. దానిని నీ బలిపీఠం పై వుంచియున్నాను. నాతో నీవేం చేయదలచుకున్నావో అలా జరిగించు. ఈ దినం నా ద్వారా మాట్లాడు. నా ద్వారా ఈ దినం మనుష్యులను తాకు. నా గురించిన సమస్తము నీ ముందున్నది నువ్వు నాకు దయచేసిన ప్రతి దీవెన నీముందున్నది. నేను యజమానిని కాను, నేను గృహనిర్వాహకుని. నన్ను నీవు ఉపయోగించుకొననిస్తున్న ప్రతిదీ, నిజానికి నీకే చెందుతుంది ప్రభువా. వాటిలో ఏదైనా నీవు వెనుకకు కోరినట్లయితే, దానినంతటినీ నీకు అనుకూలంగా చేస్తున్నాను." మనం "యెహోవా నీ దిక్కునకు చూచి నా ఆత్మను ఎత్తికొను చున్నాను." అని చెప్తున్నపుడు, ఇదే సమర్పణా అనే అర్థాన్ని ఇస్తుంది. ఇవన్నీ చెప్తున్న అర్థాన్ని ఇస్తుంది.

మనం దేనినైనా సమర్పించినప్పుడు, దానిని దేవుని ఉపయోగం కొరకై వేరుగా వుంచుతాము. కాబట్టి, మన జీవితాలను సమర్పించుకొనినప్పుడు, మనం మన శరీర వాంఛలకు, లోక విలువలకు, ప్రకృతి పరమైన ఆలోచనలకు, క్రమశిక్షణలేని జీవిత విధానానికి, చెడు అలవాట్లకు, దేవుని వాక్యంతో ఏకీభవించని ప్రతిదానికి వ్యతిరేకంగా తిరుగుతాము. మన ఉద్దేశాలకు మరియు దైవ సంబంధం కాని ఉద్దేశాలకు మధ్య దూరం పెడతాము. కాబట్టి మనలను దేవుడు ఉపయోగించుకొను నట్లు, మనం అందుబాటులో వుండునట్లు సిద్ధపాటు కలిగివుంటాము.

> మనం దేనినైనా సమర్పించినపుడు, దానిని దేవుని ఉపయోగం కొరకై వేరుగా వుంచుతాము.

మనలను మనం దేవునికి సమర్పించుకొన్నప్పుడు, మనం ఏమైయున్నామో దానంతటినీ దేవునికిచ్చు జ్ఞానము కలిగివుండాలి, మనది కానిది కూడా ఆయనకే ఇవ్వాలని తెలిసికొని

వుండాలి. మన బలహీనతలలో దేవుడు తనను తాను బలముగానూ తరచుగా ప్రభావవంతంగానూ కనపరచుకొంటాడు, కాబట్టి వాటిని ఆయననుంచి దాచవలెనని మనం భావించనవసరంలేదు. ఆయనకు మన గురించి సమస్తము తెలిసేయున్నది, మనలను అపరిమితంగా ప్రేమించుచున్నాడు, కాబట్టి ఆయన యొద్ద ఏదీ దాచవద్దు బలహీనతలు కూడా. సమస్తము ప్రభువునకు కానుకగా సమర్పించు, అప్పుడు నీకు లభించే స్వేచ్ఛను బట్టి నీవే ఆశ్చర్యపోతావు.

## ఇది జాగ్రత్త కలిగిన వ్యవహారం

సమర్పణ గురించి ఇంకా లోతుగా వెళ్ళేముందు, సమర్పించుకోవటం లేక దేవునికి అప్పగించుకొనుట అనేది తేలికగా తీసికొనే విషయాలు కాదని మీరు అర్థం చేసుకోవాలని కోరుతున్నాను. సమర్పణాప్రార్థన ఒక గంభీరమైన ప్రార్థన. అది ఎప్పుడైతే ఒక గంభీరమైన హృదయం నుంచి వస్తుందో అప్పుడు గంభీరమైన ఫలితాలు కనిపిస్తాయి. “గంభీరమైన ఫలితాలు” అంటే అర్థమేమిటంటే, ఎప్పుడైతే మనం దేవునితో, “నా సమస్తము తీసికొని నా జీవితంలో నీ చిత్తానుసారముగా జరిగించు” అని చెప్తామో, దేవుడు పని జరిగించటం మొదలు పెడతాడు. మనందరి జీవితాలలో బలహీనతలున్నాయని మనకు తెలుసు కాబట్టి మనం సమర్పించు కొనినప్పుడు దేవుడు ఆ విషయాలతో పని చేయటం మొదలు పెడతాడు. చూడండి, మనం దేవునికిచ్చినది దేవునికి చెందినదే అవుతుంది, మరియు ఆయన మనల్ని వాడుకొనవలెనంటే, మనలో ఆయన పని జరిగించవలసి యున్నది–మనము ఆయనను అది చేయనివ్వాలి.

సమర్పణ అనేది జరుగుటకు సమయం తీసికొంటుంది. సమర్పణా ప్రార్థన అనేది మనలను మార్చుటకు, తిరిగి అమర్చుటకు మరియు శుద్ధి చేయుటకు దేవునికి సులభమైన ఆహ్వానమైయున్నది. తాను వాడుకొనుటకై దేవుడు మనలను సిద్ధపరచునప్పుడు, మొదటగా ఆయన, మనలో తనను మహిమపరచని వాటిని శుభ్రపరచటం మొదలుపెడతాడు, సరిగా లేని ఆలోచనా విధానం లేక చెడు తలంపులు లేక అలవాట్లు వంటివి.

ఉదాహరణకు, తమ నోటిని మూసివుంచుకొనుట చేతకాని మనుష్యులను మనందరం ఎరిగియున్నాము. దీనిని గూర్చి నేను వ్రాయగలను, ఎందుకంటే నేనూ అలాంటిదాననే ! అలాంటి వారు సమర్పణా ప్రార్థన చేసినప్పుడు, దేవుడు మొదటిగా వారు మాట్లాడే ప్రదేశంలో పని మొదలుపెడతాడు. ఒకప్పుడు తాము మాట్లాడిన మాటలే ఇప్పుడు మాట్లాడలేకపోవటాన్ని వారు కనుగొంటారు. తాము ఏమి మాట్లాడుతున్నాం అను విషయమై వారు జాగ్రత్తపడటాన్ని గమనిస్తారు. సమయం గడిచేకొద్దీ ఇతరులకు క్షేమాభివృద్ధి, ప్రోత్సాహం కలిగించే విధంగా, దేవుని ఘనపరచే విధంగా మాట్లాడటం వారు నేర్చుకుంటారు. ఇతరులు ఇతర సమస్యలను కలిగివుంటారు, వారిని తన ఉద్దేశ ప్రకారం వాడుకునే క్రమంలో వారిని ఏవిషయాలలో బాగు చేయాలో ఆవిషయాలలో పని జరిగిస్తాడు.

మన జీవితాలలోని కొంత మంది మనుష్యులను మన నుండి వేరు పరచటం కూడా ఒక మార్గమైయున్నది. ఉదాహరణకు మనం ఒక స్నేహితునిపై ఎక్కువగా ఆధారపడుటవలన మనం దేవునిపై ఆనుకొనవలసినంతగా ఆనుకొనలేక పోతుండవచ్చు. మనము సంబంధాలలో సమతుల్యతను పాటించకపోయినట్లయితే దేవుడు వాటిని త్రుంచి వేసి పూర్తిగా తనకు చెందునట్లుగా చేసుకుంటాడు.

మనము ఒక సంఘము లేక సమాజములో ఉన్నతమైన మరియు సురక్షితముగా అనిపించు ఉద్యోగములో ఉన్నప్పుడు కూడా, దేవుడు మనలో పని జరిగిస్తాడు. మనం మన స్థాయిలలో కాక తనలో పాతుకొని వుండాలని దేవుడు కోరుతున్నాడు. మనము ఒక నిర్ధిష్టమైన పేరు ప్రతిష్టలు లేక అధికారము కలిగివున్నందువలన కాదు గాని ఆయన ప్రేమిస్తున్నందు వలననే అర్హత కలిగిన వారమయ్యామని మనం తెలుసుకోవాలని ఆయన ఇష్టపడుతున్నాడు. మనం సమతుల్యత పాటించలేని విషయాలను ఆయన తీసివేస్తాడు.

స్నేహితులను లేక మంచి స్థితులను కలిగివుండుటలో తప్పులేదు నిజానికి ఈ రెండింటిలో మనం ఆనందించాలని ఆయన కోరుకుంటున్నాడు, కాని మనం వాటిపై ఎక్కువగా ఆధారపడటం ఆయనకు ఇష్టం లేదు. ఈ ప్రపంచంలో ప్రతిదీ ఒక్క నిమిషంలో కదిలింపబడి మార్చబడుతుంది, దేవుడు మాత్రమే ఎన్నటికీ మార్పులేని వాడుగా వున్నాడు. మనుష్యులు మరియు పరిస్థితులు మనం ఊహించని విధంగా మారినప్పుడు మనం బాధపడి నిరుత్సాహపడకుండునట్లుగా మనం మొదటిగా మరియు ఎక్కువగా తనపై ఆధారపడాలని దేవుడు కోరుతున్నాడు.

ఇప్పుడు నేను చెప్పటానికి ప్రయత్నిస్తున్నదానికి సరిగా సరిపోయే ఉదాహరణగా నేను ఒక వ్యక్తిగతమైన అనుభవాన్ని కలిగియున్నాను: ఒకానొకప్పుడు నాకు చాలా ప్రాముఖ్యమైన స్నేహితుల గుంపును నేను కలిగియుండేదానిని. వాళ్ళు ఎప్పటికీ నమ్మకంగా ఉండి నన్ను ఎప్పుడు భాధ పెట్టరని నేను తలంచేదానిని. నేను బైబిల్ కళాశాలలో మరియు బైబిల్ క్లాసులను బోధించే సంఘంలో సిబ్బందిగా కూడా వున్నాను. ఆ సంఘంలో నేను సుపరిచితురాలనై ఆ సంస్థ చేసే పనులన్నిటిలో ప్రాముఖ్యమైన భాగాన్నైవున్నాను. నా స్నేహితుల గుంపులో మరియు ఆ సంఘంలో నా స్థితితో నన్ను బట్టి నేను చాలా సంతోషించేదానను. నేను వారిపై ఎక్కువగా ఆధారపడివున్నానని లేక వారి నుండి నేను యోగ్యతను, విలువను పొందుకుంటున్నానని, ఆ రెండింటిని పోగొట్టుకునే వరకు నేను గ్రహించలేదు.

నేను వారు ఎన్నడూ చేయలేరు అనుకొన్నదానిని నా స్నేహితులు చేశారు. వారు నాకు వ్యతిరేకంగా తిరిగి, కొన్ని భయంకరమైన విషయాలలో నా మీద తప్పుడు నిందలేశారు. అదే సమయంలో, సంఘంలో నా స్థానాన్ని నేను వదిలిపెట్టాలన్న విషయాన్ని దేవుడు చాలా స్పష్టంగా చెప్పాడు. నేను సమస్తం పోగొట్టుకున్నట్లుగా భావించాను! ఇది ఎందుకు జరుగుతుందో, నా జీవితంలో యిలా ఎందుకు జరిగిందో నాకు అర్థం కాలేదు. కాని,

నెమ్మదిగా దేవుడు యిది నిజానికి, నా సమర్పణా ప్రార్థనలకు తన జవాబులో ఒక భాగమని నాకు చూపించాడు.

> సమర్పణా ప్రక్రియ సామాన్యంగా సౌకర్యవంతమైనది లేక సులభమైనది కాదు. అయితే యిది ఎల్లప్పుడూ మేలు కరమైనది మరియు దాని ఫలితాలు అత్యద్భుతమైనవై యున్నవి.

నన్ను మొత్తం తీసుకొమ్మని దేవుని అడిగాను, నన్ను నేను ఆయనకు అర్పించుకున్నాను మరియు నేను నిజాయితీగా వున్నాను. కొన్ని ఫలితాలను నేను ఊహించలేదు. దేవుని మార్గములో కొన్ని విషయాలున్నాయి ఆయన వాటిని కదిలించవలసివున్నది. మొదట, నేను ఒంటరినై బాధపడ్డాను, కాని సంఘంలో నా స్థానము మరియు నా స్నేహితులలో నా రక్షణ మరియు విలువ పాతుకుని వుందని నేను చూచుట మొదలు పెట్టాను, వాటిని తొలగించుట ద్వారా దేవుడు నాకు గొప్ప మేలు చేశాడు.

నీవు సమర్పణాప్రార్థన చేసినట్లయితే, దేవుని యొక్క అగ్ని వచ్చి నిన్ను నీ జీవితాన్ని శుద్ధపరచుటను నీవు ఊహించవచ్చు. సమర్పణాప్రక్రియ సామాన్యంగా సౌకర్యవంతమైనది లేక సులభమైనది కాదు. కాని ఇది ఎల్లప్పుడూ మేలు కరమైనది మరియు దాని ఫలితాలు అత్యద్భుతమైనదెది.

## సంపూర్ణ సమర్పణ

దేవునికి పూర్తిగా సమర్పించుకొనిన మరియు అమ్మివేయబడిన జీవితాలు జీవించే క్రైస్తవులు సాతానుకు అపాయకరంగా మారతారు. ఈవిధమైన సమర్పణ అంటే మనం సమస్తం దేవునికిచ్చివేయుట, ఏదీ దాచిపెట్టుకొనకుండుటయే. ఎప్పుడైతే మనం దేవుడికి సమర్పించుకుంటామో అప్పుడు దేవునికి మనకు సంబంధించిన ప్రతి విషయం స్పష్టంగా వుంటుంది.

దేవుని కొరకు ఉపయోగించబడుటకు సమర్పించుకొనుటను గూర్చి మనము నిజంగా జాగ్రత్తగా ఆలోచన కలిగి వుంటే, మనము దేవుని దగ్గర దాచి పెట్టిన విషయాలు ఏమైనా వున్నాయేమో చూచుకోవాలి. ఎటువంటి చిన్న, మరియు దాచిన, రహస్య ప్రదేశాలు మన హృదయాలలో వున్నాయా? మనం ఏయే విషయాల నిమిత్తం “ప్రభువా ఆ ఒక్కటి తప్ప, నువ్వు అన్నీ తీసుకోవచ్చు” లేక “ఓ దేవా! నేను దానికి సిద్ధంగా లేను” లేక “దేవా అప్పుడే ఆ సంబంధాన్ని మాత్రం తాకకు” లేక “ప్రభువా అది మానమని మాత్రం చెప్పొద్దు” అని

ప్రార్థిస్తున్నాం? సంపూర్ణ సమర్పణ అంటే "ప్రభువా నేను రోజూ బైబిల్ చదువుతాను నేను వాక్యాలు కంఠస్థం చేసి నీ వాక్యాన్ని నా హృదయంలో దాచుకుంటాను రోజులో అధిక సమయం ప్రార్థనలో గడుపుతాను, కాని ఆ ఒక్క నాకిష్టమైన లోపాన్ని మాత్రం వదులుకొమ్మని చెప్పొద్దు!" అని చెప్పటం కాదు. సంపూర్ణ సమర్పణ అంటే "ప్రభువా–నీకు నన్ను నేను–సంపూర్ణముగా సమర్పించుకుంటున్నాను" అని పూర్ణ హృదయంతో చెప్పటం.

మనం సంతోషించు ప్రతిదానిని మన నుండి దేవుడు తీసివేయాలని అనుకోవద్దు, ఎందుకంటే ఆయన అది ఎప్పటికీ చేయడు – కాని సమస్తము ఆయనకు అందుబాటులో వుండాలి. మనకు ఏది మంచిదో, ఏది మంచిది కాదో ఆయనే ఎంచ వలసియున్నది ఆయనను సంపూర్ణముగా నమ్మటమే మనం చేయవలసిన పని.

మనలను యేసులా తయారు చేయటమే దేవుని యొక్క ప్రాథమిక లక్ష్యం అయివున్నది. రోమా 8:29లో "తన కుమారునితో సారూప్యము గల వారవుటకు వారిని ముందుగా నిర్ణయించెను" అని వ్రాయబడింది. దాని అర్థమేమిటంటే మన క్రియలలోనూ, మన వ్యక్తిగత జీవితాలలోనూ, ఇతరులతో మనం ప్రవర్తించే విధానంలోనూ మన మాటలలోనూ మరియు మన తలంపులలోనూ మనము క్రీస్తులా మారుటకు కొనసాగించాలి అని ఆయన మనలను కోరుతున్నాడు. క్రీస్తులా మారుట ఒక్క రోజులో జరిగే పని కాదు. దానికి సమర్పణా ప్రక్రియ అవసరమైయున్నది. దాని అర్థం మన మానసిక, శారీరక, ఐహిక భావాలు నశించవలసివున్నది.

రోమా 12:1 : "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది" ఇది మనం దేవునికి మనలను మనం ఇచ్చుకొనుటకు ఉద్దేశపూర్వకమైన నిర్ణయం తీసుకోవాలని అర్థమిస్తుంది. దేవుడు మనకు ఒక స్వేచ్ఛా చిత్తాన్ని ఇచ్చాడు. మరియు మనం దేవునికి చెందిన వారమవ్వాలంటే, వున్న ఒకే ఒక్క మార్గం మనకు మనంగా స్వేచ్ఛగా ఆయనకు అప్పగించుటయే తనను సేవించుటకు లేక ఆయనను ప్రేమించుటకు ఆయన ఎప్పటికీ ఒత్తిడి చేయడు. ఆయన మనలను నడిపిస్తాడు, ఉపదేశిస్తాడు మరియు మనలను ప్రేరేపిస్తాడు, కాని అప్పగించుకునే నిర్ణయాన్ని మాత్రం ఎప్పుడూ మనకే వదిలి పెడతాడు. దేవుడు మనుష్యులను చేశాడు, రోబోట్ లను కాదు, మనలను ఒక ప్రత్యేకమైన విధానంలో ప్రవర్తించేటట్లుగ్గా ఆయన చేయడు, ఎందుకంటే స్వంత నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఆయన మనకిచ్చాడు – ఆయనను ఎంచుకోవాలని కోరుకుంటున్నాడు. ప్రతి దినము ఆయన మన జీవితాలను బలిపీఠము ఎదుట పెట్టి, "దేవా నీ చిత్తము నెరవేరును గాక నా చిత్తము కాదు" అని చెప్పాలని కోరుకుంటున్నాడు. అర్థవంతంగా ప్రార్థిస్తే, ఇది మనం చేయగలిగిన శక్తివంతమైన ప్రార్థన. ఇది క్లుప్తంగా సులువుగా వుంటుంది, కాని దేవుడు కోరుకునే సంపూర్ణ సమర్పణను ఇది

తెలుపుతుంది. దేవుడు దేని విషయంలోనైనా నీలో పని జరిగిస్తున్నట్లయితే, దానిని సమర్పించుటలో ఆలస్యం చేయవద్దని మిమ్మును ప్రోత్సాహపరుస్తున్నాను. నీ ఆలోచనలలో నీవు కొంత సమయం తరువాత అప్పగించుకోవాలని అనుకుంటూ వుండవచ్చును, కాని మంచి ఉద్దేశాలు అనేవి విధేయతతో సమానం కాదని జ్ఞాపకం చేసుకోండి – మరియు ఆయన విధేయతను కోరుతున్నాడు.

## *నీ సభ్యులను దేవునికి బహూకరించు*

రోమా 12:1 లో పౌలు గారు "మీ శరీరములను (మీ సభ్యులను, సిబ్బందినంతటినీ) సజీవయాగముగా ఆయనకు సమర్పించుకొనుడని" మనలను ప్రోత్సాహపరుస్తున్నాడు. నిజంగా మన శరీరాలను మనం దేవునికి సమర్పించుకొన్నట్లయితే మనము రోజంతా మంచంపై పడుకొని, తినుబండారాలు తింటూ, ప్రకటనలు చూస్తూ మనం సమర్పణాజీవితాలు జీవిస్తున్నామని ఆలోచించము. సమర్పణా జీవితాలను జీవించే క్రమంలో, మనం ఉదయాన్నే లేచి, మన బైబుళ్ళు తీసి దేవునితో సమయాన్ని గడుపుతూ ఆయనకు మనలను మనం సమర్పించుకోవాలి. మన శరీరాలను దేవునికి బహుమానాలుగా మనం చూచినప్పుడు, ఆయన ఉపయోగించుకునే సాధనాలుగా చూచినపుడు మనం మన శరీరాలను పాడు చేసుకోము, నిరంతరంగా వాటిని అనవసరమైన వాటితో నింపము సరైన విశ్రాంతి లేకుండా వాటిని బలహీనపరచము, దేవుని ఘనపరచు రీతిలో దుస్తులు ధరిస్తాము మనము ఆధునికంగానే అయినప్పటికీ దేవుని ఘనపరచు రీతిలో దుస్తులు ధరిస్తాము. మనము దేవుని కనుపరచాలి కానీ లోకాన్ని కాదన్న విషయాన్ని జ్ఞాపకముంచుకోండి.

రోమా 12:1 లో వ్రాసిన విధంగా విధేయత చూపుటకు మనం మన "సభ్యులను మరియు సిబ్బందిని" దేవునికి ఇచ్చుటకు నిర్ణయించుకోవాలి. మరొక మాటలో మన మనలను, సామర్థ్యాలను మరియు ఉద్రేకాలను ఆయనకు అర్పించాలి. మన మనసులను సాతాను ఉపయోగించుకోనివ్వకూడదు. మన మనసు వాడికి యిష్టమైన యుద్ధరంగం, వాడు దినమంతా ఆలోచనా బాణాలను సంధిస్తూనే వుంటాడు. చాలా సమయాలలో అవి కుయుక్తి, కపటమైన మరియు మోసకరమైన ఆలోచనలైవుంటాయి, కాబట్టి మనం అవి నమ్ముటకు సులువైనవిగా అనుకుంటాము. మన సంతోషాన్ని, సమాధానాన్ని దొంగిలించుటకు మనం చెడిపోయామని, అర్హతలేని వారమని తలంచుటకు ఏమి చెయ్యాలో అన్నీ చేసి, చెప్పవలసిన అబద్ధాలు, నిందలు వాడు చెప్తాడు. ఇతరుల గురించి పాపకరమైన ఆలోచనలతో వాడు మన మనసులను నింపుతాడు. మన దారిలోకి ఆలోచనలను పంపకుండా మనం వాడిని ఆపలేము, కాని మనం వాటిని నిరోధించి, గద్దించి వాటిపై యుద్ధం చేయగలం. దేవుని బిడ్డలపై పడుట అనేది వాడికి జీవ మార్గంలా వున్నది. కాబట్టి, మనం కూడా ప్రార్థనను జీవమార్గంగా ఎంచుకొనవలసియున్నది. నిజంగా చెప్పాలంటే, నేను సిద్ధపడుటకు

దేవుని వాక్యము సాతానును ఎదిరించే శక్తినిస్తుంది.

పట్టేంత సమయంలో ఒక డజను ఆలోచనలను నేను గద్దించవలసి వచ్చిన రోజులు కూడా వున్నాయి! కాని దేవునికి వందనాలు, అది ఎలా చేయాలో నాకు తెలుసు. యితరుల గురించి వాడు నాకు చెడు ఆలోచనలను ఇచ్చినపుడు ఎదిరించుటకు ఉత్తమ మార్గాలలో ఒకటి ఆ వ్యక్తి గురించి వెంటనే ప్రార్థించుట అని నేను నేర్చుకున్నాను. మన ఆలోచనలను మనం సరియైన వాటితో నింపుకున్నప్పుడు తప్పుడు వాటికి చోటే వుండదు.

సాతాను యొక్క అబద్దాలను ఆపుటకు మనం ఏమి చేయాలి? యేసు ఏమి చేశాడో అదే చేయ్యాలి మనం మన నోరు తెరచి, "యిలా వ్రాయబడియున్నది" అని చెప్పి సాతానుని అబద్ధికునిగా ఋజువు చేయు బైబిల్ వాక్యాన్ని ఎత్తి చూపించవలసివున్నది. ఉదాహరణకు ఒక వ్యక్తి గురించి వాడు అబద్ధాలు చెప్తున్నట్లయితే, "ప్రేమ అన్నింటినీ నమ్ముతుందని అన్నిటికీ తాళుకుంటుందని బైబిల్ చెప్పుచున్నది. నేను ప్రేమలో నడుస్తున్నాను, మరియు ప్రేమ ప్రతి మనిషిలోని ఉత్తమమైన దానిని ఎల్లప్పుడూ నమ్ముతుంది. ఆ వ్యక్తి ఫలానా ఫలానా విధంగా వున్నాడని నా దగ్గర ఏ ఋజువు లేదు. కాబట్టి నేను దాని నమ్మబోవటం లేదు సాతానా" అని చెప్పుట ద్వారా ఆ అబద్దాలను ఖండించవచ్చు. దేవుని వాక్యము సాతానును ఎదురించుటకు శక్తినిస్తుంది. ఉదాహరణకు నా భవిష్యత్తు బాగుండదని నాకు చెప్పుటకు సాతాను ప్రయత్నించి నప్పుడెల్లా, నా భవిష్యత్తుని గురించి దేవుడు సమాధానకరమైన ఉద్దేశ్యములు కలిగియున్నాడని చెప్పు యిర్మియా 29:11 ను ఎత్తి చూపుతాను. మనం వాక్యాన్ని తెలుసుకొనుటకు ఒక కారణం ఏమిటంటే దాని ద్వారా మనం సాతానును ఓడించగలం. వాడిని కొట్టే ఆయుధం ఇదే, మనం ఉపయోగించుకోవాలి.

మనం ప్రభువునకు మన "సభ్యులను మరియు సిబ్బందిని" సమర్పించుకొనినప్పుడు ఆయనకు మన సామర్థ్యాలను, మన నైపుణ్యాలను, మన తలాంతులను ఇస్తున్నాము. చాలా మంది తమ సామర్థ్యాలను తమ పనిలో ఉపయోగిస్తారు. అంటే తమ వృత్తి జీవితాలలో–తమ ఉద్యోగములో నీతిని, సమయాన్ని సద్వినియోగ పరచుకొనుటను, తమ కంపెనీ వస్తువుల విషయంలో తమ గృహ నిర్వాహకత్వమును తమ సాటి పని వారితో తమ ప్రవర్తనను దేవునికి మహిమ తెచ్చే విధంగా వుంచుకుంటారు. మనం యజమానుని కొరకు పని చేస్తున్న వారిగా కాక దేవుని కొరకు పనిచేస్తున్న వారిగా చూచుకోవాలి. మనం ప్రతి దినం పనికి వెళ్ళి, ప్రతిదీ సరిగా శ్రేష్టంగా చేయాలన్న నిర్ణయాన్ని కలిగి వుండాలి.

ఎవరైనా ప్రతి రోజు పనికి వెళ్ళి, ఎవరూ చూడనప్పుడు ఇంటర్‌నెట్ చూస్తూ వుంటే వారు దొంగిలిస్తున్నారు. దీనికి లెక్కలు కనపరచు విభాగానికి వెళ్ళి డబ్బు తీసుకొనుటలో

పెద్ద తేడా లేదు. ఒక రోజులో కొన్ని నిర్ధిష్ట గంటలు పని చేయటానికి కొంత జీతాన్ని మాట్లాడుకున్న వాళ్ళు ఆ సమయాన్ని పాటించవలసియున్నది. ఎవరూ చూచుటలేదని మనం చేయకూడని పనులు చేయకూడదు. ఎవరికీ కనబడకుండా పనిని ఎలా వదిలేయవచ్చు లేదా త్వరగా ఎలా ఇంటికి వెళ్ళవచ్చు అని ప్రయత్నించకూడదు. దేవునికి సమర్పించుకున్న జీవితాలు కలవారు ఆయన తమను ఎల్లప్పుడూ చూచుచుంటాడని తెలిసికొనియుంటారు. ఆయన సన్నిధిలో తమ జీవితాలు జీవిస్తున్నామని తమ ఆలోచనలు, తమ క్రియల ద్వారా ఆయనను సంతోషపరచాలని వారు ఎరిగియుంటారు. వారు తమ జీవితాలను దేవుని ఎదుట కొలస్సీ 3:23 లో "ప్రభువు వలన స్వాస్థ్యమును ప్రతిఫలముగా పొందుదుమని యెరుగుదురు గనుక, మీరేమి చేసినను అది మనుష్యుల నిమిత్తము కాక ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి, మీరు ప్రభువైన క్రీస్తునకు దాసులై యున్నారు." అని చెప్పబడినట్లుగా వెలుగులో నడువవలసియున్నది.

మనం ప్రభువునకు మన "సభ్యులను మరియు సిబ్బందిని" సమర్పించుకొనినప్పుడు ఆయనకు మన సామర్థ్యాలను, మన నైపుణ్యాలను, మన తలాంతులను యిస్తున్నాము. చాలా మంది తమ సామర్థ్యాలను తమ పనిలో ఉపయోగిస్తారు. అంటే తమ వృత్తి జీవితాలలో-తమ ఉద్యోగములో నీతిని, సమయాన్ని సద్వినియోగ పరచుకొనుటను, తమ కంపెనీ వస్తువుల విషయంలో తమ గృహ నిర్వాహకత్వమును తమ సాటి పని వారితో తమ ప్రవర్తనను దేవునికి మహిమ తెచ్చే విధంగా వుంచుకుంటారు. మనం యజమానుని కొరకు పని చేస్తున్న వారిగా కాక దేవుని కొరకు పనిచేస్తున్న వారిగా చూచుకోవాలి. మనం ప్రతి దినం పనికి వెళ్ళి, ప్రతీది సరిగా శ్రేష్టంగా చేయాలన్న నిర్ణయాన్ని కలిగి వుండాలి.

## *ఆయనను సంతోషపరచుటకు*

నీ పూర్ణ హృదయముతో, సమస్తము దేవునికై చేయుట అనునది సమర్పణాజీవితానికి ఒక గురుతైయున్నది. ఇది దేవునితో "దేవా, నేను నీకు చెందియున్నాను" అని చెప్పుటయే. ఇప్పుడు నేను మీకు యివ్వబోవు గొప్ప ప్రత్యక్షత ఏమిటంటే, నీవు నీ సొత్తు కాదు. మొదటి కొరింథీయులకు 6:19-20 "మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తు కారు, విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" అని చెప్తుంది.

మనం-యేసుక్రీస్తు రక్తం-అనే వెల ఇచ్చి కొనబడ్డాము. మనం మనకు చెందినవారము కాదు, ఆయన మనలను కొనియున్నాడు, మన జీవితాలు దేవునికి సమర్పింపబడినవైనట్లైతే చేయాలని మనకు కలిగిన ప్రతి ఆలోచనను ఉద్దేశ పూర్వకంగా ఆయన ఎదుట వుంచుతాము. దేవుడు సంతోషపరచటానికి మనుష్యులు కావాలి కాబట్టి, మనం భూమిమీద లేము.

మనల్ని సంతోషపరచటం ఆయన పని కాదు. దానికి వ్యతిరేకంగా, మనము ఆయనను సేవించుటకు, సంతోషపరచుటకు, భూమిపై ఆయన ఉద్దేశాలను విస్తరింపజేయుటకు వున్నాము. వ్యక్తిగతంగా, నా జీవితంలో దేవుని పిలుపును నెరవేర్చుటకంటే నన్ను సంతోషపరచుదానిని, గొప్పభాగ్యాన్ని గూర్చి నేను ఆలోచించలేను.

కొంతమంది, తమను ఎవరూ సంతోషపరచలేరేమో అని భయపడి, తమను తామే సంతోషపరచుకోవాలనుకుంటారు. ఎవరూ తమను గురించి శ్రద్ధ తీసుకోరు గనుక, తమను గురించి తామే శ్రద్ద తీసుకోవాలని వారు తలుస్తారు. కాని, సత్యమేమిటంటే, దేవుడు మనకు నిజంగా సంతోషకరమైన జీవితాన్నిచ్చి, మన గురించిన శ్రద్ధ తీసుకొంటాడు. మనం "దేవా, నన్ను నేను సంతోషపరుచుకొనునట్లుగా ఇక జీవించదలచుకోవటం లేదు. నేను నిన్ను సంతోషపరచునట్లు జీవించబోతున్నాను. నిన్ను సంతోషపరచునట్లు నేను జీవించినట్లయితే, నీవు నన్ను గూర్చి, నా సంతోషాన్ని గూర్చి శ్రద్ధ తీసుకుంటావని నేను నమ్ముతున్నాను." అని చెప్పినపుడు, అదే జరుగుతుంది.

మా సామర్థ్యమునకు తగినట్లుగా, నేను, డేవ్ మా జీవితములను దేవునికి సమర్పించుకొన్నాము. మేము దానిని గొప్ప విషయంగా చేసియున్నాము, మరియు మా అనుదిన జీవితాలలో ప్రతి విషయంలో క్రమంగా మేము దానిని అనుసరిస్తున్నాము. మాకు సంబంధించిన ప్రతిదీ దేవునికి చెందాలని మేము కోరుకుంటాము. మేము కష్టపడి పనిచేస్తాము. ఎల్లప్పుడూ ప్రయాణిస్తూవుంటాము. మా హృదయాలను ఇతరుల ముందు క్రుమ్మరిస్తాము. మీకు తెలుసా? దేవుడు మా గురించి చాలా శ్రద్ధ తీసుకుంటాడు! ఆయన మా ప్రతి అవసరతను తీర్చి ప్రత్యేకమైన విషయాలలో మేము కూడా చేసుకోలేని విధంగా అన్నీ అమర్చాడు.

ఉదాహరణకు, డేవ్‌కు గోల్ఫ్ అంటే ఇష్టమని అందరికీ తెలుసు మేము మొదటగా ప్రయాణించుట మొదలు పెట్టినపుడు, అతను తన గోల్ఫ్ ఆటలో వున్నాడు మరియు ఆ ఆటకు సంబంధించిన కొన్ని కార్యక్రమాలు కలిగివున్నాడు. కాని, తన జీవితాన్ని దేవునికి సమర్పించుటలో భాగంగా, తన అభిమాన క్రీడను, అతను బలిపీఠంపై పెట్టవలసివచ్చింది. తాను ఆడవలసివచ్చినపుడు ఆ కోర్సుకు ఒక్కడే వెళ్ళవలసివచ్చింది, ఎందుకంటే తన స్నేహితులు వారాంతంలో ఆడుతున్నపుడు తాను యింటిలో లేడు. గోల్ఫ్ అతనికి చాలా సంతోషాన్నిచ్చేది గనుక అది నిజంగా అతనికి ఒక త్యాగమే.

సంవత్సరాల తరువాత, ఇప్పుడు, దేవుడు డేవ్‌ను చాలా ఆశీర్వదించాడు, ప్రపంచంలోని ఉత్తమమైన గోల్ఫ్ కోర్సులను తాను తీసుకున్నాడు – తరచుగా ఏ రిస్కు లేకుండా! కొంతమంది నైపుణ్యం గలవారితో ఆడినాడు, కొన్ని సార్లు వారు అతనిని క్రొత్త క్లబ్బులకు, ఆటలకు కూడా పంపిస్తుంటారు: దేవుని కొరకు గోల్ఫ్ వదలుట అతనికి కష్టమైనదే, కానీ అతను దానిని ఇష్టపూర్వకంగా చేశాడు. యెప్పుడు దేవుడు అతనికి తాను తన గురించి శ్రద్ద

తీసుకుంటూ వున్నట్లయితే పొందుకొనలేనివాటిని ఇస్తున్నాడు. మనం మనలను యేసుకు అప్పగించుకున్నప్పుడు, దేవుడు మనకు ఉపకారము చేస్తాడు. మనలను ఆశ్చర్యపరచు, ఆనందపరచు విషయాలు సంభవించటం మొదలౌతుంది.

సమర్పణ అనేది ఆశీర్వాదాన్ని తెస్తుంది ప్రభువునకు నీ జీవితం ఇచ్చుట గౌరవమై యున్నది ఆశీర్వదింపబడుటకు నీవు దీనిని చేయకూడదు కాని ఆశీర్వాదాలు దీనిని అనుసరిస్తాయి, దేవుడు వాడుకొనునట్లుగా నీ జీవితమును వేరు పరచుకొనుట, ఆయనకు సంతోషాన్నిస్తుంది, మరియు దానికి బదులుగా ఆయన నీ జీవితాన్ని నీవు ఆనందించుటలో సహాయం చేస్తాడు.

## *దానికి సమయాన్నివ్వు*

తాను ఇప్పుడు ఆడుతున్నట్లుగా గోల్ఫ్ ఆడుటకు, డేవ్ కొన్ని సంవత్సరాలు ఎదురుచూడవలసి వచ్చినట్లుగా, మనందరి సమర్పణాజీవిత క్రమములు కూడా లేక సమర్పణాజీవిత ఆశీర్వాదములు పొందుకొనుటకు వాటిని గర్భమున ధరించినట్లుగా వుండవలసిన సమయమున్నది. దేవుడు మనలను తాను వాడుకొనునట్లుగా వేరుపరచుకొని, మనలో క్రియ జరిగిస్తున్నప్పుడు, మనం సహనం కలిగియుండవలెను. మనతో పని చేయునపుడు ఆయన సమయాన్ని వ్యర్థం చేయడు, కాని మన జీవితాలలో లోతైన, సమగ్రమైన, ఎన్నటికీ చెడిపోని పనిని చేయుటకు అవసరమైన సమయాన్ని తీసుకుంటాడు. మనం మన శరీరక ఆసక్తికి అనగా "కొంత సంభవించు నట్లుగా" ప్రయత్నించు, దానిని అంచనా వేయుటకు లేక దేవుని ఉద్దేశ్యములను మన స్వంత శక్తితో లేక బలంతో నెరవేర్చుటకు ప్రయత్నించు ఆశను విరోధముగా శ్రద్ధగా కాచుకోవాలి.

చాలా మంది విశ్వాసులు దేవుని త్వరపెట్టాలని లేక తమ జీవితాలలో ఆయన పని జరిగించుచుండగా ఆయనకు "సహాయం" చెయ్యాలని ప్రయత్నించుటను నేను చూశాను. నేను కూడా అలానే చేశాను – అటువంటి శరీరక శ్రమ పూర్తిగా అలసిపోజేస్తుంది. మన హృదయాలు దేవునికి సమర్పించినప్పటికీ, ఆయనను ప్రభావవంతంగా సేవించునట్లుగా మనలను దేవుడు శుద్ధిపరచుచుండగా ఆయన సమయమునకై అప్పగించుకోవాలి మనం ఆయన సమయాన్ని అర్థంచేసుకొనలేము, మరియు దాని వలన మరింత

మన హృదయాలు దేవునికి సమర్పించినప్పటికీ, ఆయనను ప్రభావవంతంగా సేవించునట్లుగా మనలను దేవుడు శుద్ధిపరచుచుండగా ఆయన సమయమునకై అప్పగించుకోవాలి

అసహనంగా, నిరుత్సాహంగా మారతాయి. అయినప్పటికీ, మనం మన కన్నులు బహుమానంపై వుంచుకొనవలెను. మనం ఓర్పు చేతను, విశ్వాసము చేతను వాగ్ధానములను స్వతంత్రించుకుంటాము అని బైబిల్ చెప్తుంది (హెబ్రీ 6:12 చూడండి) మన జీవితాలను సమర్పించుకొనినప్పుడు, మనం దేవుని ఘనపరుస్తున్నాము, దానిని సంపూర్ణంగా చేయు క్రమంలో, ఆయన ఎంచుకున్న సమయం ప్రకారం సమర్పణాక్రమాన్ని పూర్తి చేయుటకు ఆయనను అనుమతించాలి. అలా చేసినపుడు, మన జీవితాలలో ఆయన సన్నిధి, శక్తి యొక్క గొప్ప బహుమానాలను కోస్తాము, మరియు దేవునిచే వాడబడు వర్ణింపలేని అనుభూతిని పొందుతాము.

సమర్పణాప్రార్థన అనేది నిజాయితీ లేకుండా సులువుగా చేసేది కాదని మీరు గ్రహించివుంటారని ఆశిస్తున్నాను. కాని, మీరు ఆ ప్రార్థనను నిజాయితీగా చేసినప్పుడు, ఆ ఫలితం ఎప్పటికీ మీకు నిరుత్సాహాన్ని ఇవ్వదు.

## అధీనము చేసికొను ప్రార్థన

నీవు ఎప్పుడైనా మరొక మనిషిని కలిసినట్లయితే, ఎప్పుడైనా ఒక సంబంధంలో వున్నట్లయితే, ఎప్పుడైనా ఒక ఉద్యోగాన్ని కలిగి వున్నట్లయితే, ఎప్పుడైనా నీ జీవితం కొరకైన దేవుని ఉద్దేశ్యాన్ని గ్రహించాలని లేక ఆత్మీయంగా ఎదగాలని అనుకున్నట్లయితే – నీవు ఖచ్చితంగా కొన్ని సమస్యలు ఎదుర్కొంటావు. సమస్యలు అనేవి జీవితంలో భాగాలు, నీవు ఒక సమస్య నుండి విడదల పొందినట్లయితే, దాని వెనుకనే మరొక సమస్యను కలిగివుంటాము! మనందరి విషయంలో అది సత్యమైయున్నది, మనం ఎదిరించుటకు, సహించుటకు, ధృఢంగా వుండుటకు, విజయవంతమైన జీవితాలు జీవించుటకు మనం సామర్థ్యాలు పెంపొందించుకున్నప్పటికీ, పరిణితి చెందినప్పటికీ, ఒక దాని తర్వాత, యింకొక సమస్యను ఎల్లప్పుడూ ఎదుర్కొంటాము.

నీకు సమస్యలున్నట్లయితే, ఈ అధీనము చేసికొను ప్రార్థన నీ కొరకే. అధీనము చేసికొను ప్రార్థన అంటే ఏమిటి? సులువుగా చెప్పాలంటే, ఇది దేవునికి నీ సమస్యలను ఇచ్చుటయే, అంటే విషయాలను ఆయన అధీనం చేసి, సమస్యల నుండి, ఒత్తిడుల నుండి విడుదల తీసికొని, ప్రతి దానిలో ఆయనను పనిచేయనివ్వాలి. మన ఒత్తిడులను, పరిస్థితులను ఆయన అధీనం చేయుట మనం నేర్చుకున్నట్లయితే, మరింతగా మన జీవితాలను ఆనందిస్తాము, సంతోషాన్ని కలిగించేవారముగా వుంటాము, మరియు మనము అత్యంత ఆనందముగాను మరింత విశ్రాంతిగాను వుంటాము. జీవితాంతం శ్రమపడుతూ మనం చేసేవాటికంటే ఎక్కువగా దేవుడు ఒక్క నిమిషంలో చేయగలడు. ఆయన నెరవేర్చలేనంత పెద్ద కార్యం, ఆయన పట్టించుకోలేనంత చిన్న కార్యం ఏదీ లేదు. మనకు సంబంధించిన ప్రతిదీ ఆయన ఎరిగియున్నాడు, కాబట్టి, సమస్తము ఆయనకు ఇచ్చి, జీవితాన్ని ఆనందించండి.

## *దీనిని దేవునికివ్వు.......*

అనేకమంది సమస్యలకు ఒకే రీతిగా స్పందిస్తారు: వారు వెంటనే ఆ సమస్యను తమకు తాముగా పరిష్కరించాలనుకుంటారు. అది పనిచేయకపోతే, వారు వెంటనే ఒక స్నేహితునికో లేక ఆ సమస్యను సరిచేయగలరనుకున్న వేరొక వ్యక్తికి ఫోన్ చేస్తారు. కాని, ఫోన్ దగ్గరకు పరుగెత్తుటకు ముందు మనం సింహాసనం వద్దకు పరుగెత్తాలని నేను మీకు చెప్పదలచుకున్నాను. నేను ఇంతకు ముందుగానే వ్రాసినట్లుగా, ప్రతి పరిస్థితికి మన మొదటి స్పందన ప్రార్థన అయి వుండాలి.

మన జీవితాలలో నిజంగా తన పనిని చేయుటకు దేవుడు వస్తాడు?మన స్వంత మంచి తలంపులను అనుసరించి జీవించుటకు ప్రయత్నించుట మనము మానినప్పుడు. దేవుడు ఎప్పుడు మన సమస్యలను పరిష్కరిస్తాడు? వాటిని పరిష్కరించుటకు ప్రయత్నించుట వదలివేసినప్పుడు. మన పరిస్థితులలో దేవుడు ఎప్పుడు కలుగజేసుకుంటాడు? వాటిని గురించి చింతపడుటను మనం మానినపుడు. ఎప్పుడు దేవుడు మనకు జవాబులిస్తాడు? ప్రతిదీ మన స్వంతంగా అంచనాలు వేసుకొనుట మానినపుడు. కీర్తనలు 37:5 "నీ మార్గమును యెహోవాకు అప్పగింపుము. నీవు ఆయనను నమ్ముకొనుము, ఆయన నీ కార్యము నెరవేర్చును" అనియు, సామెతలు 16:3 "నీ పనుల భారము యెహోవామీద నుంచుము, అప్పుడు నీ ఉద్దేశములు సఫలమగును." అనియు చెప్తుంది.

అనేక సమయాలలో మన "క్రియలు" మనం మన హృదయాలలో మనం "క్రియ" జరిగించేవి అయివుంటాయి– మన కారణాలు, మన విశ్లేషణ, ఏం జరుగుతుంది, మనం ఏం చేయాలి అనే వాటి విషయమై మనం వేసుకునే అంచనాలు. కాని మన క్రియలను దేవునికి ఇచ్చినట్లయితే, మన ఉద్దేశ్యములను సఫలం చేస్తానని దేవుడు చెప్తున్నాడు మరొక మాటలో, మన హృదయాలను మనం మౌనంగా వుంచినట్లయితే, ఆయన మన ఆలోచనలను తేటపరచి, తన సలహాలు, వ్యూహాలు మరియు నిర్దేశకత్వాలు ఇస్తాడు. మన మనసులలోంచి తప్పుడు ఆలోచనలను తీసివేసినప్పుడు, ఆయన సరియైన ఆలోచనలను యివ్వగలడు, తప్పుడు సలహాలను తొలగించుకొనినప్పుడు, ఆయన గొప్ప సలహాలను ఇవ్వగలడు.

అధీనము చేసికొను ప్రార్థనలో మొదటి మెట్టు ఏమిటంటే, చింతపడుట, కారణాలు వెదకుట మానివేసి మన క్రియలను (ఆలోచనలను) దేవుని అధీనం చేయుట. అధీనము చేసికొను ప్రార్థన, దేవునితో "దేవా, నేను దీనిని నీకిస్తున్నాను ఈ సమస్యను నీకిస్తున్నాను, ఈ పరిస్థితిని

> మన త్రోవలను దేవునికి యిచ్చుట అంటే నిజానికి అర్థమేమిటి? వాటిని మన నుంచి, దేవుని వైపునకు మళ్ళించుట.

నీకిస్తున్నాను ఈ సంబంధాన్ని నీకిస్తున్నాను నేను దీనిని పూర్తిగా వదిలివేస్తున్నాను ఇది నాకు నిజంగా చాలా ఎక్కువ, దీనిని నేను పరిష్కరించలేను దీనిని గూర్చి చింతపడటం, అంచనాలు వేయటం అన్నీ ఆపివేసి – నీకు వదిలేస్తున్నాను. దేవా, నన్ను నేను కూడా నీకు ఇచ్చుకుంటున్నాను, ఎందుకంటే నాకు నేనుగా కూడా ఏమి చేయలేను సమస్తం నీకే ఇచ్చివేస్తున్నాను. నా బలహీనతలను సమస్యలను నీకిస్తున్నాను. నేను మారాలని కోరుకుంటున్నాను, కాని, నీవే నన్ను మార్చాలి అని చెప్తుంది. నా పని నమ్ముట మాత్రమేనని, నన్ను మార్చుట దేవుని పని అని నేను గ్రహించిన రోజు, నా జీవితంలో నిజంగా చాలా గొప్ప రోజు.

మన త్రోవలను దేవునికి ఇచ్చుట అంటే నిజానికి అర్థమేమిటి? వాటిని మన నుంచి, దేవుని వైపునకు మళ్ళించుట. ఒక ఆంగ్ల బైబిల్ అనువాదం ఈవిధంగా వుంటుంది: "నీ క్రియలను ప్రభువు పైకి మళ్ళించు (ఆయనకే వాటిని పూర్తిగా అధీనం చేయి ఆయన నీ ఆలోచనలను, తన చిత్తానికి అనుకూలంగా మార్చుతాడు, మరియు) నీ ఉద్దేశ్యాలను ఆయన సఫలం చేసి స్థిరపరుస్తాడు." మరొక మాటలో, మన ఆలోచనలు, ఆయన ఆలోచనలుగా మారతాయి, దాని వలన మనం, ఆయన కోరినదే కోరుకుంటాము. అది జరిగినప్పుడు, మన ప్రణాళికలు సఫలం అవుతాయి, ఎందుకంటే మన ఆలోచనలు దేవుని ప్రణాళికలతో సంపూర్ణంగా ఏకీభవిస్తాయి. కాబట్టి అనేక సమయాలలో మనకు సమస్యలు ఎందుకు వస్తాయంటే, మనం దేవుని చిత్తాన్ని చేయుటకు యిష్టపడము, లేక ఆయన మార్గాన్ని కోరుకోము. అయితే ఆ సమస్యలను ఆయన వైపునకు మళ్ళించినప్పుడు, మనం సంతోషంగా, ఆశీర్వాదకరంగా వుంటాము.

## ...మరియు దానిని వెనుకకు తీసికోకు

నీ పుట్టిన రోజు పండుగనాడు నీ స్నేహితురాలు నీకొక బంగారు నగ బహుమతి చేసిందనుకుందాం. తరువాత నీ యింటికి వచ్చి "ఒక్క సారి అది నాకు వెనుకకు ఇస్తావా, నేను ఈ రాత్రికి దానిని వేసుకోవాలనుకుంటున్నాను." అంటే నీకెలా వుంటుంది, అది చాలా వింతగా వుందని నీవు తలుస్తావు. కాని మరుసటి రోజు, ఆమె ధన్యవాదాలు ఇది నాకు చాలా అవసరమైంది, ఇది నీదని నాకు తెలుసు, కాని నన్ను పెట్టుకోనిచ్చినందుకు నిన్ను చాలా అభినందిస్తున్నాను. మరలా ఎప్పుడూ ఇలా అడగను. "అంటే నీవు ఆమెను ఈ సారి నమ్ముతావు. కాని, ఆమె మరుసటి రోజు వచ్చి," ఈ రోజు మీటింగ్‌కు ఆ బంగారునగ పెట్టుకుని, ఈ

> మన సమస్యలు దేవుని చేతులలో విశ్రాంతి పొందుతున్నపుడు, మనం వెళ్లి వాటిని పరీక్షించకూడదు!

వారాంతపు పార్టీని వుంచుకోనా? ఈ నగ వేసుకోవటానికి ఇంక ఏ అవసరం లేకపోతే," వచ్చేవారం అది తిరిగి యిచ్చేయటానికి ప్రయత్నిస్తాను. అని అన్నట్లయితే నీవు ఆమె నిజంగా నీకు దానిని ఇచ్చియుంటే మరలా దానిని కలిగియుండాలని ఆశ పడదు అని అనుకుంటావు!

ఒకసారి మనం ప్రార్థించి, దేవునికి మన పరిస్థితులను అధీనంచేసి, మన సమస్యలను ఆయనకు నిజముగా ఇచ్చినప్పుడు మనం సమస్తం ఆయన చేతులలో వదిలి పెట్టాలి. కాని అది చెప్పినంత సులభం కాదు. మనందరము మన సమస్యలను వెనుకకు తీసికోవాలని అనుకుంటాము ఎందుకంటే దేవుడు ఏమీ చేయడని భయపడతాము, లేక దేవుడు చాలినంత – పరిష్కరించుటను గూర్చి క్రొత్త సలహా నా మనసులో పెట్టినట్లు నేను కనుగొంటాను.

మనం దేవునికి ఇచ్చేసిన దానిని మరల తీసుకొనకుండా ఎలా వుండగలము? మన చింతలన్నీ ఆయన పై వేయుట నేర్చుకొనుట ద్వారా. ఒక ఆంగ్ల బైబులు అనువాదములో కీర్తనలు 37:5 మన చింతలన్నీ ఆయన వైపుకు మళ్లించమని, ప్రతి భారాన్ని ఆయనపై వుంచి నెమ్మదినొందమని చెప్తుంది: "నీ మార్గమును యెహోవాకు అప్పగింపుము (ప్రతి భారమును గూర్చిన శ్రద్ధను ఆయన వైపుకు మళ్లించి, నెమ్మదినొందుము) నీవు ఆయనను నమ్ముకొనుము (ఆనుకొను, ఆధారపడు, నిబ్బరముగానుండు) ఆయన నీ కార్యము నెరవేర్చును." నెమ్మది అనే పదం విశ్రాంతి అని అర్థాన్నియిస్తుంది. ఏదైనా విశ్రాంతి పొందుతున్నపుడు, అది కలవరపరచబడ కూడదు. మన సమస్యలు దేవుని చేతులలో విశ్రాంతి పొందుతున్నపుడు, మనం వెళ్లి వాటిని పరీక్షించకూడదు! వాటిని మనం ఒంటరిగా వదలాలి. అదే సమయంలో, దేవుడు మనం తనకు అప్పగించిన వాటిని పరిష్కరించుటలో నైపుణ్యంగా వ్యవహరిస్తాడను నమ్మకంతో, ధైర్యంగా వుండి, మనం మన హృదయాలను విశ్రాంతిగా వుంచుకోవాలి.

1 పేతురు 5:7 "ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తు (మీ ఆత్రుతలు, బాధలు, వ్యాకులము, సమస్తము ఒక్కసారే) ఆయన మీద వేయుడి." ఈ వాక్య భాగం సమస్తము ఒక్కసారే) ఆయన మీద వేయుడి." ఈ వాక్య భాగం మన ఆత్రుతలు, బాధలు, వ్యాకులము, సమస్తము ఒక్కసారే ఆయనపై వేయమని చెప్తుందని గమనించండి. యిది, వాటిని మరల తీసుకొనలేమని అర్థాన్నిస్తుంది. ఒక్కసారి వాటిని ప్రభువుకు అధీనం చేసినట్లయితే, దాని విషయంలో మనకే సంబంధం లేదని అర్థం!

నా భర్త తన జీవితంలో "నీ చింతలను ఆయనపై మోపుము" అనే ఆలోచన కలిగియున్నాడు. మా వివాహ తొలిదినాలలో, నేను చింతపడ్డాను, అతను ఆనందించాడు. అతను కేవలం ఆనందించుచుండగా, అన్నిటిని గురించి శ్రద్ధ నేనే తీసుకోవలసి రావటం నాకు కోపం తెప్పించింది. అయితే, నా చింత అంతా ఏమీ చేయలేకపోయిందని నేను తర్వాత నేర్చుకున్నాను.

దానికి బదులుగా అది నాకు తలనొప్పి, వీపునొప్పి, మెడనొప్పి, కడుపునొప్పి తెచ్చి, నన్ను ఆందోళనాకరంగా తయారుచేసింది గాని ఏ మేలు చేయలేదు. కొన్ని సంవత్సరాలు చింతలతో, ఆత్రుతలతో హింసింపబడిన తర్వాత, నేను కూడా నా చింతను దేవునిపై మోపుట నేర్చుకున్నాను. నిజానికి, మన చింత యావత్తు ఆయనపై మోపువరకు ఆయన మన విషయంలో చింతపడడని నేను నేర్చుకున్నాను. మన సమస్యలను మరల ఆలోచించాలని లేక సహజంగా మన పద్ధతిలో పరిష్కరించాలని మనము శోధింపబడినపుడు, మనం దానిని ఆపుటకై "లేదు! నేను దానిని గురించి ఆలోచించను. నేను దానిని పూర్తిగా దేవునికి అప్పగించాను.

కాబట్టి దానిని వెనుకకు తీసికోను! దీని విషయంలో నేనేమీ చేయుటకు ప్రయత్నించను!" అని చెప్పాలి. మనం దేవునికి అధీనం చేసిన వాటిని మరల దర్శించుటకు మనం తిరస్కరించాలి, ఎందుకంటే, నిజమైన అధీనం చేసికొను ప్రార్థనా అర్థం అదే కాబట్టి.

## సారాంశం

మన జీవితాలలో దేవుని నమ్ముటకు వేరుగా మనం విజయవంతమైన, అన్నిటినీ గెలుచు జీవితం జీవించుటకు వేరు దారి లేదు. మనం సమర్పణా ప్రార్థనను ప్రార్థించినపుడు మనలను మనము, మనకు సంబంధించిన ప్రతీది, దేవునికి సమర్పించుకొనుటకు ఎంచుకొనియున్నాము. దీనిలో మన శరీరాలను, ఉద్రేకాలను, సామర్థ్యాలను, మనసులను, బలహీనతలను, ఉద్దేశాలను కూడా యిచ్చుట కలిసివున్నది. ఈ విధంగా మనలను మనం యిచ్చుకొనినపుడు, మనలోని ప్రతి విషయంలో పని జరిగించి, మనలను పవిత్రంగా, తన స్వారూప్యంలోనికి మార్చునట్లుగా దేవుని ఆహ్వానిస్తున్నాము.

అధీనము చేసికొను ప్రార్థనను మనం ప్రార్థించినపుడు, మన సమస్యలను, వ్యాకులతలను దేవునికి యిచ్చి, ఆయన వాటిగురించి శ్రద్ధ తీసికొంటాడని ఆయనను నమ్ముతున్నాము. ఒకసారి వాటిని ఆయనకు యిచ్చిన తరువాత వాటిని తీసికొనలేము. మన సమస్యలను మోయు గుర్రాల వలె దేవుడు మనలను చేయలేదు. అయితే, ఆయన వైపుకు మన సమస్యలను మళ్లించువారముగా మనలను చేశాడు. మనం ఆయనతో సంబంధం కలిగియున్నాము ఆయన మన తండ్రి మరియు స్నేహితుడు మరియు మన ప్రతి పరిస్థితిని గూర్చి శ్రద్ధ తీసికొనగలవాడు ఆయన ఒక్కడే.

సమర్పణ మరియు అధీనము చేయు ప్రార్థనలు నీ జీవితానికి గొప్ప స్వాతంత్ర్యాన్ని తెస్తాయి, కాబట్టి, వాటిని తరచుగా చేస్తూవుండమని నేను మిమ్మల్ని ప్రోత్సాహపరుస్తున్నాను. జ్ఞాపకముంచుకోండి: ఏదీ మరింత పెద్దది కాదు, ఏదీ మరింత చిన్నది కాదు, ప్రతిదానిని గురించి ప్రార్థించండి.

## ప్రార్థనాంశములు

- సమర్పణ ప్రార్థనలు మనలను మనము దేవునికి ఇచ్చుకొనుటతోను, అధీనము చేసికొను ప్రార్థనలు మన పరిస్థితులను ఆయనకు ఇచ్చుకొనుటతోను మిళితమై యుంటాయి.

- ప్రభువునకు మనలను మనము, మరియు మన జీవితాలకు సంబంధించిన ప్రతిదానిని ఇష్టపూర్వకంగా మరియు పూర్తిగా సమర్పించుకొనుటయే సమర్పణా ప్రార్థన. దేవుని నుంచి ఏదీ దాచకుండా, మన జీవితాలలో ఆయన పనిచేయదలచుకున్న ప్రతి విషయంలో ఆయనను పనిచేయనివ్వాలని ఆలోచించి నిర్ణయించుకొనుట అని దీని అర్థం.

- సమర్పణలో మన శరీరం, ప్రవర్తన, మాటలు మాత్రమే కాకుండా మన ఆలోచనలు, ఉద్దేశాలు, తలంపులు కూడా మిళితమైవుంటాయి.

- సమర్పణా జీవితాన్ని జీవించుట ఒక గౌరవమైయున్నది. అది సులభమైనది కాదు, కానీ, మనం ఊహించని గొప్ప ఆశీర్వాదాలను అది తెస్తుంది.

- అధీనం చేసుకొను ప్రార్థనను మనం ప్రార్థించినపుడు, ప్రభువునకు మన సమస్యలన్నిటినీ ఇస్తున్నాము. మన జీవితాలను మనం జీవించలేమని, ఇతరులను నియంత్రించలేమని, ప్రతీదీ అంచనా వేయలేమనీ గ్రహించినపుడు, అధీనమ చేసికొను ప్రార్థన వస్తుంది. అంటే దేవుని అధికారమునకు ఒప్పుకొనుట అని అర్థం. మనం నిజంగా దేవునికి మన సమస్యలను అప్పగించినపుడు, వాటిని మరల వెనుకకు తీసికొనము వాటిగురించి చింతించలేము మన మనసులలో వాటిని గురించి ఆరాతీయము. వాటిని దేవునివైపుకు మళ్లించి, అక్కడే వాటిని వదలివేస్తాము.

# 7

# విన్నపము మరియు పట్టుదల

ప్రతిచోట, ప్రతిఒక్కరికి ఏదో ఒకటి కావలెనని అనిపిస్తుంది. పూర్తిగా సంతృప్తిపొంది, ఏ కోరికా లేకుండా వున్న వ్యక్తిని కనుగొనుట చాలా కష్టం. మనం అడుగుట లేదు కనుక పొందుకొనుట లేదని బైబిల్ చెప్తుంది (యాకోబు 4:2 చూడండి). మరియు దేవుని యొద్ద నుండి మనకేదైనా కావలసినప్పుడు, మనం దానిని అడుగ వలసి వున్నది. మనం కోరికను మనవి చేసుకొనునప్పుడు చేయు ప్రార్థనను విన్నపము అంటారు– అటువంటి ప్రార్థన ప్రాముఖ్యమైయున్నది. ప్రార్థన ద్వారా ఆయనతో భాగస్వామ్యం పొందుతాము, సహజముగా పనులను జరిగించుటకు ఆత్మీయ ప్రదేశంలో మనం దేవునికి తోడ్పడుతూ పని చేయుటను ప్రార్థన అంటారు. ప్రార్థన అనేది పరలోకపు శక్తిని భూమి పైకి తెస్తుంది.

కొన్ని సార్లు మన ప్రార్థనకు జవాబు త్వరగా వచ్చినట్లుంటుంది, కొన్ని సార్లయితే దేవుడు స్పందించే వరకు స్థిరత్వం కలిగి ప్రార్థించాలి అనిపిస్తుంది. ఆ సమయంలో, మనం పట్టుదల కలిగిన ప్రార్థనలు ప్రార్థిస్తున్నాము. మనం మొదటి సారి ప్రార్థించినప్పుడు దేవుడు వినడు అని కాదు గానీ ఆయన మన విశ్వాసాన్ని పెంపొందించి, మన ఆత్మీయ కండరాలు బలం తెచ్చుకొనుటకు, మనం ప్రార్థన ద్వారా ఓర్పు నేర్చుకొనుచుండగా పట్టుదల కలిగి ప్రార్థించుటకు మనలను నడిపిస్తాడు.

మనం పట్టుదల కలిగి ప్రార్థించుటకు మరొక కారణం ఏమిటంటే, దురాత్మలు మన జవాబులను అడ్డుకొనవచ్చును. దీనికి ఉదాహరణను దానియేలు 10 నందు, దానియేలు తన జవాబు కొరకు 21 దినములు ఉపవాసముండి ప్రార్థించిన వేళలో చూడవచ్చు. దానియేలు ప్రార్థించిన మొదటి రోజే దేవుడు జవాబు పంపించాడు, కాని ఒక దురాత్మ, పారసీకుల రాజ్యాధిపతి దానిని అడ్డుకుంటున్నాడు. దానియేలు విడువక, ప్రార్థించుట

కొనసాగింపగా, దేవుడు ప్రధాన దూతయైన మిఖాయేలును పంపించి విజయాన్నిచ్చాడు. దానియేలు తన జవాబును దేవుని వద్ద నుండి పొందుకున్నాడు!

మనం మన కోరికలను ఆయనకు తెలియజేస్తూ విన్నపము చేసుకోవాలి, మరియు అవి భూమిపై ప్రత్యక్షమగువరకు ప్రార్థనలో పట్టుదల కలిగియుండాలి. ప్రభావవంతమైన ప్రార్థనా జీవితానికి ఈ రెండు విధాలైన ప్రార్థనలు అవసరము, ఆవశ్యకమైయున్నవి.

## మనవిచేయుట

మనకు కావలసిన, అవసరమైన వాటిని మనం దేవుని అడిగినప్పుడు, మనం మనవిచేస్తూ ప్రార్థిస్తున్నాము. ఇతరమైనవాటికంటే

మనం ఈ ప్రార్థనను ఎక్కువగా చేస్తాము. మరియు యేసు ఈ ప్రార్థనను చేయమని మనకు చెప్పినాడు. మత్తయి 7:7 నందు ఆయన "అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరుకును, తట్టుడి మీకు తీయబడును" అని చెప్పాడు. ఎవరూ తట్టకపోతే, ఏ తలుపు తీయబడదు. ఎవరూ వెదకక పోయినట్లయితే, ఏమీ దొరకదు. ఎవరూ అడుగకపోయినట్లయితే, ఎవరూ ఇవ్వరు.

> మన స్తుతులతోను, కృతజ్ఞతలతోను సమతుల్యంగా ఉన్నప్పుడు, దేవునికి మనవి చేయుట అనేది అత్యద్భుతంగాను, ఉత్సాహ భరితంగాను వుంటుంది.

మనం పొందుకొనునట్లుగా అడగాలి గనుక, మన మనవులు చాలా ముఖ్యమైనవి. మనం దేవుని మన కోరికలు అడుగుతున్నప్పటికీ, అవి మన స్తుతులను, కృతజ్ఞతలను మించినవై వుండకూడదు, ఎందుకంటే, మనం కృతజ్ఞత కలిగివుండగలిగినంత కంటే ఎక్కువగా అడుగవలసిన అవసరం లేదు. ఫిలిప్పీ 4:6 లో చెప్పబడిన "దేనిని గూర్చియు చింతపడకుడి గాని, ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి." అను మాటను జ్ఞాపకం చేసుకొనండి. మన కోరికలను దేవునికి తెలియజేయుట అనేది, మన స్తుతులతోను, కృతజ్ఞతలతోను సమతుల్యంగావున్నప్పుడు, దేవునికి మనవి చేయుట అనేది అత్యద్భుతంగాను, ఉత్సాహభరితంగానూ వుంటుంది. దేనిగురించైనా దేవుని అడగటం, ఆయన అది చేస్తాడని నమ్మటం, ఆయన దానిని మన జీవితాలలో చేయుచుండగా చూడటం అనేది చాలా అద్భుతంగా వుంటుంది. ఆయన మనకు జవాబిచ్చాడని, మరల ఆయనను

అడుగనవసరం లేదని మనకు హృదయంలో తెలుస్తుంది, లేక మనం పట్టుదల కలిగి ప్రార్థించాలని మనకు అనిపిస్తుంది ఏ విధంగానైనా, ఆయన మనకు ఇచ్చుటకు ఇష్టపడుతున్నాడని మనకు ఖచ్చితంగా తెలుస్తుంది. ఆయన తన జ్ఞానముతో, తన సమయములో, తన మార్గములో మనకు జవాబిచ్చుటకు ఇష్టపడుతున్నాడు. కాబట్టి, సాగిపోయి – అడగండి.

## *విన్నపము మరియు కోరిక*

మనవి చేయవలసిన విధానం ఇదేనని నేను నమ్ముతున్నాను. నీవు దేవుని పరిచర్యలో తీరికలేకుండా వున్నావని అనుకుందాం. నీవు వాక్యానికి లోబడుతున్నావు నీవు నీతిని వెదకుచున్నావు మత్తయి 6:23 ప్రకారం నీవు నిజంగా ఆయన రాజ్యమును మొదట వెదకుచున్నావు. నీ నిజమైన హృదయవాంఛ మనుష్యులతో చక్కగా ప్రవర్తించుట, నీతి, న్యాయములు కలిగి జీవించుట, జ్ఞానము కలిగియుండుట, దేవుని చిత్త ప్రకారం జీవించుట అయివుంటుంది. నీ హృదయంలో ఆ కోరిక కలిగినప్పుడు, నీవేం చేస్తావు? దానిని దేవునికి ఇలా చెప్తావు, “దేవా, నాకు నిజంగా ఒక క్రొత్త కారు అవసరమని నీకు తెలుసు. ప్రభువా, నీవు మంచివాడవు, మరియు మేము ఆశీర్వదింపబడాలని కోరుతున్నావు. కాబట్టి, ఆ కారు నాకు వచ్చునట్లుగా నీవే మార్గం సిద్దపరచు, ఎందుకంటే, నా స్వంత బలంతో ఇది నాకు వచ్చునట్లుగా కనబడుటలేదు.” తర్వాత నీవేం చేస్తావు? మరల దేవుని పరిచర్యకు వెళ్లి, నీ జీవిత విధానంలో జీవిస్తూ, దేవుడు నీకు ఆ క్రొత్త కారు వచ్చునట్లు చేయుటకు ఎదురుచూస్తూవుంటావు.

మనవి అనునది సామాన్యంగా కోరిక పై ఆధారపడి వుంటుంది. దేనినైనా అడుగుటకు ముందుగా, దానిని మనం కోరుకోవాలని నేను నమ్ముతాను. మన హృదయాలలో దేవుడు సరియైన కోరికలుంచుతాడని, మన శరీర కోరికలకు, మన నిజ హృదయ కోరికలకు మనం తేడా తెలుసుకోవాలని నేను నమ్ముతున్నాను. “నీవు వెదుకవలసిన వాటివైపుగా దేవుడు నీ కోరికలను మళ్లిస్తాడు. నీ కోరికలను నీకు బోధిస్తాడు……” అని చెప్పిన చార్లెస్ స్పర్జన్ గారి మాటలతో నేను ఏకీభవిస్తాను. దేవుడు మనలో ఏదైనా కోరికనుంచినప్పుడు, మనం “దేవా నాకది కావాలి” అని చెప్పుటకు మనం సరిగా స్పందిస్తాము. మరియు ఆయనయందు మనం ఆనందిస్తే, ఆయన మన హృదయవాంఛలను తీరుస్తాతాడని బైబిలు చెప్తుంది (కీర్తన 37:4). కాని, మనము దేవుడు యివ్వని, శారీరక, ప్రకృతిపరమైన కోరికలు కలిగివుంటాము – అవి తీరుస్తానని దేవుడు చెప్పలేదు. వాటిని ఆయనకు చెప్పి, వాటిని అలా వదలివేయటం, అటువంటి కోరికలకు స్పందించే సరియైన తీరు. కొన్నిసార్లు కొన్ని ప్రార్థనలు ఎందుకు జవాబివ్వబడవంటే, అవి మన శారీరక కోరికలు అయివుండి, ఆత్మచే నడిపింపబడనివై ఉంటాయి (యాకోబు 4:3 చూడండి).

మన కోరిక మన హృదయానికి సంబంధించిందో లేక మన శరీరానికి సంబంధించిందో తరచుగా మనం ఖచ్చితంగా చెప్పలేకపోతూ వుంటాము. అటువంటి సమయాలలో, నేను

"ప్రభువా, నేను నిన్ను దీనిని అడుగుతున్నాను, కాని, ఇది నాకు సరియైనది కానట్లయితే, నాకేది మంచిదో అది చేయునట్లుగా నిన్ను నమ్ముతున్నాను." అని చెప్తాను. దేవుడు మంచివాడనీ, నన్ను ప్రేమిస్తున్నాడనీ, నాకొరకు మంచివాటిని ఇస్తాడని నాకు తెలుసు గనుక, ఆయనకు ఇష్టం లేనిదానికోసం ప్రాకులాడటం అనవసరం అని నాకు తెలుసు. ఉత్తమమైనవి తండ్రికి ఎల్లప్పుడూ తెలుసు!

మనకు ఏం కావాలో ప్రార్థించునపుడు, మనం పరిశుద్ధాత్మని అనుసరించవలసి యున్నది. మన కోరికలను, ప్రత్యేకంగా మనకు కావలసినంత త్వరగా అవి జరగనప్పుడు ఎలా చేయాలో నేర్పించుటకు ఆయనను ఆహ్వానించవలసియున్నది. మన కోరికలు సమతుల్యాన్ని కోల్పోయి, వ్యసనాలుగా మారకుండా చూచుకోవాలి, మనం ఆ కోరికను దేవుని చేతికి అప్పగించినప్పుడు, అది వ్యసనంగా మారుతుంది. కోరిక ఎప్పుడైతే బలంగా మారి, అది లేకుండా మనం ఆనందంగా వుండలేమనిపిస్తుందో, ఆ కోరిక వ్యామోహంగా మారినట్లు – మరియు వ్యామోహం – ఒక పాపం. క్రీస్తు మన సంతోషం అయినంతకాలం, ఈ లోకంలో ఏది కూడా క్రీస్తులేకుండా మనకు సంతోషాన్నివ్వలేదు. వ్యక్తిగతంగా, ఏ కోరిక కూడా నన్ను నియంత్రించకుండా నేను చూసుకుంటాను, ముఖ్యంగా అది వ్యామోహంగా మారకుండా చూసుకుంటాను. ఎందుకంటే ఆయన సన్నిధికి బదులైనది, నా జీవితంలో ఏదీ లేదు.

ఒక కోరిక సమతుల్యాన్ని కోల్పోవటం ఎలా వుంటుందన్న దానికి, మీకు ఒక ఉదాహరణను ఇవ్వనివ్వండి. పెళ్లి చేసుకోవటం గురించి తప్ప మిగిలిన వాటిని గురించి ఆలోచించలేని, కొందరు ఒంటరి మహిళలున్నారు. వారు దేవునితో "నేను పెళ్లి చేసుకోవాలి, నేను పెళ్లి చేసుకోవాలి" అని చెప్తూనే వుంటారు. ప్రార్థనా గుంపును ఆ విషయం ప్రార్థన చేయమని అడుగుతారు, ఇక ప్రార్థనా సమయంలో అందరూ, వారికి భర్తలను ఇవ్వమని అడుగు తుంటారు. ఆ విషయంలోనే ప్రార్థనా సహాయాన్ని వారు అడుగుతుంటారు. అన్ని సమయాలలో ఈ విషయం గురించే మాట్లాడుతుంటారు. దీని విషయంలో వారు నిరాశా, నిస్పృహలకులోనౌతారు. తాము పెళ్లి చేసుకునే వరకు తాము ఖచ్చితంగా సంతోషంగా వుండలేమని వారు నిర్ణయించుకుంటారు. మీకు తెలుసా? అలాంటి వారు ఎప్పటికీ అలానే వుండవచ్చు లేదా వారు తమను అలా వుంచగలిగే వారితో ముగించుకుంటారు!

> మనం చేయగలిగిన దేనినైనా మనకు ఇచ్చుటకు, దేవుడు ఇష్టపడుతున్నాడు– మనం ఆయనను మన జీవితంలో ప్రథమంగా వుంచినంతవరకు, మనకు ఎంతైనా ఇస్తాడు.

ఒక ఒంటరి వ్యక్తి “దేవా, నేను ఒంటరిగా వున్నాను, జీవితాన్ని పంచుకోవటానికి ఒకరుండాలని నేను నిజంగా ఇష్టపడుతున్నాను. అందుకు సరియైన వ్యక్తిని నీవే తెమ్మని అడుగుతున్నాను. నేను పెళ్ళిచేసుకోవాలని అను కుంటున్నాను” లేక “నాకు స్నేహితులు కావాలి” అని అడుగుటలో అస్సలు తప్పు లేదు. నిజమే, ఇటువంటి విషయాలను గురించి ప్రార్థించవచ్చు, కాని ఒక్క కోరికపై మన జీవితాలు కేంద్రీకృతమవకుండా జాగ్రత్తపడుతూ, శ్రద్ధ కలిగివుండాలి. దేవుని సేవించుటలో, లోబడుటలో దృష్టి కేంద్రీకరించండి. ఇతరులకు ఆశీర్వాదకరంగా వుండుటలో దృష్టి పెట్టు, అప్పుడు సరైన సమయంలో దేవుని చిత్తం నీ జీవితంలో నెరవేరుతుందని నీకు తెలుస్తుంది. నీవు పోరాడి, నిరాశ పడి లేక కలవరపడవలసిన అవసరం వుండదు. నీవు వెళ్ళుచున్న మార్గంలో నీవు సంతోషించగలవు.

మీరు విజయవంతమైన జీవితం జీవించాలని, నేను చేసిన పొరబాటు. మనం రొట్టెను అడిగితే, తాను రాయినివ్వడని, చేపనడిగితే, తేలునివ్వడని యేసు చెప్పాడు (మత్తయి 7:9-10). కాని మీకు తెలుసా? మనం రొట్టెను అడుగుతున్నాం అని అనుకుంటాం, కాని నిజానికి, రాతిని అడుగుతున్నాము. మరొక మాటలో చెప్పాలంటే, మనం సరైనదే అడుగుతున్నామని మనం నిజంగా అనుకుంటాం, కాని ఆ కోరికను తీర్చాలా, వద్దా అనేది దేవునికి తెలుసు. అమాయకత్వంతో, మనకు చాలా అపాయకరమైన దానిని కూడా, గ్రహించకుండా అడుగుతాము. ఆ సమయంలో, అది మనకు ఇవ్వనందుకు మనం సంతోషించాలి. నాకు తెలిసినంతవరకు ఆ వస్తువును లేక వ్యక్తిని మన జీవితాలలోనికి రానివ్వటం అంటే ఒక పాపమును మన జీవితాలలోనికి రానివ్వటం వంటిదని కొంత అనుమానంగా వున్నప్పుడు మనం దేవునితో, “నేను ఏ విషయం అయినా నిన్ను అడగవచ్చున్న నమ్మకం నాకు వుందని నీకు తెలుసు దేవా కాని నీ చిత్తం కాని దానిని నేను కోరుకొనటం, లేదు ప్రభువా నేను నిన్ను నమ్ముతున్నాను, నాకు ఇది ఇవ్వకపోయినప్పటికీ ఇది నాకు సరైన సమయం కాదని లేక ఇంతకంటే మంచి దానిని నువ్వు నాకు ఇస్తావని నేను నమ్ముతున్నాను. అంతేకానీ, నేను అడిగిన ప్రతిదీ నాకు ఇవ్వనందు వలన చెడు ఉద్దేశం గానీ బాధ గానీ నేను కలిగివుండను.”

మనం దేవుని బిడ్డలం మరియు మనం ఆశీర్వదింపబడాలని దేవుడు కోరుతున్నాడు కేవలం మనం కోరుకున్నవే కాకుండా మనం ఏది ఉత్తమమో, మనం దానిని కలిగి వుండాలని దేవుడు ఇష్టపడుతున్నాడు. కాబట్టి మనం మనవులు చేయు ప్రతి సారి దీనిని మనస్సులో వుంచుకోవాలి. మనం దేవుని నిజంగా నమ్మినట్లయితే, ఆయన “అవును” అని చెప్పినప్పటిలానే, మన మనవులకు “కాదు” అని చెప్పినప్పుడు కూడా నమ్మాలి.

రాజైన దావీదు దేవుని కొరకు ఒక దేవాలయాన్ని కట్టాలని చాలా ఆశపడ్డాడు. దేవుడు అతను కట్టకూడదు కానీ అతని కొడుకు దేవాలయాన్ని కడతాడని చెప్పాడు. దావీదు

చెడుగా భావించలేదు కనీసం బాధపడలేదు, బదులుగా, దేవాలయం కొరకు అవసరమైన వస్తువులను ఇతరుల నుండి సంపాదించుటలో తీరిక లేకుండా సహాయపడ్డాడు, చేశాడు.

ఖచ్చితంగా నీవు కోరుకున్నదే దేవుడు ఇవ్వకపోయినట్లయితే, ఆయన ఏది అంగీకరిస్తాడో కనుగొని ఆ పని చేయుటలో నిమగ్నమవ్వండి. దేవుని మార్గాలు అర్థం కాని అయోమయ స్థితిలో నీ జీవితాన్ని గడపవద్దు. మనం దేవుని అర్థం చేసుకోవటం కాదు, నమ్మవలసివున్నది. మన జీవితంలో జవాబు లేని కొన్ని ప్రశ్నలకు నమ్మకం కంటే గొప్ప జవాబు లేదు.

## *ధైర్యంగా రండి*

రోమా 8:26 "......ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదు గానీ, ......" అని చెప్తుంది. మనము విలువ లేని వారముగా లేక తీర్పు తీర్చబడిన వారముగా లేక సిగ్గుగా భావించుటవలన దేవుని నమ్మకంగా చేరలేము. కొన్ని సార్లు మనం దేవుడు నిజంగా సహాయం చేయాలనుకుంటున్నాడని తలంచము, అర్హత లేని వారముగా భావించుటలో ఇది రెండవరకమైయున్నది. కొంతమంది అయితే తాము ఇప్పుడు "బాగున్నాము" అనుకున్నరోజు దేవుడు తమ ప్రార్థన వింటాడని తలంచి ఆదినాల్లో మాత్రమే ప్రార్థిస్తారు! ఈ ఆలోచనలన్నీ సాతాను యొక్క అబద్ధములైయున్నవి. సత్యం, మనము మన స్వంత బలంతో యోగ్యంగా ప్రార్థించుట ఎరుగము, మన స్వంత బలంతో దేవుని యొద్దకు వెళ్ళలేము. మనము యేసుక్రీస్తు యొక్క నీతితో దేవుని వద్దకు వెళ్తున్నాము. యేసు ద్వారా మనం నీతిమంతులముగా చేయబడ్డాము, పరిశుద్ధాత్మ మన కొరకు విజ్ఞాపన చేస్తున్నాడు (రోమా 8:26 చూడండి). అది, యేసు జీవించి మన కొరకు విజ్ఞాపన చేయుచున్నాడను (హెబ్రీ 7:25 చూడండి), సత్యంతో మిళితమై, దేవుడు మన ప్రార్థనలను వింటున్నాడని మనలను ఒప్పించి, ఆయన యొద్దకు నమ్మకంతో చేరగలిగిన ధైర్యాన్నిస్తుంది.

మనం పరలోకపు తలుపు తట్టి, తలలు వంచుకొని ఆయన సన్నిధిలోకి ప్రవేశించి, "ఊ.....దేవా నన్ను ఒక్కసారి చూడు ఊ.....క్షణం నీకువుందా? నేను ఎక్కువ సమయం తీసుకోను, నేను మంచిని మాత్రమే అడగాలనుకుంటున్నాను. మంచి దాని గూర్చి వదిలెయ్యి, సరే నువ్వు ఏమి అనుకోకపోతే నాకు ఒక సహాయము చేయుటకు నీకు కుదురుతుందా?" అని చెప్పాల్సిన అవసరం లేదు. ఆయనను ధైర్యంతో చేరగల నిశ్చయత మన సంబంధంతో కలిగి వుండాలి. ఒక సారి తన గురించి ప్రార్థన చేయమని అడిగిన ఒక స్త్రీని నేనెప్పటికీ మర్చిపోలేను. నేను ప్రార్థించుటకు ఒప్పుకొన్నప్పుడు, ఆమె నా వైపు కలవరంగా అయోమయంగా చూసి "నేను రెండు విషయాలను అడగవచ్చా?" అని సిగ్గుపడుతూ అడిగింది. నేను ఆమెతో దేవుడు ఆమె యొక్క ప్రార్థనా మనవులన్నింటినీ వింటాడని, లెక్కపెట్టుకోడనీ చెప్పి నిశ్చయతనిచ్చాను.

దేవుని వద్దకు ధైర్యంగా చేరుట అనునది, ఒక బ్యాంక్‌కు వెళ్లి డబ్బు తీసుకొనుటవంటిది. నేను పోయిన వారం బ్యాంక్‌లో 50 రూపాయలు వేశానని నాకు తెలిసుంటే, బ్యాంక్‌కు వెళ్లి ఆ 50 రూపాయలు తీసుకొనుటకు నేను వెనుకాడను. నా దగ్గర డబ్బులు ఉన్నవని నాకు తెలుసు, అవి నావి, గనుక నాకిష్టమైతే వెళ్లి వాటిని తెచ్చుకుంటాను. నేను చెక్ ఇచ్చినప్పుడు, ఆ 50 రూ॥లు వస్తాయని ఎదురుచూస్తాను. అదే ధైర్యంతో మనం దేవుని యొద్దకు చేరవలసి యున్నది. యేసు ద్వారా మనకు లభించిన దానిని అర్థం చేసుకుని, మనకు చెందినదానిని పొందుకుంటామన్న ఆశతో ఎదురుచూస్తూ, నమ్మకం కలిగి ప్రార్థించవలసి యున్నది. దేవుడు, క్రీస్తునందు మన కొరకు అసామాన్యమైన సంపదను దాచివుంచాడు, ఆయన మన కొరకు కొనియుంచిన ఆశీర్వాదాన్ని, కేవలం మనం అడగవలసివున్నది, అనర్హులం అన్న తలంపులు మనకు వస్తున్నప్పుడు, మనం పరిశుద్ధాత్ముని సహాయం కోరవలసియున్నది. ఎందుకంటే "మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో కూడా సాక్ష్యమిచ్చుచున్నాడు. మనము పిల్లలమైతే వారసులము, అనగా దేవుని వారసులము ......... క్రీస్తు తోటి వారసులము." (రోమా 8:16-17).

మనం దేవుని పిల్లలము, వారసులము గనుక, హెబ్రీ 4:16 నందు వలె "గనుక మనం కనికరింపబడి, సమయోచితమైన సహాయము కొరకు (మనకు అవసరమైనపుడు, సరియైన సమయములో) కృప పొందునట్లు (మన అపజయములకై) ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము." చేయగలము. మనుష్యులు ప్రార్థించకపోవుటకు, తమకు కావలసినవి అడుగకుండుటకు గల ఒక కారణము, తాము అర్హత కలవారుగా తలంచకపోవుటే. తమను గురించి తాము మంచిగా అనుకొనరు తమకు తగినంత ఆత్మీయత లేదేమో అనుకుంటారు ఏదేమైనా దేవుడు తమ ప్రార్థనలు వినడేమో అని అనుకుంటారు. తాము "చెడుగా" వున్నాము గనుక తమను ఆశీర్వదించమని దేవుని అడుగుట సరియైనది కాదని వారు తలుస్తారు. తాము పొరబాట్లు చేసినప్పటికీ, తన ఆశీర్వాదములను క్రుమ్మరించు దేవుని క్షమాపణను, కృపను వారు గుర్తించనప్పుడు ఇలా తలంచుతారు.

మనం విన్నపాలు చేయునప్పుడు, యేసు రక్తము ద్వారా నీతిమంతులుగా తీర్చబడిన కుమారులు, కుమార్తెలముగా మన స్థానాన్ని అర్థంచేసుకోవాలి. మనం తరచుగా మన నీతి – మన సరియైన మాటలపై, మన సరియైన ప్రవర్తనపై, మన సరియైన ఉద్దేశాలపై ఆధారపడివుందని తలుస్తాము.

> మనం విన్నపాలు చేయునపుడు, యేసు రక్తము ద్వారా నీతిమంతులుగా తీర్చబడిన కుమారులు, కుమార్తెలముగా మన స్థానాన్ని అర్థంచేసుకోవాలి

మనల్ని మనం మతసంబంధిగా చేసుకొనగలం కానీ, మనల్ని మనం

నీతిమంతులుగా చేసుకొనలేము. ప్రతీదీ సరిగా చేయుటకు నీతితో ఏ సంబంధం లేదుగానీ, యేసు కార్చిన రక్తం మనలను అనీతి నుండి కడుగుతుందను దానికి నీతితోసంబంధం వుంది. క్రీస్తు రక్తం ద్వారా మాత్రమే మనం దేవునితో సరిగా వుండగలము. మనం దానిని నమ్మినట్లయితే, మన జీవితాలలో నీతిని వ్యక్తపరచుటకు ఆరంభిస్తాము. కాని, దానిని నమ్మనంత వరకు మనం దానిని వ్యక్తపరచలేము లేక దేవుని దాని ద్వారా చేరలేము.

యేసు మనలను నీతిమంతులనుగా చేశాడను సత్యాన్ని, క్రొత్త నిబంధన అంతటిలో చూస్తాము. వాటిలో కొన్నింటిని చూద్దాం:

- ఎందుకనగా మనమాయనయందు (ఆయనతో పాటు, కనబడునట్లు, ఉదాహరణలుగా) దేవుని నీతి అగునట్లు (ఆయన మంచితనము ద్వారా, దేవునితో సరియైన సంబంధం కలిగివుండునట్లుగా) పాపమెరుగని ఆయనను మనకోసము (వాస్తముగా) పాపముగా చేసెను (2 కొరింథీ 5:21).
- కాబట్టి తీర్పు ఒక్క అపరాధమూలమున వచ్చినదై, మనుష్యుల కందరికిని శిక్షావిధి కలుగుటకు ఏలాగు కారణమాయెనో, ఆలాగే ఒక్క పుణ్యకార్యము వలన కృపాదానము మనుష్యులకందరికిని జీవప్రదమైన నీతి విధింపబడుటకు కారణమాయెను. ఏలయనగా ఒక మనుష్యుని అవిధేయత వలన అనేకులు పాపులుగా ఏలాగు చేయబడిరో, అలాగే ఒకని విధేయతవలన అనేకులు నీతిమంతులుగా చేయబడుదురు (రోమా 5:18-19).
- నేను దేవుని కృపను నిరర్థకము చేయను నీతి ధర్మశాస్త్రమువలననైతే ఆ పక్షమందు క్రీస్తు చనిపోయినది నిష్ప్రయోజనమే (గలతీ 2:21).
- విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియైయున్నాడు (రోమా 10:4).
- ఏ భేదమును లేదు అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు. కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తుయేసు నందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు (రోమా 23-24).

నేను నీతిని గురించి బోధించునప్పుడు, ఈ దృష్టాంతాన్ని ఉపయోగిస్తాను, ఇది ఒకసారి ప్రయత్నించమని మిమ్మల్ని అడుగుతున్నాను. ఒక కుర్చీలో కూర్చోండి తర్వాత కుర్చీలో కూర్చోటానికి ప్రయత్నించండి. ఆ మాట వినటానికి చాలా బుద్ధిహీనంగా వుంటుంది. ఎందుకంటే, నీవు కుర్చీలో కూర్చొనే వున్నావు. ఒకసారి నువ్వు కుర్చీలో కూర్చున్న తర్వాత, మరల కూర్చొనటానికి ఏముంటుంది. నీతి కూడా ఇలానే వుంటుంది, మనల్ని మనం

నీతిమంతులుగా చేసుకొనుటకు ఏమీ చేయలేము. నీతి అనే స్థానంలో యేసు మనలను కూర్చుండ బెడుతున్నాడు. ఒకసారి

అక్కడ కూర్చున్న తర్వాత, మరల అక్కడ కూర్చుండుటకు మనం చేయగలిగింది ఏముంది. ఆయనలో, దేవుని యెదుట మనం ఆ స్థానంలో వున్నాము. క్రీస్తు రక్తం ద్వారా మనం దేవుని యెదుట నీతిమంతులముగా వున్నామని నిజంగా ఒకసారి నమ్మినప్పుడు, మనం నీతిమంతులుగా ప్రవర్తించుటకు మొదలుపెడతాము. ఏదేమైనా, క్రీస్తుకు వేరుగా, ఏ సరియైన క్రియ మనలను దేవునితో సరిగా చేయలేదు. దీనిని తెలుసుకొని, అపోస్తలుడైన పౌలు తన స్వంత నీతిని గాక, క్రీస్తునందలి విశ్వాసము వలననైన నీతి, అనగా విశ్వాసమును బట్టి దేవుడు అనుగ్రహించు నీతిగల వాడై ఆయన యందు అగుపడు నిమిత్తము ప్రార్థించాడు (ఫిలిప్పీ 3:9).

మనల్ని మనం నీతిమంతులుగా చేసుకొనుటకు ఏమీ చేయనవసరంలేదనియు, దేవునికి ఏమీ ఋజువు చేసుకోనవసరం లేదనియు మనం గ్రహించినపుడు, యేసు మనకిచ్చు నీతి అను బహుమానములో విశ్రాంతిపొందుతాము – మరియు మన మనవిలో ధైర్యాన్ని, మనకు జవాబిచ్చుటకు దేవుని కోరిక పై నమ్మకాన్ని ఇస్తుంది. నేను మంచిదానినైనందువలన ఆయన నా ప్రార్థనకు జవాబివ్వడని నాకు తెలుసు ఆయన మంచివాడు గనుక ఆయన నా ప్రార్థన విని, నాకు జవాబిస్తున్నాడు.

## పట్టుదల కలిగిన ప్రార్థన

పట్టుదల కలిగిన ప్రార్థన, దీనినే బ్రతిమాలు ప్రార్థన అని కూడా అంటారు. ఇది మౌనముగానుండదు. ప్రార్థిస్తూనే వుండి, ఆశ వదలని ప్రార్థన ఇది. కొన్నిసార్లు నీవు కొన్ని మాటలు లేక కొన్ని వాక్యాలు ప్రార్థించి, తర్వాత నీ పనిలో పడిపోతావు అది బ్రతిమాలు ప్రార్థన కాదు. ఇతర సమయాలలో, ఒక వ్యక్తి లేక ఒక పరిస్థితి నీ మనస్సులోకి మరల మరల వస్తున్నపుడు, నీ ప్రార్థన అయిపోలేదని నీకు అర్థం అవుతుంది. పరిశుద్ధాత్ముడు ఏదైనా విషయం నీ హృదయంలో మరల మరల ఒత్తిడి చేస్తున్నపుడు, ఆయన నిన్ను ప్రార్థించుటను పట్టుదల కలిగిన, గోజాడు ధోరణిలో చేయమంటున్నాడని అర్థం.

నీ కోరికను దేవునికి విన్నపరూపంలో ప్రార్థించి, ఆయన జవాబిచ్చువరకు, జవాబు నిమిత్తమై ఆయనకు కృతజ్ఞతలు చెల్లించుట, పట్టుదల కలిగియుండుటకు ఒక మార్గం. దానిని నీవు విశ్వాసం ద్వారా నీ హృదయములో కలిగియున్నావు, అది ప్రత్యక్షపరచ బడుతుందని నీకు తెలుసు, ఆ పరిస్థితిని గురించి నీవు ఆలోచించిన ప్రతిసారి, "వందనాలు ప్రభువా, నీవు నా ప్రార్థన వినినందుకు, నాకు జవాబు ఇస్తున్నందుకు వందనాలు. నీవు

ఒకరోజు కూడా ఆలస్యం చేయవని నాకు తెలుసు.” అని చెప్తావు. పట్టువదలని ప్రార్థన అనునది, పట్టు విడువని కృతజ్ఞతలు తెలుపు రూపందాలుస్తుంది.

పట్టువదలకుండుటకు మరొక మార్గం, “ప్రార్థనా అప్పగింతలకు” ప్రతిస్పందించుట. నేను మనుష్యులు, పరిస్థితుల కొరకు ఒక్కసారి ప్రార్థించిన సందర్భాలు అనేకం వున్నాయి. మనలో తాను చేయతలంచినది నెరవేరువరకు ప్రార్థించుటను దేవుడు మనకు అప్పగించియున్నాడని నేను నమ్ముతాను. నేను ఒక వ్యక్తి కొరకు అక్షరాలా, 25 సంవత్సరాలు ప్రార్థించాను, నేను చనిపోయేవరకు లేక దేవుడు నాకు విడుదల ఇచ్చు వరకు లేక ఆ వ్యక్తి చనిపోవువరకు లేక జరుగవలసినది జరుగువరకు ప్రార్థిస్తూనే వుంటాను. కొన్నిసార్లు ఆ వ్యక్తి గురించి ప్రార్థించుటలో నేను అలసిపోతాను, కాని నేనెలా భావిస్తున్నాను అన్నది అనవసరం, నేను ప్రార్థిస్తూనేవుండేదానను. దేవుడు ఇది నాకు అప్పగించాడని నాకు తెలుసు, నేను దీనిని వదలిపెట్టను! ఈ వ్యక్తి యొక్క లక్ష్యాన్ని సరిచేయుటలో నా ప్రార్థనలు సహాయపడునట్లు దేవుడు ఉపయోగించుకుంటున్నాడని నేను నమ్ముతున్నాను.

నేను ప్రస్తుతం చేస్తున్న ప్రార్థనకంటే కొంతమంది కొరకు మరింత ప్రార్థించాలని నేను తలుస్తాను, కాని నా తలంపులతో నిమిత్తం లేకుండా, ప్రార్థించునప్పుడు వారు నాకు అస్సలు గుర్తుకు రారు. నేను ప్రార్థించుటకు ప్రయత్నించినప్పటికీ, ఎక్కువ ప్రార్థించలేకపోయేదాన్ని, ఒకవేళ ప్రయత్నించినా అది జీవరహితంగా వుండేది.

ఒక వ్యక్తి లేక పరిస్థితిని గురించి దేవుడు ప్రార్థించమని నీకు అప్పగించినప్పుడు, నీవు ఆ కోరిక కలుగునట్లుగా ప్రయత్నించనవసరం లేదు. నీకు నీవుగా ప్రయత్నించకుండానే, ఏ ప్రణాళికా వేసుకొనకుండగనే వారికొరకు ప్రార్థించుటను నీవు కనుగొంటావు.

నా కొరకు ప్రార్థించుట కొంతమంది నిర్ణయించబడిన వారున్నారు. నాకు తెలియనివారు చాలామంది వుండివుంటారు, కాని, నాకు ఇద్దరు తెలుసు. మిన్నెసొటాలోని ఒక స్త్రీ నాతో తరచుగా “జాయిస్, నీ గురించి నాకు ప్రార్థించుటకు నియమింపబడినది.” అని చెప్తుంది. అందువలన, ఆమె నా గురించి ఎల్లప్పుడూ ప్రార్థిస్తుంది. మరొక స్త్రీ, నా

ఒక వ్యక్తి లేక పరిస్థితిని గురించి దేవుడు ప్రార్థించమని నీకు అప్పగించినప్పుడు, నీవు ఆ కోరిక కలుగునట్లుగా ప్రయత్నించనవసరం లేదు. నీకు నీవుగా ప్రయత్నించకుండానే, ఏ ప్రణాళికా వేసుకొనకుండగనే వారికొరకు ప్రార్థించుటను నీవు కనుగొంటావు.

ప్రాణ స్నేహితురాలు, తాను తమ సంఘంలో అనేక క్రొత్త కార్యక్రమాలు చేపట్టి, నా కొరకు ఎల్లప్పుడూ ప్రార్థించుట నుండి తనకు విడుదలనివ్వమని దేవుని అడిగింది. కాని, దేవుడు ఆమెకు విడుదలనివ్వనందువలన తాను ఎల్లప్పుడూ నా గురించి మాత్రమే ప్రార్థిస్తూ ఉండేది, లేకపోతే చాలా బాధపడెడిది. నన్ను విజ్ఞాపనకర్తలకు అప్పగించినందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. నా జీవితంలో ప్రార్థన యొక్క రక్షణ వుండాలని నాకు తెలుసు, అలాగే, ఇది నీకు కూడా అవసరమైయున్నది.

గోజాడే ప్రార్థనల గురించి ఆండ్రూ ముర్రే ఈ విధంగా వ్రాస్తున్నాడు: "పట్టుదల కలిగిన ప్రార్థన, ఓ ఇది ఎంత లోతైన పరలోక మర్మము. ఆశీర్వాదమును వాగ్దానము చేసి, ఇచ్చుటకు ఆశకలిగి, నిశ్చయమైన ఉద్దేశాన్ని కలిగివున్న దేవుడు, దానిని పట్టుకొనియున్నాడు. భూమి మీద వున్న ఆయన స్నేహితులు తమ పరలోకపు స్నేహితుడెంత ధనవంతుడో తెలుసుకోవాలని, నమ్మాలని తమ పట్టుదల ఏవిధంగా గెలుస్తుందో కనుగొనుటకు ఆలస్యమనే పాఠశాలలో తమకు శిక్షణ ఇస్తున్నారని తెలుసుకొనుటకు ఆయన గొప్ప ప్రాముఖ్యతనిస్తున్నాడు మరియు పరలోకములో వారికి ఎంత బలమైన శక్తి వున్నదో వారు తెలుసుకోవాలని కోరుకుంటున్నాడు." నా జీవితంలో ఇది దేవుని చిత్తము అని తెలిసిన విషయాలున్నాయి, ఎందుకంటే నేను వాటిని వాక్యంలో కనుగొన్నాను. నేను వాటిని అడిగి పొందుకొనలేక పోయినప్పుడు నేను మరలా దేవుని దగ్గరకు వెళ్ళి "ఇదిగో ప్రభువా నేను మరలా నీ యెదుటికి వచ్చాను నేను అమర్యాదగా మాట్లాడాలనుకోవటం లేదు, ప్రభువా నా జీవితంలో ఒక మలుపు సంభవించే దాక నేను మౌనంగా ఉండదలచుకోవటంలేదు. నేను నిన్ను మరలా అడుగుతున్నాను ప్రభువా ఈ ప్రదేశంలో విజయం చూసేదాక నేను అడుగుతూనే వుంటాను" అని చెప్తాను. కొన్ని సమయాలలో మనం, మన మూలపురుషుడు యాకోబులా వుండాలి. అతను దేవదూతతో "నీవు నన్ను ఆశీర్వదించితేనే గానీ నిన్ను పోనియ్యను" అని చెప్పాడు. దేవుడతనితో నీవు దేవునితోనూ, మనుష్యులతోనూ పోరాడి గెలిచితివి గనుక నిన్ను ఆశీర్వదించాను అన్నాడు (ఆదికాండము 32:24–28).

నాకు దేవుని చిత్తము తెలిసినపుడు నేను దాని ప్రకారము ప్రార్థిస్తూ ఆశ వదులుటకు ఇష్టపడను. జవాబు వచ్చినప్పుడు, పట్టుదల నిజంగా గెలుస్తుందని నేను చూస్తాను, పరలోకంలో సాధ్యమైన శక్తి ద్వారా ప్రోత్సహించబడతాను. పట్టుదల కలిగిన ప్రార్థన ద్వారా ఇది సాధ్యము– మీకు కూడా.

## *పట్టు విడువని విధవరాలు*

గోజాడు ప్రార్థనకు బైబిల్‌లో వున్న ఒక ఉత్తమమైన ఉదాహరణ లూకా 18:1–6: "వారు విసుకక నిత్యము ప్రార్థన చేయుచుండవలెననుటకు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను. దేవునికి భయపడకయు మనుష్యులను లక్ష్యపెట్టకయు నుండు ఒక న్యాయాధిపతి

ఒక పట్టణములో ఉండెను. ఆ పట్టణములో ఒక విధవరాలును ఉండెను. ఆమె అతని యొద్దకు తరచుగావచ్చి - నా ప్రతివాదికిని నాకును న్యాయము తీర్చుమని అడుగుచు వచ్చెను గాని, అతడు కొంత కాలము ఒప్పక పోయెను. తరువాత అతడు - నేను దేవునికి భయపడకయు మనుష్యులను లక్ష్యపెట్టకయు ఉండినను, ఈ విధవరాలు నన్ను తొందరపెట్టుచున్నది గనుక ఆమె మాటి మాటికి వచ్చి గోజాడకుండునట్లు ఆమెకు న్యాయము తీర్తునని తనలోతాననుకొనెను. మరియు ప్రభువిట్లనెను - అన్యాయస్థుడైన ఆ న్యాయాధిపతి చెప్పిన మాట వినుడి."

ఈ ఉపమానములో యేసు అన్యాయస్థుడైన ఆ న్యాయాధిపతి విసిగి న్యాయము తీర్చినపుడు తనకు దివారాత్రము మొఱ్ఱపెట్టు వారికి నీతి, ప్రేమ గల దేవుడు దయచేయలేడా? మనం ఊహించువాటి కంటే ఎక్కువగా ఇవ్వగలడు-మనం గోజాడినట్లయితే. పరిస్థితులు నిరాశాకరంగా లేక సమస్యలు అధిగమించలేనివిగా కనిపించినప్పటికీ మనం ఒత్తిడి చేసి ప్రార్థించినట్లయితే గెలువగలము.

రోమా 8:28 "దేవుని ప్రేమించువారికి, ఆయన సంకల్పం చొప్పున పిలువ బడిన వారికి, మేలు కులుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని ఎరుగుదుము" అని చెప్తుంది. ఈ వాక్యం ప్రార్థనకు సంబంధించిన భాగంలో కనిపిస్తుంది కాబట్టి, ప్రార్థన కొనసాగింపనిదే సమస్తము సమకూడి జరగవని ఇది చెప్తుందని నేను నమ్ముతున్నాను. మనం ప్రార్థనలో పట్టువదలకుండా వున్నట్లయితే, మన జీవితాలలో ఏమి జరిగినప్పటికీ, సమస్తము-అవి ఎంత చెడ్డవైనప్పటికీ-దేవుని జ్ఞానములో పని చేసి మన మేలుకై సమకూడి జరుగుతాయి.

> ప్రార్థనను కొనసాగించి, నీ గందరగోళమైన పరిస్థితిని దేవుడు అద్భుతకరంగా మార్చుటను గమనించు.

"దేవుడు తాను ఏర్పరచుకొనిన వారు దివా రాత్రులు తన్ను గూర్చి మొఱ్ఱపెట్టుకొనుచుండగా వారికి న్యాయము తీర్చడా? ఆయన వారికి త్వరగా న్యాయము తీర్చును వారి విషయమే గదా ఆయన దీర్ఘ శాంతము చూపుచున్నాడని మీతో చెపచున్నాను. అయినను మనుష్య కుమారుడు వచ్చునపుడు ఆయన భూమి మీద విశ్వాసము కనుగొనునా?" అని యేసు చెప్పుచున్నాడు (లూకా 18:7-8).

విషాదం క్రమ్మినపుడు మనుష్యులు విసుగక ప్రార్థనను కొనసాగించినట్లయితే, ఎన్ని జీవితాలు మారివుండెడివో. ప్రార్థనను కొనసాగించి, నీ గందరగోళమైన పరిస్థితిని దేవుడు అద్భుతకరంగా మార్చుటను గమనించు. మన ప్రార్థనలలో మనం నిశ్చయత కలిగి వుండాలని

దేవుడు కోరుతున్నాడు. ఏ విషయంలో మనం ఆశ వదులుకోకూడదని ఆయన కోరుతున్నాడు. నిజానికి, ఆయన వచ్చినప్పుడు, ప్రార్థనలో విసుగక కొనసాగించు విశ్వాసం కలిగిన మనుష్యుల కొరకు చూచుచున్నాడు.

## *పట్టుదల ఆశీర్వాదాలను తీసుకొనివస్తుంది*

మనం పట్టుదల కలిగి ప్రార్థించగలుగుటకు ఒక కారణం, జవాబు పొందుతామని మనకు తెలిసియుండుటయే. దేవుడు నమ్మదగినవాడని, మన ప్రార్ధనలకు జవాబివ్వకుండా మనలను నిరాశలో విడువడని మనకు తెలుసు. పట్టుదల గల ప్రార్ధనను గూర్చిన ఈ కథ ద్వారా నేను చాలా ప్రోత్సాహపరచబడ్డాను, ఇది మీకు కూడా ప్రోత్సాహాన్నిస్తుందని ఆశిస్తున్నాను.

తమ మునుపటి వివాహాల వలన జాన్ మరియు ట్రిష్ బిడ్డలను కలిగియున్నారు. కాని తమకు బిడ్డనిస్తానని దేవుడు తమ హృదయాలతో మాట్లాడాడని వారు నమ్మారు. వారు దీనిని గురించి ప్రార్థించారు, ట్రిష్ గర్భవతియైనది. ఆ సంతోషవార్తను బట్టి ఆ దంపతులు చాలా సంతోషించారు, కాని, ట్రిష్‌కు గర్భస్రావమైనది. వారి ఆనందం, దు:ఖంగా మారింది. ఆ దంపతులు మరల దైవ సన్నిధికి వెళ్లి ప్రార్థించుటకు మొదలుపెట్టారు.

“దేవా, నీవు గర్భములు తెరచువాడవు, మూయువాడవు” (ఆది 29:31, 30:22, 1 సమూ 1:5) అని జాన్ ప్రార్థించగా, “ప్రభువా, రాజు నిన్ను ఆయుష్యునిమ్మని అడుగగా నీవు దానిని అతని కనుగ్రహించావని కీర్తనలు 21 చెప్తుంది, మరియు నీవు మనుష్యులను లక్ష్యపెట్టువాడవుకావు” అని ట్రిష్ ప్రార్థించేది. ఈ దంపతులు దేవుని జీవమునడుగుతున్నారు, మరియు అది వారికిస్తాడని వారు నమ్ముతున్నారు.

త్వరలో ట్రిష్ మరలా గర్భవతియైనది. కాని, మరల గర్భస్రావమైనది, ఆ దంపతులు మరల ప్రార్థించారు. మూడవసారి ట్రిష్ మరల గర్భవతియైనది. కాని, మరల గర్భస్రావమైనపుడు, అందరూ ఎవరినైనా దత్తత తీసుకొనమని లేకపోతే ఆ ఆలోచన వదలివేయమని సలహా ఇచ్చారు. కాని, తమతో బిడ్డనిస్తానని చెప్పిన దేవుని మాటలను ఆ దంపతులు విడువదలచుకోలేదు.

ట్రిష్ మరలా గర్భవతియైనది. కాని, మరల గర్భస్రావమైనది. ఒక గర్భస్రావమే చాలా కష్టమైనది. మరి నాలుగు ? తమ సంఘకాపరి మరియు సంఘ విజ్ఞాపనకర్తల సహాయంతో, జాన్, ట్రిష్, విడిచిపెట్టమని సలహా ఇస్తున్న పరిస్థితుల మధ్యలో తమ వాగ్దానం పై ధృడంగా నిలువబడినారు. “విశ్వాసమనునది నిరీక్షింపబడువాటి యొక్క నిజ స్వరూపమును, లేనివి ఉన్నవనుటకు ఋజువునై యున్నది” అని ట్రిష్ ప్రార్థించింది. ఈ సారి ప్రార్థించుచుండగా, నిర్గమకాండము 23:26 “కడుపు దిగబడునదియు, గొడ్డుదియు నీ దేశములోను వుండదు. నీ దినముల లెక్క సంపూర్తి చేసెదను” అను వచనమును దేవుడు ఆమె హృదయములో పెట్టినాడు.

నమ్మదగినవాడైన దేవుడు జాన్ మరియు ట్రిష్‌ల ప్రార్థనలకు జవాబిచ్చినాడు. ట్రిష్, ఫ్రాన్సిస్ ఫెయిత్ కు జన్మనిచ్చింది. ఆ బిడ్డ ఇప్పుడు దేవుని మంచితనానికి ఒక మంచి సాక్ష్యంగాను, తన తల్లిదండ్రులకు గొప్ప ఆశీర్వాదకరంగాను, వారి గురించి ప్రార్థించి, వారి పట్టువదలని ప్రార్థనను గమనించిన వారికందరికీ గొప్ప ప్రోత్సాహకరంగాను వున్నది.

## *మరల మరల చెప్పుట కాదు, గోజాడుట*

ఇంకా ముందుకు వెళ్లుటకు ముందు నేనొక తేడాను చూపాలనుకుంటున్నాను. గోజాడు, పట్టుదల కలిగిన ప్రార్థనలు, మరల మరల చెప్పు ప్రార్థనలు ఒకటి కాదు. సండేస్కూల్ లో బట్టీ పట్టిన ప్రార్థనలు మరల మరల చెప్పుట కాదు గానీ, పరిశుద్ధాత్ముని నడిపింపుతో కూడిన పట్టుదల కలిగిన ప్రార్థనలు ప్రార్థించమని మిమ్మును ప్రోత్సాహపరుస్తున్నాను. ఏ అర్థం లేని పదాలను పెదవులతో ఉచ్ఛరిస్తూ ప్రార్థించుట చాలా సాధ్యం, కాని ఆ ప్రార్థనలు కేవలం జీవంలేనివైయున్నవి. నేను వేరే విషయం గురించి ఆలోచిస్తూ, పరలోక ప్రార్థనను పూర్తిగా చెప్పగలను.

పెదవుల పరిచర్య అనేది మన జీవితాలలో దేనినీ నెరవేర్చదు, దేవునికి కూడా ఏమీ చేయదు. కాబట్టి, ఒకే విషయం గురించి మరల మరల ప్రార్థించునపుడు – జాగ్రత్తకలిగి కేవలం అది పెదవుల ప్రార్థన కాకుండు నట్లుగా చూచుకోవాలి. చాలా కాలంగా ప్రార్థిస్తున్న విషయం అయినప్పటికీ, తాజా మార్గంలో నడిపించునట్లుగా పరిశుద్దాత్ముని ఆహ్వానించాలి.

నేను ఇంతకు ముందుగా చెప్పినట్లు, కొందరు ప్రార్థనా అప్పగింతలు కలిగివుంటారు. మరియు తరచుగా పట్టుదల కలిగిన ప్రార్థనలు వీటికి తోడ్పడతాయి. కొన్ని సార్లు దేవుడు ఒక వ్యక్తిని నీకు అప్పగిస్తాడు, పరిశుద్ధాత్ముడు ఒక రోజులో అనేక మార్లు ఆవ్యక్తిని నీ హృదయంలోకి రప్పిస్తుంటాడు ఆ వ్యక్తి నీ మనస్సులోనే వుంటాడు, అతని గురించి ప్రార్థించుటకు నీకు అసామాన్యమైన బలము లేక కోరిక కలుగుతుంది.

> ప్రభావవంతమైన ప్రార్థన చేయు క్రమంలో, ఒక పరిస్థితిని గురించి ఎప్పుడూ గోజాడుతూ ప్రార్థించాలి, ఎప్పుడు విడిచి పెట్టాలి అను వివేచన కలిగి వుండుటకు నేర్చుకొనుట ముఖ్యమైనది.

మనకప్పగింపబడిన వాటిని మనం నిర్ణయించుకొనలేము. అవి దేవుడు ఎంపిక చేస్తాడు, కాబట్టి మనము ఆ విషయంలో విధేయత కలిగి, సులువుగా స్పందిస్తూ అనుసరించాలి. అది కొంతకాలానికి అయినప్పటికీ దేవుడు బలమిస్తాడు. పట్టుదల

కలిగిన ప్రార్థనకు మన నిశ్చయతతో తప్ప ఎంత కాలమన్నదానితో పని లేదు. దేవుడు కొద్ది దినాలలో జవాబిచ్చిన ప్రార్థన యొక్క నిశ్చయతనే, నెలలు లేక సంవత్సరాలు ప్రార్థించే పట్టుదల కలిగిన ప్రార్థనకు కూడా కలిగి వుండాలి. ఒక రోజంతా లేక కొన్ని రోజులు లేక ఒక రోజులో కొన్ని గంటలు ఒక వ్యక్తి లేక ఒక విషయం మన మనసులో ఉండవచ్చును.

ప్రభావవంతమైన ప్రార్థన చేయు క్రమంలో, ఒక పరిస్థితిని గురించి ఎప్పుడూ గోజాడుతూ ప్రార్థించాలి, ఎప్పుడు విడిచి పెట్టాలి అను వివేచన కలిగి వుండుటకు నేర్చుకొనుట ముఖ్యమైనది. దేవుడు ముందే వాగ్ధానము చేసి, తన సమయము కొరకు ఎదురు చూడమన్నట్లయితే, మనకు చాలా చాలా అవసరమైనందున దేవుని ప్రార్థనలతో త్వరపెట్టుట అనేది మంచి కారణం కాదు. మనం పట్టుదల కలిగి వుండవలసిన విషయాన్ని మన ఆలోచనలు లేక మన ఉద్రేకాలు నిర్ణయించనివ్వకూడదు, బదులుగా, పరిశుద్ధాత్మచే నడిపింపబడాలి. దేవుని అభిషేకము ఉన్నప్పుడు ఎలా చెప్పాలి? లేనప్పుడు ఎలా చెప్పాలి? అన్నది మనం తెలుసుకొవలసియున్నది. ఆ వైవిధ్యం తెలిసికొనుటకు ఇక్కడ సులువైన మార్గం వున్నది. దేవుని అభిషేకము దేనిపైనన్నా వున్నప్పుడు, అది చేయుటలో సులువుగా వుంటుంది, ప్రవాహముగా ప్రార్థన వస్తుంది, దానిలో నిలిచియుండుటలో ప్రశాంతతవుంటుంది. దాని గురించి ప్రార్థించుచుండగా పరిశుద్ధాత్మ సన్నిధిని నీవు గ్రహించగలవు. మరొక విషయంలో, అభిషేకము లేని విషయము గురించి ప్రార్థించునప్పుడు, కష్టపడి ప్రయాసపడి ప్రార్థించవలసి వుంటుంది.

ప్రార్థనలో దేని విషయంలోనైనా దేవుని అభిషేకాన్ని నీవు గ్రహించినట్లయితే, దేవుడు నిన్ను మరొక విషయం వైపుకు నడిపించే వరకు ప్రార్థించుట మానకు. ఆయన నిన్ను నడిపించిన ప్రతీసారి పట్టుదల కలిగి ప్రార్థించు. లూకా 18లో వున్న దుష్టుడైన ఆ న్యాయాధిపతి కంటే దేవుడు అనంతముగా కృపకలిగిన వాడు, మరియు నీవు ఆయన చిత్తాన్ని ఎరిగియుండి, దాని గురించి పట్టుదల వదులుటకు ఇష్టపడక, ప్రార్థిస్తూనే వున్నట్లయితే, ఆయన జవాబిస్తాడు.

ఇందులో ఏది కూడా ప్రార్థన సులువైనదన్న నిజాన్ని కాదనటం లేదు. మనము పట్టుదల కలిగి ప్రార్థించనంత మాత్రాన ప్రార్థన చిక్కైనది కాదు. మనం ప్రార్థించుచుండగా, ఈ భూమి పై ఆయన చిత్తానికి స్వరమిచ్చుట ద్వారా ఆయనతో భాగస్వాములము అవుతున్నాము. ప్రార్థన అప్పగించుకొనుటను కోరుతుంది ఇది ఖచ్చితంగా ప్రయత్నమైనప్పటికీ, కష్టమైనది కాదు. కొందరు ప్రార్థనను పనిగా తలంచుతారు, అది నిజమే. ఇది భూమిపై అద్భుతములైన కార్యములను నెరవేర్చు, ఆత్మలో చేయు పని.

## సారాంశము

ఎక్కువమంది ఇతర ప్రార్థనలకంటే విన్నపాలను ఎక్కువగా చేస్తుంటారు. మనకు అవసరమైనవి అడుగుటను దేవుడు ఇష్టపడుతున్నాడు, మరియు ఆయన మనలను ఆశీర్వదించ గోరుతున్నాడు. ఏదేమైనా, మన విన్నపాలు, మన స్తుతులను, కృతజ్ఞతలను మించునవి కాకూడదు.

మనం విన్నపాలు చేయునపుడు,కుమారులు, కుమార్తెలముగా మన స్థానాన్ని అర్థంచేసుకోవాలి, ధైర్యంగా ఆయనను సమీపించాలి. మనము స్వంతగా ప్రార్థించుటకు మనకు అర్హత లేదు గానీ, క్రీస్తు రక్తము మనలను దేవుని యెదుట నీతిమంతులుగా చేస్తుంది. కాబట్టి, మనం ప్రార్థించునప్పుడు పిరికిగా, సిగ్గుగా నుండకూడదు. కొన్ని ప్రార్థనలకు దేవుడు జవాబిచ్చువరకూ మౌనముగా వుండుటకు ఇష్టపడని పట్టుదల కలిగిన ఉద్దేశము అవసరమై యున్నది. పట్టుదల కలిగియుండుట అనేది తలబిరుసుతనం కాదు గానీ, ఆత్మీయ బలం అవసరమైన ఆత్మీయమైన శక్తియై వున్నది. ప్రార్థనలో మనం సోమరిగా వుండకూడదు. కొన్ని సమయాలలో, దేవుడు – ఒక మలుపు వచ్చువరకూ ధైర్యంగా గోజాడువారికొరకు చూస్తున్నాడు.

## ప్రార్థనాంశములు

- మనం ప్రభువునకు మన కోరికలను చెప్పుకొనుట మనవి చేసుకొను ప్రార్థన. దేవుని కొన్ని విషయాలు అడుగుట, ఆయన చేస్తాడని నమ్ముట, అది జరుగుచుండగా కనిపెట్టుట అద్భుతమైనదైయున్నది. అయితే, మనం అడుగుటలోను, స్తుతి, కృతజ్ఞతలలోను సమతుల్యాన్ని కలిగివుండాలి.
- మనం దేవునియందు ఆనందించిన యెడల ఆయన మన హృదయ వాంఛలను తీర్చుతాడు. మన శారీరక వాంఛలు మన సమతుల్యాన్ని తప్పించునట్లుగా మనం వుండకూడదు. బదులుగా, మన కోరికలను దేవునికి అప్పగించుకొని, మన విన్నపాలను పరిశుద్ధాత్ముడు నడిపించునట్లుగా ఆయనను ఆహ్వానించాలి.
- యేసు మనలను నీతిమంతులుగా చేస్తున్నాడు. సిలువ పైని ఆయన త్యాగము మనలను దేవునితో సరియైన స్థానంలో నిలువబెడ్తుంది. కాబట్టి, మనం ప్రార్థనలో దేవుని దగ్గరకు ధైర్యంగాను, నమ్మకంతోను చేరవచ్చును.
- గోజాడు ప్రార్థన, మౌనముగా నుండని ప్రార్థన. అది పరలోక ద్వారాన్ని పట్టుదలతో, విశ్వాసంతో, జవాబు వచ్చువరకూ తడుతూనేవుంటుంది.
- "ప్రార్థనా అప్పగింతలను" దేవుని వద్దనుండి పొందుకుని, ఇతరులను తన చిత్తంలో నిలుపుకొనునట్లు దేవుడు నిన్ను వాడుకొననివ్వు.
- ఒక నిర్దిష్టమైన విషయాన్ని గురించిన ప్రార్థనలోని – ప్రశాంతత, సులువు, ప్రవాహం, శక్తి ద్వారా పరిశుద్ధాత్మ అభిషేకాన్ని గ్రహించుటకు నేర్చుకొనండి.దాని పై అభిషేకం వున్నంతకాలం దాని కొరకు పట్టుదల కలిగి ప్రార్థించండి. తర్వాత, ఆ విషయాన్ని వదలి, నీ ప్రార్థనను విని, జవాబిచ్చినందుకు దేవునికి కృతజ్ఞతలు తెలుపండి.

# 8

# విజ్ఞాపన మరియు ఒప్పందము

ప్రార్థన అనునది దేవునికి ఒక మనిషికి మధ్యగల వ్యక్తిగత సంబంధము అన్యోన్యతను తెలుపు క్రియయైయున్నది. కాని విశ్వాసులముగా మనము శూన్యములో వుండకూడదు. మనము దేవుని కుటుంబమునకు చెందినవారము, క్రీస్తు శరీరానికి జతపరచబడిన వారము మరియు మన క్రైస్తవ జీవితపు శక్తి యొక్క భాగము ఇతరులతోని మన సంబంధంలో తెలుస్తుంది. దేవుడు మనలను పదును చేయుటకు, బలపరచుటకు, సహాయపడుటకు మనతో కలిసి ఉత్సహించుటకు, మన అనుదిన జీవితంలోని ఎత్తుపల్లాలలో మనతో కలిసి నడుచుటకు వారిని ఉపయోగించుకుంటాడు.

మన సాంఘిక జీవితాలలో ఈ సంబంధాలు ప్రాముఖ్యమైనవైనట్లే, మన ప్రార్థనాజీవితాలలో కూడా ప్రాముఖ్యమైయున్నవి. కొన్ని సార్లు మనం మన చుట్టూ వున్న వారి కొరకు ప్రార్థిస్తాము, కొన్నిసార్లు వారితో *కలిసి* ప్రార్థిస్తాము. మనం వారి కొరకు ప్రార్థించినప్పుడు, విజ్ఞాపన ప్రార్థనలు చేస్తున్నాము, వారితో కలిసి ప్రార్థిస్తున్నప్పుడు ఒప్పందపు ప్రార్థనలు చేస్తున్నాము. ఈ రెండు రకాలైన ప్రార్థనలు అత్యంత శక్తివంతమైయున్నవి గనుక మనం వాటిని అర్థం చేసుకుని, అవి ఎలా ప్రార్థించాలో తెలుసుకొనవలసివున్నది.

## విజ్ఞాపనా ప్రార్థన

విజ్ఞాపనా ప్రార్థన అనగా నీ తరపున ఇతరుల గురించి ప్రార్థించుటయే. ఇది, ఇతరులకు బదులుగా వారి అవసరతలను ప్రార్థనలో ఆయన ముందు పెట్టి, మొఱ్ఱపెట్టుట అనేక

మందికి తమ గురించి ప్రార్థించుకొనుట ఎలాగో తెలియదు మరియు ప్రార్థించరు గనుక విజ్ఞాపనాప్రార్థన అనునది ప్రార్థనావిధానాలలో అతి ప్రాముఖ్యమైన విధానమైయున్నది. ఎందుకనగా ఎంతోమంది ప్రజలకు వారిని గురించి వారు ప్రార్ధన చేసుకోరు లేక వారికి ఎలా ప్రార్థించాలి? ఎందుకు ప్రార్థిచాలి? అనేది తెలియదు. వారు ఎందుకు ప్రార్థించరు? ఎందుకంటే, వారు దేవునితో సంబంధాన్ని కలిగి వుండరు కాబట్టి. అంతే కాకుండా పరిస్థితులు కష్టమైనవైనా, ఒత్తిడి ఎంతో ఎక్కువైనా, బాధ అధికమైనా అయోమయ స్థితిలో ఉన్నప్పుడు కూడా తమ పరిస్థితిని గూర్చి ప్రార్థించుట ఎలాగో తెలియని పరిస్థితులు కూడా వుంటాయి. మరియు మనుష్యులు తమ కొరకు ప్రార్థించి, ప్రార్థించి, ప్రార్థించి, ఇంక ప్రార్థించుటకు శక్తిలేని సమయాలుకూడా వుంటాయి.

> యేసుతో విజ్ఞాపనా పరిచర్యలో చేరుట ద్వారా దేవునికి దగ్గర కమ్మని మిమ్మును ప్రోత్సాహపరుస్తున్నాను

మనుష్యులు ప్రార్థించక పోవుటకు లేక ప్రార్థించ లేకపోవుటకు అనేక కారణాలు వుంటాయి. కాని, మనము ఇటువంటి పరిస్థితులలో వున్న విశ్వాసులను చూసినప్పుడు ఆ పరిస్థితిలోనికి అడుగు వేసి, వారికి బదులుగా పరిశుద్ధాత్మని నడిపింపు ప్రకారము ప్రార్థించుట ప్రాముఖ్యమైయున్నది. ఉదాహరణకు, ఒకసారి నేను క్యాన్సర్‌తో బాధపడుతూ ఆస్పత్రిలోవున్న ఒక స్నేహితురాలిని దర్శించాను. ఆమె శూరత్వంతో పోరాడి, ప్రార్థనా యోధురాలిగా ప్రార్థించింది. కాని, ఆమె ప్రార్థించుటకు ఇక శక్తి చాలదేమో అన్న స్థితికి వచ్చి నాతో, “జాయిస్ నేను ఇక ఏ మాత్రమును ప్రార్థించలేను” అని చెప్పింది. ఆమెకు ఆమె స్థానంలో ఉండి ఆమెకొరకు నిజంగా ప్రార్థించువారు అవసరమైయున్నది.

ఆంద్రూ ముర్రే మరియు వాచ్‌మెన్ నీ ఇద్దరూ విజ్ఞాపనా ప్రార్థనను “యాజక” ధర్మమని వ్రాశారు–యేసుయొక్క పరిచర్యలో పాలుపొందుటకు మనుష్యుల కొరకు ప్రార్థించుట ఒక అవకాశమైయున్నది. వాచ్‌మెన్ నీ ఈవిధంగా చెప్తున్నాడు “తన ప్రజలు మరియు వారి అవసరతల కొరకు యేసు నిరంతరము విజ్ఞాపన చేయుచున్న ప్రకారము మనుష్యులకొరకు ప్రార్థించుటకు మనము ప్రభువు ఎదుట నిలువ బడతాము. నిజానికి ఇది ప్రధాన యాజకుని ధర్మములో దేవునితో సహవాసము.” ఆంద్రూ ముర్రే వ్రాస్తూ ఒక యాజకుడు “తన కొరకు జీవించడు అతడు దేవుని కొరకు దేవునితో ... మనుష్యుల కొరకు మనుష్యులతో జీవిస్తాడు. మనుష్యుల పాపాలను అవసరతలను కనుగొని వాటిని దేవుని వద్దకు తెచ్చి వారి పేర్లపై బలిని అర్పించి వారికి క్షమాపణను ఆశీర్వాదమును తెచ్చి తరువాత బయటకు వచ్చి దేవుని పేరున వారిని ఆశీర్వదించుట అతని ధర్మమైయున్నది.”

యేసుతో విజ్ఞాపనా పరిచర్యలో చేరుట ద్వారా దేవునికి దగ్గర కమ్మని మిమ్మును ప్రోత్సాహపరుస్తున్నాను. మీ కుటుంబానికి మరియు స్నేహితులకు నీ ప్రార్థనలు అవసరం నీ పొరుగు వారికి మరియు నీ జతపని వారికి నీ ప్రార్థనలు అవసరం నీ సంఘస్తులకు నీ సమాజానికీ మరియు ప్రపంచానికి నీ ప్రార్థనలు అవసరమైయున్నవి. మనము భయంకరమైన దినములలో జీవిస్తున్నాము కనుక మనము ఒకరికొరకు ఒకరు ప్రార్థించవలసివున్నది. నీ విజ్ఞాపన అనునది నీ చుట్టూవున్న వారికి నీవిచ్చు అత్యంత శక్తి వంతమైన, అతివిలువైన బహుమానమును నీ జీవితంలోనూ వారి జీవితంలోనూ గొప్ప వైవిధ్యాన్ని కలుగచేయు నదైయున్నది. ఒక వ్యక్తి కొరకు ఈ భూమిపైన నీవు ఒక్కడవే ప్రార్థిస్తూ వుండి వుండవచ్చు – అయితే నీ ప్రార్థన ఆ వ్యక్తి జీవితాన్ని మారుస్తుంది.

## *సందులో నిలుచుండుట*

రెండింటి మధ్యవున్న ఖాళీ ప్రదేశాన్ని సందు అంటారు. ఇది రెండు వస్తువులను, రెండు ప్రదేశాలను, ఇద్దరు మనుష్యులను, రెండు వ్యక్తిత్వాల సంబంధం లేకుండా వుంచుతుంది. నేను ఇతర దేశాలలో ప్రసంగించునప్పుడు ప్రేక్షకులకు నాకు మధ్య అంతరం వుంటుంది అది ఒక వేళ నేను స్టేజీ మీద నిలువబడితే అది భౌతిక అంతరం కావచ్చు సాంస్కృతిక అంతరం కావచ్చు అయితే ఎక్కువగా నేను భాషల్లో అంతరాన్ని గ్రహిస్తాను. ప్రజలు నేను చెప్పేది అర్థం చేసుకోవాలని అనుకున్నట్లయితే మా మధ్యవున్న భాష అంతరంలో నిలుచోటానికి నాకొక అనువాదకుడు అవసరము ఆ అనువాదకుడు మా మధ్యవున్న ఖాళీని పూరించి నా మాటలు ప్రజలు అర్థం చేసుకునేట్లుగా చేస్తాడు.

సందులలో నిలుచుండుటను గురించి యెహెజ్కేలు 22:29-31 చెప్తుంది–బైబిల్ లోని అతి విషాదకరమైన నివేదికల్లో ఇదీ ఒకటని నేను అనుకుంటాను: మరియు సామాన్యజనులు బలాత్కారము చేయుచు దొంగిలించుదురు, వారు దీనులను దరిద్రులను హింసించుదురు, అన్యాయముగా వారు పరదేశులను బాధించుదురు. నేను *దేశమును పాడుచేయకుండునట్లు ప్రాకారమును దిట్టపరచుటకును, బద్దలైన సందులలో నిలుచుటకును, తగిన వాడెవడని నేను ఎంత విచారించినను ఒకడైనను కనబడలేదు.* కావున నేను నా క్రోధమును వారి మీద కుమ్మరింతును, వారి ప్రవర్తన ఫలము వారి మీదకి రప్పించి నా ఉగ్రతాగ్నిచేత వారిని దహింతును ఇదే ప్రభువైన యెహోవా వాక్కు. ప్రాముఖ్యంగా దేవుడు చెప్పునది ఏమనగా"ప్రార్థించే వారు కావాలని నేను కనిపెట్టాను ఎవరూ కనబడలేదు గనుక, నేను తప్పని సరిగా దేశాన్ని నాశనము చేయవలసివున్నది." అని అంటున్నాడు. దేశమంతా నాశనము నుండి తప్పించుకొనుటకు ఒక వ్యక్తి కావలసివున్నది. విజ్ఞాపనాప్రార్థన ఎంత ప్రాముఖ్యమైనదో చూశారా? కేవలం ఒక్క వ్యక్తి, దేశమంతటా మరియు ఆ ప్రదేశమంతటా తన ప్రార్థన ద్వారా మార్పు కలుగజేశాడు. ప్రార్థించుటకు మనం ఇష్టపడువారమైయుండాలి. మనలను పరిశుద్ధాత్ముడు ప్రార్థనకు నడిపించు సమయమును గుర్తెరిగి, లోబడు వారముగా

వుండాలి. దేవుని, ఒక నాశనకరమైన పరిస్థితితో కలిపి మార్పు కలుగజేయువిధంగా నీ ప్రార్థన ఎప్పుడు అవసరమౌతుందో నీకు తెలియదు.

## *అతని మనస్సును దేవుడు మార్చుతాడు*

విజ్ఞాపన బలమైనదని, అనేకమందిని మార్చగలదని, యెహెజ్కేలు కథనంలో మీరు గమనించగలరు. కాని, విజ్ఞాపన దేవుని మనస్సును కూడా మార్చుతుందని మీకు తెలుసా? ప్రార్థన యొక్క ఫలితంగా, దేవుడు ప్రణాళిక చేసుకున్నదానిని కూడా తిరిగి ఆలోచిస్తాడు.

ఈ కథనాన్ని గుర్తు చేసుకోండి? "కాగా యెహోవా మోషేతో ఇట్లనెను – నీవు దిగివెళ్లుము ఐగుప్తుదేశమునుండి నీవు రప్పించిన నీ ప్రజలు చెడిపోయిరి. నేను వారికి నియమించిన త్రోవనుండి త్వరగా తొలగిపోయి తమకొరకు పోతపోసిన దూడను చేసికొని దానికి సాగిలపడి బలినర్పించి – ఓయి ఇశ్రాయేలూ, ఐగుప్తుదేశమునుండి నిన్ను రప్పించిన నీ దేవుడు ఇదే అని చెప్పుకొనిరనెను." (నిర్గమ కాండము 32:7–8).

మోషే పది ఆజ్ఞలను తీసుకోవటానికి, సీనాయి కొండ పైకి వెళ్లి, చాలాకాలం తిరిగిరాలేదు. వారి నాయకుడు లేని సమయంలో, వారు ప్రభువును మరచిపోయి, శరీర కోరికలకు తమను తాము అప్పగించుకున్నారు. తమ నగలను కరిగించి, పోతపోసిన దూడను చేసికొని, దానిని ఆరాధించుటకు మొదలుపెట్టారు. దేవుడు మోషేతో *నీవు తిరిగివెళ్లటం మంచిది, ఎందుకంటే, ప్రజలు చాలా గందరగోళం చేస్తున్నారు. ఆ విషయంలో నేను చాలా కోపంగా వున్నాను* అని చెప్పాడు (దేవునికి వందనాలు, ఆయన కోపము నిమిషమాత్రముండును, ఆయన దయ ఆయుష్కాలముండును అని కీర్తనలు 30:5 చెప్తుంది.)

తరువాత : "మరియు యెహోవా ఇట్లనెను – నేను ఈ ప్రజలను చూచియున్నాను ఇదిగో వారు లోబడనొల్లని ప్రజలు. కావున నీవు ఊరకుండుము నా కోపము వారిమీద మండును, నేను వారిని కాల్చివేసి నిన్ను గొప్ప జనముగా చేసెదనని మోషేతో చెప్పగా" (నిర్గమ కాండము 32:9–10).

మోషే దైవభక్తిగలవాడగుట చాలా మంచివిషయం, లేకపోయినట్లయితే అతను దేవునితో *"బ్రహ్మాండమైన తలంపు గల దేవా, వాళ్లని గురించి మర్చిపో, నాతోనే ఏదైనా గొప్ప పని చేయి"* అని చెప్పి వుండేవాడు. కాని, దానికి బదులుగా మోషే వారికొరకు విజ్ఞాపన చేయటం మొదలుపెట్టాడు, ఎందుకంటే, అతను వారిగురించి చాలా శ్రద్ధ తీసుకున్నాడు. "మోషే తన దేవుడైన యెహోవాను బ్రతిమాలుకొని" అని బైబిలు చెప్తుంది (నిర్గమకాండము 32:11). అంటే అతను ఊరకుండలేదు. కాని, దేవుడు ముందుగానే *నీవు ఊరకుండుము. వారి గురించి ప్రార్థించవద్దు, ఒకవేళ నీవు ప్రార్థించినట్లయితే, నేను నీ ప్రార్థన వినవలసివస్తుంది* అని చెప్పాడు. కాని మోషే యెహోవాను బ్రతిమాలుకొని – "యెహోవా, నీవు మహాశక్తి

వలన బాహుబలము వలన ఐగుప్తుదేశములోనుండి రప్పించిన నీ ప్రజలమీద నీ కోపము మండనేల?" అని ప్రార్థించాడు (నిర్గమకాండము 32:11). మోషే హృదయానికి అది నచ్చలేదు గనుక అతను దానిని వదలిపెట్టలేదు. అతను ప్రజలను ప్రేమించాడు అతనికి దేవుని స్వభావము తెలుసు అన్నిటికి మించి అతనికి దేవుని వ్యక్తిత్వము, ఆయన నిజంగా ప్రేమిస్తున్నాడని, వారిని మధ్యలో నిస్సహాయస్థితిలో విడిచిపెట్టుటకు నిజంగా ఇష్టపడడని తెలుసు.

ఈ పరిస్థితిని గురించి ప్రార్థిస్తూ దేవునితో మాట్లాడుతూ మోషే ఎలా ఎదుర్కున్నాడు? నిజంగా, దేవుడిని మనస్సు మార్చుకోమని మోషే చెప్పాడు. *ఆయన కొండలలో వారిని చంపునట్లును భూమి మీద నుండి వారిని నశింప జేయునట్లును కీడు కొరకే వారిని తీసికొని పోయెనని ఐగుప్తీయులు ఏల చెప్పుకొనవలెను? నీ కోపాగ్ని నుండి మళ్ళుకొని నీవు నీ ప్రజలకు ఈ కీడుచేయక దానిగూర్చి సంతాపపడుము. నీ సేవకులైన అబ్రహామును ఇస్సాకును ఇశ్రాయేలును జ్ఞాపకము చేసికొనుము. నీవు వారితో - ఆకాశనక్షత్రములవలె మీ సంతానము అభివృద్ధిజేసి నేను చెప్పిన ఈ సమస్తభూమిని మీ సంతానమున కిచ్చెదననియు, వారు నిరంతరము దానికి హక్కుదారులగుదురనియు వారితో నీతోడని ప్రమాణముచేసి చెప్పితివనెను.* (నిర్గమకాండము 32:12-13) దేవుడు తన మనసు మార్చుకున్నాడని బైబిల్ చెప్తుంది. నిర్గమకాండము 32:14 చదివినట్లయితే ఈ విధంగా చెప్తుంది: "అంతట యెహోవా తన ప్రజలకు చేసెదనని చెప్పిన కీడును గూర్చి సంతాపపడెను" విజ్ఞాపన యొక్క శక్తి మరియు ఉద్దేశంలో ఇది ఒక భాగము. మనం ప్రార్థించినప్పుడు భిన్నత్వమును కలుగజేయగలము!

## *విజ్ఞాపన వైవిధ్యాన్ని కలుగజేస్తుంది*

ఈ పుస్తకమంతటిలోని వివిధ కథలను మరియు ఉదాహరణల ద్వారా ప్రార్థనలో ఎంత శక్తి వుందో, నేర్చుకుంటారని నాకు నమ్మకంవుంది, మరియు, కానీ మనం ప్రార్థించునపుడు ఇతరుల జీవితాలలో ఎంత గొప్ప మార్పు కలుగజేస్తున్నామో చూస్తున్నాము. విజ్ఞాపనాప్రార్థన నా జీవితంలోని ఒక పరిస్థితిని ఎంతగా మార్చిందో మీతో పంచుకోనివ్వండి. వ్యాయామము ద్వారా నా శరీరాన్ని క్రమశిక్షణలో వుంచుకొనుట నాకు చాలా కష్టమైన విషయం. నేను మామూలుగానే క్రమశిక్షణ కలిగిన వ్యక్తిని. కాని క్రమంగా వ్యాయామము చేయటం అనేది ఎందుకో నావలన కావటంలేదు. యథార్థంగా, నాకు వ్యాయామం చేయటం అస్సలు ఇష్టం లేదు! వ్యాయామం అనేది నాకు చాలా భయంకరమైన బంధకం. డేవ్ అయితే తన జీవితమంతా వ్యాయామం చేస్తూ వుండి వుండవచ్చును. మరియు నేను చేయనందుకు నన్ను ప్రతీరోజు తప్పుపడుతూ వుండేవాడు. అన్నిటికి మించి నేను ఏ వైద్యుని వద్దకు వెళ్లినా, వాళ్లు నన్ను "వ్యాయామం చేస్తున్నావా?" అని అడిగేవారు, నేను "అంతగాకాదు" అని చెప్పవలసివచ్చేది. ఇంకా బాధాకరమైనది ఏమిటంటే, నా శరీరం అందవికారంగాను,

పెరగకూడనంత బాగా పెరిగిపోతూవచ్చింది. నేను అద్దంలో చూచుకొనేటప్పుడు, “జాయిస్ ఎక్కడ?” అని నన్ను నేను అడుగుకొనేదానను, చివరకు ఆ అద్దంలో కనిపించే స్త్రీని నేనే అని గ్రహించి, “దీనికి నేనేం చేయ్యాలి” అని ప్రశ్నించుకొనేదానను. జవాబు ఎప్పుడూ ఒకటే: వ్యాయామం. కాబట్టి, నేను బాధపడి, కోపపడి అన్ని విధాలైన వ్యాయామాలు మొదలుపెట్టేదానను. నా కండరాలన్నీ నొప్పిపుట్టేవరకు అలా చేసేదానను. తరువాత దానిని ఆపివేసేదానను, ఎందుకంటే, అది నాకు సంతోషాన్ని కలిగించేది కాదు.

తరువాత ఒక అభిషేకింపబడిన స్నేహితుడు నాతో “జాయిస్, నీకు నీ పరిచర్యతో సంబంధంలేని ఒక వ్యక్తిగత విషయం గురించి – నీకు చాలా అవసరమైన విషయం గురించి ప్రార్థించమని దేవుడు నా హృదయంలో భారాన్ని పెట్టినాడు” అని చెప్పాడు.

ఈ వ్యక్తి చాలా అభిషేకింపబడిన వాడని, శక్తివంతమైన విజ్ఞాపనకర్తని నాకు తెలుసు, కాబట్టి, నేను అనుకున్నాను *దీని గురించి నేను జాగ్రత్తగా ఆలోచించాలి, ఎందుకంటే, అతను ప్రార్థించినదానిని నేను తప్పకుండా పొందుకుంటాను* అని ఆలోచించాను. నేను బాగా ఆలోచించి, వ్యాయామం చేయునట్లుగా క్రమశిక్షణ కలిగివుండునట్లుగా ప్రార్థించమని చెప్పాలని నిర్ణయించుకున్నాను. కాబట్టి నేను “నేను మంచిగా వ్యాయామం చేయుటకు నన్ను నేను క్రమశిక్షణలో వుంచుకొనునట్లుగా ప్రార్థించు” అని చెప్పినాను.

ఇలా నా బలహీనతను ఆ విజ్ఞాపనకర్తతో పంచుకొని “ఈ ప్రదేశంలో నన్ను నేను క్రమశిక్షణలో వుంచుకొనలేకపోవుచున్నాననీ చెప్పుట అసామాన్యమైన శక్తిని మరియు స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది. అతను నా గురించి ప్రార్థించుట మొదలుపెట్టిన తరువాత నా జీవితంలో మొదటిసారిగా, నేను శ్రద్ధగా, క్రమశిక్షణతో వ్యాయామం చేయగలుగుతున్నాను. “నేను వ్యాయామాన్ని నిజంగా ఆనందిస్తున్నాను” అని చెప్పగలిగే స్థితికికూడా చేరుకున్నాను.

## ప్రార్థించుటకు భారం

కొన్నిసార్లు, ఇతరుల కొరకు ప్రార్థించునపుడు, నీవు భారాన్ని, ప్రార్థన కొంతకాలం క్రితం నాకొక ప్రార్థనా భారం వుండేది. టెలివిజన్ లో ఏదీ ఒక కార్యక్రమాన్ని నేను చూడటానికి ప్రయత్నిస్తున్నాను, ఆ కార్యక్రమాన్ని నేను నిజంగా చూడాలను కుంటున్నాను. కాని, ఆ కార్యక్రమం పై దృష్టిని కేంద్రీకరించటానికి నాకు సమయం దొరకటం చాలా కష్టమయ్యేది, నాకు చాలా దుఃఖం వచ్చేది. నాకు ఏమయిందో అర్థమయ్యేది కాదు, అయితే, నా లోపల నాకు చాలా బాధగా వుండేది, కాబట్టి, నేను టెలివిజన్ ఆపివేసి నేలపై సాగిలపడి, దేవుని ముందు ఏడుస్తూ, ప్రార్థించేదానను. హఠాత్తుగా, చాలా కష్టసమయాలను ఎదుర్కొంటున్న ఒక యవనస్తురాలు నాకు జ్ఞాపకం వచ్చింది, 15 నిమిషాలు నేను ఆమెకొరకు ఏడ్చి, విజ్ఞాపన చేశాను.

> భారం అంటే, నీ హృదయంలో బరువుగా, ముఖ్యమైనదిగా అనిపించు భావన – ఇది నీవు కదిలించలేనిది

ఒకసారి అలా చేసిన తరువాత, ఆ భారం ఎత్తబడినది. నేను తిరిగి బాగయినాను, వచ్చి ఆ కార్యక్రమం చూశాను, అంతా బాగయింది.

ప్రార్థనా భారాన్ని గురించి నన్ను పంచుకోనివ్వండి: దీనిని నీవు తెచ్చుకొనలేవు. కాని, ఒక ప్రార్థనా భారాన్ని నీవు అలక్ష్యం చేయాలని చూచినట్లయితే, నీవు ఉపశమనాన్ని పొందలేవు. ఇంతకు మునుపు మీరు ప్రార్థనా భారాన్ని పొందివుండని వారై, నాకు జరిగినదే మీకు కూడా జరుగుతున్నట్లయితే, నీకు ఏదైన చెడు జరిగినట్లు అయితే, దానిని గూర్చి ఆశ్చర్యపోవటం మొదలు పెట్టవద్దు. దేవుడు నాకు భారాన్ని తరచుగా ఇవ్వడు: నా ప్రార్థనలు క్లుప్తంగా, మాములుగా భిన్నమైనవిగా సామాన్యమైనవిగా మాత్రమే వుంటాయి. కొంతమందైతే, కళ్లు మూసికొనిన ప్రతిసారి భారాన్ని కలిగివుంటారు. మంచి విజ్ఞాపనకర్తయైన స్నేహితురాలు నాకుంది. ఆమె ప్రార్థన మొదలుపెట్టిన ప్రతిసారి, ఐదు నిమిషాలకు ఆమె చిన్నబిడ్డలా పెద్దగా అరుస్తూ ప్రార్థిస్తుంది. నేను చేయుదాని కంటే వైవిధ్యమైన పిలుపును ఆమె కలిగివుంది. కాని, నేను ఆమెతో కలిసి ప్రార్థించునపుడు ఆత్మీయత లేనట్లుగా భావన పొందను. దేవుడు నాకు భారం ఇచ్చినపుడు, నేను దానికి తగినట్లుగా స్పందిస్తాను కాని, ఆయన ఇవ్వనప్పుడు, నేను ఏదో తప్పుచేసినట్లుగా అనుకొని, నా ఆత్మీయజీవితంలో లోపం వున్నదని ఆలోచించను.

విజ్ఞాపనకర్తలముగా మనము మనకు అప్పగింపబడినదానిని దేవునివద్దనుండి పొందుకొనవలసియున్నది, మరియు ఆ భారం దేవుని వద్ద నుండి పొందామా, లేదా అను తేడా తెలుసుకొనవలసి యున్నది. అంతేకాకుండా, ఒక విషయమై ఇతరులను దేవుడు పిలచిన దానిని చేయుటకు ప్రయత్నించకూడదు దేవుడు వారికి అప్పగించిన భారం నిమిత్తమే విధేయత కలిగి ప్రార్థిస్తూ, నమ్మదగినవారై, ఆ భారం ఎత్తబడువరకూ ఆశక్తితో ప్రార్థించాలి.

మనమందరము, దేవుని నడిపింపు ప్రకారము ఇతరుల కొరకు ప్రార్థించు బాధ్యత కలిగి, విజ్ఞాపనా పరిచర్యకు పిలువ బడినాము. కొందరైతే, విజ్ఞాపనా పరిచర్యలో ప్రత్యేకంగా వరం పొంది, విజ్ఞాపనా కార్యాలయంలో నిలువబడినవారై వుంటారు. వారు ఇతరుల కొరకు రోజులో అనేక గంటలు లేక వారంలో అనేక సార్లు ప్రార్థిస్తుంటారు. రాత్రి వేళల్లో ప్రార్థించునట్లు దేవుడు తమను లేపాడని, వారు తరచుగా మాట్లాడుతుంటారు. ఇతరులు అనుభవించని వాటిని వీరు అనుభవిస్తుంటారు, కాని, జ్ఞాపకముంచుకోండి, వ్యక్తిగతంగా ప్రార్థించాలని దేవుడు మనకు బోధిస్తున్నాడు. ఇతరుల ప్రార్థనా అనుభవముల వలన మనము పిరికి వారముగా వుండనవసరంలేదు.

## ప్రార్థనలో నీ స్థానాన్ని కనుగొను

ప్రతి విశ్వాసి ప్రార్థించుటకు, విజ్ఞాపన చేయుటకు పిలువబడినారు. కాని, అందరూ విజ్ఞాపన కర్తలుగా "ఆత్మీయ కార్యాలయంలో" నిలువబడుటకు పిలువబడలేదు. ఉదాహరణకు, అమెరికా గురించి విజ్ఞాపన కర్తగా డేవ్ పిలువబడినాడని నేను నమ్ముతాను, అతను దేవుని చేత ఆ పని అప్పగింపబడినట్లుగా కనిపిస్తాడు. జాతీయ విషయాలు, పనుల విషయంలో నిజమైన భారాన్ని, సంయుక్తరాష్ట్రాల సమస్యల విషయంలో లోతైన ఆసక్తి, మా దేశంలో గొప్ప విప్లవాన్ని చూడాలను కోరికను అతను కలిగివున్నాడు. అమెరికా చరిత్రను గురించి అతను శ్రద్ధగా చదువుతాడు, మరియు అమెరికా రాజకీయ విషయాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకొంటుంటాడు. అతని ప్రార్థనలలో అసామాన్యమైన ఆసక్తి కనిపిస్తుంది. "ఆత్మీయ కార్యాలయంలో" నిలువబడువిజ్ఞాపన కర్తలు అనుదానికి అర్థం అదే.

సంయుక్త రాష్ట్రాల కొరకు 1997 నుంచి అతను దేవుని ఎదుట ప్రార్థిస్తూ, ఏడుస్తూ, గోజాడుటను నేను గమనిస్తున్నాను. మా రాష్ట్రం కొరకు నేను అతనిలా ఏడవ్వను, కాని, నేను మా నాయకుల గురించి, దేశం గురించి ప్రార్థించనని దాని అర్థం కాదు. నేను డేవ్ వంటి అపేక్ష కలిగివుండుటకు ప్రయాసపడలేను, ఎందుకంటే, అది దేవుడు ద్వారా అనుగ్రహింపబడినది. దేవుడు డేవ్‌ను, నన్ను ఒక టీమ్ గా, రెండు వైపులా వాడుకొంటున్నాడు. అతనిలా విజ్ఞాపన చేయలేకపోవటం గూర్చి నేను ఆలోచిస్తున్నట్లయితే, నేను అపరాధ భావనలో వుండిపోయి – దేవుడు నన్ను పిలచిన పిలుపును నెరవేర్చలేను. ఏదేమైనా, నేను నా స్థానంలో ఆత్మస్థైర్యంతో నిలువబడి, దానిలో అద్భుతంగా చేయాలని దృష్టిపెట్టినట్లయితే, మా టీమ్ ప్రతిసారి గెలుస్తుంది. దేవుడు ప్రతిదానిని ప్రతి ఒక్కరికీ అప్పగించడు. ప్రతి ఒక్కరికి సరిపోయినదానిని పరిశుద్ధాత్ముడు వారికి అప్పగిస్తాడు, మనం మన భాగం చేయాలి.

## ఎప్పుడు ప్రార్థించకూడదు

మనం కొన్ని సార్లు ఇతరుల గురించి ప్రార్థించి దేవుని చిత్తాన్ని వ్యతిరేకిస్తున్నామని మీకు తెలుసా? నమ్మండి, నమ్మకపోండి లేదా కొందరు వ్యక్తుల గురించి విజ్ఞాపన చేయుట దేవుని చిత్తము కాని సమయాలు కూడా ఉంటాయి. యిర్మియా 7:16 నందు దేవుడు యిర్మియాతో "కాబట్టి నీవు ఈ జనము కొరకు ప్రార్థన చేయకుము, వారికొరకు మొఱ్ఱనైనను ప్రార్థననైనను చేయకుము, నన్ను బతిమాలుకొనకుము, నేను నీ మాట వినను." అని చెప్పాడు.

కొన్ని సమయాలలో ప్రార్థన ద్వారా మనము మనుష్యులను రక్షించి సాతానుని వారినుంచి దూరంగా వుంచగలము. కాని కొన్ని సమయాలలో వారు అశాంతికరమైన మార్గంలో

ప్రయాణించుటకు సాతాను వారికి దగ్గర కావలసివున్నది. ఎందుకంటే ఆ సమస్యే వారిని దేవుని వైపుకు త్రిప్పుతుంది. ఇది చాలా ముఖ్యమైన విషయం, ఎందుకంటే మనం ఎవరి గురించైనా ప్రార్థించకుండా పాపము చేస్తున్నామేమో అన్న భావనను మనం కలిగివుండాలని సాతాను ఆశ పడుతున్నాడు. దాని ద్వారా మనం అపరాధ భావనను పొంది దేవుడు కోరిన రీతిలో ఆ పరిస్థితిని గురించి ప్రార్థించకుండా వుంటాము అందువలననే మనము తప్పకుండా పరిశుద్ధాత్మ వలననే నడిపించబడవలసివున్నది. ఆయన అతి తరచుగా ఒక వ్యక్తిని గురించి ప్రార్థించమని చెప్పాడు, కాని ఆయన అలా చెప్పినప్పుడు మనం ఆయన స్వరాన్ని గుర్తించి, ఆయనకు లోబడి సాతానును ఎదిరించవలసిన వారమైయున్నాము.

## *అత్యంత శక్తివంతమైన ప్రార్థన*

నీవు చేయగలిగిన అత్యంత శక్తివంతమైన ప్రార్థనలలో ఒకటి నీ శత్రువులను గురించి ప్రార్థించుట. తన ప్రార్థనలో శక్తివంతుడైన వ్యక్తిని నీవు చూడాలనుకుంటే తన శత్రువు కొరకు విజ్ఞాపన చేసే వ్యక్తి కొరకు చూడు.

> తన ప్రార్థనలో శక్తివంతుడైన వ్యక్తిని నీవు చూడాలనుకుంటే తన శత్రువు కొరకు విజ్ఞాపన చేసే వ్యక్తి కొరకు చూడు.

మనలను బాధపెట్టిన వారి కొరకు, మనలను మోస పరచిన వారి కొరకు విజ్ఞాపన చేసినప్పుడు దేవుడు అత్యధికముగా ఆశీర్వదిస్తాడని నేను నమ్ముతున్నాను.

యోబును జ్ఞాపకం చేసుకోండి, తనను బాధపరచి నిజముగా నిరుత్సాహపరచిన తన స్నేహితుల కొరకు అతను ప్రార్థించవలసి వచ్చింది. కాని, అలా ప్రార్థించిన వెంటనే అతని జీవితం పునరుద్ధరింపబడినది. నిజానికి, అతను పోగొట్టుకున్నదానికంటే దేవుడతనికి రెండింతలు ఎక్కువ ఇచ్చాడు (యోబు 42:10) ! మనల్ని బాధపెట్టిన వారికొరకు ప్రార్థించుట అనేది చాలా శక్తివంతమైనది ఎందుకంటే అలా చేసినపుడు మనం ఆ వ్యక్తి యెడల ప్రేమలో నడుస్తూ దేవుని వాక్యప్రకారం నడుస్తున్నామని అర్థం.

మత్తయి 5:44 నందు యేసు మనకు ఏమి చెప్పాడు? ఆయన అని, “నేను మీతో చెప్పునదేమనగా, మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులైయుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి.” అని సూచిస్తున్నాడు. మిమ్మును ఉపయోగించుకొని, మిమ్మును దూషించిన వారిని గురించిబాధ పెట్టిన వారిని గురించి హింసించిన వారిని గురించి నీ గురించి చెడుగా మాట్లాడిన వారిని గురించి నీవు ఆలోచించినప్పుడు వారిని దీవించు శపించవద్దు.

వారి గురించి ప్రార్థించు. శత్రువులను దీవించుట సులభము కాదని, అది చేయుటకు నీవు ఇష్టపడవని దేవునికి తెలుసు. కాని నీకు ఇష్టం కాబట్టి నీవు దీనిని చేయుట లేదు – దేవుని కొరకు దీనిని చేస్తున్నావు. శపించుటకు బదులుగా ప్రార్థించుటకు దీవించుటకు ఎంచుకొనుట అనేది ఆత్మీయతలో శక్తివంతమైనది మరియు దాని ఫలితంగా దేవుడు నీ జీవితంలో గొప్ప విషయాలను జరిగిస్తాడు.

## ఒప్పందపు ప్రార్థన

నీవు ఒకదానిగురించి ప్రార్థిస్తూ, అందులో ఏ అభివృద్ధి చూడక పోయినట్లయితే, నీతో కలసి ప్రార్థించుటకు నీకు ఒకరు కావలసి యున్నది. ఇటువంటి ఐకమత్యంలో శక్తివంతమైన ఆత్మీయ బలమైయున్నది, కీర్తనలు 133 ప్రకారం, ఇది మంచిదియు, దేవుని ఆశీర్వాదములను తెస్తుంది.

ఇద్దరు లేక ఎక్కువమంది ఒక విషయం గురించి ఒప్పందము లోనికి వచ్చినప్పుడు, యేసు తానే వారితోవుంటానని వాగ్ధానము చేసియున్నాడు, మరియు మన పరిస్థితులలోను, జీవితాలలోను ఎన్నడూ ఊహించని విధంగా ఆయన సన్నిధి యొక్క శక్తి వినియోగపరచ బడుతుంది. మత్తయి 18:19–20 నందు ఆయన "మరియు మీలో ఇద్దరు తాము వేడుకొను దేనిని గూర్చియైనను భూమి మీద ఏకీభవించిన యెడల అది పరలోకమందున్న నా తండ్రివలన వారికి దొరకునని మీతో చెప్పుచున్నాను. ఏలయనగా ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని చెప్పెను" అని చెప్తున్నాడు. వ్యక్తిగతముగా కూడా దేవుడు మన మధ్యవున్నాడు, కాని మనం కలసి, ఐకమత్యంతో మరియు ఒప్పందముతో దేవుని వద్దకు వచ్చినప్పుడు మన శక్తి అభివృద్ధి చెందుతుంది. ఒకడు వేయిమందిని తరుమును, ఇద్దరు పదివేలమందిని పారదోలుదురు అని బైబిలు చెప్తుంది (ద్వితి 32:30). అటువంటి లెక్క నాకు ఇష్టం!

ఎందుకనగా దేవుని ఆశీర్వాదము ఐకమత్యములోను, ఆయన సన్నిధి ఆయన నామమున ఒప్పందముతో కూడిన వారిమీదను వుంటుంది గనుక, మనుష్యులను జాగ్రత్తగా విడదీయుటకు, సంబంధాలలో కలహాలు పుట్టించుటకు, కోపాన్ని, రోషాన్ని పెంచుటకును, మనుష్యులు ఒకరినొకరు ద్వేషించుటకు సాతాను శ్రద్ధగా పనిచేస్తాడు. ఐకమత్యము మరియు ఒప్పందము యొక్క శక్తిని మనం అర్థంచేసుకొనవలసి యున్నది. దేవునితో వ్యక్తిగత సమయాలు, సన్నిహిత సంభాషణలు మనకు అవసరమైయున్నప్పటికీ, ఒకరితో ఒకరు ఒప్పందముతో ప్రార్థించుటలోని శక్తిని కూడా మనము అభ్యసించవలసియున్నది.

## ఒప్పందములో జీవించుట

మన అనుదిన జీవితాలలో కూడా ఒప్పందంలో జీవించే వాళ్ళు ప్రార్థనలో ఒప్పందం కలిగి చేసినప్పుడు మాత్రమే ఈ ఒప్పందపు ప్రార్థన ప్రభావవంతంగా వుంటుంది. ఒప్పందంలో జీవించటం అంటే మనకు సొంత అభిప్రాయాలు వుండకూడదని కాదు కానీ మన సంబంధాలలో మృదుత్వం, ఒకరి పట్ల ఒకరికి మర్యాద గౌరవం వుండాలని అర్థం. దీని అర్థమేమిటంటే విభజనలను కలహాలను పుట్టించే విషయాలు–స్వార్థం, కోపం, ప్రతీకారం, ద్వేషం, రోషం లేక పోల్చుకొనుట వంటివి ఉండకుండుట. ఒప్పందంలో జీవించుట అనేది ఒక ఆటకు సంబంధించిన ఒకే గుంపులో వున్నట్లు–అందరూ కలిసి పని చేయుట, ఒకరినొకరు ప్రోత్సహించుకొనుట, సహాయము చేసుకొనుట, ఒకరినొకరు నమ్ముట, ఒకే లక్ష్యాన్ని సాధించుటకు విజయాన్ని పంచుకొనుట వంటిది.

నేను నా భర్త దేవ్ ఒప్పందంలో జీవిస్తున్నాము. అయితే దీనినిబట్టి మా ఇద్దరికీ వేరు వేరు అభిప్రాయాలు లేక కలయికలేని విషయాలు వున్నాయి కానీ మేము మా సంబంధంలో కలహాలను విభేదాలను ప్రక్కన పెట్టాలనుకున్నాం దాని వల్ల కొన్ని సమయాలలో “అనంగీకారమైనదానిని అంగీకరించవలసి వస్తుంది”, దాని వలన మేము ఒకరినొకరు గౌరవించుకుంటున్నాం.

అదేవిధంగా, జాయిస్ మేయర్ మినిస్ట్రీస్‌లో పని చేసే వారితో నేను ఒప్పందంలో జీవిస్తున్నాను. ఏ నిర్ణయాన్ని నేను ఒక్కదాన్నే తీసికొనను గానీ నా హృదయాన్ని మాకొరకు పనిచేస్తున్న వారితో పంచుకుంటాను. వారు నిర్ణయాలు చేసినపుడు, దేవుడు నాకిచ్చిన దర్శనం ప్రకారం నేను వారికి వ్యక్తపరచిన దానిని బట్టి చేస్తారు. ఆవిధంగా, పరిచర్య కొరకు దేవుడిచ్చిన దర్శనాన్ని, ఉద్దేశాన్ని మేము ఒప్పందంతో ప్రార్థిస్తూ పని చేస్తున్నాము, మరియు గొప్ప ఆశీర్వాదాలను అనుభవిస్తూ ఎవరూ ఊహించలేని విధంగా ఇతరులకు ఆశీర్వాదకరంగా వున్నాము.

ఒప్పందంలో జీవించుట ఎలాగో మీరు తెలిసికొనినట్లే ఒప్పందంలో జీవించకపోవుట ఎలాంటిదో మీరు తెలుసుకోవాలని నేను ఆశ పడుతున్నాను. ఉదాహరణకు ఒక వారమంతా సంఘకాపరి గురించి పుకార్లు చెప్పుకొని వైద్యుడు మనకు బాగాలేదని చెప్పిన వెంటనే ఆ సంఘకాపరి యొద్దకే వెళ్ళి స్వస్థత కొరకు మనతో ఏకీభవించమని అడగలేము. ప్రతీ రోజు మన పిల్లల మీద అరచి, ప్రతీ విషయంలో వాళ్ళని తప్పుపడుతూ వుండి వాళ్ళకి బడిలో మంచి మార్కులు వచ్చునట్లుగా ప్రార్థించుటకు ఏకీభవించమని అడగలేము. మనతో పని చేసే వ్యక్తి వెనుక అతని గురించి చెడుగా మాట్లాడి ఉద్యోగాలు పోయే పరిస్థితి వచ్చిందని తెలిసినప్పుడు మనతో ఏకీభవించమని ఆ వ్యక్తిని అడుగలేము. మన జీవిత భాగస్వామితో ఎప్పుడూ పోట్లాడుతూ మన స్నేహితులకు వారి గురించి ఫిర్యాదులు చెబుతూ, వాళ్ళు తమ ఉద్యోగం పోగొట్టుకున్నప్పుడు “త్వరలో నీకు మరొక ఉద్యోగం వచ్చునట్లుగా

ఏకీభవించి ప్రార్థిద్దాం" అని చెప్పలేము. మన కుటుంబంలోని ఒక వ్యక్తి పట్ల పట్టరానంత ప్రతీకారాన్ని మనస్సులో వుంచుకొని తాత గారి వీలునామా చదివే సమయం వచ్చినప్పుడు ఆవ్యక్తితో దేవుడు మనల్ని గొప్పగా ఆశీర్వదించాలని ఏకీభవించి ప్రార్థిద్దాం అని చెప్పలేము.

ఐకమత్యాన్ని, సమన్వయతని పాటించటానికి చాలా ప్రయత్నం అవసరం, కాని ఒప్పందంలో జీవించే వాళ్ళు ప్రార్థించినప్పుడు విడుదలయ్యే శక్తి ఆ ప్రయత్నానికి సరిపోతుంది. ఐకమత్యంలో జీవించటానికి మన జీవితాలను అప్పగించుకొన్నప్పుడు దేవుడు దానిని ఘనపరుస్తాడు. ఎందుకంటే అది ఎల్లప్పుడూ సులువైన విషయం కాదని ఆయనకు తెలుసు. సమాధానమును కలిగివుండండి, సమాధాన పరచండి, అప్పుడు మీరు దేవుని కుమారులని పిలువబడతారు (మత్తయి5:9).

## *ఏకీభవించి ప్రార్థించు; దేవునికి ప్రార్థించు*

లూకా 18:10-11 లో ప్రార్థించుటకు దేవాలయానికి వెళ్ళిన ఇద్దరు మనుష్యులను చూస్తాము. వారిలో ఒకడు పరిసయ్యుడు, ఒకడు సుంకరి. యేసు ఇలా చెప్పాడు "పరిసయ్యుడు నిలువబడి దేవా, నేను చోరులును, అన్యాయస్థులును, వ్యభిచారులునైన ఇతర మనుష్యుల వలెనైనను, ఈ సుంకరివలెనైనను వుండనందుకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాను" అని తరువాత తాను చేసిన మంచి పనులన్నిటి జాబితాను చెప్పటం మొదలుపెట్టాడు.

ఈ భాగంలో నాకు నచ్చేది ఏమిటంటే పరిసయ్యుడు ప్రార్థిస్తున్నాడని బైబిల్ చెప్పటం లేదు. అతడు ప్రార్థన చేయుటకు వెళ్ళి "తనలో తాను ప్రార్థించుచుండెను" అని చెప్తుంది. ప్రార్థిస్తున్నట్టు కనబడిన వ్యక్తిని గూర్చి మనము ఇక్కడ చదువుతాము, ఇతను దేవునితో కూడా మాట్లాడుటలేదు కానీ తనలో తాను ప్రార్థిస్తున్నాడని బైబిల్ చెప్తుంది. కొన్ని సార్లు మనము కూడా ఇటువంటి వ్యక్తులుగానే వుంటున్నాము అని నేను భావిస్తాడు. ఇతరులను సంతోష పెట్టటానికి లేదా మనలను మనమే సంతోషపరచుకోవటానికి ప్రార్థిస్తుంటాము. నిజాయితీగా మాట్లాడుకుందాం: మన వాక్చాతుర్యమువలన మనమే సంతో షపడుతుంటాము. మనము ఎవరితోనైనా, ఏ ప్రార్థనాగుంపుతోనైనా కలిసి ప్రార్థిస్తున్నప్పుడు మనం వారికి బోధించుటలేదని జ్ఞాపకముంచుకోవాలి మరియు, మహా ఆత్మీయతకలిగిన వారముగా కనిపించుటకు ప్రయత్నించకుండా జాగ్రత్తపడాలి. మన ప్రార్థనలు దేవునితో మన హృదయాన్ని నిజంగా పంచుకొనునవి అగునట్లు ఆత్మ నడిపింపు పొందినవై వుండాలి.

> ఏకీభవించుట అనేది అసామాన్యమైన శక్తి కలిగినది అయితే అది పవిత్రంగానూ, తగ్గింపు కలిగినదిగానూ వుండాలి.

ఏకీభవించుట అనేది అసామాన్యమైన శక్తి కలిగినది కాని అది పవిత్రంగానూ, తగ్గింపు కలిగినదిగానూ వుండాలి.

## హెచ్చింపబడిన శక్తి

ఈ లోకంలో ఇద్దరు ఏ విషయం గురించైనా ఏకీభవిస్తే అది తప్పకుండా దొరుకుతుందని యేసు వాగ్ధానం చేశాడు (మత్తయి 18:19). నేను ఇంతకుమునుపే పంచుకొన్నట్లుగా తమ అనుదిన జీవితాలలో కూడా ఒప్పందముతో జీవించే వారి ప్రార్థనలకు దేవుడు జవాబిస్తాడు. ఒప్పందముతో, ఐకమత్యంతో, విడుదలౌతుంది. ఏకీభవించుట యొక్క శక్తి ఎంత శక్తివంతమైనదంటే మీకొక గొప్ప మలుపు కలుగుతుంది–అందులో ఏ సందేహం లేదు, అది నేను అనుభవించాను."

ఏకీభవించుట అనేది ఎంత శక్తివంతమైనదంటే అది హెచ్చవేతయే గానీ కూడిక కాదు. అందుకే ఒకడు వేయిమందిని తరుమును, ఇద్దరు పదివేలమందిని పారదోలుదురు అని బైబిలు చెప్తుంది (ద్వితి 32:30). ఒక వేళ ఏకీభవించుట కూడికకు సంబంధించినదైతే ఒకడు వేయి మందిని తరుమును, ఇద్దరు రెండువేల మందిని పారదోలుదురు అని వ్రాయబడియుండేది. కాని ఐకమత్యం అనేది దేవుని ఆశీర్వాదాన్ని - దేవుని ఆశీర్వాదం హెచ్చింపును తెస్తుంది. ఆ కారణంచే, ఆత్మీయ ప్రదేశంలో నిజంగా ఏకీభవించి చేసే ప్రార్థన అత్యంత శక్తివంతమైనదైయున్నది.

కొంతకాలం క్రితం, తన సంఘంలోని కాపరులతో కలిసి ఒప్పందపు ప్రార్థన చేసిన ఒక యువకుని కథనాన్ని విన్నాను ఇటువంటి ప్రార్థన యొక్క శక్తికి ఇది నిజంగా గొప్ప సాక్ష్యం అయివున్నది. ఒప్పందపు ప్రార్థన చేయుట ఎలాగో తెలుసుకొనుటకు, మిమ్మును ప్రోత్సాహపరచుటకు ఇది మీకు సహాయపడుతుందని ఆశిస్తున్నాను.

దేవుడు తనకు ఒక భార్యను పంపుటకు ఇష్టపడుతున్నాడని అలాన్ తనకు 21 సంవత్సరాలు వున్నప్పుడు తలంచాడు. చాలా మందికి, ఇటువంటి విషయాలు ఆలోచించుటకు అతడు చాలా చిన్నవాడు. కాని అతనితో మాట్లాడిన తరువాత ఈ విధంగా అతనిని ప్రభువే నడిపిస్తున్నాడని అతని సంఘకాపరులు అంగీకరించారు. తన సంఘకాపరులతో చాలా సన్నిహితంగా మెలుగుతూ అలాన్ ఐకమత్యపు సూత్రాలను పాటించాడు.

ఎందుకంటే అతను ఏకీభవించి ప్రార్థించుటను విశ్వసించాడు మరియు తాను ప్రార్థించే దాని విషయంలో అతను చాలా గంభీరంగా వున్నాడు ప్రతీదినం తన భార్య కొరకు ప్రార్థించమని ఒక్కొక్క సంఘకాపరికి ఫోన్ చేసేవాడు. అలాన్ "ప్రభువా నీవు ఏకాంగులను సంసారులుగా చేసేవాడివని బైబిల్ చెప్తుంది. కాబట్టి తగిన సమయంలో నాకు భార్యను అనుగ్రహించమని ప్రార్థిస్తున్నాను" అని ప్రార్థించేవాడు.

అటు వైపునుంచి అతని సంఘకాపరి ప్రార్థిస్తూ “ప్రభువా, నేను అలాన్‌తో ఏకీభవిస్తున్నాను. ఈ భూమిపై ఇద్దరు కూడి దేనినైనా అడిగిన యెడల అది నా తండ్రి వలన వారికి దొరుకును అని నీ వాక్యం చెప్తుంది. కాబట్టి, దేవా, అలాన్ భార్య త్వరగా రావాలని యేసు నామములో ప్రార్థిస్తున్నాను” అని ప్రార్థించేవాడు.

ఆరు వారాలలో దేవుడు అలాన్ ప్రార్థనకు జవాబిచ్చాడు అనుకోని విధంగా, తాను కొన్ని నెలలు క్రితం కలిసిన యౌవనస్థురాలు తన భార్య అని అతను తెలుసుకున్నాడు అప్పటి వరకు ఏవిధమైన ఆశక్తి లేని వాళ్ళు అలాన్ మరియు అతని కాపరి ఏకీభవించి ప్రార్థించుట మొదలు పెట్టగానే, అలాన్‌లోనూ, ఆ యువతిలోనూ ఒకరిపట్ల ఒకరి భావనలు మారటం మొదలు పెట్టాయి.

మొదట, ఇద్దరు వాటిని పట్టించుకొనలేదు. అలాన్ అయితే దేవుడు తన ప్రార్థనకు జవాబు కొన్ని నెలలు లేదా సంవత్సరాల తరువాత ఇస్తాడని అనుకుంటున్నాడు అయినా తన వధువు గురించి ప్రతీ రోజు ప్రార్థించుట మానలేదు. తమ భావనల్ని కొన్ని సమయాలు గద్దించిన తరువాత దేవుడు తమని నిజంగా వివాహానికి నడిపిస్తున్నాడని ఇద్దరూ గ్రహించారు. వాళ్ళిద్దరూ వివాహానికి ముందు 7 నెలలు తమ వివాహము కొరకు ప్రార్థించారు.

ఈ దంపతులకు వివాహము అయ్యి ఇప్పటికీ 2 సంవత్సరాలు, త్వరలో తమ మొదటి బిడ్డను పొందబోవుచున్నారు. మరియు హృదయమార దేవుని సేవిస్తున్నారు. జీవితభాగస్వామి గురించి ప్రార్థించిన ప్రతి ఒక్కరూ అలాన్ అంత త్వరగా కలవలేరు. దేవుని సమయంలో తనకు భార్యనివ్వమని అలాన్ ప్రార్థించాడని జ్ఞాపకం వుంచుకోండి, అతనికి త్వరగా ఇచ్చుట దేవుని సమయమైయున్నది.

అలాన్ వలెనే మనము కూడా ఒప్పందపు ప్రార్థనలోని శక్తిని అనుభవించగలము. వ్యక్తిగతంగా, నా పరిచర్యలోను, జీవితంలోను ఈ ప్రార్థనాశక్తిని నేను అనుభవించాను. ఒప్పందపు ప్రార్థన అనేది హెచ్చైన శక్తిని విడుదల చేసే ప్రార్థన అని నాకు తెలుసు. మరియు ఈవిధంగా ప్రార్థించుట నీ జీవితంలో కూడా అత్యద్భుతమైన ఫలితాలనిస్తుందని నేను నమ్ముతున్నాను.

## సారాంశము

విశ్వాసులముగా ఒక కుటుంబము–దేవుని కుటుంబములోని భాగముగా మనము జీవిస్తున్నాము. సంబంధాలు అనేవి క్రైస్తవ జీవితము యొక్క అంతర్భాగమైయున్నవి మరియు మనం ఒకరికొకరం సహాయపడవలసివున్నది, ఒకరినొకరం ప్రోత్సహించు కొనవలసివున్నది, ఒకరితో ఒకరం పంచుకొనవలసివున్నది, ఒకరి భారాలు ఒకరం భరించవలసివున్నది.

ఇతరులతో మరియు ఇతరులకొరకు ప్రార్థించుట ద్వారా ఒకరినొకరం ప్రార్థనాజీవితాలలో కలుపుకొనవలసివున్నది.

మనం ఇతరుల కొరకు ప్రార్థించునపుడు, విజ్ఞాపన అను ప్రార్థనను అభ్యసిస్తున్నాము. మనము విజ్ఞాపన చేయునపుడు, భూమిపైనున్న వారికొరకు పరలోకంలో విజ్ఞాపన చేస్తున్న యేసు పరిచర్యలో కలిసి ఆయనకి తోడ్పడుతున్నాము. విజ్ఞాపన అనేది ఒక వ్యక్తి యొక్క జీవిత గమనాన్ని మారుస్తుంది, మన చుట్టూవున్న వారి కొరకు ప్రార్థించే గొప్ప భాగ్యాన్ని మనం కలిగియున్నాం. మన ప్రార్థనా శక్తిని తక్కువగా అంచనా వేసుకోనవసరంలేదు ఒక్క వ్యక్తి ప్రార్థనలు గొప్ప వ్యత్యాసాన్ని కలుగచేస్తాయి.

మనం ఇతరుల కొరకు ప్రార్థించటమే కాదు, వారితో కలిసి ఒప్పందపు ప్రార్థనలు కూడా చేయగలము. సంబంధాలలోని సమన్వయత ప్రార్థనలో ఐకమత్యాన్ని తెస్తుంది, ఇది మనుష్యుల జీవితాలలోను పరిస్థితులలోను గొప్ప శక్తిని విడుదల చేస్తుంది. ఆండ్రూ ముర్రే “ఇద్దరు ముగ్గురు ఏకీభవించి చేసే ప్రార్థనకు దేవుడు ఒక ప్రత్యేకమైన వాగ్దానాన్నిస్తున్నాడు” అని వ్రాస్తున్నాడు. ఆ వాగ్దానం, శక్తి, ఆదరణ మరియు నడిపింపైయున్నది. అది మనము ప్రార్థించు చుండగా ఆయన సన్నిధిలో లభిస్తుంది. దేవుని శక్తి, ఆదరణ మరియు నడిపింపు నీకు లభిస్తుంది. వాటిని నీవు శక్తివంతమైన, వ్యక్తిగతమైన మార్గాలలో అనుభవించాలని ఆయన కోరుతున్నాడు – నేను కూడా కోరుకొంటున్నాను.

## ప్రార్థనాంశములు

- విజ్ఞాపన అనేది ఇతరుల కొరకు ప్రార్ధించుట. మనం విజ్ఞాపన చేస్తున్నపుడు ఒక వ్యక్తికి మరియు దేవునికి మధ్య వున్న ఖాళీ ప్రదేశంలో నిల్చుంటున్నాము.
- విజ్ఞాపనా ఫలితంగా దేవుడు అతని మనస్సును మార్చుతాడు.
- విజ్ఞాపనా ప్రార్ధనలో, నీవు ప్రార్ధిస్తున్న వ్యక్తుల జీవితాలలో ఆయన చేస్తున్న దానిని బట్టి పరిశుద్ధాత్ముడు నిన్ను నడిపించి, తోడ్పడనివ్వు. ప్రార్ధించుటకు నీకు భారం వున్నప్పుడు, అది ఎత్తబడువరకు ప్రార్ధించు. ఏదైనా విషయంలో ప్రార్ధించకూడదని నీకు అనిపించినపుడు, దేవుని నమ్ము, ప్రార్ధించుటకు ఒత్తిడి కావద్దు.
- మనందరం ప్రార్ధనలో మన స్ధానాన్ని కనుగొని, దేవుడు మనకు అప్పగించిన దానిని నెరవేర్చుటలో నమ్మకంగా వుండవలసియున్నది.
- మనం చేయగలిగిన అత్యంత శక్తివంతమైన ప్రార్ధనలలో ఒకటి, మన శత్రువుల కొరకు ప్రార్ధించుట.

- ఒప్పందములో జీవించేవారు, ఏకీభవించి ప్రార్థించునపుడు శక్తివంతమైన ఆత్మీయ బలం విడుదలవుతుంది.
- ఒప్పందములో జీవించుటలో సమన్వయం, పవిత్రత, గౌరవం, బంధంలో తగ్గింపు మిళితమైవున్నాయి. దీనికి కలహము, రోషం, ప్రతీకారం, కోపం మరియు ద్వేషం వుండకూడదు.
- ఏకీభవించి చేసే ప్రార్థనలు హెచ్చైన శక్తిని, దేవుని ఆశీర్వాదాలను ఆ పరిస్థితిలోనికి తెస్తాయి.

# 9

# వాక్యము మరియు ఆత్మ

మునుపటి అధ్యాయాలలో, అనేకములైన వివిధ విధానాల ప్రార్థనలను పరీక్షించాము. అది ఏవిధమైన ప్రార్థనైనప్పటికీ – ఏదిఏమైన సమర్పణ, అధీనము చేసుకొను ప్రార్థనైనా, విన్నపము లేక పట్టుదల కలిగిన ప్రార్థనైనా, విజ్ఞాపన లేక ఒప్పుదల ప్రార్థనైనా, స్తుతి, ఆరాధన, లేక కృతజ్ఞతాస్తుతి, ఏదైనప్పటికీ, దేవుని వాక్యం అనేది ఆవశ్యకమైన విషయమైయున్నది. మనము దేవునికి ఆయన వాక్యాన్ని "జ్ఞాపకం చేస్తూ" తాను మాట్లాడిన వాటిని ఆయన చేయగల సమర్థుడన్న విశ్వాసముతో ప్రార్థించినప్పుడెల్లా, మన ప్రార్థన ప్రభావవంతంగా వుంటుంది.

ప్రభావవంతమైన ప్రార్థన "ఆత్మలో" ప్రార్థించినదైయుండాలని నేను నమ్ముతాను నేను 3వ అధ్యాయంలో చెప్పినట్లుగా క్రీస్తు శరీరములోని వివిధ గుంపులకు చెందిన వ్యక్తులు "ఆత్మలో ప్రార్థించుటను" గురించి వైవిధ్యమైన తలంపులు కలిగివున్నారు, కాని అనేక మంది క్రైస్తవులు ఈ మాటకు అర్థం మనం మన సొంతంగా ప్రార్థించుటకు బదులుగా పరిశుద్ధాత్ముని నడిపింపునకు ఒప్పుకొనుట అని అంగీకరిస్తారు. నేనైతే ఈ ఆత్మలో ప్రార్థించుటను గురించి వ్యక్తిగత ఒప్పుదలను కలిగియున్నాను, దానిని నేను తరువాత జాగ్రత్తగా వివరిస్తాను. కాని అన్నింటికంటే ఎక్కువగా మన ప్రార్థనలను పరిశుద్ధాత్ముడు నడిపించునట్లుగా మన సామర్థ్యం చొప్పున ప్రయత్నించాలని నేను నమ్ముతున్నాను.

మన ఆత్మీయ జీవితాలలో సమతుల్యంగా మరియు బలంగా నిలువబడు క్రమంలో మనకు వాక్యము మరియు ఆత్మ రెండూ అవసరమైయున్నవి. మనుష్యులు అసాధారణ అనుభవాలను కోరుకొనుట లేక ఆత్మీయ విషయాలలో బహు అతిశయముగా మారినట్లయితే వారు మోసగింపబడు ఉద్రేకపూరితులవుతారు. అదే సమయంలో, ఆత్మతో సంబంధం

లేకుండా మనం కేవలం వాక్యంపై మనస్సు ఉంచినట్లయితే, ఆచార వ్యవహారాలను పాటించేవారంగా తయారవుతాము. మనము వాక్యాన్ని ఆత్మను రెండింటిని కలిగివున్నప్పుడు మనం సత్యమనే పునాదిని మరియు ఆనందాన్ని శక్తిని కలిగివున్న తులనాత్మకమైన, ధృఢమైన జీవితాలను జీవిస్తాము మనకు దేవుని వాక్యం యొక్క బలమైన పునాది మరియు ఆత్మ యొక్క ఆశక్తి మరియు ఉత్సాహం అవసరమైయున్నది. వాక్యమును అంగీకరిస్తూ ఆత్మలో ప్రార్థించుట అనేది మనము దేవుని చిత్తప్రకారము ప్రార్థించునట్లుగా చేస్తుంది. మన ప్రార్థనలు ప్రభావవంతంగా వుండునట్లుగానూ మన జీవితాలలో గొప్ప ఫలములు ఫలించునట్లుగా కూడా ఇది చేస్తుంది. మీరు ఏమి చేసినప్పటికీ మీ ప్రార్థనలను వాక్యంతో నింపుకొని ఆత్మ నడిపింపును కలిగివుండమని మిమ్మును ప్రోత్సాహ పరుస్తున్నాను. మీరు అత్యద్భుతమైన ఫలితాలను చూస్తారు.

## దేవుని వాక్యమును ప్రార్థించుట

దేవునికి ఆయన వాగ్ధానములను “జ్ఞాపకము చేస్తూ” ప్రార్థించుట అనేది, ప్రార్థనలలో ఒక ఉత్తమ మార్గం. యెషయా 62:6 దేవునికి తన వాగ్ధానములు జ్ఞాపకం చేయమని చెప్తుంది. “యెరుషలేమా, నీ ప్రాకారములమీద నేను కావలి వారిని ఉంచియున్నాను రేయైన పగలైన వారు మౌనముగా ఉండరు; నువ్వు ఎవరు (నీ ప్రార్థనల ద్వారా నువ్వు ఆయన సేవకుడవా) *దేవునిని నీవు జ్ఞాపకము చేసుకో (ఈ వాగ్ధానము ద్వారా), వుదక వుండకము”(వత్తి పలుకు)* దేవుని వాక్యము ఆయనకు చాలా విలువైనది, అలానే మనకు కూడా విలువైనవారిగా వుండవలసియున్నది. నిజం చెప్పాలంటే, విస్తరించిన దేవుని వాక్యపు అనువాదన కీర్తనలు 138:2 ఈ విధంగా చెప్తుంది: “నీ పరిశుద్ధాలయము తట్టు నేను నమస్కారము చేయుచున్నాను నీ నామమంతటికంటే నీవిచ్చిన వాక్యమును నీవు గొప్పచేసియున్నావు నీ కృపాసత్యమును బట్టి నీ నామమునకు కృతజ్ఞతాస్తుతులు నేను చెల్లించెదను” దేవుడు తన నామముకంటే, తన వాక్యమును దేవుడు గొప్ప చేసియున్నాడని ఈ వచనం చెప్తుంది. దేవుడు దానికి అంత విలువనిచ్చియున్నపుడు, మనం ఆ వాక్యమును తెలిసికొనుటలోను, పఠించుటలోను, ప్రేమించుటలోను, మన హృదయాలలో లోతుగా నాటబడ నిచ్చుటలోను, మరియు మన ప్రార్థనలలో దానికి సాముహికంగా ప్రధమ స్థానాన్నివ్వవలసియున్నది.

నేను ఇప్పుడు చెప్పిన విధంగా, మీరు వాక్యాన్ని గౌరవించి, మిమ్మును మీరు దానికి అప్పగించుకొనినట్లయితే, మనం దానిలో “నిలిచియుంటాము.” యోహాను15:7లో యేసు ఈ విధంగా చెప్తున్నాడు “నాయందు మీరును మీయందు నా మాటలును నిలచియున్నయెడల మీకేది ఇష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును” అని చెప్తున్నాడు. ఈ వచనంలో

మనము చూచినట్లుగా మనం వాక్యమందును, వాక్యం మనయందును నిలచియుండుట అనేది ప్రార్థించుటలోనూ మరియు ప్రార్థనకు జవాబులు పొందుట లోనూ మనకు కలిగి యున్న నమ్మకం పై ఆధారపడి వుంది. మనం దేవుని వాక్య ప్రకారం ప్రార్థించుచున్నప్పుడు దేవుని చిత్తము కాని విషయాల గురించి ప్రార్థించము.

> మనం వాక్యమందును, వాక్యం మనయందును నిలచియుండుట అనేది ప్రార్థించుటలోనూ మరియు ప్రార్థనకు జవాబులు పొందుటలోనూ మనకు కలిగి యున్న నమ్మకం పై ఆధారపడివుంది.

ఆంద్రూ ముర్రే ఈ విధంగా వ్రాస్తున్నాడు "దేవుని నోటినుండి వచ్చే వాక్యం తప్ప మరేది మనలను బలంగా చేయలేదు: మనం దాని వలన జీవించవలసివున్నది. మనలో జీవిస్తూ, ప్రేమిస్తూ, నిలిచి యుంటూ, విధేయత ద్వారా మనలో క్రియారూపకమై, క్రీస్తుతో ఏకం చేస్తూ, అది ఆత్మీయంగా మనలను దేవుని చేతికి విధేయత చుపుట ద్వారానే అప్పగించునది, క్రీస్తు వాక్యమే." మరియు అతను ఈ విధంగా కూడా చెప్తున్నాడు "మనకు ఇష్టమైనదానిని అడుగు హక్కును, శక్తిని ఇచ్చునది క్రీస్తులో నిలిచియుండుటయే, ఎంత నిలిచివుంటే, అంత ప్రార్థనాశక్తిని పొందుతాము." యేసు క్రీస్తు జీవించు వాక్యమై యున్నాడు (యోహాను 1:1-4). మనము వాక్యములో నిలిచియుండగా, ఆయనలో నిలిచియున్నాము - మరియు అది మన ప్రార్థనలలో నిర్వచించలేని శక్తిని తెస్తుంది.

## *వాక్యాధారమైన ప్రార్థనలు*

దేవుని వాక్యం నిజమైన ధన నిధి. మనము ఉద్దేశపూర్వకమైన, శక్తివంతమైన, విజయవంతమైన జీవితాలు జీవించునట్లుగా అవసరమైన ప్రతి విధమైన జ్ఞానాన్ని, నిర్దేశకత్వాన్ని, సత్యాన్ని ఇది కలిగి వుంటుంది. మన ప్రార్థనలలో వాక్యాన్ని కలుపుతూ, ప్రతీ సందర్భంలోనూ, పరిస్థితిలోనూ దానిని ఒప్పుకుంటూ వుండాలి "ఒప్పుకొనుట" అనే పదానికి *"అదే విషయాన్ని చెప్పుట"* అనే అర్థం వస్తుంది కాబట్టి మనం వాక్యాన్ని పలుకుతున్నప్పుడు దేవుడు చెప్పిన మాటలనే తిరిగి చెబుతూ ఆయనతో ఏకీభవిస్తున్నామని అర్థం. ఆయనతో లోతైన గొప్ప సంబంధాన్ని నిజముగా ఇష్టపడినట్లయితే ఆయనతో ఏకీభవించవలసి వున్నది మరియు అలా చేయుటకు వాక్యమును ఒప్పుకొనుట కంటే మంచి మార్గం లేదు. మన ఒప్పుదల వాక్యంలో జ్ఞానాన్ని మరియు దేవునిలో విశ్వాసాన్ని పెంచుతుంది. అది మన ప్రార్థనలలో ప్రభావాన్ని అభివృద్ధి చేస్తుంది.

వాక్యమును ఒప్పుకొను క్రమంలో మనము వాక్యాన్ని తెలుసుకొనివుండాలి, ఎందుకంటే ఆయన ఏమి చేశాడో, ఏమి చెప్పాడో, తెలియకుండా మనము ఆయనతో ఏకీభవించలేము. తమకు కలిగివున్న దానిని ఇవ్వమని లేక తాము ఏమైయున్నారో అలా తమను తయారు చేయమని ప్రార్థించే మనుష్యులను నేను తరచుగా కలుస్తుంటాను, అప్పుడు "ఆవిధంగా ప్రార్థించుట ఆపండి! ఆయనను మీరు చేయమని అడుగుతున్న దానిని ఆయన ఎప్పుడో పూర్తి చేసేశాడు" అని చెప్పాలనిపిస్తుంది. దేవుడు మనకు ఇంతకుముందే ఇచ్చిన వాటి గురించి పూర్తిగా అనవసరమైయున్నది. దేవుని వాక్యాన్ని బట్టి ఆయనను ప్రార్థించేటప్పుడు లేక ఆయనకు జ్ఞాపకం చేసేటప్పుడు సరైన విధానంలో అడుగవలసివున్నది. ఆయన ముందుగానే చేశాడని చెప్పిన వాటిని గురించి, మరలా చేయమని అడిగినట్లుగా అడగకూడదు ఉదాహరణకు:

- దేవుని స్వరము వినాలని ప్రార్థించుటకు బదులుగా, మనము దేవుని స్వరము వినగలుగుతున్నందుకు ఆయనకు వందనాలు చెల్లించాలి (యోహాను 10:27 చూడండి).
- మాకు స్వాతంత్ర్యము ఇవ్వమని ప్రార్థించుటకు బదులుగా మనలను స్వతంత్రులుగా చేసినందుకు వందనాలు చెల్లించాలి (గలతీ 5:1 చూడండి).
- మన జీవితాల గురించి మంచి ప్రణాళికలు కలిగి వుండమని దేవుని అడుగుటకు, ప్రార్థించుటకు బదులుగా మంచి ప్రణాళికలను కలిగి వున్నందుకు వందనాలు చెల్లించవలసివున్నది (యిర్మియా 29:11).
- మనలను నీతిమంతులుగా చేయమని అడుగుటకు బదులుగా మనము నీతిమంతులనుగా చేయబడి నందుకు వందనాలు చెల్లించవలసివున్నది (2 కొరింథీయులకు 5:21).
- మనలను ఆశీర్వదించమని దేవుని అడుగుటకు ప్రార్థించుటకు బదులుగా మనలను ప్రతి ఆశీర్వాదముతో ఆశీర్వదించినందుకు దేవునికి వందనాలు చెల్లించ వలసివున్నది (ఎఫెసీ 1:3).
- మనలను అంగీకరించమని ప్రార్థించుటకు బదులుగా ఆయన క్రీస్తులో మనలను అంగీకరించినందున వందనాలు చెల్లించవలసివున్నది (ఎఫెసీ 1:6).

## *మాదిరి ప్రార్థనలు*

మనుష్యులు ప్రార్థించే మార్గం ప్రార్థించే విషయాలు వారి వ్యక్తిత్వాన్ని మరియు ఆత్మీయ పరిణితిని తెలియజేస్తాయని నేను నమ్ముతాను. నా ప్రార్ధనా జీవితము ఎక్కువ ఆత్మీయ పరిణితిని తెలుపని సమయాలు వున్నాయి. నేను తిరిగి జన్మించి, పరిశుద్ధాత్మ బాప్తీస్మం

పొందిన ప్రసంగీకురాలనైనప్పటికీ, నా ప్రార్థనలు మాత్రం బాధాకరమైన శరీరసంబంధమైనవిగా వుండేవి. నేను ప్రార్థించునప్పుడు, ఒక ప్రార్థనా అవసరతల జాబితాను కలిగివుండేదానను, నేను సంతోషంగా వుండాలంటే, వాటన్నిటికీ దేవుడు "సరే" నని చెప్పాలని నేను తలంచేదానను– అవన్నీ ప్రకృతి సంబంధమైనవి: "ప్రభువా, నా సేవా పరిచర్య అభివృద్ధి చెందునట్లుగా చేయి. మాకు ఒక క్రొత్త కారు ఇవ్వు అది చెయ్యి ఇది చెయ్యి. డేవ్ మారునట్లుగా చెయ్యి, బిడ్డల ప్రవర్తన మార్చు........." అలా వుండేవి.

దానికి స్పందనగా, దేవుడు నాతో సామాన్యంగా ఇలా అన్నాడు, "నీవు యేసు యొక్క ప్రార్థనలు, పౌలు యొక్క ప్రార్థనలు పరీక్షించాలని కోరుతున్నాను. తరువాత మనం నీ ప్రార్థనా జీవితం గురించి మాట్లాడుకుందాం" అని చెప్పాడు. బైబిలంతటిలో, ప్రత్యేకంగా కీర్తనలలో అనేక ప్రార్థనలున్నాయి. కాని, దేవుడు నన్ను సువార్తలలో వున్న యేసు యొక్క ప్రార్థనలు, పత్రికలలోని పౌలు యొక్క ప్రార్థనలు ఎఫెసియుల యొక్క ప్రార్థనలను ప్రార్థించాలని కోరాడు.

నేను పౌలు వలె, యేసు వలె ప్రార్థించుట మొదలు పెట్టినప్పటి నుంచి, దేవుని వాక్యాన్ని ప్రార్థించుట కంటే శక్తివంతమైన మార్గం లేదని నేను గ్రహించాను, ఎందుకంటే, ఆయనకు ఏది ప్రాముఖ్యమైనదో అది మనకు చెప్తుంది. మనము యేసు క్రీస్తు చేసిన కొన్ని ప్రార్థనలను చుద్దాము:

- తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము (లూకా 23:34).
- సత్యమందు వారిని ప్రతిష్ఠ చేయుము (పవిత్రపరచు, నీకొరకు వేరుగా నుంచు, శుద్ధిచేయు), నీ వాక్యమే సత్యము (యోహాను 17:17).
- వారి యందు నేనును నాయందు నీవును ఉండుటవలన వారు సంపూర్ణులుగా. చేయబడి యేకముగా ఉన్నందున నీవు నన్ను పంపితివనియు, నీవు నన్ను ప్రేమించినట్టే వారిని ప్రేమించితివనియు, లోకము తెలిసికొనునట్లు....... (యోహాను 17:23).
- నీ నమ్మిక తప్పిపోకుండునట్లు నేను నీ కొరకు వేడుకొంటిని (లూకా 22:32).
- తండ్రీ, నీవు నా మనవి వినినందున నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను (యోహాను 11:41).

పౌలు యొక్క ప్రార్థనలలో కొన్నిటిని కూడా మీరు చూడాలని నేను కోరుకుంటున్నాను. ఎఫెసీయులకు, ఫిలిప్పీయులకు మరియు కొలస్సయులకు వ్రాసిన పత్రికలలో అతని ప్రార్థనలు చదువుతున్నప్పుడు నేను కన్నీళ్ళ పర్యంతమయ్యాను. నా ప్రార్థనా జీవితంలోని శరీర

> పౌలు ఎన్నడూ ప్రజలు సులువైన జీవితాలు కలిగివుండాలని లేక కష్టాల నుండి విడుదల పొందాలని ప్రార్థించలేదు.

సంబంధతత్వాన్ని బట్టి నేను చాలా బాధ పడ్డాను. నేను అతనిలా లేనందువలన, అతని ప్రార్ధనలను బట్టి నేను చాలా ప్రభావవంతమయ్యాను. పౌలు ఎప్పుడూ ప్రజలు సులువైన జీవితాలు కలిగివుండాలని లేక కష్టాల నుండి విడుదల పొందాలని ప్రార్థించలేదు. దానికి బదులుగా, అతను ప్రజలు తమ మార్గములో ఏది వచ్చినప్పటికీ భరించే శక్తిగలవారగుటకు, ఆత్మలో నడుచునట్లు, స్థిరంగా వుండుటకు, దేవుని కృపకు ఉదాహరణలుగా ఇతరులకు కనిపించాలనీ ప్రార్థించినాడు. అతను, దేవునికి ప్రాముఖ్యమైన విషయాలను గురించి ప్రార్థించినాడు. మరియు ఈ విధంగా ప్రార్థించినపుడు, దేవుడు అసామాన్యమైన శక్తిని మనకు విడుదల చేస్తాడని, నా అనుభవం నుంచి మీకు చెప్తున్నాను.

ఎఫెసీయులకు 1:17 నందు పౌలు "......... మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క దేవుడైన, మహిమ స్వరూపియగు తండ్రి, తన్ను తెలిసికొనుటయందు మీకు జ్ఞానమును ప్రత్యక్షతయును గల మనస్సు అనుగ్రహించునట్లు, నేను నా ప్రార్థనలయందు మిమ్మును గూర్చి విజ్ఞాపన చేయుచున్నాను." అని చెప్తున్నాడు. ఈ ఉదాహరణను అనుసరిస్తూ, మనము కూడా జ్ఞానము, ప్రత్యక్షత గల మనస్సు కొరకు ప్రార్థించవలసియున్నది, అది మన ప్రథమ విజ్ఞాపన అయి వుండవలెను. నిజానికి, ప్రత్యక్షత కొరకు – ఆత్మీయ పరిజ్ఞానము మరియు గ్రహింపుల కొరకు దేవుని అడుగుట అనునది మనము ప్రార్థించగలిగిన ప్రాముఖ్యమైన ప్రార్ధన అని నేను నమ్ముతున్నాను. ప్రత్యక్షత అనగా "తెర తీయుట" మరియు, క్రీస్తులో మనకు చెందిన ప్రతిదానిని తెరతీయుమని మనము దేవుని అడుగవలసియున్నది. మనకొరకు, ఇతరులకొరకు ఎలా ప్రార్థించవలెనో మనం తెలుసుకొను నట్లుగా వాక్యంలోని సత్యాలను మనకు ప్రత్యక్షపరచమని ఆయనను అడుగవలసియున్నది. ఎవరైనా నీకు బైబిలు నియమము లేక ఒక ఆత్మీయ సత్యమును చెప్పినపుడు, అది *"సమాచారము"*. కాని, దానిని అర్థంచేసుకొనుటకు దేవుడు నీకు సహాయం చేసినపుడు, అది ప్రకటన అవుతుంది – మరియు ప్రకటనను మనవద్దనుండి భూమి పైని ఏ మానవుడు, నరకంలోని ఏ అపవిత్రాత్మ తీసికొనిపోలేదు. ప్రత్యక్షత ప్రకటన, ఎందుకంటే, దానిని దేవుడు మనకు ఇచ్చాడు.

"ఆయనను గూర్చిన జ్ఞానములో" ఆత్మీయ మర్మాలలో మనకు పరిజ్ఞానము అనుగ్రహించవలెనని దేవుని నిరంతరంగా అడుగవలసియున్నదని, ఈ వచనం చివరలో చెప్పబడింది. ఎఫెసీ 1:18లో పౌలు ఇంకా చెబుతూ "మరియు మీ "మనోనేత్రములు" (మనం, మనస్సు అనుకుందాము వెలిగింపబడినందున, కాబట్టి ఆయన మిమ్మును పిలిచిన పిలుపువల్లనైన నిరీక్షణ యెట్టిదో, పరిశుద్ధులలో ఆయన స్వాస్థ్యము యొక్క

మహిమదైశ్వర్యమెట్టిదో......మీరు తెలుసుకొనవలెనని ప్రార్థిస్తున్నాను" అని అంటున్నాడు. నేను కూడా తరచుగా "ప్రభువా, నాజీవితంలో నిరుత్సాహ పడకుండునట్లుగా, నీలో నాకున్న గొప్ప నిరీక్షణను చూపించు" అని ఈ వాక్యాలను ప్రార్థిస్తుంటాను.

తరువాత వచనంలో పౌలు మరియు (అందువల్ల నువ్వు అర్థం తెలుసుకోగలవు మరియు అర్థం చేసుకోగలవు) "విశ్వసించు మన యందు ఆయన చూపుచున్న తన శక్తి యొక్క అపరిమితమైన మహాత్మ్యము యెట్టిదో...." (ఎఫెసీ 1:19). సామాన్యమైన మాటలలో చెప్పాలంటే అతను "*ఒక విశ్వాసిగా నీకు అందుబాటులో వున్న శక్తిని నీవు తెలుసుకోవాలని నేను ప్రార్థిస్తున్నాను"* అని చెబుతున్నాడు. ఇదే ప్రార్థనను ఈ పుస్తకం చదువుతుండగా నీ గురించి నేను ప్రార్థిస్తున్నాను, ఎందుకంటే ప్రార్థన ద్వారా నీవు దేవునితో సంభాషించునప్పుడు నీకు అందుబాటులోవున్న అత్యద్భుతమైన, అపరిమితమైన శక్తిని మీరు అనుభవించవలెనని నేను కోరుతున్నాను.

ఎఫెసీ 3:16 నందు పౌలు "మీరు అంతరంగ పురుషుని యందు శక్తి కలిగి ఆయన ఆత్మ వలన బలపరచబడునట్లుగాను, క్రీస్తు మీ హృదయములలో విశ్వాసము ద్వారా నివసించు నట్లుగానూ తన మహిమైశ్వర్యము చొప్పున మీకు దయ చేయవలె ననియు....." అని పౌలు ప్రార్థిస్తున్నాడు. ఈ ప్రార్థనను మనము క్రమముగా చేయవలసివున్నది. మనము, *దేవా, నా అంతరంగ పురుషునిలో శక్తిని బలమును దయచేసి, నాలోను నా ప్రవర్తన ద్వారాను పరిశుద్ధాత్ముడు నాలో నివసింపనివ్వు.* ఇటువంటి ప్రార్థన మనలను రూపాంతరపరుస్తుంది. "మీరు దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా" పౌలు ప్రార్థించే ఎఫెసీ 3:18 కూడా నాకు చాలా ఇష్టం. మన జీవితాలలో మరి దేనికీ చోటులేకుండునట్లుగా మనము దేవునితో నింపబడవలెనని ప్రార్థించవలసియున్నది.

అంతేకాకుండా, దేవుని ప్రేమను గురించి కూడా పౌలు ప్రార్థించినాడు. "ప్రేమ యందు వేరు పారి స్థిరపడి..... క్రీస్తు ప్రేమను తెలుసుకొనుటకును తగిన శక్తి గలవారు కావాలని ప్రార్థిస్తున్నాను" (ఎఫెసీ 3:17,19) అని చెబుతున్నాడు. మనుష్యులు దేవుని ప్రేమను గురించి ఇతరులనుంచి వినటం, ఒక ప్రసంగం వినటమే కాకుండా దానిని తమకుతాముగా, వ్యక్తిగతంగా తెలిసికొనవలెనని అతను అపేక్షించాడు. ఇతరుల గురించి మనము చేయగలిగిన జీవితాన్ని మార్చే ప్రార్థనలలో ఒకటి ఏమిటంటే వారు దేవుని ప్రేమను వ్యక్తిగతంగా గుర్తెరగాలని ప్రార్థించుట. మనుష్యులు దేవుని ప్రేమించాలని పౌలు ప్రార్థించలేదు దేవుని అత్యద్భుతమైన ప్రేమ యొక్క ప్రత్యక్షతను వారు కలిగివుండాలని ప్రార్థించాడు.

ప్రేమకు సంబంధించిన ఈ విషయాన్ని పౌలు మరొక పత్రికలో కూడా వ్రాస్తున్నాడు: "మీ ప్రేమ తెలివితోనూ, సకలవిధములైన అనుభవ జ్ఞానముతోనూ కూడినదై అంతకంతకు అభివృద్ధి పొందవలెనని....." (ఫిలిప్పీ 1:9). అతను ఏమి చెబుతున్నాడో మీకు అర్థమైందా? *మీరు ఒకరినొకరు ప్రేమించుటను చూడవలెనని నేను ఆశ పడుతున్నాను. కేవలం దానిని*

*గురించి వినుట కాదు గానీ, చూడాలని ఆశ పడుతున్నాను. మీరు ఒకరినొకరు ఎలా ప్రేమిస్తున్నారో ఇతరులను చూడనివ్వండి.*

ఫిలిప్పీ 1:10లో పౌలు, తాను ఎవరికోసమైతే ప్రార్థిస్తున్నాడో వారు ఇతరులు పడిపోవుటకు కారణం కాకూడదని పౌలు అడుగుతున్నాడు. వారు శ్రేష్టమైనవి ఎంచుకొనుటకు నేర్చుకొనవలెనని ప్రార్థిస్తున్నాడు. వాటిని తెలిసికొని వివేచింపగలవారు కావాలని, కష్టసమయములలో కూడా నీతి ఫలములతో నిండుకొనిన వారు కావాలని ప్రార్థిస్తున్నాడు.

కొలస్సీ 1:11లో అతను "…..ఆనందంతో కూడిన పూర్ణమైన ఓర్పును దీర్ఘశాంతమును కనపరచునట్లు ఆయన మహిమ శక్తిని బట్టి సంపూర్ణ బలముతో బలపరచబడవలెననియు……" అని చెబుతున్నాడు. మరొక మాటలో చెప్పాలంటే, *మీరు ఏ పరిస్థితి గుండా వెళ్తున్నప్పటికీ, సంతోషంగా వుండండి. పరీక్ష ఎంత కాలమైనప్పటికీ, భరించండి మీరు దాని ద్వారా వెళ్తున్నప్పుడు ఇతరులను బాధపెట్టవద్దు. విజయవంతంగా వుండండి.*

> నీకు ముఖ్యమైన వాటి గురించి దేవుడు శ్రద్ధ తీసుకుంటాడని ఎరిగినవారై ఆయన దేని నిమిత్తం ప్రార్థించమంటున్నాడో దాని నిమిత్తమే ప్రార్థించండి.

ఎందుకు పౌలు ఆవిధంగా ప్రార్థించాడు? ఎందుకంటే అతను దేవునికి ప్రాముఖ్యమైన వాటి గురించి ప్రార్థించాడు. మీ బైబిల్‌ను బయటికి తీసి ఎఫెసీ, కొలస్సీ, మరియు ఫిలిప్పీ పత్రికలలోని పౌలు ప్రార్థనలను చదవమని మిమ్ములను ప్రోత్సాహపరుస్తున్నాను. తరువాత వాటిని ఎక్కడైనా వ్రాయండి లేక టైప్ చేసి పఠించండి మీ కొరకు ఇతరుల కొరకు వాటిని ప్రార్థించండి, వాటిని మీ ఆత్మలో ఇంకనివ్వండి. ఈ ప్రార్థనలలో ఎక్కడా ఒక్కసారి కూడా సహజమైన విషయాలగురించి పౌలు అడగలేదు. ఎందుకో మీకు తెలుసా? ఎందుకంటే, "మొదట ఆయన రాజ్యమును, నీతినీ వెదకుడి, అప్పుడు అవన్నియు మీకు అనుగ్రహింప బడును" అని మత్తయి 6:33 చెబుతుంది. మరియు కీర్తనలు 37:4 "యెహోవాను బట్టి సంతోషించుము ఆయన నీ హృదయ వాంఛలను తీర్చును" అని వ్రాయబడియున్నది. పౌలు వలె వుండండి. నీకు ముఖ్యమైన వాటి గురించి దేవుడు శ్రద్ధ తీసుకుంటాడని ఎరిగిన వారై ఆయన దేని నిమిత్తం ప్రార్థించమంటున్నాడో దాని నిమిత్తమే ప్రార్థించండి.

మీ కొరకు కావలసిన వాటిని అడుగుటలో తప్పులేదు. దేవుడు ముందుగానే, మీరు అడుగుట లేదు గనుక పొందుకొనుట లేదు అని చెప్పాడు.

'అడుగుడి మీకియ్యబడును" (మత్తయి 7:7) అని కూడా చెప్పాడు. దేవునికి మనము దేని కొరకు అడుగుతున్నామన్నది ప్రాముఖ్యమైయున్నది. 90 శాతం మన విన్నపాలు

లోకానుసారమైనవి, సహజ వస్తువులు గురించి అయివుండి, 10 శాతం వరకు ఆత్మీయ విషయాలు అయి వుండాలని నేను నమ్మను. అన్నీ విషయాలు సమతుల్యంగా వుండవలసినది. లేని యెడల మన జీవితాలలో పని చేయునట్లుగా సాతానుడికి ద్వారాలు తెరుస్తున్నాము (1 పేతురు 5:8).

## *వాక్యాన్ని ప్రార్థించుట ఎలా*

> దేవుని వాగ్దానాలన్నీ మనకొరకే అవి ప్రతి విశ్వాసి కొరకు – మరియు మనం దేవుని వాక్యాన్ని ఎరిగి, దానిని ఆయనకు ప్రార్థించినపుడు దానిని ఆయన యిష్టపడుతాడు.

బహుశా నీవు ఎప్పుడూ "వాక్యాన్ని ప్రార్థించు" అనే మాటను వినియుండక పోవచ్చును, మరియు అది ఎలా చేయాలి అని ఆశ్చర్యపడుతూ వుండి వుండవచ్చును. వాక్యాన్ని ప్రార్థించుట లేక కొంతమంది చెప్పునట్లుగా లేఖన భాగాలను ప్రార్థించుట అనేది ప్రతి విశ్వాసికి అందుబాటులో వున్న సులువైన ప్రార్దనా విధానము. దానంతటికీ – బైబిలు లోని వాక్యాలను చదువుట లేక కంఠస్థం చేయుట, మరియు వాటిని వ్యక్తిగతంగా ప్రార్థించుట లేక ఇతరులకు అన్వయించి ప్రార్థించుట అవసరమైయున్నది. దీనికి ఉత్తమ మార్గం "దేవా, నీ వాక్యం (వాక్యాన్ని వుంచి) అని చెప్తుంది, నేను దానిని నమ్ముతున్నాను." అని చెప్పుట ద్వారా ఉపోద్ఘాతముగా చెప్పుటను నేను నమ్ముతున్నాను.

నీ కొరకు నీవు యిర్మీయా 31:3 ప్రార్థిస్తున్నట్లయితే, నీవు ఈ విధంగా చెప్పవచ్చును: *దేవా, నీవు శాశ్వతమైన ప్రేమతో ప్రేమించుచున్నావని నీ వాక్యం చెప్తుంది, విడువక నా యెడల కృప చూపుతున్నావనీ అది చెప్తుంది. అలా నన్ను ప్రేమిస్తున్నందును బట్టి, కృప చూపుతున్నందును బట్టి నీకు వందనాలు. ఆ ప్రేమను గూర్చిన జ్ఞానమును కలిగివుండుటకు సహాయం చేయి.* అదే వచనాన్ని, తనను దేవుడు ప్రేమిస్తున్నాడని నమ్ముటకు నిజంగా చాలా కష్టపడుతున్న, నీ స్నేహితురాలు సూజీ కోసం నువ్వుప్రార్థిస్తున్నట్లయితే, "దేవా, నీవు శాశ్వతమైన ప్రేమతో సూజీని ప్రేమించుచున్నావని నీ వాక్యం చెప్తుంది, విడువక ఆమె యెడల కృప చూపుతున్నావనీ అది చెప్తుంది. దేవా, నీ ప్రేమను గుర్తెరుగలేక, ఆమె చాలా బాధపడుతుంది, కాబట్టి, నీ వాగ్దానం లోని సత్యమును బట్టి ఆమె ఉద్రేకాలను విడిపించమని అడుగుతున్నాను." అని ప్రార్థించాలి.

తన వ్యక్తిగత అవసరతల కొరకు దేవుని వాక్యం ద్వారా ప్రార్థించి, గొప్ప సాక్ష్యాన్ని కలిగివున్న బెత్ అనే స్త్రీ నాకు తెలుసు. తన వృత్తిలో మంచి జ్ఞానం కలిగివుండాలనే

కోరికను ఆమె కలిగివుంది. తన ఉద్యోగంలో ఉన్నత స్థాయికి వెళ్లు అవకాశాలు తక్కువ అని తెలిసికొని, ఆమె వేరొక కంపెనీలో గొప్ప స్థాయి, బాధ్యత, అధికారం, అవకాశాలు వున్న వేరొక ఉద్యోగానికి దరఖాస్తు పెట్టింది. తన క్రొత్త ఉద్యోగాన్ని మొదలుపెట్టుటకు రెండు వారాల ముందుగా, ఆమె తాను ఉద్యోగం నుండి వెళ్ళిపోతున్నానని తన పాత బాస్‌కి నోటీసు ఇచ్చింది. ఆయన వెంటనే ఆమె ఉద్యోగాన్ని ఆమె సహాయకురాలుకి ఇచ్చేశాడు. ఆమె నోటీసు ఇచ్చిన 5 నిమిషాలలో క్రొత్త కంపెనీ నుండి ఫోన్ చేసి “ఆగు నీ నోటీసు ఇవ్వద్దు. మా కంపెనీని అమ్మివేయబోతున్నాము నీ కొరకు మా దగ్గర ఏ ఉద్యోగము లేదు” అని చెప్పినారు.

ఆమె సహాయకురాలు మరలా సహాయకురాలి స్థానాన్ని తీసికోవటానికి నిరాకరించింది, వారి బాస్ కూడా ఆ ఉద్యోగాన్ని సహాయకురాలికే ఇవ్వటానికి నిర్ణయించాడు, కాని రెండు వారాల ఆమె సమయాన్ని నాలుగు వారాలకు పొడిగించాడు. బెత్‌కు ఒక ఉద్యోగం చాలా అవసరమైయున్నది, కాని ఇంకొక ఉద్యోగం కోసం వెతుకుకొనుటలో, సమయాన్ని, ఆ సమయానికి వచ్చే డబ్బును పోగొట్టుకోగలిగే స్థితిలో లేదు కాబట్టి, ఆమె వాక్యం నుంచి ఒక వాగ్దానాన్ని ఆధారము చేసుకొని దేవుని అడుగుటకు నిర్దిష్టమైన వాక్యభాగాన్ని తన హృదయంలో వుంచమని దేవుని అడిగింది.

దేవుని వాగ్దానాలన్నీ మనకొరకే అవి ప్రతి విశ్వాసి కొరకు – మరియు మనం దేవుని వాక్యాన్ని ఎరిగి, దానితో ఆయనకు ప్రార్థించినప్పుడు ఆయన ఇష్టపడుతాడు. దేవుడు ఆమెను యిర్మియా 24:6 “వారికి మేలు కలుగునట్లు నేను వారిమీద దృష్టియుంచుచు, ఈ దేశమునకు వారిని మరల తీసికొనివచ్చి, పడగొట్టక వారిని కట్టెదను, పెల్లగింపక వారిని నాటెదను.”

ఈ వాక్యాన్ని బెత్ రోజులో అనేక మార్లు, ఆ ఆఫీసులో నడుస్తుండగా, భోజన సమయంలో, విరామ సమయంలో “దేవా, నాకు మేలు కలుగునట్లు నీవు నామీద దృష్టియుంచియున్నావని నేను నమ్ముతున్నాను, ప్రకటిస్తున్నాను. ఈ దేశమునకు నీవు నన్ను మరల తీసికొనివచ్చి, పడగొట్టక నన్ను కట్టమని, పెల్లగింపక నన్ను నాటమని నిన్ను ప్రార్థిస్తున్నాను.” అని ప్రార్థించేది. “ఈ దేశమునకు నీవు నన్ను మరల తీసికొనివచ్చి” అన్నపుడు బెత్ “ఈ ప్రదేశమునకు తన పాత స్థానమునకు” అని నిర్దిష్టంగా చెప్తూ, తనను ఆ కంపెనీ “పెల్లగింపక” యుండునట్లుగా ప్రార్థించేది. దానికి అదనంగా ఆమె తాను ఒక్క దినపు పనిని, జీతాన్ని కోల్పోకూడదని కూడా ప్రార్థించేది.

తన పని యొక్క ఆఖరి రోజున, నాలుగు వారాల చివరిలో బెత్‌కి ఉద్యోగం లేదు. తన కంపెనీలోనే వేరొక విభాగానికి ఆమె తన పేరు ఇచ్చివుంది కానీ వారి వద్ద నుండి ఏ జవాబు రాలేదు. అప్పటికీ, ఆమె దేవుడు తనను ఆ కంపెనీలో నుండి పెళ్ళగింపక నాటుతాడని నమ్ముతూ ప్రార్థిస్తూనే వుంది. ఆ ఆఖరి రోజు సాయంత్రం 5 గంటలు

కావటానికి కొన్ని నిమిషాల ముందు ఆమె తన వస్తువులు సర్దుకొంటుండగా ఆమె ఫోన్ మోగింది. తన కంపెనీలోని వేరొక విభాగం నుంచి ఉద్యోగానికి పిలుపును పొందుకుంది – వారు ఇలా చెప్పారు: "మేము నిజంగా నిన్ను తొందర పెట్టాలనుకోవటంలేదు, కాని వీలైతే మాకు రేపటి నుండే పని మొదలు పెట్టగలవా?" అని అడిగాడు. సమస్తము ఆమె దేవుని వాక్య ప్రకారమే జరిగింది. ఆయన "ఆమెను అదే దేశములోనికి తీసికొని వచ్చినాడు, వెళ్ళగొంచ లేదు" ఆమె అవసరతను గుర్తెరిగి ఒక్క దినపు జీతం కూడా పోకుండా చేయుట ద్వారా ఆయన దృష్టి తనపై వున్నదని బెత్ గుర్తెరిగింది.

ఇటువంటి కథనాలు చాలా నేను విన్నాను, వ్యక్తిగత అనుభవాలూ కలిగివున్నాను. నీవు సంక్షోభ స్థితిలో వుండి ప్రార్థించుటకు ఒక వాగ్దానం అవసరమైనప్పుడు ఆవాగ్దానాన్ని నీ మనస్సులో ఉంచమని దేవుని అడుగమని మిమ్మును ప్రోత్సాహపరుస్తున్నాను. నీవు అలా చేసినప్పుడు దేవుని వాక్యముపై నీ నమ్మకము పెరుగుతుంది, నీ విశ్వాసము అభివృద్ధి చెందుతుంది. జవాబు ఇవ్వబడిన ప్రార్థనలోని ఆనందాన్ని నీవు పొందుతావు.

## *మీ అనుదిన జీవితమునకై వాక్యముతో కూడిన ప్రార్థనలు*

దేవుని వాక్యము, మన అనుదిన జీవితాలలో మనలను ప్రోత్సాహపరచుటకు, నిర్దేశకత్వము చేయుటకు, సహాయపడుటకు రూపొందించబడినది మరియు ప్రతీ పరిస్థితినందు ప్రార్థించుటకు తగిన వాక్యభాగాలను మనము బైబిల్ నందు కనుగొంటాము. కొన్ని సమయాలలో మన పరిస్థితికి సరిగా సరిపోయే విధమైన వచనాలను వాక్యభాగాలను మనము కనుగొంటాము, ఇతర సమయాలలో వాక్యభాగాలను కొంత జ్ఞానాన్ని లేక సాధారణ ఆత్మీయ నియమాలను మన పరిస్థితికి అన్వయించుకోవలసి వస్తుంది. సాతాను మనలను వేధించే కొన్ని సామాన్య, నిర్దిష్ట పరిస్థితితులు, వాటికి సరిపోయే వాక్య భాగాలు క్రింద ఉదాహరణగా ఇవ్వబడ్డాయి:

- నీవు గానీ నీవు ప్రేమించువారు గానీ రోగిగా వున్నప్పుడు, "నిన్ను స్వస్థపరచు యెహోవాను నేనే" అను నిర్గమకాండము 15:26 ను, కీర్తనలు 103:2-4లోని, "నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము ఆయన చేసిన ఉపకారములలో దేనిని మరువకుము ఆయన నీ దోషములన్నిటిని క్షమించువాడు నీ సంకటములన్నిటిని కుదుర్చువాడు. సమాధిలోనుండి నీ ప్రాణమును విమోచించుచున్నాడు కరుణాకటాక్షములను నీకు కిరీటముగా ఉంచుచున్నాడు" అను ప్రార్ధనను ప్రార్థించ వచ్చును.
- నీవు కష్టసమయము ద్వారా లేక నీ ప్రాణమును అలసిపోజేసే పరిస్థితుల ద్వారా వెళ్ళుతున్నప్పుడు నీవు యెషయా 40:29,31ల లోని "*సొమ్మసిల్లిన వారికి బలమిచ్చువాడు ఆయనే శక్తిహీనులకు బలాభివృద్ధి కలుగ జేయువాడు ఆయనే*" "యెహోవా కొరకు ఎదురు చూచు వారు నూతన బలము పొందుదురు వారు

పక్షిరాజు వలె రెక్కలు చాపి పైకి ఎగురుదురు అలయక పరుగెత్తుదురు సొమ్మసిల్లక నడిచిపోదురు” మరియు విలాపవాక్యములు 3:22-23 లోని “యెహోవా కృపగలవాడు, ఆయన వాత్సల్యత యెడతెగక నిలుచునది గనుక మనము నిర్మూలము కాకున్నము. అనుదినము నూతనముగా ఆయనకు వాత్సల్యతపుట్టుచున్నది. నీవు ఎంతైన నమ్మదగినవాడవు.” అనియు ప్రార్థించవచ్చును.

- నీ ప్రార్థనలు దేవుడు వింటున్నాడని నీవు తెలిసికొనవలసి వచ్చినప్పుడు, కీర్తనలు 6:9 లోని “యెహోవా నా విన్నపము ఆలకించియున్నాడు. యెహోవా నా ప్రార్థననంగీకరించును.” మరియు కీర్తనలు 55:17 లోని “సాయంకాలమున, ఉదయమున మధ్యాహ్నమున నేను ధ్యానించుచు మొర్ర పెట్టుకొందును, ఆయన నా ప్రార్థననాలకించును.” అని ప్రార్థించవచ్చు.
- నీ నోరు నిన్ను సమస్యలలో పడవేస్తున్నప్పుడు కీర్తనలు 141:3 “యెహోవా నా నోటికి కావలియుంచుము నా పెదవుల ద్వారమునకు కాపు పెట్టుము” అనియు కీర్తనలు 19:14లోని “నా నోటి మాటలును నా హృదయ ధ్యానమును నీ దృష్టికి అంగీకారమగును గాక” అని ప్రార్థించ వచ్చు.
- నీవు భయపడినప్పుడు యెషయా 41:10లోని “భయపడకుము నేను నీ దేవుడనైయున్నాను దిగులుపడకుము నేను నిన్ను బలపరతును నీకు సహాయము చేయువాడను నేనే నీతియను నా దక్షిణ హస్తముతో నిన్ను ఆదుకొందును అనియు, యెహోషువా 1:9లోని “నిబ్బరము కలిగి ధైర్యముగా వుండుము దిగులుపడకుము జడియకుము నీవు నడుచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును” అనియు ప్రార్థించవచ్చును.
- నీవు ఆందోళన కలిగి ఒత్తిడిలో వున్నప్పుడు కీర్తనలు 55:22 “నీ భారము యెహోవా మీద మోపుము ఆయనే నిన్ను ఆదుకొనును నీతిమంతులను ఆయన ఎన్నడును కదలనియ్యడు” అనియు యెషయా 26:3లోని “ఎవని మనస్సు నీ మీద ఆనుకొనునో వానిని నీవు పూర్ణశాంతిగల వానిగా చేయుచున్నావు, ఏలయనగా అతడు నీయందు విశ్వాసముంచుచున్నాడు.
- నీవు ఆర్థికంగా బాధపడుతున్నప్పుడు కీర్తనలు 34:9-10లోని “యెహోవా భక్తులారా ఆయనయందు భయభక్తులు ఉంచుడి, ఆయనయందు భయభక్తులు ఉంచు వానికి ఏమియు కొదువలేదు. సింహపు పిల్లలు లేమిగలవై ఆకలిగొనును గాని యెహోవాను ఆశ్రయించు వారికి ఏ మేలు కొదువయై యుండదు” మరియు నీవు ఇచ్చుటలో నమ్మకముగా వున్నట్లయితే ఫిలిప్పీ 4:19లో “దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును” అని ప్రార్థించవచ్చు.

- నీవు ఒక నిర్ణయాన్ని తీసుకొనవలసివుండి ఏమి చేయాలో నీకు అర్థం కానప్పుడు నీవు సామెతలు 3:5–6, నీస్వబుద్ధిని ఆధారము చేసుకొనక నీ పూర్ణ హృదయముతో యెహోవా యందు నమ్మకముంచుము నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును" అని ప్రార్థించవచ్చు మరియు యెషయా 42:16 లోని "వారెరుగని మార్గమున గ్రుడ్డి వారిని తీసుకొని వచ్చెదను వారెరుగని త్రోవలలో వారిని నడిపించుదును వారి యెదుట చీకటిని వెలుగు గానూ వంకర త్రోవలను చక్కగానూ చేయుదును నేను వారిని విడువక ఈ కార్యములను చేయుదును" అని కూడా ప్రార్థించవచ్చు.
- నీ భవిష్యత్తును గురించి నీవు వేదన పడినప్పుడు లేక నిరుత్సాహపడినప్పుడు యిర్మియా 31:17 లోని "రాబోవు కాలము నందు నీకు మేలు కలుగునను నమ్మిక యున్నది, నీ పిల్లలు తిరిగి తమ స్వదేశమునకు వచ్చెదరు. యిదే యెహోవా వాక్కు" అనియు, యిర్మియా 29:11 లోని "నేను మిమ్మును గూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును, రాబోవు కాలమందు మీకు నిరీక్షణ కలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములే గాని హానికరమైనవి కావు ఇదే యెహోవా వాక్కు" అనియు ప్రార్థించవచ్చును.
- నీ బిడ్డలతో నీవు సమస్యలను ఎదుర్కొంటున్నపుడు, నీవు ప్రార్థించి, దేవునికి యెషయా 54:13లోని "నీ పిల్లలందరూ యెహోవా చేత ఉపదేశము నొందుదురు" అనియు ప్రార్థించవచ్చును.
- నీతో దేవుడు ఏమి చేయుచున్నాడో, లేక నీ జీవితంలో ఏమి జరుగుతుందో నీకు అర్థంకానపుడు, కీర్తనలు 37:23 "ఒకని నడత యెహోవా చేతనే స్థిరపరచబడును, వాని ప్రవర్తన చూచి ఆయన ఆనందించును" అనియు, యెషయా 55:8–9 "నా తలంపులు మీ తలంపులవంటివి కావు, మీ త్రోవలు నా త్రోవలవంటివి కావు ఇదే యెహోవా వాక్కు. ఆకాశములు భూమికి పైన ఎంత ఎత్తుగా వున్నవో, మీ మార్గములకంటే నా మార్గములు మీ తలంపుల కంటే, నా తలంపులు అంత యెత్తుగా ఉన్నవి." అనియు ప్రార్థించవచ్చును.

దేవుని వాక్యం మన ప్రతి పరిస్థితికి తగిన జవాబును, నిర్దేశకత్వాన్ని, ప్రార్థనా వ్యూహాలను ఇస్తుంది

మన జీవితాలలో ప్రతి విషయాన్ని ఇవి చెప్పకపోయినప్పటికీ, దేవుని వాక్యం మన ప్రతి పరిస్థితికి తగిన జవాబును, నిర్దేశకత్వాన్ని, ప్రార్థనా వ్యూహాలను ఇస్తుందని మీరు

తెలుసుకున్నారని నమ్ము తున్నాను. నీకు సాధ్యమైనన్ని వాక్యభాగాలను వెదకి, ధ్యానించి, కంఠస్థం చేయండి. ఈ విధంగా, నీవు దేవుని వాక్యాన్ని నీ హృదయంలో దాచివుంచు కుంటావు. మరియు నీవు నీ ప్రార్థనలలో వాక్యాన్ని ఆవశ్యకమైన భాగంగా వుంచుకొనుటకు, దానిని గూర్చిన జ్ఞానాన్ని కలిగియుంటావు.

## ప్రార్థనా భాషలో ప్రార్థించుట

ప్రార్థనా భాషలో ప్రార్థించు పరిశుద్ధాత్మునిచే అనుగ్రహించబడిన ప్రార్థనా భాషలో (ఇతర భాషలో ప్రార్థించుట) ను కొందరు క్రైస్తవులు నమ్ముతారు. ఈ అభ్యాసాన్ని భాషలలో మాట్లాడుట అని కూడా అంటారు. ఈ ఆత్మీయ వరాన్ని నమ్మని వారిని నేను నిజంగా గౌరవిస్తాను, కాని, దానిని నమ్మువారు అనేకమంది వున్నారు గనుక దీని గురించి చెప్తూ ఈ అధ్యాయాన్ని వ్రాస్తున్నాను. ఆత్మవరములన్నీ మనకు అవసరమనీ, ప్రార్దనా భాష ప్రతి విశ్వాసికీ అందుబాటులో వున్నదనియూ, వ్యక్తిగతముగా, నేను నమ్ముతున్నాను. ఈ అంధకార ప్రపంచములో, అనిర్ధిష్ట పరిస్థితుల మధ్యలో దేవుని శక్తిని అనుభవించుటకు, అభ్యసించుటకు, ఈ వరాలు మనకు ఇవ్వబడ్డాయని నేను నమ్ముతున్నాను. పరిశుద్ధాత్ముడు మనకు అనుగ్రహించు ప్రతి వరము, మనకు అవసరమైయున్నదని నేను నమ్ముతున్నాను: మనకు బుద్ధి వాక్యమను వరము అవసరమైయున్నది, జ్ఞానవాక్యమను వరము అవసరమైయున్నది, విశ్వాసమనువరము అవసరమైయున్నది, స్వస్థపరచు వరము అవసరమైయున్నది, అద్భుతకార్యములను చేయు శక్తి అను వరము అవసరమైయున్నది, ప్రవచన వరమను వరము అవసరమైయున్నది, ఆత్మల వివేచనయను వరము అవసరమైయున్నది, నానావిధ భాషలను మాట్లాడు వరము అవసరమైయున్నది, భాషల అర్థము చెప్పు శక్తియను వరము అవసరమైయున్నవి (1 కొరింథీయులకు 12:8–10). కొరింథీయులకు వ్రాసిన పత్రికలో పౌలు ఏమి చెప్పియున్నాడో నేను మీకు చెప్తాను: "..... భాషలతో మాటలాడుచున్నాను, అందుకు దేవుని స్తుతించెదను." (1 కొరింథీయులకు 14:18). నిజానికి, నేను తరచుగా భాషలతో మాట్లాడుతాను, ఎందుకంటే, అది చాలా బలము మరియు నన్ను ఆత్మీయంగా అంతరంగంలో బలపరుస్తుంది. అది నన్ను పరిశుద్ధాత్ముని నడిపింపునకు నన్ను త్వరగా స్పందించునట్లు చేస్తుంది, మరియు నేను నా మనస్సు, ఉద్రేకాలకు లోనవకుండా ఆత్మలో పరిశుద్ధాత్ముని నిలుపుకొనుటకు నడిపిస్తుంది. పరిశుద్ధాత్ముని వరాలను అభ్యసించువారు, పొందుకొనువారికి ప్రార్థనా భాషలో ప్రార్థించుట అనేది అసామాన్యమైన శక్తిని విడుదల చేస్తుందని మీకు చెప్పుచున్నాను.

### *ప్రార్థనా భాష యొక్క శక్తి*

ప్రభువుతో మర్మాలు, ఆత్మీయ రహస్యాలు మాట్లాడుటయే, ప్రార్థనా భాషలో (ఇతర భాషలలో)

ప్రార్థించుటయే ప్రార్థనా భాషలోని శక్తిలో భాగము. 1 కొరింథీయులకు 14:2 "ఎందుకనగా భాషతో మాటలాడువాడు మనుష్యులతో కాదు దేవునితో మాటలాడుచున్నాడు మనుష్యుడెవడును గ్రహింపడు గాని వాడు ఆత్మవలన మర్మములను పలుకుచున్నాడు." అని చెప్తున్నాడు. మనం ప్రార్థనా భాషలో ప్రార్థించునపుడు, మనం ప్రార్థిస్తున్న దానిని గ్రహించము గనుక మన ప్రార్థనలు శుద్ధంగా వుండి, మన ప్రభావం, ప్రాకృతిక ఆలోచనలు మరియు కారణాలు ఆలోచించకుండా వుంటుంది. 1 కొరింథీ 14:14 నందు పౌలు "నేను భాషతో ప్రార్థన చేసినయెడల నా ఆత్మ ప్రార్థన చేయును గాని నా మనస్సు ఫలవంతముగా ఉండదు." అని వ్రాస్తూ మనకు నిశ్చయతనిస్తున్నాడు.

భాషలతో ప్రార్థన చేయునపుడు, మనం మన మనసు మాత్రమే కాదు గాని, సాతాను కూడా అర్థం చేసుకోలేని ప్రార్థనను ప్రార్థిస్తున్నాము. అన్నిటికంటే మిన్నగా తరచుగా మనము మన జీవితాలలోను ఇతరుల జీవితాలలోను గొప్ప విషయాలను గురించి ప్రార్థిస్తాము – మనం వాటిని అర్థం చేసుకొన గలిగినట్లయితే, నమ్మలేము. మనము ప్రార్థించుట ఎలాగో మనకు తెలియని పరిస్థితులలో సరిగా ప్రార్థించుటకు భాషల్లో ప్రార్థించుట అనేది ఒక మార్గం. రోమా 8:26 "ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్థనచేయవలెనో మనకు తెలియదు గనుక" అని చెబుతున్నాడు. ఆ పరిస్థితిలో, మనం ప్రార్థనాభాషలో మాట్లాడగలం. ఈ ఆత్మ ప్రార్థనలు దోషరహితంగా సంభాషిస్తాయి, ఎందుకంటే అవి పరిశుద్ధాత్ముని వలన అనుగ్రహించబడినవి, మరియు ఆ పరిశుద్ధాత్ముడు మన కొరకు విజ్ఞాపన చేయుచున్నాడు.

భాషలతో ప్రార్థన చేయునపుడు, మనం మన మనసు మాత్రమే కాదు గాని, సాతాను కూడా అర్థం చేసుకోలేని ప్రార్థనను ప్రార్థిస్తున్నాము.

(ఒక వ్యక్తి ప్రాంతీయ భాష కానిది, అతనికి తెలియనిది అయిన) భాషలలో ప్రార్థించుట యొక్క శక్తిని నేను నమ్ముతాను. నా వ్యక్తిగత జీవితములోను, పరిస్థితుల లోను, అలాగే నా ప్రార్థనా జీవితములోను అది అద్భుతమైన మార్పును కలుగజేసింది. జీవితములోని ప్రతి దశను భరించుటకు ఇది పరిశుద్ధాత్ముని శక్తిని తెస్తుంది, మరియు అసహజమైన జ్ఞానంతోను, అసహజమైన కృపతోను, అసహజమైన బలముతోను జీవితంలో నడచుటకు తోడ్పడుతుంది. నేను దేవుని హెచ్చుగా వెదకుతున్న సమయంలో 1976 వ సంవత్సరములో దేవుడు దానిని నాకు అనుగ్రహింపబడినది. ఒక క్రైస్తవురాలిగా నేను అనుభవించినదానికంటే ఎక్కువగా దేవుడు నేను పొందుకొనగలనని నేను నమ్మాను. నన్ను నేను ఆయనకు

అప్పగించుకున్నాను, ఆయన నన్ను తన ఆత్మతో నింపి, అప్పటికి భాషలలో మాట్లాడుటను గురించి నేను కొంచెమే వినినప్పటికీ, భాషలతో మాట్లాడగలుగుటకు నాకు శక్తిని ఇచ్చాడు.

భూమిపై అక్షరాలా కొన్ని వేలమంది ప్రజలు భాషలతో మాటలాడుచున్నారు, అది అందరూ పొందుకోవచ్చునని నేను వ్యక్తిగతంగా నమ్ముతున్నాను. తమ మనస్సులు అర్థంచేసుకొనవు గనుక కొంతమంది భాషలకు భయపడుతారు కొంతమంది భాషలకు ఇతర ఆత్మీయ వరాలకు వ్యతిరేకంగా బోధింపబడతారు. కొంతమంది ఈ వరాలు ఆది సంఘంతో పాటుగా మాయమయ్యాయను పొరబాటు తలంపు కలిగివుంటారు. ఇప్పటికీ, ఈ ప్రదేశంలో ఇతరులకు బోధన అవసరమైయున్నది. మనం ఎప్పుడూ వినినిదానిపై మన విశ్వాసాన్ని వుంచలేము.

ఈ విషయాన్ని మరల మరింతగా చదువమని మిమ్ములను ప్రోత్సాహపరుస్తున్నాను. మనలో ఎవరూ కూడా వాక్యభాగాలను పరిశీలించకుండా ఏ సిద్ధాంతాన్ని నమ్మకూడదు. ఒక వ్యక్తి పరలోకం వెళ్లుటకు భాషలలో ప్రార్థించవలసిన అవసరం లేదు. భాషలలో ప్రార్థించుటకు అన్నిటికంటే గొప్ప వరమని బైబిలు చెప్పుటలేదు (నిజానికి, ప్రేమ గొప్ప వరమని పౌలు చెప్తున్నాడు). దైవభక్తి కలిగిన ఇతరులు నాకు తెలుసు, వారు భాషలలో ప్రార్థించరు. నాకు భాషలతో మాట్లాడుతూ, లోకానుసారమైన ప్రవర్తన కలిగియున్నవారు కూడా తెలుసు.

భాషలతో మాట్లాడుట అనేది, ఆత్మీయ పరిణితికి ఒకటే మార్గం కాదు, అయితే, ఆత్మీయతలోనికి ఇది ద్వారం తెరుస్తుంది మరియు దేవుని మర్మాలను, రహస్యాలకు శక్తినిస్తుంది. మనకు ప్రార్థించుట ఎలాగో తెలియనపుడు, ఖచ్చితంగా ప్రార్థించుటకు ఇది సహాయ పడుతుంది, మరియు మనలను మనం విశ్వాసంలో కట్టుకొనుటకు, దిద్దుకొనుటకు ఇది ఒక మార్గమైయున్నది.

## సారాంశం

దేవుని చిత్తంతో సరిపోవు ప్రభావవంతమైన ప్రార్థనలు ప్రార్థించుటకు గల ఒక సరియైన, సులువైన మార్గము వాక్యమును ప్రార్థించుట. తన వాక్యాన్ని దేవుడు గౌరవిస్తున్నాడు మరియు విలువనిస్తున్నాడు. యెషయా 62:6 నందు తన వాక్యమును తనకు జ్ఞాపకము చేయమని ఆయన మనలను కోరుతున్నాడు, ఆహ్వానిస్తున్నాడు. మనకు దేవుడు ఏమి వాగ్దానము చేసియున్నాడో తెలిసికొని, ఇంతకు మునుపు చేసిన వాటిని మరల చేయమని అడుగుటకు, మనం వాక్యాన్ని తెలిసికొనవలసియున్నది.

ప్రభావవంతమైన ప్రార్థనలు ప్రార్థించుటకు మరొక మార్గము ఆత్మతో నడిపింపబడిన ఆత్మలో ప్రార్థించుట లేక ఇతర భాషలలో ప్రార్థించుట. మన స్వంత భాషలో లేక ఇతర

భాషలలో ప్రార్థించునట్లుగా ఆత్మతో మనం నడిపింపబడవచ్చును. ఇటువంటి ప్రార్ధనలు దేవుని ఆత్మతో మన ఆత్మతో సంబంధం కలిగివుంటాయి అవి ఆత్మీయ ప్రదేశంలో ఆత్మీయ మర్మాలను మాట్లాడుతాయి. అవి మన శరీర సంబంధ ఆలోచనల నుంచి విడుదల పొంది, శత్రువుకు ఆటంకంగా వుంటాయి. మనం భాషలలో ప్రార్ధించునపుడు, మన మనసులు వాటిని అర్థం చేసికొనవు గాని, మన ఆత్మ వాటి శక్తిని, నమ్మకాన్ని సాక్ష్యమిస్తుంది.

ఏ పరిస్థితికైనా, వాక్యము మరియు ఆత్మ అనేవి తిరుగులేని సమ్మేళనం – ప్రత్యేకంగా మన ప్రార్ధనలలో. కాబట్టి, దేవుని ఆత్మతో నడిపింపబడి, వాక్యాన్ని ప్రార్థించండి.

## ప్రార్ధనాంశములు

- దేవుని వాక్యాన్ని ప్రార్థించుట అనేది ప్రార్థించుటకు ప్రత్యేకమైన ప్రభావవంతమైన మార్గమైయున్నది. ఇది మనలను దేవుని వాగ్దానాలతో, ఆయన శక్తితో జ్ఞానంగా వుంచి, ఆయన హృదయంతో ఏకీభవించేలా చేస్తుంది.
- దేవుడు మనకు ముందే ఇచ్చాడని బైబిలు చెప్పినవాటిని, మరల అడుగుటకు బదులుగా, మనం ప్రకటించి, అవి ఇచ్చినందుకు దేవునికి వందనాలు చెల్లించాలి.
- మనుష్యులు శ్రమలు, సమస్యలను తప్పించుకోవాలని పౌలు ప్రార్థించలేదు. బదులుగా, దేవుడు ఇంతకు మునుపే చేసిన వాటిని వారు చూచి – దాని ప్రత్యక్షత కలిగివుండాలని ప్రార్థించాడు. వారు ఏమి ఎదుర్కొన్నప్పటికీ జయించాలని, ఆత్మ శక్తిలో జీవించాలని, ధృఢంగా వుండాలని, మరియు దేవుని కృపకు ఇతరులకు వారు సాక్ష్యముగా వుండాలని కూడా ప్రార్థించాడు.
- జీవితం తెచ్చు ప్రతి పరిస్థితిలో ప్రార్థించుటకు ఒక వాక్యభాగాన్ని కనుగొనగలము. నిర్ధిష్టమైన వివరాలతో బైబిలు వాక్యాలను కలిగిలేదు. అయితే, అది ప్రతి పరిస్థితికి, జ్ఞానాన్ని, నియమాలను, మరియు సామాన్య నిర్దేశకత్వాన్ని యిస్తుంది.
- భాషలలో ప్రార్థించుట అను ప్రార్థనభాషలో ప్రార్థించుటను చాలామంది క్రైస్తవులు నమ్ముతారు. అది మన మనసులు గ్రహింపలేని, సాతాను అర్థంచేసుకొనలేని భాషయైయున్నది.
- ఈ విధంగా అసమాన్యమైన ప్రార్థనా భాషలలో ప్రార్థించుట అనేది ఒక వ్యక్తి ప్రార్థనా జీవితంలో గొప్ప వైవిధ్యాన్ని కలుగజేస్తుందని నేను నమ్ముతున్నాను. ఇది మన జీవితాలకు, నిర్ణయాలకు, మరియు దైనందిన పరిస్థితులకు అసమాన్యమైన జ్ఞానాన్ని, అసమాన్యమైన శక్తిని, అసమాన్యమైన బలాన్ని ఇస్తుంది.

# 10

## శక్తివంతమైన ప్రార్థనకు తాళపుచెవులు

నీ ప్రార్థనలు శక్తివంతమైన ప్రార్థనలైవుండాలనీ, మరియు నీ జీవితములోనికి, నీ చుట్టూవున్నవారి జీవితములోనికి దేవుని ప్రణాళికలను, హృదయాన్ని తెచ్చునట్లు అవి విజయవంతముగా వుండాలని నేను ప్రార్థిస్తున్నాను. "నీతిమంతుని విజ్ఞాపన మనపూర్వకమైనదై, బహుబలముగలదైయుండును" (యాకోబు 5:16) అని బైబిలు చెప్తుంది. మన ప్రార్థనలు కూడా బహుబలముగలవైయుండాలంటే, వాటి గురించి దేవుడు ఏమి చెప్తున్నాడో మనం తెలుసుకొనవలసి వున్నది. ఎందుకంటే మన ప్రార్థనలన్నీ ఖచ్చితంగా విజయవంతమవుతాయని లేదు. ఉదాహరణకు, కొన్నిసార్లు, మనకు చాలా అవసరమైనవాటిని దేవుని చిత్తప్రకారం ప్రార్థించి అడుగుటలో విఫలమౌతుంటాము – మరియు ఆ ప్రార్థనలు ప్రభావవంతముగా వుండవు. కొన్ని సమయాలలో, కొన్నిసార్లు మనం బాగా కోపంతో లేక బాధపెట్టబడి దేవుని చిత్తంతో లేక ఆయన మనస్సుతో సంబంధం లేకుండా మన ఉద్రేకాలను ఆధారంగా చేసుకొని ప్రార్థిస్తుంటాము, ఆ ప్రార్థనలు కూడా ప్రభావవంతముగా వుండవు.

శక్తివంతమైన, ప్రభావవంతమైన ప్రార్థనలు చేయుటకు ఏమి చేయవలెనో తన వాక్యం ద్వారా దేవుడు చెప్తున్నాడు, మరియు ఆయన సూచనలలో కొన్నింటిని నేను వివరించాలని ఆశపడుతున్నాను. ఈ పుస్తకంలో నేను ముందుగా వ్రాసినట్లుగా, సూత్రాలను అనుసరించుట వలన లేక కొన్ని నిర్థిష్ట నియమాలలో నిలిచియుండుటవలన మన ప్రార్థనలు శక్తివంతముగా వుండవు. శక్తివంతమైన ప్రార్థనలు దేవుని వాక్యం పై ఆధారపడివుంటాయి అవి సులువైనవి, నిజాయితీ కలిగినవి, విశ్వాసంతో నింపబడినవి. నియమ, నిబంధనలతో వాటికి పనిలేదు అవి హృదయ భావనలకు సంబంధించినవైయున్నవి.

## దేవునికి లోబడు

మన క్రైస్తవ జీవితాలలో ఒక దశ మరియు – ప్రభావవంతమైన ప్రార్థనలకు ఒక స్థితి – దేవుని యెడల మన ప్రేమను వెల్లడిచేయు, లోబడుటయైయున్నది. ఆయనకు లోబడుటకు ఇష్టపడకుండా మన దేవునితో సంబంధాన్ని కొనసాగించలేము, మరియు ప్రార్థనలో శ్రేష్ఠంగా వుండలేము. ఎటువంటి విధమైన అవిధేయత, అది ఏ స్థాయిలో నున్నప్పటికీ పాపమైయున్నది. విజయవంతముగా ప్రార్థించుటనుండి పాపము మనలను దూరముగా వుంచినట్లే, నిజముగా ప్రభావవంతమైన, ఫలవంతమైన ప్రార్థనలు ప్రార్థించుటకు దేవునికి లోబడుట ఒక దారిని కలుగజేస్తుంది.

అనేక సంవత్సరాలుగా, దేవునికి లోబడుటకు నేను అనేకమైన అవకాశాలు పొందుకున్నాను. నాకు లోబడుట అనేది ప్రత్యేకంగా సవాలుగా కనిపించిన సమయం, 1976 లో పరిచర్యకు పిలుపు అందుకొనినపుడే. ఆ సమయంలో, నేను ఉద్యోగం చేస్తున్నాను మరియు ముగ్గురు పిల్లలను పెంచుటకు, ఒక భార్యగా వుండుటకు ప్రయత్నిస్తున్నాను. సంపాదించుటకు తప్ప, మిగిలిన వాటికి నాకు చాలా కొద్దిగా సమయం వుండేది. అయితే, దేవుడు నా హృదయంలో వుంచిన బోధనా పరిచర్యను చాలా ఖచ్చితంగా ప్రారంభించవలసి యున్నది.

విశ్వాసంలో అడుగువేసి, చదువుటలోను, ప్రార్థించుటలోను ఎక్కువ సమయం గడుపునట్లుగా ఉద్యోగం మానివేయమని దేవుడు నాలో పనిచేయటం మొదలుపెట్టాడు. నేను భయపడ్డానని చెప్పుట ద్వారా దానిని అంత గంభీరంగా తీసుకోకుండా వుండివుండవచ్చును. రాయిలా వుండిపోవటం అనే మాట యింకా బావుంటుంది! అన్నింటి కంటే ముందుగా, నా ఆత్మీయ అవసరతలు తీర్చుటకు దేవుని నమ్ముటలో నాకు చాలా కొద్ది అనుభవమే వుంది. విశ్వాసంలో నూతన స్థాయికి దేవుడు నన్ను పిలుస్తున్నాడు, అయితే, నా గురించి నేను శ్రద్ధ వహించుటకు నేను అలవాటు పడిపోయాను గనుక విధేయత చూపటం నాకు కష్టంగా అనిపించింది.

మా ఖర్చులు, నా భర్త సంపాదన కన్నా 40 డాలర్లు ఎక్కువగా వుండుట వలన, మేము కేవలం డబ్బు కోసమే కాకుండా మధ్యలో ఎదురవు కారు రిపేరు, యింటి ఖర్చులు, బట్టలు యిలాంటి వాటికి కూడా దేవునిపై ఆధారపడవలసివచ్చింది.

మా ఆర్థిక పరిస్థితిని దృష్టిలో వుంచుకొని, నేను నా ఉద్యోగం మానివేసి, ఖాళీ సమయంలో చేయగల ఒక ఉద్యోగం చూసుకుందాం అనుకున్నాను. మా అవసరతలు తీరుతాయన్న నిశ్చయతను కలిగివుండి, నేను దేవుని నమ్ముతూ వున్న విధానం అది. మరొక మాటలో చెప్పాలంటే, నేను దేవుని పూర్తిగా నమ్ముటకు యిష్టపడుటలేదు. లోబడుటకు బదులుగా ఆయనకు ఒక బలిని అర్పిస్తున్నాను. అది నిజముగా లోబడుట కాదు, అది దేవుని సంతోషపరచదు.

తరువాత కొన్ని సంవత్సరాలు, ఆయన అద్భుతకరమైన రీతిలో ప్రతినెలా మా అవసరతలు తీర్చిన విధానాన్ని గమనిస్తూ నేను చాలా నేర్చుకున్నాను. అవి యితరులకు అద్భుతంగా కనిపించకపోవచ్చును కానీ అవి నాకు అద్భుతాలే. నాకు అవసరమైన వస్తువుల జాబితాను వ్రాసిపెట్టుకొని, వాటిని తీర్చమని దేవుని అడుగుట నాకు జ్ఞాపకం వున్నది. నా జాబితాలో క్రొత్త గిన్నెలు తుడిచే బట్టలు, క్రొత్త టవల్లు వున్నాయి. ఒక స్నేహితురాలు మా యింటికి వచ్చి "నీవు నాకు పిచ్చి పట్టిందని అనుకోవని ఆశపడుతున్నాను. కాని, దేవుడు నీకు క్రొత్త గిన్నెలు తుడిచే బట్టలు, క్రొత్త టవల్లు యివ్వమని చెప్పినట్లు నాకు అనిపించింది. యివిగో అవి" అని చెప్పినపుడు, నా ఆశ్చర్యాన్ని మీరు ఊహించవచ్చును.

కొన్ని సంవత్సరాల క్రితం అలా విశ్వాసంతో అడుగు ముందుకు వేయకపోయివుంటే, ఈ రోజు యిలా పరిచర్య కొరకైన ధనం కోసం దేవునిపై ఆధారపడలేకపోయివుండేదానను. ఒక ప్రసంగికుడు ఈ విధంగా చెప్పాడు "నీవు ఒక క్రొత్త యింటి కొరకు లేక క్రొత్త కారు కొరకు దేవుని నమ్ముటకు ముందుగా నీ సాక్సుల కొరకు దేవుని నమ్మాల్సివుంది". లోబడుటలో మనం అడుగులేసే కొలది, దేవుని నమ్ముటకు నేర్చుకుంటాము. దేవుని నమ్ముటలో మనం అనుభవం పొందుకుంటాము అది మన నిశ్చయతని పెంచుతుంది.

నాకు జరిగింది గనుక, నాలా చేయుటకు ప్రయత్నించవద్దని మీకు జాగ్రత్త చెప్తున్నాను, అయితే, దేవుడు అడిగినది ఏదైనప్పటికీ దానిని చేయుటకుష్టపడండి. సమూలంగా దేవునికి లోబడుట అనేది నిన్ను దేవునితో ఉత్సాహకరమైన జీవితంలోనికి, నిన్ను ఆశ్చర్య చకితులిని చేసే జీవితంలోనికి నడిపిస్తుంది.

నిజంగా, సమూలంగా దేవునికి లోబడబోతున్నానని మీ మనస్సును మీరే సిద్ధం చేసుకోమని మిమ్మును ప్రోత్సాహపరుస్తున్నాను. 1 యోహాను 3:22 "మరియు మనమాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి యిష్టమైనవి చేయుచున్నాము గనుక, మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరుకును" అని చెప్తుంది. దాని అర్థం మనం లోపరహితంగా వుండవలెననా? కాదు. పొరబాట్లు చేసేవారిని కూడా దేవుడు తన కృపలో ఆశీర్వదిస్తాడన్నది నిజం. అయితే, మనమున్న విధానంలోనే మనం తృప్తి చెందకూడదు. మనం లోప రహితులం అయినప్పటికీ దేవుడు మనలను ఆశీర్వదిస్తాడు, అయితే అదే సమయంలో, మన హృదయాలు ఎదుగుదల మరియు అభివృద్ధి కొరకు అపేక్షించాలి. మనం తెలిసీ, యిష్టంగా మరియు

> నిజంగా, సమూలంగా దేవునికి లోబడబోతున్నానని మీ మనస్సును మీరే సిద్ధం చేసుకోమని మిమ్మును ప్రోత్సాహపరుస్తున్నాను.

అలవాటుగా పాపం చేసిన తర్వాత కూడా దేవుడు ఆశీర్వాదాలతో మనలను నింపుతాడని ఎదురుచూడకూడదు. “ఈ విధంగా జీవించటానికి నేను యిష్టపడటం లేదు. నేను ఎదగాలని ఆశపడుతున్నాను. నేను మార్పుచెందాలని అనుకుంటూ, ఆ దిశగా ప్రయాసపడుతున్నాను. నేను ఇలా చేయుచున్నపుడు, అన్నీ సరిగా చేయలేనని నాకు తెలుసు, అయితే నీవు కృప కనికరములు కలవాడవు గనుక నేను పరిణితి చెందుతుండగా నీవు నన్ను ఆశీర్వదిస్తావని నేను నమ్ముతున్నాను” అన్న సందేశాన్ని మన ప్రవర్తన ద్వారా ఆయనకు పంపవలసిన అవసరం వుంది. ఒకవేళ మనం అయితే మనము అవిధేయతలో జీవిస్తూ, తెలిసి కూడా దేవునికి అవిధేయులవు తున్నట్లయితే మనము ఆశీర్వదించబడవలసిన అవసరం లేదు. ఎందుకంటే యిటువంటి ప్రవర్తనలో మనము ఆశీర్వదించ బడినట్లయితే మార్పు చెందాలని లేక అభివృద్ధి చెందాలని కోరుకోము.

మనం దేవునికి లోబడని ప్రతి సారీ మనల్ని మనము బాధ పెట్టుకుంటున్నాము. ఉదాహరణకు ఎవరికైనా క్షమాపణ చెప్పమని దేవుడు చెప్పినప్పుడు “నన్ను క్షమించండి” అని చెప్పలేనంత తలబిరుసు తనం మనం చూపినట్లయితే మనల్ని మనం బాధ పెట్టుకుంటున్నాము. మరియు మన ప్రార్థనాజీవితాలకు వ్యతిరేకంగా ప్రభావితం చేస్తున్నాము. అయితే ఎప్పుడైతే దేవునికి లోబడతామో మనల్ని మనం జవాబులు పొందు ప్రార్థనలకు, ఆశీర్వాదాలకు తగిన స్థానంలో నిలువబెట్టుకుంటున్నాము. లోబడు వారికి వచ్చు ఆశీర్వాదముల గురించి బైబిల్ ఏమి చెబుతుందో చూడండి.

పాపము చేసినప్పటికీ పశ్చాత్తాపపడువారు ఆశీర్వదింపబడతారు. మనం మన పాపాల్ని ఒప్పుకొని పశ్చాత్తాపపడి వాటినుండి తిరుగుటకు ఇష్టపడాలి. ఏదేమైనా, మనుష్యులు తమ పాపములను ప్రేమించి వాటినుండి తిరుగుటకు ఇష్టపడకపోయినట్లయితే తాము వెలుగును చూచు వరకు వారు దేవుని యొక్క దండనలో వుంటారు.

- “కాగా మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడిచినయెడల మీరు సమస్తదేశ జనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు” (నిర్గమకాండము 19:5).
- “నీ దేవుడైన యెహోవా దృష్టికి యుక్తమును యథార్థమునగు దానిని నీవు చేసినందున నీకును నీ తరువాత నీ సంతతివారికిని నిత్యము మేలుకలుగునట్లు నేను నీకాజ్ఞాపించుచున్న యీ మాటలన్నిటిని నీవు జాగ్రత్తగా వినవలెను'' (ద్వితియోపదేశకాండము 12:28).
- “మరియు నీ దేవుడైన యెహోవా నీ చేతి పనులన్నిటి విషయములోను, నీ గర్భఫల విషయములోను, నీ పశువుల విషయములోను, నీ భూమి పంట విషయములోను నీకు మేలగునట్లు నిన్ను వర్ధిల్లజేయును. ఈ ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాయబడిన ఆయన ఆజ్ఞలను కట్టడలను నీవు గైకొని, నీ దేవుడైన యెహోవా మాట విని, నీ

పూర్ణహృదయముతోను నీ పూర్ణఆత్మతోను నీ దేవుడైన యెహోవా వైపు మళ్ళునపుడు యెహోవా నీ పితరులయందు ఆనందించినట్లు నీకు మేలు చేయుటకు నీయందును ఆనందించి నీవైపు మళ్ళును." (ద్వితియోపదేశకాండము 9:10).

- "వారు ఆలకించి ఆయనను సేవించిన యెడల తమ దినములను క్షేమముగాను తమ సంవత్సరములను సుఖముగాను వెళ్ళబుచ్చెదరు" (యోబు 36:11).
- ".... ఏదనగా – నా మాటలు మీరు అంగీకరించినయెడల నేను మీకు దేవుడనై యుందును మీరు నాకు జనులైయుందురు. మీకు క్షేమము కలుగునట్లు, నేను మీకు ఆజ్ఞాపించుచున్న మార్గమంతటియందు మీరు నడుచుకొనుడి." (యిర్మియా 7:23).
- "నేను నా తండ్రి ఆజ్ఞలు గైకొని ఆయన ప్రేమయందు నిలిచియున్న ప్రకారము మీరును నా ఆజ్ఞలు గైకొనినయెడల నా ప్రేమయందు నిలిచియుందురు." (యోహాను 15:10).

## అనుగుణ్యముగా నీతి కలిగియుండు

దేవుని మన నడతలో మనం నమ్మకంగా వుండుటకు వెదకినట్లయితే, మన ప్రార్థనలను వింటానని, దేవుడు తన వాక్యంలో మనకు వాగ్దానమిస్తున్నాడు. సామెతలు 15:29 యిలా చెప్తుంది: "(అనుగుణ్యముగా) నీతిమంతుల ప్రార్థన ఆయన అంగీకరించును". "అనుగుణ్యముగా నీతి కలిగియుండుట"కు అర్థమేమిటి? సులువుగా చెప్పాలంటే, అనుగుణ్యముగా నీతి కలిగియుండుటకు ఉన్న ఉత్తమ మార్గం రాజీ పడుటకు ఒప్పుకొనకపోవుట.

రాజీపడే వ్యక్తి ఎవరంటే, అది పూర్తిగా సరైనది కానప్పటికీ, అందరూ వెళ్ళే దారిలో వెళ్లాలనే భావన కలిగివున్న వాడు. ఒకటి సరియైనది కానప్పుడు రాజీపడేవానికి అది తెలుస్తుంది, అయినా అది చేసి, దానినుంచి బయటపడాలని కోరుకుంటాడు. ఒకటి చేయకూడదని, చెప్పకూడదని, కొనకూడదని, తినకూడదని మన హృదయాలలో తెలిసినప్పటికీ–పరిశుద్ధాత్ముని ఒప్పింపు వున్నప్పటికీ మనం " నేను యిది అనకూడదని నాకు తెలుసు, కానీ.....", "నేను ఇది కొనకూడదని నాకు తెలుసు, కానీ.....," "నేను ఇది తినకూడదని నాకు తెలుసు, కానీ.....," "నేను ఇంత ఆలస్యంగా వుండకూడదని నాకు తెలుసు, కానీ .....," అని చెప్పుటద్వారా రాజీ పడతాము. ఈ నాకు *తెలుసు, కానీ .....* దీని ద్వారా నిజానికి మనం ఏం చెప్తున్నాము? ఏం చెప్తున్నామంటే, "ఏం చెయ్యాలో దేవుడు నాకు చూపిస్తున్నాడు, కానీ నేను మాత్రం నాకు చేయాలని వున్నదానినే చేస్తున్నాను." అని చెప్తున్నాము. ఆ

విషయంలో, మనం కోరిన ఫలితాలను మనం చూడలేక పోయినపుడు, తప్పు మనదే అవుతుంది.

మనం రాజీపడుటకు ఒప్పుకొనకవుండి, మనలను మనం అనుగుణ్యంగా లోబడుటకు అప్పగించుకొనినట్లయితే, దేవుడు మన ప్రార్థనలు విని, మనకు వాగ్ధానము చేసిన యితర ఆశీర్వాదాలను మనకు యిస్తాడు. యిలాంటివి:

- "…. నీతిమంతులు ఆశించునది వారికి దొరుకును" (సామెతలు 10:24).
- "నీతిమంతులు ఖర్జూరవృక్షమువలె మొవ్వ వేయుదురు" (కీర్తనలు 92:12).
- "నీతిమంతులకొరకు వెలుగును, యథార్థహృదయుల కొరకు ఆనందమును విత్తబడియున్నవి." (కీర్తనలు 97:11)
- "యెహోవా నీతిమంతులను ప్రేమించువాడు" (కీర్తనలు 146:8).

నీతిమంతులకు కలుగు ఆశీర్వాదములను బైబిల్ స్పష్టంగా చెబుతున్నప్పటికీ యిప్పటి ఆధునిక సమాజపు మనుష్యులు మనల్ని రాజీ పడేటట్లుగా చేయాలని చూస్తారు. మనం అలా వుండనట్లయితే వారు మనల్ని న్యాయానుసారంగా ప్రవర్తించేవారని కర్కశమైన మనస్సు గల వారని పిలుస్తారు. మనం పరిశుద్ధంగా జీవించాలనుకున్నప్పుడు కొందరు క్రైస్తవులు సహితం న్యాయానుసారంగా వుంటున్నామని మనపై నిందలు మోపుతారు. నన్ను సమస్యలలో పడవేసే వాటిని లేదా నాకు అవసరం లేని వాటిని తీసికొని వేరొక చోటికి వెళ్ళటం కంటే పవిత్రురాలిగా వుండటానికి ప్రయత్నించటం కష్టమైయున్నది ఈ లోకంతో కలిసిపోవటం చాలా సులువైనది అయితే ఈ లోకంలో నుండి తమను తాము వేరు పరచుకొని శుద్ధిఅయిన పవిత్ర జీవితాలు – రాజీ పడని జీవితాలు జీవించేవారికోసం దేవుడు చూస్తున్నాడు.

మనం దేవునికి లోబడబోతున్నట్లయితే (శక్తివంతమైన ప్రార్థనకు యిది ఒక తాళంచెవి అని జ్ఞాపకముంచుకోండి) మన చుట్టూ వున్న వారి అభిప్రాయాలను అధిగమించి అనుగుణ్యమైన నీతిని కలిగివుండుటకు మన జీవితాలను సమర్పించుకోవాలి. అనుగుణ్యమైన నీతిని

మనం దేవునికి లోబడబోతున్నట్లయితే మన చుట్టూ వున్న వారి అభిప్రాయాలను అధిగమించి అనుగుణ్యమైన నీతిని కలిగివుండుటకు మన జీవితాలను సమర్పించుకోవాలి

కలిగివున్న వ్యక్తి ఏం చేస్తాడు? అనుగుణ్యమైన నీతిని కలిగివున్న వ్యక్తి అన్ని సమయాలలో సరియైన దానిని చేయుటకు ప్రయత్నిస్తాడు ప్రస్తుతపు రోజులలో ఒక వ్యక్తి తాను ఏదైనా సమస్యలో వున్నప్పుడు లేక ఏదైనా అద్భుతం కావలసి వచ్చినప్పుడు మాత్రమే సరియైన దానిని చేస్తాడు. వెంటనే జరుగుటకు వారు యిలా ఆలోచిస్తారు *మనకు సహాయం కావాలి కనుక ఈ వారం చర్చికి వెళ్ళాలి* లేదా ఉదాహరణకు *మనకు స్వస్థత కావాలి కనుక పుకార్లు చెప్పుకొనకుండా వుండటం మంచిది!* మనకు ఏదైనా మలుపు అవసరమైనప్పుడు చాలా "పవిత్రంగా" వుండటం నిజంగా చాలా ఆశ్చర్యకరం, అయితే అనుగుణ్యమైన నీతిని కలిగివున్నవ్యక్తి తనకు దేవుని వద్దనుండి ఏదో ఒకటి అవసరమైనప్పుడే కాకుండా అన్ని సమయాలలో సరైన దానిని చేయుటకు ప్రయత్నిస్తాడు. అనుగుణ్యమైన నీతిని కలిగివున్నవ్యక్తి ఎల్లప్పుడూ సరైన దానిని ఎందుకు చేస్తాడంటే అది సరైనది కాబట్టి, అది దేవుని ఘనపరుస్తుంది కాబట్టి, అది తగ్గింపు మనస్సును చూపిస్తుంది కాబట్టి మరియు దేవునికి లోబడాలన్న కోరికను చూపిస్తుంది కాబట్టి – దేవుడు దానిని ఇష్టపడతాడు.

## ప్రార్థిస్తూవుండండి

"నీతిమంతుని ప్రార్థన మన:పూర్వకమైనదై బహు బలము గలదై యుండును" అని యాకోబు 5:16 చెబుతుంది. గమనించండి, బహుబలము కలిగిన ప్రార్థన మన:పూర్వకమైనది, మరియు ఎడతెగనిదైయున్నది. దేవుని మన అవసరతను అడిగిన తరువాత ఆ పరిస్థితిలో మన తరుపున ఆయన అద్భుతమైన శక్తి పని చేయుటను మనము అనుభవించు దాకా ప్రార్థించుట అనేది శక్తివంతమైన ప్రార్థనకి ఒక తాళపు చెవియైవున్నది. మనము ప్రార్థనలో బలముగా వుండి సులువుగా వదిలి వేయకుండా వుండవలెను.

యేసు తన శిష్యులకు ప్రార్థించుట నేర్పిన వెంటనే, "అటువలె మీరును అడుగుడి, మీకియ్యబడును. వెదకుడి, మీకు దొరకును. తట్టుడి, మీకు తీయబడును అడుగు ప్రతివానికి యియ్యబడును వెదకు వానికి దొరకును తట్టువానికి తీయబడునని మీతో చెప్పుచున్నాను" (లూకా 11:9–10). అని చెప్పుట ద్వారా ఎడతెగక ప్రార్థించమని వారిని ప్రోత్సాహపరుస్తున్నాడు. మనం ప్రార్థనలో పట్టుదల కలిగివుండాలని యేసు కోరుతున్నాడు ధైర్యముగాను, గోజాడి అడగవలెనని ఆయన కోరుతున్నాడు. అమర్యాదగా అడగమని దానికి అర్థం కాదు మర్యాదగానే అయితే నమ్మకంగా అడగమని దానికి అర్థం మనం ఎడతెగక ప్రార్థించినప్పుడు మన ప్రార్థనలు ప్రభావవంతంగా వుండి మనకు కావలసిన జవాబులు పొందుకుంటామని ఆయన చెప్పుచున్నాడు.

## వదలివేయుటకు నిరాకరించుట

నిత్యము ప్రార్థన చేయుచుండవలెనన్న అధ్యాయంలో అన్యాయస్థుడైన న్యాయాధిపతిని తొందర పెట్టిన విధవ రాలిని గురించి యేసు చెప్పిన ఉపమానం మీకు జ్ఞాపకం వుండేవుంటుంది. ఈ ఉపమానం చెప్పుటలోని ఆంతర్యం విసుగక నిత్యము ప్రార్థించుట అని బైబిల్ చెబుతుంది (లూకా 18:1). ఆవశ్యకంగా, ఈ స్త్రీ “నాకొరకు ఏదో ఒకటి చేయుట మంచిది లేకపోతే నేను బ్రతిమలాడుటను వినలేక నీవు అలసిపోతావు” అని చెబుతుంది. ఏం జరిగిందో మీకు గుర్తుందా? తాను అడిగిన దానిని ఆమె పొందుకుంది.

ఎడతెగక మనవిని చేసి తన జవాబు పొందుకున్న మరొక వ్యక్తిని గురించి మత్తయి 15:22-27 చెబుతుంది. “ఇదిగో ఆ ప్రాంతములనుండి కనాను స్త్రీ యొక్కతె వచ్చి - ప్రభువా, దావీదు కుమారుడా, నన్ను కరుణింపుము నా కుమార్తె దయ్యము పట్టి, బహు బాధపడుచున్నదని కేకలు వేసెను. అందుకాయన ఆమెతో ఒక్క మాట యైనను చెప్పలేదు. అప్పుడాయన శిష్యులు వచ్చి - ఈమె మన వెంబడి వచ్చి కేకలు వేయుచున్నది గనుక ఈమెను పంపివేయుమని ఆయనను వేడుకొనగా, ఆయన - ఇశ్రాయేలు ఇంటివారై నశించిన గొఱ్ఱెల యొద్దకే గాని మరి ఎవరియొద్దకును నేను పంపబడలేదనెను. అయినను ఆమె వచ్చి ఆయనకు మ్రొక్కి - ప్రభువా, నాకు సహాయము చేయుమని అడిగెను. అందుకాయన - పిల్లల రొట్టె తీసికొని కుక్కపిల్లలకు వేయుట యుక్తము కాదని చెప్పగా, ఆమె- నిజమే ప్రభువా, కుక్క పిల్లలు కూడ తమ యజమానుల బల్లమీదనుండి పడు ముక్కలు తినును గదా అని చెప్పెను.”

యేసు సహాయపడగలిగినంత విశ్వాసము ఈమెకున్నది. ఆమె యేసుతో “నీవు నాకొరకు గొప్పలు చేయనవసరంలేదు. నాకు కొన్ని రొట్టెముక్కలు యివ్వగలిగితే అవే చాలు.” అని చెబుతుంది తాను వదిలి పెట్టనని చూపుతున్న ఆమె విశ్వాసం కారణంగా యేసు ఆమెకు స్పందించి ఆమె అడిగినది యిచ్చినాడు.

బైబిల్ నందు అడుగుటలో ఎడతెగక వున్న మరొక వ్యక్తి బర్తిమయి. అతను యేసు తన వైపు చూచు వరకు కేకలు వేస్తూనే వున్నాడు. ఈ గ్రుడ్డి భిక్షకుడు “యేసు దావీదు కుమారుడా నన్ను కరుణింపుము” అని ఎడతెగక కేకలు వేశాడు. మనుష్యులు ఈ విధంగా చెప్పి వుంటారని నేను ఊహించు కుంటాను “నోరుముయ్యి! ఆయనను వదిలెయ్ ఇక్కడ నువ్వు గందరగోళం సృష్టిస్తున్నావ్ మౌనంగావుండు!.” అయితే ఊరకుండుమని అనేకులు వానిని గద్దించిరి గానీ వాడు “మరియెక్కువగా కేకలు వేసెను” (మార్కు 10:47-48) అని బైబిల్ చెబుతుంది. దేవునికి స్తోత్రం! యేసే తన ఏకైక నిరీక్షణయని అతనికి తెలుసు అందుకే అతను అలా కేకలు వేశాడు. ఫలితంగా యేసు తాను చేస్తున్న దానిని ఆపి అప్పుడే అక్కడే బర్తిమయిని స్వస్థపరచాడు,(ఇతరమైన వాటిలో వలె) ప్రార్థనలో మనుష్యులు విజయాన్ని పొందకపోవటానికి ఒక ముఖ్య కారణం ఏమిటంటే, వారు త్వరగా వదిలివేస్తారు.

పౌలు, సీలలు మధ్య రాత్రి వేళలో తమ చెరసాలలో దేవుని ఆరాధిస్తూ, స్తుతిస్తూ వున్నారు (అ.కార్యములు 16:25-26). అనేకమంది వదలివేసి, త్వరగా నిద్రపోతుంటారు. "ఎన్నడూ విడువవద్దు" అనునది మన మూలసూత్రమై వుండాలి. వదలిపెట్టుటకు తిరస్కరించు వ్యక్తిని సాతాను జయించలేదు.

ఏదేమైనా, ప్రార్థించుటను విడువవద్దని మిమ్మును ప్రోత్సాహపరుస్తున్నాను. మీరు వెంటనే వదిలి పెట్టాలని సాతాను కోరుకుంటాడు! మీరు యిలా చెప్పాలని వాడు ఆశ పడతాడు:

- "నేనెన్నటికీ ఆశీర్వదించబడను"
- "నేను పరిచర్యకు ఏమాత్రము పిలువబడలేదని నేను కనుగొన్నాను"
- "నాకు యిక మంచి ఉద్యోగం రాదని నాకు అర్థమైపోయింది"
- "నేను యిక ఎప్పటికీ నా చదువు పూర్తి చేయలేను"
- "నేను ఇక ఎప్పటికీ మంచి స్థలానికి మారలేనని నాకు అర్థమైపోయింది"
- "నాకు యింక పెళ్ళికాదు"
- "నాకు ఎప్పటికీ ఏమీ దొరకదు"
- "నేనెప్పుడు అప్పులలోనే వుంటాను"
- "నేనెప్పటికీ బరువు తగ్గలేను"
- "నేనెప్పుడూ విడిచిపెట్టబడుతుంటాను"

పైన ఉదహరించినటువంటి తలంపులు ఎప్పటికీ దేనినీ పొందుకొనలేవు! దానికి బదులుగా మనం "క్రీస్తులో నేనేమైయునాన్ననో నాకు తెలుసు. దేవా నీవు నాకొరకు ఏమి చేశావో నాకు తెలుసు మరియు నేను అన్నిటినీ అధిగమిస్తానని నీ వాక్యం చెబుతుంది గనుక నేను అలా వుండాలని భావిస్తునాన్నను. క్రీస్తు ద్వారా నేను ఆక్రమించుకొనగలను. ఈ లోకంలో వున్నవానికంటే నాలో వున్న వాడు గొప్పవాడు. నన్ను బలపరచు క్రీస్తు ద్వారా నేను సమస్తమును చేయగలను. నా జీవితమంతా దుమ్ము వలె ధూళివలె వుండుటకు నేను ఒప్పుకొనుటలేదు. దేవుడు నా కొరకు వుంచిన ప్రతి దానిని నేను పొందుకొనబోవు

> దేవుడు నడిపించిన ఏ ప్రార్థననైనా జవాబు దొరుకు వరకు మనము అడుగుతూ వున్నట్లయితే శక్తివంతమైనదౌతుంది.

చున్నాను. నేను ఈ గోతినుండి బయటకు వచ్చి యేసు నామములో గొప్ప కార్యాలు చేయబోతున్నాను" యిటువంటి ప్రార్థన మరియు ఒప్పుకోలు దేవుని వాక్యముతో ఏకీభవిస్తుంది, యిది ఎడతెగక ప్రార్థించనప్పుడు, శక్తివంతమైనదై గొప్ప ఫలితాలనిస్తుంది. నిజానికి, దేవుడు నడిపించిన ఏ ప్రార్థననైనా జవాబు దొరుకు వరకు మనము అడుగుతూ వున్నట్లయితే శక్తివంతమైనదౌతుంది. జ్ఞాపకముంచుకోండి, మీ ప్రార్థనకు జవాబు యిస్తున్నందుకు దేవునికి వందనాలు చెల్లించుట పట్టుదలకలిగిన ప్రార్థనలలో ఒక రకం దేవుని వాగ్ధానాలను నమ్ముతున్నావని, ఆయన విశ్వాస్యతను నమ్ముతున్నావని దేవునికి తెలియజేస్తూవుండండి.

## అధికారంతో సరైనసంబంధం కలిగివుండండి

మనము అధికారంతో సరైన సంబంధం కలిగి లేనప్పుడు మన ప్రార్థనలకు సంభవించే విషయాన్ని సామెతలు 28:9 చెబుతుంది: "ధర్మశాస్త్రము వినబడకుండా తన చెవిని తొలగించుకొను వాని ప్రార్థన హేయము"

మన ఆధునిక సమాజం తిరుగుబాటుతో నింపబడింది. అధికారాలకు సంబంధించి అనేక మంది ప్రజలకు సమస్యలు వుండటాన్ని నేను గమనించాను. మన కుటుంబాలలో మార్పు చెందిన అధికారాలను గమనించండి స్త్రీలు పురుషులతో సమానమని నేను నమ్ముతాను స్త్రీలు కూడా ఈ లోకంలో గౌరవనీయమైన స్థానాలలో వుండి మంచి సంపాదన కలిగి వుండవచ్చు, స్త్రీలు కూడా దేవునిచే వాడబడగలరని నేను నమ్ము తున్నాను. అయితే నా నమ్మకాలేవీ – దేవుడు పెట్టిన కుటుంబ నిర్మాణంతో, అధికార క్రమంతో సంబంధంలేదు.

భార్యలు, ప్రభువునకు వలె తమ భర్తలకు లోబడాలని బైబిల్ చెబుతుంది. పాపము చేయుటకు అప్పగించు కోవాలని ఇది చెప్పుట లేదు. ఉదాహరణకు భర్తకు లోబడుట అంటే తన భర్త చూడమనుట వలన అసభ్యకరమైన చిత్రాన్ని చూచుట కాదు. అయితే భార్యలముగా మనం, మన భర్తల పట్ల లోబడే మనస్తత్వాన్ని, గౌరవించే మనస్సుని కలిగివుండాలి. భర్తలు దేవుని వాక్యానికి లోబడి క్రీస్తు సంఘమును ప్రేమించినట్లుగా తమ భార్యలను ప్రేమించినట్లయితే, మరియు భార్యలు సత్యమైన, దైవసంబంధమైన విధేయతతో లోబడుతున్నట్లయితే వివాహాలు సంతోషమైనవిగా ఎప్పటికీ నిలిచివుండేవిగా వుంటాయి – కుటుంబాలు సురక్షితమైన, సంతోషకరమైన స్థానాలలో వుంటాయని నేను నమ్ముతున్నాను. మనల్ని సురక్షితంగానూ, సంతోషంగానూ వుంచుటకై దేవుడు మన జీవితాలలో పెట్టిన అధికారాలను గౌరవిస్తూ, దేవుని వాక్యానికి విధేయత కలిగి జీవించిన యెడల మనందరి జీవితాలు ఈ విధంగానే వుంటాయి.

ఒకానొక సమయంలో నా భర్తకు లోబడితే చులకనైపోతానేమోనన్న భయంతో అతని యెడల తిరుగుబాటు మనస్తత్వం కలిగి వుండేదానిని. నాకు మంచి కారణం వుందని నేను అనుకున్నాను, అయితే నా గత చెడు అనుభవాల వలన నేను తిరుగుబాటులో నిలిచి వుండకుండా దేవుడు ఆపాడు. నా చెడ్డ భావనలు నా ప్రార్థనకు ఆటంకం కాకుండునట్లుగా అతని యెడల గౌరవప్రదమైన భావనకు నన్ను నేను అప్పగించుకోవాలని దేవుడు నాకు తెలిపాడు. మన సాకులు ఏమైనప్పటికీ తెలిసి తెలిసి చేసే తిరుగుబాటును దేవుడు ఆశీర్వదించడు. దేవుని కృపలో శక్తిలో దేవుడు నన్ను ఏమి చేయమంటున్నాడో నేను ఎరిగాను. ఇది సులభమైనది కాదు, అయినా నేను తిరస్కరించినట్లయితే, అపజయం, నిస్పృహలనే పర్వతముల చుట్టూ తిరుగుటలో అలసిపోతాను.

అనేక వివాహాలలో నిజముగా బైబిల్ సంబంధమైన లోబడుటలేకపోవుట వలన ఆత్మీయ అధికారమునకు లోబడుట యొక్క ఉనికి లేనే లేదు. హెబ్రీ 13:17 "నీపైని నాయకులుగా వున్నవారు లెక్క ఒప్పజెప్పవలసిన వారివలె నీ ఆత్మలను కాయుచున్నారు వారు దు:ఖముతో ఆపని చేసిన యెడల నీకు నిష్ప్రయోజనము గనుక దు:ఖముతో కాక ఆనందముతో చేయునట్లు వారి మాట విని వారికి లోబడియుండుడి" అని ఆత్మీయ అధికారానికి లోబడియుండమని బైబిల్ ఆజ్ఞను చెబుతుంది.

ఎప్పుడైనా ఒక సంఘకాపరి తప్పుదిద్దాలని అనుకున్నప్పుడు, మనుష్యులు కలవరపడి సంఘాన్ని వదిలి పెట్టాలని నిర్ణయించుకుంటారు అయితే అది సరైనది కాదు. పౌలు తరచుగా సంఘం యొక్క తప్పులను దిద్దేవాడు ఆత్మీయ నాయకుడుగా అది అతని కర్తవ్యంలో ఒక భాగము మరియు ఈ నాటి ఆత్మీయ నాయకుల కర్తవ్యం అయివున్నది. పౌలు "మీ విశ్వాసము మీద మేము ప్రభువులమని ఈలాగు చెప్పుట లేదు కాని మీ ఆనందమునకు సహకారులమైయున్నాము" 2 కొరింథీ 1:24) అని చెప్పుచున్నాడు. మన ఆనందం హెచ్చునట్లుగా ఆత్మీయ అధికారము వున్నదని మనం అర్థం చేసుకొన గలిగితే దానిని హత్తుకుంటాము అలా చేసినపుడు మన ఆనందం పెరుగుతుంది మరియు మన ప్రార్థనలు ప్రభావవంతంగా వుంటాయి.

తప్పు దిద్దబడకుండా మనం అభివృద్ధి చెందలేము, పరిణితి చెందలేము. మనం పని చేసే కార్యాలలో, కంపెనీ, ప్రభుత్వం యొక్క నియమ నిబంధనలకు మరియు ఏ యితరమైన అధికారాలకు వ్యతిరేకంగా మనము వున్నట్లయితే మనం ఊహించిన దానికంటే గంభీరమైన సమస్యలను మనం కలిగివున్నట్లే. తిరుగుబాటుతనంగా వుండటం గర్వించవలసిన విషయం కాదు మన ప్రవర్తన నుంచి తలంపుల నుంచి జాగ్రత్తగా సంపూర్ణంగా నాశనం చేయవలసిన విషయం. ఎందుకు? ఈ లోకపు అధికారాలకు లోబడుటకు మనం ఒప్పుకొనక పోయినట్లయితే మనం దేవుని అధికారానికి కూడా ఒప్పుకొనుటలేదు దీనిని అవిధేయత అంటారు మరియు యిది మన ప్రార్థనలకు శక్తి లేకుండా చేస్తుంది.

నన్ను నాస్వంత పరిచర్య చేయుటకు అనుమతించుటకు ముందు వేరొకరి పరిచర్యలో అనేక సంవత్సరాలు దేవుడు నన్ను వుంచాడు. ఆ పరిచర్యలో అధికారమునకు లోబడుటకు నేను నేర్చుకున్నాను నేను చాలా గట్టి మనిషిని కాబట్టి అది నాకు అంత సులువైన విషయం కాదు. నేను ఇతరుల నిర్ణయాలతో ఏకీభవించేదానిని కాదు మరియు ఎవరైనా నాతో సరిగా ప్రవర్తిస్తున్నారని అనుకునే దానిని కాదు. అయితే అధికారమునకు లోబడుట ఎలాగో తెలియనంత వరకు మనం అధికారము చేయుటకు యోగ్యులము కాలేమని దేవుడు నాకొక పాఠాన్ని నేర్పించాడు. సవాలుకరమైన సమయాలలో మనము మంచి భక్తి కలిగిన ప్రవర్తనను కలిగివ్నుట్లయితే తగిన సమయమందు దేవుడు మనల్ని హెచ్చిస్తాడని కూడా నేను నేర్చుకున్నాను.

నీవు నిత్యము నీ అధికారిని గురించి పుకార్లు చెడ్డమాటలు చెబుతూ కూడా పనిలో నీకు వున్నతస్థాయి రావాలని జీతం పెరగాలని ఆశించ వచ్చు తిరుగుబాటులో ఇది ఒక విధానము. దేవుడు ఒక సారి నాతో "జాయిస్ నీకు చేయమని చెప్పబడింది, చేస్తూనే నీవు తిరుగు బాటు మనస్సును కలిగివుండి వుండవచ్చు" అని చెప్పాడు. లోబడుట అనేది మనము చేసే క్రియ కాదు గానీ మనము కలిగివుండవలసిన భావనయైవున్నది.

దేవుని అభిషేకము (ఆయన సన్నిధి మరియు శక్తి) అధికారానికి ఒక రూపమైయున్నది మనము గొప్ప అభిషేకాన్ని కలిగి దేవుని వద్ద నుండి బలమైన అధికారాన్ని పొందుకోవాలనుకుంటే మనల్ని నూతన స్థాయి నాయకత్వానికి నడిపించటానికి ముందు దేవుడు మనల్ని ఎవరి అధికారము క్రింద అయితే వుంచుతాడో ఆ అధికారమునకు లోబడుట నేర్చుకొనవలసి వుంది. మా పరిచర్యలో ఆరాధన నడిపించు వారు నిజముగా అభిషేకము నొందినవారైయున్నారు. ఒక వేళ వాళ్ళు నాకు డేవ్‌కు మాట వినని వారైనట్లయితే వారి జీవితాలలో ఇంత గొప్ప అభిషేకము వుంటుందని నేను అనుకోను అదేవిధంగా నేను నా భర్తకు లోబడనట్లయితే నా జీవితంలో ఇంత బలంగా అభిషేకము వుంటుందని నేను అనుకోను మన వివాహాలలో మన ఆత్మీయ జీవితాలలో వృత్తి పరమైన జీవితాలలో ఇతర ఏవిషయంలోనైనా వున్న అధికారానికి మనం లోబడినట్లయితే మన జీవితాలలో ప్రార్థనలకు జవాబులు పొందుకుంటాము మరియు దేవుని ఇష్టాన్ని సంపాదించుకుంటాము.

అనేక మంది కేవలం తిరుగుబాటు తనంగా వుండటం ఆపి వేసుకున్నట్లయితే తమ ప్రార్థనలలో అత్యద్భుతమైన మలుపులను అనుభవిస్తారు. మనం ప్రతి విషయంలో

> అధికారమునకు లోబడుట ఎలాగో తెలియనంత వరకు మనం అధికారము చేయుటకు యోగ్యులము కాలేము

అభిప్రాయాన్ని చెప్పవలసిన అవసరం లేదు ప్రతి విషయం పట్ల అవగాహన కలిగివుండాల్సిన అవసరం లేదు ప్రతి దానిని గురించి మాట్లాడాల్సిన అవసరం లేదు మనం అధికారానికి లోబడుట మొదలు పెట్టినప్పుడుమనకు యిష్టంలేని విషయాలను గురించి సణుగుట మాని వాటినే చేయాలి. మనం "నాకు ఈ భోజనం సమయం వద్దు మరొకటి కావాలి" అని ఫిర్యాదులు చేయకూడదు మనపై అధికారంలో వున్నవారు చేయమని చెప్పారు గనుక చేయవలసివున్నది. మన ప్రభువు చేయమని చెప్పాడు గనుక దానిని చేయవలసివున్నది మనం మనుష్యులను సంతోషపెట్టుటకు జీవించుట లేదు గానీ దేవుని సంతోషపెట్టుటకు జీవిస్తున్నాము.

మన దైనందిన జీవితాలలో అధికారానికి లోబడి గౌరవించే మనస్సు ఒక భాగమైయుండవలసివున్నది మనం సురక్షితంగా వుండుటకు మన ఆనందం హెచ్చింపబడుటకు దేవుడు మన జీవితంలో అధికారాలను వుంచుతాడని జ్ఞాపకముంచుకోండి. ఆయన మనకు ఆత్మీయ అధికారాలవి మరియు సహజ అధికారాలవి ఇస్తాడు. ఆత్మీయ అధికారాలకు లోబడుట ఎంత ప్రాముఖ్యమో సహజ అధికారాలకు లోబడుట అంతే ప్రాముఖ్యం కాబట్టి ఎవరైనా నిన్ను ఎక్కడైనా కూర్చోవద్దని చెప్పినప్పుడు అక్కడ కూర్చో వద్దు. "వాహనములు నిలుపరాదు" అని వున్న చోట కేవలం ఒక్క నిమిషానికి కూడా నీ వాహనాన్ని నిలుపకూడదు. వికలాంగులకు వాహనాలు నిలుపవలసిన స్థలము ఖాళీగా వున్నట్లయితే, అక్కడ ఆగక పోయినట్లయితే నీవు ఎంత దూరం నడువవలసివచ్చినను, అక్కడ నీ వాహనం ఆపకూడదు. నడువ కూడదని సూచనవచ్చినపుడు, నడువకు. నీవు తొందరగా వెళ్లవలసివచ్చినందువలన రోడ్డు దాటవద్దు. నీ వాహనం లోని సామాను యితరులకు తగులునట్లుగా వాటిని అజాగ్రత్తగా వదలిపెట్టకూడదు.

ఒకవేళ నీవు యిలా ఆలోచిస్తూ వుండివుండవచ్చు *అటువంటి విషయాలు ఏ వ్యత్యాసాన్ని కలుగజేయవు. అవన్నీ చిన్న చిన్న విషయాలు, నాకు చాలా పెద్ద సమస్య వచ్చింది.* నీకు పెద్ద సమస్యలు వస్తాయి, నువ్వు చిన్న విషయాలను గురించిన ఆలోచనా ధోరణిని మార్చుకోకపోతే పెద్ద సమస్యలు వస్తూనే వుంటాయి! మన జీవితాలలో పెద్ద సమస్యలను లేక గొప్ప ఆశీర్వాదాలను తీసికొని వచ్చేవి మన చిన్న అలవాటైన ఆలోచనా ధోరణి మరియు మనస్తత్వాలేనని నేర్చుకునే దాకా మనకు పెద్ద సమస్యలు వస్తూనే వుంటాయి.

పైన నేను చెప్పినటువంటి ప్రవర్తనలు అధికారం పట్ల వక్రమైన మనస్తత్వాన్ని తెలుపుతున్నాయి అది "నేనేం చేయదలచుకున్నానో అదే చేస్తాను ఎందుకంటే మీరు చెప్పినది సరైనదని నాకు అనిపించటం లేదు" అన్న ధోరణిని చూపిస్తుంది. ఇతరులు సరిగా వున్నారా లేదా లేక యితరమైనవి సరిగా వున్నవా, లేవా అనునది ఆలోచించకూడదు. మనం చేయవలసినదంతా నియమాలకు లోబడుటయే, అలా చేసినపుడు దేవుడు ఆశీర్వదిస్తాడు. దానికి వ్యతిరేకంగా,

అధికారం పట్ల మనం తలబిరుసు మనస్తత్వాన్ని కలిగివుంటే, మన ప్రార్థనలు ప్రభావవంతంగా వుండవు మరియు మనము ఆశీర్వదింపబడము. సామెతలు 28:9 లోని బలమైన వాక్యాలను మరియొకసారి జ్ఞాపకం చేసుకోండి "ధర్మశాస్త్రము వినబడకుండా తన చెవిని తొలగించుకొను వాని ప్రార్థన హేయము"

## ఇతరులపై దృష్టి కేంద్రీకరించండి

మన స్వంత అవసరాల యెడల వ్యామోహం కలిగి వుండకుండా యితరులపై దృష్టిని కేంద్రీకరించటం అనేది శక్తివంతమైన ప్రార్థనకు మరియొక తాళపు చెవియైయున్నది. మనం మన కొరకు, మన జీవితాలలో సంపూర్ణ ఆశీర్వాదముల కొరకు ప్రార్థించుకొనవచ్చు, అయితే సమయమంతా మన గురించి ప్రార్థించు కొనుటలోనే గడుపుటను మనం వదలిపెట్టవలసివున్నది. మన స్వంత అవసరాలను గురించి యధేచ్ఛగా హద్దు లేకుండా – స్వార్థపూరితమైన ప్రార్థనలు – ప్రభావము లేనివై వుంటాయి. కాబట్టి మనము యితరుల కొరకు ప్రార్థించుటలో సమయము గడుపునట్లుగా జాగ్రత్తపడవలెను. నేను ప్రార్థన అవసరమైన నలుగురు,ఐదుగురు గురించి విన్నాను, వారి గురించి నేను ప్రార్థించిన ప్రార్థనలలో కొన్నింటికి జవాబులు రాగానే నేను యితరుల గురించి ప్రార్థించుటకు ఇష్టపడ్డాను. మీ జీవితంలో కూడా యిలాగే జరుగుతుంది. నేను కూడా తాము ప్రేమించిన వారిని పోగొట్టుకున్న వారి గురించి, ఉద్యోగం అవసరమైన వారి గురించి, నివసించుటకు స్థలం అవసరమైన వారిని గురించి, ఆరోగ్యం బాగాలేని వారిని గురించి, తమ బిడ్డ అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గురించి, జీవిత భాగస్వామి వదలి వెళ్ళిన వారిని గురించి నీవు విని వుంటావు. మనుష్యులు అన్ని రకాలైన అవసరాలను కలిగి వుంటారు, వారికి ప్రార్థనలు అవసరం. ఒకరికొరకు ఒకరం స్వార్థరహితంగా, ప్రేమతో ప్రార్థించాలని దేవుడు కోరుకుంటున్నాడు ఎందుకంటే లేనియెడల నీ ప్రార్థనలు జవాబు యివ్వబడవు. నీవు ప్రార్థించుటకు ఒకరిని నీకు యివ్వమని దేవుని అడగమని నేను మీకు సవాలు చేస్తున్నాను. ప్రారంభంలో, దేని కొరకు ప్రార్థించాలో నీకు తెలియకపోవచ్చు, ఆయన సన్నిధిని మౌనంగా వుండి ఆయనను అడుగు, దేని గురించి ప్రార్థించాలో ఆయన చూపిస్తాడు మరియు ప్రార్థించుటకు నీకు సహాయం చేస్తాడు. విజ్ఞాపనను గూర్చిన అధ్యాయంలో యితరుల కొరకు ప్రార్థించుటను గూర్చి వ్రాశాను, మరియు ఈ విధమైన ప్రార్థన సంపూర్ణంగా విలువ కలిగినదనియు, ప్రభావ వంతమైనదనియు నేను వ్యక్తిగతంగా తెలుసుకున్నాను. మనుష్యులకు దేవుడు ప్రాధాన్యతనిస్తాడని తెలుసుకొనుట ముఖ్యమైనది, దానిని మనం తెలుసుకున్నప్పుడు వారు మనకు కూడా ప్రాధాన్యమవుతారు.

## మనుష్యుల యెడల మంచిగా వుండు

సామెతలు 21:13 "దరిద్రుల మొఱ్ఱ వినక చెవి మూసికొనువాడు తాను మొఱ్ఱపెట్టునపుడు అంగీకరింపబడడు" అని చెబుతుంది. దాని అర్థం ఏమిటంటే యితరుల అవసరతలను నేను పట్టించుకొనక వారికి ఏ సహాయము చేయకపోయినట్లయితే నా అవసరతలో సహాయము కొరకు నేను పిలుచునపుడు దేవుడు వినకుండా వుండవచ్చును.

మనుష్యులతో మంచిగా వుండుట అనేది సమాజంలో మన స్నేహితులకు మన కుటుంబానికి అతీతమైనది. మన స్వంత పట్టణాలలో చాలా భయంకరమైన విషయాలు జరుగుతుంటాయి. సెయింట్ లూయిస్‌లో గృహము లేని వారిలో అతి చిన్న వయస్కుడి వయస్సు 7 సంవత్సరాలని నేను చదవటం నాకు జ్ఞాపకముంది అది నాస్వంత పట్టణం. 20 సంవత్సరాల క్రితం ఆ విషయానికి నాస్పందన ఏమిటో మీకు తెలుసా? "యిది చాలా హృదయవిదారకమైనది" అని అనివుండేదానిని. యిప్పుడైతే అటువంటి వాటి యొక్క యథార్థతను నేనుగుర్తెరిగిన దాననై "ఈ విషయమై నేను ఏదో ఒకటి చేయబోతున్నాను" అంటాను. మనుష్యులు నాతో "అలా చేయటం నీకు సులువే జాయిస్ ఎందుకంటే నీకు చాలా పెద్దపరిచర్యవుంది, నీకు సహాయం చేసే వాళ్ళు అనేక మంది వున్నారు" అనవచ్చు. మా పరిచర్యవంటి సహాయాలు మీకు లేకపోవచ్చు అయితే నావలె మీరు కూడా ప్రార్థన చేయగలరు. యితరులకు సహాయం చేస్తూ వారి అవసరతలను తీర్చుటకు ప్రయత్నిస్తున్న పరిచర్యలకు కానుక యివ్వవచ్చు. మీరు వెళ్ళి కొంత సమయాన్ని స్వచ్ఛందంగా వారికి సహాయపడుటలో గడపవచ్చు. నిజంగా చేయదలుచుకుంటే మనందరము ఏదో ఒకటి చేయగలము.

మన చుట్టూవున్న కష్టపరిస్థితులలో మనము దయను లేక కనికరాన్ని చూపకపోవుట వలన ఇతరులతో సరిగా ప్రవర్తింపకపోవుట వలన మన ప్రార్థనలు అనేకం జవాబులు లేకుండా వుంటున్నాయని నేను నమ్ముతున్నాను. యెషయా 58:6-9 మనకు ఒక యథార్థ చిత్రాన్నిస్తుంది: "దుర్మార్గులు కట్టిన కట్లను విప్పుటయు, కాడిమాను మోకులు తీయుటయు, బాధింపబడినవారిని

మన చుట్టూవున్న కష్టపరిస్థితులలో మనము దయను లేక కనికరాన్ని చూపకపోవుట వలన యితరులతో సరిగా ప్రవర్తింపకపోవుట వలన మన ప్రార్థనలు అనేకం జవాబులు లేకుండా వుంటున్నాయని నేను నమ్ముతున్నాను.

విడిపించుటయు, ప్రతి కాడిని విరుగగొట్టుటయు, నేనేర్పరచుకొనిన ఉపవాసము గదా? నీ ఆహారము ఆకలిగొనినవారికి పెట్టుటయు నీ రక్తసంబంధికి ముఖము తప్పింపకుండుటయు, దిక్కుమాలిన బీదలను నీ ఇంట చేర్చుకొనుటయు, వస్త్రహీనుడు నీకు కనబడినప్పుడు వారికి వస్త్రములిచ్చుటయు, ఇదియే కదా నాకిష్టమైన ఉపవాసము? ఆలాగున నీవు చేసినయెడల నీ వెలుగు వేకువ చుక్కవలె ఉదయించును. స్వస్థత నీకు శీఘ్రముగా లభించును, నీ నీతి నీ ముందర నడచును, యెహోవా మహిమ నీ సైన్యపు వెనుకటి భాగమును కావలికాయును. అప్పుడు నీవు పిలువగా యెహోవా ఉత్తరమిచ్చును. నీవు మొఱ్ఱపెట్టగా ఆయన – నేనున్నాననును."

కేవలం బాగుగా ప్రవర్తించుట వలన నీవు గొప్ప కోతను పొందుకొనగలవు! నేనేమి చెప్తున్నాను? ఉదాహరణకు:

- అమర్యాదగా ప్రవర్తించవద్దు.
- పచారీ కొట్టు వరుసలో నీకు ముందుగా వేరొకరిని వెళ్ళనివ్వు.
- నీవు కోరుకున్న వాహనాలు నిలిపేస్థలంలో వేరొకరిని నిలుపనివ్వు.
- చిన్న చిన్న విషయాలను పెద్దవి చేయవద్దు.
- నీ జీవిత భాగస్వామి నీ మురికి సాక్సులు తీయమని చెప్పినప్పుడు లేక చెత్తపడవేయమని చెప్పినప్పుడు విసుక్కోవద్దు – ఆ పనులను ప్రశాంతంగా చేయండి.
- మీ బిడ్డలతో దయగా మాట్లాడండి.
- గుమస్తాలు, పనిచేసే వాళ్ళు, బ్యాంక్‌లో సలహాలిచ్చే వాళ్ళు మరియు మీకు సహాయపడే యితరులకు "వందనాలు చెప్పండి"
- నవ్వండి.
- కూర్చొనుటకు స్థలము లేనప్పుడు వృద్ధులకు మీ స్థలాన్ని ఇవ్వండి.

మనం యితరులతో బాగుగా ప్రవర్తించుట అనేది దేవునికి చాలా ప్రాముఖ్య మైనదైయున్నది. నీతో ఎవరైనా, ఎప్పుడైనా అమర్యాదగా ప్రవర్తించి వుంటే అది ఎంత బాధాకరమో నీకు అర్థమౌతుంది. యిప్పుడు నీవు అలా ఎవరైనా నీతో అమర్యాదగా ప్రవర్తిస్తున్న స్థితిలో వుండివుండవచ్చు, లేక ఎవరినైనా నీవు అమర్యాదగా చూస్తూవుండి వుండవచ్చు. నీ ప్రార్థనలు శక్తివంతంగా వుండాలంటే – నీ స్వరానికి దేవుడు స్పందించాలనుకుంటే – నీవు మనుష్యులతో చక్కగా ప్రవర్తిస్తూ వారి యెడల మంచిగా వుండాలి.

## క్షమించు

మనం శక్తివంతమైన ప్రార్థనలు ప్రార్థించవలెనంటే, దేవుని చేరునప్పుడు శుద్ధ హృదయాలు కలిగివుండాలి – మరియు ఆయన యెదుట శుద్ధిగా వుండుటకు ఒక కచ్చితమైన మార్గం,

> క్షమాపణ అనునది ప్రత్యక్షపరచబడిన దయ, క్రియారూపకమైన ప్రేమ

మనలను బాధపెట్టి, హింసించిన ప్రతి ఒక్కరినీ క్షమించుటయే. క్షమించుట సులభమైనది కాదు, అయితే, ప్రభావవంతమైన ప్రార్థనకు యిది ప్రాముఖ్యంగా కోరదగినది, మార్కు 11:25–26 నందు "మీకు ఒకని మీద విరోధమేమైనను కలిగియున్న యెడల, మీరు నిలువబడి ప్రార్థన చేయునపుడెల్లనూ వాని క్షమించుడి. అప్పుడు పరలోకమందున్న మీ తండ్రియు మీ పాపములు క్షమించును." అని యేసు సూచిస్తున్నాడు.

ఆయన శిష్యులు క్షమాపణను గురించిన ఆయన బోధనలను బాగుగా ఎరిగివున్నప్పటికీ, అది ఒక సవాలని వారు కనుగొన్నారు. ఒక దినం పేతురు ఆయనను "ప్రభువా, నా సహోదరుడు నా యెడల తప్పిదము చేసిన యెడల నేను ఎన్ని మారులు అతని క్షమింపవలెను? ఏడు మారుల మట్టుకా?" అని అడిగెను (మత్తయి 18:21). యేసు "కాదు, డెబ్బదియేండ్ల మారుల మట్టుకు" అని చెప్పాడు. ఏడు అను అంకె పరిపూర్ణతను లోపరాహిత్యాన్ని సూచిస్తుంది, కాబట్టి యేసు నిజానికి "క్షమిస్తూనేవుండు, క్షమిస్తూనేవుండు, అది పని చేయు వరకు క్షమిస్తూనేవుండు." అని చెప్తున్నాడు. మనం తప్పనిసరిగా క్షమించాలని మనకు తెలిసినప్పటికీ, అందులో మన ఉద్రేకాలు మిళితమైయుంటాయి గనుక మనలను బాధపరచిన వారిని క్షమించుట సులువైనది కాదు. క్షమించు క్రమంలో క్షమాపణ అనేది మనం అనుభవించు విషయం కాదు గానీ, మనం తీసుకునే నిర్ణయం అని గుర్తెరుగవలసివుంది. మనం సరైన నిర్ణయం తీసుకున్న ప్రతిసారి, మన భావాలు అనుసరిస్తాయి, అయితే అవి అనుసరించుటకు ముందు కొంత సమయాన్ని తీసుకుంటాయి.

మనం బాధపరచబడినప్పుడు, మనలను బాధపరచిన వ్యక్తులకు మన హృదయాన్ని మరలా తెరుచుట అనేది అసాధ్యమని భావిస్తాము. వారిని మన జీవితాలలో నుండి సాధ్యమైనంత దూరంగా వుంచాలని కోరుకుంటాము. ఇవి సహజమైన ప్రతిస్పందనలు, అయితే, ఇది దేవుని మార్గం కాదు. దేవుడు ప్రతిదినం మనలను క్షమిస్తున్నాడు మరియు మనం కూడా ఇతరులను క్షమించాలని ఎదురు చూస్తున్నాడు.

డేవ్ నా భావనలను లోతుగా బాధపెట్టిన సమయం నాకు జ్ఞాపకముంది, ఆ సమయంలో నేను అతనితో తిరిగి మాట్లాడుటకు నోరు తెరువలేకపోయాను. ఎప్పటిలాగానే, పరిశుద్ధాత్ముడు నా మనసులో దైవభక్తిని కలిగిన ప్రవర్తనను కలిగివుండమని తొందరపెట్టాడు. అయితే, అలా చేయుటకు నాకు శక్తి లేదు. మా ఇంట్లో నేనెప్పుడూ ప్రార్థనచేసే గదిలోనికి వెళ్ళి, దేవునితో "డేవ్ నా మనసుని బాధపెట్టలేదన్నట్లుగా అతనితో తిరిగి నేను మాట్లాడవలెనంటే నీ కృప కావాలి. లేక పోతే నేను ఈ పరిస్థితి నుండి బయటకు రాలేను. అతను నన్ను

ఉద్దేశపూర్వకముగా బాధపెట్టలేదని నాకు తెలుసు, కాబట్టి నేను దీనిని ఇక్కడే వదిలేయాలనుకుంటున్నాను" అని చెప్పాను.

నేను కేవలం ప్రార్థించలేదు, క్షమాపణను గురించి మరియు కోపంలో నిలిచియుంటే వచ్చే అపాయాలను గురించి వ్రాసిన అనేక వాక్య భాగాలను చదివాను. కొద్దిసేపటిలోనే, నా హృదయం దేవ్ విషయంలో మెత్తబడినది. నేను గది బయటకు వెళ్ళి అతనితో నా పూర్వపు సంబంధాన్ని పునరుద్ధరించుకోగలిగాను.

నీవు క్షమింపవలసివచ్చినప్పుడు ప్రార్థించమని ప్రోత్సాహపరుస్తున్నాను. క్షమించుటకు కేవలం "ప్రయత్నించ వద్దు" అయితే, జీవితంలో కష్టమైన విషయాలు చేయగలుగునట్లుగా కృపకొరకు దేవునిపై ఆధారపడండి. తరచుగా మనం దేవునిపై ఆధారపడకుండా, "ప్రయత్నిస్తుంటాం." మనం అలా చేసినప్పుడు, స్వంతంగా పని చేస్తున్నాము. "......నాకు వేరుగా వుండి మీరు ఏమియు చేయలేరు" (యోహాను 15:5) ను మనం కచ్చితంగా జ్ఞాపకం చేసుకోవాలి. ప్రార్థన అనునది దేవుడు పనిచేయునట్లుగా ద్వారాలు తెరుస్తుంది, కాబట్టి నీవు క్షమించవలసి వచ్చినపుడు, నీకు వచ్చిన కోపం నుండి విడుదల పొందే వరకు ప్రార్థించు, తరువాత దేవునికి లోబడు.

మనం క్షమించినపుడు క్రీస్తు స్వభావం కలిగివుంటున్నాము, మన దేవుడు క్షమించు దేవుడు గనుక – మనము దేవుని వలె క్రియచేస్తున్నాము. క్షమాపణ అనునది ప్రత్యక్షపరచబడిన దయ, క్రియారూపకమైన ప్రేమ – భావనలపై ఆధారపడిన ప్రేమ కాదు గానీ నిర్ణయంపై ఆధారపడిన ప్రేమ, దేవునికి లోబడాలని ఉద్దేశపూర్వకముగా ఎంచుకున్న ఎంపికయైవున్నది. నిజానికి, క్షమాపణ అనునది ప్రేమ యొక్క హెచ్చైన రూపము మరియు శక్తివంతమైన, ప్రభావవంతమైన ప్రార్థనలకు ప్రేమ చాలా ప్రాముఖ్యమైనదైయున్నది. అందువలన దానికి తరువాతి అధ్యాయాన్ని అప్పగించాను. క్షమాపణ మరియు ప్రేమ అనేవి ఒకదానితో ఒకటి కలిసివుండి, దేవునికి మహిమను, ఘనతను తీసికొని వస్తాయి, మనలను దేవునితో ఒప్పందంలో వుంచుతాయి, దేవుని వాక్యానికి లోబడునట్లుగా చేస్తాయి – అది మన ప్రార్థనలకు గొప్ప శక్తిని తీసికొని వస్తాయి.

## ఆశ కలిగియుండు

నా ప్రార్థనాజీవితంలో ఆశతో నిండివున్న సమయాలున్నాయి. నేను ప్రార్థించిన ప్రతిసారి, నేను అడిగినది దేవుడు ఖచ్చితంగా యిస్తాడని గొప్ప విశ్వాసంతో పూర్తి ఆశతో అడిగే దానను తరువాత ఏదో ఒక కారణం వలన, నా ప్రార్థనాజీవితంలో ఆ "కోణాన్ని" నేను కోల్పోయేదానను మరియు నా ఆశ భంగమైపోయేది. అయితే ఎక్కువ కాలం దేవుడు

నన్ను ఆ స్థితిలో వుంచలేదు. ఆయన నాతో పని చేయటం మొదలు పెట్టాడు, నా ఆశలలో బలం కలిగియుండి ప్రార్థనలో వాటిని వ్యక్తపరచమని నన్ను ప్రోత్సాహపరిచాడు. ఈ భూమి మీదను నాజీవితంలోను గొప్పవిషయాలు చేయునట్లుగా నన్ను ప్రోత్సాహపరిచాడు. మనుష్యులు ఏదైనా చూసి దానిని కోరుకున్నప్పుడు చేసే ప్రార్థనలను గురించి నేను చెప్పటం లేదు. దేవుడు ఇచ్చిన కోరికలు, దర్శనం, ఆశల గురించి–శుద్ధ హృదయంలోనుండి వచ్చు విశ్వాసపు ప్రార్థనలను గురించి నేను మాట్లాడుతున్నాను.

నా ఆశలలో ధృఢమైన ధోరణిని నేను అలవర్చుకున్న తరువాత, "దేవా, ఈ దినం నేను వెళ్లు ప్రతి ప్రదేశంలో మేలుకై ఎదురుచూస్తున్నాను. నీ వద్దనుండి, నేను కలిసికొను ప్రతి ఒక్కరి వద్దనుండి మేలును ఎదురుచూస్తున్నాను." అని దేవునితో మాట్లాడటం మొదలుపెట్టాను. మరియు నా ప్రార్థనలు "దేవా, ఈ దినం నేను మంచి వార్తకై ఎదురుచూస్తున్నాను. నీవు చేసే గొప్ప కార్యాలకు ఆశ్చర్యపోవుటకై ఎదురుచూస్తున్నాను." అని వుండేవి. ఆ దినాలలో ఎన్నో సమయాలు మా ఫోన్ గొప్ప విషయాలు వినిపించుటకై మ్రోగేది. కొన్ని సమయాలలో, కొందరు ఫోన్ చేసి "జాయిస్, నీకొక మంచి వార్త" అని చెప్పేవారు.

చాలా మంది వ్యక్తులు చెడు వార్తలకు చాలా భయపడుట వలన, మంచి వార్త కొరకు ప్రార్థించరు! అది దైవభక్తి కలిగిన ఆలోచనా ధోరణి కాదు. మన జీవితాలలో దేవుని శక్తి విడుదలగుట మనం చూడాలని అనుకున్నట్లయితే, దేవుని సంతోషపరచే ఆలోచనా ధోరణిని కలిగివుండ వలసియున్నది. ప్రతికూల భావనలకు బదులుగా, అనుకూల భావనలు కలిగివుండాలి. విశ్వాసం లేకుండా దేవునికి ఇష్టులైవుండుట అసాధ్యమని (హెబ్రీ 11:6), ఈ నిరీక్షణ మనలను సిగ్గుపరచదని (రోమా 5:5) బైబుల్ చెప్తుంది గనుక, మనం జీవితాన్ని విశ్వాసం, నిరీక్షణకు మరియు మంచి ఆశలు కలిగివుండి జీవించాలి. దేవునిలో ప్రతికూలమైనదేదీ లేదు ఆయనలో గానీ, ఆయన క్రియలలో గానీ, ఏదీ మనలను నిరుత్సాహపరచదు ఆయన చేయు ప్రతి కార్యము మన మేలు కొరకైనది – కాబట్టి మనం ప్రార్థించునప్పుడు, దానికై ఎదురుచూడవలసియున్నది. మనం ప్రార్థించిన తరువాత, దేవుడు ఏమైనా చేస్తాడా అని ఆలోచించకూడదు. మనం అడిగినవాటికంటే, ఎక్కువగా దేవుడు చేస్తాడను ఆశతో ప్రార్థించవలసియున్నది.

> మన జీవితాలలో దేవుని శక్తి విడుదలగుట మనం చూడాలని అనుకున్నట్లయితే, దేవుని సంతోషపరచే ఆలోచనా ధోరణిని కలిగివుండ వలసియున్నది.

దేవుని నుంచి గొప్ప విషయాలను ఆశించమని మిమ్ములను నమ్మకంతో ప్రోత్సాహపరుస్తున్నాను. అనేక

మంది ఈ విషయంలో “మనము అడుగు వాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి” అను ఎఫెసీ 3:20 ను ఎత్తి చూపుతారు, అయితే, ఆంగ్లంలోని మరియొక అనువాదంలో ఈ వాక్యం ఈ విధంగా చెప్పబడింది: “మనం (ధైర్యంగా) అడుగు వాటన్నిటి కంటెను, ఊహించువాటన్నిటికంటెను (మన హెచ్చైన ప్రార్థనలు, కోరికలు, తలంపులు, ఆశలు మరియు కలలకు అతీతంగా), అత్యధికముగా, అత్యంత సమృద్ధిగా చేయ శక్తిగల దేవునికి.” గమనించారా? మనం మన హెచ్చైన ప్రార్థనలు, కోరికలు, తలంపులు, ఆశలు మరియు కలలకు అతీతంగా ధైర్యంగా అడిగినప్పటికీ, అడగాలని ఊహించినప్పటికీ ఆయన అత్యధికముగా, అత్యంత సమృద్ధిగా చేయ శక్తిగల దేవుడైయున్నాడు. అది ఆశ్చర్యకరమైనది మరియు దాని ద్వారా మనకు ఆశకలిగి అడుగు నమ్మకం వస్తుంది. వ్యక్తిగతంగా విశ్వాసంలేని చిన్న ప్రార్థనలు చేయటం కంటే విశ్వాసంతో గొప్ప ప్రార్థనలు చేసి వాటిలో సగాన్నైనా పొందుకొనుట నాకు మంచిది!

ఎఫెసీ 3:20 ను మరొక ప్రాముఖ్యమైన భాగాన్ని యిక్కడ చూడవలసివున్నది. కొన్ని అనువాదాలు దీనిని దేవుడు చేయు కార్యాలకు ముందు పెట్టాయి, కొన్ని ఆ కార్యాలు వ్రాసిన తరువాత ఈ భాగాన్ని పెట్టాయి. ఏదేమైనప్పటికీ యిది ప్రాముఖ్యమైనది, అది ఈ విధంగా చెబుతుంది “మనలో కార్యసాధకమైన తన శక్తిచొప్పున” అని చెబుతుంది. బైబిల్‌లో “మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగు వాటన్నిటి కంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయశక్తిగల దేవునికి.” అని వ్రాయబడియున్నది. మనలో పనిచేసే శక్తి ఏమిటి? అది దేవుని శక్తి, మరియు సులభమైన, నమ్మకమైన ప్రార్థన ద్వారా అది కలుగుతుంది.

మనం శక్తిని కలిగివున్నప్పుడు నిరీక్షణ కలిగిన ప్రార్థనలు చేయగలం, అయితే సమయంలో నిరీక్షణ తన స్వంత శక్తిని తెస్తుంది–నిరీక్షణాశక్తి, విశ్వాసపుశక్తి. విశ్వాసము దేవుని సంతోషపరుస్తుంది గనుక విశ్వాసముతో, ఆయనను నమ్ముతూ చేసే ప్రార్థన దేవుని శక్తిని విడుదల చేస్తుంది. ఆశ కలిగివుండుట అనేది విశ్వాసము యొక్క ఒక లక్షణమైవున్నది. విశ్వాసము అనునది ఆత్మీయ ప్రదేశాన్ని చేరి ఈ భూమిపై ఏ వ్యక్తి చేయని విధంగా దేవుని అసామాన్యమైన శక్తి చేయునట్లు చేస్తుంది. మరొక విధంగా, అనుమానం, ఏమేలు జరగదని భయపెడుతుంది అది దేవుని సంతోషపరచదు ఏ ఆశీర్వాదాలను తేదు. అనుమానంతో, నిరుత్సాహంతో, దేవునిపై అపనమ్మకంతో జీవించినపుడు మనం శక్తి హీనులమవుతాము.

దేవుడు నీ కొరకు ఏమైనా చేస్తాడని నీవు అనుకొనని ఒక సమయాన్ని గురించి ఆలోచించు నీవు శక్తివంతములైన ప్రార్థనలు చేయలేకపోయావు. యిప్పుడు నీ మనసు దేవునిపై పూర్తిగా విశ్వాసముంచిన సమయాన్ని గురించి ఆలోచించు నీవు చాలా శక్తితో ప్రార్థించావు అవునా? అదే ప్రార్థనలోని ఆశ యొక్క శక్తి నీవు ఊహించినట్లుగా పరిస్థితులు జరుగకపోయినప్పటికీ ఉత్తమమైనవి తెలుసుకొనునట్లుగా దేవుని నమ్ము మరియు గొప్ప విషయాలు చేస్తాడని ఆశపడుతూనే వుండు.

## సారాంశము

మన ప్రార్థనలు శక్తివంతంగానూ ప్రభావవంతంగానూ వుండాలని మనం కోరుకుంటాం. మనం ప్రార్థించునపుడు, ఒకరి జీవితంలో లేక ఒక పరిస్థితిలో వైవిధ్యాన్ని కలుగజేయటంలో మనము దేవునితో భాగస్వాములుగా వున్నామని తెలుసుకొనుటకు యిష్టపడతాము. విజయవంతంగా ప్రార్థించే క్రమంలో, ప్రభావవంతమైన ప్రార్థనకు తాళం చెవులు మనం తెలుసుకొనవలసివున్నది, అవి: దేవునికి లోబడుట, అనుగుణ్యంగా మరియు రాజీపడకుండా నీతికలిగివుండుట, పట్టుదల కలిగివుండుట, మనపై అధికారులుగా వున్నవారికి సరిగా లోబడి వుండుట, మనకొరకు ప్రార్థించుకొనుట కంటే ఇతరుల కొరకు ప్రార్థించుట, ఇతరుల పట్ల మంచిగా ప్రవర్తించుట, మనం క్షమించబడినట్లుగా ఇతరులను క్షమించుట, మరియు ఆశకలిగియుండి ప్రార్థించుట. మన ప్రార్థనా జీవితాలలోను, మన క్రియలలోను ఈ ధోరణిని అన్వయించుకొనుటకు మనం ప్రయత్నించుచుండగా, ప్రభావవంతమైన, జవాబులు పొందిన ప్రార్థనలను మనం అనుభవించి, ఆనందిస్తాము.

### ప్రార్థనాంశములు

- దేవునికి లోబడు. విధేయత దేవుని యెడల మన ప్రేమను వ్యక్తపరుస్తుంది మరియు ప్రభావవంతమైన ప్రార్థనకు ప్రాముఖ్యమైన స్థితియైయున్నది.
- రాజీపడుటకు ఒప్పుకొనని, అనుగుణ్యమైన నీతిని కలిగియుండు. అనుగుణ్యమైన నీతి కలిగివున్నవారి ప్రార్థనలు దేవుడు ఆలకిస్తాడు మరియు రాజీపడని నీతిమంతుని అద్భుతకరంగా ఆశీర్వదిస్తాడు.
- ప్రార్థిస్తూనేవుండు, ఆత్మ నిర్దేశకత్వంలో పట్టుదలతో ప్రార్థించు, మరియు జవాబు వచ్చువరకు వదలిపెట్టక ప్రార్థించు.
- అధికారానికి సరిగా స్పందించు. ఆత్మీయ అధికారమునకు, సహజ అధికారమునకు లోబడు హృదయము దేవునికి కూడా లోబడుతుంది.
- ఇతరులపై దృష్టిని కేంద్రీకరించు. స్వార్థం మన ప్రార్థనలను ఆటంకపరచవచ్చును, అయితే ఇతరులపై దృష్టిని కేంద్రీకరించుట అనునది విజయవంతమైన ప్రార్థనలు ప్రార్థించునట్లుగా చేస్తుంది.
- మనుష్యుల యెడల మంచిగా ప్రవర్తించు. మనుష్యులతో ప్రవర్తించుట అనునది దేవునికి ప్రాముఖ్యమైనదైయున్నది, మరియు అది వాక్యానికి లోబడునట్లు చేస్తుంది.

- క్షమించు. క్షమాపణ అనునది ప్రేమ యొక్క హెచ్చైన రూపమైయున్నది. మరియు మార్కు 11:25 ననుసరించి, మన ప్రార్ధనలు దేవుడు వినుటకు అది ప్రథమ అవసరతయైయున్నది.
- ఆశ కలిగియుండు. ఆశ అనునది శక్తివంతమైన ఆత్మీయ బలం. ఆశ కలిగిన ప్రార్థనలకు జవాబిచ్చుటకు దేవుడు ఇష్టపడుతాడు.

# 11

# అన్నిటికంటే ఉన్నతంగా

ఇంతకు ముందు అధ్యాయంలో, ప్రభావవంతమైన ప్రార్ధనకు అనేక తాళపుచెవులు చూశాము, ఈ అధ్యాయంలో అన్నిటికంటే మిన్నయైనది, అన్నిటినీ కలిగివున్నదీయైన ఒక తాళపుచెవిని గురించి చెప్పదలచుకున్నాను. మనం ప్రార్ధనా నియమమని తలంచిన ప్రతి నియమాన్ని అన్వయించుకొనవచ్చును మరియు ప్రతి ప్రార్ధనా స్థితిని చేరవచ్చును, అయితే, దీనిని మనం పొందుకొనలేకపోయినట్లయితే, మన ప్రార్ధనలు – పరలోకపు పైకప్పుకు గణగణలాడుతూ కొట్టుకుంటున్న గంటవలె వుంటాయి. జవాబు కలిగిన ప్రార్ధనకు యింత ప్రాముఖ్యమైన తాళపుచెవి ఏమిటి? ప్రేమలో నడచుట.

యేసు “మీరు ఒకరినొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞ యిచ్చుచున్నాను నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరినొకరు ప్రేమింపవలెను” (యోహాను 13:34) అని చెప్పుట ద్వారా ప్రేమకు తాను అత్యంత ప్రాధాన్యతనిస్తానని తేటగా చెప్పినాడు. అపొస్తలుడైన పౌలు “ప్రేమ అనేక పాపములను కప్పును గనుక అన్నిటికంటె ముఖ్యముగా ఒకనియెడల ఒకడు మిక్కటమైన ప్రేమగలవారై యుండుడి” (1 పేతురు 4:8) అని వ్రాస్తున్నాడు. మరొక మాటలో, అన్నిటికంటే ఎక్కువగా యితరుల యెడల ఔదార్యమైన, శుద్ధమైన, మిక్కుటమైన ప్రేమను కలిగివుండాలి. దేవుని ఎరుగకుండా, ఆయనను ప్రేమించకుండా, ఆయన మనలను ప్రేమిస్తున్నాడని తెలిసికొనకుండా యితరులను నిజముగా ప్రేమించటం అసాధ్యం. ఆయనను ప్రేమిస్తూ, ఆయన ప్రేమను పొందుకుంటూ, ఆ ప్రేమను యితరులకు వ్యాపింపజేయుటలో మన ప్రార్ధనలు గొప్పగాను, శ్రేష్ఠమైనవిగాను, ప్రభావవంతమైనవిగాను మరియు బహుమతి నొందదగినవిగాను వుండుటను మనము గమనిస్తాము.

## ప్రేమ ద్వారా విశ్వాసం పనిచేస్తుంది

ఆత్మీయ పరిణితికి విశ్వాసం ప్రాథమిక సూచనయని అనేకులు తలంచుతారు. అయితే, ఆత్మీయ పరిణితికి ప్రేమలో నడచుట అనునది యథార్థమైన పరీక్ష అని, మరియు ప్రభావ వంతమైన ప్రార్థనా జీవితానికి ఇది ఆవశ్యకమనియు నేను నమ్ముతాను. ప్రేమలో మన నడక అనునది మన విశ్వాసపు నడకను బలపరుస్తుంది, మరియు ఎప్పుడైతే ప్రేమ, విశ్వాసం అను ఆత్మీయ బలాలు రెండూ కలిసి నడుస్తాయో, అప్పుడు మన ప్రార్థనలు అద్భుతమైన ఫలితాలనిస్తాయి.

దేవునిలో విశ్వాసం లేకుండా మనం ప్రభావవంతమైన ప్రార్థనలు ప్రార్థించలేము, అయితే, మన విశ్వాసాన్ని, ప్రేమ వివరిస్తుంది మరియు వ్యక్తపరుస్తుంది. మనం ఆయనను ప్రేమించినట్లయితే, ఆయనయందు విశ్వాసముంచుతాము. ప్రేమ ద్వారా విశ్వాసం పనిచేస్తుందని బైబిల్ చెప్తుంది. గలతీ 5:6 "ప్రేమ వలన కార్యసాధకమగు విశ్వాసమే ప్రయోజనకరమగును" అని చెప్తుంది. ప్రేమ అనునది ఒక మాట లేక సిద్ధాంతము కాదు ఇది క్రియ. నిజానికి, తన సహోదరునికి లేమి కలుగుట చూచియు, అతనియెడల ఎంతమాత్రమును కనికరము చూపనివానియందు దేవుని ప్రేమ యేలాగు నిలుచును అని బైబిల్ చెప్తుంది (1 యోహాను 3:17).

యేసు "*నీ పూర్ణ హృదయముతోను నీ పూర్ణాత్మ తోను నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింప వలెననునదియే.* ఇది ముఖ్యమైనదియు మొదటి దియునైన ఆజ్ఞ. *నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను* రెండవ ఆజ్ఞయు దానివంటిదే. ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమై యున్నవి" అని చెప్పినపుడు ధర్మశాస్త్రమంతయు, ప్రవక్తలును ప్రేమలో నిక్షిప్తమైయున్నారని చెప్తున్నాడు (మత్తయి 22:37-40). ఏ ఆజ్ఞ ముఖ్యమైనదని అడిగిన వారికి సమాధానంగా యేసు దీనిని చెప్తున్నాడు. వారు ఆయనను "మాకు క్లుప్తంగా చెప్పు" అని అడిగినపుడు, దానికి జవాబుగా ఆయన "సరే, మీకు క్లుప్తంగా కావాలా? మీరు ధర్మశాస్త్రమంతటికి, ప్రవక్తలకు పూర్తిగా లోబడాలనుకుంటున్నారా? అయితే నన్ను, మనుష్యులను ప్రేమించండి" అని చెప్పాడు. అంటే అది అంత సులభం. ప్రేమలో నిలచివుండుట అనేది విశ్వాసపు జీవితాన్ని జీవించుటకు గుండె వంటిదని యేసు ప్రజలకు చెప్పాడు. ప్రేమ లేకుండా విశ్వాసములో నడుచుట అనేది నూనె లేని దీపము వంటిది మన ప్రేమ నూనె ఎల్లప్పుడూ నిండుగా వుండునట్లు చూసుకొనవలసివున్నది. లేకపోయినట్లయితే మన విశ్వాసము పని చేయదు!

దేవునితో సంబంధానికి, మన విశ్వాసానికి ఆవశ్యక భాగంగా ప్రేమలో నిలిచివుండుటను శ్రద్ధగా ఆచరింపకపోవుటవలన క్రైస్తవులు సమస్యలలోనికి పరుగులెడుతున్నారని నేను అనుకుంటాను. మనం ఆశీర్వదింపబడాలని ఆశిస్తాము స్వస్థతనొందాలని కోరుకొంటాము

> ప్రేమ లేకుండా విశ్వాసములో నడుచుట అనేది నూనె లేని దీపము వంటిది.

మన పరిచర్యలు విజయవంతం కావాలని యిష్టపడతాము, అయితే ఆత్మ ఫలాలను, ప్రేమలో నిలిచియుండుటను వెదకి వెంబడించము. విశ్వాసుల హృదయాలలో ప్రేమ చల్లారిపోవుట అనే బలమైన దుర్గాలను కట్టుటకు సాతానుడు వెదకుచున్నాడు ఇతర మనుష్యుల అవసరతలను పట్టించుకోని, అనుభవించని, తెలిసికోలేని రాతి హృదయాలు మనము కలిగివుండాలని వాడు ఆశ పడుతున్నాడు. యితరుల కొరకు ఏమైనా చేయాలని కాకుండా, స్వార్థపూరితులమై ఎవరైనా మనకేమైనా చేస్తారేమో అని చూసేవారిగా మనము ఉండాలని వాడు కోరుకుంటున్నాడు. ప్రేమ ద్వారా విశ్వాసం పని చేస్తుందని ప్రేమ లేకుండా విశ్వాసం వ్యర్థం అని వాడికి తెలుసు. మనము కూడా అది తెలుసుకొనిన వారమై విశ్వాసములో మన ఆత్మీయ జీవితాల ఇతర విషయాలలో బలమైన ప్రేమ సంబంధాన్ని వృద్ధి పొందించుటకు చూడవలసివున్నది.

## ప్రేమ అంటే ఏమిటి

ప్రేమ ద్వారా పనిచేసే విశ్వాసమును కలిగివుండుట అంటే అర్థమేమిటి? అంటే, ప్రేమ పొందుటకు అర్హతలేనివారిగా కనిపించే వారిని మనం ప్రేమించాలి. అంటే, ఎవరి విషయంలోనైనా కోపంగా వుండుట న్యాయమే అని మనకు అనిపించినప్పటికీ వారిని క్షమించుట. మనయెడల ఇతరులు చేసిన దానిని మాటలాడుట మనకు యిష్టంగా వున్నప్పటికీ "ప్రేమ అనేక దోషములను కప్పును" అని బైబుల్ చెప్పుచున్నది గనుక వారి పాపాలను కప్పుటకు మనం ప్రయత్నించాలి (1 పేతురు 4:8).

ప్రేమ అంటే మనుష్యులకు హద్దులేకుండా మరలా ఆశించకుండా ఇచ్చుట. వారికి మనము ఇచ్చినప్పుడు మనకు అప్పు వున్నారని తలంచకుండా వుండాలి. మనం ప్రేమలో నిలిచియున్నాము గనుక యిచ్చియున్నాము - మనుష్యులు ఎవరినైనా నిజంగా ప్రేమిస్తే అలాగే యిస్తాము. ప్రేమలో నిలిచియుండుట అనగా దేవుని వంటి హృదయాన్ని ఔదార్యముగల, కృపగల, దయగల, క్షమించు, కనికరము కలిగిన, ఎల్లప్పుడూ ఉత్తమమైన దానిని నమ్ము, ఎల్లప్పుడూ ప్రోత్సాహకరంగా వుండు, ఎల్లప్పుడూ సహాయకరంగా వుండు, ఎన్నటికీ విడిచిపెట్టని హృదయాన్ని కలిగివుండుటకు మొదలు పెట్టుట.

వివాహాలలో తరచుగా మొదటి కొరింథీయులకు 13వ అధ్యాయం చదవబడుతుంది, ఎందుకనగా అది నిజమైన ప్రేమను చక్కగా వివరిస్తుంది. ఇది భార్యలకు, భర్తలకు

అన్వయించబడుతుంది అయితే ప్రతి విధమైన సంబంధంలో– రక్తసంబంధాలలో లేక ఉమ్మడి కుటుంబాలలో, సంఘస్తులతో, స్నేహితులతో మరియు సన్నిహితులతో, తోటి పని వారితో మరియు మనకు తెలియని వారితో ప్రేమలో నిలిచియుండాలనే ప్రతిఒక్కరికీ అన్వయించబడుతుంది. మనము ఎక్కడకు వెళ్ళినప్పటికీ ఏమి చేస్తున్నప్పటికీ – పచారికొట్టులో సామానులు తీసుకొన్నప్పుడు, బ్యాంక్‌కు వెళ్ళినప్పుడు, పనిలో ఏవైనా క్రీడలను చూచినప్పుడు, బిడ్డలను నిద్రపుచ్చుతున్నప్పుడు మరియు నిద్ర లేపుతున్నప్పుడు, ఎల్లప్పుడూ ప్రేమింపవలసివున్నది.

ప్రేమ ఓర్పు కలిగినదని మొదటి కొరింథీయులకు 13వ అధ్యాయం చెప్తుంది. ప్రేమ కలిగియున్న వ్యక్తి త్వరగా, సులువుగా కోపపడడు. ప్రేమ దయ కలిగినది, అంటే ప్రేమలో నిలిచియుండు వ్యక్తి మనుష్యుల యెడల మంచిగా వుంటాడు ఆ వ్యక్తి ఆలోచిస్తూ, మృదువుగా, మరియు ఇచ్చువాడుగా వుంటాడు. ప్రేమ దీర్ఘశాంతము కలిగినది మరొక మాటలో చెప్పవలెనంటే, అది సహిస్తుంది, సహిస్తుంది మరియు సహిస్తుంది, నిజమైన ప్రేమ అలసిపోవుట అసాధ్యం. ప్రేమ హానిచేయదు. ప్రేమలో నిలిచియుండు వ్యక్తి ముంగోపియై, పరిస్థితులకు త్వరగా ఓర్పుకోల్పోడు. ఆ వ్యక్తి ద్వేషం వుంచుకొనడు లేక ప్రతీకారం చేయదలచుకొనడు ప్రేమ క్షమిస్తుంది మరియు కోపాన్ని మరచి పోతుంది. మనుష్యులలో ఉత్తమమైన దానిని ప్రేమ ఎల్లప్పుడూ నమ్ముతుంది అది వ్యతిరేకభావనలు కలిగి, *నీవు నన్ను ఇష్టపడుట లేదు, అందుకే నేను లోపలకు వచ్చినపుడు నాతో మాట్లాడలేదు, నేనంటే నీకు నిజంగా ఇష్టం లేదని నాకు తెలుసు!* అని ఆలోచించదు. ప్రేమ అమర్యాదగా ప్రవర్తించదు. ప్రేమలో నిలిచియున్న వ్యక్తి, ప్రేమ గురించిన పుస్తకం కొనుటకు వరుసలో నిలిచియున్న యితరులను నెట్టివేయడు! ప్రేమ ఇతరులకు ప్రాధాన్యతనిస్తుంది. పచారీ కొట్టులో రెండు బుట్టల నిండుగా వస్తువులు కలిగివున్న వ్యక్తి వరుసలో వున్నప్పుడు, అతని ముందు రెండు వస్తువులు కలిగిన వ్యక్తి వుంటే, అతను వెనుకకు వచ్చి యితనిని ముందు పోనిచ్చేట్లుగా ప్రేమ చేస్తుంది. ఒక వ్యక్తి వాహనాలు నిలుపు స్థలములో ఐదు నిమిషాలనుంచి నిలిచివుండగా, స్థలం ఖాళీ అయినపుడు, ఒక వృద్ధుడు కారులో వస్తే, ప్రేమ అతనికి ఆ స్థలం ఇచ్చునట్లుగా చేస్తుంది.

ప్రేమ త్యాగం చేస్తుంది ప్రేమ అవసరతలను తీర్చుతుంది ప్రేమ ఇస్తుంది మరియు ఇస్తుంది, ఇస్తుంది, ఇస్తుంది, ఇస్తుంది. నిజమైన ప్రేమ ఇచ్చుటలోనే బయటపడదు, అది ఎల్లప్పుడూ వ్యక్తపరచుటకు అవకాశముల కొరకు ఎదురుచూస్తుంది. ప్రేమ క్షేమాభివృద్ధి కలుగజేస్తుంది. అది కడుతుంది, పడద్రోయదు. ప్రేమ ప్రోత్సాహపరుస్తుంది. ప్రేమ వింటుంది. మనుష్యులతో మనం ప్రవర్తించే విధానంలో ప్రేమ కనిపిస్తుంది లేక కనిపించదు. ప్రేమ రాజ్య నియమమును, దేవుని లక్షణమునైయున్నది. ఇది దేవునిలో మన విశ్వాసానికి వివరణను, ప్రభావవంతమైన ప్రార్థనకు రహస్యమైయున్నది.

## ఏది ప్రేమ కాదు

ఇప్పుడు మీరు ప్రేమ ఏమిటో చూచుటకు మొదలుపెట్టారు, నన్ను ప్రేమ ఏది కాదో కూడా వివరించనీయండి. ప్రేమలో నిలిచియుండుట అంటే నీవు ప్రతి ఒక్కరికీ కాళ్ళ క్రింది మెత్తలా అయ్యి, మనుష్యులు నిన్ను బాధపెట్టుటకు, వాడుకొనుటకు ఒప్పుకొనుట కాదు. అది ఎవరికీ మంచిది కాదు. ఒక వ్యక్తి నీతో సరిగా ప్రవర్తించకపోవుట అనునది నిన్ను బాధపెట్టుట కంటే వారిని ఎక్కువగా బాధపెడుతున్నట్లు నీకు తెలిసినట్లయితే, ప్రేమ ఒక సంబంధాన్ని త్రుంచునంత ధృఢమైనది. ప్రేమలో నడచుట అనగా నీకు యిష్టంలేని వ్యక్తితో కలసి నడచుట. నీ సంబంధాలలో దేవుని జ్ఞానాన్ని అన్వయించుకుంటూ వుండగా యితరులకై దేవుని హృదయాన్ని కలిగివుండుటకు వెదకుటయే దీని యొక్క అర్థము.

యథార్థముగా ఉండు క్రమంలో ప్రేమ ధృఢంగా వుండవలసి వున్నది మరియు ప్రేమలో యిచ్చు విషయంలో మనం సమతుల్యతను పాటించవలసియున్నది. తన భాగాన్ని చేయని వ్యక్తికి మనం యిస్తూనే వుండకూడదు. తాము సమర్థులముగా ఉన్నప్పటికీ పనిచేయని వ్యక్తులకు మరియు తమ జీవితాలకు బాధ్యత తీసికొనని వారికి యిచ్చుట జ్ఞానమని అనిపించుకొనదు. ఒక యింటిలో ఎదిగిన బిడ్డ వుండి, ఆ బిడ్డ పనిచేయుటకు నిరాకరించి, మిగిలిన వారి సంపాదన పై ఆధార పడుతున్నట్లయితే, తల్లిదండ్రుల వద్దనుండి నిజమైన ప్రేమ అనునది వారిని ఆ విధంగా వదలివేయదు. ఆ కుటుంబం చేయదగిన మంచి పని ఏమిటంటే, ఆమె లేక అతను పనిచేస్తూ, బాధ్యత కలిగివుండగలిగిన స్థానంలో వారిని వుంచుటయే.

నేను ఎవరికైనా కొన్ని సంవత్సరాలు సహాయం చేయాలని ప్రయత్నిస్తున్నపుడు, వారు మార్పు చెందు తలంపు లేక నా సహాయాన్ని ఉపయోగపరచుకొననట్లయితే, వారు నన్ను, నా సహాయాన్ని కేవలం వాడుకుంటున్నారని నేను నిర్ణయించుకున్నాను. ప్రతి ఒక్కరికీ ఒక అవకాశం అవసరం, దానిని ఇచ్చుట ద్వారా మనం దేవునిచే వాడబడుతాము, అయితే, వారు ఇంకనూ ఒక ఎంపిక చేసుకొనవలసి వున్నది. తమ గందరగోళ పరిస్థితినుండి బయటపడగలిగిన అవకాశం ఇవ్వబడికూడా, అందులోనే వున్నవారిని వదలి, నిజంగా ప్రయోజనకరం కాగలిగిన వేరొకరికి సహాయం చేయుట మంచిది.

> ప్రేమలో నిలిచియుండుట అంటే నీవు ప్రతి ఒక్కరికీ కాళ్ళ క్రింది మెత్తలా అయ్యి, మనుష్యులు నిన్ను బాధపెట్టుటకు, వాడుకొనుటకు ఒప్పుకొనుట కాదు.

మనుష్యులు మనలను ఉపయోగించుకొనునట్లుగా ఒప్పుకొనుట వారికి సహాయం చేయదు, అయితే బాధ్యత కలిగి యుండుట వారికి సహాయం

చేస్తుంది. సామెతలు 1:3 నందు బైబిల్ "నీతి న్యాయ యథార్థతల ననుసరించుటయందు బుద్ధి కుశలత ఇచ్చు ఉపదేశము నొందుటకును" అని చెప్పుచున్నది. అది జ్ఞానము కలిగినది కానపుడు, ఒకరికి ఏమైనా ఇచ్చుట అనునది వారికి ఉత్తమమైనది కాని సమయం కూడా వస్తుంది. నేను ప్రేమించి, శ్రద్ధ వహించే మనిషి యొక్క అవసరత తీర్చకుండుట కొన్ని సమయాలలో నాకు చాలా కష్టంగా వుంటుంది. అది లేకుండా వారిని చేయుట కంటే అది వారికి యిచ్చుటయే నాకు సులువుగా వుంటుంది. అయితే, దేవుని వంటి ప్రేమ ఉద్రేకంగా కదలదు అది జ్ఞానాన్ననుసరిస్తుంది.

## అది లేకుండా మనం నిష్ప్రయోజకులం

మనుష్యులను దేవుని చిత్తప్రకారమైన విధంగా ప్రేమింప శక్తిగలవారమగునట్లుగా మన ప్రేమ నడత అభివృద్ధి పొందుటకు, పరిణితి పొందుటకు, దేవుని ప్రార్థించి ఆయన సహాయం అడుగవలసి యున్నది. నేను ప్రేమలో నడువకపోయినట్లయితే నా జీవితం, నా పరిచర్యలో ఏ శక్తి వుండదన్న సత్యాన్ని చివరకు నేను పొందుకొనుట వలన కొన్ని సంవత్సరముల నుంచి ప్రేమను గురించి ధ్యానిస్తున్నాను. నేను ఎక్కువ సమయం స్టేజీల మీద మైకులతో, కెమెరాల ముందు గడపవలసివస్తుంది. కానీ, ముఖ్యమైన విషయం ఏమిటంటే స్టేజీ క్రింద మైకులు కెమేరాలు లేకుండా నేను ఎలా జీవిస్తాను అన్నదే. నేను కనిపించే, బహిరంగ ప్రదేశాలలో వున్నప్పుడు ఏం జరుగుతుంది అన్నదానిని అదే నిర్ణయిస్తుంది. నేను ప్రజలతో మాట్లాడేటప్పుడు నేను డ్రామా వేయటం లేదు కానీ, వారు అయోమయ పరిస్థితిలో వుంటే వారి జీవితాలు సరిచేసుకొనుటకు సహాయపడాలనుకుంటాను మరియు దేవునితో పరిణితి చెందిన సంబంధాన్ని వృద్ధిపొందించుకొనుటకు ప్రోత్సాహ పరచాలనుకుంటాను. మనం బహిరంగంగా వున్నప్పుడు మనుష్యులను ప్రేమిస్తున్నట్లుగా నటించి మూసిన తలుపుల వెనుక వారితో సరిగా ప్రవర్తించకపోయినట్లయితే, మనము గణగణలాడు కంచు, వ్యర్థులమును, చనిపోయిన వ్యక్తి ఎముకలున్న సున్నము వేసిన సమాధిని పోలియున్నాము (1 కొరింథీ 13:1,2 ; మత్తయి 23:27).

నా జీవితంపై దేవుని అభిషేకము తప్ప మనుష్యులకిచ్చుటకు నా వద్ద ఏమి లేదు. మనుష్యులను ఆకట్టుకునే విధంగా నేను పాడలేను లేక యితరమైనవి చేయలేను. నేను కేవలం జయజీవితం జీవించుటకు, దేవునికి లోబడి జీవించుటకు– వాక్యసత్యాన్ని–వున్నరీతిలో చెబుతాను. తమ జీవితాలను మరింత ఆనందించునట్లుగా ఎలా మారవలెనో చెబుతాను మరియు ఆత్మీయంగా ఎలా ఎదగవలెనో చెబుతాను. తమ దైనందిన జీవితాలలో ఉపయోగపడునట్లు దేవుని వాక్యాన్ని భోధిస్తాను. దేవుని దయ వలన ఈ పరిచర్య ప్రపంచంలోని కొన్ని లక్షలమందిని చేరుతుంది, అయితే ఆయన నన్ను పిలిచినది చేయు క్రమంలో నేను

దేవుని అభిషేకాన్ని కలిగివుండవలసివున్నది – లేని యెడల నా పని అయిపోతుంది. నేను ప్రేమలో నిలిచివుండనట్లయితే దేవుని అభిషేకాన్ని కలిగివుండలేనని తెలుసుకొన్నాను, ఎందుకంటే దేవుడు శరీరాన్ని (మన స్వంత కోరికలు మరియు స్వార్థపూరితమైన తలంపులు లేక ప్రవర్తనలు) అభిషేకించడు.

పాత నిబంధనలో యాజకులపై అభిషేకపు నూనె పోయబడినప్పుడు అది వారి శరీరాలపై పోయబడలేదు – వారి తలలపైన మాత్రమే పోయబడింది. దేవుడు శరీర సంబంధమైన ప్రవర్తనను అభిషేకించడు. ప్రేమలో నిలిచియుండుట అనేది మన జీవితాలలో అభిషేకాన్ని వృద్ధిపొందించుటకు తోడ్పడుతుంది. మరియు ఆ అభిషేకము దేవుడు మనల్ని పిలిచిన పిలుపును చేయుటకు సమర్థులుగా చేస్తుంది. మరియొక సారి, దేవుని సన్నిధి మరియు శక్తియే ఆయన అభిషేకము మరియు మనము ఎన్నడూ చేయలేని దానిని మన స్వంత శ్రమలేకుండా సులువుగా చేయునట్లుగా అది చేస్తుంది. మనందరికీ దేవుని అభిషేకము అవసరమైయున్నది. దేవుని అభిషేకము పొందుటకు ఏదో ఒక "ఆత్మీయ" శక్తి పనిచేస్తూ వుండనవసరం లేదు. లోకంలో జీవించుటకు మంచి స్నేహితులుగా వుండుటకు, ఉద్యోగంలో, అక్షరాల ప్రతి విషయంలో దేవుని అభిషేకము అవసరమైయున్నది.

కొన్ని సంవత్సరాలు నేను నిందారహితమైన, మనస్సునొప్పించెడి ప్రసంగికురాలిగా, ఇంట్లో నా భర్తను యిష్టంవచ్చినట్లు మాట్లాడి, చర్చిలో వాక్యం చెప్పుటకు రాగానే నేను ఒక గొప్ప స్త్రీనని తలంచేదాననుగా వున్నాను. మనుష్యులతో ఎలా ప్రవర్తించాలో నాకు తెలియదు. నేను ఓర్పులేని దాననుగా వుండేదానను అందరూ నాకు యిష్టం వచ్చినట్లే ప్రవర్తించాలి లేకపోతే నేను చాలా కలవరపడేదానిని. ఎవరూ నన్ను సరిచేయగలిగే వారు కాదు ఎవరూ నాకు ఏమి చెప్పగలిగే వారు కాదు "నేను దేవుని స్త్రీని" – "వాక్యములో జీవం" అని మేము పిలుచుకుంటున్న దానికి అధ్యక్షురాలను గనుక నా జీవితంలో ఎవరి ప్రమేయము వుండేది కాదు.

ఆ సమయములో నా జీవితములోనూ మరియు పరిచర్యలోనూ పరిస్థితులు నేను అనుకుంటున్నట్టు జరుగుట లేదు పరిచర్యలో నేను కోరుకున్న అభివృద్ధిని మరియు అణువుగా వున్నదనుకున్న దేవుని శక్తిని నీవు చూచుట లేదు. మా కూడికలు తృప్తికరంగానే వుంటున్నాయి ఎందుకంటే దేవుడు నాకు బోధించే వరాన్ని తన కృపతో అనుగ్రహించాడు అయితే యిప్పటివలె పరిశుద్ధాత్ముని శక్తిని దేవుని సన్నిధిని మేము అనుభవించుట లేదు. నేను నిరాశతో నిండి పోయాను. చివరకు దేవుని సన్నిధిని నేను కోల్పోతున్నానని గ్రహించాను. నాతో చాలా కాలం దేవుడు పని చేసిన తరువాత, చివరిగా నేను బలమైన ప్రేమ సంబంధాన్ని వృద్ధిపొందించాలని అర్థం చేసుకున్నాను. మనుష్యులను మనం ప్రేమించాలని దేవుడు కోరుకుంటున్నాడు గనుక, వారితో మన ప్రవర్తనను ఆయన చాలా పట్టించుకుంటాడని గ్రహించాను. మనం చేసే వాటన్నిటికీ ప్రేమ నడత అనునది పునాదియైయున్నది.

> మనం చేసే వాటన్నిటికీ ప్రేమ నడత అనునది పునాదియైయున్నది.

మొదటి కొరింథీ 13:2 "ప్రవచించు కృపావరము కలిగి మర్మములన్నియు, జ్ఞానమంతయు ఎరిగినవాడనైనను, కొండలను పెకిలింపగల పరిపూర్ణ విశ్వాసము గల వాడనైనను, ప్రేమలేని వాడనైతే నేను వ్యర్థుడను" అని చెబుతుంది. అది చాలా బలమైన వివరణ: "ప్రేమలేని వాడనైతే నేను వ్యర్థుడను". మనము వ్యర్థులము కాకుండవలెనంటే, మనము నిజముగా ఈ సత్యమును ఆలోచించి బైబిల్ ప్రోత్సాహపరచునట్లుగా ప్రేమలో నడువవలసివున్నది:

- "....ప్రేమతో ఒకరినొకరు సహించుచూ, మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా...." (ఎఫెసీ 4:1-2).
- "క్రీస్తుయేసు నందుంచవలసిన ప్రేమలు కలిగినవాడవై, నీవు నావలన వినిన హితవాక్యప్రమాణమును గైకొనుము" (2 తిమోతి 1:13).
- "ప్రేమ అనేక పాపములను కప్పును గనుక అన్నిటికంటే ముఖ్యముగా ఒకని యెడల ఒకడు మిక్కుటమైన ప్రేమ గలవారై వుండుడి" (1 పేతురు 4:8).
- "క్రీస్తు మిమ్మును ప్రేమించి, పరిమళ వాసనగా ఉండుటకు మనకొరకు తన్నుతాను దేవునికి అర్పణముగాను బలిగాను అప్పగించుకొనెను ఆలాగుననే మీరును ప్రేమగలిగి నడుచుకొనుడి." (ఎఫెసీ 5:2).

## ఆశీర్వాదముగానుండుడి

ప్రేమలో నిలిచియుండుటకు వున్న ఉత్తమమైన మార్గాలలో ఒకటి యితరులకు ఆశీర్వాదకరంగా వుండుట లేక వారికి సహాయపడుటయే మనుష్యులను ఆశీర్వదించుటకు లేక సహాయపడుటకు అనేక మార్గాలు కలవు మరియు ఆ విధముగా నుండుటకు మనము మంచిగావుండుటయే ప్రారంభము ఉదాహరణకు ఎవరికైనా సమస్య వచ్చిన యెడల, "అబ్బ ఎంత అవమానకరం" అంతకు బదులుగా ప్రార్థించి "దేవా నేను చేయగలిగిన సహాయము ఏదైనా వుంటే అదేమిటో నాకు చూపించగలవా" అని అడుగవలసివున్నది. మన స్నేహితులెవరైనా జబ్బుగా వున్నట్లయితే ఆ వ్యక్తిని వైద్యుని వద్దకు తీసుకు వెళ్ళినట్లుగా నడిపించవచ్చు. అగ్ని ప్రమాదంలో గానీ లేక యితర ప్రకృతి వైపరీత్యాలవలన ఏదైనా కుటుంబం తమ ఇంటిని ఇంట్లో వస్తువులన్నిటినీ పోగొట్టుకుందని తెలిసినప్పుడు వాళ్ళకివ్వదగినవి మన ఇంట్లో ఏమున్నవో అని ఇళ్ళలోను, బీరువాలలోను చూడగలము. లోకములో వుండే సమస్యలన్నిటినీ ఏ వ్యక్తి తీర్చలేడు

అయితే మన చుట్టూ వున్న వారికి మనం ఏవిధంగా ఆశీర్వాదకరంగా వుండగలమా అని మరియు దేవుని ప్రేమను వారి పట్ల ఎలా వ్యక్తపరచగలమా అని ఆయనను అడుగవచ్చును.

మా మేనేజర్లలో ఒకతను తాను మారబోయే ఇల్లు సిద్ధపడుటకు ముందే తన ఇంటిని అమ్మి వేశాడు. అతను ఒక వారం రోజులు హోటల్‌లో వుండబోతున్నాడని నేను విన్నప్పుడు అతను నివసించుటకు స్థలం కోసం చూడటం మొదలుపెట్టాను. మా అల్లుడు నాకు సహాయం చేశాడు. తాము అద్దెకు తీసుకున్న సమయం కంటే ఒక వారం ముందుగానే ఇల్లు ఖాళీ చేస్తున్న ఒక దంపతులు మాకు ఆ ఇల్లు ఇచ్చుటకు ఒప్పుకున్నారు. ఆ వారం చివరలో ఆ దంపతుల పని పూర్తికాకపోవుట వలన వారికి ఇంకా కొంత సమయం ఆ ఇంటిలో వుండవలసివచ్చింది. ఆ సమయంలో నా కుమార్తె నా వద్దకు వచ్చి, "వారి ఇల్లు పూర్తయే వరకూ మా ఇంట్లో వుండుట నీకిష్టమేనా?" అని నన్ను అడిగింది. నా కూతురు అప్పటికే 4 పిల్లలను కలిగివుంది – వారి ఇంట్లో ఇంకా ఐదుగురు వుండవలసిన అవసరం లేదు. అయితే, యితరులను ఎలా దీవించవలెనో, అలా దీవించు క్రమంలో మనం కొంత అసౌకర్యం పొందవలెనని కూడా నా కుమార్తెకు తెలుసు. ప్రేమలో నిలిచివుండునట్లుగా తన వ్యక్తిగత సౌకర్యాన్ని నా కుమార్తె త్యాగం చేయవలెననుకుంటున్నది.

ఇతరులను దీవించుటపై మనం దృష్టిని కేంద్రీకరించినట్లయితే, మనం దీవించబడుటను దేవుడు పట్టించుకుంటాడు. ఎవరికైనా ఏమైనా చేయుటకు ముందు దేవుని వద్దనుండి మనం ప్రత్యేకమైన మాట పొందుకొనవలసిన అవసరం లేదు! మనుష్యులు చెప్పేవి వినుట ద్వారా మరియు వారిని గమనించుట ద్వారా వారి అవసరతలను తెలుసుకొనగలము మీ సంఘంలో కొంత ఒంటరిగా కనిపించేవారిని చూడు, ఎప్పుడూ ఒంటరిగా వస్తూ ఒంటరిగా కూర్చునే వారిని చూచి ఆ పరిస్థితిలో నీవు వుంటే ఎలా ఆలోచిస్తావో అని ఆలోచించు, నీతో కలిసి కూర్చొనుటకు వారిని ఆహ్వానించు. నలుగురు పిల్లలను కలిగి రోజులు భారంగా గడుపుతున్నా ఒంటరి తల్లిని చూడు. ఆమెకు ఒక యాభై రూపాయలిచ్చి మధ్యాహ్నభోజనానికి కుటుంబాన్ని బయటికి తీసికొని వెళ్ళమను, లేక పోతే ఆమె భోజనం చేసేటప్పుడు ఆమె బిడ్డలను చూచుకొనుటకు ఒప్పుకో. ఎవరైనా "నా జుట్టు చాలా అసహ్యంగా వుంది, నా కొక జుట్టు బాగు చేసే యంత్రము కావాలి కాని నాదగ్గర డబ్బు లేదు అనటం నీవు విన్నట్టయితే ఆమెకు ఒక వందరూపాయలు చేతిలో పెట్టి దానిని కొనుక్కొనమని చెప్పు. ఇతరులను ఆశీర్వదించుటకు సృజనాత్మకంగా ఆలోచించు.

నీవు నాతో అనవచ్చు "జాయిస్ నా దగ్గర వందరూపాయలు కూడా లేవు." నేను ఏం చెప్తానంటే నీ వద్దవున్నదే ఇవ్వటం మొదలుపెట్టు చివరకు నీకు అవసరమైనప్పుడు వంద రూపాయలు యిచ్చేస్థితికి వస్తావు. కొన్ని సార్లు మనం ఏదైనా అవసరతను గురించి విన్నప్పుడు అది పూర్తిగా తీర్చే స్థోమత మనకు లేనప్పుడు దానిని వదిలి వేస్తాము. నీకు లేని దానిని బట్టి ఆలోచిస్తూ నీవు ఇవ్వగలిగినది యివ్వకుండా ఆపకు నీవు చేయలేని

దానిని బట్టి ఆలోచిస్తూ నీవు చేయగలిగినది చేయకుండా ఆగకు లేకపోతే నీ జీవితంలోని దేవుని సామర్థ్యమును వ్యర్థపరుస్తూ ఏమీ చేయకుండానే మిగిలి పోతావు.

*నా సంగతేమిటి, నాకు సహాయము చేసే వారు ఎవరూ లేరు* అని నువ్వు ఆలోచిస్తూ వుండివుండవచ్చు. నీవు ఆ విధమైన భావనలు కలిగి వున్నంతకాలం ఎవరూ నీకొరకు ఏమీ చెయ్యరు. నీవు ఈ త్యాగపూరితంగా యిచ్చుట మొదలుపెట్టినప్పటికీ, నీ సమృద్ధిలో యివ్వగలిగిన స్థాయికి నీవు చేరుకుంటావు. అయితే నీవు వున్న స్థాయిలో నీవు మొదలు పెట్టకపోతే నీవు చేరవలసిన స్థాయికి చేరలేవు. కొన్నిసార్లు మనుష్యులకు అసలు అవసరం లేని వాటిని కూడా ఇవ్వవలసినదిగా దేవుడు మన హృదయాలలో వుంచుతాడు. వారు మనం ఇవ్వగలిగిన దాని కంటే ఎక్కువగా పొందుకోగలరు కానీ వారికి ప్రోత్సాహం అవసరమైయున్నది. తమ గురించి యితరులు ఆలోచిస్తున్నారని, శ్రద్ధ చూపిస్తున్నారని వారికి తెలియవలసివున్నది. నీవు ఎవరికైనా ఏమైనా ఇచ్చినట్లయితే అది వారికి అవసరం లేకపోయినప్పటికీ వారిని ఆశీర్వదిస్తుంది. దానిని వారు ఉపయోగించుకోక పోయినా అది వారిని మనలను కూడా ఆశీర్వదిస్తుంది.

కొన్ని సమయాలలో మనం కొందరికి వారి నిర్ధిష్ట అవసరతలను తీర్చేదానిని ఇస్తాము లేకపోతే ఒక విత్తనాన్ని ఇస్తాము. దేవుడు విత్తువానికి విత్తనమును తినుటకు ఆహారమును దయచేయువాడని బైబిల్ చెప్తుంది (2 కొరింథీ 9:10). నాకు వ్యక్తిగతంగా అవసరంలేని అనేకమైన వాటిని మనుష్యులు నాకు ఇస్తుంటారు అయితే నేను దానిని విత్తనంగా ఉపయోగిస్తాను. కాబట్టి నేను దానిని వేరొకరికిస్తాను ఎవరైనా మనకు అవసరం లేని దానిని ఇచ్చినప్పుడు దానిని మనము యింకను ఒక బహుమతిగా పొందుకొని దానిని ఇతరులకు ఆశీర్వాదకరంగా ఇవ్వవచ్చు. నేను తరచుగా యితరులకు వస్తువులను ఇచ్చి "నీకు ఇది ప్రయోజనం కాకపోయినా లేక నీకు ఇష్టం లేకపోయినా, దీనిని విత్తనములా వుపయోగించుకొని దీనితో ఇతరులను ఆశీర్వదించు." అని చెప్తాను. ఆ బహుమతిని వారు ఇతరులకు ఇచ్చినప్పటికీ వారిని గురించి నేను ఆలోచిస్తుంటాను కాబట్టి వారు ఆశీర్వదింపబడినవారే.

ప్రతి పరిస్థితిలోను, మనం కలియు ప్రతి ఒక్కరికీ ఆశీర్వాదకరంగా వుండాలని నిర్ణయించుకోవాలి. ఆశీర్వాదకరంగా వుండుట అంటే బ్యాంక్‌లో గుమస్తాను పిలిచి చిరునవ్వు నవ్వటం అంత సులువైనది లేక అసౌకర్యమైన పని చేయవలసిన అవసరం ఉన్నది లేక ఇతరులకు మనం చేయవలసిన అవసరం లేనిది. దానికి సమయం లేక డబ్బు అవసరం

కొన్ని సమయాలలో మనం కొందరికి వారి నిర్ధిష్ట అవసరతలను తీర్చేదానిని ఇస్తాము లేకపోతే ఒక విత్తనాన్ని ఇస్తాము.

కావచ్చు, అది ఏమి తీసుకున్నప్పటికీ దేవునితో మన సంబంధానికి మరియు ప్రభావవంతమైన ప్రార్థనా జీవితానికి ప్రేమలో నిలిచి యుండుట ప్రాముఖ్యమైనదని మనం అర్థం చేసుకొనవలసివున్నది కాబట్టి మనం ఎక్కడకు వెళ్ళినప్పటికీ ఇతరులను ఆశీర్వదించు మార్గములను వెదకవలసివున్నది.

## ప్రేమ ఇచ్చుటకు చూస్తుంది

“నాకు వున్న అతి ఉత్తమమైన దానిని ఇస్తున్నాను” అన్న దానికి గొప్ప ఉదాహరణను బైబుల్ మనకు ఇస్తుంది. తండ్రియైన దేవుడు మనపై తనకున్న ప్రేమలో తన ఏకైక కుమారుని మనకు ఇచ్చియున్నాడు. అయితే మనకు అటువంటి అవకాశము వచ్చినప్పుడు, “నేను దానిని ఇవ్వలేను నాకు వున్నది అది ఒక్కటే, అది కూడా ఏదో ఒక రోజు నాకు అవసరమౌతుంది” అని వెంటనే చెప్పుటకు శోధించబడతాము. యథార్థమేమిటంటే మనలో అనేక మందిని కొన్ని సంవత్సరాలుగా ఉపయోగించని వాటిని అలాగే వుంచుతున్నాం. అవి మనకు అవసరమైనప్పుడు మనకు గుర్తుకురావు లేక ఆ సమయానికి అవి పనిచేయకుండా పోతాయి లేకపోతే అవి మురికి పట్టి మనము గుర్తు పట్టలేనంతగా మారిపోతాయి. వస్తువులను పేర్చి వుంచుకొనుటకు బదులుగా వాటిని ఉపయోగించుకొని తరువాత వాటితో కొన్ని సంవత్సరాలు పనిలేదు అని తెలిసినప్పుడు యిప్పుడు వాటి అవసరమున్న వారికి ఇచ్చివేయాలి. నీకు అవసరమున్న సమయంలో దేవుడు అవి నీకు వచ్చునట్లుగా చూసు కుంటాడు. మనము ఇతరులకు అధికముగా యిచ్చినట్లయితే మన అవసరములు అధికముగా తీర్చబడుతాయి అని దేవుని వాక్యము మనకు బోధిస్తుంది మనము ఏది విత్తుతామో దానినే కోస్తామని జ్ఞాపకము చేసుకొనండి. ఇతరుల అవసరతలను మనము తీర్చుతూ వారిని ఆశీర్వదించిన ప్రతిసారి మన అవసరతలు కూడా తీర్చబడతాయన్న నిశ్చయతను పొందుకుంటాము.

నాకొక వృద్ధురాలైన తల్లి, వృద్ధురాలైన ఆంటీ వున్నారు. నా ముసలి తనంలో ఎవరైనా నా యెడల శ్రద్ధ చూపించాలని నేను కోరుకున్నట్లే వారి ముసలితనంలో నేను శ్రద్ధ చూపించాలని దేవుడు నాకు చూపించాడు. నాకు ఎప్పటికీ ఒకరి మీద ఆధారపడే పరిస్థితి రాకపోవచ్చు కానీ ఒకవేళ వచ్చినట్లయితే అందుకుముందుగానే నేను విత్తియున్నాను.

నీ స్వాస్థ్యమును చక్కదిద్దు కొమ్మని నేను మీకు సవాలు చేస్తున్నాను. నీ ఇల్లంతా తిరిగి ఒకటి రెండు సంవత్సరాలుగా నీవు ఉపయోగించని వాటన్నిటినీ ఇచ్చివేయుటకై వేరుగా పెట్టు ఒక వేళ నీవు *వాటికొరకు నేను చాలా కష్టపడ్డాను, ఏదో ఒకరోజు అవి నాకు అవసరమౌతాయి* అని ఆలోచించవచ్చు. అయితే, నీవు ఒక పొదను కత్తిరించినపుడు, ఏమి జరుగుతుంది, అది యింకా పెరుగుతుంది! అలాగే నీ స్వాస్థ్యమును ఇచ్చివేయుట

నీవు మొదలుపెట్టినపుడు, అది ఎంతగా పెరుగుతుందంటే, తరువాత ఏమి చేయాలో తెలియక ఆలోచించి, నీవు ఉపయోగించని వస్తువులు తీసికొని వెళ్లుటకు యింకా పెద్ద పెట్టెలను వెదకుకుంటావు. ఆ సిద్ధాంతం నా జీవితంలో ఎల్లప్పుడూ పనిచేస్తుంది. నేను క్రొత్తవాటిని తెచ్చినపుడు, నేను వాడని వాటిని ఇచ్చివేస్తుంటాను, తరువాత మరింత వస్తువులను నేను తెస్తుంటాను, యింకా ఎక్కువ వాటిని ఇచ్చివేస్తుంటాను. అది ఆశీర్వాదాల పరంపర. నేను ఆశీర్వదింపబడినాను, నేను దానితో ఇతరులను ఆశీర్వదింపబడినపుడు, నేను ఇంకను ఆశీర్వదింపబడుతాను కాబట్టి నేను మరియొకరిని మరింత ఆశీర్వదిస్తాను, ఇది ఆ విధంగా జరుగుతూనే వుంటుంది.

నా దుస్తులు చాలా ఇచ్చివేయుట నాకు చాలా ఆనందకరమైన పని. నాకు చాలా దుస్తులు అవసరం కాబట్టి, నేను వాటిని ఎక్కువగాను, క్రమంగాను యిచ్చివేస్తుంటాను. దీవెన అవసరమైన స్త్రీలకు నా మంచి దుస్తులను ఇచ్చుటలో ఎంత ఆనందం వున్నది. కొన్ని సమయాలలో నా ఆఫీసులో కనీసం 12 మంది స్త్రీలు నేను ఇచ్చిన దుస్తులు ధరించివుండుటను గమనిస్తాను.ఆ దుస్తులు వారికి ఒక దీవెన, మరియు ఆ దీవెనలో నేను పాలుపొందాను కాబట్టి నేను కూడా ఆశీర్వదింపబడుతాను.

మన స్వాస్థ్యములను పట్టుకొని వ్రేలాడుట అను బుద్ధిహీనమైన పనిని మనం ఆపివేయాలి. దానికి బదులుగా, మన చేతులు తెరచి, ఇతరులకు ఇచ్చుటలో ఆసక్తి కలిగివుండి, మన ప్రేమను వ్యక్తపరచాలి. ఏ యే ప్రదేశాలలో ఇవ్వగలమా అని ప్రేమ చూస్తుంది. ఇచ్చుటలో ప్రేమ ముందు వుంటుంది. ఇతరులను ఆశీర్వదించుట ఎలా అని ప్రేమ చూస్తుంది. ప్రేమ ఉద్దేశపూర్వకంగా చేస్తుంది.

నేను వడ్రంగినైతే ఆ పనికి అవసరమైన వస్తువులు నాకు కావాలి. నేను వైద్యుడినైతే వైద్యశాస్త్రాన్ని అభ్యసించటానికి అవసరమైన వస్తువులు నాకు కావాలి. అదే విధంగా నేను మనుష్యులను ప్రేమించు దానిగా వుండాలని యితరులను ఆశీర్వదించటానికి వస్తువుల రూపంలో వచ్చు సామాగ్రి నాకు కావాలి. మనుష్యుల అవసరతలను నేను గ్రహించుటకు ముందు అన్ని విధాల నేను సిద్ధంగా వుండాలి. నీవు డబ్బును ప్రక్కన పెట్టివుంచుకున్నట్లయితే ఆ దీవెన అవసరమైన వారికి యివ్వు. రెస్టారెంట్‌లకు, పచారి కొట్లకు, షాపింగ్ సెంటర్‌లకు గిఫ్ట్ సర్టిఫికేట్‌లను వుంచుకో. నీవు చర్చికి, పనికి లేక కుటుంబ ప్రార్థనలకు వెళ్ళునపుడు నీ జీవితంలో ఒక విత్తనం విత్తాలని నీవు అనుకుంటే నీ బహుమతిని నీతో పాటు తీసికెళ్ళు.

నేను సంపూర్ణ, ముందస్తైన, ఉద్దేశపూర్వకంగా ఇచ్చుటను గూర్చి మాట్లాడుతున్నాను. మన కొరకు పచారి సామాన్లను, బట్టలు పుస్తకాలు లేక సినిమా టిక్కెట్‌లు కొనుక్కొనుటకు బదులుగా వాటిలో కొన్నింటిని యితరుల కొరకు కూడా కొనవలసివున్నది. దీవించ వలసిన వారికోసం ఎక్కడో చూడవలసిన అవసరం లేదు. మనం ఒకరినొకరం దీవించవలసివున్నది. గలతీ 6:10 ఈ విధంగా చెప్తుంది "కాబట్టి మనకు సమయము దొరికిన కొలది అందరి

యెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరిన వారి యెడలను (తోటి విశ్వాసులు) మేలు చేయుదము" అలాగే, క్రొత్త వారికి లేక అవిశ్వాసులకు ఆయన ప్రేమను పంచుకొనునట్లుగా ఎప్పుడు యివ్వవలెనో దేవుని అడుగవలసివున్నది. పొందునది ఎవరైనప్పటికీ ప్రేమ ఇస్తుంది, ఇవ్వకుండా వుండలేదు!

## ప్రేమ పక్షపాతం చూపదు

అందరినీ ఒకేలా చూచుట మరియు అందరిని గౌరవించుటలో ఒకే విధమైన భావాన్ని కలిగివుండుటని ప్రేమ కోరుతుంది. అంటే ఒక ప్రాణ స్నేహితుని లేక నీకిష్టమైన ఒక గుంపును కలిగివుండుట అనునది తప్పు అని ఇది చెప్పుట లేదు, అయితే కొంతమందిని నీకంటే "తక్కువ" స్థాయికి చెందినవారని తలంచుట తప్పు. మనుష్యులు తమను తాము వదలివేయబడిన వారిగా మరియు తిరస్కరింపబడినవారిగా అనుకొనునట్లు మన ప్రవర్తన ఉండకూడదు.

> అందరినీ ఒకేలా చూచుట మరియు అందరిని గౌరవించుటలో ఒకే విధమైన భావాన్ని కలిగివుండుటని ప్రేమ కోరుతుంది.

యేసు ఇతర శిష్యులతో చేయనివాటిని పేతురు, యోహాను మరియు యాకోబులతో చేసినాడు, అయితే వారిని ప్రేమించుట వలన అలా చేసినాడని నేను అనుకొనను. ఇతరులలో చూచిన దానికి అతీతంగా తాను పనిచేయగలిగినది ఏదో వారిలో చూచినందువలన అని నేను నమ్ముతాను. ఇతరులలో చూడని విధంగా తన పరిచర్యను పొందుకొనగలిగే సామర్థ్యమును వారిలో చూచుట వలన వారితో ఎక్కువ సమయాన్ని గడుపుతూ, వారితో పంచుకుంటున్నాడని నేను తలంచుతాను. వారి ముగ్గురితో ఆయన ఎక్కువ సమయం గడిపినప్పటికీ వారిలో ఎవరినీ లేక ఇతరులలో ఏ ఒక్కరినీ ఆయన తక్కువగా చూడలేదనీ, ఎవరితో తప్పుగా ప్రవర్తించలేదనీ నేను నమ్ముతాను.

దేవుడు పక్షపాతి కాడని వాక్యము స్పష్టంగా చెబుతుంది. అపోస్తలుల కార్యములు 10:34 "దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించి యున్నాను" అని చెబుతుంది. మరియు బైబిలు "దేవుడు నరుని వేషము చూడడు" (గలతీ 2:6) అని కూడా చెబుతుంది. అలాగే యాకోబు 2:1 "నా సహోదరులారా మహిమా స్వరూపియగు మన ప్రభువైన

యేసుక్రీస్తును గూర్చిన విశ్వాస విషయంలో మోమాటము గలవారై వుండకుడి” అని ఎలా ప్రవర్తించాలో చెప్తుంది.

అహంకారి అనగా యితరులకంటే తమను తాము మంచి వారుగా తలంచుట. యిటువంటి వారు తమకు ఎక్కువ ధనము వుండుటను బట్టి, ఎక్కువ విద్య వుండుటను బట్టి, లేక ఈ లోకంలో ఎక్కువ గౌరవం పొందే అధికారమును బట్టి తాము ఇతరులకంటే పైన వున్నామని తలంచుతారు. వీరు తమకంటే తక్కువ స్థాయిగల వారితో కలవటానికి ఇష్టపడరు ఇటువంటి భావనను “గర్వం” అంటారు అది పాపము మరియు ఒక వ్యక్తి ప్రేమలో నిలిచియుండకుండా అది త్రిప్పి వేస్తుంది, జవాబులు పొందు ప్రార్థనను ఇది అడ్డగిస్తుంది. దేవుడు బాధ పడువారి కోరికను వింటాడని కీర్తనలు 10:15 నందు ఆయన అహంకారులను ఎదిరించి, దీనులకు కృపను అనుగ్రహిస్తాడని అని యాకోబు 4:6 నందు బైబుల్ చెప్తుంది.

మనము, మనలను ఒకరితో ఒకరిని వేరు చేసే విషయాలకు విలువనిచ్చి స్నేహితులుగా వుండు క్రమంలో అందరూ ఒకే విధంగా వుండవలసిన అవసరం లేదని గ్రహించాలి. నిజం చెప్పాలంటే వైవిధ్యమైన స్నేహితులను కలిగివుండటం వలన ప్రపంచమంతా మన ఇరుగు పొరుగు వలె, మన సంఘం వలె, మనం పనిచేసే ప్రదేశం వలెనే వుండదని తెలుసుకుంటాము.

ప్రేమలో నిలిచియుండుటకు నీవు చేయగలిగినదంతా శ్రద్ధగా చేయమని మిమ్మును ప్రోత్సాహపరుస్తున్నాను. పక్షపాతము చూపకుండుట వలన, గర్వించుటకు అవకాశము ఇవ్వకుండుట వలన, మనుష్యులందరిని ఒకే విధంగా ప్రేమించి గౌరవించుటకు హృదయంలో నిర్ణయించుకొనుట వలన దేవుడు ప్రత్యేకముగా చేసుకొనిన వ్యక్తిగతమైన వారిగా వారికి విలువనిచ్చుట వలన నీవు అది చేయగలవు.

## సువర్ణ నియమాన్ని పాటించు

ప్రేమలో నిలిచియుండుటకు మరియు గొప్ప ఫలితాలను పొందుటకు మనము లోబడవలసిన మరియొక బైబిల్ నియమాన్ని మత్తయిలో కనుగొనగలము. మత్తయి 7:7–11 ఈ విధంగా చెప్తుంది: “అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును అడుగు ప్రతి వాడును పొందును వెదకు వానికి దొరకును తట్టు వానికి తీయబడును. మీలో ఏ మనుష్యుడైనను తన కుమారుడు తన్ను రొట్టెను అడిగిన యెడల వానికి రాతినిచ్చునా? చేపనడిగిన యెడల పామునిచ్చునా? మీరు చెడ్డవారైయుండియు మీ పిల్లలకు మంచి ఈవులనియ్య యెరిగియుండగా పరలోకమందున్న మీతండ్రి తన్ను అడుగు వారికి అంతకంటే ఎంతో నిశ్చయముగా ఎంతో మంచి ఈవులనిచ్చును”.

మత్తయి 7:12 "కావున మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరునూ వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రము, ప్రవక్తల ఉపదేశమునై యున్నది" అని చెప్తున్నది. కొన్ని సమయాలలో మనము మత్తయి 7:7-12ను ఒక విషయముగా మరియు "సువర్ణ నియమం" అని పిలువబడు మత్తయి 7:12ను ఒక వ్యక్తిగత తలంపుగా భావిస్తాము. మత్తయి హఠాత్తుగా వేరొక దారిలో వెళ్ళుతున్నాడు అని మీరు అనుకొనవచ్చు, అయితే అతనేమి చెప్తున్నాడంటే *మీరు అడిగినట్లయితే, అది మీకు యివ్వబడుతుంది అయితే ఇక్కడ ఒక నియమం వస్తుంది ఇలా జరుగుట చూడాలని మీరు అనుకున్నట్లయితే - ఇతరులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుకుంటున్నారో మొదట మీరు అలా చేయుడి.* జవాబులు పొందు ప్రార్థనకు ఇతరులను ప్రేమించుట ఒక నియమము అని చెప్తుంది! గుర్తుంచు కోండి, ప్రేమ లేకుండా మన విశ్వాసం పని చేయదు.

సంయుక్త రాష్ట్రాలలో వివాహ వ్యవస్థ గొప్ప అపాయములో వుండుటకు కారణం ఇదేనని నేను నమ్ముతున్నాను ఇరువురిలో ఏ ఒక్కరు క్షమాపణ చెప్పుటకు లేక వదిలి వేయుటకు తగిన పరిణితి లేక తగిన తగ్గింపు లేని వారుగా వుండుటను బట్టి కలహాలు మొదలైనవని నేను నమ్ముతున్నాను. సాధారణంగా మనం మనుష్యులు మనతో ఎలా ప్రవర్తిస్తారో అలానే ప్రవర్తిస్తాము. బైబిల్‌ను అనుసరించి వారు మనతో ఎలా ప్రవర్తించాలని కోరుకుంటామో మనం వారితో అలాగే ప్రవర్తించ వలసివుంటుంది.

ఎవరూ తమకు తాముగా మొట్టమొదటిగా "నన్ను క్షమించు" అని చెప్పుటకు ఇష్టపడరు. వారు, *నీవు నాతో మంచిగా వుండకపోతే నేనూ నీతో మంచిగా వుండను నువ్వు నన్ను గౌరవించకపోతే నేనూ నిన్ను గౌరవించను. నీవు నాకు ఏమీ చేయకపోతే నేనూ ఏమీ చేయను* అని తలంచుతారు. ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తితో కలవాలని ప్రయత్నించినప్పుడు అతను ఒప్పుకొనక పోయినట్లయితే కోపం పెరుగుతుంది, పరుషమైన మాటలు వాడబడుతాయి, సంబంధాలు లోతుగా సమస్యలలో పడతాయి.

భార్య భర్తలు ప్రేమలో నిలిచియుండి సువర్ణ నియమాన్ని పాటిస్తున్నట్లయితే వారు ఈ విధంగా తలంచుతారు. నా భర్త నాకు ఎక్కువ బహుమతులు యిస్తాడని నేను ఆశించాను కానీ అతను ఇవ్వలేదు కాబట్టి నేను అతనికి బహుమతులు కొనుటకు మొదలు పెడతాను. నా భర్త నన్ను కొంచెం పొగుడుతూ నన్ను ఇంకొంచెం పట్టించుకుంటే బాగుంటుందని తలంచాను, అతను అలా చేయలేదు, కాబట్టి నేను అతనిని ఎక్కువ పట్టించుకొని పొగుడుటకు మొదలు పెడతాను.

ఇదే నియమము ఇతర సంబంధములలో కూడా వర్తిస్తుంది. కుటుంబ సంబంధాల లోనూ, పనిలోనూ, ఆటల గుంపులలోనూ, సంఘకమిటీలలోనూ కలిసి పని చేయాలనుకునే మనుష్యుల మధ్య ఎల్లప్పుడూ కలహాలకు తావు వుంటుంది. మనుష్యులు మన ఎడల చేయదలచు కున్నట్లుగా వారికి చేయటమన్నది మనుష్యులలో కలహాలను తగ్గించి, దేవునితో

మనుష్యులు మన ఎడల చేయదలచుకున్నట్లుగా వారికి చేయటమన్నది మనుష్యులలో కలహాలను తగ్గించి, దేవునితో కలిసి ఆనందించుటకు ఆయన పిలిచిన బలమైన ఫలవంతమైన సంబంధాలను కలిగివుండుటకు దారి తీస్తుంది.

కలిసి ఆనందించుటకు ఆయన పిలిచిన బలమైన ఫలవంతమైన సంబంధాలను కలిగివుండుటకు దారి తీస్తుంది.

సువర్ణ నియమాన్ని పాటించు: మనుష్యులు మీకు ఏమి చేయవలెనని కోరుదురో ఆలాగుననే మీరునూ వారికి చేయుడి మీకు స్నేహితులు కావలెనంటే స్నేహంగావుండు. మీకు బహుమతులు కావలెనంటే ఏమైనా యిచ్చివేయి, మీకు ప్రోత్సాహం కావలెనంటే ప్రోత్సాహపరచుడి. నీ కొరకు ఇతరులు ప్రార్థించవలెనంటే నీవు వారి కొరకు ప్రార్థించు. ఈ ప్రోత్సాహం, ప్రార్థన, స్నేహం, బహుమతులు ఇచ్చుట మీకు చిన్న విషయాలుగా అనిపించవచ్చు, అయితే ఈ చిన్న విషయాలు చేయకుండానే మనుష్యులు సంబంధాలను చెడగొట్టుకుంటున్నారు. అదే సమయంలో సంబంధాలని కట్టునవి కూడా యివే కాబట్టి అది చిన్నదైనా పెద్దదైనా మనుష్యులు నీకు ఏమి చేయవలెనని కోరుకుంటావో అలాగే వారికి చెయ్యి. ప్రేమలో నిలిచియుండుటకు విఫలమవ్వని మార్గం ఇదియే.

యేసు ప్రార్థనలను తండ్రి దేవుడు విని, జవాబిచ్చినాడని మనం అందరం నమ్ముతున్నాము, అయితే, యేసు ప్రేమలో, అక్షరాలా ఎల్లప్పుడూ నిలిచియున్నాడని మనం జ్ఞాపకం చేసుకుందాం. చివరకు సిలువలో, బాధపడుతున్నపుడు కూడా ఆయన "తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించు" అని చెప్పినాడు. సంపూర్ణముగా తన జీవితం బలియాగమువువరకు ఆయన ఇచ్చుటకు వదలిపెట్టలేదు.

## సారాంశం

మన ప్రార్థనలు ప్రభావవంతముగా చేయుటకు ఒక ఖచ్చితమైన మార్గము, ప్రేమలో నడుచుటయే. యితరులను ప్రేమించుట అనునది, దేవుని సంతోషపరచు అనేక హృదయ భావనలతో మిళితమై యుంటుంది. అన్నింటికీ పైగా, ఆయనను మరియు ఇతరులను యథార్థముగా ప్రేమించు హృదయమును దేవుడు గౌరవిస్తాడు. నిజానికి, ఆయనపై మన విశ్వాసము, ప్రేమ ద్వారా పనిచేస్తుంది మరియు ఆయన పై మన ప్రేమను ఇతరులను

ప్రేమించుట ద్వారా వ్యక్తపరుస్తాము. ప్రేమ దేవుని లక్షణమైయున్నది మరియు మనం యితరులను ప్రేమించు కొలది ఆయన వలె మారుతాము. మనము ఆయన మార్గములో నడచుచూ, ఇతరులను ప్రేమించుటలో ఆయనను అనుకరించుచుండగా, ఆయనతో మన సంబంధం లోతుగాను బలంగాను పెరుగుతుంది మరియు మన ప్రార్థనా జీవితాలు గొప్పవవుతాయి.

## ప్రార్థనాంశములు

- అన్నింటికంటే ముఖ్యంగా మనం దేవుని ప్రేమింపవలసియున్నది మరియు తరువాత ఇతరులపై మిక్కుటమైన ప్రేమను కలిగియుండ వలెను.
- ప్రేమ ద్వారా విశ్వాసం పనిచేస్తుంది.
- మొదటి కొరింథీయులకు 13వ అధ్యాయం ప్రేమను వివరిస్తుంది.
- బాధపరచబడు లేక కాళ్లకిందవేసి త్రొక్కు పట్టా వలె ఉపయోగపడువారిని లేక బాధ్యత లేకుండా తిరుగు వారి యెడల బాధ్యత కలిగివుండుట ప్రేమ కాదు.
- మన జీవితాలలో దేవుని ప్రేమ ప్రవహించకుండా, ఇతరులకు ప్రభావవంతముగా సహాయపడు మన సామర్థ్యము అడ్డగింపబడుతుంది.
- ప్రేమ వస్తువులను దాచివుంచుకొనదు. ఇతరులకు ఆశీర్వాదకరముగా వుండుట అనునది ప్రేమను వ్యక్తపరచు ఒక ఉత్తమమైన మార్గము.
- ప్రేమ పక్షపాతము చూపదు మరియు అహంకారముగా ప్రవర్తించదు, అది అందరికీ విలువనిస్తుంది.
- మనం ప్రేమలో నిలిచియున్నప్పుడు, మన యెడల యితరులు ఎలా ప్రవర్తించాలని కోరుకుంటామో, మనం వారియెడల అలానే ప్రవర్తిస్తాము.
- ప్రేమలో నిలిచియున్నవారు ఎన్నడూ వదలిపెట్టరు తమ చివరి శ్వాస వరకూ వారు ప్రేమిస్తూనే వుంటారు.

# 12

# జవాబులు పొందు ప్రార్థనకు పదునాలుగు ఆటంకములు

మీరు ప్రభావవంతమైన ప్రార్థనకు కొన్ని తాళపు చెవులను చూచియున్నారు, యిప్పుడు జవాబు పొందు ప్రార్థనకు కొన్ని ఆటంకములను చూడవలెనని కోరుతున్నాను. ప్రార్థించునపుడు చేయవలసినవే కాకుండా, చేయకూడనివి కూడా మనము తెలిసికొనవలసి యున్నది. మన సమయమును, శక్తిని మన ప్రార్థనలో వుంచుటకు మనం నిర్ణయించు కున్నట్లయితే, మంచి ఫలితములు పొందునట్లుగా, మన శక్తి కొలది చేయదగిన ప్రతి దానిని చేయవలసియున్నది!

సహజంగా, ప్రభావవంతమైన ప్రార్థనకు తాళపుచెవియైన ప్రతి గుణము యొక్క వ్యతిరేక గుణము అనునది జవాబు పొందు ప్రార్థనకు ఆటంకముగా వున్నది (ఉదాహరణకు, క్షమాపణ అనునది ప్రభావవంతమైన ప్రార్థనకు తాళపు చెవియైతే, క్షమించలేని గుణం జవాబు పొందు ప్రార్థనకు ఆటంకం). ఈ అధ్యాయంలో అటువంటి కొన్ని "వ్యతిరేకతలను" చెప్పదలచుకున్నాను, ఎందుకంటే, ఒక విషయం యొక్క అనుకూలతలు ప్రార్థనా ప్రభావాన్ని వృద్ధిపొందించినట్లే మన ప్రార్థనా జీవితాలలో దాని ప్రతికూలతలు ఎలా సమస్యలను తెస్తాయో తెలిసికొనవలసియున్నది.

## 1. ప్రార్థనలేనితనం

ఇది చాలా సహజంగా అనిపిస్తుందని నాకు తెలుసు, అయితే మనం ప్రార్థించనట్లయితే, మన ప్రార్థనలు జవాబివ్వబడవు. ఈ పుస్తకంలో అనేక సమయాలలో, "మీరు అడుగనందున

మీకేమియు దొరుకదు" అను యాకోబు 4:6 ను చెప్పియున్నాను. అది కూడా చాలా సులువుగా అనిపిస్తుంది, నాకు తెలుసు, అయితే, యిది సత్యం. మనకు ఏది ఇష్టమో, అవసరమో అడుగవలసియున్నది. కొన్నిసార్లు మనం ఒక విషయాన్ని గురించి మన మనసులో పని చేస్తాము, మన స్నేహితులతో దాని గురించి మాట్లాడుతాము లేక ఆశపడుతాము లేక ఎదురుచూస్తాము, అయితే మనం ప్రార్థించము. ఆలోచించుట, ఆశపడుట, కోరుకొనుట, ఇతరులతో మాట్లాడుట అనునది ప్రార్థించుట కాదు *ప్రార్థించుటయే* ప్రార్థన. మనకు ఏదైనా అవసరమైనపుడు లేక ఒక పరిస్థితి మనలను వేధిస్తున్నపుడు, దాని గురించి దేవునితో మాటలాడుటయే ప్రార్థించుట. మనము ప్రార్థనలో ఆయనతో మనవులు చేయాలని దేవుడు ఎదురుచూస్తున్నాడని మీకు తెలుసా? మనం కేవలం ప్రార్థించినట్లయితే మన కొరకు క్రియ చేయుటకు ఆయన సిద్ధంగా వున్నాడని మత్తయి 7:7 మరియు యెషయా 65:1-2 చెబుతుంది.

తాను ఎంత పని చేయవలసివస్తుందోనని తరచుగా ఫిర్యాదులు చేయు ఉద్యోగస్తుని మేము ఒకప్పుడు కలిగియున్నాము. తాను ఫిర్యాదులు చేస్తున్నానని కూడా తాను గ్రహించేవాడని నేను అనుకొనను,అతను నాకు చిరాకు పుట్టించెడివాడు. అతనిని గురించి నాహృదయంలో తొందరపడి ఉద్రేకపడిపోయాను కలహపూరితంగా తయారయ్యాను వ్యతిరేక భావనలు ఆలోచించాను. నిజానికి ఫిర్యాదులు చేసే ఆ ఉద్యోగి గురించి నేను ఫిర్యాదులు చేయటం మొదలు పెట్టాను తరువాత ఒక దినం అతని ప్రతికూలభావనలను బట్టి నేను ప్రార్థించలేదని తలంచాను, కాబట్టి అతను తన పనిని గురించి ఫిర్యాదులు చేయుట మాని కృతజ్ఞత కలిగివుండునట్లుగా చేయమని దేవుని అడిగాను.

ఆ మరుసటి రోజే నేను ఆ వ్యక్తిని చూచినప్పుడు తన ఉద్యోగాన్ని గురించి చాలా కాలం తరువాత అతను అనుకూలంగా మాట్లాడాడు. అతను ఈ దినం తాను కొంత విశ్రాంతిని పొందానని పనులు బాగానే సాగుతున్నాయని చెప్పాడు. దేవుడు మనకు సహాయము చేయుటకు సిద్ధంగా వున్నాడు కాకపోతే ఎవరైనా ప్రార్థించువరకు ఆయన చేతులు కట్టబడినట్లుగా వుంటాయి. నా ప్రార్థన లేని తనం నా ఉద్యోగి ఫిర్యాదులు చేయుట ఎంత తప్పైయున్నది. దేవుని పని చేయునట్లుగా ద్వారము తెరువబడకుండునట్లు నేను మరింత అనుకూలముగా ఉండుట వలన ఆటంకంగా వున్నాను. నేను సమస్యను గురించి ఆలోచించాను ఆ సమస్యకు ప్రతీకారాన్ని

> నీ జీవితంలోను, మీరు ప్రేమించిన వారి జీవితములలోను దేవుడు పని చేయకుండునట్లుగా ప్రార్థనలేమిని ఆటంకం కానివ్వకండి.

ఆలోచించాను, సమస్య గురించి మాట్లాడాను, దానికి కలహపూరితంగా మారాను అయితే నేను ప్రార్థించుటకు ముందు అక్షరాల కొన్ని నెలలు గడిచిపోయాయి నేను ప్రార్థించిన వెంటనే దేవుడు స్పందించాడు.

నా పొరపాటునుండి నేర్చుకొని, నీ జీవితంలోను, మీరు ప్రేమించిన వారి జీవితములలోను దేవుడు పని చేయకుండునట్లుగా ప్రార్థన లేని తనం ఆటంకం కానివ్వకండి.

## 2. ధైర్యహీనత

మన ప్రార్థనలు జవాబులు పొందుకొనవలెనంటే, మనం కేవలం ప్రార్థించుటయే కాకుండా, ప్రార్థనను ధైర్యంగా చేయవలసియున్నది, అనగా భయం లేకుండా, దాపరికము లేకుండా ప్రార్థించవలసియున్నది. సిలువలోని తన మరణం ద్వారా మనము దేవుని ధైర్యంగా చేరుటకు యేసు ఒక మార్గమును ఏర్పరచినాడు. ఆయన మనకు చేసినదానిని బట్టి, మనం దేవుడు మనలను ప్రేమిస్తున్నాడనియు, మన ప్రార్థనలను వింటాడనియు, ఉత్తమమైన, సాధ్యమైన మార్గంలో మనకు జవాబిస్తాడనియు ఎరిగిన వారమై, దేవుని వద్దకు నమ్మకంతోను మరియు ధైర్యంగాను వెళ్లగలము.

దేవుని మనము న్యాయంగా చేరగలమని మనం అర్థంచేసుకున్నట్లయితే, మనలను శిక్షార్హులముగా భావించాలని చూచు శత్రువు ప్రయత్నాలను అధిగమించుటకు సమర్థులమై, మన ప్రార్థనలలో ధైర్యవంతులముగా తయారవుతాము. మనతో మనం, *దేవుడు గొప్ప కార్యాలు చేస్తాడని నాకు తెలుసు, అయితే, అవి నా కొరకు చేస్తాడని నమ్ముట చాలా కష్టంగా* వున్నదని చెప్పుకొను పరిస్థితిని కల్పించు సాతాను అబద్ధములకు యికను బానిసలము కాము. మనము అర్హులము కామని తలంచుతాము గనుక యిటువంటి ఆలోచనలను ఆలోచిస్తాము, అయితే, యేసు మనలను అర్హులనుగా తయారుచేశాడనియు, కాబట్టి కృప పొందుటకుమనము అర్హులమయ్యాము (హెబ్రీ 4:16). మనం అడుగగలిగినంత ధైర్యం కలిగివున్నట్లయితే, కృప అనునది మనం పొందుటకు అర్హులము కాకున్నప్పటికీ దేవుడు ఇచ్చునది, మనము ఆశీర్వదింపబడుటకు అర్హులము కాకున్నప్పటికీ దేవుడు ఆశీర్వదించుట. మనం యేసు నామంలో అడుగుచున్నాము, మన నామములను బట్టి కాదు. మనము యేసు ఏమైయున్నాడో దానిని దేవునికి యిస్తున్నాము గానీ, మనలను కాదని దాని అర్థం. యేసు లేకుండా మనము వ్యర్థము. మనం ఆశించు, అడుగు, ఊహించు వాటన్నిటికంటే దేవుడు ఎక్కువగా చేయశక్తిగలవాడని ఎఫెసీ 3:20 చెబుతుంది. కాబట్టి, మనం ధైర్యంగా అడుగుట వలన దేవుడు చేయగలుగు ప్రతి దానిని దైర్యంగా అడుగుటకు నిర్ణయించు కొనవలసియున్నది.

వారి కొరకు ఏమైనా చేయమని మనుష్యులు నన్ను అడిగినపుడు, వారు నన్ను నమ్మకంతో అడిగినపుడు నేను మంచిగా స్పందిస్తాను. వారు మర్యాదపూర్వకంగా, కృతజ్ఞతాపూర్వకంగా మరియు భయంగా వుండాలని నేను కోరుకుంటాను. నమ్మకం, నమ్మకాన్ని పుట్టిస్తుంది. మరొక మాటలో చెప్పవలెనంటే, మనుష్యులు నన్ను నమ్మకంతో చేరినపుడు, వారు అడిగిన దానిని వారు చేయగలరను నమ్మకాన్ని వారి నమ్మకం నాకు పుట్టిస్తుంది. ఏదేమైనప్పటికీ, వారు భయంతో వచ్చినట్లయితే, ఏ విషయంలోనైనా వారితో భాగస్వామ్యం పొందుటకు నేను వెనుకాడతాను, ఎందుకంటే భయం ఎక్కడ పుడుతుందో అక్కడ అపజయాన్ని ఇచ్చుటకు సాతానుకు సులువుగా ప్రవేశం దొరుకుతుంది. నీకు ఇష్టమైనదానికంటే తక్కువ దేవుని అడుగకు. ధైర్యంగా వుండు, నమ్మకంగా వుండు. తాను ఎంత గొప్పవాడినో ఆయన చూపించుటకు ద్వారం తెరచునట్లుగా, ఆయనను గొప్ప విషయాలు అడుగు.

## 3. పాపము

"నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసినయెడల ప్రభువు నా మనవి వినకపోవును" అని కీర్తనలు 66:18 చెబుతుంది. మరొక మాటలో, మనకు తెలిసీ, దానిని పరిష్కరించుటకు తిరస్కరించు పాపము జవాబు వచ్చు ప్రార్థనలకు ఆటంకమైయున్నది. మనలో ఎవరూ లోపరహితంగా లేరు. మనందరిలో దేవుని సంతోషపరచనిది ఏదో ఒకటి వుంటుంది, అయితే, అది ఉద్దేశపూర్వకమైనది కాకపోవచ్చును మరియు మనం దానిని గ్రహింపకుండా కూడా వుండివుండవచ్చును. ఒకసారి దేవుడు మనలను ఒప్పింపజేసి, తెలియజేసిన పాపాన్ని మనం పరిష్కరించవలసియున్నది. లేనియెడల, మనం పాపాన్ని లక్ష్యము చేసిన వారమవుతాము మరియు దేవుడు మన మనవి వినకపోవును.

మన హృదయాలలో పాపమును దాచి వుంచుకున్నట్లయితే, దేవుడు జవాబిస్తాడను నమ్మకంతో ప్రార్థించలేము. ఏదేమైనా, ఆ దాగిన పాపములను ప్రత్యక్షపరచమని ఆయనను అడిగినట్లయితే, ఆయన అలా చేస్తాడు. ఆయన ప్రత్యక్షపరచినపుడు, ఆయనతో మన సంబంధాన్ని కొనసాగించవలెనంటే, మనం వెంటనే స్పందించవలసి యున్నది. ఉదాహరణకు, మనం సత్యం చెప్పని ఒక సందర్భాన్ని ఆయన మన మనసులోనికి తెచ్చినట్లయితే, మనం *అబ్బ! ఇది ఏమంత పెద్ద విషయం కాదు. అది చిన్న, అపాయం లేని అబద్ధం,* అని తలంచకూడదు. ఆయన చూపించు దేనినైనా మనం పెద్ద విషయం కాదని కొట్టి వేయలేము. దానికి బదులుగా, మనం పాపము చేశామని ఒప్పుకొని, అబద్ధమాడినందుకు పశ్చాత్తాపపడి, క్షమాపణను పొందుకొనవలెను.

అతి తరచుగా, మనం "చిన్న విషయాలు" అని పిలిచేవే, వాటిని పాపపు అలవాట్లుగా మరియు విధానాలుగా మారుటకు మనం అనుమతించుట వలన పెద్ద సమస్యలకు

దారితీస్తాయి. మన జీవితాలలోని పాపాలను దేవుడు ప్రత్యక్షపరచినప్పుడు, దానిని ఆపివేసి పశ్చాత్తాపపడవలసివున్నది. ఆయన చెప్పిన దానిని గంభీరంగా – వెంటనే తీసికొనుట ద్వారా, ఆయనను గౌరవించవలసిన వారమైయున్నాము! దేవునితో మన సంబంధం పాపము ద్వారా ఆటంకపరచబడకుండు నట్లుగా మనం పరిశుద్ధంగా, తేటగా వుండుటకు మన శక్తికొలది ప్రయత్నించాలని దీని అర్థమైయున్నది. లేకపోయినట్లయితే, మన ప్రార్థనలు వినబడకుండా, జవాబులేకుండా వుంటాయి.

## 4. దేవుని చిత్తము కాని దానిని ప్రార్థించుట

దేవుని చిత్తానుసారంగా ప్రార్థించకపోవుట కూడా మన ప్రార్థనలకు జవాబు రాకుండునట్లుగా చేస్తుంది. దేవుని చిత్తానుసారంగా ప్రార్థించుటకు ఒక ఉత్తమ మార్గం ఏమిటంటే, చేయగలిగి నంత వరకూ వాక్యమును ప్రార్థించుట. మనం ప్రార్థిస్తున్న దానికి మద్దతుగా ఒక వాక్యాన్ని, లేక వాక్యభాగాన్ని లేక దేవుని వాక్యంలోని ఒక నియమాన్ని ప్రార్థించవలసివున్నది.

మన అవసరతలన్నిటినీ వివరంగా తెలుపు ప్రతి వాక్యం మనము కనుగొనకపోవచ్చును. ఉదాహరణకు, ఒక క్రొత్త కారు కొనమని నిర్ధిష్టంగా చెప్పుటకు మనకు బైబిలు నందు వాక్యం కనిపించక పోవచ్చును, అయితే మన అవసరతలన్నిటినీ దేవుడు తీర్చుతాడను వచనం మనము కనుగొనగలము. క్రొత్త కారు అనునది న్యాయమైన కోరిక అయినట్లయితే, మనం ఆ వాక్య ప్రకారంగా మన అవసరతలన్నిటినీ తీర్చుట దేవుని చిత్తమైయున్నదని నమ్మి, ప్రార్థించగలము.కొన్ని సమయాలలో మనం ప్రార్థించగోరిన విషయాలు వుంటాయి, అయితే వాక్యాన్ననుసరించి, అవి మన కొరకైన దేవుని చిత్తమో, కాదో మనకు ఖచ్చితంగా తెలియదు.అటువంటి విషయాలలో, అది చేయుట దేవుని చిత్తమైతే చేయమని, ఆయన నిర్ణయముతో తృప్తిపొందుటకు మనకు సహాయం చేయమని దేవుని అడుగవలసియున్నది.

మరొక విధంగా, తన వాక్యంలో నిర్ధిష్టంగా చెప్పాడు గనుక, దేవుని చిత్తంలోని భాగాలని మనకు తెలియు విషయాలు కొన్ని వున్నాయి. వాటిలో ఒకటి. ఆయన "..... ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు...." అని 2 పేతురు 3:9 చెబుతుంది. కాబట్టి, మనుష్యులు రక్షింపబడాలని ప్రార్థించునపుడు మనం దేవుని చిత్తప్రకారం ప్రార్థిస్తున్నామని మనకు తెలుస్తుంది.

> ఆయన చిత్తంలో, ఆయన సమయం కూడా ఒక భాగము.

దేవుని చిత్తంతో ఏకీభవించి ప్రార్థించినపుడు, మనం

అడిగిన దానిని మనం పొందుకుంటాము. మనం వేచియుండవలసి రావచ్చును. ఎందుకంటే, ఆయన చిత్తంలో, ఆయన సమయం కూడా ఒక భాగము, అయితే అది జరుగుతుంది. మనం "అది నాది. నేను దానిని చూడలేక పోవచ్చును, అయినా, అది నాకు చెందుతుంది, కాబట్టి, అది వచ్చు దారిలోనే వున్నది" అని చెప్పవచ్చును.

మనందరం పొరబాటుగా కొన్నింటిని అడిగివుంటామని నాకు తెలుసు, అయినా దేవుడు హృదయాలను ఎరిగినవాడు. మనము అడిగిన దానిని ఆయన యివ్వక పోయినప్పటికీ, మనం మంచి భావనలను కలిగివున్నట్లయితే మనకు మరింత ఉత్తమమైనదానిని యిస్తాడని నేను నమ్ముతున్నాను.

## 5. తప్పుడు ఉద్దేశాలతో ప్రార్థించుట

యాకోబు 4:2 "మీరు అడుగనందున, పొందుకొనుట లేదు" అని చెప్తుందని మీకు తెలుసు, అయితే తరువాతి వచనాన్ని కూడా చూడవలెనని నేను ఆశపడుతున్నాను. అది "మీరడిగినను మీ భోగముల నిమిత్తము వినియోగించుటకై దురుద్దేశముతో అడుగుదురు గనుక మీకేమియు దొరకుటలేదు" అని చెబుతున్నది. ఉద్దేశము అంటే ఒక "ఏమిటి" వెనుక వున్న "ఎందుకు." మనం ఎందుకు చేస్తున్నాము అనుదానిపై ఏమి చేస్తున్నామనునది ఆధారపడివుంటుంది. ప్రార్థనలో మనం చెప్పు మాటలకంటే, మనం ప్రార్థించు కారణం ముఖ్యమైనదై వున్నది. దేవుడు మన హృదయాలను చూచుచున్నాడు, మరియు ఆయన ఒక అపవిత్రమైన ఉద్దేశాన్ని చూచినపుడు ఆ ప్రార్థనకు జవాబివ్వడు.

దేవుని మరియు యితరులను యథార్థముగా ప్రేమించు శుద్ధ హృదయము, ఎల్లప్పుడూ దేవునికి అంగీకారయోగ్యమైన ఉద్దేశమైయున్నది. స్వార్థం అనంగీకారము ప్రతీకారము అనంగీకారము వక్రముగా హృదయములను త్రిప్పుట మరియు నియంత్రించుట అనంగీకారము అసూయ అనంగీకారము గర్వము అనంగీకారము. నిజానికి, స్వార్థపూరితమైన మరియు ప్రేమలేని ప్రతీదీ అనంగీకారమైన ఉద్దేశమైయున్నది.

నా పరిచర్య వృద్ధిపొందునట్లుగా చేయమని నేను ప్రార్థించి, ప్రార్థించిన రోజులున్నాయి, ఎందుకంటే పెద్ద, పేరుగల పరిచర్యను కలిగివుండుట వలన నేను చాలా ప్రాముఖ్యంగా వుంటానని నేను తలంచానని నేను ఒప్పుకుంటున్నాను. ఏం జరిగిందో మీకు తెలుసా? పరిచర్య ఎంతమాత్రమూ వృద్ధిపొందలేదు! నిజానికి, నా ఉద్దేశములు శుద్ధిపరచబడువరకూ అది వృద్ధిపొందుటకు మొదలుపెట్టలేదు. నాలోని స్వార్థం నశించింది, మరియు నేను ఇంకా ఎక్కువ మందికి సహాయ పడుటకు పరిచర్య వృద్ధిపొందాలని ఆశపడుట మొదలు పెట్టాను.

అదేవిధంగా, ఒక పరిస్థితిలో మనం మన ఇష్టప్రకారం జరగాలని ఆశపడి, అవతలి వ్యక్తికి ఏది ఉత్తమమో తెలిసికొనకుండానే, ఆ వ్యక్తి మనసు మార్చమని, మనతో ఏకీభవించేట్లు చేయమని దేవుని కోరుతుంటాము. ఆ విధమైన స్వార్థపూరిత ప్రార్థనలకు దేవుడు జవాబివ్వడు. మనం క్షమాపణ చెప్పవలెనని దేవుడు కోరిన పరిస్థితిలో మనం ఇతరులు మనకు క్షమాపణ చెప్పవలెనని దేవుని అడిగివుండి వుండవచ్చును. జరిగినదాంట్లో మన తప్పు లేకపోయినప్పటికీ, సమాధానం చేయుటలో మనము ముందువుండి, తగ్గింపు స్వభావం కలిగినవారమై వుండాలని దేవుడు కోరుకుంటున్నాడు. ఆయన అలా ఎందుకు చేస్తాడు? ఎందుకంటే, మన యెడల ఒకరు తప్పు చేశారు గనుక మన దూరపు పరుగులో మన భావాలను మెత్తపరచునట్లుగా తగ్గింపు అనునది చాలా విలువైనదైయున్నది.

మనం సరియైన ఉద్దేశాలతో ప్రార్థించునట్లుగా, మన హృదయాలను శుద్ధి పరచమని దేవుని అడుగవలసియున్నది. మన ఉద్దేశాలను పరీక్షించుకొనుటలో మనము నిజాయితీగా వుండవలసియున్నది. నేను చేయుచున్నదానిని, ఎందుకు చేస్తున్నానని నన్ను నేను ప్రశ్నించుకొనుట మొదలు పెట్టిన తరువాత నా జీవితంలోచాలా విషయాలు మారిపోయినాయి. అదేవిధంగా, నా ప్రార్థనల వెనుకవున్న ఉద్దేశాలను గురించి మరింత సున్నితంగా వుండుట మొదలుపెట్టిన తరువాత, నా ప్రార్థనలనేకం మారినవి. మన ఉద్దేశాలన్నిటినీ చూచుకొనుట బాధాకరముగానే వుంటుంది, అయినప్పటికీ, దేవుని యెదుట శుద్ధ హృదయంతో నివసించాలను కోరికను మనం కలిగివున్నప్పుడు అది తప్పకుండా చేయవలసియున్నది.

## 6. అనుమానము మరియు అపనమ్మకము

జవాబు పొందు ప్రార్థనకు విశ్వాసం అనునది పునాదియై వుందని మనకు తెలుసు, కాబట్టి, విశ్వాసమునకు వ్యతిరేకములైన – అనుమానము మరియు అపనమ్మకము అనునవి జవాబు పొందు ప్రార్థనకు ఆటంకములని కారణముచే తెలుస్తున్నవి. విశ్వాసం అనునది శక్తివంతమైన ఆత్మీయ బలం మరియు దేవుడు స్పందించు, ఆశీర్వదించునదియై యున్నది. అయితే మన విశ్వాసమునకు వ్యతిరేకమైనవి లేకపోలేదు. సాతాను మన మనసులను అనుమానము, అపనమ్మకముతో మరియు ప్రశ్నలతో ఎదుర్కొంటాడు. వాడు అలా చేసినపుడు, మన హృదయాలు ఏమి చెప్తున్నవో అని వాటిని పరీక్షించవలసివున్నది. మన మనస్సులు ప్రశ్నిస్తున్నప్పటికీ, మన హృదయాలలో నమ్ముతుంటాము, మన తలలలో వున్నది కాకుండా, మన హృదయాలలో వున్న వాటిని మనం నమ్మవలసివున్నది. మనం మన అనుమానాలను నమ్మకూడదు మన అనుమానాలను అనుమానించి, దేవుని నమ్మవలసివున్నది.

అనుమానమును, అపనమ్మకమును అధిగమించుటకు ఒక తాళంచెవిని హెబ్రీ 12:2 నందు కనుగొంటాము. అది “.....విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన

యేసు వైపు చూచుచు......” అని చెప్తుంది. అనేక సమయాలలో, అనుమానం మరియు అపనమ్మకం అనునవి, పరధ్యానము లేక వ్యాకులమునుండి కలుగుతాయి. దేవుని వాగ్దానాలు మరియు మనలోని దేవుని సామర్థ్యమునుండి మన దృష్టి మళ్లింపబడినపుడు, మనలో అనుమానం మొదలవుతుంది. మన సమస్యల గురించి లేక సవాళ్ల గురించి మనం ఎక్కువగా ఆలోచించుటకు మొదలుపెడతాము, అది మన విశ్వాసాన్ని మందగింపజేస్తుంది. అయితే మనం హెబ్రీ 12:2 చెప్పిన విధంగా మన దృష్టి క్రీస్తుపై వుంచవలసియున్నది. అనుమానమును అడ్డగించి, విశ్వాసములో నిలుచు క్రమములో ఆయనను, ఆయన మంచితనమును, మనకు సహాయపడగల సామర్థ్యమును, మన యెడల ఆయన ప్రేమను తేరిచూడవలసియున్నది, మరియు సమస్యను కేవలం తక్కువగా చూడవలసియున్నది. మనము సమస్యలు లేవని అనుట లేదు కానీ వాటికి ఎక్కువ విలువ నిచ్చుటకు నిరాకరిస్తున్నాము.

దేవుడు చెప్పిన దాని పై నుండి మన విశ్వాసమును మరియు దృష్టిని మళ్లించేవిగా వున్న వాటిపై నుండి మన దృష్టిని మళ్లించుకొనుట అనునది అనుమానమునకు మరియు అపనమ్మకమునకు ఒక వ్యతిరేక ఔషధమైయున్నది. మన విశ్వాసమునకు కర్త, దానిని చివరి వరకూ కొనసాగించువాడు ఆయనేనని మనము జ్ఞాపకం చేసికొనవలసియున్నది – కాబట్టి, అనుమానించుటకు ఏ కారణము లేదు.

అనుమానముతో అడుగువాడు, ద్విమనస్కుడని, అతను తన సమస్త మార్గములలో అస్థిరుడుగా వుంటాడు గనుక తాను అడుగు దేనినీ పొందుకొనలేడనీ అపొస్తలుడైన యాకోబు చెబుతున్నాడు (యాకోబు 1:6–8). మనం ఏమి నమ్మవలెనో నిర్ణయించుకుని, పరిస్థితులు కదులుచున్నప్పటికీ మనస్సులు మరకుండా చూచుకొనవలసియున్నది. మనము నమ్మిన యెడల దేవుని మహిమ చూస్తామని చెప్పిన యోహాను 11:40 లోని వాగ్దానమును జ్ఞాపకం చేసికొనవలసియున్నది.

## 7. చింత

తాము ప్రార్థించిన తరువాత, చింత పడుట, మనుష్యులు తమ ప్రార్థనకు జవాబులు పొందకపోవుటకు మరొక కారణమైయున్నది. “దేనిని గూర్చియు చింతపడకుడి గానీ ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి” అని ఎఫెసీ 4:6 చెప్పుచున్నది. విచారము, చింతకు పర్యాయపదమైయున్నది, మరియు దీని అర్థము, రేపటిని గురించి ఈ దినం అంచనా వేసికొనుట లేక రేపటిని గురించి నేడు భయపడుట – మరియు మనం దేనిని గూర్చియు విచారించవలసిన అవసరం లేదు.

> విచారము.... దీని అర్థము, రేపటిని గురించి ఈ దినం అంచనా వేసికొనుట లేక రేపటిని గురించి నేడు భయపడుట

మనం ప్రార్థించి, తరువాత చింతపడినట్లయితే, మనం దేవుని యందలి నమ్మికను అభ్యసించుట లేదు. మన భారాలను లేక అవసరతలను పూర్తిగా ఆయనపై వదలివేయుట లేదు వాటిని "వెనుకకు తీసికొని" మన మనస్సులలో పనిచేస్తున్నాము. మనం ప్రార్థిస్తున్న విషయంలో మన చేతులు వుంచుటకు మనం బలవంతముగా ప్రయత్నించి, దేవునికి అది పూర్తిగా అప్పగించనట్లయితే, మన ప్రార్థనలకు జవాబిచ్చుటకు ఆయనకు పూర్తి స్వాతంత్ర్యము వుండదు. దేవుని నమ్ము తున్నామని మనం చెబుతాము, అయితే ఒకవేళ దేవుడు సహాయం చేయకపోతే ఏమి చేయాలను దానికి ఒక ప్రణాళిక వేసి వుంచుకుంటాము. మన సమస్యలను గురించి ధ్యానించుటయే చింత, అయితే దేవుని వాక్యమును ధ్యానించ వలెను గాని మన సమస్యలను కాదని మనకు చెప్పబడినది.

చింతకు, విచారమునకు వ్యతిరేకమైనది శాంతి. మనం శాంతినందు జీవించవలెనంటే, ఒక దినమును ఏ విధంగా జీవించాలో నేర్చుకొనవలసియున్నది. మత్తయి 6:34 నందు యేసు "రేపటిని గూర్చి చింతింపకుడి రేపటి దినము దాని సంగతులను గూర్చి చింతించును ఏనాటి కీడు ఆనాటికి చాలును." అని చెప్పియున్నాడు. మరొక మాటలో చెప్పవలెనంటే, రేపటిని గురించి చింతిస్తూ, ఈ దినాన్ని గడపవద్దని యేసు చెప్పుచున్నాడు. మన "ఈ దినము" నకు చాలినంత సమస్య వున్నది – మరియు ఆ సమస్యకు చాలిన కృప, శక్తి వున్నవి. ప్రతి దినం దాని సమస్యలను కలిగివున్నట్లే, ప్రతి దినమునకు తగిన కృప వున్నది. రేపటి దినమును జీవించుటకు దేవుడు ఈ దినం కృపనివ్వడు. మనము రేపటి దినమును గూర్చి చింతించుటకు తిరస్కరించువారముగాను, మన ప్రార్థనలను దేవుని చేతిలో వదలిపెట్టుటకు యిష్టపడువారముగాను, మరల వాటిని తీసికొనని వారముగాను వుండవలసియున్నది.

## 8. కృతజ్ఞత

కృతజ్ఞత అనునది జవాబులిచ్చు ప్రార్థనకు ఒక ఆటంకమైయున్నది. నేను 5వ అధ్యాయంలో వ్రాసినట్లుగా, దేవుడు యిచ్చిన దాని గురించి మనం సణుగుతూ వున్నట్లయితే, ఆయన యింకను ఎక్కువ ఎందుకు ఇవ్వాలి? అదే సమయంలో, మనం ఆయన మంచితనమును ఔదార్యముగా పొగడుతూ వుండి, ఆయన చేసినదానిని బట్టి కృతజ్ఞతా హృదయాలు కలిగివున్నట్లయితే మనలను ఆశీర్వదించుటకు ఆయన కొనసాగిస్తాడు.

కృతజ్ఞత అనునది ఒక మనిషి హృదయం సరిగా లేదని సూచిస్తుంది. మనుష్యులు తమకు కావలసిన దానిని పొందుకొనక పోవుట వలన ఫిర్యాదులు చేస్తూ సణుగుతూ ఉండరు అది వారి వ్యక్తిత్వపు సమస్యయైయున్నది. దైవ భక్తి గల వ్యక్తిత్వం కలిగి వున్న వారు దేవుడు తమకు చేసిన దానిని బట్టి ఎల్లప్పుడూ కృతజ్ఞత కలిగివుంటారు. కృతజ్ఞత అనేది మన దృష్టిని దేవునిపై కేంద్రీకరింప జేస్తుంది.

మరొక విధంగా కృతజ్ఞత అనేది మనుష్యులు ఎన్నటికీ తృప్తి చెందకుండా తమ అసంతృప్తిని గురించి మాట్లాడే వారిగా చేస్తుంది. సణుగుడు మరియు ఫిర్యాదులు చేయుటకంటే ఎక్కువగా ఏది ఒక మనిషి జీవితమును ప్రభావితము చేయునట్లుగా సాతానుకు ద్వారాలు తెరువదని నేను నమ్ముతున్నాను, ఎందుకంటే మనము గొణుగునప్పుడు వాడితో ఏకీభవిస్తున్నాం. మనం కృతజ్ఞతావచనాలు పలికినప్పుడు దేవునితో ఏకీభవిస్తున్నాం ఎందుకంటే ఫిర్యాదులు చేయకుండా కృతజ్ఞత కలిగి వుండాలని చెప్పు వాక్య భాగాలతో బైబిల్ నింపబడింది. కృతజ్ఞత కలిగిన వ్యక్తి శక్తివంతుడు, మరియు ఎప్పుడైతే మనము కృతజ్ఞత కలిగి వుంటామో, ఇంతకు మునుపు చేయని వాటిని కూడా దేవుడు మన కొరకు చేయుటకు సిద్ధమవుతాడు.

మనం కృతజ్ఞతను "అనుభవించక" పోయినప్పటికీ కృతజ్ఞులముగా "వుండగలము." మనకు తప్పుగా అనిపించినప్పటికీ సరిగా వుండుటనే ఎంచుకొనగలము. ఈ శక్తివంతమైన ఆత్మీయ బలమును మనము నేర్చుకొను వరకు, ఆత్మలో నిజముగా నడుస్తామన్న నమ్మకం లేదు.

తన జీవితంలో అధిక శ్రమలు పొంది, ఫిర్యాదులు చేయుటకు ఎక్కువ ఆస్కారము వున్న అపోస్తలుడైన పౌలు గారు ఈ విధంగా చెప్తున్నాడు: "నేనేస్థితిలో వున్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగియుండ నేర్చుకొనియున్నాను. దీన స్థితిలో వుండనెరుగుదును, సంపన్న స్థితిలో వుండనెరుగుదును" (ఫిలిప్పీ 4:11-12). మరొక మాటలో, మనము ఏవిధంగా భావించినప్పటికీ ప్రతీ పరిస్థితిలో కృతజ్ఞత కలిగి యుండవలసివున్నది. పరిస్థితులు బాగుగా జరుగుతున్నప్పుడే కాకుండా, జీవితపు శ్రమలలోనూ, ఆటంకములలోనూ, నిరాశలలోనూ ధృఢముగా నిలువబడుటయే నిజమైన కృతజ్ఞత. మనము కృతజ్ఞతను కలిగివుండుటను దేవుడు చూచినపుడు తప్పకుండా మన ప్రార్థనలకు జవాబిస్తాడు.

## 9. ప్రతికూలమైన ఒప్పుకోలు

ప్రతికూలమైన ఒప్పుకోలుతో మన ప్రార్థనలను మనమే ప్రభావము లేని వాటిగా చేసికొంటాము. మన మనస్సులలో అనుమానము మరియు అపనమ్మకము నాటుకొనుటకు మనము అవకాశము యిచ్చి, ప్రతికూలముగా మాటలాడుటకు మొదలు పెట్టినప్పుడు మన ప్రార్థనలను మనమే

ఆటంకపరచుకుంటాము. మనము దేనినైనా అడుగుతూ దేవుని ప్రార్థించి, తరువాత "దేవుడు నాకొరకు యిది చేయడేమో అని భయంగా వుంది" అని చెప్పినట్లయితే అది ప్రతికూలమైన ఒప్పుకోలు.

మనం మాటలాడు మాటలు మనము గ్రహించు దాని కంటే శక్తివంతమైనవి. నిజానికి, సామెతలు 18:21 "జీవ మరణములు నాలుక వశము, దాని యందు ప్రీతిపడువారు దాని ఫలము తిందురు. మరొక మాటలో చెప్పాలంటే మనము ఏమి చెప్తామో దానిని పొందుకుంటాము కాబట్టి మనము ప్రతికూలముగా కాక, అనుకూలముగా ప్రార్థించవలసి వున్నది.

మన హృదయాలు అనుమానంతో నిండియున్నప్పుడు, మనము ప్రతికూలపు మాటలు మాటలాడుతాము, అయితే అది విశ్వాసముతో నింపబడియున్నప్పుడు మన మాటలు దేవుని యందలి మన విశ్వాసమును నమ్మకమును తెలియజేసేవిగా వుంటాయి.

యెషయా 53:7 యేసును గురించి "అతడు" దౌర్జన్యమునొందెను, బాధింపబడినను అతను నోరు తెరువలేదు" అని చెప్తుంది. యేసు "తన నోరు తెరువలేదు" మరియు ప్రతికూలపు మాటలు మాటలాడ లేదు ఎందుకంటే తప్పుడు సమయంలో ప్రతికూలముగా మాటలాడుట వలన తాను దేవుని ప్రణాళికను త్రుంచి వేస్తానని లేక ఆలస్యం చేస్తానని యేసుకు తెలియును. కచ్చితంగా, ఆయన శ్రమలు కష్టమైనవి – ఊహించలేనంత క్రూరత్వం కలిగినవి – అయిప్పటికీ ఆయన ఫిర్యాదులు చేయలేదు.

మన గురించి కూడా ఇదే విధంగా – కష్టసమయములలో వెళుతున్నప్పటికీ నోరు తెరువలేదను మాటను పొందవలసివున్నది. మనము ఫిర్యాదులు చేయకూడదు సణుగ కూడదు ఇతరుల గురించి మాటలాడకూడదు మన మాటలతో దేవుని అనుమానించ కూడదు. మనమేమైయున్నామో దానిని బట్టి పుట్టవు గానీ, మనమేమైయున్నామో దానిని సూచించునవిగా వున్నవి, ఎందుకంటే అవి మన హృదయాలలో వున్న దానిని ప్రత్యక్షపరచుచున్నవి. మత్తయి 12:34, "హృదయమందు నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడును కదా" అని చెప్తుంది. మన హృదయాలు అనుమానంతో నిండియున్నప్పుడు, మనము ప్రతికూలపు మాటలు మాటలాడుతాము, అయితే అది విశ్వాసముతో నింపబడియున్నప్పుడు మన మాటలు దేవుని యందలి మన విశ్వాసమును నమ్మకమును

తెలియజేసేవిగా వుంటాయి. ప్రతికూలపు మాటలు పలుకు ప్రార్థనను దేవుడు విన్నప్పుడు, స్పందించడు. అయితే ఆయన యందలి విశ్వాసమును వ్యక్తపరచు మాటలు కలిగిన ప్రార్థన వినబడినప్పుడు జవాబిచ్చుటకు ఆనందించు వాడైయున్నాడు.

## 10. ఏకాగ్రతయుంచుటకు విఫలమగుట

ప్రార్థనలు జవాబు పొందలేకపోవుటకు మరియొక కారణం ఏమిటంటే మనము ప్రార్థించునపుడు ఏకాగ్రత కలిగివుండము మరియు పరలోకమునకు మన హృదయములు సంబంధం కలిగియుండునట్లుగా జాగ్రత్త కలిగియుండము. దీనిని తెలిసికొనుటకు ముందు, మనము స్వల్పమైన అర్థము కలిగిన మాటలు మాటలాడుతూ వున్నాము లేక మన జీవితంలోని అనేక ఒత్తిడులు మరియు క్రియల వలన మనస్సు మళ్ళింపబడుతున్నాము. చివరకు దేవునితో మాటలాడుటకై ఏకాగ్రత నిలుపకుండా, ఆయనను నిజముగా పట్టించుకొనకుండా ముగిస్తున్నాము – జవాబు పొందవలసిన ప్రార్థనకు అది మంచి మార్గము కాదు!

ఏకాగ్రత గురించి నాకు తెలిసిన మంచి కథలలో ఒకటి సింహములను మచ్చిక చేసుకొనుట. సింహములకు శిక్షణను యిచ్చువాడు ఆ బోనులోనికి వెళ్ళునపుడు తనతో మూడింటిని తీసుకు వెళతాడు: ఒక కొరడా, ఒక తుపాకీ, మూడు లేక నాలుగు కాళ్ళు వున్న స్టూలు. అతను లోపలికి వెళ్ళినపుడు సింహము వైపు ఆ కాళ్ళను చూపిస్తూ స్టూలు ఎత్తి పట్టుకుంటాడు. ఎందుకు? ఎందుకంటే సింహం ఒకటి కంటే ఎక్కువ వాటి మీద తన దృష్టిని నిలుపలేదు. ఆ స్టూలు మీద ఒకటి కంటే ఎక్కువ కాళ్ళను ఆ సింహం చూసినపుడు అది ఏకాగ్రతను కోల్పోయి తన శిక్షకునిపై దాడి చేయలేదు.

ఒక విధంగా మనం కూడా సింహం లాంటి వారమై అనేక సమస్యలు ఒక్కసారిగా వచ్చినప్పుడు పని చేయలేకుండా పోతామని నేను నమ్ముతాను. మనం ఏకాగ్రత నిలుపలేనప్పుడు, ప్రభావవంతంగా మరియు ఫలవంతంగా ఉండలేము. సామెతలు 4:25–27, “నీ కన్నులు ఇటు అటు చూడక సరిగాను నీ కనురెప్పలు నీ ముందర సూటిగాను చూడవలెను నీవు నడుచు మార్గమును సరాళము చేయును, అప్పుడు నీ మార్గములన్నియు స్థిరములగును. నీవు కుడి తట్టుకైనను, ఎడమ తట్టుకైనను తిరుగకుము....” అని చెప్తుంది.

మనము దేవుని వద్దనుండి పొందుకోవాలనుకున్నట్లయితే – మన ప్రార్థనలకు జవాబు పొందాలని అనుకున్నట్లయితే – మన ప్రార్థనలోనే కాకుండా, జీవితంలో కూడా ఏకాగ్రత చూపవలసి యున్నది. మనము ఏమి చేయుటకు పిలువబడి యున్నామో దానిని తెలిసికొని, దానికి ప్రాధాన్యతనిచ్చి, దాని కొరకు ప్రార్థించి మరియు మన ప్రార్థనలకు దేవుడు జవాబిచ్చు చుండగా మరియు మన ద్వారా గొప్ప కార్యాలను చేయు చుండగా గమనించవలసినవారమై యున్నాము.

దేవుడు నిన్ను ఏమి చేయుటకు పిలచియున్నాడో తెలిసికో బాధ్యత కలిగియుండు ఆ విషయాలను ఎల్లప్పుడూ మనసు నందుంచుకొనియుండు. నీ ప్రార్థనల కంటే ఎక్కువగా ఎవరి ప్రార్థనలు కూడా నా జీవితంలో, పరిచర్యలో మరియు కుటుంబంలో ప్రభావాన్ని చూపించవు. పౌలు తిమోతితో పరిచర్యకు అప్పగించుకొనుమని చెప్పినప్పుడు "వీటిని మనస్కరించుము, వీటియందే సాధకము చేసికొనుము" అని చెబుతున్నాడు. ప్రార్థన అనునది కాంతికిరణం వంటిది. యిది శక్తివంతమైనది, అయితే, కోరిన ఫలితమును పొందువరకూ ఆ ప్రదేశంలో ఏకాగ్రత కలిగివుండవలసియున్నది. దేవుడు నీకు అప్పగించినదానిపై దృష్టిని కేంద్రీకరించు. ఏకాగ్రత కలిగిన ప్రార్థన శక్తివంతమైనదైయున్నది.

## 11. అవసరతలో నున్న వారిపై శ్రద్ధ చూపకపోవుట

"కనికరమనునది ఇతరుల యెడల జాలికి, శ్రద్ధకు, మనసులో నుంచుకొనుటకు తోడుగా నిలుచుచున్నది." మరియు "కనికరము కలిగిన వ్యక్తికి ప్రార్థన చెందుతుంది" అని ఇ.ఎమ్ బౌండ్స్ వ్రాస్తున్నాడు. మనము పేదల యెడల దయను, కనికరమును కలిగివుండాలి. నేను యింతకు మునుపే చెప్పినప్పటికీ మరల, సామెతలు 21:13 "దరిద్రుల మొఱ్ఱ వినక చెవి మూసికొనువాడు తాను మొఱ్ఱపెట్టునపుడు అంగీకరింపబడడు'' అని చెప్పాలనుకుంటున్నాను. ఆ వచనమే చాలా మాటలాడుతుంది. దేవుడు మన ప్రార్థనలు వినాలని మనం అనుకుంటే, మనకంటే తక్కువ స్థితిలో వున్నవారిని గురించి మనం శ్రద్ధ చూపాలి.

మొదటి యోహాను 3:17-18 "ఈ లోకపు జీవనోపాధిగలవాడై యుండి, తన సహోదరునికి లేమి కలుగుట చూచియు, అతని యెడల ఎంతమాత్రమును కనికరము చూపనివానియందు దేవుని ప్రేమ యేలాగు నిలుచును? చిన్నపిల్లలారా, మాటతోను, నాలుకతోను కాక క్రియతోను, సత్యముతోను ప్రేమింతము" అని చెబుతుంది. అవసరతలో వున్న వారిగురించి మనము వినినపుడు, మరియు అనేక కారణాలకు మనము మన చెవులను లేక హృదయమును మూసివేసుకుంటాము. మొదటగా, వారిని గురించి యింకెవరైనా శ్రద్ధ తీసుకుంటారులే అని ఆలోచిస్తాము. వేరొకరు ఎవరూ వారి గురించి శ్రద్ధ తీసుకొనరని మీకు చెప్పాలనుకుంటున్నాను. యేసు క్రీస్తు సంఘం పేదలకు, అవసరతలో వున్నవారికి సహాయం చేయుటకు దేవునిచే పిలువబడి, పంపబడియున్నది. ప్రభుత్వం పిలువబడలేదు, పంపబడలేదు మరియు ప్రభుత్వం దేవుని ద్వారా అభిషేకింపబడలేదు – కానీ మనుష్యులు అభిషేకింపబడినారు. రెండవదిగా, మనలను ఎవరైనా సులువు చేసుకుంటారేమో అని భయపడతాము. నిజమే, అది జరుగకుండా మనము చూసుకొనవలసియున్నది. మనం పరిశుద్ధాత్మచే నడిపింపబడి, మనకు సరిగా అనిపించినదానిని, మరియు ఇతరులు మనలను తమ స్వార్థమునకు

ఉపయోగించుకొనకుండునట్లుగా చేయవలెను. మూడవదిగా, మనం కేవలం సోమరులముగా వుండివుండ వచ్చును. క్రీస్తు ఆజ్ఞలను నిర్లక్ష్యపరచుటకు, సోమరితనం మంచి కారణం కాదు, కాబట్టి మనం లేచి, మన చుట్టూ వున్నవారి అవసరతల నిమిత్తం ఏమైనా చేయవలసియున్నది.

మనకు అనేక అవసరతలు తెలిసినందు వలన ఉక్కిరి బిక్కిరవుతూ వుండి వుండవచ్చును, లేకపోతే అనేక అవసరతలు వింటూ వున్నందు వలన మనం కఠినంగా మారి వుండవచ్చును. ఈ దినాలలో, విషాదం మరియు నాశనం అనునవి దిన పత్రికలను, టి.వి. ప్రసారాలను నింపుతున్నవి. మనం నిరంతరంగా భయంకరమైన రోగాలు, ప్రమాదాలు, భూకంపాలు, సునామీలు, అగ్నిప్రమాదాలు, వరదలు, హరికేన్‌లు మరియు యితర నాశనాలను వింటున్నాము.

దేవుడు మనలను కనికరము కలిగినవారిగా చేసియున్నాడు, మరియు 1 యోహాను 3:17 నందు మనము అవసరతను చూచినపుడు, హృదయములను మూసికొనకూడదని బోధింపబడినాము. మన ప్రేమలను చల్లబరచాలని సాతానుడు ప్రయత్నిస్తాడు. నిజానికి, ప్రేమ చల్లారుట అనునది, అంత్యదినముల యొక్క సూచనయని మత్తయి చెబుతున్నాడు. మత్తయి 24:12 "అక్రమము విస్తరించుట చేత అనేకుల ప్రేమ చల్లారును" అని చెబుతుంది. మనకంటే తక్కువ స్థితిలోవున్న వారికి నిరంతరంగా సహాయపడుతుండుట అనునది మన ప్రేమ చల్లారుట, హృదయ కఠినత్వము అను బలమైన కోటగోడలను కూల్చేస్తుంది. నీ హృదయమును మూసికొనుట లేక నీ ప్రేమ చల్లారుట ద్వారా, నీవు వినిన అవసరతలను నిర్లక్ష్యపెట్టవద్దు, బదులుగా, వాటికి స్పందించు.

> నీ హృదయమును మూసికొనుట లేక నీ ప్రేమ చల్లారుట ద్వారా, నీవు వినిన అవసరతలను నిర్లక్ష్యపెట్టవదు.

దేవుని యెదుట పవిత్రమైన భక్తి రహస్యం "దిక్కులేని పిల్లలను, విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించుటయు...." (యాకోబు 1:27) అని యాకోబు గ్రంథము చెబుతుంది. ఈ రెండు రకాల మనుష్యులు (దిక్కులేని పిల్లలను, విధవరాండ్రు) దేవునికి చాలా ప్రాముఖ్యమైనవారు మరియు వీరిని గురించి బైబిలులో అనేక సార్లు చెప్పబడినది, అయితే దిక్కులేని పిల్లలు, విధవరాండ్రు అని చెప్పుట అనునది బాధింపబడువారు, ఒంటరివారు, హింసింపబడుచున్నవారు మరియు ప్రతి విధమైన అవసరతలోనున్నవారిని సూచిస్తుందని నేను అనుకుంటాను. మనము దేవుని ప్రేమను యిటువంటి వారికి పంచనపుడు, మన ప్రార్థనలు ఆటంకపరచబడుతాయి. మనం మనుష్యులకు ఆశీర్వాదకరమైన వారిగా వుండాలి,

అయితే ప్రాముఖ్యముగా పేదవారికి, అవసరతలోనున్న వారికి, దిక్కులేని పిల్లలకు మరియు విధవరాండ్రకు ఆశీర్వాదకరముగా వుండాలి. మనం అలా చేసినట్లయితే, మనం దేవుని ప్రేమను వ్యక్తపరుస్తున్నాము మరియు ఆయన మనకు జవాబిస్తాడు.

ఇంతకు మునుపు యెషయా 58:6-9 ను గురించి చెప్పియున్నాను, అయితే ఈ అధ్యాయంలోనూ మీతో దానిని చెప్పాలనుకుంటున్నాను. "దుర్మార్గులు కట్టిన కట్లను విప్పుటయు, కాడిమాను మేకులు తీయుటయు, బాధింపబడినవారిని విడిపించుటయు, ప్రతి కాడిని విరుగగొట్టుటయు, నే నేర్పరచుకొనిన ఉపవాసము గదా? నీ ఆహారము ఆకలిగొనినవారికి పెట్టుటయు నీ రక్తసంబంధికి ముఖము తప్పింపకుండుటయు, దిక్కుమాలిన బీదలను నీ ఇంట చేర్చుకొనుటయు, వస్త్రహీనుడు నీకు కనబడినప్పుడు వారికి వస్త్రములిచ్చుటయు, ఇదియే కదా నాకిష్టమైన ఉపవాసము? ఆలాగున నీవు చేసినయెడల నీ వెలుగు వేకువ చుక్కవలె ఉదయించును. స్వస్థత నీకు శీఘ్రముగా లభించును, నీ నీతి నీ ముందర నడచును, యెహోవా మహిమ నీ సైన్యపు వెనుకటి భాగమును కావలికాయును. అప్పుడు నీవు పిలువగా యెహోవా ఉత్తరమిచ్చును. నీవు మొఱ్ఱపెట్టగా ఆయన - నేనున్నాననును."

## 12. తిరుగుబాటు

అధికారమునకు తిరుగబడుట అనునది మన ప్రార్థనలకు జవాబులు పొందకుండా ఆటంకపరుస్తుంది. ఈ పుస్తకంలో యింతకు మునుపు చదివినట్లుగా, అప్పగించుకొను హృదయము, తిరుగుబాటు హృదయమునకు వ్యతిరేకమైనదై, దేవునికి త్వరగా లోబడునదై యున్నది. తిరుగుబాటు దారియైన వ్యక్తి, మరొక విధంగా, దేవునికి ఉద్దేశపూర్వకంగా అవిధేయుడైన వ్యక్తి - మరియు మనం యింతకు మునుపే చర్చించుకున్న విధంగా, దేవుడు అవిధేయులను ఆశీర్వదించడు.

నా ప్రార్థనలను, దేవునితో నా సంబంధమును నా తిరుగుబాటుతనం ఆటంకపరుస్తుందని నేను బాగా ఒప్పింపబడిన తరువాత, తెలిసీ, తెలిసీ నా భర్తకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినపుడు, ఆయనకు, దేవునికి క్షమాపణ చెప్పనట్లయితే, స్టేజీ మీదకు వెళ్లి, బోధించుటకు భయపడేదానను. నేను అలా చేసేదానను కాను, ఎందుకంటే అప్పుడు నేను పాపమందు వుండేదానను మరియు సాతాను నన్ను నాశనము చేసియుండెడివాడు. నేను దేవుడు నాకు యిచ్చిన మరుగులో వుండవలసియున్నది. కాబట్టి మన ప్రార్థనలు జవాబులు పొందునట్లుగా మరియు మన హృదయాలు ఆయన యెదుట సరియైనవిగా వుండునట్లుగా మనందరం మన జీవితాలలో ఆయన వుంచిన అధికారముల క్రింద వుండవలసియున్నది.

# 13. క్షమించకపోవుట

మనుష్యులను క్షమించుట మిళితమైయున్న మరియు ప్రభావవంతమైన ప్రార్థనకు అతి ముఖ్యమైన స్థితియైన, ప్రేమలో నిలిచియుండుటను నేను నమ్ముతానని మీకు ముందే తెలుసు. అదే విధంగా, జవాబు పొందని ప్రార్థనకు క్షమించకపోవుట అనునది మొట్టమొదటి కారణమని కూడా నేను నమ్ముతాను. ఒక విశ్వాసి జీవితంలో యితరమైన వేటికంటే కూడా, ఎక్కువ స్థానం క్షమించకపోవుటకు యివ్వబడుతుందని చెప్పుటకు నేను సాహసిస్తున్నాను. దేవుడు మనలను చూచునట్లుగా, మనం ఇతరుల యెడల ప్రవర్తించునదైన, క్షమాపణ యొక్క ప్రాముఖ్యతను గురించి దేవుని వాక్యం అనేక వాక్య భాగాలను కలిగివున్నది. అయితే ఎఫెసీ 4:32 కంటే స్పష్టంగా క్షమాపణ అను ఆజ్ఞను చెప్పిన వాక్యభాగం నాకు కనిపించలేదు. అది "ఒకనియెడల ఒకడు దయగలిగి కరుణాహృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి" అని చెబుతుంది.

మనము మనవలెనే లోపములు కలిగిన మనుష్యులతో నిండిన లోకంలో జీవిస్తున్నాము గనుక, బాధపరచబడకుండా, హింసింపబడకుండా, వేధించబడకుండా లేక మోసగింపబడకుండా వుండలేము. కోపపడుటకు మనకు కారణములుండవచ్చును, అయితే తరగని కోపము ద్వేషానికి మరియు క్షమింపలేనితనానికి దారితీసి – మన ప్రార్థనలకు ఆటంకమవుతుంది. నిజానికి, ఎఫెసీ 4:26 "కోపపడుడి గాని పాపము చేయకుడి సూర్యుడస్తమించువరకు మీ కోపము నిలిచి యుండకూడదు" అని చెప్తుంది. దేవుడు మన ప్రార్థనలకు జవాబు యివ్వవలెననుకుంటే, మనం కోపాన్ని చంపుకుని, క్షమాపణను పెంచుకొనవలసి యున్నది.

జవాబు పొందని ప్రార్థనకు క్షమించకపోవుట అనునది మొట్టమొదటి కారణమని కూడా నేను నమ్ముతాను.

యేసు, మార్కు 11:25 నందు, "మీకు ఒకని మీద విరోధమేమైనను కలిగియున్న యెడల, మీరు నిలువబడి ప్రార్థన చేయునపుడెల్లను వాని క్షమించుడి. అప్పుడు పరలోక మందున్న మీ తండ్రియు మీ పాపములు క్షమించును" అని చెప్తున్నాడు. మరొక మాటలో, ఇతరులపై మనకు ఏ విధమైన కోపమున్నప్పటికీ క్షమించ వలసివున్నది. అది ఎంత చిన్నదైనా, ఎంత పెద్దదైనప్పటికీ, దానిని వదిలి పెట్ట వలసివున్నది. మనకు క్షమించాలని అనిపించు వరకు వేచి వుండకూడదు ఒక ఉద్దేశపూర్వకమైన ఎంపిక, ఇష్టప్రకారమైన నిర్ణయం ద్వారా ఆ విషయమును వదలి వేసి క్షమించుచున్నాను. అలా చేసినపుడు, జవాబులు పొందు ప్రార్థనకు దారి ఏర్పరచు కుంటున్నాము.

# 14. గర్వము

"దేవుడు అహంకారులను ఎదిరించి, దీనులకు కృప అనుగ్రహించును" అని మొదటి పేతురు 5:5 చెప్తుంది. ఈ వచనం ద్వారా జవాబులు పొందు ప్రార్థనకు గర్వం ఒక ఆటంకం అని కచ్చితంగా తెలుస్తుంది! ఒక పరిస్థితిలో దేవుని కృపను మనము అడిగినపుడు, గర్వము దానిని అడ్డుకుంటుంది, అయితే తగ్గింపు దానికి మార్గాన్ని సిద్ధం చేస్తుంది. మనము గర్విష్టులముగా వున్నపుడు, మనకు దేవుడు లేక ఇతరులు అవసరమని తలంచము. మనము సంతృప్తి పొంది మనపై మనమే ఆధారపడువారముగా వుంటాము. ఇతరుల కంటే మనమే ఉత్తమమైన వారమని తలంచుతాము. గర్వమును దేవుడు చాలా గంభీరముగా తీసుకుంటాడు. దానిని గురించి చెప్పు అనేక వచనాలు బైబిల్‌లో వున్నవి, అయితే వాటిలో బలమైనది సామెతలు 16:5, "గర్వహృదయులందరూ యెహోవాకు హేయులు, నిశ్చయముగా వారు శిక్షనొందుదురు."

మన ప్రార్థనలకు జవాబు రాకుండా గర్వము ఆపుతుంది కనుక, నీ ప్రార్థనలు దేవుడు విని, జవాబివ్వవలెనని మనము కోరుకుంటే, మొదటగా గర్వమును తీసివేసుకొన వలసివున్నది. మన హృదయాలలో ఏవిషయాలలో మనము గర్వము కలిగియున్నామో చూపమని దేవుని అడుగవలెను మరియు పశ్చాత్తాపపడవలెను. ఒక నిర్దిష్టమైన పాపమునుండి తిరుగుటకు లేక పాతభావాలను మరియు ఆలోచనా విధానమును మార్చుకొనుటకు ఉత్తమమైన మార్గము, దాని నిమిత్తం దేవుని క్షమాపణ అడిగి, బదులుగా, దానికి వ్యతిరేకమైన భావనలను లేక ప్రవర్తనను పెంపొందించుకొనుటకు ఎంచుకొనుటయే. కాబట్టి, గర్వమను పాపమును అధిగమించునపుడు, మన హృదయాలలో తగ్గింపును వృద్ధిపొందించుకొనుటకు మరియు తగ్గింపు మనస్తత్వాన్ని కలిగియుండుటకు మనము దేవుని సహాయం అడుగవలసియున్నది. మనం కేవలం దేవుని ముందు మాత్రమే కాకుండా, యితర మనుష్యులతోని మన సంబంధములో కూడా తగ్గింపు కలిగివుండవలసియున్నది.

తగ్గింపును అభ్యసించుటకు వున్న ఒక ఉత్తమ మార్గము – ఒప్పుకోలు ద్వారా తగ్గింపు. యాకోబు 5:16లోని మొదటి వాక్యము ఈ విధంగా చెప్తుంది: "మీ పాపములను ఒకనితోనొకడు ఒప్పుకొనుడి మీరు స్వస్థత పొందునట్లు ఒకనికొరకు ఒకడు ప్రార్థన చేయుడి." స్వస్థతను పొందుశక్తి ఒప్పుకొనుట ద్వారాను, ప్రార్థన ద్వారాను వస్తున్నట్లయితే, ఎలా ఒప్పుకోవాలో మరియు ఎలా ప్రార్థించాలో మనము తెలుసుకొనవలసివున్నది. మన పొరపాట్లను ఒప్పుకొని, ప్రార్థించమని అడుగుటకు మొదటిగా, మనము నిజముగా నమ్మగలిగిన ఒక వ్యక్తిని కనుగొనవలసివున్నది, రెండవదిగా, గర్వమును ప్రక్కన పెట్టి సమస్యలను పంచుకొనుటకు తగ్గించుకొనవలసి వున్నది. ఒక వేళ అది ఒక సవాలుగా నీకు అనిపించినట్లయితే, తగ్గింపులో ఎదుగు నట్లుగా సహాయం చేయమని దేవుని అడుగు నీవు నమ్మదగిన ఒక స్నేహితుని

కనుగొని ఆ వ్యక్తితో “ఈ విషయంలో నేను కష్టపడుతున్నాను, అది నాకు ఇష్టం లేదు. అయితే నేను బాధ పడుతున్నాను నాకొరకు ప్రార్థన చేయి” అని అడిగినట్లయితే ఫలితాలు చాలా ఆశ్చర్యకరంగా వుంటాయి.

ఒకప్పుడు ఒక స్నేహితురాలిపై నాకున్న అసూయతో నేను పోరాడుతుండేదానిని. నేను దేవుని అడుగుతూ వున్న ఒక విషయాన్ని ఆమె పొందుకుంది, నేను యింకనూ పొందుకొనలేక పోయాను. అలా ఆలోచించుట తప్పని నాకు తెలుసు మరియు అలా ఆలోచించుట నాకు కూడా ఇష్టంగా లేదు, అయితే ఆవిడ ఆశీర్వాదాన్ని తిరస్కరించి, అది నాకు వస్తే బాగుండని తలంచుట నుంచి నేను బయటకు రాలేక పోతున్నాను. ఆమె పట్ల నాకున్న అసూయ, ఆమెపైని నా ప్రేమను చల్లార్చింది. ఒకదినం నేను యాకోబు 5:16 చదువుచుండగా, నన్ను నేను తగ్గించుకొని, ఎవరినైనా నా కొరకు ప్రార్థించమని అడుగవలెనని నిర్ణయించుకొన్నాను. నా సమస్యను గురించి దేవునితో మాట్లాడుటలో నాకే సమస్యా లేదు, అయితే యితరులెవరికీ చెప్పుటకు నేను యిష్టపడుట లేదు (అది గర్వము). నేను నా భర్త వద్దకు వెళ్ళి, నా స్నేహితురాలి విషయంలో నా అసూయను అతనితో పంచుకున్నాను. అది పాపమని అతనితో ఒప్పుకుని, నా కొరకు ప్రార్థించమని అడిగాను. నా భావాలను పంచుకొనుట నాకు యిబ్బందికరముగానే వున్నది, అయితే అది నాకు స్వేచ్ఛనిచ్చింది.

> మన పొరపాట్లను ఒప్పుకొని, ప్రార్థించమని అడుగుటకు మొదటిగా, మనము నిజముగా నమ్మగలిగిన ఒక వ్యక్తిని కనుగొనవలసివున్నది, రెండవదిగా గర్వమును ప్రక్కన పెట్టి సమస్యలను పంచుకొనుటకు తగ్గించుకొనవలసివున్నది.

ఈ నా అనుభవం నుండి మరియు అనేకుల అనుభవాలనుండి, మనం నిజంగా దేనివలననైనా బాధపడుతున్నపుడు, నమ్మదగిన ఒక వ్యక్తి – మన వేదనలను యితరులకు పుకారు చేయని, ప్రచారం చేయని వ్యక్తి వద్దకు వెళ్ళి, తగ్గింపుతో మన కొరకు ప్రార్థించమని అడిగినట్లయితే మరియు మన సవాళ్లను ఆ వ్యక్తితో పంచుకుని ప్రార్థించమని అడిగినట్లయితే, ఫలితం అద్భుతంగా వుంటుంది.

యథార్థంగా, నమ్మకంగా ప్రార్థించు వ్యక్తికి మన సమస్యలు చెప్పుకొనుటకు సిగ్గుపడవలసిన అవసరం లేదు. మన జీవితాలలో నుంచి గర్వమును తొలగించి, తగ్గింపును అభ్యసించుటకు యిది ఒక మార్గమైయున్నది. నిజానికి, ఒకసారి నేను గౌరవించు ఒక వ్యక్తి వచ్చి, “నేను దీనిని ఎవరితోనైనా పంచుకోవాలనుకుంటున్నాను మరియు యిది నేను ఒక్కసారి

బయటపెట్టగలిగితే, అది సాతాను శక్తిని కూల్చివేస్తుందని ఆశిస్తున్నాను.” అని చెప్పారు. ఆ వ్యక్తి తరచుగా ఒంటరి ప్రయాణాలు చేస్తుంటాడు, అతను ఈ విధంగా చెప్పటం కొనసాగించాడు: “నా భార్య నుండి ఎక్కువ కాలం దూరంగా వున్నపుడు, యితర స్త్రీలను గురించిన చెడు తలంపులతో నేను చాలా శోధింపబడుతున్నాను. విమానాశ్రయంలో లేక మరి ఎక్కడైనా ఒక స్త్రీని చూచినపుడు, నా మనసు తప్పుడు ఆలోచనలను ఆలోచిస్తుంది. అది నాకు యిష్టంగా లేదు, అయితే, నేను దానిని నియంత్రించలేక పోతున్నాను.” అని చెప్పాడు.

నేను అతనితో ప్రార్థించాను, తరువాత అతను “నా సమస్యలను పంచుకొనుట నాకు ఒక గొప్ప మలుపును తెచ్చింది” అని చెప్పాడు. నీ సమస్యలను పంచుకొనుట కూడా నీకు ఒక గొప్ప మలుపును తెస్తుందని నేను ఊహించగలను. సంగతులు దాచిపెట్టాలని సాతాను కోరుకుంటాడు. మనం చేయలేమని తెలిసినప్పటికీ, మన స్వంతంగా పరిస్థితులను చక్కదిద్దుకోవాలని చూచినపుడు, వాడు సంతోషిస్తాడు, ఎందుకంటే, అది గర్వం కాబట్టి. ఇతరులను సహాయం చేయమని అడుగునపుడు, మనం తగ్గింపు కలిగి వుంటున్నాము. అది దేవుని సంతోషపరుస్తుంది మరియు సమస్యలను అధిగమించుటకు సహాయపడునట్లుగా దేవుని శక్తిని విడుదల చేస్తుంది.

మనందరికీ సహాయం అవసరమైయున్నది. మనందరం సమస్యలు కలిగివున్నాము మరియు నీకున్న సవాళ్లు, బహుశా యితరులకంటే భయంకరమైనవి కావు. దేవుడు తన కుటుంబాన్ని, ఒకరికొకరు అవసరమవునట్లుగా రూపొందించాడు. కొన్నిసార్లు మనం ఒంటరిగా మన భారాలను మోయలేము మరియు కొన్నిసార్లు అవసరమైన సహాయం అడుగుటకు మరీ తలబిరుసుతనంగా లేక మరింత గర్వంగా వుంటాము. జ్ఞాపకముంచుకొనండి, తమ హృదయాలలో గర్విష్టులైనవారిని దేవుడు ఎదిరిస్తాడు మరియు వారి హృదయ గర్వము, వారి ప్రార్థనలకు ఆటంకమవుతుంది. అయితే, దీనమనస్కుల ప్రార్థనను దేవుడు ఆలకిస్తాడు మరియు దానికి స్పందనగా తన కృపను అనుగ్రహిస్తాడు.

## సారాంశం

జవాబులు పొందు ప్రార్థనలకు అనేక ఆటంకాలు ఉన్నాయి, మరియు వాటిని గురించి తెలిసికొనుట, వాటికి దూరంగా వుండుటకు సహాయపడుతుందని ఆశిస్తున్నాను. గొప్ప, ప్రభావవంతమైన ప్రార్థనా జీవితాన్ని కలిగివుండుటకును మరియు జవాబులు లేని ప్రార్థనగా నీ ప్రార్థనను చేయు ప్రతి విషయమును ఎదుర్కొనుటకును నీవు చేయగలిగినదంతయూ చేయమని ప్రోత్సాహపరచుచున్నాను.

## ప్రార్థనాంశములు

- ప్రభావవంతమైన ప్రార్థనకు తాళపుచెవులను తెలిసికొనినట్లే, జవాబులు పొందు ప్రార్థనకు ఆటంకములను కూడా తెలిసికొనవలసియున్నది.
- మనం ప్రార్థించనట్లయితే, దేవుడు మన ప్రార్థనలకు జవాబివ్వలేడు. ధైర్యహీనత అనునది మన ప్రార్థనలను జవాబులు లేనివిగా చేస్తుంది. ఎందుకంటే, మనం క్రీస్తు యొక్క నీతిలో నిలుచుచున్నాము గనుక, దేవుని ధైర్యంగా చేరి, నమ్మకంతో అడుగగలము.
- మనం పాపముతో – ఉద్దేశ్యపూర్వకం కాని పాపముతో కూడా – పని చేయవలసివున్నది. ఎందుకంటే ప్రార్థన ద్వారా దేవునితో సంభాషించు ఆనందమును, అది అడ్డగిస్తుంది.
- మన ప్రార్థనలు జవాబులు పొందవలెనని మనము కోరినట్లయితే, మనం ప్రార్థిస్తున్నది, దేవుని వాక్యముతోను మరియు ఆయన వ్యక్తిత్వముతోను పొత్తు కలదిగా వుండునట్లు జాగ్రత్తపడవలెను.
- తప్పుడు ఉద్దేశ్యాలు కలిగి ప్రార్థించుట అను ప్రార్థన జవాబులు పొందదు. మన హృదయాలు శుద్ధిగాను మరియు మన ఉద్దేశములు సరియైనవిగాను వుండవలెను.
- అనుమానం మరియు అపనమ్మకం అనునవి జవాబులు పొందు ప్రార్థనకు ఆటంకములైయున్నవి. మనం విశ్వాసముతో ప్రార్థించి, సాతాను మనలో అనుమానం పుట్టించకుండునట్లుగా చూడవలసియున్నది.
- చింత అనునది జవాబులు పొందు ప్రార్ధనసుంచి మనలను దూరంగా వుంచుతుంది, ఎందుకంటే, అది మన సమస్యలను వెనుకకు తీసికొనునట్లుగా చేసి, దేవుని పైని మన విశ్వాసమును దొంగిలిస్తుంది.
- కృతఘ్నుత అనునది, ఒక మనిషి హృదయము సరియైనది కాదని చూపిస్తుంది మరియు జవాబులు పొందు ప్రార్ధనకు కృతజ్ఞత అవసరమైయున్నది.
- ఏకాగ్రత చూపలేకపోవుట మన ప్రార్థనలను ఆటంకపరచవచ్చును. మన ప్రార్థనా జీవితాలలో మనం మనసు మళ్లి, తప్పిపోయినపుడు, దేవుని వద్దనుండి ఏమైనా పొందుకుంటామని ఎదురుచూడకూడదు.
- బీదలు మరియు అవసరతలో వున్నవారికొరకు శ్రద్ధ చూపునట్లుగా దేవుని బిడ్డలు పిలువబడినారు, పంపబడినారు. మనము వారిని నిర్లక్ష్య పరచినట్లయితే, దేవుడు మన ప్రార్థనలు విని, జవాబివ్వడు.

- తిరుగుబాటు అనునది జవాబులు పొందని ప్రార్థనకు దారితీస్తుంది. అధికారమునకు వ్యతిరేకమైన భావనలు మనము కలిగివున్నట్లయితే, దేవుడు మనలను ఆశీర్వదించలేడు.
- క్షమించకపోవుట అనేది ప్రార్థనకు గల అతి పెద్ద ఆటంకం. దేవుడు మనలను చూచునట్లుగానే మనం ఇతరులతో ప్రవర్తించాలి మరియు మనలను బాధించు వారందరినీ క్షమించాలి.
- ప్రార్థనలు జవాబులు పొందకుండుటకు గర్వం కారణమవుతుంది, అయితే, తగ్గింపు అనునది దేవుని కృపను ఆకర్షిస్తుంది.

# 13

# ప్రార్థనలో రూఢియైన విజయము

మీకొక శత్రువు వున్నాడని మీకు తెలుసా? ఎఫెసీ 6:12 లో "ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు, గాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాథులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము" అని చదివినట్లుగా వాడు అదృశ్యుడు, అయితే వాడు నిజముగా వున్నాడు.

నీ శత్రువు పేరు సాతాను వాడు ఒక ఆత్మ అంధకార సంబంధమైన రాజ్య శక్తులను వాడు ఆజ్ఞాపిస్తాడు మరియు దేవుని బిడ్డలను నశింపజేయుటకు వాడు నిశ్చయించుకొనినాడు. వాడు దేవుని ద్వేషిస్తాడు దేవునియందు విశ్వాసముంచు ప్రతి ఒక్కరినీ ద్వేషిస్తాడు నీ వ్యక్తిగత నాశనము కొరకు వాడు ప్రణాళికను కలిగివున్నాడు, నీ వివాహజీవితములో, కుటుంబాలలో నాశనమునకు, ఆరోగ్యము, ఆర్థిక పరిస్థితులు, ఉద్రేకాలు, మరియు నీ జీవితములోని ప్రతి విషయములో నాశనమునకు వాడు ప్రణాళికను కలిగివున్నాడు. అయితే ఒక మంచి వార్తవున్నది: వాడి ప్రణాళికలను నీవు ఆపగలవు–మరియు దానిని నీవు నీ ప్రార్థనా శక్తి ద్వారా చేయగలవు. సాతాను వేంద్రమైన శత్రువు, వాడు వేంద్రమైన ఆయుధాలను, విశ్వాసి పైకి ప్రయోగిస్తాడు, అయితే వాడి నరకములోని వేంద్రమంతా, ఒక చిన్న సులువైన, నమ్మకమైన ప్రార్థనా శక్తికి సరికాదు. ఈ విషయం పై వాచ్‌మన్ నీ వ్రాసిన మాటలు నాకు చాలా ఇష్టం: "దేవుడు మన ప్రార్థనలు వినుటతోడనే, సాతాను ప్రణాళికలు ఖచ్చితంగా పరాజయం పాలవుతాయి. మన ప్రార్థనలకు జవాబులో దేవుడు, సాతాను యొక్క చెడు చిత్తాన్ని భంగము చేస్తాడు, మరియు ఫలితంగా, ఈ విషయంలో వాడు రెండవసారి మన పై దాడి చేయలేడు. ప్రార్థనలో మనం పొందుకున్నదేదైనా, శత్రువు కోల్పోతాడు."

# మన యుద్ధోపకరణములు

"ఆపద్దినమందు" నిలువబడవలెనని ఎఫెసీ 6:13 సూచిస్తుంది. ఆపద్దినము ఏది? మన జీవితాలలో సాతాను మనలను ఎదుర్కొను ఏ సమయమునైనా ఈ ఆపద్దినము సూచిస్తుందని నేను తలంచుతాను. ఆ ఎదుర్కొనుట శారీరకంగా, మానసికంగా, ఉద్రేకాలలో లేక ఆత్మీయంగా, ఎలాగైనా కావచ్చును. కాబట్టి, మనం తిరిగి ఎలా యుద్ధం చేస్తాము? మనం ఆత్మీయ ప్రదేశంలో యుద్ధం చేస్తున్నాము గనుక ఆత్మీయ ఆయుధాలతో యుద్ధం చేయాలి. 2 కొరింథీయులకు 10:4 ఈ విధంగా చెప్తుంది: "మా యుద్ధోపకరణములు శరీరసంబంధమైనవి కావుగానీ, దేవుని యెదుట దుర్గములను పడద్రోయజాలినంత బలము కలవై యున్నవి" మన ఆయుధశాలలో వుండవలసిన మూడు ముఖ్యమైన, శక్తివంతమైన ఆత్మీయ ఆయుధాలను ఒకసారి చూద్దాము: దేవుని వాక్యము, యేసు నామము, యేసు రక్తము.

## *ఆయుధం 1 : దేవుని వాక్యము*

దేవుని వాక్యము శక్తివంతమైన ఆయుధము. ఆంద్రూ ముర్రే ఈ విధంగా వ్రాస్తున్నాడు: "నిత్యుడైన దేవుడు, ఎవరిలోనైతే జీవము మరియు శక్తి, ఆత్మ మరియు సత్యము, వాక్యము లోని లోతైన అర్థాలు వున్నవో – తన మాటలను ఆ దేవుడు మాటలాడినపుడు, తనంతట తానే వాటిలో వున్నాడు, ఆయన ప్రేమ మరియు ఆయన జీవము, ఆయన చిత్తము మరియు ఆయన శక్తి, వాటిని పొందుకొనువానికి యిచ్చి యున్నాడు....." 2. దేవుని ప్రేమ, చిత్తము మరియు శక్తి మనకు ఆయన వాక్యము ద్వారా ప్రత్యక్షపరచబడి మరియు అందుబాటులో వున్నవి అది నిజముగా శక్తివంతమైన బలము.

హెబ్రీ 4:12, "ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై, బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు, హృదయముయొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది." అని చెప్పుచున్నది. దాని గురించి ఆలోచించండి: రెండు వైపులా పదునుగా వున్న ఖడ్గము చాలా భీకరమైన గాయములు చేయగలదు! మనము వాక్యమును ఎరిగియుండి, అది సత్యమని నమ్మి, దాని అధికారమునకు మనలను అప్పగించుకొని, దానిని అపవాదిపై ప్రయోగించినట్లయితే, వాడు పరాజయం పాలవుతాడు. మనము జయజీవితము

మనము జయజీవితము జీవించవలెనంటే, దేవుని వాక్యమును సాతానుతో ఎలా మాట్లాడవలెనో తెలిసికొనవలసియున్నది.

జీవించవలెనంటే, దేవుని వాక్యమును సాతానుతో ఎలా మాట్లాడవలెనో తెలిసికొనవలసియున్నది. మన మనసులలో తప్పుడు తలంపులు వుంచుట ద్వారా సాతాను మనతో మాట్లాడుతాడు, మరియు దేవుని వాక్యమును బిగ్గరగా మాటలాడుట ద్వారా మనము వాడితో తిరిగి మాటలాడగలము. "..నా వాక్కు ఎవనికుండునో వాడు సత్యమును బట్టి నా మాట చెప్పవలెను..." అని యిర్మీయా 23:28 చెప్తుంది. దేవుని వాక్యము రెండంచులు కలిగిన ఖడ్గమైయున్నది, మనం కేవలం దానిని కలిగియుండుట కంటే, దానిని ప్రయోగించవలసియున్నది (హెబ్రీ 4:12). వాక్యమును మాటలాడుట ద్వారా మనము ఖడ్గమును ప్రయోగిస్తాము. ఎఫెసీ 6:17, నిర్ధిష్టంగా "దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గమును ధరించుకొనుడి" అని చెప్తుంది. *వాక్యము, నామము, రక్తము* అను నా పుస్తకములో నేను "ఆత్మ ఖడ్గము" ను గురించి వ్రాసియున్నాను. మన దైనందిన జీవితాలకు ఉపయోగపడు మాటలు ఏమిటంటే: "ప్రతి పరిస్థితికితగిన ఖచ్చితమైన వాక్యములు పరిశుద్ధాత్మునికి తెలియునని నేను నమ్ముతున్నాను. ఎటువంటి పరిస్థితిని విశ్వాసి ఎదుర్కొంటున్నాడో ఆయనకు తెలుసు....." 3. ప్రార్థనలో ఆయనతో మనము సంభాషించుచుండగా, మనకు సూచనలు యిచ్చుచున్న ఆయన స్వరాన్ని మనము వినగలము. ఉదాహరణకు, మనము భయపడుతున్న పరిస్థితిలోవున్నట్లయితే, ఆయన "భయపడకుడి. నా వాక్యము భయపడవద్దని చెప్తుందని జ్ఞాపకం చేసుకో" అని చెప్పుటను నీవు వినగలవు.

యేసు ఆత్మచేత అరణ్యములోనికి నడిపించబడి, నలుబది దినములు వున్నాడని లూకా నాలుగవ అధ్యాయము చెప్తుంది. ఆయన అక్కడ వుండగా, సాతాను నుంచి ఒకదాని తరువాత ఒకటిగా శోధనలను ఎదుర్కొన్నాడు. సాతాను ఆయనను శోధించిన ప్రతిసారీ, ఒక వాక్యభాగమును మరియు "వ్రాయబడివున్నది" అను మాటతో జవాబిచ్చాడు.

లూకాలోని ఈ అధ్యాయం ద్వారా, శోధనలు ఒకదాని తరువాత ఒకటి వచ్చినవి. లూకా 4:13 "అపవాది ప్రతి శోధనను ముగించి, కొంతకాలము ఆయనను విడిచిపోయెను." అని చెప్తున్నది. ఈ వచనము ద్వారా మరల మరల ఎదుర్కొనుటకు వచ్చుచున్నదని తెలుస్తుంది. వాటిని మనము ఎదుర్కొనాలి. మనం ధృఢంగా నిలువబడవలసి యున్నది. వాడు మనలను కొంత కాలము విడిచిపెడతాడు, అయితే మనం సోమరిగా లేక నిద్రబోతులుగా తయారుకాకుండుట మంచిది. వాడు మరియొక అవకాశము కొరకు ఎదురుచూస్తుంటాడు మరియు మరొక విధంగా ఎదుర్కొనుటకు వస్తాడు గనుక మనం జాగ్రత్తగా గమనించుకొనవలసియున్నది.

తరచుగా మనలను మనము: *సాతాను నుంచి ఎటువంటి శోధనలు నేను ఎదుర్కొనని రోజు ఎప్పుడు వస్తుంది?* అని జవాబు ఏమిటంటే, మనము పరలోకమునకు చేరినపుడు! వ్యక్తిగతంగా, సాతాను నాకు విరోధంగా రానట్లయితే నేను మరింత చింత పడతాను ఎందుకంటే వాడు నన్ను తొందరపెట్టకపోతున్నట్లయితే, నేను వాడిని తొందరపెట్టుటలేదని

అర్థం. నేను వాడిని తొందరపెట్టుటలేదంటే దేవుడు నన్ను పిలచిన పనిని చేయుటలేదని అర్థం.

మనము జీవించియున్నంత కాలం సాతాను మనలను తొందరపెట్టి, బాధపెడుతున్నప్పటికీ, మనం వాడిని ఎదిరించగలం వాడికి విరోధంగా నిలువబడగలము వాడిని దూరముగా నెట్టివేయ గలము. వాడిని శక్తి హీనుని చేసే ఆయుధాలతో పోరాడగలం. నీవు నిజముగా సాతానుకు కోపం తెప్పించి, వాడిని పరుగెత్తించాలనుకుంటే, సిలువను మరియు కల్వరిలో వాడి అపజయాన్ని గుర్తు చేసే బైబిల్ వాక్యాలను ఉపయోగించండి. అందుకు కొన్ని ఉదాహరణలను చూద్దాము:

- కొలస్సయులకు 2:15: “(దేవుడు) ప్రధానులను, అధికారులను నిరాయుధులనుగా చేసి, సిలువ చేత జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి బాహాటముగా వేడుకకు కనుపరచెను”
- 1 యోహాను 4:4: “...మీలో వున్న వాడు లోకములో వున్నవానికంటే గొప్పవాడు....”
- యెషయా 54:17: “నీకు విరోధముగా రూపింపబడిన ఏ ఆయుధమును వర్ధిల్లదు. న్యాయవిమర్శలో నీకు దోషారోపణ చేయు ప్రతివానికి నీవు నేరస్థాపనచేసెదవు.”
- 1 యోహాను 3:8: “...అపవాది క్రియలను లయపరచుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను.
- కొలస్సయులకు 1:13: “ఆయన మనలను అంధకారసంబంధమైన అధికారములలోనుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులనుగా చేసెను.”
- హెబ్రీయులకు 4:12: “ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై, బలముగలదై రెండంచులు గల ఎటువంటి ఖడ్గము కంటెను వాడిగా వుండి, ప్రాణాత్మలను, కీళ్ళను, మూలుగను విభజించునంతమట్టుకు దూరుతూ ఆలోచనలను శోధించును.”
- 2 కొరింథీ 2:14: “మా ద్వారా ప్రతిస్థలమందును క్రీస్తును గూర్చిన జ్ఞానముయొక్క సువాసనను కనపరచు ఆయనయందు మమ్మును ఎల్లప్పుడూ విజయోత్సవముతో ఊరేగించుచున్న దేవునికి స్తోత్రము.”

దేవుని వాక్యము, మన జీవితాలలోను మరియు సాతాను పైనను శక్తిని కలిగివుంది. మనం కేవలం వాక్యమును తెలుసుకొనుట కాదు, గానీ ఆయన ఆజ్ఞలను నమ్మి లోబడవలసివున్నది. అది మనకు ఏమి చెప్తుందో అది చేయుట ద్వారా, మరియు ఆయన

ఆజ్ఞలను పాటిస్తూ, ఆయన మార్గంలో నడుచుట ద్వారా లోబడగలము. మనం తెలిసికొని, వాక్యమునకు లోబడి, మన హృదయములను మరియు దృష్టిని ఆయనపై నిలిపి వుంచి నట్లయితే – రూఢిగా విజయం మనదౌతుందని ఆయన చెప్తున్నాడు.

నిజముగా వాక్యమును తెలుసుకొనమని నేను నిన్ను ప్రోత్సాహపరస్తున్నాను. నీ మనసుతోను, హృదయముతోను దానిని తెలుసుకో. దానిని ప్రేమించు, కంఠస్థం చేయి, మరియు దాని సత్యము నీలో లోతులకు ఇనుకనియ్యి. నీవు అలా చేసినపుడు, నీ ప్రార్థనలలో వాక్యమును కలుపుటను, దేవుని వాక్యమునే మాట్లాడుటను నీవు కనుగొంటావు – ఆయన చెప్పిన దానిని ఆయన ఎల్లప్పుడూ గౌరవిస్తాడు.

## *ఆయుధం 2 : యేసు నామము*

బైబిల్ కాలేజిలో నేను బోధించు నా స్నేహితుడు ఒకతను, ఒక దినం తన నాలుగు సంవత్సరముల కుమారునితో కారులో వెళ్ళుచున్నాడు. ఆ పిల్లవాడు కూర్చున్నవైపు తలుపు సరిగా వేయబడకుండుటను అతను గమనించుకొనలేదు. నాలుగు రోడ్డులు కలిసే చోట అతను అజాగ్రత్తగా మలుపు త్రిప్పినాడు, ఈ విషయం కారులో బెల్టులు పెట్టుకోవాలని చట్టం రాక మునుపు జరిగినది కనుక, ఆ పిల్లవాడు సురక్షితంగా లేడు. నా స్నేహితుడు మలుపు త్రిప్పగానే, తలుపు తెరుచుకొని, ఆ పిల్లవాడు నాలుగువైపుల నుండి వస్తున్న వాహనాల మధ్య రోడ్డుపై పడిపోయాడు. నా స్నేహితునికి గుర్తున్న ఆఖరి విషయం ఏమిటంటే ఒక జత కారు టైరులు తన కుమారుని మీదకు వచ్చుట చూచి “యేసు” అని బిగ్గరగా అరచుట.

తన కారును ఆపిన తక్షణమే అతను తమ కుమారిని వద్దకు పరుగెత్తి, ఆ పిల్లవాడు సురక్షితముగా వుండుటను కనుగొన్నాడు. రెండవ వాహనపు డ్రైవరు పిచ్చి పట్టినట్టుగా అరవటం మొదలు పెట్టాడు. నా స్నేహితుడు అతనితో తన కుమారుడు క్షేమంగా వున్నాడని చెప్పి శాంతపరచుటకు ప్రయత్నించాడు. అయితే అతను “నీకు అర్థం కావటం లేదు. నేను బ్రేకుల మీద కాలే వేయలేదు” అని చెప్పాడు.

యేసు నామములో నమ్మశక్యము కాని శక్తి వుంది! అది అన్ని నామముల కంటే పై నామము అన్ని నామముల కంటే బలమైనది ఈ నామము ఒక్కటే. యిది అన్ని నియమములను, అందరు మనుష్యులను పరిపూర్ణంగా ఆజ్ఞాపించి విధేయులుగా చేయగలిగినది. యేసుక్రీస్తును, దేవుడు అదికముగా హెచ్చించాడని ఫిలిప్పీ 2:9–11 “అందుచేతను పరలోకమందున్న వారిలో గాని, భూమి మీద వున్న వారిలో గాని, భూమిక్రింద వున్న వారిలో గాని, ప్రతివాని మోకాలును యేసు నామమున వంగునట్లును, ప్రతివాని నాలుకను తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి ప్రతి నామమునకు పైనామము ఆయనకు అనుగ్రహించెను.”

> అది అన్ని నామములకంటే పై నామము, అన్ని నామములకంటే బలమైనది ఈ నామము ఒక్కటే. యిది అన్ని నియమాలను, అందరు మనుష్యులను పరిపూర్ణంగా ఆజ్ఞాపించి విధేయలుగా చేయగలిగినది.

ఎఫెసీ 1:17-21 నందు పౌలు విశ్వాసుల కొరకు ప్రార్థిస్తూ, వారికి "జ్ఞానమును, ప్రత్యక్షయును గల మనస్సు" ను అనుగ్రహించమని అడుగుతున్నాడు. మరియు దేవుడు వారి మనోనేత్రములు తెరుచుట వలన తమ జీవితములలో దేవుని పిలుపు యొక్క నిరీక్షణను, పరిశు ద్ధులలో ఆయన స్వాస్థ్యము యొక్క మహిమైశ్వర్యమును తెలుసుకొనవలెనని ప్రార్థించాడు. అతను యింకా "ఆయన తన బలాతిశయము చేత క్రీస్తును మృతులలో నుండి లేపి తన కుడిపార్శ్వమున కూర్చుండబెట్టిన విధానమును, ఈ యుగమునందు మాత్రమే కాక, రాబోవు యుగమునందును పేరు పొందిన ప్రతినామము కంటెను, ఎంతో హెచ్చుగా చేసిన విధానమును" తెలిసికొనవలెనని ప్రార్థించుచున్నాడు.

ఫిలిప్పీయులకు 2 మరియు ఎఫెసీయులకు 1 వ అధ్యాయములలో, పౌలు ఏమి చెప్పవలెనని కోరుకుంటున్నాడో మనము నిజముగా అర్థము చేసికొనగలిగితే, మరియు అన్ని నామములకంటే పై నామము యేసుకు యివ్వబడినదని మనము నమ్మినట్లయితే, ఆయన నామములో అసామాన్యమైన శక్తి మనకు దొరుకుటను చూడగలము. అన్ని నామముల కంటే పై నామము అంటే అర్థమేమిటి? అంటే యేసు నామము కాన్సర్ పేరు కంటే పైన వున్నది. ఆ నామము పేదరికము పేరు కంటే పైన వున్నది. ఆ నామము మత్తుమందుల వ్యసనము పేరు కంటే పైన వున్నది. ఆ నామము విడాకుల పేరు కంటే పైన వున్నది. ఏ పేరు మనము తలంచినప్పటికీ, యేసు నామము వాటికంటే పైన వున్నది - ఆయన మనకొరకు తన ప్రాణమును యిచ్చినాడు గనుక మనము ఆయన పేరు పెట్టబడినాము. యేసు నామములో మనకు అందుబాటులో వున్న శక్తిని మనము తెలిసికొన్నంతకాలము, మన మార్గములోనికి వచ్చు దేనివలననైనను మనము అపజయం పొందము.

యేసు తన శిష్యులతో మాట్లాడుచూ, ఈ భూమి పైని తాను లేని దినముల గురించి చెప్పుచున్నపుడు: "ఆ దినమున మీరు దేనిగూర్చియు నన్ను అడుగరు మీరు తండ్రిని నా పేరట ఏమి అడిగినను ఆయన మీకు అనుగ్రహించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. ఇదివరకు మీరేమియు నా పేరట అడుగలేదు మీ సంతోషము పరిపూర్ణమగునట్లు అడుగుడి, మీకు దొరకును" (యోహాను 16:23-24). ఈ వచనాలలో ఆవశ్యకముగా యేసు *యిప్పుడు యికను మీరు నన్ను అడుగవలసిన అవసరం లేదు, నా నామములో తండ్రి*

*వద్దకే వెళ్లవచ్చును. మరియు మీరు నా నామమును పలుకునపుడు – మిమ్మల్ని కాదు కానీ, నన్ను మీరు ఆయనకు చూపించుచున్నారు* అని చెప్తున్నాడు.

యేసు నామములో నేను ప్రార్థించు ప్రతి సమయము, నేను "ప్రభువా, యేసు విజయాన్ని నేను నీ ముందు పట్టుకొనియున్నాను, మరియు నేను ఆయనతోటి వారసురాలిని. నేను సంపాదించుకొనుట వలన కాదుగాని, ఆయన నా కొరకు సంపాదించి, తన రక్తముతో నా పేరట వ్రాసినాడు గనుక, నాకొరకు ఒక స్వాస్థ్యము వున్నది. మరియు యేసు నామము అన్ని నామముల కంటే పై నామము గనుక నేను ధైర్యముగాను, శక్తివంతముగానూ ప్రార్థించగలను" అని ప్రార్థిస్తున్నాను. యిదే నియమం మీకు కూడా వర్తిస్తుంది.

కాబట్టి యేసు నామములో మనము ప్రార్థించి, అడుగు ప్రతిసారీ, యేసు తనంతట తానే ఆ మనవిని చేసుకుంటున్నట్లుగా తండ్రికి కనుపరుస్తున్నాము. మన స్వంత యోగ్యతతో తండ్రిని చేరుట లేదు మనము యేసు యొక్క యోగ్యతతో చేరుతున్నాము. అందుకే, మనము సమస్తము సరిగా చేయకపోయినప్పటికీ, దేవుడు మన ప్రార్థనలు వింటాడని మనము ఎదురుచూడగలము – ఎందుకంటే, మనము యేసు నామములో ప్రార్థిస్తున్నాము. ఆయన పరిపూర్ణత మన బలహీనతలను కప్పివేస్తుంది.

యేసు ఏమైయున్నాడో, అంతటినీ – ఆయన నీతియంతటినీ, ఆయన సంపూర్ణతయంతటినీ, ఆయన కృపయంతటినీ మరియు ప్రేమను – ఆయన నామము సూచిస్తున్నది గనుక అది శక్తివంతమైనదైయున్నది. నా పేరులోను, నీ పేరులోను ఏ విధమైన శక్తి లేదు, అయితే ఆయన నామము సూచిస్తున్నదానిని బట్టి, యేసు నామము శక్తివంతమైనది. ఆంద్రూ ముర్రే ఈ విధంగా వ్రాస్తున్నాడు: "ఒక రాజు పేరులో అతని గౌరవము, అతని అధికారము, అతని రాజ్యము మిలితమైవుంటాయి. అతని పేరు అతని శక్తికి సంకేతమైయున్నది..... యేసు నామము ఆయన చేసిన దానికంతటికీ, చేయుటకు జీవిస్తున్న దానికంతటికీ సంకేతమైయున్నది......". మరియు అతను యింకా యిలా వ్రాస్తున్నాడు: "తన నామమును వేరొక వ్యక్తికి యిచ్చినపుడు, అతను ప్రక్కన నిల్చుని, వేరొక వ్యక్తిని తన కొరకు క్రియ చేయనిస్తాడు వేరొకని నామమును తీసుకున్నవాడు, తన స్వంత నామమును విలువలేనిదిగా ఎంచుకుంటాడు. యితరుల నామంలో నేను వెళ్లినపుడు, నన్ను నేను లేనట్లే ఎంచుకుని, ఆయన నామమునే కాకుండా, ఆయన ఏమైయున్నాడో దానిని తీసుకుంటాను."

దీనిని దైనందిన జీవిత క్రమంలో ఆలోచిద్దాం. నా పేరు మొదటినుంచి జాయిస్ మేయర్ కాదు. నేను డేవ్‌ను వివాహం చేసుకునే వరకూ అతని యింటిపేరు నాకు పెట్టబడలేదు. వివాహమనే చట్టపరమైన నిబంధనలోనికి మేము వచ్చువరకూ అతనికి చెందినది ఏదికూడా నాకు చెందలేదు. మాకు వివాహం అయినపుడు, నాకు కారు లేదు, డేవ్‌కు వుంది. నేను అతని పేరు పొందుకున్న తరువాత, హఠాత్తుగా నేను కూడా ఒక కారును పొందుకున్నాను. నాకు ఎక్కువ ధనం లేదు, నిజానికి, నేను అప్పుల్లో వున్నాను. డేవ్‌కు డబ్బు వున్నది

కాబట్టి నేను అతనిని వివాహం చేసుకున్న తరువాత, నేను నా అప్పులు తీర్చుకొనగలిగాను. డేవ్‌ను వివాహం చేసికొని, అతని పేరు పెట్టబడేవరకూ అతనికి చెందిన వాటిని నేను పొందుకొనలేకపోయాను. నేను శ్రీమతి డేవ్ మేయర్‌ను అయినపుడు, అతనికి చెందిన ప్రతీది నాకు కూడా చెందినదైనది. వివాహమునకు ముందు అప్పుడప్పుడూ కలియు సమయములో కూడా, నేను నా యింటి పేరునే కలిగియున్నాను, నాకు అప్పులు అలానే ఉన్నాయి, నాకు కారు లేదు.

యేసుతో కూడా ఎప్పుడో ఒకసారి సమయం గడుపుతూ వుండి, ఆయనతో నిజమైన అప్పగింపులో వచ్చు అవకాశముల కొరకు ఆశించలేము, మరియు కేవలం ఆయన యిచ్చు ఆశీర్వాదముల కొరకు మాత్రమే సంబంధాన్ని కొనసాగించాలని కోరుకొనలేము. ఆయనతో సంబంధంలోని అవకాశములను కేవలం అప్పగించుకొనినపుడే పొందగలము. డేవ్‌ను వివాహం చేసికొనకముందే నేను అందరికీ నా యింటిపేరు మేయర్ అని చెప్పుకొనవచ్చును, అయితే అది అక్రమము. మనకు నచ్చినా, నచ్చకపోయినా, పరలోకము ఒక క్రమ పద్ధతిలో పనిచేస్తున్నది. దేవుడు ఆత్మీయ న్యాయములను వుంచినాడు, మనము వాటిని నిర్లక్ష్యపెట్టలేము, అతిక్రమించలేము.

తనతో మనము కేవలం ఏప్పుడో ఒకసారి మాట్లాడుతున్నామా, లేక నిజముగా అప్పగించుకున్నామా అనునది, దేవునికి తెలుసు. ఆయనతో అప్పగించుకొను సంబంధములో మనము ఉన్నప్పుడు ఆయన నామము ఇచ్చు ప్రతి దానిని మనము పొందుకొనగలము.

విశ్వాసులముగా మన జీవితాలలో యేసు నామమును ఉపయోగించుటకు ఏ నిర్దిష్ట సూత్రము, నియమము లేదు. ఆయనను నమ్ము, ఆయన శక్తిని విశ్వశించు, ఆయన అధికారమునకు అప్పగించుకొను హృదయము మాత్రమే అవసరమైయున్నది. సాతానుతోని మన యుద్ధములో యేసు నామమును ఉపయోగించునపుడు దేవునికి అప్పగించుకొనుట అనేది ఆవశ్యకమైయున్నది. యాకోబు 4:7-9 : “కాబట్టి దేవునికి లోబడియుండుడి అపవాదిని ఎదిరించుడి అప్పుడు వాడు మీ యొద్దనుండి పారిపోవును. దేవుని యొద్దకు రండి, అప్పుడు ఆయన మీ యొద్దకు వచ్చును. పాపులారా, మీ చేతులను శుభ్రము చేసుకొనుడి ద్విమనస్కులారా మీ హృదయములను పరిశుద్ధపరచుకొనుడి.” అని చెప్తుంది. ఈ వచనాలలోని ఆత్మీయ నియమములను ఆంద్రూ ముర్రే వివరించిన విధానం నాకు నచ్చింది. అతను ఈ విధంగా చెప్తున్నాడు

> ఆయనతో అప్పగించుకొను సంబంధములో మనము ఉన్నప్పుడు ఆయన నామము ఇచ్చు ప్రతి దానిని మనము పొందుకొనగలము.

"యజమానుని పని కొరకు మరియు ఆశక్తి కొరకు మాత్రమే జీవించి ఫలించుటకు యేసు నామములోని శక్తి ప్రయోజనకరమైయున్నది. మనము సూచించు వ్యక్తికి సంపూర్ణముగా అధీనము చేసుకొనుటను ఈ నామ ఉపయోగము కోరుతున్నది."

మరొక మాటలో, మన జీవితాలలో ఇష్టపూర్వకంగా అవిధేయతను కలిగివున్నట్లయితే, యేసు నామమును ఉపయోగించి సాతానుని గెలువగలమని తలంచకూడదు. మనం పాపములో జీవించుచున్నట్లయితే సాతాను పై అధికారము పొందలేము. మనందరము పాపములు చేసియున్నాము అయితే నేను ఇష్టపూర్వకమైన అవిధేయత అని చెప్పినపుడు ఉద్దేశపూర్వకమైన పాపాన్ని సూచిస్తున్నాను. దేవునికి మనకు అడ్డముగా వున్నది పాపమే అని మనకు తెలుసు, అయినప్పటికీ మనము పశ్చాత్తాపపడి వదిలిపెట్టుటకు ఇష్టపడము. దేవునికి లోబడమని బైబుల్ చెప్తుంది, మన శక్తియంతటితో మనము దానిని చేసినప్పుడు సాతాను మనకు ఎదురుగా వచ్చినపుడు నోరు తెరిచి "సాతానా యేసు నాములో నిన్ను అడ్డగిస్తున్నాను" మరియు ఆ నామములోని శక్తి వాడిని వెనుకకు నెట్టివేయడాన్ని ఊహించవలసి వున్నది.

మనము సాతానుకు విరోధముగా నిలువబడిన ప్రతిసారీ యేసు నామములో దానిని చేయవలసివున్నది. సాతాను మనకు భయపడడు కానీ వాడు యేసు రక్తమునకు, దేవుని వాక్యమునకు, సిలువకు మరియు యేసు నామమునకు భయపడతాడు. ఆత్మతో నింపబడిన విశ్వాసి యేసు నామములో మాత్రమే సాతానుపై శక్తిని కలిగివుంటాడు.

మనము యేసు నామమును ఉపయోగించినపుడెల్లా, దానిని గురించి బైబుల్ ఏమి చెప్పుచున్నదో జ్ఞాపకము చేసుకొనుట అవసరము:

- *ఆయన నామము రక్షించుటకు శక్తి కలిగివున్నది.* "మరి ఎవని వలనను రక్షణ కలుగదు ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గానీ, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏనామమున రక్షణ పొందలేము" (అ.కార్యములు 4:12).
- *ఆయన నామములో యితరులతో కలిసి ప్రార్థించినపుడు, తానే మన మధ్య వుంటానని యేసు వాగ్దానము చేసియున్నాడు.* "ఏలయనగా ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన వుందునని చెప్పెను" (మత్తయి 18:20).
- *ఆయన నామము స్వస్థతనిస్తుంది.* అంతట పేతురు ఆ కుంటివానితో, "...నజరేయుడైన యేసుక్రీస్తు నామమున నడువుము" (అ.పొ.కార్యములు 3:6). ఈ అద్భుతకరమైన స్వస్థతకు కారణమును, తాను తరువాత మాట్లాడుతున్నప్పుడు

పేతురు ఈ విధంగా వివరించాడు, “మీరందరును ఇశ్రాయేలు ప్రజలందరును తెలుసుకొనవలసినదేమనగా, మీరు సిలువ వేసినట్టియు, మృతులలోనుండి దేవుడు లేపినట్టియు నజరేయుడైన యేసుక్రీస్తు నామముననే వీడు స్వస్థత పొంది మీ యెదుట నిలుచుచున్నాడు” (అ.పొ.కార్యములు 4:10).

- *ఆయన నామము మనలను స్వతంత్రులనుగా చేస్తుంది.* సిలువలో యేసు విజయము పొందినాడు గనుక ఆయన నామములో మనము అంధకారశక్తులను ఎదిరించగలము. యేసు తన శిష్యులతో “నమ్మిన వారివలన ఈ సూచక క్రియలు కనబడును, ఏవనగా నానామమున దయ్యములను వెళ్ళగొట్టుదురు....” అని చెప్పినాడు. (మార్కు 16:17), (లూకా 10:19-20, కొలస్సయులకు 2:15 చూడండి).

మనము ప్రార్థించు ప్రతీ సారీ యేసు నామములోని శక్తిని మనస్సునందు వుంచు కొనవలసివున్నది మరియు ఆయన నామమును ఉపయోగించు అవకాశమును ఆయనతోని సంబంధంలోనే వస్తుందని జ్ఞాపకము చేసుకొనవలసివున్నది. ప్రార్థనలో ఆయనతో సన్నిహితులమయ్యేకొలది, ఆయన నామము మనకు మరింత అమూల్యమవుతుంది మరియు ఆ నామము యొక్క శక్తిని మరింతగా తెలిసికొంటాము.

మనము యేసు నామమును గౌరవించి, దానిని వ్యర్థముగా ఉపయోగించ కూడదు. కొంతమంది ఆయన నామమును ఒకసారి వ్యర్థముగా ఉపయోగించి, తరువాత ఆయన నామములో ప్రార్థించుటకు ప్రయత్నిస్తారు. ప్రభువు నామమును వ్యర్థముగా ఉచ్ఛరించుట అనునది శాపముతో సమానము. దానిని తేలికగా వాడు ప్రతిసారీ మనము వ్యర్థముగా ఉచ్ఛరిస్తున్నాము. మన వద్ద 220 వోల్టుల కరెంటు ప్రవహిస్తున్న వైరు ఉన్నప్పుడు, దానిని ఎక్కడబడితే అక్కడ నిర్లక్ష్యంగా పడవేయము. అదే విధంగా మనము దేవుని నామమును అగౌరవంగా ఉపయోగించము.

పాతనిబంధనలో, ఆ ప్రజలు ప్రభువు నామము పట్ల అత్యంత భక్తిశ్రద్దలు కలిగివుండేవారు, కాబట్టి వారు దానిని ఉచ్ఛరించేవారు కూడా కాదు. అది మానవ పెదవుల నుండి కూడా రాకూడనంత పవిత్రమైనదని అక్షరాలా అనుకొనెడివారు. దేవుని నామమును మోషే అడిగినపుడు, ఆయన “నేను ఉన్నవాడను అనువాడను” అని జవాబిచ్చాడు (నిర్గమకాండము 3:14). దేవుడు వర్ణింపలేనంత అద్భుతమైన వాడు అపరిమితమైన వాడు. ఆయన ఏమైయున్నాడో దానినంతటిని ఆయన నామము సూచిస్తుంది. యేసు నామమునకు (దేవుని నామమునకు) గౌరవము చూపించుటకు మనందరము శ్రమపడాలని మరియొక సారి జ్ఞాపకము చేస్తున్నాను. ఆ అద్భుతమైన నామములో ఏమి ఉన్నదో మనము గ్రహించుకొలది, యేసు నామములో ప్రార్థించినపుడు అంత ఎక్కువ ఫలితాలను పొందుకుంటాము.

## ఆయుధం 3: యేసు రక్తము

యేసు నామము పలుకుట ద్వారా ఆయన నామములోని శక్తిని, వాక్యము పలుకుట ద్వారా వాక్యములోని శక్తిని విడుదలచేసినట్లే మన ప్రార్థనలలో క్రీస్తు రక్తములో మనము ఏమైయున్నామో ప్రకటించుట ద్వారా యేసు రక్తములోని శక్తిని విడుదల చేయగలము. ఎలాగంటే, "నా జీవితమునకు యేసు రక్తమును అన్వయించు కుంటున్నాను. క్రీస్తు రక్తములో నేను సురక్షితముగా వున్నానని నమ్ముతున్నాను." ప్రార్థించుదాం అను తన పుస్తకములో వాచ్‌మన్‌నీ ఈ విధంగా వ్రాస్తున్నాడు: "మనము దేవునికి చెందిన వారమైనందువలన, మనలను నాశనం చేయవలెనని, బాధ పెట్టవలెనని, అణిచి వేయవలెనని సాతాను భావించుతాడు మరియు మనము నిలుచుటకు ఆస్పదము లేకుండా తలంచుతాడు. మనము దేవుని కృపాసనము యొద్దకు క్రీస్తురక్తము ద్వారా చేరి దేవుని రక్షణను అడుగుతాము గనుక వాడు లక్ష్యము నెరవేరకపోయినప్పటికీ యిది వాడి లక్ష్యము అయివున్నది. దేవుడు మన ప్రార్థనలు వినిన తోడనే, సాతాను యొక్క ప్రణాళిక పరాజయము పాలౌతుంది." అదే మనకు కావలసినది. సాతాను యొక్క పరాజయాన్ని మనము కోరుకుంటున్నాము, యేసు చిందించిన రక్తమును ప్రార్థనలో ఒప్పుకొనుట ద్వారా వానిపై మనము విజయమును ప్రకటించగలము.

నిర్గమకాండము 12:1–13, మనకు మొదటి పస్కా యొక్క అద్భుతకరమైన సంఘటనలను మరియు రక్తములోని శక్తిని వివరిస్తుంది. ఈ సంఘటనలో మరణ దూత ఐగుప్తులోని ప్రతి ఇంటిలోని మొదటి సంతానాన్ని చంపుటకు బయలు దేరినది.

> మన ప్రార్థనలలో క్రీస్తు రక్తములో మనము ఏమైయున్నామో ప్రకటించుట ద్వారా యేసు రక్తములోని శక్తిని విడుదల చేయగలము.

అయితే దేవుడు ఒక గొర్రె పిల్ల రక్తమును తీసికొని ఇండ్ల ద్వారబంధపు రెండు నిలువ కమ్ముల మీదను చల్లమని తన జనులకు సూచించాడు. మరియు మరణ దూత వచ్చినప్పుడు తాను ఆ రక్తమును చూచి ఇంటిలోని వారికి ఏ కీడు చేయక దాటి పోతానని చెప్పాడు.

ఈ దినం యేసు మన పస్కా గొర్రె పిల్ల అయివున్నాడు, మనము పాపమరణముల శాపమునుండి విముక్తులగుటకు ఆయన కల్వరిలో తన రక్తమును చిందించాడు. పాత హెబ్రీయుల ఇంటి ద్వారబంధముల మీది రక్తము మరణ దూతను దూరముగా వుంచి, వారి తొలి సంతానమును రక్షించినట్లయితే సాతాను మన ద్వారా పనిచేయకుండునట్లుగా, నాశనము చేయకుండునట్లుగా మనము క్రీస్తు రక్తమును మనజీవితములలో అన్వయించుకొని

విశ్వాసము ద్వారా మన హృదయ తలుపులను శ్రద్ధగా మూయవలసివున్నది. తమ ద్వార బంధములపై రక్తమును చల్లుటకు ఇశ్రాయేలీయులు కొంత శ్రమపడి – కొంత గందర గోళాన్ని సృష్టించవలసివున్నది. వారు ఒక గొర్రె పిల్లను చంపి, రక్తము తీసి, ఆ రక్తాన్ని గిన్నెలలో పోసికొని, కొంత హిస్సోపు (శుద్ధి చేయు కార్యక్రమంలో ఉపయోగించు మొక్క)ను తెచ్చి, దానిని రక్తములో ముంచి ఆ రక్తమును ద్వారపు కమ్ములకు పూయవలసివున్నది. అది శుభ్రమైన ప్రయత్నం కాదు! అది వారికి అసహజంగా అనిపించి వుండవచ్చు, అయినా వారు దానిని చేసారు – వారు దీనిని దేవుడు తమకు చెప్పాడు గనుక విశ్వాసముతో చేశారు. ఇశ్రాయేలీయులు భౌతికంగా గొర్రె పిల్ల రక్తాన్ని పూసియున్నారు, మనమైతే విశ్వాసము ద్వారా చేయవలసివున్నది. యేసు దేవుని గొర్రెపిల్ల, మరియు విశ్వాసులముగా మనము కేవలము దానియందు విశ్వాసము ద్వారా మన జీవితములకు యేసు రక్తములోని శక్తిని అన్వయించుకుంటాము.

పాత నిబంధన, "అతి పరిశుద్ధ స్థలము" అని పిలువబడు దేవాలయములోని లోపలి భాగమును వివరించుచున్నదని మనలో చాలా మందికి తెలుసు. ఇది దేవుని సన్నిధి ప్రత్యక్షపరచబడు ప్రదేశము, మరియు నిర్ధిష్ట ప్రదేశాలలో, నిర్ధిష్ట వస్తువులపై రక్తము చల్లుట ద్వారా మాత్రమే యాజకులు లోపలికి వెళ్ళగలరు. వారు దేవుని సన్నిధిలోనికి ప్రవేశించుటకు, వారికంటే ముందుగా రక్తము వెళ్ళవలసివున్నది.

అదే విధంగా, యేసు రక్తము మనలను అనుమతించనిదే – పరిశుద్ధుడైన దేవుని సన్నిధిలోనికి వచ్చుటకు, ప్రార్థించుటకు మనకు ఏ అర్హత లేదు. అనేక సమయాలలో నేను ప్రార్థించుటకు ముందు, "దేవా, నీ రక్తమును బట్టి వందనాలు మరియు యేసు రక్తములో నన్ను బాగుగా కడుగుమని అడుగుతున్నాను. నీ సన్నిధిలోనికి వచ్చియుండగా, దేవా, రక్తములో నన్ను నీతిమంతురాలిగా చేసి, నీ వద్దకు చేరుట సాధ్యపరిచినందుకు వందనాలు" అని ప్రార్థిస్తాను. పాత నిబంధన యాజకుల వలెనె, దేవుని సన్నిధిలోనికి ప్రవేశించుచుండగా, మనము కూడా రక్తమును అన్వయించుకుంటాము, అయితే మనము దీనిని విశ్వాసము ద్వారా చేస్తాము.

సాతాను మనకు విరోధముగా వచ్చినపుడు రక్తము యొక్క శక్తిని గూర్చిన సత్యము మన హృదయములలో వేచి మనలను బలముగాను, ధైర్యముగాను చేయుటకై రక్తము యొక్క శక్తిని గూర్చిన పాటలను మరియు వాక్యభాగాలను దాచి యుంచుకొనవలసి వున్నది. కొన్ని సంవత్సరాల క్రితం, కేవలము రక్తమును గూర్చిన పాటలు కలిగిన సీ.డి.ని విడుదల చేయవలెనని నేను ప్రేరేపింపబడ్డాను. ఒక దినం, ఒక స్త్రీ మా పరిచర్యకు ఫోన్ చేసి తన సాక్ష్యాన్ని మాతో పంచుకుంది. ఆమె యిలా చెప్పింది, "నేను రక్తమును గూర్చిన మీ సీ.డి.ని కొనాలని నడిపింపబడ్డాను, అది మా ఇంటిలో వున్నది. కానీ నేను దానిని చాలా కాలం వినలేదు. ఒక రాత్రి నేను చదువుతూ కుర్చీలో కూర్చుని వున్నాను, హఠాత్తుగా ఆ

సీ.డి.ని వినాలను కోరిక నాలో తీవ్రంగా కలిగింది. నాకు తెలియకుండా, మా కిటికీ బయట దొంగ వున్నాడు. నేను సీ.డి పెట్టుటకు లేచిన సమయంలోనే వాడు కిటికీ గుండా కాల్చాడు. ఆ తూటా నేరుగా నేను అప్పటిదాకా కూర్చున్న కిటికీని తాకింది నాకు ఏ హానీ జరుగలేదు. ఇది ఆరక్తమును గూర్చిన సీ.డి నా ఇంటిలో ఉండుట వలననే కదా, లేకపోతే యిప్పటికీ నేను చనిపోయి ఉండేదానను."

యేసు రక్తము, విశ్వాసులముగా మనకు ఆయన బహుమానము అయివున్నది. మరియు దానిని ఒక పరిస్థితికి అన్వయించుకొనుటకు భయము లేదా కష్టమును అనుభవించు వరకు ఎదురుచూడనవసరం లేదు. మనకు యేసు రక్తమును అన్వయించుకోవాలనిపించినపుడు, "దేవా, యేసు రక్తములోనికి నా విశ్వాసమును విడుదల చేస్తున్నాను. రక్తములో శక్తి వున్నది సాతాను రక్తమునకు విరోధముగా నిలువబడలేడు మరియు విశ్వాసము ద్వారా నా జీవితములోను, నాకుటుంబములోను, రక్తము యొక్క శక్తిని అన్వయించుకొంటున్నాను. యేసు రక్తము ద్వారా నేను శుద్ధి చేయబడి సంరక్షింపబడుతున్నందుకు నీకు వందనాలు" అని ప్రార్థించవచ్చు. మనము యేసు రక్తము అని చెప్పిన ప్రతిసారి సాతాను వణుకుతాడు.

## ప్రార్థన మరియు యుద్ధము

మన ప్రార్థనలు దేవునికి మహిమను, సాతానుకు అపజయాన్ని తెచ్చుటకు కారణమైనట్లయితే అవి అత్యంత విజయాన్ని పొందినట్లుగా భావించవచ్చు. ప్రార్థనలో మనము చూడవలసినది శత్రువు యొక్క ఓటమి. తీవ్రమైన, ప్రభావవంతమైన ప్రార్థనల ద్వారా సాతానును యుద్ధమునకు సిద్ధము కాలేని వానిగా చేయవచ్చని నేటి విశ్వాసులు అనేకులు తెలిసికొనలేకపోవుట ఎంత బాధాకరం. ప్రార్థన యొక్క నిజమైన శక్తిని మనం తెలుసుకొన్నట్లయితే మరింతగా ప్రార్థిస్తాము. ప్రార్థన ఎల్లప్పుడూ ఒక భాగ్యమే కానీ బాధ్యత కాదని మనం తెలిసికొంటాము.

సాతాను కళ్ళకు కనిపించడు వాడు మనుష్యుల ద్వారా మరియు పరిస్థితుల ద్వారా పని చేస్తాడు. దేవుని ప్రజలు ప్రతి విషయంలో నిందింపబడాలని వాడు కోరుకుంటాడు. రోగాలు మరియు బాదల ద్వారా విశ్వాసుల శరీరాలను బలహీనం చేస్తాడు. శ్రమలు మరియు కష్టములు తెచ్చుట ద్వారా వాడు భౌతిక ప్రపంచంలో పని చేస్తాడు. క్రైస్తవుల మధ్య అపార్థాలు సృష్టించుట ద్వారా కుటుంబాలను మరియు ప్రాణ స్నేహితులను విడదీయాలని చూస్తాడు. వస్తువుల సరఫరాను నిలిపి వేసి కొరత తెస్తాడు. మనుష్యులు నిరాశ, బాధ, వేదనకు లోనగునట్లుగా మరియు నిష్ప్రయోజకులమని తలంచునట్లుగా చేస్తాడు. నిర్ణయాలు తీసికొనే సామర్థ్యాన్ని మనుష్యులలో తగ్గించి వేస్తాడు. అనవసరమైన భయాలను విశ్వాసుల హృదయాలలో పుట్టిస్తాడు. మనము ఎక్కువ అలసిపోవునట్లుగా ఎక్కువ పని చేయుటకు

మనలను బలవంతంగా నెడతాడు. సాతాను మనుష్యుల మనసులు మరియు ఉద్రేకాలపై దాడి చేసి, వారిలో నిరోధక శక్తిని బలహీన పరచి, వారిని మోసగించి త్రోవతప్పునట్లుగా చేస్తాడు. మనుష్యులను సాతాను దాడిచేయు మార్గాలు అనంతమైనవి మరియు తప్పకుండా నిరోధించవలసినవైయున్నవి. దేవునికి లోబడివుండి సాతానును ఎదిరించమని, అప్పుడు వాడు పారిపోతాడని యాకోబు 4:7 చెప్తుంది.

వాచ్‌మన్‌నీ ఈ విధంగా వ్రాస్తున్నాడు "సాతానుని అధిగమించుటకు ముందుగా మనము వాడియెడల విరోధమును పెంచుకొనవలసివున్నది మరియు వాని బాధకు మనలను మనము అప్పగించుకొనకుండా ఉండవలసివున్నది" మత్తయి 12:29 నందు బలవంతుని ఇంటిని దోచుకొనవలెనంటే మొదట బలవంతుని బంధింపవలసివున్నదని బైబిల్ చెప్తుంది. ఆత్మచే నడిపింపబడు ప్రార్థనల ద్వారా మనము సాతానుని బంధింపగలము. సాతాను మనపై దాడి చేయునట్లుగా అనుమతించి వాడిని ఏవిధంగాను నిరోధించకపో యినట్లయితే మనము తప్పకుండా నిరాశ చెంది నిస్పృహ పాలవుతాము. సాతాను ఒక శత్రువు, వాడిని శత్రువు వలెనే చూడవలసివున్నది.

> సాతాను మనపై దారుణంగా దాడిచేసినప్పుడు మనం ఎప్పటికీ నిరాశ లేక ఆశక్తులుగా మారకుండునట్లు దేవుని యెడల మనము ఉత్సాహపూరితులము మరియు ఆశక్తిపరులముగా ఉండవలెను.

సాతానుకు వ్యతిరేకంగా నిలువమని మీకు సలహా యిస్తున్నాను. ఆత్మీయ జీవితం అనునది, ప్రయోజనకరమైనదై యుండవలెను. సాతానును నిరంతరంగా ఎదిరిస్తూ, ఎప్పటికీ మౌనంగా వుండక, మనము దేవుని కొరకు ఆసక్తిని, రోషాన్ని కలిగియుండవలెను. ప్రేమలోను, యిచ్చుటలోను, ఉపచారములోను, చదువుటలోను, ప్రార్థనలోను మరియు నీవేమి చేసినను ముందుగా వుండవలసియున్నది. సాతాను ఏ విధంగా దాడిచేసినప్పటికీ, తక్షణమే, ప్రార్థనలో వాడి పై యుద్ధానికి సిద్ధంకండి.

## సారాంశం

మనం జీవించినంతకాలం, మనం ఆత్మీయ యుద్ధంలో వున్నవారమై యున్నాము. మరియు ఆత్మీయ యుద్ధం చేయు ప్రాథమిక మార్గము ప్రార్థనయే. మనం ప్రార్థించుచుండగా, దేవుని వాక్యములోను,యేసు నామములోను, యేసు రక్తములోను వున్న శక్తిని అర్థంచేసికొనుట

ఆవశ్యకమైయున్నది. ఈ అధ్యాయమును మరల చదువమనీ, వాక్యము, రక్తము మరియు నామము గురించిన పుస్తకాలు సంవత్సరమునకు ఒకసారైనా చదువమని మిమ్మల్ని ప్రోత్సాహపరుస్తున్నాను. ఎందుకంటే, ఈ ఆయుధాల శక్తిని మరియు మూల సూత్రాలను ఎల్లప్పుడూ మన హృదయములలో వుంచుకొనవలసి యున్నది. సాతానును మరి ప్రభావవంతముగా ఓడించుటకు ఈ మూడు ఆత్మీయ ఆయుధాలు సహాయపడతాయి గనుక, వాటిని గురించిన ప్రత్యక్షతను మనకు యివ్వమని దేవుని నిరంతరముగా అడుగవలసియున్నది.

ప్రార్థన ద్వారా దేవునితో గొప్ప, లోతైన సంబంధాన్ని మనము వృద్ధిపరచుకొనుకొలది, ఆయన యిచ్చిన ఆయుధముల శక్తిని అర్థం చేసుకుంటాము. ఆయనతో లోబడు సంబంధమును కలిగియున్నపుడు, వాక్యము, నామము మరియు రక్తము యొక్క శక్తి మనకు లభిస్తుంది, మరియు ఖచ్చితంగా విజయాన్ని పొందుకుంటాము.

సాతాను మన శత్రువు, వాడి యెడల మన ఉద్దేశము విరోధముగాను, కలహపూరితముగాను వుండవలెను. అన్ని సమయాలలో మనము వాడిని నిరోధించవలసియున్నది. క్రియాత్మకంగానూ, ప్రయోజనకరముగానూ వున్నవారై, సాతానుకు ఏ అవకాశము ఇవ్వకండి.

## ప్రార్థనాంశములు

- సాతాను మన శత్రువు, వాడు ఆత్మయైవుండి, ఆత్మీయ ప్రదేశంలో, మనతో యుద్ధం చేస్తాడు. కాబట్టి, మనం వాడితో దేవుని వాక్యము, యేసు నామము, యేసు రక్తము అను ఆయుధములతో యుద్ధం చేస్తాము. ఈ మూడూ మన ప్రార్థనా జీవితాలలో కలిసి, యితరమైన వేటికంటే ఎక్కువగా మన ప్రార్థనలకు శక్తినిస్తాయి.
- దేవుని వాక్యము "రెండంచులు గల ఏ ఖడ్గము కంటెను, వాడియైనదై" (హెబ్రీ 4:12) శత్రువును చిత్తుగా ఓడించగలిగినదైయున్నది. వాక్య ఖడ్గమును ప్రభావవంతముగా ఉపయోగించుటకు, ఆ వాక్యమును, నిర్దిష్ట వాక్యభాగాలను మనకు జ్ఞాపకం తెచ్చుట ద్వారా పరిశుద్ధాత్ముడు మనకు సహాయపడుతాడు.
- లూకా 4 వ అధ్యాయంలో మనము చదివినట్లుగా, యేసు కూడా సాతానును ఓడించుటకు వాక్యమును ప్రయోగించినాడు.
- ఈ భూమిపై దేవుడు మనలను చేయమని చెప్పిన దానిని మనము చేస్తున్నంత వరకూ, సాతాను మనలను అడ్డగిస్తూనే వుంటాడు. అన్ని సమయాలలో వాడిని ఎదిరించగల ప్రభావవంతమైన ఆయుధం వాక్యమే.

- యేసు నామము భూమి పై అన్ని నామముల కంటే పై నామమైయున్నది. మనకు విరోధంగా వచ్చు దేని నామము కంటే అది ఉన్నత నామమై యున్నది మనలను నాశనం చేయాలని, హాని కలుగ జేయాలని చూచు ఏ శక్తి కంటెను అది ఉన్నత నామమైయున్నది. మరియు మనపై నిందలు వేయుటకు చూచు ఏ స్వరము కంటెను బిగ్గరగా ధ్వనించునదైయున్నది.
- యేసు నామంలోని భాగ్యాలను అనుభవించునట్లుగా మనం దేవునితో అప్పగించుకొనిన బంధాన్ని కలిగియుండవలసియున్నది. యేసు నామంలో ప్రార్థించునపుడు, మనలను కాక, యేసును దేవునికి చూపుచున్నాము.
- ఈ దినం, యేసు మన పస్కా గొర్రెపిల్లయై వున్నాడు. విశ్వాసము ద్వారా ఆయన రక్తమును మన జీవితములకు అన్వయించుకొనుచున్నాము అది మనలను సంరక్షించి, సాతాను ప్రవేశించకుండునట్లుగా మన జీవితములలో ద్వారములను మూసివేసి, ముద్ర వేయుచున్నది.
- యేసు రక్తము ద్వారా మాత్రమే మనము దేవుని సన్నిధిలోనికి ప్రవేశించగలము – మరియు ఆయన సన్నిధిలో బలమైన, అధిగమించు శక్తికలదు.
- మనము సాతానును అన్ని సమయాలలో కలహపూరితముగా ఎదిరిస్తూ, మనలను మనం వాడికి అప్పగించుకొనకుండవలెను.

# 14

# ప్రార్థన ద్వారా బలంగా నిలచుట

ఈ అధ్యాయంలో, సాతాను యొక్క అభిమాన వ్యూహాలలో ఒకదానిని – వాడి అతి ప్రభావవంతమైన కుయుక్తిని పరిచయం చేయాలనుకుంటున్నాను – అది *అలసిపోజేయుట.* మనం వదలివేయునట్లుగా, మౌనముగా వుండునట్లుగా, మనలను విసిగించి, బలహీనపరచి, నలుగగొట్టి, కృంగజేసి, అలసిపోజేస్తాడు. దానియేలు 4:7 వాడి గురించి మాట్లాడుచూ "ఆ రాజు మహోన్నతునికి విరోధముగా మాటలాడుచు, మహోన్నతుని భక్తులను నలుగగొట్టును" అని చెప్తుంది. అది మనకు ఎలా అర్థమవుతుంది? సాతాను దేవునికి విరోధంగా మాట్లాడుతాడు. దేవుని గురించి యిలా నీకు అబద్ధాలు చెప్తాడు – *దేవుడు నిన్ను ప్రేమించటం లేదు, లేక నీ కొరకు దేవుడు ఏమీ చేయడు, లేక దేవుడు అది క్షమించడు, లేక దేవుని వాక్యం అందరికీ పనిచేస్తుంది కానీ నీకు కాదు.* మనలను కృంగజేయుటకు వాడు ఉద్దేశపూర్వకంగా ప్రణాళిక వేస్తాడు, అయితే మనము ధృఢంగా నిలువబడాలని దేవుడు కోరుకుంటున్నాడు, మరియు అందుకు ఒక మార్గం దేవునికి ప్రార్థించుట మరియు ఆయనతో సహవాసం.

ఒక మధ్యాహ్నం నా బోధనా కూడికలలో ఒకటి అయిపోయిన తరువాత, నేను అటువంటి అలసిపోయే అనుభవాన్ని పొందుకున్నాను. మొదటగా, నేను, నా టీమ్ ఒక రెస్టారెంట్‌కు వెళ్లాము, అంతా చాలా బాగుంది. అయితే భోజనం అత్యంతయాతనకరమైన ఆలస్యం అయింది. యిప్పుడు, యిలా కూడికల సమయంలో "ఆలస్యం" అనేది నాకు పనిచేయదు, ఎందుకంటే నేను మరల హోటల్‌కు వెళ్లి చదువుకొనవలసివున్నది. నేను కొంచెం నిద్రపోదామని కూడా అనుకుంటున్నాను! ఎందుకంటే ఆ మధ్యాహ్నం అనేక కార్యక్రమాలు వుండుటవలన చాలా తీరిక లేని ప్రణాళికను కలిగివున్నాము. అటువంటి సమయంలో భోజనం చాలా ఆలస్యం అవటం అనేది – తొందరలో వున్న మనిషిలో ఎటువంటి భావాలు కలిగిస్తుందో అలానే నాకు కూడా అనిపించింది.

చివరకు మేము మా మధ్యాహ్న భోజనాన్ని ముగించాము, నేను దేవ్ మా హోటల్ గది వద్దకు వెళ్లాము. నేను సాయంత్రపు కూడికకు వెళ్లుటకు యింకా ఖచ్చితంగా 2 గంటల సమయం వుంది. కాబట్టి నేను ఒక గంట చదువుకోవాలని, ఒక గంట విశ్రాంతి తీసుకోవాలని అనుకున్నాను. మొత్తానికి, మా గది తాళాలు పనిచేయలేదు, అవి అంతకు మునుపు రాత్రి పనిచేసినవి, ఆ ఉదయం పని చేసినవి, అయితే – మాకు నిజంగా అవసరం అయ్యేవేళకు అవి పనిచేయలేదు. మాలో ఒకరం వెళ్ళి హోటల్ వాళ్ళ దగ్గర వున్న తాళాలు తెచ్చుకోవాల్సి వచ్చింది. చివరకు తాళాలు తీసి గదిలోనికి వెళ్ళాను నాకు కొంత బాగా వేడిగా వుండే నీరు కావలసి వచ్చింది, కాబట్టి సింక్‌లో నీళ్ళు త్రిప్పి, నాకు కావలసినంత వేడి అయ్యే వరకు దానిని వదిలి పెట్టాను. కొంత సేపటి తరువాత, నీరు పోతున్న శబ్దం వినిపించింది. నేను పరుగెత్తుకుంటూ వెళ్ళి సింక్ కారుతూ వుండటం చూశాను. నీరంతా నా మేకప్ మీద, దువ్వెనల మీద, నా వస్తువులన్నిటి మీద, నేల మీదపడుతూ వుంది. తరువాత నేను నేలంతా తుడిచి నా వస్తువులను ఆరబెట్టుకోవలసి వచ్చింది.

ఆ గొడవంతటి తరువాత, నేను చదువుకోవటం పూర్తి చేయగలిగాను, ఇంకా నలభై ఐదు నిమిషాలు విశ్రాంతి తీసికోవటానికి మిగిలినవి. నేను నా మంచం పై పడుకొని కళ్ళు మూసుకున్నాను. అదే సమయంలో హోటల్‌లోని ప్రమాదాన్ని సూచించే గంట మ్రోగింది. దానితో పాటే "హోటల్‌లో అత్యవసరమైన పని పడింది. లిఫ్ట్‌ను, మెట్లను దయచేసి ఎవరూ ఉపయోగించవద్దు. ఈ పరిస్థితిని మేము పరిశోధన చేస్తున్నాము. మరలా చెప్తున్నాము బయటకు రావద్దు మెట్లు ఎక్కవద్దు. ఇంకా వివరణ కోసం వేచి వుండండి." అని ఒక సమాచారం వినబడింది. తరువాత ముప్పై నిమిషాల వరకు ఆ విసిగించే సమాచారం, చెవులు దద్దరిల్లేలా గంట, రెండూ వినిపిస్తూనే వున్నాయి.

> అంధకార రాజ్యానికి విరోధంగా అభివృద్ధి చెందుతూ దేవుని రాజ్యం కొరకు పని చేయుట మొదలు పెట్టిన సమయంలోనే, సాతాను మనలను నిరోధించుటకు, కృంగ చేయుటకు తాను చేయవలసినదంతా చేసి, ఆపుటకు ప్రయత్నిస్తాడు.

ఆ రాత్రి కూడికలో నేను జరిగిన దానిని పంచుకున్నప్పుడు, వేరొక హోటల్‌లో బస చేసిన నా కూతురు, తమ హోటల్‌లోనూ యిటువంటి సంఘటనే జరిగిందని చెప్పింది! మీకు తెలుసా? యిటువంటి విషయాలు ప్రమాద వశాత్తు సంభవించవు. నేను నిద్రపోవాలని

చాలా కోరుకున్నాను! యిది సాతాను యొక్క స్వాభావికముగా అలసిపోజేసే కుయుక్తులలో ఒకటి. మనందరి జీవితాలలో ఇటువంటి సంఘటనలు అనేకం జరుగుతుంటాయి.

దేవుని సేవించుటకు శ్రమపడి ప్రయత్నిస్తున్న, మన జీవితాలలోనే ఎందుకిలా జరుగుతుంది? ఎందుకంటే అంధకార రాజ్యానికి విరోధంగా అభివృద్ధి చెందుతూ దేవుని రాజ్యం కొరకు పని చేయుట మొదలు పెట్టిన సమయంలోనే, సాతాను మనలను నిరోధించుటకు, కృంగచేయుటకు తాను చేయవలసినదంతా చేసి, ఆపుటకు ప్రయత్నిస్తాడు. మనము ఆత్మచే నడిపించబడిన, ఆత్మ శక్తి కలిగిన ప్రార్థనలు ప్రార్థించినపుడు, తనకు విరోధముగా శక్తివంతమైన యుద్ధాన్ని మనం చేస్తున్నామని వాడు తెలిసికొంటాడు. దేవుని కొరకు తాము మొదలు పెట్టిన దానిని పూర్తి చేయాలని ఆశపడే మనుష్యులు, తాము ఎదుర్కొనబోయే దాడులలో బలముగా నిలువబడుటకు సిద్ధంగా వుండాలి. భౌతికముగా జరుగునదైన లేక ప్రార్థన ద్వారా ఆత్మీయస్థితిలో జరుగుతున్నదైనా, దేవుని పనిని సాతాను అడ్డగిస్తాడు. అంధకార రాజ్యపు దాడులను ఎదుర్కొనుటకు, ఆ వ్యక్తి మిషనరీగా పని చేస్తున్న వాడో లేక టీవీలో వాక్యము చెప్పేవాడో కానవసరం లేదు.

హోటల్‌లోను, రెస్టారెంట్‌లోనూ మేము ఎదుర్కొన్నవి, మమ్మల్ని కృంగదీయుటకు, అలసిపోజేయుటకైన సాతాను వ్యూహాలు. అయితే, వాడు కలుగజేయు యితర దాడులు మరింత కుయుక్తిగానూ, కనుగొనుటకు కష్టమైనవిగానూ వుంటాయి. మా భోజనపు బల్ల దగ్గర ఎర్ర దుస్తులు ధరించి, రెండు కొమ్ములతో, చేతిలో ఒక బల్లెంతో నిలబడినట్లయితే మనం గుర్తించి, నిరోధిస్తామని, అయితే వాడు కపటంగా, దొంగతనంగా, మనల్ని ఆకర్షించే, అంగీకారమైన పరిస్థితి లేక వస్తువు రూపంలో వచ్చినట్లయితే, మనం సులువుగా వాడి వలలో పడతామని వాడికి తెలుసు. సాతాను వెలుగు దూతవలె వస్తాడని బైబిలు చెప్తున్న దానిని మనం జ్ఞాపకము చేసికొనవలసివున్నది. మంచిగా కనిపిస్తున్న లేక అనిపిస్తున్నదంతా మంచి కాదు.

## నెమ్మదైన, కపటియైన శత్రువు

మనలను అలసిపోజేయుటకు సాతాను ఉపయోగించు ఒక ఉపాయము "క్రమాభివృద్ధి" అని పిలువబడుతుంది. దీని అర్థం చాలా నెమ్మదిగా, దాదాపు అస్పష్టంగా, క్రమంగా మన పై దాడిచేయుట. మనం గ్రహించకమునుపే, కృంగిపోయి, అలసిపోయి, పడిపోవునంత అగోచరముగా పనిచేయుట వాడి ప్రణాళికలో భాగమైయున్నది. పరిశుద్ధులను నలుగగొట్టుటకు సాతాను ప్రయత్నిస్తాడని, దానియేలు 7:25 చెప్తుందని జ్ఞాపకం చేసుకొనండి. "నలుగగొట్టుట" అంటే, "కొంచెం కొంచెంగా తగ్గించుట." అది ఈ నిమిషం కొంత, తరువాత నిమిషం కొంత, ఈ రోజు కొంత, మరుసటి రోజు మరి కొంతగా జరుగుతుంది. వాడు మనల్ని

కొంత యిక్కడ, కొంత అక్కడ అలా పట్టుకుంటాడు. వాడు మనకు ఒక చిన్న అబద్ధం చెబుతాడు, తరువాత మరొక చిన్న అబద్ధం చెబుతాడు, తరువాత మరొకటి, మరొకటి, మరొకటి, ఇలా పూర్తిగా తప్పుడు మరియు మోసపూరితమైన పరిస్థితికి లేక ఆలోచనా విదానానికి మనము చిక్కుకునే వరకు చెప్తాడు. ఏం జరుగుతుందో మనము ఊహించలేనంత జాగ్రత్తగా, కుయుక్తిగా, నెమ్మదిగా, మరియు తికమకగా వాడు పని చేస్తాడు. మనము గ్రహించేలోపల భారమైన, చిక్కైన సమస్య మనం కలిగివుంటాం మరియు అది ఎలా వచ్చిందో కూడా మనకు తెలియదు – కచ్చితంగా సాతానుకు కావలసింది అదే.

ఈ విధమైన అలసిపోజేసే సాతాను యొక్క యుక్తి చాలా అగోచరమైనది, అయితే దాని ఫలితముగా ఏదీ మిగులదు – ఆరోగ్యము, ఆర్థిక సమృద్ధి, బంధాలు, సంతోషం, సమాధానం, బలం, దర్శనం మరియు తరచుగా ప్రార్థించాలన్న కోరిక అన్నవేవీ మిగులవు. దీనినే విశ్వాసుల జీవితాలలో చేయాలని ప్రయత్నిస్తూ సాతాను తీరిక లేకుండా అయితే కపటంగా పనిచేస్తుంటాడు. మనము ఖాళీగా, అలసిపోయి, వదిలివేయుటకు సిద్ధమై, ఇటువంటి గందరగోళ పరిస్థితిలోకి ఎలా వచ్చామో కూడా తెలియని పరిస్థితికి వచ్చే వరకు మనపైకి కత్తులు విసురుతూనే వుంటాడు.

సాతాను మనలను అలసిపోజేసి, గందరగోళ పరిస్థితిలో వదిలి పెట్టాలని అనుకుంటున్నాడు గనుక ఒకసారి మనలను వలలో చిక్కించుకున్న తరువాత మన మనసులపై పనిచేస్తూ *ఏమైంది నాకు?* అని ఆలోచించేట్లుగా చేస్తాడు, లేక సమస్యను యితరుల పై వేసి నిందమోపు రీతిలో చేస్తాడు, *అతను నాకు యిలా చేయకపోయి వున్నట్లయితే, నేను యిలా అనుకొనివుండేదానను కాను! లేక బహుశా, మా బాస్ బాగుంటే, నా భావన బాగుండి వుండేది! లేక ఆ పిల్లలు బాగా ప్రవర్తిస్తే, ఈ యిల్లు బాగుచేసుకొని వుండేదానను!* వంటి ఆలోచనలను ఆలోచిస్తాము.

సాతానును మరియు వాడి ప్రణాళికలను జయించువిధముగా ఎలా ప్రార్థించగలము? మనము సాతాను వ్యూహాలను పట్టించుకోలేనంతగా మనలను అలయజేసి, కృంగజేసి, ఒట్టివారిగా చేయుటకు వాడు క్రమంగా వేయు ప్రణాళికకు మనం ఏమి చేయగలము? మనము చేయవలసిన మొట్టమొదటి పని ఏమిటంటే, వాడి కుయుక్తుల వలన మనము మోసగింపబడకుండా వుండుటకు ప్రార్థించుట. సాతాను యొక్క అలసిపోజేసే కుయుక్తులను మనము త్వరగా గుర్తించునట్లుగా మన కన్నులు తెరువజేయుమని దేవుని అడుగవలసియున్నది.

మొదటి పేతురు 5:8 మనలను “నిబ్బరమైన బుద్ధిగలవారై మెలకువగా ఉండుడి మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు” అని హెచ్చరిస్తున్నది. సాతాను తాను బాధపరచనుద్దేశించిన ప్రతివారిని బాధపరచలేడని ఈ వచనం చెబుతుంది. వాడు, తనకు తలుపులు తెరచేవారికోసం క్రియాత్మకముగా మరియు దొంగతనముగా వెదకుచున్నాడు. అనేక సమయాలు మనము

వాడిని భరించవలసినంత కంటే ఎక్కువ సమయం భరిస్తుంటాము. కొన్నిసార్లు మన జీవితాలలో సమతుల్యత కోల్పోవుట ద్వారా సాతానునకు ఒక ద్వారం తెరుస్తుంటాము (ఉదాహరణకు, మనము పనికి, విశ్రాంతికి సమతుల్యత కుదుర్చుకోలేకపోయినట్లయితే, పనిరాక్షసులం కానీ లేక సోమరులం గానీ అవుతాము.) మనలను క్రీస్తులోని విజయమును అనుభవించ నీయకుండా, ఒట్టివారముగా చేయుటకు సాతానునకు అనేక ప్రధాన మార్గాలు వున్నాయి. యిక్కడ నేను నాలుగింటిని ప్రధానంగా చెప్తున్నాను.

*1. సాతాను మనలను భౌతికంగా అలసిపోజేయాలని ప్రయత్నిస్తాడు.* మనము మంచి విశ్రాంతి తీసుకొనునట్లుగా చూచుకొనుట అనేది మనం మన యెడల చేయగలిగే మేలు. వాటితో బాటుగా మనం మంచి ఆహారం, వ్యాయామము మరియు క్రమముగా వైద్య సలహాలు తీసికొనుట కూడా మంచిది. సాతాను మనలను భౌతికంగా అలసిపోజేయకుండా, భౌతికంగా బలంగా వుండునట్లుగా జాగ్రత్తగా చూచుకొనవలసి యున్నది. దేవుడు మనతో "నీవు ఈ వారాంతములో విశ్రాంతి తీసుకోవాలి" లేక "నీవు వారానికి మూడుసార్లు వ్యాయామము చేయాలి." లేక "నువ్వు నిజంగా ఎక్కువ తీపి తింటున్నావు, అది ఆపివేసి పండ్లు తినటం మొదలుపెట్టాలి" అని చెప్పుచున్నపుడు వినునటువంటి మనసు, జ్ఞానము మనకు యిచ్చునట్లుగా ప్రార్థించవలసియున్నది.

> మన అపేక్ష తీవ్రమైనదిగా మరియు మన ఉత్సాహము ఎంత ఉండవలెనని ఆయన కోరుకుంటున్నాడో అంత ఉండుటకు సహాయపడమని దేవుని అడుగుతూ ప్రార్థించవలసివున్నది.

*2. సాతాను మన ఆసక్తిని మరియు పట్టుదలను బలహీనపరచుటకు ప్రయత్నం చేస్తాడు.* అపేక్ష లేకుండా దేవుని సేవించుటకు ప్రయత్నిస్తున్న అనేకమందిని నేను చూస్తుంటాను. ఒకానొక సమయంలో వారు పట్టుదల కలిగివుంటారు. ఒకానొక సమయంలో వారు ఆసక్తి కలిగివుంటారు. ఒకానొక సమయంలో వారు అపేక్షను కలిగివుంటారు. ఒకానొక సమయంలో వారు ఉద్రేకంగా వుంటారు. అయితే, ఏం జరుగుతుందో మీకు తెలుసా? "అలవాటు అలక్ష్యాన్ని పుట్టిస్తుంది" అను పాత సామెత యథార్థమే. కొన్ని సార్లు మనము దేనికైనా బాగా అలవాటు అయినపుడు మన వద్ద అది తన అర్థాన్ని కోల్పోతుంది మరియు మనం దాని పట్ల అపేక్షను కోల్పోతాం. దానికి మనం అలవాటు అయ్యాము గనుక అది మనకు ఇకను ఉత్సాహమును పుట్టించదు. అదే సాతాను! వాడు కొంత కొంతగా ఉత్సాహాన్ని దొంగిలిస్తాడు. మన అపేక్ష తీవ్రమైనదిగా మరియు మన ఉత్సాహము ఎంత ఉండవలెనని

ఆయన కోరుకుంటున్నాడో అంత ఉండుటకు సహాయపడమని దేవుని అడుగుతూ ప్రార్థించ వలసివున్నది. మనము ఆయన యెడల అపేక్ష కలిగిన వారమై ఉండాలని ఆయన కోరుకుంటున్నాడు. మనము ఆవిధంగా నిలిచియుండుటకు సహాయపడు కొన్ని వాక్య భాగాలను చూద్దాం:

- కొలస్సయులకు 3:23: "మీరేమి చేసినను అది మనుష్యుల నిమిత్తము కాక ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి."
- రోమా 12:11: "ఆసక్తి విషయములో మాంద్యులు కాక ఆత్మయందు తీవ్రత గలవారై ప్రభువును సేవించుడి."
- 2 తిమోతి 1:6: "దేవుని కృపావరము ప్రజ్వలింపచేయవలెను" అని పౌలు తిమోతితో చెప్పుచున్నాడు.

మన హృదయాలలోని దేవుని అగ్నిని ఆరిపోనివ్వకుండా మనము ప్రజ్వలింప చేసుకొనవలసివున్నది! మనలను మనం ఎలా ఉత్సాహపరచుకొనగలం? దేవుని తెలిసికొనుట వలన మనమెంత ధన్యులమో మనతో మనం మాట్లాడుకోవాలి, బైబిల్‌లు కలిగివుండుట వలన ఎంత ధన్యులమో, మన జీవితాలలో ఒక క్రైస్తవ స్నేహితుని కలిగి వుండుట వలన ఎంత ధన్యులమో మనలో మనం గ్రహించాలి. మనందరము అనేకమైన ఆశీర్వాదములను కలిగియున్నాము మరియు వాటిని గమనించుకొన వలసివున్నది. వాటిని గురించి ధన్యవాదాలు తెలుపు కొనునట్లుగా వాటికి అలవాటు పడకూడదు.

*3. మన ప్రార్థనా సమయమును మరియు వాక్యము పఠించే సమయమును దొంగిలించుట ద్వారా సాతాను మన ఆత్మీయ జీవితాలను కృంగదీయాలని ప్రయత్నిస్తాడు.* మనము దేవునితో మాట్లాడుట మరియు దేవుని మాటలు వినుట సాతానునికి ఇష్టం లేదు గనుక మన ప్రార్థనాసమయమును దొంగిలించాలని వాడు దాడి చేస్తాడు. మనం వాక్యం చదువకుండా వుంచుటకు కూడా ప్రయత్నిస్తాడు. మనం వాక్యములో సమయమును గడపనట్లయితే, మనము బలహీనులముగా మరియు ఆత్మీయ సామర్థ్యం లేని వారముగా తయారవుతాము. మనలను ఎండిపోవునట్లుగా చేయు మనుష్యులను లేక క్రియలను మన జీవితములో వుంచి సమయమును వ్యర్థము చేయుట అనునది సాతాను యొక్క సమయమును – దొంగిలించే వ్యూహాలలో ఒకటి. దేవుడు మనకు చెప్పని విషయాలను మనము కలుపు కుంటాము, ఆ విషయాలు నిష్ఫలమై మనలను సంపూర్ణముగా నిరుత్సాహపరుస్తాయి. మనము తీరిక లేకుండా వుండాలని సాతాను కోరుకుంటాడు, అయితే దేవుడు మనం ఫలభరితంగా వుండాలని కోరుకుంటాడు!

*4. మనము మేలు చేయుటలో అలసిపోయేలా చేయుటకు సాతాను ప్రయత్నిస్తాడు.* దేవుని పైనను, ఆయన పని పైనను ధృఢంగా దృష్టినిలిపి వుండుట అనునది ప్రాముఖ్యమై

వున్నది. మంచి చేయనివారు అభివృద్ధి చెందుతున్నపుడు, మనసు నొచ్చుకొనకుండా యిది ఆపుతుంది. గలతీ 6:9 ఈ విధంగా చెప్తుంది: "మనము మేలు చేయుటయందు విసుకక యుందము. మనము అలయక మేలు చేసితిమేని తగినకాలమందు పంటకోతుము."

కాబట్టి, మనం సాతాను సులువుగా నాశనం చేయు మనుష్యులుగా వుండకుండా ఎలా వుండగలము? జవాబు 1 పేతురు 5:9 ప్రారంభంలో వున్నది: "విశ్వాసమందు స్థిరులై, వానిని ఎదిరించుడి." మనం చూడవలసిన రెండు విషయాలు యిక్కడ వున్నాయి: (1) సమతుల్యతను కోల్పోవుట అనునది, మనపై దాడి చేయుటకు సాతానుకు ద్వారాలు తెరుస్తుంది, మరియు (2) సాతానును వాడి దాడిలోనే ఎదిరించవలసివున్నది. అంటే, వాడు మన పై దాడి చేయు సమయంలోనే, వెంటనే వాడిని ఎదిరించవలసివున్నది.

1 పేతురు 5:9 పూర్తిగా ఈ విధంగా చెప్తుంది: "లోకమందున్న మీ సహోదరులయందు ఈ విధమైన శ్రమలే నెరవేరుతున్నవని ఎరిగి, విశ్వాసమందు స్థిరులై వానిని ఎదిరించుడి." మనము కష్టసమయములలో వెళుతున్నప్పుడు ఇతరులు కూడా అటువంటి పరిస్థితులలోనే వున్నారని తెలుసుకొనుట ఎందుకు ముఖ్యమైయున్నది? ఎందుకంటే ఈ శ్రమలో వెళు తున్న వాళ్ళం మనం ఒక్కరమే అని అనుకొనినట్లు చేయుట సాతానుకు ఇష్టమైయున్నది. నేనే ఎందుకు? అని ఆలోచించుటకు బదులుగా, ఈ శ్రమలు అనుభవిస్తున్నది నేనొక్కడనే కాదు అని తలంచుటకు ఇది సహాయపడుతుంది. ఇతరులు కూడా శ్రమపడుతున్నారని సంతోషించాలి అని దీనికి అర్థం కాదు కానీ, మనం ఈ శ్రమలలో ఒంటరిగాలేమని గ్రహించుటకు యిది సహాయపడుతుందని అర్థము. మనం ఎంత బాధపడుతున్నామో, అంతకంటే ఎక్కువ బాధను మరొకరు అనుభవిస్తూవుండివుంటారు. మనలను గురించి మనం బాధపడేవారముగా, జాలిపడేవారముగా వుండకూడదు. సాతానును వాడి దాడిలోనే ఎదిరించి, ఎదిరిస్తూనే వుండవలసివున్నది.

## మెలకువగా వుండి, ప్రార్థించుడి

యేసు సిలువ మరణము పొందకముందు, తనతో వున్న శిష్యులతో, "మీరు శోధనలో ప్రవేశించకుండునట్లు మెలకువగా వుండి ప్రార్థన చేయుడి..." (మత్తయి 26:41) అని చెప్పుచున్నాడు. "మెలకువగా వుండి, ప్రార్థించుడి" అన్న మాటలు మనకు అతి ప్రధానమైనవైయున్నవి. మనము మన చుట్టూ ఏమి జరుగుతుందో జాగ్రత్తకలిగివుండి, ఏదైనా అవసరతను చూచినపుడు లేక సరియైనది జరుగుట లేదని అనిపించినపుడు వెంటనే ప్రార్థించవలసివున్నది. "ఆలస్యం చేయకుండా తక్షణమే ప్రార్థించుట" అనునది మన జీవిత నియమమై యుండవలెను.

> ప్రత్యేకముగా మనం మన సంబంధాల పట్ల మెలకువగా వుండి

నేను ఇంతకుమునుపు వ్రాసినట్లుగా ప్రార్థన అనునది సాతానును నిరోధించు ఆయుధం. ఈ ఆయుధం, మన యెడల మనము ప్రేమించే వారి యెడల వాడి ప్రణాళికలను ఎత్తుగడలను నాశనం చేస్తుంది. ప్రత్యేకముగా మనం మన సంబంధాల పట్ల మెలకువగా వుండి ప్రార్థించవలసివున్నది. మన జీవితాలలోనికి దేవుడు అద్భుతమైన మనుష్యులను – మనలను ప్రోత్సాహపరిచేవారు, మన జీవితాలలో దేవుని పిలుపును నెరవేర్చుటకు సహాయపడువారు, మనము సహాయపడవలసిన వారు, మనలను సంతోషపెట్టువారు, అయినా మనుష్యులను దేవుడు తెస్తుంటాడు. మనకు సరిపోని వారిని సాతాను కూడా మన జీవితాలలోనికి తెస్తుంటాడు – మనలను బాధ పెట్టువారు, మనతో చెడుగా ప్రవర్తించేవారు, నిరుత్సాహపరిచేవారు, మోసగించేవారు, మరియు మనలను తమ స్వంత అవసరతల కొరకు ఉపయోగించుకునే వారు.

## *దురాత్మల విషయంలో మెలకువ కలిగివుండండి*

దేవుని ప్రణాళికలోనుండి మనలను దారి మళ్ళించుటకు మరియు అలసిపోజేయుటకు సాతానుడు వలలు పన్నుతాడు. వాటిలో చాలా వరకు మనుష్యుల ద్వారా పనిచేయు దురాత్మల రూపంలో వస్తాయి, వాటిలో కొన్నింటిని చెప్పుటలో ఈ అధ్యాయంలోని మిగిలిన భాగంలో వాటిలో కొన్నింటిని గురించి చెప్తాను. మనుష్యులను కృంగజేసే సాతాను కుయుక్తులకు ఉత్తమమైన బైబుల్ ఉదాహరణను అపోస్తలుల కార్యములు 16:16–17 నందు కనుగొనగలము: "మేము ప్రార్థనాస్థలమునకు వెళ్ళుచుండగా (పుతోను అను) దయ్యము పట్టినదై సోదె చెప్పుటచేత తన యజమానులకు బహు లాభము సంపాదించుచున్న యొక చిన్నది మాకు ఎదురుగా వచ్చెను. ఆమె పౌలును మమ్మును వెంబడించి – ఈ మనుష్యులు సర్వోన్నతుడైన దేవుని దాసులు  వీరు మీకు రక్షణ మార్గము ప్రచురించు వారైయున్నారని కేకలు వేసి చెప్పెను."

ఇక్కడ మనము గమనించవలసిన మొట్టమొదటి విషయం ఏమిటంటే పౌలు మరియు అతని తోటి వారు ప్రార్థించుటకు వెళ్ళుచున్నారు. సాతాను ప్రార్థనను యిష్టపడడు మరియు ప్రార్థించుట నుండి మనలను దూరపరచుటకు వాడు చేయగలిగినదేదైనా చేస్తాడు. ఆ బానిస చిన్నది చెప్పుచున్నది సత్యమే అని కూడా గమనించండి, అయితే ఆమె దురాత్మను కలిగివున్నది గనుక ఆమె చెప్పుట చాలా వ్యాకులభరితంగా వుంది. ఆమె మరలా మరలా చెప్పుచున్న రీతి విసుగుపుట్టిస్తుందేగానీ మంచి చేయుట లేదు.

మన కళ్ళకు కనిపించే ప్రతీ దానిని నమ్మకుండా అంతరంగంలో దేవుడిచ్చు వివేచనకు మనసును అప్పగించుట నేర్చుకొనవలసివున్నది. జాయిస్ మేయర్ పరిచర్యలో అన్ని అవసరమైన

అర్హతలుండి, అన్ని సరిగా చేసిన వారికి ఉద్యోగమిస్తాము, అయితే నేను అసౌకర్యంగా భావించేవి కొన్ని వారిలో వుంటూనేవుంటాయి. మొదటిలో, వారి గురించి నాకు స్థిరమైన భావాలు లేనందువలన ఉద్యోగము ఇవ్వకుండుట నాకు ఇష్టం లేకపోవుట వలన నా వివేచనను నమ్ముటకు వెనుకాడేదానను. సంవత్సరాలు గడిచే కొలదీ, నా సహజ భావాలను నేను నమ్మాలని నేర్చుకున్నాను. పరిశుద్ధాత్ముడు నాలో నివసిస్తాడు గనుక, నేను శుద్దిపరచబడిన సహజభావాలు కలిగివున్నాను! అన్ని సమయాలలో, అన్నీ సరియైన తలంపులు నేను కలిగివుంటానని దీనికి అర్థం కాదు, అయితే నన్ను నడిపించుటలో పరిశుద్ధాత్ముని, నేను నమ్మగలను.

పౌలు, ఈ బానిస చిన్నదానిని ఎదుర్కొన్నపుడు, ఏదో కారణం వలన అతను వెంటనే ఈ సమస్యను పరిష్కరించలేదు. ఆ చిన్నది ఈ విధంగా చేయుచూ వచ్చింది. అపొస్తలుల కార్యములు 16:18, “ఆమె ఈలాగు అనేక దినములు చేయుచుండెను” అని చెప్తున్నది. సాతాను మనతో కలహపూరితంగా వున్నపుడు, తాను విజయవంతమగువరకు లేక ఆపబడువరకూ – చేస్తూనే వుంటాడు, చేస్తూనే వుంటాడు, చేస్తూనే వుంటాడు, చేస్తూనే వుంటాడు, చేస్తూనే వుంటాడు. పౌలు ఆ ఒత్తిడి వలన “వ్యాకుల పడ్డాడని” ఈ వచనం చెప్తుంది. పౌలును అలసిపోజేయుటకు మరియు వ్యాకులపరచుటకు, సాతాను ఈ బానిస చిన్నదానిని పంపినాడు. దేవుడు, పౌలును చేయమని పిలచిన పిలుపు నుండి తప్పించుటకు, తొందరపెట్టుటకు మరియు అడ్డగించుటకు ప్రయత్నించునట్లుగా, ఆమె సాతాను చేతిలో ఒక పనిముట్టుగా వాడబడినది.

మన జీవితాలలో కూడా మనలను కృంగజేయుటకు – ఆ చిన్నదాని వంటి మనుష్యులను సాతాను పంపిస్తాడు. వారు మన పొరుగువారు కావచ్చు, తోటి పనివారు కావచ్చు, లేక మన కుటుంబ సభ్యులు కావచ్చును. సామాన్యంగా వారు, మనం క్రమంగా, ఎక్కువగా కలుస్తూ వుండేవారైవుంటారు.

కాబట్టి మనలను కృంగజేసే వారందరినీ మన జీవితాలలో నుండి వెళ్లమని చెప్పాలని దీనికి అర్థం కాదు. కొన్ని సమయాలలో, మనము ప్రేమించలేమని తలంచిన వారితో కూడా ప్రేమలో నిలిచియుండుటను మనకు నేర్పుతున్నపుడు, దేవుడు కూడా మనల్ని కృంగజేసేవారిని మన చుట్టూ వుంచుతాడు. నా శరీరాన్ని కృంగజేసేవారికి, నా ఆత్మను కృంగజేసేవారికి మధ్య తేడా వుంటుంది. ఈ బానిస చిన్నదాని విషయంలో వివేచనను వెదకుచూ పౌలు ఎక్కువ రోజులు వేచియున్నాడని నేను నమ్ముతున్నాను.

పౌలు విషయంలో, చివరకు అతను దానివైపు తిరిగి – నీవు ఈమెను వదలిపొమ్మని యేసుక్రీస్తు నామమున ఆజ్ఞాపించుచున్నానని ఆ దయ్యముతో చెప్పెను వెంటనే అది ఆమెను వదలిపోయెను (8వ వచనం). పౌలు ఆమెను గద్దించలేదుగానీ, ఆమె ద్వారా పనిచేస్తున్న దయ్యాన్ని గద్దించాడను విషయాన్ని దయచేసి గమనించండి.

కొన్నిసమయాలలో, కొందరిని గూర్చి ప్రార్థిస్తూ, వారి ద్వారా పనిచేస్తున్న దురాత్మలను గద్దిస్తున్నపుడు, వారు బాగుగా ప్రవర్తించుటకు ముందు మరింత చెడుగా ప్రవర్తిస్తారు. ఎందుకు? జవాబు చాలా సులభం: సాతాను త్వరగా విడిచిపెట్టడు. ఈ సోదె చెప్పు ఆత్మను వెళ్లగొట్టిన తరువాత, పౌలుకు యిదే జరిగింది. తాను విజయం పొందుటకు కొంత ముందు పౌలు వ్యాకులపడవలసివచ్చింది. ఆ బానిస చిన్న దాని ద్వారా లాభము సంపాదించుచున్న యజమానుడు, తమ లాభసాధకము పోయిందని గ్రహించి, ఆ దురాత్మను వెళ్ళగొట్టినందుకు పౌలుపై కోపపడ్డాడు. వారు స్థానిక అధికారుల యొద్దకు వెళ్ళి, పౌలు మరియు అతని తోటివారు "అంగీకరింపకూడని ఆచారములను ప్రచురిస్తున్నారు" అని చెప్పారు (అ.కార్యములు 16:21). తరువాత పౌలు అతని తోటివారు కొట్టించబడి చెరసాలలో పడవేయబడినారు!

పౌలు మంచిపనే చేశాడు, అయితే అతని పరిస్థితి విషమించింది. దేవునికి బదులుగా వేరొకరిని ఆరాధించుటకంటే అగ్నిగుండములో పడవేయబడుట మేలని సరియైన నిర్ణయం తీసికొన్న షద్రకు, మేషాకు, అబేద్నెగోల వలె భావించు సమయములు మనందరకూ వచ్చివుంటాయి. వారు సరైన దానిని చేసినప్పటికీ అగ్నిగుండము ఏడంతలు వేడిమి కలదిగా చేయబడింది. ఏదేమైనా, చివరలో, వారు ఏ హానీ కలుగకుండా బయటికి వచ్చినారు, వారి అధికరము హెచ్చింపబడింది, మరియు దేవుడు వారిని రక్షించినపుడు ఇతరులు చూచినదాని ఫలితముగా దేవుని రాజ్యము హెచ్చింపబడింది (దానియేలు 30:10-30).

పౌలు, సీలలు చెరసాలలో వుండగా "దేవునికి ప్రార్థిస్తూ కీర్తనలు పాడుచూ వుండిరి, ఖైదీలు వినుచుండిరి" అని అపోస్తలుల కార్యములు 16:25 చెప్పుచున్నది. ఈ దృశ్యాన్ని ఊహించుకోండి: పౌలు మరియు అతనితోటి పనివాడు, చేతులు బంధింపబడి, సంకెళ్ళు వేయబడి కాళ్ళకు బండవేసిబిగింపబడి, దేవునికి స్తుతులు పాడుతున్నారు. తరువాత ఏమి జరిగిందో అపోస్తలుల కార్యములు 16:26 చెప్తుంది: "అప్పుడు అకస్మాత్తుగా మహా భూకంపము కలిగింది, చెరసాల పునాదులు అదరెను, వెంటనే తలుపులన్నియి తెరచుకొనెను, అందరి బంధకములు ఊడెను." అప్పుడు తన విధి నిర్వాహణలో నిద్రించుచున్న జైలు అధికారి లేచి ఖైదీలు తప్పించుకొని పోకపోవుట చూచినపుడు ఆశ్చర్యపోయాడు.

> మనము ధృఢంగా వుండి వదిలి పెట్టకుండా వున్నట్లయితే, సాతాను చేయాలని ప్రయత్నించిన ప్రతి చెడు నుండి దేవుడు ఎల్లప్పుడు మంచిని వెలికి తీస్తాడు.

అందువలన అతడు రక్షణ నొందుటకు తానేమి చేయవలెనో తెలిసికొన గోరాడు. ఫలితంగా, అతడు తిరిగి జన్మించాడు మరియు అతని కుటుంబంలోని ప్రతి ఒక్కరు రక్షణ సువార్తను విన్నారు.

మనము ధృఢంగా వుండి వదిలి పెట్టకుండా వున్నట్లయితే, సాతాను చేయాలని ప్రయత్నించిన ప్రతి చెడునుండి దేవుడు ఎల్లప్పుడు మంచిని వెలికి తీస్తాడు. సాతాను మనలను కృంగదీయాలని ప్రయత్నిస్తున్నప్పుడు, మనం సాతానుని ఎదిరిస్తూ దేవుని నమ్ముతూ ధృఢంగా వున్నట్లయితే సాతాను యొక్క ప్రణాళికలను దేవుడు త్రిప్పికొడతాడు. దేవుడు మనలను ఆశీర్వదించి, తనకు మహిమను తెచ్చుకుంటాడు. పౌలు మరియు అతని స్నేహితులు బాధింపబడ్డారు, విసిగింపబడ్డారు, వ్యాకులపరచబడ్డారు – వారి ప్రణాళిక ప్రకారం ఏమీ జరుగలేదు. అయితే వారు మంచి భావనలు కలిగివుండి దేవుని స్తుతించి ఆరాధించుట ద్వారా తమను తాము బలపరచుకున్నారు. వారు ప్రార్థించినపుడు తమ పరిస్థితి చెడుగా మారింది కాబట్టి వారు ప్రార్థిస్తునే వున్నారు. అప్పుడు దేవుడు పరిస్థితిని త్రిప్పి వేశాడు, సాతాను ఓడిపోయాడు. సాతాను వారిని చెరసాలలో కృంగజేయుటకు సిద్ధము చేశాడు, కాబట్టి, దేవుడు ఆ చెరసాల అధిపతి రక్షింపబడుటకు ప్రణాళిక సిద్ధం చేశాడు. దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తము సమకూడి జరుగుచున్నవనుటకు (రోమా 8:26–28) యిది ఒక ఉదాహరణ.

## *ఫేలిక్సు విషయంలో మెలకువ కలిగివుండండి*

నేను "ఫేలిక్సు వల" అని పిలుచు మరొక మార్గం ద్వారా కూడా సాతాను మనలను అలసిపోజేయుటకు ప్రయత్నిస్తాడు. పౌలు పరిచర్య చేయుచున్న ప్రాంతమునకు ఫేలిక్సు అధిపతిగా వున్నాడని, అపోస్తలుల కార్యములు 24 వ అధ్యాయం చెప్తుంది. పౌలు చెప్పుచున్న విషయంలో ఫేలిక్సు ఆసక్తి కలిగివున్నట్లుగా కనబడుతున్నాడు పౌలు నుండి నేర్చుకోవాలని కోరుతున్న వానిగా కనబడుతున్నాడు. అయితే, నిజానికి ఫేలిక్సు ధనాపేక్ష కలిగినవాడై, పౌలు ద్వారా ధనం సంపాదించుటకు చూస్తున్నాడు (26 వ వచనం చూడండి).

మన జీవితములలోనికి వచ్చి, సహాయపడగోరుతున్నామని చెప్పి, ఏ అభివృద్ధి కనిపించని, నటించేవారు వున్నారు. లెక్కించలేనన్ని సమయాలు నేను ఈ విధానాన్ని చూశాను. మనము ఆత్మను కోల్పోయి, అలసిపోవుటకై సాతాను ఇటువంటి మనుష్యులను మన జీవితములలోనికి పంపుతాడు, వారు మార్పు చెందాలను ఉద్దేశాన్ని కలిగివుండరు. వారు తమ బాధల గురించి మాట్లాడుటకు ఇష్టపడుతారు, అయితే వాటిని అధిగమించుటకు యిష్టపడరు. తమ సమస్యలను మరల మరల చెప్పుటకు యిష్టపడుతారు, అయితే త్వరగా మంచి పరిస్థితిని తెచ్చుకొనుటకు యిష్టపడరు. ఫేలిక్సు వలె వారు తప్పుడు ఉద్దేశములను కలిగివుంటారు. వారు ఒక మనిషిని అలసిపోజేసిన తరువాత, మరియొకరిని కృంగదీయుటకు మొదలుపెడతారు.

దేవునితో వాడబడుతూ, దేవుని ప్రేమిస్తూ, మనుష్యులకు సహాయపడాలి, ప్రేమించాలను మన కోరికలతో సాతాను ఆడుకోవాలని చూస్తాడు గనుక మనుష్యులను వివేచించుటలో మనము అభివృద్ధి పొందవలసివున్నది. అనేక సమయాలలో, యితరులతో "నీకు తెలుసా? నీకు నిజంగా ఏ సహాయాన్ని కోరుకొనటం లేదు  నువ్వు కేవలం నన్ను ఉపయోగించు కొంటున్నావు. కాబట్టి, నీవు చేయదలచుకున్న దానిని చేయి, ఒకవేళ నీకు నిజంగా సహాయం అవసరం అనిపించిన రోజున, రా" అని చెప్పుటకు అపరాధభావనను అనుభవిస్తాము. అయితే, మనం : *నేను అలా చేయలేను, అది మంచిది కాదు. అది దయతో కూడినది కాదు.* అని ఆలోచిస్తాము. యేసు అలా చేశాడు. బెతెస్థ కోనేటి వద్ద వున్న రోగితో యేసు ఏమన్నాడో తెలుసా? "స్వస్థపడగోరుచున్నావా?" (నీవు నిజంగా బాగుపడాలను ఆసక్తిని కలిగియున్నావా?" (యోహాను5:6). ఆ రోగి "అయ్యా, నీళ్లు కదలింపబడినప్పుడు నన్ను కోనేటిలోనికి దించుటకు నాకు ఎవడును లేడు గనుక నేను వచ్చునంతలో మరియొకడు నాకంటె ముందుగా దిగునని ఆయనకు ఉత్తరమిచ్చెను" (7 వ వచనం). యేసు, ఆ వ్యక్తి గురించి జాలిపడుతూ వుండలేదు. నీవు నిజంగా స్వస్థపడగోరుచున్నావా అని అడిగిన తరువాత, ఆయన "నీవు లేచి నీ పరుపెత్తికొని నడువుము" అని చెప్పాడు (8 వ వచనం). యేసు ఏమి చెప్తున్నాడంటే : *సరే, నేను నీకు సహాయం చేస్తాను, అయితే, నీవు కూడా కొంత చేయాలి. నీ పరుపు తీసుకో  నీవు ఫిర్యాదులు చేయుట తప్ప మరేమియూ చేయలేకపోయినట్లయితే, నన్ను అలసిపోజేయవద్దు.*

నిజముగా సహాయము అవసరము లేనివారికి, సహాయం చేస్తున్నానను భావనతో నిన్ను నీవు అలసిపోజేసుకోకుండునట్లుగా, నీ వివేచనను పదును పెట్టుకొను జ్ఞానమునివ్వమని దేవుని అడుగమని నిన్ను ప్రోత్సాహపరుస్తున్నాను. అలా నిన్ను నీవు యితరుల కొరకు అనవసర సహాయాలు చేస్తున్నపుడు, సాతాను నిన్ను కృంగదీయుటకు, అలసిపోజేయుటకు వారిని ఉపయోగించుకుంటాడు. అయితే, నేను మనము ఓర్పును వదలిపెట్టాలని చెప్పటం లేదు. మనుష్యుల యెడల ఓర్పును, దీర్ఘశాంతమును మనము కలిగివుండాలి. అయితే మనము ఫేలిక్సు యొక్క కథ మొత్తము చదివినట్లయితే, ఫేలిక్సు ప్రతిదినము, ప్రతి వారము ఒకే విషయం గూర్చి మాట్లాడినాడు, మరియు రెండు సంవత్సరముల తరువాత కూడా మార్పుచెందని వాడిగా వున్నాడు. అపోస్తలుల కార్యములు 24:26-27 నందు ఈ విషయం చదవండి: "తరువాత పౌలు వలన తనకు ద్రవ్యము దొరుకు నని ఆశించి, మాటి మాటికి అతనిని పిలిపించి అతనితో సంభాషణ చేయుచుండెను.  రెండు సంవత్సరములైన తరువాత ఫేలిక్సుకు ప్రతిగా, పోర్కియు ఫేస్తు వచ్చెను. అప్పుడు ఫేలిక్సు యూదుల చేత మంచివాడనిపించుకొనవలెనని కోరి, పౌలును బంధకములలోనే విడిచిపెట్టి పోయెను."

పౌలును మాటిమాటికి పిలిపించి ఎక్కువ సమయం తీసుకున్నప్పటికీ, ఫేలిక్సు పౌలును చెరసాలలోనే వదలివెళ్లిపోయాడు. ఫేలిక్సు ఏ విధమైన సహాయం నిజముగా కోరుకొనలేదు గనుక, పౌలు యొక్క శ్రమ అంతా వ్యర్థమైపోయినది.

నీ జీవితములో “ఫేలిక్సులు” విషయంలో మెలకువగా వుండు. దేవుడు నిజంగా సహాయపడుటకు పంపించిన వారికి సహాయపడుటకు వివేచన కలిగివుండు. యిటువంటి మనుష్యులు ఎందుకు నీ జీవితములోనికి వచ్చియున్నారో, వారితో ఎలా ప్రవర్తించాలో అర్ధంచేసుకొనుటకు, గ్రహించుటకు దేవుని సహాయం అడుగు. సాతాను నిన్ను కృంగజేయుటకు యిటువంటి వారిని పంపినపుడు, నీ సమయాన్ని, శక్తిని వ్యర్థము చేసికొనకుండునట్లుగా ఆత్మీయ గ్రహింపునిమ్మని ప్రార్థించు. నీవు ప్రార్థించుచుండగా, నీకు “దైవిక సంబంధాలు” యిమ్మని దేవుని అడుగు. ఈ సంబంధాలు కలిగిన వ్యక్తులు – నీకు సహాయం చేయుటకు లేక నీ నుండి సహాయం పొందుటకు దేవుని ద్వారా పంపబడినవారు. వారు నీ జీవితానికి ప్రయోజనాన్ని కలుగజేయువారు, లేక నీ నుండి ప్రయోజనము పొందువారు. మనుష్యులకు సహాయం చేయుటకు దేవుడు మనలను పిలిచాడు, అయితే, సమయం వ్యర్థం చేసికొనుటకు కాదు. నీ సమయంతో సహా, నీకు అప్పగింపబడిన వాటన్నిటిని జాగ్రత్తగా కాపాడుకొను గృహనిర్వాహకునిగా వుండుటకు ప్రార్థించు.

## *దెలీలా విషయంలో మెలకువగా వుండు.*

మనకు విరోధంగా పంపబడు దెలీలాలు కూడా వుంటారు. కాబట్టి, వారిని గుర్తించు సామర్థ్యము కొరకు మనము ప్రార్థించవలసి యున్నది. సంసోనును ఓడించునట్లుగా, అతని బలము యొక్క రహస్యము కొరకు, దెలీలా అతనిని అనుదినము తొందరపెట్టినదని న్యాయాధిపతులు 16:16–17 చెప్తుంది. ఆమె పెట్టిన ఒత్తిడి వలన అతను “ప్రాణము విసికి చావగోరెను” అని వ్రాయబడివున్నది. చివరకు సంసోను విసికిపోయి, తన బలము యొక్క రహస్యమును చెప్పి, తన శత్రువులకు అప్పగింపబడినాడు.

ఒక అద్భుతమైన కుటుంబం కలిగిన ఒక వివాహితుని శోధించుటకు, సాతాను ఒక స్త్రీని పంపిందనుకుందాం. వ్యభిచారము అనునది, యిద్దరు వ్యక్తులు “మనము సంబంధం కలిగివుందాం” అని చెప్పుకొనుట ద్వారా మొదలవుతుందా? లేదు, అది క్రమంగా సంభవిస్తుంది. అది పనిచేసే స్థలంలో కొన్ని అభినందన మాటలతో మొదలవవచ్చు, తరువాత కొన్ని మాటలు, మరికొన్ని మాటలు. త్వరలో ఆ స్త్రీ, ఆ వ్యక్తి యొక్క ప్రతి వాక్యాన్ని ఆలోచిస్తుంది, అతను వున్న స్థలంలోనే అవసరమునకు మించి వుంటుంది. తరువాత అతను, ఆ స్త్రీ తన భార్యకంటే కొంత చిన్నదని గమనించటం

> యుక్తము కాని ఆలోచన మన మనసులోనికి వచ్చిన క్షణమే, మనం “లేదు! నేను అది చేయబోవటం లేదు!” అని చెప్పవలసియున్నది.

మొదలుపెడతాడు. ఒకవేళ అతని భార్య చాలా మంది బిడ్డలను కనివుండవచ్చు, పని వద్దవున్న స్త్రీ ఇంకా బిడ్డలను కనియుండకపోవచ్చును. కాబట్టి, ఆమె శరీరం మంచి ఆకృతిలోనూ, ఆమె ఎక్కువ పనిలేకపోవుట వలన అలసిపోకుండానూ వుండి వుంటుంది. త్వరలోనే వారిద్దరూ, విరామ సమయంలో కలసి కాఫీ తాగుతుంటారు. తరువాత, ఆమె కారు పాడయినపుడు, ఆమె తనను యింటి వద్ద వదలిపెట్టమని అతనిని అడుగుతుంది. తరువాత వదలిపెట్టినందుకు అతనికి ధన్యవాదాలు చెప్పుటకు యింటిలోనికి ఆహ్వానిస్తుంది, అతను వచ్చినపుడు, యింట్లో తయారు చేసిన వంటకం పెడుతుంది...... తరువాత ఏమి జరుగుతుందో మీరు ఊహించవచ్చు.

ఈ విధమైన పరిస్థితి మనము ఆలోచించుట కంటే ఎక్కువే చేస్తుంది. దీనికి లింగబేధాలు లేవు – ఒక పురుషుడు, స్త్రీని శోధింపదలచుకున్నపుడు కూడా యిలాగే జరుగుతుంది. – విషయమేదైనప్పటికీ, యిది చాలా కుయుక్తిగా మొదలయ్యి, చాలా నాశనకరముగా తయారవుతుంది, అది సాతానును చాలా సంతోషపెడుతుంది. అందుకే మనం వాడు పని చేయుచుండగానే నిరోధించాలి. యుక్తము కాని ఆలోచన మన మనసులోనికి వచ్చిన క్షణమే, మనం "లేదు! నేను అది చేయబోవటం లేదు!" అని చెప్పవలసియున్నది. మన జీవితంలోని "దెలీలాలు" చాలా ఆకర్షణీయంగా, దుర్బుద్ధిని పుట్టించేవారుగా, కోరిన విధంగా మరియు చాలా అమాయకంగా, మంచిగా కనిపిస్తారు. ఈ కారణం వలన, మనం దేవుడు నిర్దిష్ట పరిస్థితిలో, నిర్థిష్ట మనుష్యులతో ఎలా ప్రవర్తించవలెనని కోరుతాడో తెలుసుకొనుటకు, ప్రార్థన ద్వారా సహవాసం కలిగివుండాలి.

## పేతురు విషయంలో మెలకువగా వుండండి

సాతాను కేవలం నిన్ను విసికించుటకు, అలసిపోజేయుటకు, శోధించుటకు, చెడగొట్టుటకు మాత్రమే కాకుండా, దేవుడు నీలో, నీ ద్వారా చేయాలను కుంటున్నదానిని ప్రత్యక్షంగా అడ్డగించుటకు కూడా మనుష్యులను పంపుతాడు. అది యేసుకు కూడా సంభవించింది, సాతాను పేతురును, ఆయన దగ్గరి స్నేహితులలో ఒకరిని ఉపయోగించుకున్నది. మత్తయి 16వ అధ్యాయంలో యేసు,పేతురు తోను మిగిలిన శిష్యులతోను, తాను చంపబడి, మూడవ దినమున తిరిగి లేస్తానని చెప్పాడు. రక్షణ ప్రణాళిక నేరవేరుటకు యేసు సిలువపై మరణించాలని అర్థం చేసుకొనని పేతురు, యేసుతో "ప్రభువా, అది నీకు దూరమగుగాక, అది నీకెన్నడును కలుగదు" అని చెప్పినాడు. యేసు సమయం వ్యర్థంచేయలేదు, ఆయన పేతురు వైపు తిరిగి "సాతానా నా వెనుకకు పొమ్ము నీవు నాకు అభ్యంతరకారణమైయున్నావు" అని గద్దించాడు (మత్తయి 16:22-23). దేవుని రక్షణ ప్రణాళిక నెరవేర్చబడునట్లు, సాతాను అపజయం పొందునట్లుగా యేసు వెంటనే పేతురును సరిచేసినాడు.

దేవుని చిత్తం చేయకుండా దూరంగా వుంచుటకు, సాతాను మనము ప్రేమించువారు లేక మనలను ప్రేమించువారిని ఉపయోగించుకుంటాడు. వారు మనకు బాధకలిగించాలని అనుకొనరు గానీ వారు అర్థం చేసికొనరు అంతే. దేవుని వద్దనుండి ఒక పిలుపును మనము వినినపుడు, లేక అనుభవించినపుడు, మన జీవితాలలోని మనుష్యులు ఎల్లప్పుడూ మనము వినినదానిని వినలేరనీ, మనం అనుభవిస్తున్న దానిని అనుభవించలేరని జ్ఞాపకం చేసికొనవలసియున్నది. అది వారికి అర్థం కాదు గనుక మనలను చేయకుండా ఆపుటకు ప్రయత్నిస్తారు. మనకు క్రొత్తవారు లేక మనకు ఏమీ కానివారితో వాడు ఏమీ చేయడు. మనలను బాధపెట్టుదానితోనే మనకు విరోధంగా వచ్చుటకు చూచుచున్నాడు, ఎందుకు? ఎందుకంటే, మనం అభివృద్ధి పొందుట వాడికి యిష్టం లేదు. వాడు మనకు భయపడుతున్నాడు! మనం దేవునికి పూర్తిగా లోబడుటకు యిష్టపడినట్లయితే, అంధకార రాజ్యమునకు మనం అపాయంగా మారుతామని వాడికి తెలుసు.

మనము దేవునిని మన సంబంధాలలో జ్ఞానము మరియు వివేచనకొరకు ప్రార్థించినట్లయితే సులభమైన ప్రార్థన యొక్క శక్తి మనలను అన్ని రకాల పరిస్థితులనుండి మరియు సమస్యలనుండి రక్షించును.

మనము మన జీవితాలలో "పేతురు"లతో, "దెలీలా" లతో, "ఫేలిక్సు"లతో పనిచేయుచుండగా, మనకు నిజంగా విరోధంగా వున్నది మనుష్యులతో కాదని జ్ఞాపకం వుంచుకోవలసి వున్నది. నిజానికి మనకు వ్యతిరేకత మరియు యుద్ధము సాతాను అధికారిగా వున్న అంధకార రాజ్యమునుండి వస్తుంది "ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు, గాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాథులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము" అని బైబిల్ చెప్తుంది (ఎఫెసీ 6:12). మనుష్యులు మన విరోధులు కారు – సాతాను మన విరోధి మనుష్యుల ద్వారా పనిచేస్తున్న సాతానుని నిరోధిస్తున్నప్పుడే, మనుష్యులను ప్రేమించుట నేర్చుకోవాలి. ఈ విషయాలలో నీవు ఎల్లప్పుడూ వివేచన కలిగివుండునట్లుగా ఆత్మీయ జ్ఞానముకై ప్రార్థించు. మన సంబంధాలలో వివేచనా మరియు జ్ఞానమును యివ్వమని దేవుని అడిగినట్లయితే సులువైన ప్రార్థనాశక్తి అన్ని రకముల సమయాలు మరియు సమస్యల నుండి మనలను రక్షిస్తుంది.

## సారాంశము

దేవుని బిడ్డలకు విరోధముగా సాతాను యొక్క అతి తరుచుగా ఉపయోగించు మరియు అత్యంత విజయవంతమైన కుయుక్తులలో ఒకటి కృంగిపోజేయుట – మనము విశ్వాసమందు మంచి పోరాటము పోరాడుచుండగా మనలను అలసిపోజేసి నలుగగొట్టుతాడు. మనము ధృఢముగా నిలువబడాలని దేవుడు కోరుకుంటున్నాడు, మరియు దానిని మనము గొప్ప ప్రార్థనాజీవితము ద్వారానే నెరవేర్చగలము. నీవు ఒక అవసరతను గ్రహించినపుడు, “ఆలస్యం చేయవద్దు వెంటనే ప్రార్థించు” దేవుడు మనలను మెలకువగా వుంచాలని మరియు ప్రతి సాతాను ప్రణాళికకు విరోధముగా గెలువగల వ్యూహాలను దేవుడు మనకి ఇచ్చునట్లుగా ప్రార్థనచేయవలసివున్నది.

మనము భౌతికముగా అలసిపోవునట్లు చేయుటకు మనము తీరికలేకుండాను మరియు ఒత్తిడిలోను పని చేయునట్లుగా చేయుటకు సాతాను ప్రయత్నిస్తాడు వాడు మన ఆసక్తిని దొంగిలిస్తాడు మనము ప్రార్థించకుండునట్లుగా చేయుటకు ప్రయత్నిస్తాడు మరియు మేలు చేయుటయందు విసుగునట్లుగా చేస్తాడు. మనలను ఒట్టి వారిగా చేయుటకు, మోసపరచుటకు, లేకపోతే మన జీవితాలలో దేవుని చిత్తాన్ని జరుగకుండా వుండునట్లుచేయుటకు, దురాత్మల ద్వారా పనిచేయు మనుష్యులను మన జీవితములలోకి పంపిస్తాడు. ప్రార్థన ద్వారా దేవునితో సహవాసములో మనము నిలుచునపుడు, ఆయన జ్ఞానమును పొందుకొనుటకు మరియు ఆయన స్వరమును వినుటకును సమర్ధులమౌతాము మరియు సాతానుని ఎదిరించుటకు, అధిగమించుటకు అది సహాయపడుతుంది.

### ప్రార్థనాంశములు

- మనము ఒక నెమ్మదైన, వంచకుడైన శత్రువును కలిగియున్నాము, వాడు క్రమంగా మనలను కృంగదీసి, అలసిపోజేసి, మనలను దేవుడు పిలచిన పిలుపు నెరవేర్చుటకు కోరిక మరియు బలము లేనివారిగా చేస్తాడు.
- మనకు విరోధముగా సాతాను యొక్క వివిధ కృంగజేసే కుయుక్తులను గ్రహించునట్లుగా మనము ప్రార్థించవలసియున్నది.
- మనలను అలసిపోజేయుటకు సాతాను ఉపయోగించు మార్గములలో కొన్ని: మనలను శారీరకంగా అలసిపోజేయుట, మన అపేక్షను, ఉత్సాహమును దొంగిలించుట, ప్రార్థనలోను, వాక్యములోను గడుపు సమయమును దొంగిలించుట మరియు మేలు చేయుటలో అలసిపోవునట్లు చేయుట.

- 1 పేతురు 5:9 ప్రకారం మనము సాతానును వాడి మార్గంలోవుండగనే ఎదిరించి, మనము శ్రమలలో ఒంటరిగా లేమని జ్ఞాపకం చేసుకోవాలి.
- మన సంబంధాల విషయంలో మనం మెలకువగా వుండి, ప్రార్థన చేయాలి. దురాత్మలు కలిగిన మనుష్యులకు దూరంగా వుండునట్లుగా వివేచన కొరకై ప్రార్థించాలి.
- మనలను ఒట్టివారిగా చేయుటకు, శోధించుటకు లేక మన జీవితముల కొరకైన దేవుని ప్రణాళికను వ్యతిరేకించుటకు, సాతాను యొక్క పనిముట్లయిన "ఫేలిక్సులు," "దెలీలాలు" మరియు "పేతురు" ల విషయమై మనము మెలకువగా వుండాలి.

# ముగింపులో............

ఈ పుస్తకం ఫలితంగా మీ ప్రార్థనా జీవితం బలపరచబడిందని, దేవునితో మీ సహవాసం మరింత లోతుగా అయినదని నేను నమ్ముతున్నాను. ప్రార్థన నిజముగా ఎంత సులువైనదో మీరు గ్రహించారనీ, మీ దైనందిన జీవితాలలో సులువైన, నమ్మకమైన ప్రార్థనా శక్తిని అనుభవిస్తున్నారని నేను ఆశిస్తున్నాను. మీరు  గొప్ప ప్రార్థనా విధానాన్ని వృద్ధి చేసుకొనుచూ, ఆనందించుచున్నావనీ, మరియు మీ ప్రార్థనలు ఒక వైవిధ్యాన్ని కలుగజేస్తాయను మరింత నమ్మకాన్ని మీరు పొందుకున్నారనియు నేను నమ్ముతున్నాను.

ఇంకనూ సాధించవలసిన ఆత్మీయ పరిణితి ఎల్లప్పుడూ వుంటుందని మరియు మీ ప్రార్థనలోని ప్రభావం ఎల్లప్పుడూ పెరుగుతూ వుంటుందనియు ఎరిగినవారై, ప్రార్థన నేర్పించుమని దేవుని అడుగుటకు కొనసాగించమని నేను మిమ్మల్ని ప్రోత్సాహపరుస్తున్నాను. దేవుడు మీ జీవితము కొరకై గొప్ప విషయాలు కలిగివున్నాడు గనుక ఆయనతోని సహవాసములో ఎదుగుటకు కొనసాగించాలని, మిమ్మును గురించి ప్రార్థిస్తున్నాను. దేవుడు మిమ్మును ప్రేమిస్తున్నాడు మరియు సన్నిహితమైన, ఉత్సాహభరితమైన మార్గాలలో ఆయనతో సహవాసం కలిగివుండాలని కోరుకుంటున్నాడు – అది కేవలం మీ ప్రార్థనల ద్వారానే సాధ్యమవుతుంది.

ఈ పుస్తకం వ్రాయుటకు అనుమతినిచ్చిన దేవునికి వందనాలు చెల్లిస్తున్నాను. ఈ పుస్తకం వ్రాయు సమయంలో నా స్వంత ప్రార్థనా జీవితం సుసంపన్నం చేయబడింది. “ఆలస్యం చేయవద్దు, వెంటనే ప్రార్థించు” అను నా స్వంత సలహాను నేను పాటించాను. నేను కొన్ని అద్భుతమైన ఫలితాలు చూశాను, మీరు కూడా చూస్తారని నమ్ముతున్నాను. జ్ఞాపకముంచుకొనండి, నీకు అవసరమైనపుడెల్లా, దేవుడు పనిచేయునట్లుగా ప్రార్థన ద్వారాన్ని తెరుస్తుంది!

# రచయిత్రి గురించి

జాయిస్ మేయర్, ప్రపంచంలో ప్రఖ్యాత బైబిల్ బోధకులలో ఒకరు. న్యూయార్క్ టైమ్స్ వారి ఉత్తమ రచయిత్రి, ఈమె డెబ్భైకి పైగా దైవ ప్రేరేపణ కలిగిన పుస్తకములు వ్రాసింది. వాటిలో The confident woman, Look Great, Feel Great మరియు మానసిక రణరంగం అను పుస్తకముల మొత్తము కలవు. ఈమె ఒక సంపూర్ణ వీడియో గ్రంధాలయము వలెనెకొన్ని వేల బోధనల క్యాసెట్‌లను విడుదల చేసింది. జాయిస్ మేయర్ యొక్క Enjoying Everyday Life రేడియో మరియు టెలివిజన్ కార్యక్రమాలు ప్రపంచం అంతటా ప్రచారం చేయబడుతున్నాయి, మరియు ఆమె విస్తారంగా ప్రయాణిస్తూ అనేక కూడికలు నిర్వహిస్తున్నారు. జాయిస్ మరియు ఆమె భర్త డేవ్, నలుగురు పెద్దవారైన పిల్లలను కలిగియుండి St. Louis, Missouri నందు తమ నివాసాన్ని ఏర్పరచుకన్నారు.

# ప్రభువుతో వ్యక్తిగతమైన సంబంధం కొరకైన ప్రార్థన

అన్నిటికంటే ముఖ్యంగా యేసు ప్రభువు నిన్ను రక్షించి, నిన్ను తన ఆత్మతో నింపగోరుచున్నాడు. సమాధానకర్తయగు అధిపతియైన యేసును నీ జీవితములో రక్షకునిగా ప్రభువుగా నుండుటకు నీవు ఇంతవరకు ఆహ్వానించనియెడల, ఇప్పుడైనా ఆలాగు చేయాలని నిన్ను కోరుచున్నాను. ఈ క్రింది ప్రార్థన నీవు యదార్థంగా చేసినట్లయిన నీవు క్రీస్తులో నూతన జీవితం అనుభవిస్తావు.

*ప్రియ తండ్రీ,*

*నీవు లోకమును ఎంతో ప్రేమించావు. ఆయనయందు విశ్వాసముంచు వారందరు నశింపక నిత్యజీవము పొందునట్లు నీ ప్రియకుమారుని అనుగ్రహించావు.*

*మేము కృపద్వారా విశ్వాసమును బట్టి రక్షణ పొందాము అని, అది దేవుని వరమని నీ వాక్యము సెలవిస్తుంది. రక్షణ సంపాదించుకొనుటకు మా స్వంత క్రియలు ఏవియు పనికిరావు.*

*నీ కుమారుడైన యేసు క్రీస్తు లోకరక్షకుడని, నమ్మి నా నోటితో ఒప్పుకొనుచున్నాను. ఆయన సిలువపై చనిపోయి నా పాపములన్ని సిలువపై మోసి వాటి కొరకైన క్రయమును చెల్లించాడు. నీవు యేసును మృతులలో నుండి లేపావని నా హృదయపూర్వకంగా నమ్ముచున్నాను.*

*నా పాపములు క్షమించుమని నేను మనవి చేయుచున్నాను. యేసు నా ప్రభువని ఒప్పుకొనుచున్నాను. నీ వాక్యం చెప్పిన రీతిగా నేను రక్షణ పొందాను. నిత్యత్వంలో నీతోనే ఉంటాను. తండ్రి నీకు స్తోత్రములు, నీకు కృతజ్ఞుడను. యేసు నామమున ఈ ప్రార్థన చేయుచున్నాను. ఆమెన్.*

యోహాను 3:16, ఎఫెసీ 2:8,9, రోమా 10:9,10, 1 కొరింథీ 15:3,4, 1 యోహాను 1:9, 4:14-16, 5:1,12,13.

# Other Books By Joyce Meyer

## Books Available In English

A Leader In The Making

A New Way Of Living

Battlefield Of The Mind

Battlefield Of The Mind For Kids

Battlefield Of The Mind For Teens

Battlefield Of The Mind – Devotional

How To Hear From God

Healing The Brokenhearted

New Day New You

Beauty For Ashes

Battle Belongs To The Lord

Secrets To Exceptional Living

Eight Ways To Keep The Devil Under Your Feet

Why God Why

When God When

Look Great Feel Great

Managing Your Emotions

Me And My Big Mouth

The Confident Women

The Secret Power Of Speaking God's Word

The Word, The Name, The Blood

The Most Important Decision

Reduce Me To Love

Don't Dread

Expect A Move Of God Suddenly

Filled With The Holy Spirit

How To Succeed…..

The Celebration Of Simplicity

The Joy Of Believing Prayer

## Other Books in Telugu by Joyce Meyer

*A Leader in the Making*

*Battle Belongs to the Lord*

*Battlefield of the Mind*

*Beauty for Ashes*

*Filled with the Spirit*

*Healing the Brokenhearted*

*Jesus Name Above All Names*

*Peace*

*Reduce Me to Love*

*Secrets to Exceptional Living*

*Straight Talk on Depression*

*Straight Talk on Discouragement*

*Straight Talk on Fear*

*Straight Talk on Insecurity*

*Straight Talk on Loneliness*

*Straight Talk on Stress*

*Straight Talk on Worry*

*Tell Them I Love Them*

*The Most Important Decision You Will Ever Make*

*The Word, The Name & The Blood*

*When God when*

*Why God why*




# ఆత్మవిశ్వాసంగల స్త్రీ

భయము లేకుండా ధైర్యముగా జీవించడం ఈ రోజు నుండే ప్రారంభించండి

ఆత్మ విశ్వాసముగల స్త్రీ లో, జాయిస్ మేయర్ ఆనేక సంవత్సరాల అనుభవమును స్త్రీలతో పంచుకొనుచు, వారితో సంభాషిస్తు మరియు స్త్రీల మధ్య పరిచర్య చేయుచు వారిని ఆకర్షిస్తుంది. ఈ పుస్తకంలోని ఆమె వర్తమానం కూడా తన భద్రత లేని జీవితం నుండి మరియు తన్నుతాను అసహ్యించుకొనుట నుండి  ధైర్యముతో తన పూర్తి సామర్థ్యతను గ్రహించుటలో, తన యొక్క వ్యక్తి గత  జీవిత ప్రమాణంలోని ఫలితాలను వివరించింది.

జాయిస్ మేయర్ యొక్క స్వచ్ఛమైన రచనల వలన మరియు అనుభవం ద్వారా ధైర్యంగా విజయవంతమైన జీవితమునకు, ఏవిధంగా అడ్డంకులను అధిగమించాలో నువ్వు నేర్చుకొంటావు. ఆమె క్రీస్తులోని విశ్వాసం యొక్క నిజమైన ధైర్యాన్ని వివరిస్తుంది. అంతేకాదు ఈ రాకతో నేర్చుకొనుటకు ఇష్టపడతారు. “ఇది స్త్రీలు భూమి మీదకు దేవుని నుండి వచ్చిన ఒక విలువైన బహుమానాలు అని గుర్తు చేస్తుంది. వారు సృజనాత్మకతగలవారు, సున్నితమైనవారు, కరుణగలవారు మరియు కళాకారులు”.

ఆత్మ విశ్వాసమునకు గల అడ్డంకును గుర్తించుటకు, సిద్ధపాటు నుండి అధిక శక్తిని అన్వేషించుటకు, స్త్రీలకు జాయిస్ కొన్ని సూత్రాలను ఇస్తుంది. ఆమె స్త్రీల ఆత్మ విశ్వాసము యొక్క ఏడు లక్షణాలను పరిశీలిస్తుంది. అవి ఒక స్త్రీ తను ప్రేమించబడుతుందని తెలుసు, భయముతో జీవించటాన్ని తిరస్కరిస్తుంది, మరియు ఎవ్వరితోను తన జీవితాన్ని పోల్చుకోకుండా వుండుట ద్వారా ‘‘ఒక వేళ అదే”(లేదా)“అయితే ఏంటి” అనేవాటితో కలసి.

మన సమాజములో అనేక మంది స్త్రీలకు అభద్రత అనే అంటువ్యాధి కలదు. స్త్రీలలో అభద్రతా భావం మూలంగా వారి కుటుంబాలలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అంత మాత్రమే కాకుండా ఆ సమస్యలు తుదకు దాంపత్య జీవితాన్ని దెబ్బతీసే రీతిలో విడాకులకు దారితీస్తున్నాయి.

నా జీవిత ప్రయాణములో "నిజమైన ఆత్మవిశ్వాసము" అంటే ఏమిటో నేను నేర్చుకొన్నాను. నేను వ్యక్తిగతముగా నేర్చుకొన్న అనుభవాలను ఏమైనప్పటికి మీతో పంచుకోవాలని ఎంతో ఆశిస్తున్నాను. తద్వారా మీరు కూడ నా వలె దేవుని చిత్తానుసారముగా ఎలా జీవించాలో నేర్చుకొంటారు. మీరు ధైర్యవంతులు గాను, పౌరుషము గల వారిగాను, పరాక్రమము గల వారిగాను, హెచ్చించబడిన వారిగాను, వారికొరకు అపేక్షింప బడెడివారిగాను, ఆత్మ విశ్వాసము గల వారిగాను, గౌరవమును పొందుకొనే వారిగాను, అభినందించబడే వారిగాను, మరియు ప్రాముఖ్యముగా ప్రేమించబడే వారిగాను ఉండాలన్నదే దేవుని ఉద్దేశ్యము.

దేవుడు మీ జీవితము పట్ల ఒక అద్భుతమైన ప్రణాళికను కలిగి యున్నాడని మరియు మీరు ఈ పుస్తకము చదువుచుండగా మీరు గతంలో గ్రహించని రీతిలో దేవుని ప్రణాళికను అర్థం చేసుకొనే వారిగా ఉండాలని నేను దేవునికి ప్రార్థిస్తున్నాను. ఈ పుస్తకమును చదివిన తర్వాత, మీరు మీ తలను ఎత్తుకొని జీవిస్తారు మరియు మీ భవిష్యత్తుకు ఒక భద్రత ఉందన్న ఒక గొప్ప నమ్మకముతో ముందుకు సాగుతారు. మీరు గతంలో ఏ పురుషుడు గాని లేక స్త్రీ గాని చేయలేని ఆ మహత్తరమైన కార్యములను చేయునట్లు ధైర్యముతోను మరియు నూతన ఉత్సాహముతోను ముందుకు సాగాలి. ఈ పుస్తకములో మీరు పొందుకొనవలసినదే మీరు పొందుకోబోతున్నారని నమ్మండి!

To contact the author in the United States, please write to:

Joyce Meyer Ministries
P.O. Box 655,
Fenton, Missouri 63026
or call: (636) 349-0303
or log on to : www.joycemeyer.org

To contact the author in India, please write to:

Joyce Meyer Ministries
Nanakramguda,
Hyderabad - 500 008
or call: 2300 6777
or log on to : www.jmmindia.org

*Please include your testimony of help received from this book when you write. Your prayer requests are welcome.*